# భాగము - 2

# సుడిగాలి

## అధ్యాయము - 1

## పూంగుళలి

**అప్పుడక్క డ** పూర్తి పశాంతత నెలకొనివుంది. *కోడిక్కరై* కడలి అలల సద్దు మణిగి ప్రశాంతంగా ఉంది. ఓడలు, మర పడవలు సముద్రతీరాన్ని సమీపిస్తున్నాయి. సముద్రంలో ఎర వెతికేందుకు వెళ్ళిన పక్షులు వెనుదిరుగుతున్నాయి. ఒడ్డున కాస్త దూరంవరకు తెల్లని ఇసుక విస్తరించివుంది. దానికవతల చాల దూరంవరకు దట్టమైన అడవి. ఆ అడవి చెట్ల కొమ్మలు కదలడంలేదు. వాటి ఆకులుకూడ కదలడంలేదు. నలువైపుల నిశ్శబ్దం కమ్ముకొంది. ఎర్రని సూర్యుడు ఆకాశం, సముద్రం కలిసే చోటికి వేగంగా దిగిపోతున్నాడు. మేఘాలు కొన్ని సూర్యుని మరుగుపరచజూసి, అవి కూడ ఆ అరుణ కిరణాలు సోకి ఎర్రబారాయి.

తీరానికి సమీపంగా చిన్న పడవ తేలుతోంది. సముద్రపు మెత్తని పుష్పతరంగ హస్తాలు చిన్న పాప పడుకొన్న ఊయలను ఊపినట్లు దాన్ని మెల్లగా కదుపుతున్నాయి. ఆ పడవలో ఒక యువతి కూర్చొనివుంది. ఆమెను చూసిన వెంటనే సేందన్ అముదన్ తన మామ కూతురిని ఉద్దేశించి చేసిన వర్ణన గుర్తుకొస్తూంది. అవును; ఆమె తప్పక పూంగుళలే అయి ఉండాలి. పేరుకు తగినట్లు ఆమె జడలో ఒక మొగలి పూవుంది. నల్లటి పొడవాటి ఉంగరాల జుట్టు ఆమె భుజాలను అలంకరించాయి. సముద్రపుటలలు తీసుకొని వచ్చి ఒడ్డుకు చేర్చిన శంఖాలు, గవ్వలను ఏరుకొని అందంగా ధరించింది. కానీ ఇవన్నీ ఆమె ఒంటిమీద మరింత అందాన్ని పొందాయే తప్ప, ఆమె సహజ సౌందర్యాన్ని అవి ఇనుమడింపజేశాయని చెప్పలేము. సౌందర్యమే రూపుగొని వస్తే దానికి ఏ ఆభరణాలు మరింత అందాన్నివ్వగలవు?

పూంగుళలి ఆ పడవలో వయ్యారంగా కూర్చొని పాడుతోంది. ఆమె గానాన్ని వినేందుకే కడలి కూడ నిశ్శబ్దమై నిలిచిందేమో! అందుకే గాలికూడ గట్టిగా వీయక, మెల్లగా ఊసులాడుతోంది కాబోలు! దూరంలో ఉన్న అడవి చెట్లు కూడ ఆకులు కదపక నిశ్చలంగా నిలబడి ఆమె గానాన్ని వింటున్నట్లున్నాయి. ఆకాశం, భూమి కూడ ఆమె కమ్మని పాటను విని నిలకడగా ఉండిపోయాయి కాబోలు! సూర్యుడు కూడ, సముద్రపుటంచు వరకు దిగినా కూడ, మునిగిపోక అక్కడే తచ్చాడుతూ నిలబడ్డాడు కాబోలు!

<< ఆ తియ్యని తేనెలొలొకే పాటను అనువదించవలసి ఉంది >>

ఆ యువతి మనసులో ఏం శోకం గూడు కట్టుకొందో తెలియదు! ఆ కలకంఠి కంఠంలో ఎలాంటి వేదన మిళితమైందో తెలియదు! లేక, ఆ పాట పదాలతోబాటు కన్నీళ్ళను కూడ కలగలిపి అమర్చారో ఏమో అది కూడ మనకు తెలియదు. కానీ ఆ పాటను విన్నప్పుడు మన మనసు దుఃఖంతో నిండి పేలిపోతుందేమోనన్న భావం కలగడం తథ్యం.

పూంగుళలి పాటను ఆపింది. తెడ్లను నాలుగుసార్లు బలంగా వేసిన వెంటనే పడవ వచ్చి ఒడ్డుకు చేరింది. పూంగుళలి ఒక్క దూకుతో పడవనుంచి ఒడ్డుపైన దూకింది. పడవను ఒడ్డుకు లాగి పడవేసింది. అక్కడ కొన్ని కట్టు బల్లలు కుప్పగా పడివున్నాయి. వాటిపైన తన పడవను ఆనించి, తాను కూడ దానికానుకొని చుట్టుపక్కల పరికించి చూసింది పూంగుళలి.

-:-

అదిగో! నావికా సూచి దీపస్తంభం పైమేడలో దీపాన్ని వెలిగించారు. ఇక రాత్రంతా అది ప్రజ్వలంగా వెలుగుతూ అన్నివైపులా కాంతులీనుతుంటుంది. సముద్రంలో వెళుతున్న ఓడలకు అది 'దగ్గరకు రాకు!' అని హెచ్చరిక చేస్తుంది. కోడిక్కరై దగ్గర సముద్రం అంతగా లోతులేదు. కాబట్టి చిన్న చిన్న పడవలు, కొయ్య తెప్పలు మాత్రమే ఒడ్డుకు దగ్గరగా రాగలవు. పెద్ద ఓడలు ఒడ్డుకు దగ్గరైతే ఇసుకలో కూరుకుపోతాయి. మరీ వేగంగా వస్తే ముక్క చెక్కలైపోతాయి. కాబట్టి కోడిక్కరైలో ఉన్న ఆ దీపస్తంభం నావికులకు చాల ఉపయోగకరంగా ఉంది.

ఇంకొకవైపున్న చిట్టడవిలో ఒక గోపురం తలెత్తి చూస్తూంది. అది కోడిక్కరై *కుళకర్* కోవెల. సుమారు రెండు వందల ఏళ్లకు మునుపు శ్రీ సుందరమూర్తి నాయనార్ కోడిక్కరైకి వచ్చారు. అడవిమధ్య ఒంటరిగా ఉన్న ఆ గుడిలోని స్వామిని చూసి, "దేవా! ఇలా ఈ సముద్రపుటొడ్డునున్న అడవిలో ఒంటరిగా తోడులేకుండ ఎందుకున్నావు? భక్తులు తండోపతండాలుగా నీ మహిమను, వైభవాన్ని స్తుతించే స్థలాలెన్నో ఉండగా, ఈ భయంకరమైన అడవి మధ్య ఎందుకు నెలకొన్నావు? ఈ దీనుని కనులు ఇంతటి దృశ్యాన్ని చూడవలసి వచ్చెగద!" అని మనసు కరిగి పాడారు.

<< ఆ మనసును కదిలించే పద్యాన్ని అనువదించవలసి ఉంది >>

శ్రీ సుందరమూర్తి నాయనార్ వచ్చి దర్శించుకొని వెళ్ళిన రెండు వందల సంవత్సరాల పిదప కూడ కోడిక్కరై కుళకర్ అదే స్థితిలో ఉన్నాడు[1]. చుట్టుపక్కల అడవి ఇంకా దట్టంగా పెరిగింది. ఆ చెట్లలో గుడ్లగూబలు నివసిస్తున్నాయి. చూసేందుకు భయంకరంగా కనిపించే కొందరు వేటగాళ్ళు మాత్రమే ఆక్కడక్కడ గుడిసెలు వేసుకొని ఆ అడవిలో నివాసం చేస్తున్నారు.

1 ఇప్పటికీ, వెయ్యేళ్ళ తర్వాత కూడ, ఆ స్వామి అదే స్థితిలో ఉన్నాడు.

కానీ అప్పటికీ, ఇప్పటికీ ఒకే ఒక్క తేడా ఉంది. శ్రీ సుందరమూర్తి నాయనార్ వచ్చినప్పుడు దీపస్తంభం లేదు. కొన్నేళ్ళకు మునుపు, మొదటి పరాంతక చక్రవర్తి కాలంలో ఆ దీపస్తంభాన్ని అక్కడ కట్టించారు. ఆ దీపస్తంభ గృహంలో పని చేసే వారికి దాని చుట్టుపక్కలే ఇళ్ళు కట్టించారు. కోడిక్కరై గుడి పూజారికూడ అక్కడికి వచ్చి స్థిరపడ్డాడు.

-:-

పూంగుళలి సముద్రపుటొడ్డున తన పడవనానుకొని నలువైపులా పరికించి చూసింది. దీపస్తంభాన్ని చూసి అటువైపు వెళదామా అనుకొంది. తర్వాత కుళకర్ గుడి గోపురాన్ని చూసింది. ఆ సమయాన గుడి గంట వినిపించింది. ఇంతలోపల ఇంటికి వెళ్ళి చేసేదేముంది? పూంగుళలి ఒక తీర్మానానికి వచ్చింది. గుడికి వెళ్ళి పూజారిని దేవారం పాడమందాం. తర్వాత ప్రసాదం తీసుకొందాం.

ఇలా తీర్మానించుకొని పూంగుళలి గుడివైపు సాగింది. ఆడుతూ, పాడుతూ, తుళ్ళుతూ, దూకుతూ వెళ్ళింది. దారిలో ఒక జింకల గుంపు కనిపించింది. ఆ జింకలు ఇసుక బయలును దాటి అడవి వైపు వెళుతున్నాయి. ఏడెనిమిది పెద్ద జింకలతోబాటు ఒక జింకపిల్ల కూడ వెళుతూంది. ఆ జింకల గుంపును చూడగానే పూంగుళలికి ఉత్సాహం పొంగుకొచ్చింది. వాటిని పట్టుకోవడానికన్నట్లు వాటి వెంబడి పరుగు తీసింది. కానీ ఎంత వేగంగా పరుగెత్తినా జింకలతో పోటీ సాధ్యమా? అవి ఒక్క ఊపున పరుగెత్తి మాయమయ్యాయి.

ముందుకు దూసుకు వెళ్ళిన జింకలు ఒక చోట నాలుగు కాళ్ళను పైకెత్తి ఎగురుతున్నట్లు ఒక్క ఉదుటున దూసుకెళ్ళాయి. అవి అలా దాటిన చోట ఒక ఊబి ఉందని పూంగుళలి ఊహించింది/గ్రహించింది. పెద్ద జింకలు ఆ ఊబి గుంటను సులభంగా దాటగలిగాయి. కానీ జింకపిల్ల మాత్రం దాటలేక దాని వెనక కాళ్ళు ఊబి గుంటలో కూరుకుపోయాయి. అది గట్టెక్కేందుకు ఎంత ప్రయత్నించినా బయటపడలేకపోయింది. తల్లి జింక అది చూసి దిగులుగా, నిస్సహాయంగా తన పిల్లను కాపాడుకోలేని పరిస్థితిలో అలాగే నిలబడిపోయింది.

ఇదంతా ఒక్క క్షణంలో చూసి గ్రహించిన పూంగుళలి ఆ ఊబి ఎంతవరకుందో చూసి కనిపెట్టి తెలుసుకొంది. ఆ ఊబి ఓరగా వెళ్ళి నేల గట్టిగా ఉన్న చోట జింకపిల్లకెదురుగా నిలబడింది. మొదట తల్లిజింక ఆమెను చూసి ఉరిమింది. పూంగుళలికి జింకల భాష తెలుసు కాబోలు! మృదువైన స్వరంతో ఆమె ఏదో చెప్పగానే ఆ తల్లి జింక భయం వీడి నిలబడింది. పూంగుళలి ఊబి ఒడ్డున తన కాళ్ళను మడిచి కూర్చొంది. చేతులు చాచి జింకపిల్లను పట్టుకొని బలంగా పైకి లాగి గట్టెక్కించింది. కొన్ని క్షణాలపాటు ఆ జింక పిల్ల ఒళ్ళు గడగడ వణికింది. తల్లి జింక దగ్గరకు వచ్చి ధైర్యం చెప్పింది కాబోలు! అంతే! మరుక్షణమే తల్లి జింక, పిల్ల జింక పరుగెత్తి మాయమయ్యాయి.

"ఛీ! ఏమాత్రం కృతజ్ఞత లేని మృగాలు!" అని పూంగుళలి తనకు తానే చెప్పుకొంది. "కానీ

మనుషుల కన్న ఈ మృగాలు మేలు!" అని తానే తనకు ఊరట చెప్పుకొని మళ్ళీ గుడి వైపు నడక సాగించింది.

~

ఇసుక బయలు దాటిన వెంటనే దట్టమైన అడవిగుండా వెళ్ళింది. ఆ అడవిని ఒక ప్రకృతి వింత అనే చెప్పవచ్చు. అక్కడ రాతిబండల కొండలుగాని, గుండ్ల కొండలుగాని లేవు. ఒట్టి ఇసుక బయలే. అక్కడక్కడ ఇసుక మేటవేసి గుట్టలుగా ఏర్పడిన చోట కొన్ని చెట్లు, పొదలు మొలిచి, ఆ ఇసుక మేటలు రాళ్ళలాగ గట్టిపడ్డాయి. ఆ ఇసుక గుండ్రాళ్ళ పక్కన పల్లాలు కూడ ఉన్నాయి. అటువంటి అడవిలో దారి కనిపెట్టుకొని వెళ్ళడం అంత సులభం కాదు. చాల దూరం నడిచినట్లనిపిస్తుంది. కానీ తిరిగి తిరిగి బయలుదేరిన చోటికే వచ్చి చేరుతుంటాము.

~

పూంగుళలి ఆ అడవి దారిగుండా అతివేగంగా నడిచి గుడి దగ్గరకు వచ్చి చేరింది. ఆలయం చుట్టు ప్రాకారం లోపల పొన్న, పన్నీరు మొదలైన చెట్లు ఏపుగా పెరిగి పూలు పూచాయి.

పూంగుళలి గుడి లోపలికి వెళ్ళింది. పూజారి ఆమెను చూడగానే ఆయన ముఖం విప్పారింది. ఆ గుడికి భక్తులు రావడం అరుదు. కాబట్టి అలా అరుదుగా వచ్చే భక్తులను చూసి పూజారి సంతసించడం సహజమే కద?

ఒక కొబ్బరి చిప్ప, ప్రసాదం తీసుకొని వచ్చి ఆమెకిచ్చారు. "అమ్మా! కాస్త వేచివుంటావా? ఇదిగో, నేను కూడ దైవసన్నిధికి తాళంవేసి ఇంటికి బయలుదేరుతాను!" అన్నారు. చీకటి పడ్డ తర్వాత ఆ అడవి దారిలో వెళ్ళడం కాస్త కష్టమే. కానీ దారి చూపేందుకు పూంగుళలి ఉంటే దిగులే లేదు.

"ఉంటానయ్యా! నాకు తొందరేం లేదు. నిదానంగా గుడి కైంకర్యం ముగించుకొని బయలుదేరండి!" అన్నది పూంగుళలి. ఆలా చెప్పి గుడి బయటి ప్రాంగణంలోకి వచ్చింది. ఒక చెట్టు కొమ్మను పట్టుకొని ప్రాకారం గోడమీదికి ఎగిరి కూర్చొంది. ప్రాకారం గోడ చివర ఒక నంది విగ్రహం అమర్చబడివుంది. ఆ విగ్రహాన్నానుకొని గోడ మీద కాలు చాచి కూర్చొంది. కొబ్బరి చిప్పను పళ్లతో గోకి తిననారంభించింది.

~

నలువైపులనుంచి చీకటి కమ్ముకొస్తున్న విచిత్రాన్ని పూంగుళలి అబ్బురపాటుతో చూస్తుండగా, గుర్రపు డెక్కల చప్పుడు విన్నది. వింటూ, ఆ శబ్దం వస్తున్న వైపే ఆసక్తితో చూడసాగింది. ఆ గుర్రపు డెక్కల చప్పుడు ఆమె మనసులో ఏవేవో పాత జ్ఞాపకాలను లేపి, ఊహాలోకానికి తీసుకొని వెళ్ళింది. ఎక్కడినుంచో గుర్తు తెలియని దుఃఖం లేచి, ఆమె గొంతును పూడ్చింది. వస్తున్నది ఎవరై ఉండవచ్చు? ఎవరైనా మనకేం దిగులు? కొన్ని రోజులుగాకొత్త మనుషుల రాకపోకలు అధికమైనాయి. రాజకార్యం మీద వస్తున్నారట,

పోతున్నారట. నిన్న కూడ ఇద్దరు వచ్చారు. వారు చూసేందుకే అసహ్యంగా ఉన్నారు. అన్నను పడవ నడపమని లంకకు తీసుకొని వెళ్ళారు. రొక్కం కూడ చాల ఇచ్చారు. వాళ్ల డబ్బులో పిడుగు పడ! ఎవరికి కావాలి డబ్బు? ఆ డబ్బుతో ఈ నట్టడవిలో చేసేదేముంది? కానీ, అన్నకు, వదినకు డబ్బంటే చాల ఆశ. ఎందుకో తెలియదు! ఇదంతా కూడబెట్టి, పూడ్చి పెడుతున్నారు.

~

ఇదిగో, గుర్రపు డెక్కల చప్పుడు దగ్గరౌతూంది. ఒకటి కాదు, రెండు గుర్రాలొస్తున్నాయి. ఇదిగో అవి కనిపిస్తున్నాయి. పల్లంనుంచి మెల్ల మెల్లగా మిట్ట ఎక్కి వస్తున్నాయి. చాల దూరం ప్రయాణం చేసి అలిసిపోయి ఉన్నాయి గుర్రాలు. ఒక్కొక్క గుర్రం మీద ఒక రౌతు ఉన్నాడు. ముందు వస్తున్న గుర్రం మీదున్నవాడు యుక్త వయస్కుడు. చూడ లక్షణంగా ఉన్నాడు. మంచి బలశాలిలాగను కనిపిస్తున్నాడు. ముఖం గంభీరంగా ఉంది. కానీ ఆమె హృదయంలో పదిలమైవున్న ఆ ముఖం ఎక్కడ? ఈ ముఖం ఎక్కడ? చూడబోతే చెట్టు బోదెలో ఉండే గుడ్లగూబ ముఖంలాగ కద ఉంది వీడి ముఖం?

మొదటి గుర్రం మీద వస్తున్నవాడు మన పాత స్నేహితుడు వల్లవరయ్యన్ వంతిదేవుడే. రెండవ వాడు వైద్య కుమారుడు. ఇద్దరూ పళైయార్రై నుంచి ఇక్కడికి వచ్చి చేరేటప్పటికి పూర్తిగా అలిసిపోయారు. కానీ వంతిదేవుని ముఖం ఆలయప్రాకారపు గోడమీద కూర్చొనివున్న పూంగుళలిని చూడగానే విప్పారింది. ఆమె తననే నిశితంగా చూస్తోందని గ్రహించగానే ఉత్సాహం పుట్టుకొచ్చింది.తన ముఖాన్ని చెట్టు బోదెలో ఉండే గుడ్లగూబ ముఖంతో పోల్చిందని తెలిస్తే అతడికంత ఉత్సాహం కలిగేది కాదేమో! ఒకరి మనసులో ఏముందో ఇంకొకరికి తెలియకపోవడం ఒక విధంగా మంచిదే కద?

గుర్రంమీద వస్తున్నవాడు తననే పరీక్షగా చూస్తున్నాడని పూంగుళలి గ్రహించింది. వెంటనే తనకే తెలియని సిగ్గు ముంచుకొచ్చింది. గోడపైన కూర్చొని కొబ్బరిచిప్ప తింటున్నానన్న విషయంకూడ గుర్తొచ్చి, ఒక్క ఉదుటున గోడపైనుంచి కిందకు దూకి గోడవారగా పరుగెత్తనారంభించింది.

అది చూసిన వంతిదేవునికి కూడ గుర్రంమీదినుంచి కిందకు దూకాలనిపించింది. దూకి ఆమెను వెన్నంటి పరుగత్తి పట్టుకోవాలనిపించింది. అలా అనుకోగానే గుర్రంమీదినుంచి కిందకు దూకి ఆమె వెంట పరుగెత్తాడు.

ఈ అర్థంలేని చేష్టలకు కారణమేమని ఎవరికి తెలుసు? ఇంతకీ కారణమేమైన ఉందా? సృష్ట్యాదినుంచి జరుగుతున్న ఇటువంటి విచిత్రాలకు కారణాలు వెతకడం నిరర్థకం కద?

~~~
~~~

# అధ్యాయము - 2

## బురద గుంట

**అడవిలో**, మెట్టలో, రాళ్ళలో, ముళ్ళలో ఆ అమ్మాయిని వెంబడించి పరుగెత్తాడు వంతిదేవుడు. ఒక్కోసారి ఆమె కంటికి కనిపిస్తూంది. మరుక్షణం మరుగైపోతూంది. ఇక ఆమెను పట్టుకోలేమనిపించినప్పుడు మళ్ళీ కనిపిస్తూంది! మాయలేడిని వెంబడించి వెళ్ళిన రాముని కథ గుర్తుకొచ్చింది వంతిదేవునికి. కానీ ఈమె మాయా కాదు; మారీచుడు కాదు. ఈమె కాళ్ళలో జింకల వేగముందన్నది మాత్రం నిజం! అబ్బబ్బ! ఎంత వేగంగా పరుగెడుతూంది! 'ఎందుకీమె వెన్నంటి పరుగెడుతున్నాం? ఏమిటీ పిచ్చితనం?' అని ఆలోచించాడు వంతిదేవుడు. వెంటనే అందుకొక కారణం కల్పించుకొన్నాడు. కోడిక్కరై దగ్గరపడే కొద్దీ, సేందన్ అముదన్ వర్ణించిన ఆ వనితామణి అతడికి తరచూ గుర్తుకు రాసాగింది. ఈమె ఆ పూంగుళలే అయివుండాలి. ఈమెతో స్నేహం కలుపుకొంటే వచ్చిన పని నెరవేరడానికి అనుకూలంగా ఉంటుంది. దానితోబాటు దీపస్తంభ గృహానికి వెళ్ళే దారి కూడ అడిగి తెలుసుకోవచ్చు. కాస్త దూరాన వచ్చేటప్పుడే వారికి ఆ దీపస్తంభశిఖరం కనిపించింది. కానీ దాని దగ్గరికి వెళ్ళడం అంత సులభమార్గంగా అగుపించలేదు. అడవిలోకి దూరి వెళ్ళి చూసినా కూడ అది కనిపించనే లేదు. అడవిలోపలే తిరిగి తిరిగి వచ్చారే తప్ప, అక్కడికి వెళ్ళే దారి మాత్రం కనిపించలేదు. అప్పుడే వంతిదేవుడు కుళకర్ దేవాలయం ప్రాకారపు గోడ మీద వంతిదేవుడు పూంగుళలిని చూడడమైంది. ఆమెను పట్టుకొని దారి అడుగుదామంటే, ఏమిటిలా మాయజింకలాగ చేతికి చిక్కకుండ పరుగెడుతోందే? ఈమెనలాగే వదిలేది తిరిగి వెళ్ళిపోవలసిందేనా? కానీ పరుగుపందెంలో కూడ ఒక అమ్మాయి చేత ఓడిపోవడమంటే, అది కూడ మనసుకు నచ్చలేదు...

ఆహా! అదిగో బయలు ప్రదేశం వచ్చేసింది. కాస్త దూరాన నీలి సముద్రం కనిపిస్తూంది. విశాలంగా విస్తరించి ప్రశాంతం నెలకొన్న ఆ సముద్రం చూడడానికి ఎంతందంగా ఉంది! అదిగో దీపస్తంభం కూడ కనిపిస్తూంది. దాని చివర ఇప్పుడు దీపం ప్రకాశవంతంగా వెలుగుతూంది. దాని చంద్రకిరణాలు నలువైపులా వ్యాపించి విచిత్రమైన దృశ్యాలను సృష్టిస్తున్నాయి.

ఈ చోట ఈ పిల్లను వెంబడించడాన్ని వదిలిపెట్టేసి దీపస్తంభ గృహంవైపు వెళదామా? వద్దు, వద్దు! ఈ బయలుప్రదేశంలో ఈ పిల్లను వెన్నంటి పట్టుకోవడం సులభం. ఇక్కడ అంతగా ఇసుక కూడ లేదు. కాలు ఇసుకలో కూరుకుపోవడం లేదు. నేలలో గడ్డి మొలిచి గట్టిపడివుంది. కొన్నిచోట్ల బురద ఎండిపోయి పొక్కులుగట్టింది. ఇక్కడంతా అడ్డంకి లేకుండ పరుగెత్తవచ్చు. ఆ పిల్లను సులభంగా పట్టేసుకోవచ్చు! పైగా

ఆమె సముద్రంవైపు కద పరుగెడుతూంద? ఎంత పరుగెత్తినా, చివరిక సముద్రతీరాన ఆగిపోవలసిందే కద! ఒకవేళ ఈ విచిత్రమైన పిల్ల సముద్రంలోనే మునిగిపోయి మరుగైపోతుందా, ఏమి? అరెరె! గుర్రమెక్కి రాకపోయాం కద? అలా గుర్రమెక్కి వస్తే ఈ బయలు ప్రదేశంలో ఈ పిల్లను ఒక్క క్షణంలో పట్టేయవచ్చు కద?

అదిగో ఆమె కాస్త జంకుతూ నిలబడింది. తిన్నగా కడలివైపు పరుగెత్తకుండ కుడివైపుగా తిరిగి పరుగెడుతూంది! తనచేత పట్టుబడకూడదని కుడివైపున కాస్త దూరాన కనిపిస్తున్న అడవివైపు పరుగెడుతూంది. అడవిలోపల దూరిపోతే, పట్టుకోవడం అసాధ్యం! ఇంతసేపు పరుగెత్తిందంతా వృథా! వంతిదేవుని కాళ్ళు కూడ అప్పుడు బతిమాలసాగాయి...!

మళ్ళీ తన మనసు మార్చేసుకొంది కాబోలు! అడవిలోపలికి దూరే ఉద్దేశాన్ని వదిలేసినట్లుంది! బొంగరంలాగ ఒక చుట్టు తిరిగి మళ్ళీ పరుగెత్తి వస్తూంది. దీపస్తంభం అడుగుభాగం దగ్గరికి వెళ్ళాలనుకొంటూంది కాబోలు. నాలుగంగల్లో ఆమెను పట్టేసుకోవచ్చు. గట్టిగా పట్టుకొని, “అమ్మాయ్! ఎందుకు నన్ను చూసి ఇలా బెదరి పరుగెడుతున్నావు? నీకు నీ ప్రేమికుని వద్దనుంచి సందేశం తీసుకొచ్చాను!” అంటే, ఎంత ఆశ్చర్యపడుతుంది! సేందన్ అముదన్ అతడికేమీ చెప్పి పంపించలేదన్నది నిజమే. అందువల్లనేమి? ఏమైనా తానే కల్పించి చెబితే పోతుంది...!

వంతిదేవుడిలా తీర్మానించి, తన దేహంలో మిగిలివున్న బలాన్నంతా కూడదీసుకొని, ఒక్క ఉరుకు ఉరికాడు. తిరిగి పరుగెత్తుకొంటూ వస్తున్న ఆమెను నాలుగే అంగల్లో పట్టేసుకోవచ్చన్నదే అతడి ఉద్దేశం. ఉన్నట్లుండి "అయ్యో!” అని అరిచాడు. తనకేం జరిగిందన్నది తనకే మొదట తెలియలేదు. తర్వాత తెలియవచ్చింది. అతడి రెండు కాళ్ళూ బురదలో కూరుకుపోతున్నాయి. మొదట పాదాలు మాత్రం కూరుకుపోయాయి. తర్వాత మోకాలివరకు రెండు కాళ్ళూ కూరుకుపోయాయి!

అరెరె! ఈ ప్రదేశం మననెలా మోసం చేసేసింది! పైన చూస్తే బాగా ఎండిపోయి పొక్కులు కట్టినట్లుంది. లోపల బురద ఇంకా ఎండలేదు. ఎప్పుడూ పూర్తిగా ఎండలేని బురద గుంటల గురించి (ఊబి) గురించి వంతిదేవుడు వినివున్నాడు. వాటిలో జింకలు, ఎడ్లు, గుర్రాలు, ఏనుగులు కూడ చిక్కుకొంటే, కొద్ది కొద్దిగా లోపలికి లాగబడి, చివరికి పూర్తిగా మునిగిపోయి మరుగైపోతాయట! అలాంటి ఊబేనా ఇది? అలాగే ఉండాలి. మోకాలు కూడ మాయమైపోయిందే! ఇంకా లోపలికి దిగిపోతూంటామా, ఏమి? త్వరలో తొడవరకు మునిగిపోతాంలాగుంది! ఏనుగులను, గుర్రాలను మింగేసి త్రేన్చే ఈ ఊబి మనని మాత్రం ఊరకే వదిలిపెడుతుందా? అయ్యో! ఇదా మన గతి? మనం కన్న పగటి కలలన్నీ ఈ ఊబిలోనే పూడిపోవలసిందేనా? ఈ అపాయ సమయంలో ఆ విచిత్రమైన పిల్ల వచ్చి చేయిచ్చి కాపాడితేనే సరి. తప్పించుకోవడానికి ఇంకే దారే లేదు. పెద్దగా కేకవేసి చూద్దాం అని ఎంచి వంతిదేవుడు, “అయ్యో! నేను చచ్చిపోతున్నాను! బురద గుంటలో మునిగిపోతున్నాను! నన్ను కాపాడేవారెవరూ లేరా?” అని అరిచాడు.

ఆ అరుపు పూంగుళలి చెవిన పడింది. అతడికెదురుగా కాస్త దూరాన పరుగెడుతున్న పూంగుళలి ఆగింది. వంతిదేవుడున్న అపాయకరపరిస్థితిని చూసి గ్రహించింది.

మరుక్షణం అక్కడ సగం ఇసుకలో, సగం బురద గుంటలో ఉన్న ఒక పడవను గమనించింది. ఆ గుంటలో నీరు నిండి కొలనులాగ ఉన్నప్పుడు ఆ పడవను ఉపయోగించబడివుండాలి. అందులోకిప్పుడు పూంగుళలి లాఘవంగా దూకింది. తెడ్డును తీసుకొని రెండుసార్లు వేసింది. అరెరె! ఇదేం విచిత్రం! ఆ పడవ నీటిమీద హంస వెళ్ళేటట్లు కద బురదమీద సునాయాసంగా వెళుతూంది? తేలుతూ వెళ్ళి బురదగుంట అవతలి గట్టును కూడ చేరుకొంది. పూంగుళలి గట్టి నేలమీదికి దూకింది. నేలమీద కాళ్ళను గట్టిగా ఊని, వంతిదేవుని రెండు చేతులను పట్టి గట్టుకు లాగి పడేసింది. అబ్బబ్బ! ఆ సన్నటి చేతుల్లో ఎంతటి బలం! తంజావూరు కోట దళపతి చిన్న పళువేట్టరయ్యర్ చేతులకన్న ఈమె చేతులు ఎక్కువ దృఢంగా ఉన్నాయే!

గట్టెక్కగానే వంతిదేవుడు గలగల నవ్వాడు. అతడి కాళ్ళు మాత్రం కాస్త వణుకుతున్నాయి.

“నన్ను కాపాడి గట్టెక్కించావని అనుకొంటున్నావు కాబోలు! నీవు రాకుంటే నేను గట్టెక్కేవుండేవాడిని కాననుకొన్నావా?” అన్నాడు.

“మరెందుకలా ’అయ్యో! అయ్యో!’ అని కేకలేశావు?” అన్నది పూంగుళలి.

“నీవు పరుగెత్తకుండ అడ్డగించి ఆపేందుకే!”

“అలాగైతే నిన్ను మళ్ళీ ఈ బురదగుంటలోకి తోసేస్తాను. నీ సామర్థ్యంతో నీవే గట్టెక్కు!” అని చెప్పి పూంగుళలి వంతిదేవుని తోసేందుకు ముందుకు దూకింది.

“అయ్యయ్యో!” అని అరిచి పక్కకు తొలగి నిలబడ్డాడు వంతిదేవుడు.

“మళ్ళీ ఎందుకరుస్తున్నావు?”

“ప్రాణాలకోసం భయపడడం లేదు! బురదను చూసే భయపడుతున్నాను! ఇప్పటికే తొడలవరకు బురదైపోయింది!”

పూంగుళలి ముఖంలో చిరునవ్వు విరిసింది. వంతిదేవుని తేరిపారజూసింది.

“అదిగో సముద్రముంది. వెళ్ళి బురదను శుభ్రంగా కడిగేసుకో!” అన్నది.

“నీవు కాస్త ముందుగా వెళ్ళి దారి చూపించాలి!” అన్నాడు వంతిదేవుడు. ఇద్దరూ సముద్రంవైపు నడిచారు. బురదగుంటను చుట్టు తిరిగి వెళ్ళారు.

“నన్ను చూడగానే ఎందుకలా పడుతూ లేస్తూ పరుగెత్తావు? నన్ను భయంకర పిశాచనుకొన్నావా?” అని అడిగాడు వంతిదేవుడు.

“కాదు; దెయ్యం, పిశాచి అనుకోలేదు. గుడ్లగూబ అనుకొన్నాను. నీ మూతి గుడ్లగూబ మూతిలాగే ఉంది!” అనేసి నవ్వింది.

వంతిదేవునికి తన రూపం గురించి గర్వమెక్కువ. కాబట్టి అతన్ని గుడ్లగూబ మూతి అన్నది చాల

కోపాన్ని తెప్పించింది.

“నీ కోతిమూతికి నా గుడ్లగూబ ముఖం తక్కువైపోయింది కాబోలు!” అని గొణిగాడు.

“ఏమన్నావు?”

“ఏం లేదు. నన్ను చూసి ఎందుకలా పరుగెత్తావని అడిగాను.”

“నీవెందుకలా నన్ను తరుముకొంటూ వచ్చావు?”

“దీపస్తంభానికి దారి అడిగేందుకే నిన్ను తరుముకొంటూ వచ్చాను...”

“అదిగో కనిపిస్తోంది దీపం! నన్ను దారి అడగనేల?”

“అడవిలోపల ప్రవేశించిన తర్వాత దారి తెలియలేదు. అందుకే! నీవెందుకు నన్ను చూడగానే అలా పరుగు లంకించుకొన్నావు?”

“మగవాళ్ళు చాల చెడ్డవాళ్ళు. మగవాళ్ళను చూస్తేనే నాకు నచ్చదు!”

“సేందన్ అముదన్ కూడానా?” అన్నాడు వల్లవరయ్యన్ కాస్త మెల్లగా.

“ఎవరినన్నావు?”

“తంజావూరు సేందన్ అముదన్నే చెప్పాను.”

“అతడి గురించి నీకేం తెలుసు?”

“అతడు నీకిష్టమైన ప్రేమికుడని తెలుసు.”

“ఏమి? ఏమి?”

“నీ పేరు పూంగుళలే కద?”

“నా పేరు పూంగుళలే. సేందన్ అముదన్ గురించి ఏం చెప్పావు? అతడు నా...”

“అతడు నీ ప్రేమికుడన్నాను.”

పూంగుళలి గొల్లుమని నవ్వింది. “అలా అని నీకెవరు చెప్పారు?” అన్నది.

“ఇంకెవరు చెబుతారు? సేందన్ అముదనే చెప్పాడు.”

“తంజావూరు చాల దూరాన ఉంది. అందుకే అతడలా చెప్పి తప్పించుకొన్నాడు!”

“లేకపోతే...”

“ఇక్కడే నా ముందే చెప్పివుంటే ఆ బురదగుంటలోకి ఎత్తి విసిరేసేదాన్ని.”

“అందువల్లనేమి? బురదను కడిగేసుకోవడానికి సముద్రంలో ధారాళంగా నీళ్ళుంది కద?”

“నీవు పడ్డ బురదగుంట ఊబిలో గొడ్లు, గుర్రాలు పడి చచ్చిపోయాయి. ఏనుగును కూడ అది మింగేస్తుంది!”

వంతిదేవుని ఒళ్ళు జలదరించింది. అతన్ని ఆ పాడు ఊబి కొద్దికొద్దిగా లోపలికి లాగుతున్నప్పుడు కలిగిన భయానుభూతిని మళ్ళీ తలుచుకొన్నాడు. ఈమె గనక వచ్చి తన్ని గట్టెక్కించివుండకపోతే,

ఇప్పటికి...దాన్ని తలుచుకొన్నప్పుడు అతడి ఒళ్ళంతా వణికింది.

"సేందన్ అముదన్ నా గురించి ఇంకా ఏం చెప్పాడు?" అని అడిగింది పూంగుళలి.

"నీవతడి మామకూతురని చెప్పాడు. నీలాంటి అందగత్తె దేవలోకంలో కూడ లేదన్నాడ..."

"దేవలోకానికతడు స్వయంగా వెళ్ళి చూసినట్లుంది. ఇంకా?"

"నీవు చాల బాగ పాడుతావన్నాడు. నీవు పాడితే కడలి కూడ తన హోరునాపేసి వింటుందట! అది నిజమేనా?"

"నీవే దాన్ని తెలుసుకో! ఇదిగో! కడలి తీరానికొచ్చేశాము!"

ఇద్దరూ సముద్రతీరానికి వచ్చి నిలబడ్డారు.

~~~
~~~

# అధ్యాయము - 3

## చిత్త భ్రమ

**ఆకాశంలో** చుక్కలు కళ్ళు మిటకరిస్తున్నాయి. నెలవంక నీలి సముద్రాన తేలివచ్చే వెండి పడవలాగ లేచి వస్తూంది. గాలి చాల వేగంగా వీస్తూంది. సముద్రపు హోరేమో విపరీతంగా ఉంది. తన తెల్లని అలల చేతులను చాచి ఒడ్డున నించున్నవారిని తనలోకి లాక్కోవడానికి ప్రయత్నిస్తూంది.

"ఎందుకలా నిలబడ్డావు? బురదను త్వరగా కడిగేసుకొని బయల్దేరు. ఇంటికి వెంటనే వెళ్ళాలి. లేకపోతే ఈరోజు నాకు అన్నం దొరకదు. అమ్మ అన్నపు కుండను కడిగేస్తుంది!" అన్నది పూంగుళలి.

"ఇక్కడ సముద్రం లోతెక్కువా?" అని అడిగాడు వంతిదేవుడు.

"నీలాంటి బెదురుగొట్టును నేను చూసిందే లేదు. ఇక్కడ చాల దూరం వరకు లోతే లేదు. అరకోసు దూరం వెళ్ళినా కూడ నడుం లోతే ఉంటుంది. అందుకే ఒక్కొక్కరోజు రాత్రి కూడ స్తంభదీపం వెలుగుతుండాలి!"

వంతిదేవుడు జంకుతూ నీట దిగాడు. బురదను కడిగేసుకొని, కాళ్ళు చేతులను శుభ్రం చేసుకొని గట్టెక్కాడు. కాస్త దూరాన వైద్యకుమారుడు గుర్రమెక్కి వస్తుండడాన్ని గమనించాడు. వంతిదేవుని గుర్రం కూడ ఆ గుర్రం పక్కనే వస్తూంది. "అయ్యయ్యో! గుర్రం బురదలో దిగేస్తుంది కద!" అని పెద్దగా అన్నాడు వంతిదేవుడు.

"దిగదు; మనుషులకన్న గుర్రాలకు వివేకమెక్కువ!" అన్నది పూంగుళలి.

"కానీ ఒక గుర్రం మీద ఒక మనిషున్నాడు కద? వాడు నా గుర్రాన్ని కూడ తీసుకొని వస్తున్నాడు కద?"

"అది కాస్త అపాయమే! పరుగెత్తి వెళ్ళి హెచ్చరించు!"

"ఆగాగు!" అని కేకలేస్తూనే వంతిదేవుడు పరుగెత్తి వెళ్ళి అడ్డగించాడు.

పూంగుళలి కూడ కాసేపటికల్లా వచ్చి వారితో చేరింది. ముగ్గురూ దీపస్తంభంవైపు నడిచారు. "నీవు గుర్రమెక్కవచ్చు కద?" అన్నది పూంగుళలి.

"లేదు; నీతో నడిచే వస్తాను."

పూంగుళలి గుర్రాన్ని సమీపించి దాని ముఖాన్ని నిమిరింది. అందువల్ల సంతోషంగొన్నట్లు గుర్రం ఒళ్ళు విదిలించుకొని మెల్లగా సకిలించింది. "నీవు నా గుర్రానికి నచ్చినట్లుంది. ఇది చాల మంచిది" అన్నాడు వంతిదేవుడ.

"ఏ విధంగా మంచిది?"

"నేను లంకకు వెళ్ళాలి. ఈ గుర్రాన్ని నీకు ఒప్పజెప్పేసి వెళదామని అనుకొంటున్నాను. చూసుకొంటావా?"

"ఓ! తప్పక చూసుకొంటాను. అన్ని మృగాలు కూడ నాతో చాల త్వరగా స్నేహం కలుపుకొంటాయి. మనుషులకు మాత్రమే నన్ను చూస్తే పడదు."

"ఎందుకలా అంటున్నావు? సేందన్ అముదన్ నీమీద..."

"నాకు కూడ మృగాలంటే మాత్రమే ఇష్టం. మనుషులంటే నాకూ ఇష్టం లేదు!"

"మనుషులు నీకేమలా కీడు చేశారు?"

"మనుషులు చెడ్డవాళ్ళు. అబద్ధాలు, కట్టు కథలు చెప్పడమే వాళ్ళ పని!"

"అందరినీ అలా ఒక్కటిగా చేర్చి చెప్పకూడదు. సేందన్ అముదన్ మంచివాడు. ఇదిగో ఈ వైద్యకుమారుడు కూడ చాల మంచివాడు..."

"మరి నీవో?"

"నేనూ మంచివాడినే. నా గొప్పతనాన్ని నేనే చెప్పుకోకూడదు కద?"

"మీరిద్దరూ ఎందుకిక్కడికి వచ్చారు?"

"చక్రవర్తికి ఒంట్లో బాగలేదు కద? ఆయన వ్యాధిని నయం చేసేందుకు కొన్ని మూలికలు కావాలి. ఈ అడవిలో కొన్ని అపూర్వమైన మూలికలున్నాయట కద? అందుకే నేను, వైద్యకుమారుడు ఇక్కడికి వచ్చాము..."

"కాసేపటి క్రితం లంకకు వెళ్ళాలన్నావు కద?"

"ఇక్కడ దొరకని మూలికలను లంకనుంచి తేవాలి. లంకలో హనుమాన్ తీసుకొని వచ్చిన సంజీవిని పర్వతం ఇంకా ఉందట కద?"

"అవును, ఉంది. అందుకే అక్కడిప్పుడు వేలకొద్ది జనాలు విషజ్వరంవల్ల చచ్చిపోతున్నారు...!"

"అవునా? అది నాకు తెలియదే? మమ్మల్ని పంపించిన అంతఃపురవైద్యులకు కూడ అది తెలియదు..."

"మగవాళ్ళలాగ అబద్ధాలు చెప్పేవారిని నేను చూసిందే లేదు. రెండురోజుల క్రితం ఇద్దరిక్కడికి వచ్చారు. వాళ్ళు కూడ ఇలాగే ఏదో అబద్ధం చెప్పారు. కానీ వాళ్ళు చెప్పినది కాస్త నమ్మదగిన అబద్ధంలాగుంది."

"వారెవరు? ఏం అబద్ధం చెప్పారు?"

"వాళ్ళు తమనెవరో మంత్రవాది/మాంత్రికుడు పంపించనట్లు చెప్పుకొన్నారు. చక్రవర్తికి రక్ష కట్టేందుకు పులి గోరు, ఏనుగు తోక వెంట్రుక కావాలని, అందుకోసం లంకకు వెళ్ళాలని చెప్పారు. వాళ్ళని నా అన్న పడవెక్కించుకొని లంకకు వెళ్ళాడు..."

"ఓ! అలాగా సంగతి!" అన్నాడు వంతిదేవుడు. అతడికి రవిదాసనే భయంకరమైన మంత్రవాది గుర్తొచ్చాడు. ఒక రాత్రి తాను పడుకొన్న పాడుబడ్డ మంటపంలో తన అనుభవం గుర్తొచ్చింది.

'దేవుడా! ఇలాంటి భయంకరమైన కార్యాల్లో ఎందుకు చిక్కుబడ్డాము? యుద్ధరంగంలో శత్రువులకెదురుగా నిలబడి పోరాడాలి! అప్పుడు మన ధీర, వీర, శూరత్వాలను చూపించాలి. ఇలాంటి మంత్ర, తంత్ర పన్నాగాలలో ఎందుకు చిక్కుబడ్డాము?'

'మనకన్న ముందే లంకకు వెళ్ళినవారు ఎవరై ఉండవచ్చు? ఈ పిల్లను ఎంతవరకు నమ్మవచ్చు? ఈమె కూడ ఆ కుట్రదారుల కూటమికి చెందినదై ఉండవచ్చా...! లేదు, లేదు! ఈమె కల్లాకపటం తెలియని పిల్ల, ఈమెతో ఎలాగైనా స్నేహం కలుపుకోవడం మంచిది.'

"పూంగుళలి! నీకు నిజం చెప్పేస్తాను. కాసేపటి క్రితం నేను మూలికల కోసం వచ్చానని చెప్పాను కద, అది అబద్ధం! నిజానికి నేనొక ముఖ్యమైన రహస్యకార్యం మీద లంకకు వెళుతున్నాను. దాన్ని నీకు చెప్పగోరుతున్నాను."

"వద్దు! ముఖ్యమైన, రహస్యమైన కార్యాల గురించి ఆడవాళ్ళకు చెప్పకూడదని నీకు తెలియదా? నాకేమీ చెప్పకు..."

"సాధారణమైన ఆడవాళ్ళ గురించే అలా చెబుతారు. నీకా రహస్యం చెబితే ఏమీ కాదు."

"నేను సాధారణమైన ఆడదాన్నికానని నీకెలా తెలుసు? నీవు నన్ను చూసి ఒక ఘడియ కూడ గడవలేదు కద?"

"పూంగుళలి! నిన్ను మొట్టమొదట ఆ గుడి ప్రాకారపు గోడమీద చూసినప్పుడే నీవు నాకు చాల నచ్చావు. నిన్నొకటడుగుతాను - నిజమైన జవాబు చెబుతావా?"

"అడిగి చూడు!"

"సేందన్ అముదన్ నీ ప్రేమికుడు కాదన్నది నిజమా? అతన్ని నీవు పెళ్ళిచేసుకోబోవడం లేదా?"

"ఎందుకడుగుతున్నావు?"

"సేందన్ అముదన్ నా స్నేహితుడు; అతడికి వ్యతిరేకంగా నేనేమీ చేయకూడదు. కానీ అతడు నీ ప్రేమికుడు కాదంటే..."

"చెప్పు! ఎందుకు జంకుతున్నావు?"

"ఆ స్థానానికి నేను విన్నపం తెలియజేయగోరుతున్నాను. పూంగుళలీ! ప్రేమ గురించి నీవు లోకువగా మాట్లాడడం నాకు నచ్చలేదు. లోకంలో ప్రేమకన్న మహత్తరమైన శక్తి ఇంకేదీ లేదు. అప్పర్, సుందరమూర్తి, సంబందర్ మొదలైన మహానుభావులందరూ భగవంతుని ప్రేమికునిగా ఎంచి పాటలు పాడారు. తొల్కాప్పియర్, వళ్ళువర్, ఇంకా తమిళ కవివరులందరూ ప్రేమను పొగిడి పాడారు. బృందావనంలో కన్నయ్య గోపికల ప్రేమకు వశమయ్యాడు..."

"అయ్యా! నేనొకటి చెబుతాను. దాన్ని బాగ విని, మనసులో పదిలం చేసుకోండి!"

"ఏమది?"

"నాకు మిమ్మల్ని చూస్తే ఇష్టం కలుగుతూంది, నిజమే. రెండురోజుల క్రితం వచ్చిన వాళ్ళను చూసినప్పుడు కలిగిన చిరాకు మిమ్మల్ని చూస్తే కలగలేదు.."

"ఓ! అలాగైతే నేను భాగ్యశాలినే!"

"కానీ ప్రేమ, గీమ అన్న మాటలను మాత్రం ఎత్తకండి!"

"ఏల? ఏల?"

"సేందన్ అముదన్ నా ప్రేమికుడు కాడు. కానీ నాకు వేరే ప్రేమికులున్నారు..."

"అరెరె! వేరే ప్రేమికులా? ఎవరు? ఎంతమంది?"

"నడిరాత్రి చిమ్మచీకటిలో నేను లేచి వెళతాను. నా వెన్నంటి వస్తే వాళ్ళను చూపిస్తాను. మీరే చూసి తెలుసుకోవచ్చు!" ఇలా చెప్పేసి పూంగుళలి 'హహ్హాహ్హా' అని నవ్వింది.

ఆ నవ్వు వంతిదేవుని కలవరపరిచింది. 'పాపం ఈ పిల్లకు చిత్తభ్రమ కాబోలు! మన కార్యం నెరవేరడానికి ఈ పిల్లనుంచి ఎలాంటి సహాయం ఎదురుచూడడం కూడ వృధానే! ఈమెకేమీ చెప్పకుండడమే మంచిది' అనుకొన్నాడు.

దీపస్తంభం దగ్గరున్న ఇంటిని సమీపించారు వారు. లోపలున్న ఒక పెద్దాయన, ఒక వయసు మళ్ళిన స్త్రీ బయటికొచ్చారు. పూంగుళలిని, తక్కిన ఇద్దరిని, రెండు గుర్రాలను చూసి పెద్దాయన నిశ్చేష్టులైనారు.

"పూంగుళలీ! వీరెవరు? ఎక్కడ పట్టుకొన్నావు వీరిని?" అని అడిగారు.

"నేను వీళ్ళను పట్టుకోలేదు. నాన్నా! వీళ్ళే నన్ను పట్టుకొన్నారు!" అన్నది పూంగుళలి.

"అంతా ఒకటే. 'పొద్దుగుంకేలోపల ఇంటికి వచ్చేయి' అని చెబితే నీవు వినడం లేదు. మొన్న ఇద్దరిని పిలుచుకొని వచ్చావు. ఇప్పుడిద్దరిని పిలుచుకొని వచ్చావు. వీళ్ళెందుకొచ్చారు?"

"చక్రవర్తికి వైద్యం చేసేందుకు మూలికలు తీసుకొని వెళ్ళడానికి వచ్చారట, నాన్నా!"

"ఏమయ్యా! ఈ పిల్ల చెబుతున్నది నిజమేనా?" అని ఆ పెద్దాయన వంతిదేవుని చూసి అడిగారు.

"అవునండీ! ఇదిగో, తాళపత్రం!" అని చెప్పి వంతిదేవుడు నడుం బట్టలో దాచుకొన్న ఒక తాళపత్రసందేశాన్ని తీసి ఆయనకిచ్చాడు.

అదే సమయాన ఇంకొక తాళపత్రం కింద పడింది. దాన్ని తొందరగా తీసి భద్రపరుచుకొన్నాడు. "పెద్ద మూడుణ్ణి నేను. ఒకసారి కార్యం చెడ్డా బుద్ధి రాలేదు!" అని తనలో తానే అనుకొన్నాడు.

పెద్దాయన ఆ తాళపత్రాన్ని తీసుకొన్నారు. స్తంభదీపం వెలుతురులో దాన్ని శ్రద్ధగా చదివారు. ఆయన ముఖం విప్పారింది. తమ ఇల్లాలిని చూసి, "యువరాకుమారి తాళపత్రాన్ని రాసి పంపింది. వీరికి

భోజనం ఏర్పాటు చేయాలి. లోపలికి వెళ్ళి నీ కోడలికి చెప్పు! అన్నం కుండను దొర్లించేయబోతుంది!" అన్నారు.

~~~
~~~

# అధ్యాయము - 4

## నడిరాత్రి ...

రాత్రి భోజనమైన తర్వాత దీపస్తంభసూచిక నిర్వహించే/చూసుకొనే పెద్దాయనను విడిగా కలుసుకొని, తాను లంకకు తొందరగా వెళ్ళాలనే విషయాన్ని తెలియజేశాడు. త్యాగ విడంగకరైయర్ అనే ఆ పెద్దాయన తన అసహాయతను, విచారాన్ని వెలిబుచ్చారు.

"ఒకప్పుడు ఈ తీరంలో ఎన్నో పెద్ద, పెద్ద ఓడలు, పడవలు ఉండేవి. కానీ ఇప్పుడవన్నీ సేతుసముద్రానికి వెళ్ళిపోయాయి. లంకలో ఉన్న మనసైన్యానికి సహాయంగానే వెళ్ళాయవి. నాకు సొంతంగా రెండు పడవలున్నాయి. నా కొడుకు నిన్న వచ్చిన ఇద్దరు మనుషులను వాటిలో ఒక పడవలో ఎక్కించుకొని వెళ్ళాడు. వాడెప్పుడు తిరిగి వస్తాడో తెలియదు. నేనేం చేయను?" అన్నారు.

"ఆ మనుషులెవరు? వారు అదో రకమైన మనుషులని మీ కుమార్తె చెప్పిందే?"

"వారిని చూస్తే నాకు నచ్చలేదు. వారెవరన్నదీ తెలియలేదు. ఎందుకు లంకకు వెళుతున్నారన్నదీ తెలియరాలేదు. పళువేట్టరయ్యర్ గారి తాటి చిహ్నపు లాంఛనాన్ని/ముద్రను వారి దగ్గర చూశాను. అప్పటికీ నేను నాకొడుకును వెళ్ళమనేవాడిని కాను. కానీ నా కోడలికి ధనాశ ఎక్కువ. సంచి నిండా డబ్బిస్తామని వారు చెప్పింది విని తన మొగుడు తప్పకుండ వెళ్ళాలని హఠం పట్టింది..."

"ఇదేం విచిత్రమయ్యా? లోకానుభవం లేని ఒక ఆడపిల్ల చెబితే అది మీ కొడుకు వినడమా?" అన్నాడు వంతిదేవుడు. తర్వాత కాస్త జంకుతూ, "మన్నించాలి! అది మీ కుటుంబ విషయం!" అన్నాడు.

"అబ్బాయ్! అడగడంలో తప్పేమీ లేదు. నా కుటుంబానికి ఒక శాపం ఉంది..." అని చెప్పేసి కాస్త జంకారా పెద్దాయన.

వంతిదేవునికి అప్పుడు సేందన్ అముదన్ చెప్పిన విషయం గుర్తుకొచ్చింది. "మీ కుమారుడు మూగవాడా?" అని అడిగాడు.

"అవును. నీకెలా తెలిసింది?" అని అడిగారాయన.

సేందన్ అముదన్ గురించి, అతడి తల్లి గురించి, వారి ఇంట్లో తాను బసచేసిన విషయం గురించి చెప్పాడు వంతిదేవుడు.

"ఓ! ఆ మనిషి నీవేనా? నీ గురించిన సమాచారం నీకన్న ముందే వచ్చి చేరింది. నీకోసం దేశమంతా వెతుకుతున్నారు కద?"

"ఉండనీ. దాని గురించి నాకు తెలియదు."

"నీవెందుకు ఇంత తొందరగా లంకకు వెళ్ళాంటున్నావని నాకిప్పుడు తెలిసింది..."

"పెద్దయ్యగారూ! నా ప్రాణాన్ని కాపాడుకోవడానికి నేను లంకకు పారిపోవాలనుకోవడం లేదు. అక్కడున్న ఒకరికి అతిముఖ్యమైన తాళపత్ర సందేశాన్ని తీసుకొని వెళుతున్నాను. కావాలంటే దాన్ని మీరు చూడవచ్చు."

"అవసరం లేదు. యువరాకుమారి కుందవైదేవి నీగురించి రాసిన పరిచయ పత్రమే చాలు. కానీ నీవు నన్నిప్పుడు అడుగుతున్న ఉపకారాన్ని నేను నీకు చేయలేను కద?"

"ఇంకొక పడవుందని చెప్పారు కద?"

"పడవుందిగాని దాన్ని నడిపేందుకు మనుషులెవరూ లేరు. నీవూ, నీ స్నేహితుడు కలిసి నడుపుకొంటూ వెళతారంటే ఇస్తాను..."

"మాకిద్దరికీ పడవ నడపడం రాదు. నాకు నీళ్ళంటేనే భయం. మరి సముద్రమంటే ..."

"పడవ నడపడం తెలిసినా, అనుభవం లేని వారు సముద్రంలో పడవ నడపలేరు. సముద్రంలో కాస్త దూరం వెళ్ళిన తర్వాత తీరం కనుమరుగైపోతుంది. తర్వాత దిక్కు తెలియక అవస్థ పడాలి."

"నాతో వచ్చిన వాడిని నావెంట తీసుకొని వెళ్ళలేను. మూలిక వెతకడానికి అతన్ని ఇక్కడే వదిలిపెట్టి వెళ్ళాలి. కాబట్టి మీరే నాకొక దారి చూపండి..."

"ఒక ఉపాయం ఉంది. కానీ అది అంత సులభసాధ్యం కాదు. నీవు కూడ ప్రయత్నించి చూడు. అదృష్టం నీవైపుంటే..."

"నేనేం చెయ్యాలయ్యగారూ! చెబితే తప్పకుండ చేస్తాను!" అన్నాడు వంతిదేవుడు.

"ఈ చుట్టుపక్కల పూంగుళలి కన్నమిన్నగా పడవ నడపగలవారెవరూ లేరు. లంకకు ఎన్నోసార్లు వెళ్ళి వచ్చింది. ఆమెకు నేను చెబుతాను. నీవు కూడ అడిగి చూడు!"

"ఇప్పుడే పిలవండేం! అడగి చూద్దాం!"

"వద్దు. అది చాల హఠమారి. ఇప్పుడే అడిగి, 'వల్లకాదు' అని చెప్పేస్తే తర్వాత దాని మనసు మార్చలేం. రేపు మంచి సమయం చూసి నేనే చెబుతాను. నీవు కూడ తర్వాత అడిగి చూడు!"

ఇలా చెప్పి, త్యాగ విడంగకరైయర్ దీపస్తంభం వైపు నడిచారు.

వారి ఇంటి దిన్నెమీద వంతిదేవుడు పడుకొన్నాడు. అతడితోబాటు వచ్చిన వైద్యకుమారుడు అప్పటికే నిద్రపోయాడు. వంతిదేవునికి కూడ ప్రయాణపుటలసట వల్ల వెంటనే నిద్ర ముంచుకొచ్చింది. త్వరలో నిద్రలోకి జారిపోయాడు.

~

ఉన్నట్లుండి నిద్ర చెదిరిపోయింది. తలుపు తెరిచిన శబ్దమైంది. గాఢనిద్రవల్ల మూసుకొనిపోతున్న కళ్ళను అతికష్టంమీద తెరిచి చూశాడు వంతిదేవుడు. ఒక ఆకారం ఇంటినుంచి బయటక రావడం కనిపించింది. బాగా పరిచించి చూడగా అది ఒక స్త్రీ ఆకారం అని తెలిసింది. ఆః! అది పూంగుళలి!

సందేహంలేదు.

ఆమె మనకేమో చెప్పింది కద? “నడిరాత్రి నాతోరా! ఆ ప్రేమికులను చూపిస్తాను!” అన్నది. అప్పుడది ఏదో పరాచికంగా అన్నదనుకొన్నాం. చూడబోతే అది నిజంలాగుంది! నిజంగానే ఈమె మధ్యరాత్రి లేచి వెళుతూంది! ప్రేమికుడినో, ప్రేమికులనో చూసేందుకు వెళుతుంటే మనని వెంట రమ్మంటుందా? 'నా వెనకే వస్తే చూపిస్తాను!' అంటుందా? ఇందులో ఏదో మర్మముంది! లేక, ఒకవేళ – ఎలా ఉన్నా, వెన్నంటి వెళ్ళి ఎందుకు చూడకూడదు? రేపు ఆమెను లంకకు పడవలో తనను పిలుచుకొని వెళ్ళమని నయంగా అడిగి చూడాలి. ఇప్పుడీమెకు ఏదైనా అపాయం కలగవచ్చు. అందునుంచి ఆమెను మనం కాపడితే రేపు మనం అడిగే సహాయానికి ఇంకాస్త అనుకూలంగా ఉంటుంది కద?

వంతిదేవుడు సద్దు చేయకుండ లేచాడు. పూంగుళలి వెళుతున్న దారి వెంట సాగాడు. సాయంకాలం ఋరదగుంటలో పడ్డ అనుభవం ఇంకా బాగా గుర్తుంది. అలా ఇంకొకసారి జరగడం అతడికిష్టంలేదు. కాబట్టి పూంగుళలి కనుచూపుమేర దాటకుండ చూసుకోవాలి.

~

దీపస్తంభ గృహంనుంచి కాస్త దూరంవరకు పట్టపగలు వెలుతురులాగ ఉంది. కాబట్టి పూంగుళలి ఆకారంకూడ స్పష్టంగా కానవచ్చింది; కాబట్టి ఆమె వెళుతున్న దారి వెంట వెళ్ళడం అంత కష్టమనిపించలేదు. వేగంగా వెళ్ళి ఆమెను పట్టుకోవాలనుకొన్నాడు. కానీ వేగం పెంచేకొద్దీ, ఆమె ఇంకా వేగంగా వెళుతున్నట్లనిపించింది. తాను ఆమె వెంటడి వస్తున్న విషయం ఆమె గమనించినట్లే లేదు.

బయలు దాటిన తర్వాత, దట్టమైన అడవి, మిట్టపల్లాల ప్రదేశం మొదలైంది. ఆ మిట్టను తిన్నగా ఎక్కకుండ, పూంగళలి దాని చుట్టు తిరిగి వెళ్ళింది. మిట్ట, అడవి చివరికి ముగిశాయి. వంతిదేవుడు కూడ ఆ చివరి భాగాన్ని వేగంగా చుట్టి వెళ్ళాడు. అటు తిరగగానే దూరాన పూంగుళలి కనిపించింది. 'అమ్మయ్య' అనుకొని ధైర్యపడ్డాడు. కానీ మరుక్షణమే ఆమె మాయమైంది!

ఉన్నట్లుండి ఎలా మాయం కాగలదు? ఇదేమి మాయమా? మంత్రమా? అక్కడేమైన పల్లముందా? ఉరుకులు పరుగులతో పూంగుళలి మాయమైన చోటికి వెళ్ళి చేరాడు. అక్కడ నిలబడి నలువైపుల పరికించి చూశాడు. మూడువైపుల మాయమయ్యే అవకాశం లేదు. ఆ మూడువైపుల జాగ్రత్తగా కాలూని ఋరదగుంటలేం లేవని రూఢిపరుచుకొన్నాడు. కాబట్టి ఇక మిగిలిన నాలుగోవైపున్న దట్టమైన అడవిలోపలికే వెళ్ళివుండాలి.

~

ఇంకాస్త పరికించి చూడగా ఆ దట్టమైన చెట్లున్న మిట్టపైన ఒక సన్నటి కాలిబాట కనిపించింది. ఆబాట పైకెక్కి ముందుకడుగు వేశాడు. సూచికాదీపస్తంభపుమసక వెలుతురుకూడ అక్కడ పడడం లేదు. ఆ చిమ్మ చీకటిలో మిణుకు మిణుకుమంటున్న చుక్కల వెలుతురులోనే ఎలాగో దారి చూసుకొని

ముందుకు సాగాలి. ఆ దారికూడ కాస్త దూరం వెళ్ళిన తర్వాత కనిపంచలేదు. ముళ్ళపొదలు, లావాటి చిన్న చెట్లు భయంగొలిపేలా కానవచ్చాయి. వాటి నీడలు నల్లటి దెయ్యాలలాగ కనిపించాయి. చెట్ల ఆకులు కదిలినప్పుడు ఆ నీడలుకూడ కదిలాయి. ఒక్కొక్కసారి అవి పెద్దగా కదిలినప్పుడు అతడి గుండె గుబగుబలాడింది. ఆ చిమ్మ చీకటిలో, క్రీనీడల్లో ఎటువంటి అపాయం పొంచివుందో ఎవరికి తెలుసు? విష సర్పాలు, క్రూరమృగాలు పొంచివుండి మనమీదకు దూకవచ్చు. అపాయం ముందునుంచి రావచ్చు; పక్కలనుంచి రావచ్చు. వెనకనుంచి కూడ రావచ్చు! అరెరే! ఇదేమిటిలా వచ్చి చిక్కుపడ్డాము! చేత శూలం కూడ లేదు!

అదేమి గలగల శబ్దం? ఆ చెట్టుపైన ఏమా నల్లటి ఆకారం? ఆ పొదలో మిణుమిణుకుమంటున్న ఆ రెండు కాంతిపుంజాలేమి?

వంతిదేవుని కాళ్ళు అతనికి తెలియకుండానే వణకసాగాయి. సరే, సరే! మనకిక్కడేం పని? ఎందుకిక్కడికి వచ్చాము? ఏం తెలుసుకోవడానికి? వద్దు, వెంటనే ఇక్కడినుంచి దిగి తిరిగి వెళ్ళిపోవాలి!

దిగుదామని వెనుదిరిగినప్పుడు ఒక గొంతు వినిపించింది. మనసును కట్టి కుదిపేలా ఒక అమ్మాయి గొంతు. వెక్కుతున్న శబ్దం. తర్వాత ఈ పాట వినిపించింది:

"అలల కడలి నిలకడ కాగా
మనోసముద్రం పొంగుతోందేం?
...
..."

వంతిదేవుడు ఆ మిట్ట దిగి కిందకు వెళ్ళే ఆలోచనను పూర్తిగా వదిలేసి ఆ గొంతు వినిపించిన దిక్కుగా పైకెక్కి త్వరలోనే శిఖరం చేరాడు. అక్కడ నిలబడ్డది పూంగుళలే అని గ్రహించాడు. ఆ పాట పాడింది కూడ ఆమే. ఆకాశంలో మెరుస్తున్న నక్షత్రాలను చూస్తూ ఆ పాట పాడింది.

ఆ చుక్కలే తన పాటను వినేందుకు సభ కూడినట్లు వాటిని చూస్తూ, వాటికోసమే పాడింది కాబోలు! ఆ నక్షత్రాలకు కూడ ఆ శోకగీతాన్ని విని ఒళ్ళు జలదరించింది. ఆ చుక్కల్లో ఒకటి ధూమకేతువనే తోకచుక్క. దాని నుంచి వెలువడుతున్న కాంతి విసనకర్రలా చాల దూరం పరుచుకొంది. మిట్టమీద ఆ పిల్ల నీడ, ఆమె గొంతు, శోక గీతం, ఆకాశంలో ధూమకేతు అన్నీ చేరి వంతిదేవుని స్వాధీనాన్ని పోగొట్టాయి. అతని కాళ్ళు అతన్ని మిట్ట శిఖరానికి తీసుకొని వెళ్ళాయి.

~

పూంగుళలి ఎదురుగా వెళ్ళి నిలబడ్డాడు వంతిదేవుడు. ఆమె వెనక, చాలదూరంలో దీపగృహం కనిపించింది. చుట్టూ సముద్రం తన వెండికెరటాలను పరిచింది.

"వచ్చేశావా? కుంభకర్ణునిలాగ నిద్రపోతున్నావే అనుకొన్నాను..."

"ఇంటి తలుపు తెరిచిన శబ్దం వినగానే మెలకువైంది. నీవు గబగబా నడిచి వచ్చేశావు! తిరిగి చూడనేలేదు! అబ్బబ్బ! నిన్ను వెంబడి రావడం ఎంత కష్టమైంది!"

"ఎందుకు నా వెంబడి వచ్చావు?"

"మంచి ప్రశ్న! నీవే కద రమ్మన్నావు? మరిచిపోయావా?"

"ఎందుకు రమ్మన్నాను? నీకు గుర్తుందా?"

"గుర్తులేకేం? వస్తే నీ ప్రేమికులను చూపిస్తానన్నావు! ఎక్కడ నీ ప్రేమికులు? చూపించు చూద్దాం!"

"అదిగో చూడు! నీ వెనుక తిరిగి చూడు!" అన్నది పూంగుళలి.

~~~~~
~~~~~

# అధ్యాయము - 5

## "నడి సముద్రంలో ..."

వంతిదేవుడు వెనక్కి తిరిగి చూశాడు. ఒక్కసారిగా తన్ పేగులన్నీ చుట్ట చుట్టుకొని గుండెల్ని నొక్కినట్లనిపించింది. గొంతు పూడుకొని, ఊపిరి సలపనట్లైంది.

అతడి తలలో వేయి మెరుపులు మెరిశాయి. బాగా కాల్చిన శూలంతో పొడిచినట్లు ఒక అనుభవం - అటువంటి భయంకర దృశ్యం అతడి కళ్ళముందు కనిపించింది.

అనంతంగా పరుచుకొన్న ఆ నిశీధిలో పది, ఇరవై, నూరు అగ్నిగుండాలు కానవచ్చాయి. వాటినుంచి పొగలేదు, వెలుతురు లేదు. కింద కట్టెలు పేర్చి కాల్చే మంటలు కావవి. వట్టి అగ్ని పిండాలు. భూమిలోపలినుంచి అవి ఎలాగో లేచి నిలబడివున్నాయి. ఉన్నట్లుండి కొన్ని మాయమయ్యాయి. ఇంకొన్ని అగ్ని పిండాలు పుట్టుకొచ్చాయి.

ఒక బ్రహ్మాండమైన రాక్షసుడు, తలలేని కబంధుడి వంటి రాక్షసుడు, పొట్టలోనే నోళ్ళున్న రాక్షసుడు. కానీ వాడి పొట్టలో ఒక నోరు కాదు - వందల కొద్ది నోళ్ళు. వాటిని తెరిచినప్పుడు కడుపునుంచి అగ్ని జ్వాలలు పైకొస్తున్నాయి. మూసినప్పుడు మాయమౌతున్నాయి.

ఇటువంటి దృశ్యాన్ని చూసిన వంతిదేవుని ఒంట్లోని ఒక్కొక్క వెంట్రుక గుండా రక్తం పొంగుతున్నట్లనిపించింది. అతడెప్పుడూ అంతగా భీతిగొనలేదు. పెద్ద పళువేట్టరయ్యర్ పాతాళ చెరసాలలో కూడ ఇంతగా భీతిగొనలేదు.

తన వెనుక 'హహ్హాహ్హా ' అన్న ఒక వికటాట్టహాసం వినిపించగా, తిరిగి చూశాడు.

పూంగుళలే! ఇంకొక సందర్భంలోనైతే ఆ వికటాట్టహాసం అతడికి భీతిగొల్పేదే. కానీ అదే ఇప్పుడతడికి ధైర్యాన్నిచ్చింది. సజీవంగా ఉన్న ఒక అమ్మాయి/మనిషి తన పక్కనుండడం ఆ అపాయకరమైన పరిస్థితిలో ఒక పెద్ద అండగా అనిపించింది.

"చూశావా నా ప్రేమికులను?" అని అడిగింది పూంగుళలి.

"ఈ కొరివి దెయ్యాలే నా ప్రేమికులు. వీరిని చూసి వీరితో సరస సల్లాపాలేడేందుకే మధ్యరాత్రి ఇక్కడికి వస్తుంటాను!" అన్నది పూంగుళలి.

ఈ పిల్లకు పిచ్చి ముదిరిందనడంలో సందేహంలేదు. ఈ పిల్ల సహాయం తీసుకొని లంకకు వెళ్ళడం సాధ్యమా? వంతిదేవుడిలా ఆలోచిస్తుండగా అతడి మనసు లోలోపలినుంచి ఇంకేదో ఒక ఆలోచన బయటకు వచ్చేందుకు పోరాడసాగింది. అదేమి? ఈ కొరివి దెయ్యాల గురించిన ఒక ఆలోచనే.

"నీ స్నేహితుడు సేందన్ అముదన్ ఈ ప్రేమికులతో పోటీ చేయగలడా?" అని పూంగుళలి అడిగింది

ఎక్కడో నూతిలోపలినుంచి వస్తున్నట్లనిపించింది. ఎందుకంటే వంతిదేవుని మనసు దేన్నో గుర్తు తెచ్చుకోవడానికి లోతుగా ఆలోచిస్తూంది. మనసులో ఒక పెద్ద పోరాటం! ఆఁ! అది ముగిసి, ఇప్పుడు స్పష్టంగా ఒక ఆలోచన ముందుకొచ్చింది.

~

గంధకం కలిసివున్న నేలలో నీరు చాల కాలం నిలవ ఉండి బురదగుంటగ మారితే, అటువంటి ప్రదేశాల్లో ఇటువంటి దృశ్యాలు గోచరిస్తుంటాయి. భూమిలోపలినుంచి గంధకపు వాయువు గుప్పుగుప్పుమని బయటకు వచ్చినప్పుడు అగ్ని జ్వాలల్లాగ కనిపిస్తుంది. కొన్నిసార్లు చాలసేపు కనిపిస్తోంది. కొన్నిసార్లు గుప్పుగుప్పుమని ఆరిపోతుంది. ఆ ప్రకృతి సహజమైన దృశ్యాన్ని చూసి, తెలియని వాళ్ళు భయపడతారు. 'కొరివి దెయ్యం' అనే భయంకరమైన పేరు పెట్టి తమ భయాన్ని ఇంకొందరికి పంచి పెడతారు.

ఇలా తన పెద్దలు చెప్పింది గుర్తుకొచ్చింది. తర్వాత భయానికి, ఎరుకకు/జ్ఞానానికి మధ్య ఒక పెద్ద పోరాటం జరిగింది. ఆ పోరాటంలో చివరికి జ్ఞానం గెలిచింది.

కానీ అదంతా భ్రమించివున్న ఈ పిచ్చిపిల్లకు చెప్పి ప్రయోజనం లేదు. ఎలాగైనా మంచిమాటలు చెప్పి ఇక్కడినుంచి తీసుకెళ్ళిపోవాలంతే.

“అమ్మాయీ! నీ ప్రేమికులెక్కడికీ పోరు. ఇక్కడే ఉంటారు. రేపుకూడ వారిని వచ్చి చూడవచ్చు కద? ఇంటికి పోదాం రా!” అన్నాడు.

అందుకు పూంగుళలి బదులు చెప్పక వెక్కివెక్కి ఏడ్వసాగింది.

ఇదేం తంటరా బాబు అనుకొన్నాడు వంతిదేవుడు. తర్వాత కాసేపు ఊరుకొన్నాడు.

“అమ్మాయీ! ఇక వెళదామా?” అని మళ్ళీ అడిగాడు.

ఏడుపు ఆగలేదు.

వంతిదేవునికి ఓపిక నశించింది.

“సరి; నీ ఇష్టం వచ్చినట్లు చెయ్. నాకు నిద్రొస్తూంది. ఇంటికి వెళుతున్నాను" అని చెప్పేసి దిబ్బమీదినుంచి కిందకు దిగనారంభించాడు.

పూంగుళలి వెంటనే ఏడుపునాపేసి తానుకూడ కిందకు దిగనారంభించింది. నాలుగే దాట్లలో కిందకు దిగి వెళ్ళి నిలబడింది.

వంతిదేవుడు పరుగెత్తి వెళ్ళి ఆమెను కలుసుకొన్నాడు.

~

ఇద్దరూ దీపగృహంవైపు నడక సాగించారు.

ఈ పిచ్చిపిల్లను నమ్మి పడవనెక్కడమా? కడలి దాటినట్లే - కానీ వేరే దారి లేదు కద? ఏదైనా

మంచి మాటలతో స్నేహం కలుపుకొందామా?

"ఆకాశంలో తోకచుక్క కనిపిస్తూంది కద? దాని గురించి నీ అభిప్రాయమేమి?" అని పూంగుళలి అడిగింది.

"నా అభిప్రాయమేమీ లేదు. తోకచుక్క కనిపిస్తోంది. అంతే!" అన్నాడు వంతిదేవుడు.

"ఆకాశంలో తోకచుక్క కనిపిస్తే నేలమీద పెద్ద కీడు/దుర్ఘటన జరుగుతుందంటారు కద?"

"అలాగనే కొందరంటున్నారు."

"నీవేమంటావు?"

"నేను జ్యోతిష్క శాస్త్రం చదవలేదు. జనాలు/ప్రజలు అలా చెప్పుకోవడం మాత్రమే నాకు తెలుసు."

తర్వాత కాసేపు మౌనంగా నడిచారు. తర్వాత పూంగుళలి, "చక్రవర్తికి ఒంట్లో బాగా లేదంటున్నారు. అది నిజమేనా?" అని అడిగింది.

ఈ పిల్ల అంత పిచ్చిది కాదనుకొన్నాడు వంతిదేవుడు. కాస్త నమ్మకం పుట్టింది.

"నేనే నా కళ్ళారా చూశాను. చక్రవర్తి పడుకొన్న పడకనుంచి లేవలేకున్నారు. రెండు కాళ్ళూ చచ్చుబడిలోయాయి. ఒక్క అడుగుకూడ ఎత్తి వేయలేరు. ఆయన కోలుకోవడానికి మూలిక కోసమే కద నేనిక్కడికి వచ్చా? అమ్మాయీ! నీవు నాకొక సహాయం చేస్తావా?" అని అడిగాడు.

అందుకు బదులు చెప్పక, "చక్రవర్తి చాలరోజులు బతికుండరు, త్వరలోనే చనిపోతారంటున్నారు. అది నిజమేనా?" అని అడిగింది.

"నీవిప్పుడు సహాయం చేయకపోతే అలా జరిగినా జరగవచ్చు. లంకలో ఒక అపూర్వ సంజీవిని ఉందట. అది తీసుకొని వచ్చి ఇస్తే చక్రవర్తి బతుకుతారట. నీవు పడవ నడిపి నన్ను లంకకు తీసుకొని వెళతావా?

"చక్రవర్తి చనిపోతే ఆయన తర్వాత పట్టానికెవరు వస్తారు?"

"అమ్మాయ్! దానిగురించి నీకు, నాకు ఏల చింత? పట్టానికి ఎవరు వస్తే మనకేం?"

"ఎందుకు చింత లేదు? మనమీ దేశప్రజలం కాదా?"

ఈ పిల్ల పిచ్చిది కానేకాదు. చాల జాగ్రతగా మసలుకోవాలి. ఈమె విచిత్ర ప్రవర్తనకు వేరే కారణముండాలి.

"ఎందుకు మౌనంగా ఉన్నావు? తర్వాత పట్టానికి ఎవరు వస్తారు?" అని పూంగుళలి మళ్ళీ అడిగింది.

"ఆదిత్య కరికాలన్‌కే కద యువరాజు పట్టం కట్టారు? ఆయనే సింహాసనానికి న్యాయమైన వారసుడు."

"మధురాంతకులు - ఆయనకేం హక్కేలేదా?"

"ఆయన రాజ్యం వద్దని చెప్పేశారు కద?"

"మునుపలా చెప్పారు. ఇప్పుడు కావాలంటున్నారట కద?"

"ఆయన చెబితే చాలా? ప్రజలందరూ ఒప్పుకోవాలి కద?"

"పెద్ద మనుషులు చాలమంది ఆయన పక్షాన ఉన్నారట కద?"

"అలాగనే నేనూ విన్నాను. ఇదంతా నీ చెవికి చేరిందని తెలిసి చాల ఆశ్చర్యపడుతున్నాను."

"సుందర చోళ చక్రవర్తి ఉన్నట్లుండి చనిపోతే  ఏమవుతుంది?"

"దేశమంతా సంక్షోభంలో మునిగిపోతుంది. దాన్ని ఆపేందుకే ఇప్పుడు నీ సహాయం కావలసి ఉంది..."

"నేనేం సహాయం చేయగలను?"

"ముందే చెప్పాను కద? నేను తొందరగా మూలిక తీసుకొని రావడానికి లంకకు వెళ్ళాలి. అందుకు నీవు పడవ నడుపుకొని రావాలి."

"నన్నెందుకు పిలుస్తున్నావు? ఒక ఆడపిల్లను పడవ నడపమని అడిగేందుకు సిగ్గుగా లేదూ?"

"ఇంకెవరూ లేరని మీ నాన్నగారు చెప్పారు. మీ అన్నకూడ నిన్న ఇంకొక పడవ నడుపుకొంటూ వెళ్ళిపోయాడట కద?"

"వాడు పోతేనేమి? నీకు రెండు చేతులు, నీతో వచ్చినవాడికి రెండు చేతులు లేవా?"

"నాకు పడవ నడపడం రాదు..."

"అదేం బ్రహ్మ విద్యా? తెడ్డు పట్టుకొని వేస్తే పడవ తానే ముందుకు వెళుతుంది!"

"దిక్కు తెలియకుండ పోతుంది కద? నడి సముద్రంలో దిక్కు తెలియకుండపోతే..."

"నడి సముద్రంలొ దిక్కు తెలియక మునిగి చావండి! అందుకు నేనేం చేయాలి?"

ఇద్దరూ దీపగృహం దగ్గరకొచ్చేశారు. అంతటితో ఆమాటను ఆపగోరాడు వంతిదేవుడు. ఇంకా పొడిగించి పూంగుళలి తిరస్కారాన్ని దృఢపరచడం అతడికిష్టం లేదు. ఆమె అంత నిక్కచ్చిగా బదులిచ్చినా, ఆమె గొంతు, మాట ధోరణి అతడి మనసులో ఒక చిన్న ఆశాంకురాన్ని నాటాయి.

~

రెండవసారి పడుకొన్నప్పుడు వంతిదేవునికి చాలసేపటి వరకు నిద్రపట్టలేదు.ఏవేవో ఆలోచనలతో అతని మనసు సంక్షోభానికి లోనయ్యింది. నాలువగ జాము మొదలైనప్పుడే కాస్త నిద్ర పట్టింది.

నిద్రలో ఒక కలగన్నాడు. తెరచాప కట్టిన ఒక పడవలో తాను, పూంగుళలి ఎదురెదురుగా కూర్చొనివున్నారు. నలువైపులా సముద్రం; ఎటుచూసినా నీరు. చల్లని మలయమారుతం. పడవ ఆ గాలిలో తేలుతున్నట్లు వెళుతోంది. పూంగుళలి ముఖం సౌందర్యమే రూపుగొన్నట్లుంది. ఉంగరాల జుట్టు ముఖంపైన ఆటలాడుతూంది. చీర చెరగు గాలిలో ఎగురుతూంది. ఎక్కడికి వెళుతున్నాం, ఎందుకు

వెళుతున్నాం అన్నదంతా వంతిదేవుడు మరిచిపోయాడు. పూంగుళలితో పడవలో వెళ్ళేందుకే తానిన్నాళ్ళు ప్రయాణం చేసి ఇక్కడికి వచ్చినట్లు అనిపించింది. ఒకేఒక్క కొరత – అదేమి? అదేమి? ఆఁ! పూంగుళలి పాట! సేందన్ అముదన్ చెప్పాడు కద?

"అమ్మాయీ! నీ పగడాల నోరు తెరిచి ఒక పాట పాడవా?" అన్నాడు వంతిదేవుడు.

"ఏమన్నావు?" అని పూంగుళలి చిరునవ్వుతో అడిగింది. ఆహా! ఆ నవ్వు ఏడేడు లోకాలకు సాటి కద!

"నీ నోరారా ఒక పాట పాడవా అన్నాను!"

"పాట పాడితే ఏమిస్తావు?"

"నీ చెంతజేరి నీ అందమైన చెంపమీద..."

పూంగుళలి వెంటనే బొడ్లో దోపుకొన్న ఒక చురకత్తిని దూసింది.

"ఇదిగో చూడు! ఆ తెరచాప ఇవతలికి ఒక్క అడుగు వేశావో, నిన్ను ఈ చురకత్తితో పొడిచేస్తాను. సముద్రంలో చేపలు చాల ఆకలిగొనివున్నాయి!" అన్నది.

~~~~~
~~~~~

# అధ్యాయము - 6

## 'మరుగైన మంటపం '

మరునాడుదయం సూర్యకిరణాలు వంతిదేవుని తట్టి లేపాయి.నిద్రవీడిన తర్వాత కూడ పూర్తి మెలకువ వచ్చేందుకు కాసేపయ్యింది. తనమీద పడుతున్నది సూర్య కాంతా లేక దీపగృహపు దీపం వెలుతురా అని తెలుసుకోవడానిక్కూడ కాసేపు పట్టింది. గత రాత్రి అనుభవాలలో ఏది నిజం, ఏది కల అని ఆలోచించినప్పుడు అతడికి ఒకే గందరగోళంగా అనిపించింది. ఇంట్లో పెద్దాయన భార్య, ఆయన కోడలు మాత్రమే ఉన్నారు. పెద్దాయన పుష్పకైంకర్యం చేసేందుకు కుళకర్ ఆలయానికి వెళ్ళారని చెప్పారు వారు. పూంగుళలిని గురించి వారిని విచారించేందుకు ధైర్యం చాలలేదు. వారిచ్చిన ప్రాతఃకాలభోజనాన్ని ఆరగించిన తర్వాత చుట్టుపక్కల కళ్ళతోనే వెతికి చూశాడు. పూంగుళలి ఎక్కడా కనిపించలేదు. గుడికి వెళ్ళి చూద్దామని వెళ్ళాడు. అక్కడ ఆమె తండ్రి కనిపించాడు - పూజకు కావలసిన పూలను గుడి చుట్టూ ఉన్న చెట్లనుంచి కోసుకొంటూ. పూలను చేర్చి మాల కట్టేందుకు ఒక్కోసారి పూంగుళలి వచ్చేదని, కానీ ఇవాళ రాలేదని చెప్పారు.

“ఎక్కడైనా అడవిలో జింకల వెంటబడి పరుగెడుతూంటుంది. లేదా సముద్రంలో తిరుగాడుతుంటుంది. వెళ్ళి వెతికి చూడు!” అన్నారు. తర్వాత, “తమ్ముడూ! ఈ అమ్మాయి చాల గడుసుది. ఆమె అపార్థం చేసుకొనేలాగ ఏదీ మాట్లాడకు. కావ్యాలలో చదివిన శృంగార రసంలోకి దిగిపోకు! వెంటనే భద్రకాళిగా మారిపోతుంది. తర్వాత నీ ప్రాణాలు నీవి కావు!” అని హెచ్చరించారు పెద్దాయన. గతరాత్రి కలను గుర్తుకు తెచ్చుకోగానే ఒళ్ళు జలదరించింది వంతిదేవునికి. తర్వాత సంభాళించుకొని పూంగుళలిని వెతుక్కొంటూ అడవిలోలి వెళ్ళాడు. అడవిలో ఎక్కడని వెతకడం? కాసేపటికల్లా అలిసిపోయాడు. అడవినుంచి బయటపడితే చాలనిపించింది. తర్వాత సముద్రతీరం వైపు వెళ్ళాడు. తీరంవెంబడి చాలదూరం వరకు వెతికికూడ ప్రయోజనం లేకపోయింది. 'ఎలాగు మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వస్తుంది కద? అప్పుడు చూసి మాట్లాడుకొందాం!' అనుకొని వెనుదిరిగాడు. ఉన్నట్లుండి ఒక ఆలోచన తట్టింది. అలలు లేకుండ ప్రశాంతంగా ఉన్న ఆ సముద్రంలో దిగి స్నానం చేయాలనిపించింది. ఇటువైపు సముద్రం అంతగా లోతులేదని పూంగుళలి అప్పుడే చెప్పింది కద? మరిక దిగి స్నానం చేసేందుకు ఏమాలస్యం? సముద్రమంటే తనకున్న భయాన్ని పోగొట్టుకోవడం కూడ ముఖ్యం. పడవెక్కి సముద్రప్రయాణం చేయవలసిన సమయం కూడ దగ్గర పడుతూంది. సముద్రాన్ని చూసి భయపడితే ఎలా? ఆ భయాన్ని పోగొట్టుకొనే తీరాలి.

~

నడుము చుట్టు కట్టుకొన్న బట్టలో ఉన్న తాళపత్రాన్ని, కత్తిని తీసి ఒడ్డున పెట్టి సముద్రంలోకి దిగాడు. మెల్లమెల్లగా అడుగు తీసి అడుగు వేస్తూ ముందుకెళ్ళాడు. మోకాలికన్న లోతులేదు. చిన్న చిన్న అలలు వచ్చి తాకినప్పుడు కూడ నడుము కన్న పైకి రాలేదు నీటి మట్టం. "చాల మంచి సముద్రం ఇది! మునక వేసి స్నానం చేద్దామన్న లోతులేదు కద!" అని అనుకొంటూనే ఇంకాస్త ముందుకెళ్ళాడు.

అరెరే! లోతులేదనుకొంటూ తీరంనుంచి చాల దూరం వచ్చేశాం కద? ఉన్నట్లుండి సముద్రం పొంగితే ఏం చేయాలి? అలలు పెద్దవై గుద్దితే? అలా ఆలోచిస్తూనే తీరంవైపు తిరిగి చూశాడు. తీరంనుంచి చాల దూరం వచ్చేసింది నిజమేగాని, సముద్రం అంత హఠాత్తుగా పొంగదు!... అరె! అదిగో పూంగుళలి వచ్చేసింది! త్వరగా తీరం చేరుకొని, ఆమెతో నయంగా మాట్లాడాలి (లంకకు వెళ్ళడం గురించి). ఆమెకూడ మనను చూసినట్లుంది! మనమున్న వైపే వస్తూంది! ఏదో మనని చూసి సైగకూడ చేస్తోందే!

ఓ! ఇదేమి? ఒడ్డున వంగి ఏదో చూస్తోందే! దేన్ని తీస్తోంది? ఆఁ! మన నడుం బట్టను కద తీసుకొంటోంది?! "అమ్మాయ్! అది నాది! దాన్ని తాకకు!..." అరె! మనం చెబుతున్నది ఆమెకు వినిపిస్తున్నట్లు లేదే! ఈ సముద్రపు అలల హోరులో!

మన గొంతు ఆమెకు వినిపించినట్లుంది! మనని చూసి ఏదో చెబుతూంది! "పూంగుళలి! అది నా వస్తువు! తీసుకోకు!... ఇదిగో చూడు! అదేమో నీదన్నట్లు తీసుకొని వెళ్ళిపోతున్నావే! ఆగు!.."

వంతిదేవుడు తీరంవైపు పరుగెత్తనారంభించాడు. ఒకసారి పూంగుళలి అతన్ని తిరిగి చూసింది. తర్వాత ఆమె కూడ పరుగెత్తసాగింది.

ఆహా! ఈపిల్ల చాల చెడ్డది! చెడ్డదా లేక ఒట్టి పిచ్చిదా? ఈ పిచ్చిపిల్ల చేతినుంచి తన నడుం బట్టను, అందులో ఉన్న ముఖ్యమైన తాళపత్రాన్ని చేజిక్కించుకోవడమెలా?..

~

రెండుసార్లు సముద్రంలో జారిపడి, ఉప్పునీళ్ళు తాగేసి, పడుతూ లేస్తూ ఎలాగో గట్టెక్కి ఆ అమ్మాయి వెంట పరుగెత్తనారంభించాడు. పోనుపోను ఆమె పరుగు వేగం అధికం కాసాగింది. వారికి కాస్త ముందు యాభై అరవై జింకలు గుంపుగా పరుగెత్తుతుండం కనిపించింది. ఆహా! అవి అలా తుళ్ళుతూ, గెంతుతూ పరుగెడుతుంటే చూడ ఎంత ముచ్చటగా ఉంది! ఏల? ఈ అమ్మాయి తుళ్ళుతూ గెంతుతూ పరుగెడుతుండడం కూడ అంత అందంగానే ఉంది కద? ఇలా సహజంగా, స్వేచ్ఛగా జీవించే అమ్మాయిల అందమే అందం! ... కానీ ఇదంతా అమెకు చెప్పకూడదు. చెబితే మన పని చెడిపోతుంది! పెద్దాయన హెచ్చరించాడు కద? అయినాకూడ, ఈ పిల్ల ఎందుకిలా మంకు పట్టు పట్టి పరుగెడుతూంది? అడవిలో దూరిపోతే, తర్వాత ఆమెను పట్టుకోవడం కష్టం. ఇదిగో అడవిలో దూరనే దూరింది! మన పని చెడి

మూలపడింది. తనలాంటి దద్దమ్మలు ఈ లోకంలో ఇంకెవ్వరూ ఉండరు! .. కోతిచేతికి చిక్కిన పూలమాల తిరిగి దొరుకుతుందా?

వంతిదేవుడు కూడ అడవిలో దూరాడు. అటూ ఇటూ తిరిగాడు. తొందరవల్ల, ఆదుర్దా వల్ల ముళ్ళ చెట్లను సరిగ్గా చూసుకొని పక్కకు తప్పుకొని వెళ్ళక ఒళ్ళంతా గీసుకొనిపోయింది. "పూంగుళలి! పూంగుళలి!" అని గట్టిగా పిలిచాడు. తర్వాత, "ఓ వృక్షమా! పూంగుళలిని చూశావా?", "ఓ కాకీ! పూంగుళలిని చూశావా?" అని అడగనారంభించాడు. ఇదేమిటి? మనకే పిచ్చి పట్టేటట్లుందే!... అని అతడు అనుకొంటున్న సమయంలో, ఒక చెట్టుపైనుంచి ఏదో కింద పడింది. ఆ:! తన నడుం బట్టే! గబగబా తీసి చూశాడు. తాళపత్రం, బంగారు నాణాలు భద్రంగా ఉన్నాయి!

"డబ్బు భద్రంగా ఉందా?" అని పైనుంచి ఒక గొంతు వినిపించింది. వంతిదేవుడు తలెత్తి పైకి చూశాడు. పూంగుళలి చెట్టుకొమ్మ పైన కూర్చొనివుంది,

ఆమెకోసం వెతికి వేసారిపోయివున్న వంతిదేవుడు, కోపం పట్టలేక, "నీలాంటి కోతిని నేను చూసిందే లేదు!" అన్నాడు.

అందుకు బదులుగా పూంగుళలి, "నీలాంటి గుడ్లగూబను చూసిందే లేదు! ఎలా గుడ్లు మిటకరిస్తున్నావు చూడు!" అన్నది.

"ఎందుకిలా నన్ను అటూఇటూ పరుగెత్తిస్తున్నావు? నీకు డబ్బు కావాలంటే..."

"ఛీఛీ! నీ డబ్బు ఇక్కడెవరికి కావాలి?"

"మరెందుకు దీన్ని తీసుకొని పారిపోయి వచ్చావు?"

"నేనలా చేసివుండకపోతే తిన్నగా ఇంటిపైపు వెళ్ళేవాడివి..."

"వెళ్ళివుంటేనేం?"

"ఈ చెట్టుపైకెక్కి చూడు తెలుస్తుంది!"

"ఏం కనిపిస్తుంది?"

"పది పదిహేను గుర్రాలు, తళతళలాడే కత్తులు, శూలాలు!"

ఆమె ముఖకవళికలు చూస్తే ఆమె చెబుతున్నది నిజమేననిపించింది. కాని అది ఖాయం చేసుకోవడానికి/దృఢపరుచుకోవడానికి చెట్టెక్కాడు. ఎక్కేందుకు మునుపు నడుం బట్టను గట్టిగా కట్టుకొన్నాడు. ఒకవేళ ఈ పిల్ల పొరబాటున దాన్ని కిందకు జారవేసిందో, ఏమో! దాన్ని మళ్ళీ ఇప్పుడు అపహరించేందుకు ఉపాయం పన్నుతూందేమో, ఎవరు చూడవచ్చారు?

చెట్టుపైకెక్కి దీపగృహం వైపు చూశాడు. అవును; పూంగుళలి చెప్పింది నిజమే. అక్కడ పది పదిహేను గుర్రాలు నిలబడివున్నాయి. వాటిపైన శూలాలు, కత్తులు పట్టుకొన్న వీరులు ఉన్నారు. వారెవరై ఉండవచ్చు...? ఇంకెవరు? మనని పట్టుకోవడానికి వచ్చిన పళువేట్టరయ్యర్ మనుషులే అయివుండాలి!

పూంగుళలి తనని ఒక పెద్ద అపాయంనుంచి తప్పించింది.  ఎందుకని? ఏ ఉద్దేశంతో? - ఇంకా కొన్ని విషయాలు విశదంకాలేదు.

ఇద్దరూ చెట్టుపైనుంచి దిగారు. "పూంగుళలీ! నీవు నన్ను చాల పెద్ద అపాయంనుంచి తప్పించావు/కాపాడవు. అందుకు చాల కృతజ్ఞతలు!" అన్నాడు వంతిదేవుడు.

అందుకు పూంగుళలి, "అంతా అబద్ధం! మగవాళ్ళకు కృతజ్ఞత కూడ తెలుసా?" అన్నది.

"అందరు మగవాళ్ళలాగ నన్ను అంచనావేయకు!"

"అవును; నీవందరిలాగ లేవు. కాస్త భిన్నంగా/వేరుగా ఉన్నావు!"

"అమ్మాయీ! నిన్నొక ప్రశ్న అడగనా?"

"ధారాళంగా అడుగు; కానీ దానికి జవాబివ్వడమూ, ఇవ్వకపోవడమూ నా ఇష్టం."

"నన్నెందుకు కాపాడాలనుకొన్నావు? నామీద ఉన్నట్లుండి నీకెందుకు కనికరం కలిగింది?"

పూంగుళలి కాసేపు మౌనందాల్చింది. ఆమె ఇటువంటి ప్రశ్నను ఎదురుచూడలేదని ఆమె ముఖం చెబుతూంది.

తర్వాత సాలోచనగా, "దద్దమ్మలను [அச்டுகள்] చూస్తే నాకెప్పుడూ కాస్త కనికరం కలుగుతుంటుంది" అన్నది.

"సంతోషం; ఈ వీరులు నన్నే వెతుక్కొని వచ్చారని నీకెలా తెలుసు?"

"నిన్ను చూస్తే తెలియడం లేదు? ఎక్కడినుంచో తప్పించుకొని పారిపోయివచ్చావని? నిన్ననే అలా ఊహించాను. ఇవాళ పొద్దున వైద్యకుమారుని - నీ స్నేహితుని - మూలంగా అది రూఢి అయింది."

"వాడేం చెప్పాడు?"

"పొద్దున లేచిన వెంటనే మూలిక కోసం అడవికి వెళ్ళాలన్నాడు. నేను సరేనని ఇక్కడికి పిలుచుకొని వచ్చాను. నాతో ప్రేమకలాపాలు ప్రారంభించాడు. 'నీ స్నేహితుడు నీకన్న ముందున్నాడు కద?' అన్నాను..."

"ఏం చెప్పావు?"

"కాస్త ఓపిక పట్టు; నీవు నన్నిప్పటికే ప్రేమించనారంభించావని చెప్పాను. అప్పుడే నీపైన తనకున్న సందేహాన్ని వెలిబుచ్చాడు. ఏదో రాజకీయ శిక్షను తప్పించుకొని నీవు పారిపోయి వచ్చావని దారిలో పలుకారణాల వల్ల సందేహం కలిగిందట! 'అటువంటి వాడిని నమ్మి మోసపోకు! నన్ను పెళ్ళి చేసుకో!' అన్నాడు. 'చాల తొందరపడుతున్నావే! పెద్దలను అడగవద్దా?' అన్నాను. 'పాత తమిళ సంప్రదాయం ప్రకారం గాంధర్వ వివాహం చేసుకొందాం' అన్నాడు నీ స్నేహితుడు. ఎలా ఉంది కథ?"

ఆమె గడుసుతనం వంతిదేవునికి చాల ఆశ్చర్యం కలిగించింది.

"ఇంతలో గుర్రాలు వస్తున్న చప్పుడు వినిపించింది. నేను చెట్టెక్కి చూసి, కిందకు దిగివచ్చి,

వాడిని కూడ చెట్టెక్కి చూడమన్నాను. చెట్టెక్కి చూసినప్పుడు వాడి కాళ్ళు గడగడ వణికాయి. అది తలుచుకొంటే నాకిప్పుడు కూడ నవ్వొస్తూంది…" అని చెప్పేసి నవ్వింది పూంగుళలి.

"తమాషా ఉండనీ, తర్వాతేం జరిగిందో చెప్పు."

"వాడు చెట్టు దిగి కిందకు వచ్చాడు. 'చూశావా? నేను చెప్పింది నిజమైంది! వాడిని పట్టుకోవడానికి రాజసేవకులు ఇక్కడకు వచ్చేశారు!' అన్నాడు. 'మరి అతడితో వచ్చిన నిన్నుకూడ వారు పట్టుకొంటారు కద? నీవు పరుగెత్తి వెళ్ళి ఎక్కడైనా దాక్కో!' అన్నాను. 'అలాగే చెయ్యాలి' అన్నాడు వాడు. నన్ను వదిలి వేరుగా వెళ్ళాడు. నేననుకొన్నట్లుగానే జరిగింది…"

"ఏమది? ఏం జరిగింది?"

"పరుగెత్తి వెళ్ళి దాక్కొంటానని నాదగ్గర చెప్పి, తిన్నగా వెళ్ళి ఆ రాజసైనికుల చేత చిక్కుబడ్డాడు…"

"అయ్యో! పాపం!"

"ఎక్కువగా జాలిపడకు! కాస్త మిగుల్చుకో!"

"ఎందుకలా అంటున్నావు?"

"మిగిలిన కథకూడ వింటే అర్థమౌతుంది! నేరుగా వారి దగ్గరకు వెళ్ళాడు. వారు వీడిని అబ్బురంగా చూశారు. గుచ్చి గుచ్చి చూస్తూ, వారిలోవారే మాట్లాడుకోసాగారు. 'మీరెవరు?' అని వీడడిగాడు. 'మేము వేటగాళ్ళం; జింకలను వేటాడేందుకు వచ్చాం' అన్నాడు వారిలో ఒకడు. 'లేదు, మీరు నన్ను వేటాడేందుకు వచ్చారని నాకు తెలుసు' అన్నాడు వీడు. వారు ఇంకా ఆశ్చర్యపోయి, వీడినింకా పైపైకి పురికొల్పారు. 'మీరు వంతిదేవుని వెతుక్కొంటూ వచ్చారు. వాడున్న చోటు చెబితే నన్ను వదిలిపెట్టేస్తారా?' అని అడిగాడు. అందుకు వారు సమ్మతించారు. వీడు వారిని పిలుచుకొని మాఇంటివైపు వెళ్ళాడు…"

"ద్రోహి! ఛండాలుడు!"

"వారు వెళ్ళిన తర్వాత నేను నిన్ను వెతుక్కొంటూ వచ్చాను. నీవు సముద్రంలో దిగి స్నానం చేస్తుండడాన్ని గమనించాను…"

"నాకిదంతా అక్కడే ఎందుకు చెప్పలేదు? ఈ నడుం బట్టను తీసేసుకొని ఎందుకు పరుగెత్తి వచ్చావు?"

"లేకపోతే, నీవంత వేగంగా పరుగెత్తి వచ్చేవాడివా? ఆ వేటగాళ్ళను ఒక చెయ్యి చూస్తానని వారి వెంటబడి వెళ్ళేవాడివేమో! నామాటను నమ్మేవాడివి కావేమో! ఇదంతా నేను నీకు చెప్పి నమ్మించేలోపల వారు నిన్ను కనిపెట్టి బంధించేసేవారేమో…"

'ఆహా! ఈ పిల్లనా మనం పిచ్చిదనుకొన్నాం?' అని తలుచుకొని వంతిదేవుడు సిగ్గుపడ్డాడు. ఈమెను పూర్తిగా నమ్మేతీరాలి. ఈమె సహాయం లేకపోతే మనం కడలి దాటి లంక చేరలేం. ఇం తదూరం

వచ్చింది వృథా అవుతుంది. పళువేట్టరయ్యర్ల చేత మళ్ళీ చిక్కుపడ్డా పడవచ్చు.

"అమ్మాయీ! నీవు నాకెంత పెద్ద సహాయం చేశావన్నది మాటల్లో చెప్పలేను. మిగిలిన సహాయం కూడ నీవే చేయాలి..."

"ఏం సహాయం చేయాలంటున్నావు?" అని అడిగింది పూంగుళలి.

"నా స్నేహితుడి గుణం చూశావు కద? నీవే నన్ను పడవలో తీసుకెళ్ళి లంకకు చేర్చాలి!"

పూంగుళలి మౌనందాల్చింది.

"నేను తప్పుడు పనులేవీ చేయనని నీకు నమ్మకం కలిగిందా? అమ్మాయీ! నేను లంకకు అతి ముఖ్యమైన కార్యంమీద వెళ్ళితీరాలి. ఈ సహాయాన్ని నీవు నాకు తప్పక చేయాలి..."

"చేస్తే నీవు నాకేమిస్తావు?" అని అడిగింది పూంగుళలి.

అలా అడిగిన వెంటనే మొట్టమొదటిసారిగా ఆమె ముఖంలో సిగ్గుఛాయలు కనిపించాయి. అది తెచ్చిన వెలుగుతో ఆమె ముఖారవిందం మరింత సౌందర్యంతో వెలిగింది.

~

ముందురోజు రాత్రి కలలో ఆమె తనను ఇదే విధంగా అడిగింది గుర్తుకొచ్చింది వంతిదేవునికి. తానందుకు చెప్పబోయిన జవాబు కూడ గుర్తుకొచ్చింది. అవే మాటలు అతడి నోటినుంచి బయటకు దూకేందుకు కొట్టుమిట్టాడాయి. పంటితో నాలుకను కరుచుకొని ఆ మాటలను అణగదొక్కాడు.

"అమ్మాయీ! నాకు నీవీ సహాయం చేస్తే నా ఊపిరున్నంతవరకు మరువను. ఎన్నడూ కృతజ్ఞతలు చెప్పుకొంటాను. ఇందుకు బదులుగా చేయదగ్గ సహాయమేమీ తోచడంలేదు. నీవేమైనా చేయమని అడిగితే తప్పక చేస్తాను!" అన్నాడు.

పూంగుళలి దీర్ఘాలోచనలో మునిగింది. అడగదలుచుకొన్నది అడుగుదామా వద్దా అని ఆలోచిస్తున్నట్లు కనిపించింది.

"సరే! ఇది సత్యమైన మాటేనా?"

"ముమ్మాటికీ సత్యం!"

"అయితే సమయం వచ్చినప్పుడు అడుగుతాను. మరిచిపోవుకద?"

"ఎన్నటికీ మరువను. నీవెప్పుడు ప్రత్యుపకారం అడుగుతావని వేచివుంటాను. అప్పటివరకు నీకు ఋణపడివున్నట్లే భావిస్తాను."

పూంగుళలి మాళ్ళీ కాసేపు ఆలోచిస్తూ ఉండిపోయింది.

"సరే, నాతో రా! నిన్నీ అడవిలో ఒక చోటికి పిలుచుకొని వెళతాను. అక్కడ నీవు ఈరోజు పొద్దుగుంకే వరకు ఉండాలి, పస్తుగానే ఉండాలి..."

"అందుగురించి దిగులు లేదు. పొద్దున మీ తల్లి నాకు నిన్నటి అన్నం వడ్డించింది. ఆమెకు

కడుపుమంట పుట్టించేవరకు కడుపునిండ తిన్నాను. రాత్రి వరకు ఆకలి వేయదు..."

"రాత్రికూడ భోజనం దొరుకుతుందో, లేదో? చేతిలో కాస్త అన్నం తీసుకొని రావడానికి ప్రయత్నిస్తాను. నేను చెప్పిన చోట చీకటిపడే దాక ఉండాలి. చీకటి పడ్డ తర్వాత తిరిగి వస్తాను. వచ్చి, నేను ఒక సంకేత శబ్దం చేస్తాను. కోయిల కూత విన్నావా?"

"బాగా తెలుసు. అలా తెలియకపోయినా, నీ గొంతును పోల్చుకోగలను. "

"నేను కూత కూసిన వెంటనే నీవాచోటినుంచి బయటకు రావాలి. చీకటిపడ్డ మొదటి జాము లోపల మనమిక్కడినుంచి బయలుదేరాలి."

"కోయిల గొంతు ఎప్పుడు వినిపిస్తుందా అని వేచివుంటాను."

అడవి మధ్య ఇసుక మేటవేసిన ఒక ఎత్తైన ప్రదేశానికి తీసుకొని వెళ్ళింది పూంగుళలి వంతిదేవుని. మేటకవతల చెట్లు చుట్టుపక్కల కన్న దట్టంగా ఉన్నాయి. వాటిని లాఘవంగా పక్కకు తొలగించి ఒక చెట్టు పక్కన ఉన్న ఒక పల్లంలోకి దిగింది. వంతిదేవుడు కూడ ఆమ వెంటే వెళ్ళాడు. అక్కడ ఒక పాత/పాడుపడ్డ మంటపపు పై అంచు కనిపించింది. ఇంకా పరికించి చూస్తే చీకట్లో రెండు స్తంభాలు  కనిపించాయి. వీటన్నిటిని చెట్లు, పొదలు మరుగుపరుస్తున్నాయి. ఎటువైపు నుంచి చూసినా అక్కడా మంటపం ఉందన్నది తెలియనే తెలియదు.

"ఈ మంటపంలో ఒక చిరుత ఉండేది. అది వెళ్ళిపోయిన తర్వాత నేనీ మంటపంలో ఉంటున్నాను. దీన్ని నా స్వంత నివాసంగా భావించి చూసుకొంటున్నాను. మనుషులను చూడ ఇష్టపడనప్పుడు నేనిక్కడికి వచ్చేయడం నా అలవాటు. కుండలో నీరుంది. ఈ పగలంతా ఇక్కడే ఉండు! నలువైపుల మనుషుల సందడి వినిపించినా, గుర్రపు డెక్కల శబ్దం వినిపించినా, ఇంకే గడబిడలూ వినిపించినా కూడ నీవు తల బయట పెట్టకూడదు. మిట్టపైకెక్కి చూడకు!" అని హెచ్చరించింది పూంగుళలి.

"చీకటి పడ్డ తర్వాత కూడ ఇక్కడే ఉండమంటావా? అడవి జంతువులు - పులి, సింహం, చిరుత – వస్తే..."అని మెల్లగా జంకుతూ అడిగాడు వంతిదేవుడు.

"ఇప్పుడిక్కడే పులులు, సింహాలూ లేవు. వస్తే నక్కలు, అడవి పందులు రావచ్చు. వాటికి నీవు బెదరవు కద?"

"భయమేమీ లేదు. చీకటిలో వచ్చి మీద పడితే ఏం చేయను? చేత శూలం కూడ లేదు. ఇంట్లో వదిలి పెట్టి వచ్చేశాను."

"ఇదిగో! ఈ ఆయుధాన్ని తీసుకో!" అని పూంగుళలి మంటపం లోపలినుంచి ఒక ఆయుధాన్ని తీసిచ్చింది. అది ఒక విచిత్రమైన ఆయుధం. రెండువైపుల శూలంలాగ పదునైన ముళ్ళున్నాయి. ముళ్ళు ఉక్కు కన్న గట్టిగా ఉన్నాయి. ఇంద్రుని వజ్రాయుధం ఇలాగే ఉంటుంది కాబోలు!

"ఇదేం ఆయుధం? దేనితో చేసింది?" అని అడిగాడు వంతిదేవుడు.

"ఇది ఒక చేప తోక! ఈ మంటపంలో ఉన్న చిరుత నాపైకి దూకినప్పుడు ఈ ఆయుధంతోనే దాన్ని చంపాను!" అన్నది పూంగుళలి.

# అధ్యాయము - 7

## 'సముద్ర కుమారి '

**ఆరోజు** వంతిదేవునికి పగలంతా సులభంగా గడిచిపోయింది. సగంసేపు నిద్రించి కాలం వెళ్ళబుచ్చాడు. మెలకువగా ఉన్నప్పుడు పూంగుళలి విచిత్ర స్వభావాన్ని గురించి ఆలోచిస్తూ గడిపాడు. ఎంతటి అద్భుతమైన పిల్ల! ఎంతటి ఇంపైన, సరళమైన పేరు! కానీ స్వభావమెంత కఠినం! కఠినం మాత్రమేనా? అందులో తీయదనం కూడ కలిసివుంది కద? చిరుతను కొట్టి చంపిన విషయాన్ని ఎంత సర్వ సాధారణంగ చెప్పింది? ఎంతటి బుద్ధిమంతురాలు! ఎంతటి ముందాలోచన? - వీటన్నిటితోబాటు ఒక్కొక్కసారి పిచ్చిపట్టినట్లు ప్రవర్తిస్తుంది కద, అదేల? ఈ అమ్మాయి జీవితంలో ఏదో ఒక చేదు అనుభవం జరిగి ఉండాలి! చేదు అనుభవమో, లేక తీయటి అనుభవమో? రెండింటిలో ఏ ఒక్కదానివల్ల గాని ఈ పిల్ల ఇలా ఉన్మత్తురాలై ప్రవర్తించడం సాధ్యం! లేక, ఏ కారణమూ లేక పుట్టినప్పటినుంచే ఇలా ప్రవర్తిస్తూందా? ఈమె కన్నవారిలో స్వాభావికంగా ఏమీ విశేషం కనిపించలేదు కద? వారు తీయని, శాంత స్వభావం కలిగిన వారై ఉన్నారు కద...! గుణమెలాగైన ఉండనీ! ఈమెకు మనపైన ఇంత శ్రద్ధ ఏర్పడడానికి కారణమేమి? పళువూర్ మనుషుల చేత తాను చిక్కుపడకూడదని ఈమె ఇంత కష్టపడుతోంది కద? చివరికి లంకకు తనను పడవలో తీసుకొని వెళ్ళడానికి కూడ ఒప్పుకొంది కద? ఇందులో ఏమీ మోసం లేదు కద? ఎన్నటికీ ఉండదు! కానీ ఈమె మనసు మారడానికి కారణమేమి? మననుంచి ఈమె ఎటువంటి ప్రత్యుపకారాన్ని ఎదురు చూస్తూంది? తర్వాత చెబుతానంది కద? అది ఏమై ఉండవచ్చు?

వంతిదేవుడిలా ఆలోచిస్తున్న సమయంలో, పూంగుళలి చెప్పినట్లే, అతని చుట్టూ గుర్రాల శబ్దం, మనుషుల అట్టహాసం, చిన్న చిన్న అడవి మృగాల భీత్యావారాలు, పక్షులు కీచుమని అరుస్తున్న శబ్దం - ఇవన్నీ కలగలిసి ఒకే గందరగోళంగా మారింది వాతావరణం. వెంటనే నిశ్శబ్దం నెలకొంది. అదంతా తనను వెతికి పట్టుకోవడానికి పళువేట్టరయ్యర్ల మనుషులు చేస్తున్న ప్రయత్నమేనని వంతదేవుడు గ్రహించాడు. వైద్య కుమారుడు తనకు చేసిన ద్రోహం కూడ అతడికి తరచూ గుర్తుకొస్తూంది. వెధవ! పూంగుళలి పైన వాడికి అంతలోనే ప్రేమ పుట్టుకొచ్చింది కాబోలు - ఆడసింహం పైన చిట్టెలుక ప్రీతిగొన్నట్లు! కానీ వాడి బుద్ధిహీనతను ఈ పిల్ల ఎంత తెలివిగా ఉపయోగించుకొంది! వాడి మనసులో అసూయాగ్నిని ఎలా పుట్టించింది! అర ఘడియలో వాడిని ద్రోహిగా మార్చేసింది కద!

వంతిదేవా! నీవొకటి ఒప్పుకొనే తీరాలి! ఇన్నాళ్ళు నీవే చాల గొప్ప తెలివైన వాడివని అనుకొనే

వాడివి! తంత్ర మంత్ర సామర్థ్యాల్లో నీకు ఎవరూ సాటిలేరని గర్వపడే వాడివి! కానీ నాగరికత తెలియని ఈ పల్లె పిల్ల నిన్ను ఓడించేసింది కదా! కడలిలో స్నానం చేస్తున్న నిన్ను తీసుకొని వచ్చి ఈ మరుగైన మంటపంలో దాచిపెట్టేసింది కదా! ఏమని చెప్పాలి ఆమె బుద్ధి చాతుర్యతను? ఆమె నీ నడుం బట్టను తీసుకొని పారిపోయి రాకుంటే నీ గతి ఏమయ్యేది? పళువూర్ మనుషుల చేత చిక్కుబడిపోయేవాడివి! వచ్చిన పని పూర్తిగా చెడిపోయేది! అవును! ఇక ముందెప్పుడూ అజాగ్రతగా ఉండకూడదు.

~

పశ్చిమసముద్రంలో సూర్యుడు అస్తమించాడు. ఇది ఒక అద్భుతమైన దృశ్యం. ఇంతవరకు దక్షిణంగా వస్తున్న సముద్రతీరం మలుపు తిరిగి పడమటివైపుగా తిరుగుతూంది. కాబట్టి కోడిక్కరైలో ఒక ఎత్తైన ప్రదేశం పైన నిలబడి చూస్తే, తూర్పు - పడమర – దక్షిణం - ఈ మూడు దిక్కుల్లోను సముద్రం విస్తరించి ఉండడం కనిపిస్తుంది. ఇక కొన్నిసెలల్లోపు సూర్య చంద్రులిరువురు దేదీప్యమానంగా తూర్పు కడలినుంచి ఉదయించడం చూడవచ్చు; దక్షిణ సముద్రాన్ని బంగారు వన్నెతో వెలిగించి మునిగిపోవడం కూడ చూడవచ్చు. వంతిదేవునికి మంటపాన్ని మరుగు పరుస్తున్న ఇసుక మేటనెక్కి ఆ అద్భుత దృశ్యాన్ని చూడాలన్న కోరిక బలంగా కలిగింది. అతి కష్టంమీద దాన్ని అదిమి పెట్టాడు.

నలువైపుల చీకటి కమ్ముకోసాగింది. మంటపంలో అప్పటికే కమ్ముకొన్న చీకటి ఇంకా పదిరెట్లైంది. వంతిదేవుడు ఇక అక్కడ ఉండలేక, బయటకు వచ్చేశాడు. మంటపాన్ని కప్పివున్న ఇసుక మేట పైకెక్కి నిలబడ్డాడు. దూరాన దీపగృహం వెలుతురు కనిపించింది. ఆకాశంలో చుక్కలు వజ్రాల్లాగ మెరుస్తున్నాయి. అడవినుంచి పలు విచిత్రమైన శబ్దాలు వినిపించనారంభించాయి. అడవిలో పగలు వినిపించే ధ్వనులకు, చీకటి పడ్డాక వినిపించే శబ్దాలకు చాల తేడా ఉంది. రాత్రి వినిపించే శబ్దాలలో ఏదో మర్మముంది - అది మనసులో భీతిని, ఒంట్లో జలదరింపును పుట్టిస్తూంది. పగలు పులిని ఎదురుగా చూసినా భయపడడం లేదు. కానీ రాత్రి ఒక పొదలో ఒక చిట్టెలుక పరుగెత్తినా మనసు ఉలిక్కి పడుతోంది!

అదిగో కోయిల గొంతు 'కూ! కూ!' అని వినిపిస్తూంది! అది వంతిదేవునికి దేవగానంలాగ వినిపించింది. కూత వినిపించిన దిక్కుగా చూశాడు. పూంగుళలి అక్కడ నిలబడివుంది. 'చప్పుడు చేయకుండ నాతో రా!' అని సైగ చేసింది. అక్కడినుంచి సముద్ర తీరం చాల దగ్గర అని తెలిసింది.

~

సముద్రంలో పడవ సిద్ధంగా ఉంది. అందులో తెరచాప, దాన్ని కట్టేందుకు కావలసిన తాడు చుట్టబడివున్నాయి. పడవలో ఒక వైపు రెండు పొడవైన తెడ్లు కూడ సిద్ధంగా ఉన్నాయి.

పడవను నీటిలోకి దించేందుకు వంతిదేవుడు సహాయం చేయబోయాడు. 'నీవూరుకో!' అని సైగ చేసింది పూంగుళలి. పడవను లాఘవంగా ముందుకు తోసి సముద్రంలోకి దించింది. ఏమాత్రం సద్దు చేయక పడవ సముద్రంలో దిగింది.

వంతిదేవుడు పడవలోకెక్కబోయాడు. "ఉష్! కాస్త ఓపిక పట్టు! కాస్త దూరం వెళ్ళిన తర్వాత నీవెక్కవచ్చు!" అని మెల్లని గొంతుతో చెప్పేసి పూంగుళలి పడవను పట్టుకొని ముందుకు లాక్కొని వెళ్ళింది.

వంతిదేవుడు తాను కూడ సహాయం చేయబోయి పడవను తోశాడు. పడవ నిలిచిపోయింది. "నీవూరకే ఉంటే చాలు!" అన్నది పూంగుళలి. తీరం వెంబడి అలలు కొట్టే తావు దాటిన తర్వాత, "ఇక నీవు పడవలోకెక్కవచ్చు!" అని చెప్పి పూంగుళలి తాను ముందు పడవలోకెక్కింది. వంతిదేవుడు కూడ ఒక్కదూకుతో పడవలోకెక్కాడు. అప్పుడు పడవ చాల ఊగిసలాడింది. ఆ ఊగిసలాటలో వంతిదేవుడు సముద్రంలో పడిపోతాడేమోననిపించింది. ఎలాగో నిభాయించుకొని కూర్చొన్నాడు. అయినా కూడ అతడి గుండె దడదడ తగ్గలేదు.

"ఇక మీదట మాట్లాడవచ్చు కద?" అని అడిగాడు.

"మాట్లాడవచ్చు. నీకు వణుకు ఆగిందంటే ధారాళంగా మాట్లాడవచ్చు!" అన్నది పూంగుళలి.

"వణుకా? ఎవరికి? అదేం లేదు!"

"లేకపోతే సరే!"

"తెరచాప కట్టవద్దా?"

"తెరచాప కడితే ఒడ్డున ఉన్నవారు మనని చూసే అవకాశం ఉంది."

"ఇక వారిటువైపు వస్తే నేను చూసుకొంటాను! నీవు భయపడకు!" అని వంతిదేవుడు వీర ప్రలాపాలు చేయనారంభించాడు.

"ఇప్పుడు ఎదురుగాలి వీస్తోంది. తెరచాప విప్పితే మళ్ళీ తీరానికి తోస్తుంది. మధ్యరాత్రి తర్వాత గాలి మనకనుకూలంగా వీస్తుంది. అప్పుడు తెరచాప విప్పితే మనకుపయోగపడుతుంది!" అన్నది పూంగుళలి.

"ఓహో! నీకిదంతా బాగా తెలిసినట్లుంది. అందుకే మీ తండ్రి నిన్ను పిలుచుకొని వెళ్ళమన్నారు."

"నా తండ్రా? ఎవరిని గురించి చెబుతున్నావు?"

"దీపగృహాన్ని చూసుకొనే త్యాగ విడంగకరైయర్ గురించే చెబుతున్నాను."

"ఒడ్డుపైనున్నంత వరకే ఆయన నాకు తండ్రి. కడలిలో దిగిన తర్వాత..."

"తండ్రి కూడ మారిపోతారా, ఏమి?"

"అవును. ఇక్కడ సముద్రరాజే నా తండ్రి. నాకింకొక పేరు సముద్రకుమారి. నీకెవరూ చెప్పలేదా?"

"చెప్పలేదు. అదేమి విచిత్రమైన పేరు?"

"చక్రవర్తి కడగొట్టు కొడుకును/కనిష్ఠ పుత్రుని 'పొన్నియిన్ సెల్వన్' అని పిలుస్తారు కద? ఇది కూడ అలాగే!"

ఇది విన్న వెంటనే వంతిదేవుడు తన నడుం చుట్టువున్న బట్టను తడిమి చూసుకొన్నాడు.

అది గమనించిన పూంగుళలి, “భద్రంగా ఉంది కద?” అని అడిగింది.

“దేన్ని గురించి అడుగుతున్నావు?”

“నీ నడుం బట్టలో ఉన్న వస్తువు గురించే!”

~

వంతిదేవుని మనసులో చురుక్కుమంది. ఏదో ఒక చిన్న సందేహం పుట్టుకొచ్చింది. పూంగుళలి వంతిదేవునితో మాట్లాడుతూనే తెడ్డు వేస్తూంది.

“లంకాద్వీపానికి మనమెప్పుడు వెళ్ళి చేరుతాం?” అని అడిగాడు వంతిదేవుడు.

“ఇద్దరూ తెడ్డువేస్తే పొద్దుపొడిచే వేళకు అక్కడికి వెళ్ళి చేరవచ్చు - గాలి మనకు తోడైతే!”

వంతిదేవుడు కూడ ఒక తెడ్డు తీసుకొని నడిపేందుకు ప్రయత్నించాడు. అబ్బ! తెడ్డుతో పడవ నడపడం తేలికైన పని కాదు - చాల కష్టమే. ఉన్నట్లుండి పడవ గిర్రున తిరిగి పూర్తిగా నిలిచిపోయింది.

“ఇదేమి? నేను తెడ్డు వేయడం మొదలుపెట్టగానే పడవ నిలిచిపోయింది?”

“నేను సముద్రకుమారిని కద? అందుకే! నీవు ఊరక కూర్చుంటే చాలు! నిన్ను ఎలాగైన లంకకు తీసుకొని వెళ్ళి చేరుస్తాను. సరేనా?”

~

వంతిదేవుడు కాస్త సిగ్గుపడి కాసేపు మౌనందాల్చాడు. తర్వాత చుట్టూ పరికించి చూశాడు. పడవనుంచి నిటారుగా పొడుచుకొచ్చిన కొన్ని కర్రలు కనిపించాయి. “ఈ కర్రలెందుకు?”

“పడవ ఎక్కువగా ఊగకుండేందుకు.”

“పడవ ఇంతకన్న ఎక్కువగా ఊగుతుందా, ఏమి? ఇప్పటికే ఇంతటి ఊగిసలాటకు నా తల తిరుగుతోంది!”

“ఇదొక లెక్కా? ఆశ్వయుజ – కార్తీక మాసాల్లో వీచే ఉత్తరపు గాలులు చేసే అట్టహాసాన్ని కద చూడాలి?”

~

ఒడ్డునుంచి చూస్తే సముద్రం ప్రశాంతంగా సమతలమైన రేకులాగ కనిపిస్తూంది. కానీ నిజానికలా లేదని వంతిదేవుడు గ్రహించాడు. నురగ లేని అలలు ఆ పడవను ఊయలనూపినట్లు ఊపసాగాయి.

“పెనుగాలి వీచినప్పుడు ఈ కొయ్యలేమవుతాయి?”

“ఎంతపెద్ద గాలి అన్నదాన్ని బట్టి ఉంటుంది. సాధారణంగా పెనుగాలి వీచినా, ఈ కొయ్యలు పడవ తలకిందులైపోకుండ కాపాడుతాయి. ఒకవేళ సుడిగాలి ఈ పడవను తలకిందులు చేసేస్తే, కొయ్యలను విప్పి వదిలేయవచ్చు. వాటిని పట్టుకొని ప్రాణాలు కాపాడుకోవచ్చు.”

“అయ్యో! గాలిలో పడవ తలకిందులై పోతుందా, ఏమి?”

"పెద్ద సుడిగాలి వీస్తే పెద్ద పెద్ద ఒడలే తునాతునకలైపోతాయి. ఈ చిన్న పడవ ఒక లెక్కా?"

"సుడిగాలి అంటే ఏమి?"

"ఇదికూడ తెలియదా? ఒకవైపునుంచి వీచేగాలి, ఇంకొకవైపునుంచి వీస్తున్న గాలిని గుద్దుకొంటే సుడిగాలి పుడుతుంది. ఇక్కడ పుష్య, మాఘ మాసాల్లో సుడిగాలి వీయదు. అప్పుడు అపాయమే లేదు. సులభంగా లంకకు వెళ్ళవచ్చు. రాత్రికి రాత్రే వెళ్ళి తిరిగి వచ్చేయవచ్చు. వైశాఖమాసం నుంచి సుడిగాలి వీస్తుంది. అప్పుడు లంకకు వెళ్ళి రావడం కాస్త కష్టమే. ఇప్పుడా గాలికి, ఉత్తరపు గాలికి మధ్య కాలం. సముద్రంలో ఒకగాలి, ఇంకొక గాలి గుద్దుకొంటాయి. కవ్వంతో పెరుగును చిలికినట్లు ఆ సుడిగాలి సముద్రాన్ని చిలుకుతుంది. కొండంత అలలు లేచి పడతాయి. సముద్రంలో బ్రహ్మాండమైన సుళ్ళు ఏర్పడుతాయి. ఆ సుళ్ళలో పడవ చిక్కుకొంటే అధోగతే!"

~

వంతిదేవునికి ఉన్నట్లుండి మనసులో ఒక దిగులు పుట్టింది. దానికి తోడు ఒక సందేహం కూడ ఉదయించింది.

"అయ్యో! నేను రాను! నన్ను ఒడ్డుకు తీసుకొని వెళ్ళి వదిలేయి!" అని అరిచాడు.

"ఏం పేలుతున్నావు? నోరు మూసుకొని కూర్చో! భయంగా ఉంటే కళ్ళు మూసుకో. లేకపోతే పడుకొని నిద్రపో!"

వంతిదేవుని సందేహం ఇప్పుడు దృఢపడింది.

"నీవు పెద్ద మోసగత్తెవు! నన్ను సముద్రంలో ముంచేసేందుకే తీసుకొని వెళుతున్నావు. నేను నిద్రపోతే నీ పని చాల సులభమవుతుందని చూస్తున్నావు!"

"ఇవేం పిచ్చి మాటలు?"

"నాకేం పిచ్చి పట్టలేదు! పడవను వెనక్కి తిప్పుతావా, లేదా? తిప్పకపోతే సముద్రంలోకి దూకేస్తాను!"

"ధారాళంగా దూకు! కానీ దూకేముందు నీవు **పొన్ని యిన్ సెల్వన్** కి తీసుకుని వెళుతున్న తాళపత్రాన్ని నాకిచ్చేయి!"

"ఓ! ఆ పత్రం గురించి నీకెలా తెలుసు?"

"నీ నడుం బట్టను విప్పి చూసినప్పుడు తెలిసింది. నీవెవరు, నీవెందుకు లంకకు వెళుతున్నావని తెలుసుకోకుండ నిన్ను లంకకు తీసుకొని వెళ్ళేందుకు ఒప్పుకొనేదాన్నా? పొద్దున చెట్టుపైన కూర్చొని నీ నడుం బట్టను విప్పి ఆ పత్రాన్ని చూశాను..."

"మోసం! నిన్ను నమ్మి పడవెక్కాను కదా? పడవను వెనక్కు తిప్పుతావా, లేదా?"

వంతిదేవుని దిగులు, పిచ్చి పదిరెట్లైనాయి. "పడవను తిప్పు! పడవను తిప్పు!" అని అరిచాడు.

"నేనే యువరాకుమారి కుందవైదేవి అయివుంటే, ఇంత ముఖ్యమైన సందేశాన్ని నీవంటి చంచల బుద్ధిగలవాడికి ఇచ్చి పంపేదాన్ని కాను!" అన్నది పూంగుళలి.

"ఓహో! తాళపత్రం ఎవరిచ్చిందని కూడ నీకు తెలిసిపోయిందా? నీవు వంచకి అన్నదాంట్లో సందేహం లేదు. పడవను వెనక్కు తిప్పుతావా, లేక సముద్రంలో దూకనా?"

"దూకు! ధారాళంగా దూకు!" అన్నది పూంగుళలి.

పిచ్చిగా వంతిదేవుడు దబ్బున సముద్రంలో దూకేశాడు. ఒడ్డు దగ్గరున్నట్లు ఇక్కడ కూడ నీటిలోతు తక్కువగా ఉంటుందనుకొన్నాడు. అంత త్వరగా పడవ సముద్రం చాల లోతు ఉన్నచోటికి వచ్చేసిందని గ్రహించలేదు. సముద్రంలో దూకిన తర్వాతే ఆ విషయం తెలిసింది. తెలిసిన తర్వాత లబోదిబోమని నోరు కొట్టుకోసాగాడు!

~

ఇంతకు మునుపు వంతిదేవుడు ఈదడం కాస్త నేర్చుకొన్నాడు. కానీ నీరంటే అతనికున్న సహజ భయం అతడి కాళ్ళు, చేతుల బలాన్ని పీల్చేసింది. నదిలో, కొలనులోనైతే కనుచూపు మేరలో ఉండే గట్టును చూసి ధైర్యం  తెచ్చుకొనే అవకాశం ఉండేది. ఇదేమో మహాసముద్రం - ఎటువైపు చూసినా నీటిమయం. అక్కడ అలలు చిన్నగానే ఉన్నాయి. కానీ అవి ఒక్కొక్కసారి అతన్ని పైకెత్తి కింద పడేస్తున్నాయి. పైకి వచ్చినప్పుడు పడవ కనిపిస్తూంది. 'ఓ' అని అరిచాడు. అలలు  కిందకు తెచ్చేసినప్పుడు పడవ కనిపించడం లేదు. చుట్టూ కారు చీకటిలో ఎత్తైన నీటిగోడ మాత్రమే కనిపిస్తోంది. 'ఓ' అని అరిచే శక్తిని కూడ కోల్పోయిందతని నోరు. మూడవసారి కడలి అలలు అతన్ని పైకి తెచ్చినప్పుడు పడవ చాల దూరం వెళ్ళిపోయినట్లనిపించింది. అంతే! 'సముద్రంలో మునిగి చావబోతున్నాం' అన్న భావం అతడి మనసులో బలంగా నాటుకొంది! మనం మునగడం మాత్రం కాదు. మనతోబాటు నడుం బట్టలో ఉన్న తాళపత్ర సందేశంకూడ మునిగిపోబోతుంది! కుందవైదేవి ముఖం అతని మనోనేత్రం ముందు నిలిచింది. 'ఇలా చేసేశావే' అని అడుగుతున్నట్లనిపించింది. ఆహా! ఏమేమి కలలు కన్నాము? ఏవేవో ఆకాశ హర్మ్యాలు కట్టుకొన్నాం కద? వాణర్ కులపు పాత రాజ్యం మనకు తిరిగి వచ్చి, రత్న ఖచిత సింహాసనం మీద  యువరాకుమారి కుందవైదేవితో ఆసీనులు కాబోతున్నామని కలగన్నామే! అదంతా కూలిపోయింది! ఈ చెడ్డ పిల్ల అంతా చెడగొట్టేసింది! ఇదొక ఆడ పిల్ల కాదు. స్త్రీరూపందాల్చిన ఒక దెయ్యం. పళువేట్టరయ్యర్ల వంటిది కాదు. ఆ మోహినీ పిశాచి నందిని జాతికి చెందింది. మనం మునిగి చచ్చినా ఫరవాలేదు. ఈ ఆడపిశాచి మన చేతికి చిక్కితే దాని గొంతు పిసికి... ఛీఛీ! ఇదేం ఆలోచనలు! చచ్చేటప్పుడు మంచి విషయాల గురించి ఆలోచిద్దాం! దేవుని తలుచుకొందాం! ఉమాపతీ! పరమేశ్వరా! పళని ఆండవా! పాలకడలిలో పవళించే మహావిష్ణు! ...కుందవైదేవీ! ఒప్పుకొన్న కార్యాన్ని నెరవేర్చలేక పోతున్నాను... అదిగో పడవ కనిపిస్తోంది! ఆ పిల్ల ఇప్పుడు గనక చేతికి చిక్కితే!...

~

వంతిదేవుడు సముద్రంలో దూకిన తర్వాత పూంగుళలి కాసేపటి వరకు నిర్లక్ష్యంగా కూర్చొంది. ఎలాగో కిందమీద పడి ఈదుకొచ్చి పడవలోకెక్కుతాడనుకొంది. కాస్త కష్టపడనీ అన్న ఉద్దేశంతోనే పడవను కాస్త దూరంగా తీసుకొని వెళ్ళింది. కానీ త్వరలోనే ఆమె అనుకొన్నది తప్పని తెలిసిపోయింది. ఇతడిక బాగా ఈదడం తెలియదు. దానికి తోడు చాల భీతిగొన్నాడు. 'ఆ' 'ఓ' అని నిజంగానే భయపడే అరుస్తున్నాడని గ్రహించింది. ఇంకాసేపటికి ఉప్పునీరు తాగనారంభిస్తాడు; మునిగి కూడ పోతాడు. తర్వాత అతడి దేహాన్ని కనిపెట్టడం కూడ సాధ్యం కాదు. ఛఛ! మనం చేసింది పొరబాటు కద? వేళాకోళం విపరీత పరిణామాలకు దారితీస్తున్నట్లుందే! అవతలి తీరం చేరేవరకు మనం నోరు మూసుకొని ఉండాల్సింది. అతడి రహస్యం మనకు తెలుసని ఢంకా బజాయించి చెప్పుకోకుండ ఉండాల్సింది! అంతలోపల తొందర పడ్డాం! అయినా కూడ ఈ మొరటు వెధవ ఇలా చేస్తాడని ఎవరు చూడొచ్చారు? నీటిని చూసి ఇతడింత భయపడతాడని ఎవరికి తెలుసు?

అలల శిఖరంపైన వంతిదేవుని ఇంకొకసారి చూసినప్పుడు, పూంగుళలి పడవను అటు వైపు తిప్పింది. కన్ను మూసి తెరిచేలోపల పడవ అతడి దగ్గరకు చేరింది. 'రా! రా! వచ్చి పడవెక్కు!' అన్నది. కానీ అతడి చెవిన పడినట్లు లేదు. పడ్డా, పడవను పట్టుకొని పడవలోపలికెక్కుతాడో లేదో తెలియదు. వినే శక్తితోబాటు చూసేశక్తిని కూడ కోల్పోయినట్లున్నాడు ఈ దౌర్బల్య మనస్కుడు. కానీ అరిచే శక్తి మాత్రం ఇంకా ఉంది. తల పైకెత్తి 'ఓ' అని ఒకసారి అరిచాడు. నమ్మకం పూర్తిగా కోల్పోయి, చావడం ఇక తథ్యం అనుకొన్నవాడి ఆర్తనాదం లాగ వినిపించింది. అది పూంగుళలి వెంటనే గ్రహించింది. అతడు తలెత్తినప్పుడు నెలవంక మసక వెలుతురులో అతడి ముఖం కనిపించింది. ప్రాణభయం ముదిరిన పిచ్చివాడి ముఖమే అది! అతడే వచ్చి పడవెక్కుతాడని ఇక నమ్మడం వృథా! - మనమతడిని కాపాడి పడవెక్కించాల్సిందే! - లేని తంట మనమే కల్పించుకొన్నాం కద!

వెంటనే పూంగుళలి కొన్ని కార్యాలను అతివేగంగా చేసింది. పడవలో తెరచాపను కట్టేందుకోసం ఉంచిన తాడును తీసి, దాని ఒక చివరను పడవలో ఉన్న కొయ్యలమోపుకు కట్టింది. ఇంకొక చివరను తన నడుం చుట్టు చుట్టుకొంది. అతిలాఘువంగా ఈదుకొంటూ ముందుకు వెళ్ళి వంతిదేవుని సమీపించింది. చేయి విసిరి పట్టుకోగలంత దూరంలో నిలిచింది.

వంతిదేవుడు కూడ ఆమెను చూసేశాడు. అతడి ముఖంలోను, కళ్ళలోను భయంకరమైన మారణోద్రేకం (చంపాలన్న ఆవేశం) [కొలై వెరి] తాండవమాడింది.

పూంగుళలి బుద్ధి అతివేగంగా పనిచేసింది. ఈత తెలియక, సత్తువ కోల్పోయి నీట మునగబోయే వారు చివరి క్షణంలో ఏం చేస్తారన్నది ఆమెకు బాగా తెలుసు - కాపాడ వచ్చిన వారి భుజాలనో, గొంతునో గట్టిగా పట్టేసుకొంటారు. కాపాడే వారిని కూడ ఈదనివ్వకుండ చేసేస్తారు. ప్రాణంపైనున్న ఆశ అప్పుడు

వారికి ఏనుగంత బలాన్నిస్తుంది. కాపాడవచ్చిన వారిని గట్టిగా పట్టుకొని నీటిలోపలికి అదమజూస్తారు. వారి భయంకర రాక్షస పట్టునుంచి విడిపించుకోవడం అసాధ్యం! ఈదడం కూడ సాధ్యం కాదు. ఇద్దరూ ఒక్కటిగా కడలిలో మునిగిపోవలసి వస్తుంది!

ఇదంతా బాగా తెలిసిన పూంగుళలి మెరుపువేగంతో ఆలోచించి, ఒక తీర్మానానికి వచ్చింది. ప్రాణభయంతో ఉక్కిరిబిక్కిరవుతున్న వంతిదేవుడు ఇంకాస్త ముందుకొచ్చాడు. వెంటనే పూంగుళలి ఒక చేత్తో ఈదుతూ అతడి దగ్గరకు వచ్చి, ఇంకొక చేత్తో అతడి ముఖానికి గురి చూసి ఒక ముష్టి గుద్దు గుద్దింది. ముక్కుకు, నుదుటికి మధ్య ఆ గుద్దు పడింది. పడవ నడిపి నడిపి గట్టి పడ్డ చేత్తో గుద్దిన ఆ గుద్దు వజ్రాయుధం దెబ్బలాగ వంతిదేవుని మీద పడింది. అతడి తల వేయి ముక్కలైంది. అతడి కళ్ళు పదహారు వేల నేత్రాలుగా చెదిరిపోయాయి.. ఒక్కొక్క అణు నేత్రం ముందు లక్ష మెరుపులు మెరిశాయి. ఒక్కొక్క మెరుపులోను  సముద్రకుమారి ముఖం కనిపించి, 'హా హా హా హా' అని వికటాట్టహాసం చేసింది. అది అతడి చెవులు దిబ్బేళ్ళు పడేలా చేశాయి. తర్వాత అతడికి చెవులు కూడ వినిపించలేదు; కళ్ళు కనిపించలేదు; స్పృహ కూడ కోల్పోయాడు. అంతులేని గాఢాంధకారం! ఎల్లలు లేని నిశ్శబ్దం!

~~~
~~~

# అధ్యాయము - 8

## భూతాల దీవి

**ఆకాశమాత** ఉంది చూశారూ, ఆమె బుద్ధి వైశాల్యతలో మానవ జాతికి చెందిందనే చెప్పాలి. పరంజ్యోతియైన ఆ పరమాత్మను మానవులు తమ మనసనే ఆకాశం నుంచి జారవిడిచేసుకొంటున్నారు! తర్వాత చీకటి కమ్ముకొన్న గుళ్ళలో, ప్రాకారాల్లో, గర్భగుడుల్లో వేవేల దీపాలు వెలిగించి వెతుకుతున్నారు ఆ పరంజ్యోతిని!

ఆకాశమాత కూడ అలాంటి పనే చేస్తూంది ప్రతి దినమూను! జ్యోతిర్మయుడైన సూర్య భగవానుని తన వశం నుంచి సముద్రంలోకి జారవిడిచేస్తూంది. తర్వాత తన నాధుడు కనిపించలేదనే దిగులుతో లక్ష దీపాలు వెలిగించి వెతుకుతూంది! అంతేనా? రాత్రంతా లక్ష దీపాలు వెలిగించి తాను కూడ నిద్రపోకుండ సూర్యుని వెతుకుతూంది.

వంతిదేవునికి స్పృహ వచ్చి కళ్ళు తెరిచి చూసినప్పుడు, వేలాది దీపాలు వెలుగుతుండడం చూశాడు. ఏ కోవెలలో ఇంత అలంకార మయంగా వేలాది, లక్షలాది దీపాలు వెలిగించి ఉంటారని ఆశ్చర్యపడ్డాడు. తర్వాత అవి దీపాలు కావని, ఆకాశంలో వెలిగే నక్షత్రాలని గ్రహించాడు. తాను పడవలో వెల్లికిలా పడుకొని ఉండడం, తన నడుం చుట్టు తడిసిన బట్టతోబాటు ఒక తాడు కూడ కట్టి ఉండడాన్ని గ్రహించాడు.

చల్లని గాలి అతని శరీరాన్ని తాకి, ఎనలేని నెమ్మదినిచ్చింది.

ప్రశాంత సముద్రంలో లేచిన ఓంకారనాదం అతని మనసులో అపూర్వమైన శాంతిని నెలకొల్పింది.

ఆ నాదానికి తోడు ఒక గీతం వినిపించింది. అదేమి గీతం? ఆ గీతాన్ని తాను మునుపెప్పుడో విన్నట్లుంది కద?

[పూంగుళలి స్వరచితమైన ఆ గీతం ఆమె మనఃకల్లోలాన్ని ఎత్తి చూపే భావోద్వేగమైన గీతం. మనమిప్పటికే ఒకసారి దాన్ని విన్నాం. గుర్తుచేసుకోండి! ]

ఆహా! ఆ విచిత్రమైన అమ్మాయి పూంగుళలి కద పాడుతూంది? కాస్త లేచి కూర్చొని ఎదురుగా చూశాడు. అవును, ఆమే! పడవనడుపుతోంది! ఆ శోక గీతాన్ని పడవ నడుపుతూ పాడుతూంది! కారు చీకట్లో మెరుపు మెరిసి ఒక్క క్షణంపాటు చుట్టూ పలు వస్తువులను చూపినట్లు, నడిరాత్రి జరిగినదంతా వంతిదేవునికి కొట్టవచ్చినట్లు ఛక్కున జ్ఞాపకం వచ్చింది. అదికూడ, తాను సముద్రంలో మునకలు వేస్తూ, ఊపిరాడక, ఉక్కిరిబిక్కిరి కావడము, పూంగుళలి పడవనుంచి నీట దూకి తనను సమీపించడం వరకే. తర్వాత జరిగిందేమీ గుర్తు చేసుకోలేకపోయాడు.. తనను ఆ అమ్మాయి కడలిలోమునిగిపోక కాపాడి

ఉండాలి. పడవ కదిలినప్పుడు తాను మళ్ళీ సముద్రంలో పడిపోకుండ తన నడుం చుట్టూ తాడు కట్టి దాని రెండవ కొనను పడవ మధ్యనున్న అడ్డ కర్రకు కట్టింది. తాడు తన చర్మానికి రాసుకొని బాధించకుండేందుకు దాన్ని తన పైబట్ట మీదుగా కట్టింది.

నడుం బట్టలోపల చుట్టివున్న తిత్తిని తడిమి చూసుకొన్నాడు. తాళపత్రం, డబ్బు భద్రంగా ఉన్నాయని గ్రహించాడు. ఆహా! ఈ అమ్మాయిని సందేహించి మనమెంత పెద్ద పొరబాటు చేశాం? ఆమెకేదైన దురుద్దేశం ఉండి ఉంటే తనను కాపాడవలసిన అవశ్యకత లేనే లేదు కద? సత్తువ కోల్పోయి, స్పృహ తప్పిన తనను సముద్రంనుంచి కాపాడి పడవలోకి చేర్చేందుకు ఈమె ఎంత కష్టపడివుండాలి? ఒంటరిగా ఎలా చేసిందో! అపూర్వమైన అమ్మాయి ఈమె!

ఇదిగో లేచి నిలబడుతూంది! ఎందుకు? తాను పెల్లికిలా పడిపోయానని తెలిసి తనవైపు వస్తోందా? కాదు, కాదు! తెరచాపను విప్పుతోంది! ఎంత కష్టమైన పని! కానీ ఒంటరిగా చేస్తోంది!

“పూంగుళలి! పూంగుళలీ!”

“ఓహో! మెలకువొచ్చేసిందా?”

“నా కట్లు విప్పేయి! నేను కూడ సహాయం చేస్తాను.”

“నీవూరుకొంటే చాలు; అదే పెద్ద సహాయం. కట్లు విప్పాలంటే నీవే విప్పుకోవచ్చు. కానీ మళ్ళీ సముద్రంలోకి దూకేయకు!”

వంతిదేవుడు తనని కట్టివున్న తాటిని విప్పేసుకొన్నాడు.

పూంగుళలి తెరచాపను కట్టే కొయ్యను లేపి నిలబెట్టింది. దానిమీద తెరచాపను విప్పి ఎగరవేసింది. పడవ ఇప్పుడు ఉల్లాసంగా వెళ్ళసాగింది. వేగంగా కూడ వెళ్ళనారంభించింది.

“సముద్రకుమారీ!”

“ఏమి?”

“దాహం వేస్తూంది.”

“ఉప్పు నీరు తాగావు కద? దాహం వేయక మరేం చేస్తుంది?”

పూంగుళలి సొరకాయ బుర్రనొకదాన్ని తీసుకొని వంతిదేవుని సమీపించింది.

“నీకోసం నేను అన్నం కూడ తెచ్చాను. నీవు సముద్రంలోకి దూకినప్పుడు అదికూడ నీట పడిపోయింది. అదృష్టవశాత్తు ఈ సొరకాయ బుర్ర మాత్రం బతికిపోయింది.”

ఇలా చెబుతూనే సొరకాయ బుర్రను మూత తీసేసి వంతిదేవునికిచ్చింది. వంతిదేవుడు దాన్ని తీసుకొని నీరు తాగాడు.

తర్వాత, గొంతు సవరించుకొని, “నీగురించి నేను పొరబడ్డాను. అందుగురించి విచారపడుతున్నాను.” అన్నాడు.

"అందుగురించి బాధలేదు. నీవెవరో? నేనెవరో? పొద్దుపొడిస్తే విడిపోయేవాళ్లం..."

"ఇప్పుడు సమయమేమి?"

"ఆకాశాన్ని చూసి తెలుసుకో! సప్త ఋషి మండలాన్ని చూడు!" అన్నది పూంగుళలి.

~

వంతిదేవుడు ఉత్తరదిక్కున ఆకాశం కిందటి భాగాన్ని చూశాడు. అతడు పడవెక్కినప్పుడు చూసిన దానికి, ఇప్పటికి పోల్చితే, సప్తఋషుల అర్ధ వృత్తం కాస్త ముందుకు వచ్చారు. ఆ అరుంధతి నక్షత్రం ఎలా వశిష్ఠునితో అంటుకొని వస్తోంది కద? ఎంత ఆశ్చర్యం? ధ్రువ నక్షత్రం మాత్రం ఉన్నచోటినుంచి కదలలేదు. ఆకాశం, సముద్రపుటంచు కలిసేచోట ఆ ధృవ నక్షత్రం యుగయుగాలుగా స్థిరంగా ఉంటూ వస్తోంది. ఎందరెందరో నావికులకు ఆ ధృవ నక్షత్రం దారి, దిశ చూపిస్తూ వస్తూంది! ధృవ నక్షత్రం - దాన్ని ఎవరికో ఉదాహరణగా చెప్పారు కద? ఎవరు చెప్పారు? ఎవరిని గురించి? ఆఁ! గుర్తుకొస్తోంది. కుడంద్తై జ్యోతిష్కులు యువరాజు అరుళ్మొళి వర్మను ధృవ నక్షత్రంతో పోల్చి చెప్పారు. యువరాజును చూసే భాగ్యం మనకుందా? ఈ అమ్మాయి సహాయం వల్ల అది సాధ్యం కాబోతోందా?

పూంగుళలి వెళ్ళి తన తావులో కూర్చొంది.

"సమయం ఎంతని అనుకొంటున్నావు? మూడవ జాములో సగం పూర్తయ్యింది. గాలి తిరిగేసింది. పొద్దు పొడిచేటప్పటికి నాగ ద్వీపం చేరుకొంటాం" అన్నది.

"నాగ ద్వీపమా?" అని వంతిదేవుడు ఉలిక్కిపడి అడిగాడు.

"అవును; లంకకు ఉత్తరదిక్కుగా తీరం వెంబడి చాల దీవులున్నాయి. వాటిలో ఒకటి నాగ ద్వీపం. ఆ దీవిలో దిగితే మళ్ళీ సముద్రం దాటవలసిన పని లేదు. తీరం వెంబడే వెళ్ళి లంకకు చేరుకోవచ్చు."

"నన్ను దింపేసిన తర్వాత నీవేం చేస్తావు?"

"నాగురించి నీకెందుకు దిగులు/అక్కర?" అన్నది పూంగుళలి.

"నాకింత పెద్ద ఉపకారం చేస్తున్నావు కద? అందుకు కృతజ్ఞతగా ఏం చేయను? నన్నేదో ప్రత్యుపకారం అడుగుతానన్నావు కద? అదేమి?" అన్నాడు.

"నేను నా ఉద్దేశం మార్చేసుకొన్నాను. నేను నిన్ను ప్రత్యుపకారమేమీ అడగదలుచుకోలేదు. నీవు కృతఘ్నుడివి."

ఆమె అలా తన గురించి నిందాపూర్వకంగా మాట్లాడడానికి కారణముందని గ్రహించాడు వంతిదేవుడు. ఇంకొకసారి నడుం బట్టను తడిమిచూసుకొని తాళపత్రం భద్రంగా ఉందని రూఢి చేసుకొన్నాడు.

"సముద్రకుమారీ! నిన్న రాత్రి తొలిజామున నిన్ను సందేహించి నేను మాట్లాడిన మాటలు, నా నడత తలుచుకొంటే నాకే సిగ్గుగా ఉంది. నన్ను మన్నించు!"

“అలాగే; నీవు కూడ దాన్ని మరిచిపో! జరగవలసిన దాన్ని గురించి ఆలోచించు! లంకలో నేను దింపిన తర్వాత నీవేం చేస్తావు? యువరాజు ఉన్న చోటును ఎలా కనిపెడతావు?”

“ఈ కడలిని దాటేందుకు సహాయం చేసిన ఆ దేవుడే అందుకు కూడ సహాయం చేస్తాడు!”

“దేవుని పైన నీకు చాల నమ్మకమున్నట్లుంది. మన వంటి అల్ప జీవుల కార్యాలలో ఆ దేవుడు శ్రద్ధ తీసుకొంటాడని అనుకొంటున్నావా?”

“నేనంత తత్వ విచారం చేయను. ఏదైన కష్టమో, అపాయమో ఎదురైతే దేవుని ప్రార్థిస్తాను. దేవుడు కూడ సహాయం చేస్తాడు. ఈ సముద్రాన్ని దాటేందుకు నిన్ను సహాయంగా పంపించాడు కద?”

“అంత గర్వం నీకు తగదు. నేను నీకోసం పడవ నడపుకొంటూ రాలేదు. నీకు సహాయం చేయమని కలలో దేవుడు వచ్చి నాకు చెప్పలేదు...”

"మరెందుకు నీవు నన్ను కాపాడావు? ఎందుకిప్పుడు పడవ నడుపుకొంటూ నన్ను లంకకు తీసుకొని వెళుతున్నావు?”

“అందు గురించి అడగకు. అది నా స్వంత/వైయక్తిక విషయం.”

~

వంతిదేవుడు మౌనందాల్చి దీర్ఘాలోచనలో మునిగిపోయాడు. అతడి గర్వపూరితమైన మనసులో ఒక ఆలోచన పుట్టింది - తన వీర సౌందర్య రూపాన్ని చూసి ఈ అమ్మాయి మోహంలో పడిందా అనుకొన్నాడు. వెంటనే ఆ ఆలోచనను వమ్ముచేసుకొన్నాడు. ఈమె మాట తీరు, నడవడిక అటువంటి ఆలోచనలకు అవకాశాన్నివ్వడంలేదు. ఇంకేదో నిగూఢకారణముండితీరాలి. ఈమెను మాటల్లోకి దించి అది బయటకొచ్చేలా చేయాలి.

“ఒక విషయాన్ని తలుచుకొంటే నాకు దిగులుగానే ఉంది...” అన్నాడు.

“అదేమి? నీకు కూడానా దిగులు?”

“లంకలో అడవులు, కొండలు అధికమంటున్నారు.”

“లంకలో సగానికి పైగా అడవులు, కొండలే!”

“అడవి జంతువులక్కడ ఎక్కువంటున్నారు.”

“అడవి ఏనుగులు మందలు మందలుగా సంచరిస్తుంటాయి. కొన్ని సార్లవి బయటకు కూడ వచ్చేస్తుంటాయి.”

“లంకలో ఉన్న మనుషులు అడవి జంతువుల్లాగ మొరటువారని విన్నాను.”

“అది పచ్చి అబద్ధం.”

“అలాగైతే సరే; నీవు చెబితే అది నిజమే అయి ఉండాలి. అటువంటి అడవి ప్రదేశంలో యువరాజు అరుళ్మొళి వర్మ ఎక్కడున్నారని వెతికి కనిపెట్టడం?”

"అదేమంత కష్టం కాదని ఇందాక అన్నావే?"

"అవును; చెప్పాను. సూర్యుడుండే చోటు కనిపెట్టడమంత కష్టం కాదని మునుపనుకొన్నాను."

"ఇప్పుడెందుకు కష్టమని అనుకొంటున్నావు?"

"సూర్యుని మేఘాలు కప్పివుండవచ్చు, లేదా సూర్యుడు సముద్రంలో మునిగివుండవచ్చు."

"ఈ సూర్యుని ఏ మేఘాలు, సముద్రమూ మరుగు పరచలేవు. పొన్నియిన్ సెల్వన్ని కప్పేందుకు ప్రయత్నించే మేఘమే కాంతివంతమౌతుంది. కడలి కూడ జ్వలిస్తుంది!"

ఆహా! యువరాజు గురించి మాట్లాడేటప్పుడు ఈమెలో ఎలా ఉత్సాహం పొంగుతోంది! చోళదేశపు ప్రజలు చాల మందిలాగ ఈమె కూడ ఆయనను దైవంగా భావిస్తూంది! అరుళ్మొళి వర్మ దగ్గర ఏమంతటి వశీకరణ శక్తి ఉందో కద? - ఇలా మనసులో అనుకొని, "అలాగైతే లంకలో యువరాజును కనిపెట్టడం కష్టం కాదంటున్నావు?" అన్నాడు.

"చోళ సైన్యం ఎక్కడుందని విచారించుకొని వెళితే యువరాజుండే చోటు తనకు తానే తెలిసిపోతుంది."

"అదెలా? లంకలో సగభాగం కన్న ఎక్కువగా చోళ సైన్యం విస్తరించి ఉందని విన్నాను కద?"

"అవును; మామిడి తోపునుంచి పులస్తినగరం వరకు చోళసైన్యం విస్తరించి ఉందని నేను కూడ విన్నాను..."

"మరి? అంత విశాలమైన ప్రదేశంలో యువరాజెక్కడున్నాడని వెతకడం? అడవి దారుల వెంబడి వెళ్ళి ఆయనను కనిపెట్టడడాని కి చాల రోజులు పట్టవచ్చు. ఈ తాళపత్రాన్ని నేనాయనకు వెంటనే చేర్చాలి. నీవు ఆ తాళపత్రాన్ని చూశావు కద? అది ఎంత అత్యవసరమైన కార్యమని తెలుసుకొన్నావు కద?"

సముద్రకుమారి ఇందుకు బదులేమీ చెప్పక మౌనందాల్చింది.

"యువరాజు ఉన్నచోటు మొదటే తెలిస్తే అక్కడా ఇక్కడా తిరుగాడుతూ సమయం వృధాచేయడం తప్పుతుంది" అన్నాడు వంతిదేవుడు.

"అందుకు ఒక దారి ఉంది" అన్నది పూంగుళలి.

"ఉంటుందని నమ్మే నిన్నడిగాను."

"పొద్దున నిన్ను నాగ ద్వీపంలో దింపేస్తానని అన్నాను కద?"

"అవును."

"నాగదీవికి పక్కన భూతాల దీవి ఉంది."

"దీవి పేరు వినేందుకే భయంకరంగా ఉందే!"

"భయపడకు! మొదట ఆ దీవి పేరు 'బుద్ధ దీవి' అని ఉండేది. బుద్ధ భగవానుడు ఆకాశమార్గం గుండా లంకకు వచ్చినప్పుడు మొట్ట మొదట ఆ దీవిలోనే దిగాడట. అక్కడున్న రావి చెట్టు కింద కూర్చొని

బౌద్ధ ధర్మాన్ని బోధించాడట. కాబట్టి 'బుద్ధ దీవి' అన్న పేరు వచ్చిందా దీవికి."

"తర్వాత 'భూత దీవి' అని మారిపోయింది కాబోలు!"

"అవును; 'భూత దీవి' అన్న పేరు వినే చాలమంది నీలాగ భీతిగొనేవారు. తర్వాత ఆ దీవికి ప్రజలు వెళ్ళడం మానేశారు. భూతాలకు భయపడని వారు వెళతారు."

"అంటే నీలాంటి ధైర్యశాలురన్నమాట. కొరివి దెయ్యాలకే భయపడని దానివి కద నీవు? సరే! భూతాల దీవి గురించి ఏం చెప్పొచ్చావు?"

"భూతాల దీవి తీరాన నీవొక ఘుడియకాలం వేచివుంటే, 'పొన్నియిన్ సెల్వన్' ఇప్పుడు లంకలో ఎక్కడున్నారని విచారించి చెబుతాను..."

"భూతాల దీవిలో ఎవరిని విచారిస్తావు?"

"భూతాల దీవిలో ఒక భూతం ఉంది. దాన్ని అడుగుతాను..."

"ఆ భూతాన్ని నాక్కూడ చూపిస్తావు కద?"

"అది మాత్రం సాధ్యం కాదు. నీవు నన్ను వెన్నంటి దీవిలోపలికి రాకూడదు. ఒడ్డున పడవను చూసుకొంటూ నాకోసం వేచివుంటానని ఒట్టేసి చెబితేనే నేను వెళ్ళి విచారించి తెలుసుకొని వస్తాను..."

"సరే; అలాగే!" అన్నాడు వంతిదేవుడు.

ఉన్నట్లుండి గాలి హోరుమని వీచింది. తెరచాప సహాయంతో పడవ సముద్రాన్ని చీల్చుకొని దూసుకు వెళ్ళింది. సముద్రంలో ఓంకారనాదం వినిపిస్తూనే ఉంది.

వంతిదేవునికి నిద్ర ముంచుకొచ్చింది. అలాగే నిద్రలోకి జారిపోయాడు.

~~~
~~~

# అధ్యాయము - 9

## "ఇదే లంక!"

**మళ్లీ** వంతిదేవుడు నిద్రనుంచి మేలుకొన్నప్పుడు, అతడి ముందు, చుట్టూ కనిపించిన దృశ్యం అతన్ని భ్రమింపజేసింది. తూర్పున సూర్యుడు ఉదయిస్తున్నాడు. ఆ బంగారు కిరణాలు సోకి, తూరుపు సముద్రం కరిగించి పోసిన బంగారం లాగ ధగధగ మెరిసిపోతూంది. అతడికెదురుగా పడవ వెళుతున్న దిశలో ఒక మరకత దీవి నీలాంబరాన్ని కప్పుకొని కనుల విందుగా కానవచ్చింది. కుడివైపు అదే విధంగా పచ్చని ప్రదేశమొకటి కనిపించింది. అది నాలుగు వైపుల సముద్రమున్న ద్వీపమా, లేక చాల పెద్దగా/విశాలంగా విస్తరించివున్న భూప్రదేశమా అని తెలియలేదు. ఆ రెండు మరకత ప్రదేశాలలాగే దూరంలో చాల దీవులు పచ్చని రంగుతో పలువిధాలైన కదంబ ప్రహేళికలకు ఉదాహరణగా వెలుగొందుతున్నాయి. పడవలో ఉన్నఫళంగానే చుట్టూ చూస్తే, ఇంద్ర ధనుస్సులోని ఏడు రంగులు, వాటి ఏడువేల వన్నెలు కమనీయంగా కనిపించాయి. ఆ దృశ్యం వాస్తవమనే చెప్పలేము. ఒక ప్రసిద్ధ చిత్రకారుడు, "ఇదిగో స్వర్గలోకం ఎలా ఉంటుందో చూపిస్తాను!" అని చెప్పి చిత్రీకరించిన ఒక అద్భుత కళాఖండం లాగ కనిపిస్తూంది.

ఈ దృశ్యాన్ని చూసి మైమరచిన వంతిదేవుని చెవిలో మెత్తగా, "ఇది స్వర్గం కాదు, ఇది లంక!" అన్న మాటలు పడి, అతన్ని ఈ లోకానికి తీసుకొచ్చాయి.

"అవును; ఇది స్వర్గమా అని సందేహించిన మాట నిజమే!" అన్నాడు వంతిదేవుడు.

"ఇది స్వర్గం కాదు; కానీ ఇది స్వర్గం వంటి భూమి. ఈ స్వర్గాన్ని నరకం చేసేందుకు మనుష్యరూపం దాల్చిన అసురులు చాల కాలంగా ప్రయత్నిస్తున్నారు!" అన్నది పూంగుళలి.

"ఎవరిని అసురులు అని అంటున్నావు?"

"నీలాగ యుద్ధమే వృత్తిగా కొన్నవారినే."

"పొన్నియిన్ సెల్వన్ కూడానా?"

"ఆయనను గురించి నన్నెందుకు అడుగుతున్నావు?"

"యువరాజు గురించి చెబుతానన్నావు కద?"

"ఆయన ఉండగల చోటును విచారించి తెలుసుకొని చెబుతానన్నానే గాని ఆయన అసురుడా, దేవుడా లేక మానవుడా అని విచారించి చెబుతానని చెప్పలేదు కద?"

~

పడవ దీవులను సమీపించసాగింది. కడలి మధ్య వినిపించే ఓంకార నాదానికి బదులు, ఆ కడలి అలలు తీరాన్ని తాకేటప్పుడు చేసే గలగల శబ్దం వినవచ్చింది.

"ఎదురుగా కనిపించేదే భూత దీవి. కుడివైపు కనిపించేది నాగదీవి. ఎక్కడికి వెళ్లను? నాగదీవికి నిన్ను తీసుకొని వెళ్ళి దింపేయనా? అక్కడ నీవే విచారించుకొంటావా?"

“లేదు; భూతదీవికే వెళదాం.కాస్త ఆలస్యమైనా , యువరాజు ఎక్కడున్నారని తెలుసుకొని వెళ్ళడమే మంచిది.”

“అలాగైతే సరే; నీవు నాకిచ్చిన మాట జ్ఞాపకం ఉండనీ!”

చిన్న దీవి తీరానికి పడవ వచ్చి చేరింది. వంతిదేవుని పడవ చూసుకోమని చెప్పి పూంగుళలి దీవి లోపలికి వెళ్ళింది. వంతిదేవుడు ఆమె వెళ్ళినవైపు చూశాడు. పచ్చని చెట్ల మధ్య ఆమె అతివేగంగా వెళ్ళి మరుగైంది.

బుద్ధదీవి. ఆ దీవి పేరు ప్రజల నోట భూతాల దీవిగా ఎలా మారివుంటుందా అని వంతిదేవుడు కాసేపు ఆలోచించాడు. తర్వాత ఆ దీవిలో నివసిస్తున్న భూతం ఎలాంటి భూతంగా ఉంటుందో అని ఇంకాసేపు ఆలోచించాడు. తర్వాత ఈ అపూర్వమైన పిల్ల మనసులో దాగివున్న రహస్యం ఏమై ఉండవచ్చు అని ఆలోచించాడు.

పూంగుళలి తాను చెప్పినట్లే ఒక ఘడియ లోపల తిరిగి వచ్చింది. పడవలోకెక్కి, వంతిదేవుని కూడ ఎక్కమంది. నాగదీవి వైపు పడవ సాగింది.

“విచారించి విషయం తెలుసుకోగలిగావా ?” అని అడిగాడు వల్లవరయ్యన్.

“ముఖ్య మంత్రి అనిరుద్ధ బ్రహ్మరాయలు పొన్నియిన్ సెల్వన్ని చూసేందుకు మామిడి తోపుకు వచ్చి విడిదిచేశారట. నిన్న యువరాజు కూడ అక్కడికి వచ్చి ఉండాలి. ఎన్ని రోజులు అక్కడ ఉంటారో తెలియదు. నీవక్కడికి వెళ్ళి తెలుసుకోవచ్చు !” అన్నది పూంగుళలి.

“మామిడి తోపు ఇక్కడినుంచి ఎంతదూరముంటుంది ?”

“ఐదారు కోసుల దూరం ఉంటుంది. దారంతా ఒకటే అడవి మయం. కోడిక్కరై అడవి లాగ ఉంటుందనుకోకు. ఆకాశాన్నంటే ఎత్తైన చెట్లతో నిండిన దట్టమైన అడవి. పట్ట పగలే కొన్ని చోట్ల చీకటిగా ఉంటుంది. ఏనుగుల గుంపులు, ఇంకా ఇతర వన్య మృగాలు ఉంటాయి. నీవు జాగ్రతగా వెళ్ళాలి.”

“అడవిలో నీవంటి సమర్థురాలైన /తెలివైన అమ్మాయి దొరికితే...” అని పెద్దగా నిట్టూర్చాడు వంతిదేవుడు.

“అప్పుడు నీ అవసరమేమి ? తాళపత్ర సందేశాన్ని నేనే తీసుకొని వెళ్ళి ఇస్తాను...లేదు, లేదు! అసాధ్యం! ఏదో పిచ్చిదానిలాగ వాగుతున్నాను. నావల్లకానేకాదు. యువరాకుమారికి మాటిచ్చి వచ్చావు కద? రాజకార్యాన్ని నీవే నెరవేర్చాలి!” అన్నది పూంగుళలి.

“అలాగే కానీ, పూంగుళలీ! నేనే ఆ కార్యాన్ని నెరవేరుస్తాను. ఇంకొకరు బ్రతిమాలి అడిగినా ఇవ్వను. నీవింత సహాయం చేశావు కద, అదే చాలు!”

పడవ నాగ ద్వీపాన్ని సమీపించినప్పుడు పూంగుళలి చేతులు అలవాటు ప్రకారం తెడ్లు వేస్తున్నాయి. కానీ ఆమె మనసు ఎక్కడో ఊహాలోకంలో విహరిస్తూందని ఆమె ముఖం తెలయజేస్తూంది.

“సముద్రకుమారీ !” అని వంతిదేవుడు పిలవగానే ఈలోకానికి వచ్చింది.

“ఎందుకు పిలిచావు ?” అని అడిగింది.

“ఏదో నన్ను ప్రత్యుపకారం అడుగుతానన్నావు కద? అది నీవిప్పుడు అడిగితేనే అడిగినట్లు. ఇదిగో తీరం దగ్గర పడుతోంది.”

~

పూంగుళలి వెంటనే జవాబివ్వలేదు . వంతిదేవుడు కాస్త ధైర్యం తెచ్చుకొని ముందుకు మాట్లాడాడు .

"నీవు నాకు చేసిన ఉపకారం చాల పెద్దది. అది నీవు నాకు మాత్రం చేసిన ఉపకారం కాదు; చోళ సామ్రాజ్యానికే పెద్ద ఉపకారం చేశావు. చోళ చక్రవర్తి కులానికి పెద్ద ఉపకారమది . ఇందుకు ప్రతిగా ఏదైనా ఉపకారం /సహాయం చేయకపోతే నా మనసు నెమ్మదిగొనదు " అన్నాడు .

"ఇదంతా నీవు నిజంగా చెబుతున్నావా ? లేక ఇతర పురుషులలాగ కపటంగా మాట్లాడుతున్నావా ?"

"సముద్రరాజు సాక్షిగా నిజం చెబుతున్నాను ."

"అంటే నీట రాసిన మాటనా అర్థం?"

"భూమి, ఆకాశం, అష్టదిక్పాలకుల మీద ఒట్టేసి చెబుతున్నాను .!"

"నీ సత్య ప్రమాణాన్ని చూసి నేను చెప్పలేదు . అబద్ధాలు చెప్పేవారికి ఈ ఆనలు, ఒట్లు ఒక లెక్కా ? నిన్ను మొట్టమొదటిసారి చూసినప్పుడే నాకనిపించింది నీవు మంచివాడివని . అందుకే చెబుతున్నాను ..."

"మొదట కలిగే అభిప్రాయం ఎప్పుడూ మేలైనది. దాన్ని నీవు మార్చేసుకోకు !"

"పొన్నియిన్ సెల్వన్ని చూసి, ఆయనకు తాళపత్రాన్ని ఇచ్చిన తర్వాత, ఆయనతో మాట్లాడవలసిందంతా మాట్లాడి ముగిసింతర్వాత , ఆయన తీరికగా ఉన్నప్పుడు , '**సముద్ర కుమారి మీకు జ్ఞాపకం ఉందా ?'** అని అడుగు. 'జ్ఞాపకం ఉంద" అని చెబితే, 'ఆమే నన్ను పడవలో తీసుకొని వచ్చి లంకకు చేర్చింది' అని చెప్పు !"

పూంగుళలి ! నీవంత ఎత్తుకు ఎదగాలనుకొంటున్నావా ? పిచ్చుక గగనరాజైన గరుత్మంతుడు ఎగిరేటంత ఎత్తు ఎగురుతానని ప్రయత్నించడం తగునా ?ఇది నీకు మంచిది కాదే! - అని వంతిదేవుడు మనసులో అనుకొన్నాడు . ప్రకాశంగా, "ఇది చెప్పేందుకేనా ఇంత జంకావు ? ఏదో పెద్ద కోరిక అడుగుతావనుకొన్నాను . యువరాజుకు నీవు చెప్పింది తప్పక చెబుతాను ! ఆయన అడగకపోయినా నేనే చెబుతాను !..."

"అయ్యయ్యో ! ఆయన అడగకపోతే నీవేమీ చెప్పకు !"

"అదంతా వీలు కాదు; చెప్పే తీరుతాను ."

"ఏం చెబుతావు ?"

"జరిగింది జరిగినట్లు చెబుతాను . 'యువరాజా ! పొన్నియిన్ సెల్వా ! సముద్రకుమారి మీకు గుర్తుంది కద? జ్ఞాపకం లేకపోతే ఇప్పుడు గుర్తు తెచ్చుకోండి ! ఆమే నన్ను పళువేట్టరయ్యర్ మనుషుల చేత చిక్కి చావకుండ కాపాడింది . ఆమే ఒంటరిగా పడవ నడుపుకొంటూ నన్ను లంకకు తీసుకొని వచ్చి చేర్చింది . సముద్రంలో పడి ఉక్కిరిబిక్కిరవుతున్నప్పుడు ఆమే నన్ను కాపాడి మళ్ళీ పడవెక్కించింది . సముద్రకుమారి సహాయం లేకపోతే నేను మిమ్మల్నిచూడడం సాధ్యమయ్యేది కాదు . ఈ తాళపత్ర సందేశం

కూడ మీకు దొరికేద కాదు' అని చెబుతాను. సరేనా?"

"ఇంతవరకు చెప్పింది సరే; పైగా ఇంకేమీ చేర్చి చెప్పకు. ఇదంతా నేను ఆయనకు చెప్పమన్నానని చెప్పకు!"

"ఛఛ! నేనేమంత పెర్రి వెంగళ్ళప్పనను కొన్నావా?"

"యువ రాజు అందుకు ఏదైనా బదులు చెబితే అది ఉన్నది ఉన్నట్లు నాకు వచ్చి చెప్పాలి. హెచ్చు  తగ్గులు చేసి చెప్పకూడదు."

"నిన్ను నేను మళ్ళీ ఎక్కడ చూడడం?"

"అదేమంత కష్టం? కోడిక్కరైలోనో, భూత దీవిలోనో, లేక రెండింటికి మధ్య పడవలోనో ఉంటాను."

"ఊరికి తిరిగి వెళ్ళేటప్పుడు ఈ దారివెంబడి వస్తే, భూతాల దీవిలో నీవున్నావా అని వెతికి చూడనా?"

"ఏకారణం చేతనూ దీవి లోపలికి రాకూడదు; వస్తే విపరీత పరిణామాలు కలుగుతాయి. ఈ పడవ సముద్రతీరంలో ఉందేమో చూడు! ఉంటే ఏదైనా ఒక గుర్తు పెట్టుకొని శబ్దం చెయ్యి! నేను నిన్న కోయిల లాగ కూశాను కద? అలా నీవు కూయగలవా?"

"కోయిలలాగ కూయలేను! కానీ నెమలి లాగ శబ్దం చేయగలను. ఇది విను!" అని చెప్పి వంతిదేవుడు చేత్తో తన నోటిని మూసిపెట్టుకొని నెమలి కూసేలాగ ఒక ఘోరమైన శబ్దం చేశాడు.

అది విని పూంగుళలి గలగల నవ్వింది.

పడవ నాగదీవి తీరం చేరింది. ఇద్దరూ పడవనుంచి  దిగారు. వంతిదేవుడు ఒడ్డుపైకెక్కి పూంగుళలి వద్ద సెలవు తీసుకొన్నాడు. పూంగుళలి వెంటనే పడవను వెనక్కు తిప్పింది. వంతిదేవుడు చపలచిత్తంతో వెనక్కి తిరిగి చూశాడు. 'నీతో వస్తాను' అని ఆమెకూడ తనతో రాదా అన్న ఆశ అతడి మనసులో ఇంకా కొద్దిగా మిగిలివుంది. కానీ పూంగుళలి అతన్ని గమనించను కూడ లేదు. అప్పటికే ఆమె తన ఊహాలోకంలో విహరించేందుకు వెళ్ళిపోయిందని ఆమె ముఖం చెబుతూంది.

~~~
~~~

# అధ్యాయము - 10

## "అనిరుద్ధ బ్రహ్మరాయలు "

**ఈ కథ** మొదలైనప్పటినుంచి మనకు చాల సన్నిహితుడిగా ఉంటూ వస్తున్న ఆళ్వార్ కట్టియాన్ నంబిని మనం కొంతకాలంగా గమనించక వదిలి పెట్టేశాం. అందుకోసం పాఠకులను, నంబిని మన్నింపు కోరుతున్నాము. ముఖ్యంగా నంబిని మన్నింపు కోరే తీరాలి. ఎందుకంటే ఆళ్వార్ కట్టియాన్ ఇప్పుడు చాల కోపంగా ఉన్నాడు! అతడి ముందు పిలక రామేశ్వరం సముద్రతీరంలో వీస్తున్న గాలిలో ఎగురుతోంది. అతడి చేతి బడితేమో తలపైన గిర్రున తిరుగుతోంది! అతన్ని ఆది శైవులు, వీరశైవులు చాలమంది చుట్టుముట్టి ఉన్నారు. వారి ఆర్భాటం బలంగా ఉండడం వల్ల, ఆళ్వార్ కట్టియాన్ గతి ఏమౌతుందోనని మనకు కాస్త దిగులుగా కూడ ఉంది. అయినా, అతడి నరసింహావతార రూపము, చేతి బడితె తిరుగుతున్న వేగమూ ఆ దిగులును పోగొట్టుతున్నాయి.

వంతిదేవుడు, రాకుమారి కుందవైదేవి మాట్లాడుకొన్న మాటలను శ్రద్ధగా విన్న ఆళ్వార్ కట్టియాన్ వెంటనే పళైయార్రైనుంచి బయలుదేరాడు. వాయువేగ మనోవేగాలతో దక్షిణ దిక్కుగా వెళ్ళాడు. దారిలో ఎక్కడా శైవ, వైష్ణవ జగడాలలో దిగలేదు. తాను చేపట్టిన కార్యానికి ఆటంకం కలగకూడదని తన దారిన వచ్చిన పోట్లాటలను కూడ వద్దని పక్కకు తోసిపుచ్చి, మనసును గట్టిగా అదుపులో పెట్టుకొని ముందుకు సాగాడు. మదురైలో కాసేపు ఆగాడు. అక్కడ తాను తెలుసుకోగోరిన విషయాలను తెలుసుకొని రామేశ్వరానికి బయలుదేరాడు.

వంతిదేవుడు పూంగుళలి పడవలో వెళ్ళి లంకకు చేరిన అదే రోజు సాయంత్రం ఆళ్వార్ కట్టియాన్ రామేశ్వరం చేరుకొన్నాడు.

~

ఆ పుణ్యభూమి మీద కాలుమోపగానే ఆళ్వార్ కట్టియాన్ మనసులో ఇన్నాళ్ళూ అణగివున్న వైష్ణవ భక్తిభావం గట్లు తెంచుకొని పొంగిపొర్లింది. రామెశ్వరంలో ఎటు చూసినా తిరుగాడుతున్న శైవ భట్టారకులు ఆ వైష్ణవ భావాగ్నికి ధూపం వేశారు. ఆ పుణ్యతీర్థానికి వచ్చే యాత్రికులను పలు తీర్థాలకు తీసుకొని వెళ్ళి స్నానం చేయించడం, ఆయా క్షేత్రాల విశేషాలను వారికి వివరంగా చెప్పడమే వారి పని. కాబట్టి కొత్త యాత్రికుని చూసిన వెంటనే పలు భట్టారకులు వెళ్ళి చుట్టుముడతారు. అలాగే ఆళ్వార్ కట్టియాన్ని కూడ చుట్టుముట్టారు.

"అబ్బాయ్! రా! రా! ఈ పుణ్య స్థలంలో ఉన్న అరవై నాలుగు తీర్థాలలోను మునిగి స్నానం చేసి నీ ఒంటిపైనున్న ఆ పాషండ వైష్ణవ చిహ్నాలను కడిగేసుకో! రాముని బ్రహ్మహత్యా దోషాన్ని పోగొట్టిన పుణ్య

స్థలం కద ఇది! వైష్ణవ పాషండ మత చిహ్నాలను ధరించడం వల్ల కలిగిన పాపాలను కూడ పోగొట్టుకోవచ్చు!" అని ఒక భట్టు రసపూరితంగా మాట్లాడారు/ఉద్బోధించారు

ఇంకొకరు అడ్డం వచ్చి, "రామ తీర్థం, లక్ష్మణ తీర్థం, ఆంజనేయ తీర్థం, సుగ్రీవ తీర్థం - ఇలా అరవై నాలుగు తీర్థాలున్నాయి. ఒక్కొక్కరు ఆయా తీర్థాలలో మునక వేసి తమ తమ దోషాలను పోగొట్టుకొన్నారు. నీవు నాతో మొదట ఆంజనేయ తీర్థానికి రా! వైష్ణవ  చిహ్నా దోషానికి సరైన సంకల్పం చేయిస్తాను!" అన్నారు.

మరింకొక భట్టారకులు, "అబ్బాయీ! నీవు వీళ్ళు చెప్పేదంతా వినకు! రాముడు రావణుని చంపిన బ్రహ్మ హత్యా దోషాన్ని పోగొట్టుకోవడానికి, సముద్రం నుంచి ఇసుక తీసుకొని దాన్ని పట్టి శివలింగంగా చేసి పూజించిన స్థలానికి నిన్ను తీసుకొని వెళతాను, రా!" అన్నారు.

~

ఆళ్వార కట్టియాన్ కళ్ళనుంచి నిప్పుల కురిపిస్తూ అందరినీ పరికించి చూశాడు. "ఆపండి మీ అసంబద్ధ ప్రలాపాలను! మొదట మీరు చెప్పిన ఆ తీర్థాలలో మీ నాలుకలను కడిగేసుకొని మీ పాపాలను పోగొట్టుకోండి!" అన్నాడు.

"ఓహో! రాముడు, లక్ష్మణుడు అని వారి పేర్లు ఉఛ్ఛరించినందుకు  మాకు పాపం చుట్టుకొందనుకొంటున్నావా? అలాగేం లేదు. ఈ క్షేత్రం పేరే రామేశ్వరం. రాముడు ఈశ్వరుడైన శివ పరమాత్మను పూజించి పాపాన్ని పోగొట్టుకొన్న స్థలం. అంతటితో రాముడి పేర ఉన్న క్షేత్రం కూడ పోసే పోయింది!" అన్నారు ఒక వీరశైవ భట్టు.

"ఓ అజ్ఞాన శిఖామణులారా! ఎందుకిలా తలా పేలుతున్నారు? ఈ స్థలం పేరుకు నిజమైన అర్థాన్ని మీరెవరూ తెలుసుకోలేదు!"

"మరి నీవే చెప్పు, చూద్దాం!"

"బ్రహ్మయొక్క ఒక తల కొట్టేసినందువల్ల శివునికి బ్రహ్మహత్యాదోషం పట్టుకొంది. శ్రీవిష్ణువు పూర్ణ అవతారమైన రాముని పాదం తాకి పవిత్రమైన ఈ స్థలానికి వచ్చి శివుడు ఆ బ్రహ్మహత్యాదోషాన్ని పోగొట్టుకొన్నాడు. అందుకని శివుడు రాముని పూజించిన స్థలం కాబట్టి 'రామేశ్వరం' అన్న పేరు వచ్చింది! తెలుసకొన్నారా, మూర్ఖ శిఖామణులారా!" అని ఆళ్వార్ కట్టియాన్ గర్జించాడు.

"ఎవడ్రా వాడు మనని మూర్ఖ శిఖామణులంటున్నాడు? ఒరే దద్దమ్మా! నీవేమైన తలమీద కొమ్ములు మొలిచిన వాడివా?" అని కోపంగా అన్నారొక వీరశైవ భట్టు.

"లేదయ్యా, భట్టుగారూ! నాతలమీద కొమ్ములు మొలవలేదు; చేతిలో ఈ బడితే ఉంది! నేనెవరని  అడిగారు కద? చెబుతాను వినండి. తిరుక్కూరులో అవతరించి వేదాలను తమిళీకరించిన నమ్మాళ్వార్ దాసుడిని! ఇతరుల బుర్ర బద్దలు కొట్టేందుకు బడితె చేతబట్టిన వాడిని!" అని చెప్పి తన చేతి

బడితెను పైకెత్తాడు.

"ఆళ్వార్ దాసుడుకి దాసుడైన వాడా! నీవెందుకు పిలక ముందువైపు పెట్టుకొన్నావు? దాన్ని కూడ గీసేసుకొంటే బుర్ర బయట, లోపలకూడ ఒకటిగా ఉంటుంది!" అన్నారింకొక శైవ భట్టు.

"భట్టుగారూ! ఈ పుణ్యక్షేత్రంలో నా ముందరి పిలకను నేనే తీసేయించుకోవాలనుకొన్నాను. అంతలో మీరే గుర్తు చేశారు!..."

"ఒరేయ్! మంగలి వీధికి వెళ్ళి ఒక మంగలిని పిలుచుకొని రండర్రా! కత్తిని బాగా పదును చేసి తీసుకొని రమ్మనండి!" అన్నాడింకొక శైవుడు.

"కాస్త ఓపిక పట్టండి; ఇంకా ఒక విషయం బాకీ ఉంది.ఒకప్పుడు నా తలనిండా జుట్టుండేది. ఒక్కొక్క శైవుని బుర్ర పగలగొట్టి ఒక్కొక్క రోమాన్ని పీకేయడమని వ్రతం పూనాను. ఆవిధంగా మూడువంతులకు పైగా నా సిగ పోయింది.ఈ ఊళ్ళో నా వ్రతాన్ని పూర్తిగా నెరవేర్చేసి సముద్రంలో ఒక మునకవేసి వెళతాను. ఏదీ, ఒక్కొక్కరే ముందుకొచ్చి మీ బుర్ర చూపండి, చూద్దాం!" అని చెప్పి ఆళ్వార్ కట్టియాన్ చేతి బడితె పైకెత్తాడు.

"అరెరె! ఈ వైష్ణవుడు ఎంత దుడుగ్గా మాట్లాడుతున్నాడు?" అన్నారొకరు.

"మా అందరి బుర్రలు పగలగొట్టేస్తావా? అది నీవల్ల సాధ్యమవుతుందా?" అని అడిగారింకొకాయన.

"సాధ్యంగాకనా మూడొంతుల సిగను పీకి పారేశాను?" అని చెప్పి ఆళ్వార్ కట్టియాన్ బడితెను వేగంగా తిప్పసాగాడు.

"కొట్టండి! పట్టండి! కట్టండి!" అని అందరూ అరిచారే తప్ప, ఆ గుంపులో ఎవ్వరూ ఆళ్వార్ కట్టియాన్ దరిదాపులకు రాలేదు.

అప్పుడు వారికి అతి దగ్గరగా వినిపించిన ఘోష వారందరి ఆసక్తిని ఆకట్టుకొంది.

"శ్రీభువన చక్రవర్తి సుందర చోళ పరాంతకుల మాన్య ముఖ్యమంత్రి అనిరుద్ధ బ్రహ్మరాయలు వేంచేస్తున్నారు! పరాక్! బహు పరాక్!"

~

అందరూ అవాక్కై నిలబడిపోయి ఆ ఘోష వినవచ్చిన వైపుగా చూశారు. ఆళ్వార్ కట్టియాన్ అందరికన్న ఎక్కువగా అచ్చెరువొంది తన బడితెను చంకలో దోపుకొన్నాడు.

వారు నిలబడి జగడమాడిన స్థలం రామేశ్వరం కోవెల ప్రాకారం గోడవారగా ఒక మూల. ఆ మూల మలుపు తిరిగితే విశాలంగా పరుచుకొన్న సముద్రం. ఆ సముద్రమేమో చూడనలవికానంత అద్భుతమైన దృశ్యం - పెద్ద పెద్ద ఓడలు, నావలు, చిన్న చిన్న పడవలు, తెప్పలు మొదలైనవి బారులు తీరి కనుచూపు మేరదాక కనిపించాయి. గాలికి రెపరెపలాడుతున్న తెరచాపలు, సముద్రాన్ని, ఆకాశాన్ని,

దూరంగా దట్టంగా ఉన్న దీవులను చాల వరకు మరుగు పరుస్తున్నాయి.

పైన చెప్పినట్లు వంది మాగధుల ఘోషతో, ముందు వెనుక కాపలా వీరులు సాగగా, చోళ సామ్రాజ్యపు అతి ప్రసిద్ధుడైన ముఖ్యమంత్రి అనిరుద్ధ బ్రహ్మరాయలు రాజగాంభీర్యంతో ఒక పెద్ద పడవలో వస్తున్నారు. తీరాన గుడి ప్రాకారపు మూలలో జరుగుతున్న వాగ్వివాదాన్ని ఆయన గమనించారు. గుంపు మధ్య చంకలో బడితెతో అతి సాధువులాగ నిలబడివున్న ఆళ్వార్ కట్టియాన్ని చేత్తో సైగ చేసి దగ్గరకు రమ్మన్నారు. ఆళ్వార్ కట్టియాన్ భయభక్తులతో చేతులు కట్టుకొని ముందుకు వచ్చాడు.

"తిరుమలై! ఇదేమి వీధి భాగవతం? " అన్నారు అనిరుద్ధులు.

"గురువుగారూ! అదంతా ఆ కపట నాటక సూత్రధారి కన్నయ్య ఆడించిన నాటకమే/ఆటే! నా కళ్లముందు కనిపిస్తున్న దృశ్యాన్ని నమ్మడమా మానడమా తెలియడం లేదు. నేను చూస్తున్నది కలా, నిజమా? లేక అంతా మాయేనా?..."

"తిరుమలై! నీవు పరమవైష్ణవుడని భావించాను. ఎప్పుడు ప్రపంచాన్ని మిథ్య అనే మాయావాదివైనావు?"

"గురుదేవా! పరమ వైష్ణవ పరంపరలో పుట్టిన తమరు శైవమతాన్ని పాటిస్తున్నప్పుడు నేనెందుకు మాయావాదిని కాకూడదు? నాపేరు మార్చుకొని శ్రీ శంకర భగవత్పాదాచార్యుల అడియార్[2] కట్టియాన్ గా మారిపోతాను..."

"ఆగాగు! నేను శైవమతాన్ని పాటిస్తున్నానని నీకెవరు చెప్పారు?"

"మీ దివ్య శరీరంపైనున్న చిహ్నాలే చెబుతున్నాయి!"

"ఆహా! తిరుమలై! నీవింకా మునుపటిలాగే ఉన్నావే! బాహ్య చిహ్నాలకే ప్రాముఖ్యతనిస్తున్నావే! నుదుట పెట్టుకొనే చందనాన్ని నిలువుగా పెట్టుకొంటేనేమి? అడ్డంగా పెట్టుకొంటేనేమి?"

"గురుదేవా! నేనేమీ ఎరగనివాడిని; ఏది ముఖ్యం, ఏది ముఖ్యం కాదు అని తెలియనివాడిని. మీరే నాకు తెలియజేయాలి/నేర్పాలి."

"అంతా తేటగా తెలియజెబుతాను. నేను విడిది చేసే చోటికి వచ్చి చేరు! అదిగో సముద్రంలో ఒక చిన్న దీవి కనిపిస్తోంది కద? అక్కడున్న మంటపానికి రా!"

"గురుదేవా! ఈ జగడాలమారి శైవులు నన్ను రానివ్వరు కద?" అని చెబుతూ ఆళ్వార్ కట్టియాన్ వారిని చేత్తో చూపించాడు.

అంతవరకు ఊరకున్న వీరశైవులు వెంటనే దగ్గరకొచ్చారు.

"బ్రహ్మదిరాజా! ఈ వైష్ణవుడు మా తలలను పగలగొట్టేస్తాడట. వీడిని తగిన విధంగా

---

2 అడియార్ = దాసుడు

దండించాలి!" అని ఒకాయన ప్రారంభించారు. తక్కినవారు కూడ వెంటడే మాట్లాడనారంభించారు.

"వీడికి తగిన శిక్ష నేను విధిస్తాను. మీరు వెళ్ళవచ్చు!" అన్నారు అనిరుద్ధ బ్రహ్మరాయలు.

అది వారికి తృప్తినివ్వలేదు. "మేమే వీడికి శిక్షనివ్వకూడదా? వీడి ముందరి పిలకను పీకేసి, వీడి ఊర్ధ్వపుండ్రాలను తుడిచేసి, బావిలో మునక వేయించి..." అని ఆవేశంగా మొదలుపెట్టారొకాయన.

"ఏమన్నారు?" అని కళ్లనుంచి నిప్పులు కురిపిస్తూ వారి వైపు తిరిగి చూశాడు ఆళ్వార్ కట్టియాన్.

అనిరుద్ధ బ్రహ్మరాయలు అప్పుడు కలగజేసుకొని, "శివభక్త మణులారా! వీడు చాల మొరటువాడు. వీడిని దండించడం మీవల్ల కాని పని. నేను చూసుకొంటాను" అన్నారు.

తర్వాత తమ వెంట పడవలో వచ్చిన వీరులను చూసి, "మీలో ఎనిమిది మంది కిందకు దిగి వీడిని మన విడిదికి తీసుకురండి!" అన్నారు.

అంతే! మరుక్షణం ఎనిమిదిమంది వీరులు పడవనుంచి గట్టున దూకి, ఆళ్వార్ కట్టియాన్ని చుట్టుముట్టారు.

పడవ ముందుకు సాగింది.

వీరులతోబాటు ఆళ్వార్ కట్టియాన్ కూడ వెళ్లాడు.

భట్టారకులు, తక్కినవారు ఆవైష్ణవుని మొరటుతనాన్ని గురించి రకరకాలుగా మాట్లాడుకొంటూ తలా ఒక దిక్కున వెళ్ళిపోయారు.

~~~
~~~

# అధ్యాయము - 11

## తెరింజకైక్కోళార్ దండు

**రామేశ్వరపు** పెద్దదీవి తర్వాతి చిన్న దీవులలో ఒక దీవిలో ఉన్న ఒక మంటపంలో అనిరుద్ధ బ్రహ్మారాయలు కొలువుదీరివున్నారు. ఆయన తన మంత్రి ఉద్యోగాన్ని నిర్వహించేందుకు కావలసిన సాధనాలు ఆయన చుట్టు అమర్చబడివున్నాయి. గణకులు, తాళపత్రాలు రాసే శ్రీమందిర నాయకులు, కాపలా వీరులు మొదలైనవారు తమతమ స్థానాలలో ఆయత్తమై ఉన్నారు.

అనిరుద్ధులు పడవ దిగి ఆ మంటపం లోపలికి వచ్చి ఆసీనులైన కాసేపటికి తమను చూడవచ్చిన వారిని రప్పించమని ఆజ్ఞాపించారు.

ముందుగా ఐదు మంది వచ్చారు. వారిని చూస్తే లక్ష్మీకటాక్షం కలిగిన వర్తకులలాగ కనిపించారు.

ఒక పళ్ళెంలో నవరత్న మాలనొకదాన్ని ఉంచి సమర్పించారు. దాన్ని అనిరుద్ధ బ్రహ్మారాయలు తీసుకొని గణాచారికిచ్చి, “శెంబియన్ మహాదేవి ఆలయ కైంకర్యానికి రాసిపెట్టండి!” అన్నారు.

తర్వాత వచ్చిన వారిని చూసి, “మీరెవరు?” అని అడిగారు.

“నానాదేశ పదహారు వేల వర్తకుల[3] తరఫున వచ్చాము" అన్నారు వారిలో ఒకరు.

“సంతోషం; పాండ్య దేశంలో మీ వ్యాపారం, వాణిజ్యం సరిగా జరుగుతోంది కద? పాండ్య దేశపు ప్రజలు ఏం మాట్లాడుకొంటున్నారు?”

“పాండ్య వంశపు పరిపాలన కన్న చోళ వంశపు పరిపాలన మేలుగా ఉందని చెప్పుకొంటున్నారు ముఖ్యంగా, యువరాజు అరుళ్మొళి వర్మగారి వీర, దయాళు గుణాన్ని వేనోళ్ళ శ్లాఘిస్తున్నారు. లంకలో జరుగుతున్నదంతా ఇక్కడి ప్రజల మధ్య మాటల్లో వినిపిస్తోంది...”

“దక్షిణ సముద్ర దేశాలలో మీ వాణిజ్యం ఇప్పుడెలా జరుగుతోంది?”

“సుందర చోళ చక్రవర్తి పాలనలో ఏ కొరతా లేదు. గత సంవత్సరం మేము పంపిన ఓడలన్నీ తిరిగి వచ్చాయి. ఒక్కటికూడ పోగొట్టుకోలేదు.”

“సముద్రపు దొంగల బెడదేమీ లేదా?”

“గత సంవత్సరం లేదు. మాణిక్య వార ద్వీపం దగ్గరున్న సముద్రపు దొంగలను మన చోళదేశపు నావికా సైన్యం నాశనం చేసిన తర్వాత దక్షిణ సముద్రంలో ఆ బెడద తొలగిపోయింది.”

---

3 ఈ పొడవైన పేరున్న వర్తకుల కూటమి చోళరాజ్య పాలన కింద దేశ విదేశాలలో, సముద్రాలను దాటి వ్యాపారం చేసేవారు.

"మంచిది. మేము రాసి పంపించిన తాళ పత్ర సందేశం గురించి మీరు ఏమేం ఏర్పాట్లు చేశారు?"

"ఆజ్ఞ ప్రకారం అన్నీ సిద్ధం చేశాము. లంకలో ఉన్న సైన్యానికి పంపేందుకు వెయ్యి బస్తాల బియ్యం, నూరు బస్తాల కంది పప్పు ఈ రామేశ్వానికి తీసుకొని వచ్చి చేర్చాము. లంకకు పంపించేందుకు ఏర్పాట్లు చేయాలి."

"మీ ఓడలలోనే పంపించగలరా?"

"ఆజ్ఞాపిస్తే చేస్తాము. లంకలో యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో తెలుసుకోగోరుతున్నాము."

"ఆహా! అది ఎవరికి తెలుసు? మీ వర్తక సంఘానికి ఒక జ్యోతిష్కుడున్నాడు కద? ఆయననే అడిగి తెలుసుకోండి!"

"బ్రహ్మ రాయా! మా జ్యోతిష్కులు చెప్పేది మేమే నమ్మలేకున్నాము."

"అలా ఆయనేం చెబుతున్నారు?"

"యువరాజు అరుళ్మొళి వర్మ వెళ్ళే దారి పొడుగునా విజయమేనంటున్నారు. ఆయన పాలనలో చోళదేశపు నావికాసైన్యం సముద్రాలకవతల ఉన్న దేశాలనన్నింటినీ జయిస్తుందంటున్నారు. దూరానున్న పలుదేశాలలో పులి జెండా ఎగురుతుందంటున్నారు."

"అలాగైతె మీకు పండగే!"

"అవును; మా సముద్ర వాణిజ్యం ఇంకా వర్ధిల్లుతుందంటున్నారు."

"చాల సంతోషం; శ్రీరంగ నాధుని దయతో అలాగే జరగనీ. లంకలో యుద్ధం జరుగుతున్నంత వరకు మీరు ఇలా నెలకొకసారి పప్పు, బియ్యం పంపుతుండాలి. ఇక మీరు వెళ్ళి రండి!"

"అలాగే చేస్తామ్ ప్రభూ! సెలవు!"

ఆ వర్తక బృందం వెళ్ళిన తర్వాత, ఒక కాపలా వాడు వచ్చి, "తెరింజ (తెరింజ = తెలిసిన) కైక్కోళ్ దండు సేనానాయకులు తమ దర్శనం కోసం వేచివున్నారు" అన్నాడు.

"వారిని లోపలికి రమ్మను" అన్నారు ముఖ్యమంత్రి.

ముగ్గురు గంభీర పురుషులు సభలో అడుగు పెట్టారు. వారి ముఖాలలోను, రూపంలోను వీర లక్ష్మి నెలకొనివుంది. బెదరని ఎద వారిదని చూస్తూనే తెలుస్తూంది.

"సుందర చోళ చక్రవర్తి తెరింజ (=తెలిసిన) కైక్కోళ్[4] సేనా నాయకులే కద?" అని అడిగారు ముఖ్య మంత్రి.

---

4 ఇప్పుడు తమిళనాడులో చేతిమగ్గం నేస్తూ అతికష్టంమీద జీవనం సాగిస్తున్న కైక్కోళార్ తెగ వారు చోళసామ్రాజ్య కాలంలో వీరాధివీరులుగా వెలుగొందేవారు .వారిలో ఏరి ఎంపిక చేసిన మేటి వీరులను చక్రవర్తి తన స్వంత పరివార సైన్యంలో నియమించుకొనేవారు . అందుకే వారికి తెరింజ (=తెలిసిన) కైక్కోళార్ దండు అన్న పేరుండేది. ఎంపిక చేసిన రాజుగారి పేరును కూడ తమ దండు పేరు ముందు చేర్చి చెప్పుకొనేవారు .

"అవునయ్యా! కానీ అలా చెప్పుకోవడానికి సిగ్గుగా వుంది..."

"అదేల?"

"చక్రవర్తి అన్నం తిని ఆరు నెలలుగా ఇక్కడ ఊరకే పడివున్నాము!"

"మీ సైన్యంలో ఎన్ని చేతులు (=శాఖలు)? ఎంతమంది వీరులు?"

"మా సేన మూడు చేతుల/శాఖల సేన. ఈయన ఎడమ చేతి సేనానాయకుడు; ఈయన కుడి చేతి సేనానాయకుడు. నేను మధ్య సేనానాయకుడిని. ఒక్కొక్క శాఖలోను రెండువేల మంది వీరులు. అందరూ తిని నిద్రపోతున్నారు. శూలాలు, ఈటెలు, మా భుజాలు సోమరితనానికి అలవాటు పడిపోతున్నాయి. యుద్ధవిద్యే మరిచిపోయామేమోననిపిస్తోంది."

"మీ కోరిక ఏమి?"

"మమ్మల్ని లంకకు పంపించండి. యువరాజు అరుళ్మొళి వర్మ మాతండ నాయకుడుగా ఉన్న సైన్యంలో చేరి యుద్ధం చేయగోరుతున్నాము."

"అలాగే; తంజావూరుకు వెళ్ళిన వెంటనే చక్రవర్తి సమ్మతి తీసుకొని మీకు తెలియజేస్తాను."

"బ్రహ్మ రాజా! అంతలోపల లంకాయుద్ధం ముగిసిపోతే??"

"ఆ భయం మీకు వద్దు. లంకాయుద్ధం ఇప్పట్లో ముగిసేటట్లు కనిపించడం లేదు."

"ఆ లంక వీరులు అంతటి గట్టివారా? మమ్మల్ని అక్కడికి పంపించండి. మా హస్తలాఘువాన్ని చూపిస్తాము!..."

"ఒక చేయి మాత్రమేమి. మూడు చేతులా చూపించేస్తారు. 'తెరింజ' కైక్కోళ్ దండు యుద్ధరంగంలో దిగితే శత్రువుల గతి అధోగతే! మధ్య శాఖవారు పగవారి మధ్యకు దూసుకు వెళ్ళగా, ఎడమచేతి వీరులు ఎడమవైపు నుంచి, కుడి చేతి వీరులు కుడివైపు నుంచి పిడుగు పడ్డట్లు ముట్టడించి ముగించేస్తారు!"

"అలా ముట్టడించే పాండ్య సైన్యాన్ని, చేరదేశపు సైన్యాన్ని నిర్మూలించాము."

"పాండ్యదేశపు సేన, చేరదేశపు సేన యుద్ధ రంగంలో ఎదురు నిలబడి పోరాడారు. కాబట్టి మీరు వారిని ఎదిరించి పోరాడి ఓడించారు. శత్రువీరులను మీ కళ్ళముందు చూస్తేనే కద వారి అంతు చూడగలరు?"

"రావణుని కాలపు అసురుల్లాగ ఈ కాలపు లంకాసైన్యంవీరులు కూడ మాయావులు కాబోలు! మేఘమండలంలో దాక్కొని యుద్ధం చేస్తున్నారా?"

"నిజంగానే మాయావులై మరుగైపోయారు; కానీ పోరాడడం లేదు. పోరాటానికి దిగితే వారున్న చోటు మనం కనిపెట్టేయవచ్చు కద? లంకాధిపతి మహీంద్రుడు కూడ కనిపించడం లేదు; అతడి సేనాధిపతులు, సైనికులు కూడ ఎక్కడా కనిపించడం లేదు. అడవుల్లోనో, కొండల్లోనో దాక్కొని ఉన్నారేమో

తెలియదు. కాబట్టి ఆరు నెలలుగా లంకలో యుద్ధమే జరగడం లేదు. మిమ్మల్ని కూడ అక్కడికి పంపించి ఏం చేయడం?"

"మహామంత్రీ! మమ్మల్ని లంకకు పంపించి చూడండి! ఆ మహీంద్రుడు, వాడి సేన ఏ అడవుల్లో గాని, కొండల్లో గాని దాక్కొని ఉండనీ. వెతికి పట్టి లాక్కొని వచ్చి యువరాజు అరుళ్మొళి వర్మగారి కాళ్ళ ముందు పడవేస్తాం. అలా చేయక పోతే మా పేరును 'వేళార్ దాసులైన దండు' అని మార్చుకొంటాం!"

"వద్దు, వద్దు! అలా ఇప్పుడేమీ శపథం చేయవద్దు! 'తెరింజ' కైక్కోళార్ దండు వీర ప్రతాపాలు ఈ జంబూ ద్వీపంలో ఎవరికి తెలియదు? తంజావూరు చేరిన వెంటనే చక్రవర్తిని సంప్రదించి, మీకు వారి ఆజ్ఞను తెలియజేస్తాను. అంతవరకూ ఓపిక పట్టండి. పాండ్య దేశంలో శత్రువులను అదుపులో ఉంచి శాంతిని నెలకొల్పండి!"

"మహామంత్రీ! పాండ్యదేశంలో ఇక అణచి పెట్టేందుకు ఇక పగవారెవరూ లేరు. ప్రజలు యుద్ధం ముగిసిందని సంతోషంగా ఉన్నారు. తమ తమ వృత్తులు - వ్యవసాయం, వాణిజ్యం, ఇత్యాది - కొనసాగిస్తూ సుఖంగా ఉన్నారు. పాండ్య రాజు వంశమేమో నాశనమైపోయింది...."

"అలా అనుకోకండి! వీర పాండ్యునితో పాండ్య వంశం ముగిసిపోలేదు. అది పొరబాటు. పాండ్య సింహాసనం కోసం కొంతమంది ఆశపడుతున్నారు. వారికోసం రహస్య పన్నాగాలు పన్నేవారు కూడ ఉన్నారు...."

"ఆహా! ఎక్కడ ఆ కుట్రదారులు? మాకు తెలియజేయండి!"

"సమయం వచ్చినప్పుడు మీకే తెలుస్తుంది. పాండ్యవంశపు పురాతన మణికిరీటం, ఇంద్రుడిచ్చిన రత్నహారం, వైర ఖచిత లాంఛన కరవాలం ఇంకా లంకలో ఎక్కడో ఉన్నాయి. అవి మనకు దొరికే వరకు లంక యుద్ధం ముగిసినట్లు కాదు."

"ఆ ఆభరణాలను దక్కించుకొని రావాలి; యువరాజు అరుళ్మొళి వర్మను మదురై సింహాసనం అధిష్ఠింపజేసి, పాండ్య మణిమకుటాన్ని, పట్టాకత్తిని ధరింపజేసే రోజు రావాలి!"

"ఆఁ! ఇదేమిటిలా చెబుతున్నారు??"

"ప్రజల నోటా, సైన్యవీరుల మనసులో ఉన్న మాటే చెబుతున్నాను."

"అవన్నీ పెద్ద రాజకీయ విషయాలు. మనం మాట్లాడవద్దు. మీకందరికీ సంతోషాన్నిచ్చే ఇంకొక విషయం చెప్పబోతున్నాను...."

"శ్రద్ధాసక్తులతో వింటాము, చెప్పండి మహా మంత్రీ!"

"లంక యుద్ధం తోటి ఈ యుద్ధం ముగిసిపోతుందనుకోకండి. యువరాజు అరుళ్మొళి వర్మ ఇది ముగిసిన తర్వాత దిగ్విజయ యాత్రకు బయలుదేరబోతున్నారు. వేయి ఓడల్లో వీరులనెక్కించుకొని దక్షిణ సముద్రయాత్రకు వెళ్ళబోతున్నారు. మానక్కావరం, మాపప్పాళం, శ్రీవిజయం, శావకం, పుష్పకం, కటారం

మొదలైన దేశాలను ఆ మహా వీరులు గెలుస్తారు. దక్షిణ సముద్రంలోని పేలాది దీవులను కూడ కైవసం చేసుకొంటారు. పశ్చిమాన కేరళం, కుడమలై, కొల్లం మొదలైన దేశాలు ఆయన పాదాక్రాంతమౌతాయి. తర్వాత ఉత్తర దేశ దండయాత్రకు బయలుదేరుతారు. వేంగి, కళింగం, రెట్టైపాడి, చక్రకూటం, అంగ, వంగ, కోసల, విదేహ, కూర్జర, పాంచాల దేశాలమీద దండెత్తుతారు. కావ్యాలలో పేరుప్రఖ్యాతులు గాంచిన కరికాల్ వలవన్ లాగ హిమాలయాల వరకు కూడా వెళ్ళి పులి జెండా నాటుతారు. వీరాధివీర సేనాపతులారా! ఇలా మన దక్షిణదేశపు మాతండ నాయకుడు పథకం వేసివున్నారు. తమిళ దేశంలో వీర రక్తమూ, వజ్ర హృదయమూ కలిగిన వారందరికీ చేతినిండా పనివుంది; తమ తమ వీరప్రతాపాలను చూపే అవకాశం వస్తుంది. కాబట్టి, మీరు, మీ దండు ఓరిమితో వేచివుండాలి!"

సేనాపతులు ముగ్గురూ ఏక కంఠంతో, "సుందర చోళ చక్రవర్తికి వర్ధిల్లాలి! యువరాజు అరుళ్మొళి వర్మ వర్ధిల్లాలి! మహా మంత్రి అనిరుద్ధులు వర్ధిల్లాలి!" అని ఘోషించారు.

తర్వాత వారిలో ఒక సేనాపతి ఇలా అన్నారు: "మహామంత్రీ! ఇంకా ఒకే ఒక్క విన్నపం చేయగోరుతున్నాము. మా దండు పేరు 'సుందర చోళ చక్రవర్తి 'తెరింజ కైక్కోళార్ దండు' అన్నది మీరెరిగినదే."

"తెలిసిన విషయమే."

"సుందర చోళ చక్రవర్తి సేవలో ప్రాణాలు విడిచేందుకు సిద్ధమని శత్రువుల రక్తంతో తడిసిన చేత్తో ప్రమాణం చేసిన వారం."

"అదికూడ నేనెరుగుదును."

"కాబట్టి మేము చక్రవర్తికి తప్ప ఇంకెవ్వరికీ చెందిన వారం కాము; ఇంకెవ్వరు చెప్పింది కూడ మేము వినం."

"మీనుంచి నేనెదురు చూసింది కూడ అదే!"

"ఒకప్పుడు పళువేట్టరయ్యర్ మహాసైన్యంలో ఒక భాగంగా ఉండే వారం. అందుగురించి ఎవరికీ మామీద ఎలాంటి సందేహమూ కలగకూడదు...."

"ఆహా! ఇదేం మాట? ఎవరికి ఏం సందేహం?"

"తంజావూరులో జరుగుతున్న సంఘటనల గురించి ఏవేవో వదంతులు గాలిలో తేలివస్తున్నాయి."

"గాలిలో వచ్చే వదంతులు గాలితోనే పోనీ; మీరు వాటిని నమ్మనూ వద్దు; మళ్ళీ చెప్పనూ వద్దు."

"కొడుంబాళూర్ వేళార్లు మా గురించి ఏవైనా సందేహాలు పుట్టించవచ్చు..."

"పుట్టించరు; పుట్టించినా వాటిని ఎవరూ పట్టించుకోరు."

“మానవ దేహం అనిత్యమైనది...”

“కానీ శుద్ధ వీరులకు ప్రాణభయం ఉండదు, ఉండకూడదు.”

“”త్రిభువన చక్రవర్తి కూడ ఒక రోజు...”

“దేవుని పాదాల చెంతకు చేరవలసిందే.”

“చక్రవర్తికేమో ఆరోగ్యం సరి లేదు...”

“ఆకాశంలో తోకచుక్క అగుపిస్తోంది.”

“చక్రవర్తికి అలా ఏదైన జరగకూడనిది జరిగితే, మా దండు వీరులు యువరాజు అరుళ్మొళి వర్మగారి స్వంత పరివార దండుగా ఉండగోరుతున్నారు!”

“చక్రవర్తి ఆజ్ఞను పాటించడం మీ ధర్మం, బాధ్యత.”

“చక్రవర్తి ఆజ్ఞను మాకు తెలియజేయడం మీ బాధ్యత. మీరు ఆ బాధ్యతను నెరవేర్చండి. లేక, తంజావూరుకు వెళ్ళి చక్రవర్తిని దర్శింప అనుమతినివ్వండి!...”

“వద్దు; మీరు తంజావూరుకు వెళ్ళడం ఉచితం కాదు; అనవసరంగా సంక్షోభం ఏర్పడుతుంది. చక్రవర్తిని దర్శించి మీ కోరికను వారికి తెలియజేసే బాధ్యతను నేనే తీసుకొంటాను. మీరు నెమ్మదిగా ఉండండి!”

“మీకు తెలియజేసిన వెంటనే మా మనసులోని భారం దిగిపోయింది! ఇక మేము వెళ్ళి వస్తాము!”

ఆ ముగ్గురు సేనా నాయకులు సెలవు తీసుకొని నిష్క్రమించారు.

అనిరుద్ధ బ్రహ్మ రాయలు, “ఆహా! పొన్నియిన్ సెల్వన్ వద్ద ఏం ఆకర్షణ శక్తి ఉందో కద! ఒక్కసారి చూసినవారు కూడ మతిపోగొట్టుకొంటున్నారు!” అని తనలో తాననుకొన్నారు.

తర్వాత ప్రకాశంగా, “ఎవరక్కడ? ఆ మొరటు వైష్ణవుడినిలా తీసుకురండి!” అని ఆజ్ఞాపించారు.

~~~
~~~

# అధ్యాయము - 12

## "గురువు - శిష్యుడు"

**ఈ** సందర్భాన తమిళనాడు చరిత్ర పరిశోధనకు సంబంధించిన ఒక విషయాన్ని పాఠకులకు తెలియజేయగోరుతున్నాము.

తిరుచ్చిరాపల్లి జిల్లా లాల్గుడి తాలూకాలో 'అణ్బిల్' అనే ఒక గ్రామం ఉంది. దాన్ని ఉత్తరదేశస్థులు 'ప్రేమపురి' అని పిలిచేవారు. ఇప్పటికి సుమారు 45 సంవత్సరాలకు మునుపు (అంటే కల్కి ఈ కథను 1950's లో రాసినప్పటికి సుమారు 45 సంవత్సరాలకు మునుపు) ఈ గ్రామంలోని ఒక మోతుబరి తమ పాత ఇంటిని పడగొట్టి కొత్త ఇంటిని కట్టించేందుకు పునాదులు తవ్వించారు. అప్పుడు భూగర్భం నుంచి  ఒక విచిత్రమైన వస్తువు బయట పడింది - అది ఒక తామ్ర పత్రాల పుస్తకం. వాటిని కొన్నాళ్ళు తమ వద్దనే పెట్టుకొన్నారు. తర్వాత ఆ ఊరి కోవెలను పునరుద్ధరించి కైంకర్యం చేయదలిచి, ఆ ఊరికి వచ్చిన శ్రీ ఆర్. ఎల్. ఎన్. లక్ష్మణ చెట్టియార్ అనే ఆయనకు ఆ తామ్ర పత్రాలను అప్పజెప్పారు. ఆయన వాటిని పరిశీలించి, అవి పురాతన చరిత్రకు చెందినవి కావచ్చని ఊహించి, వాటిని తీసుకొని వెళ్ళి మహామహోపాధ్యాయ స్వామినాథ అయ్యర్ గారికి ఇచ్చారు. అయ్యర్ వాటిని చూసిన వెంటనే వాటిలో అతి ముఖ్యమైన వివరాలు ఉన్నాయని గ్రహించి, ఆ రోజుల్లో శిలా శాసనాలను పరిశోధిస్తున్న శ్రీ టి.ఏ. గోపీనాథ రావ్, M.A. అన్న పరిశోధకులకు ఆ తామ్ర పత్రాలను చేర్చారు. శ్రీ గోపీనాథ రావ్ వాటిని చూడగానే ఒక అద్భుతమైన నిధి దొరికినట్లు సంతోషపడ్డారు. ఎందుకంటే ఆ తామ్ర పత్రాలలో చోళ వంశం గురించిన ముఖ్యమైన వివరాలన్నీ రాయబడివున్నాయి.

సుందర చోళ చక్రవర్తి అధికారానికి వచ్చిన తర్వాత నాలుగవ సంవత్సరంలో తమ మాన్య ముఖ్యమంత్రి అణ్బిల్ అనిరుద్ధ బ్రహ్మరాయలకు  రాసి ఇచ్చిన పది ఎకరాల భూమి (మాన్యం) గురించి ఈ తామ్రపత్రాలలో రాయబడివుంది. ఆ భూశాసనాన్ని రాసిన మాధవ భట్టు అన్నాయన సుందర చోళ చక్రవర్తి వంశ పరంపర గురించి సుందర చోళ చక్రవర్తి వరకు ఆ తామ్ర శాసనాలలో రాశారు. ఇంకా, అనిరుద్ధ బ్రహ్మ రాయలు, ఆయన తలిదండ్రులు, తాత ముత్తాతలు శ్రీ రంగనాథ అలయంలో చేసిన సేవలను గురించి కూడ రాశారు.

ఇంతకు మునుపు వెలికి తీయబడిన ఆనై మంగలం తామ్రపత్రాలు, తిరువాలంగాడు తామ్రపత్రాలు - మొదలైన వాటిలో వివరించబడిన చోళ వంశావళి ఇప్పుడు అణ్బిల్ తామ్రపత్రాలలోని వివరాలకు చాలవరకు పోల్చదగినవిగా ఉన్నాయి. కాబట్టి ఆ తామ్రపత్రాలలో రాయబడిన వివరాలు చరిత్రపూర్వకంగా నిజమేనని నిర్ధారమైంది. అంతేగాక, తక్కిన రెండు తామ్రపత్ర పుస్తకాల కన్న ఈ అణ్బిల్

తామ్రపత్రాలలో మరిన్ని వివరాలు ఉండడం వల్ల "అణ్బిల్ తామ్ర పత్రాలు" తమిళనాడు చరిత్ర పరిశోధనలో చాల ప్రసిద్ధి చెందాయి.

కాబట్టి అనిరుద్ధ బ్రహ్మారాయలనేవారు చారిత్రక తామ్రపత్రాలలో ప్రసిద్ధిగాంచిన చోళ సామ్రాజ్యపు ముఖ్య మంత్రి అన్న విషయాన్ని మనసులో ఉంచుకొని ఇక ముందు వచ్చే కథను చదవమని పాఠకులకు విన్నపం.

~

మాన్య ముఖ్య మంత్రి అనిరుద్ధ బ్రహ్మారాయలు కొలువుదీరి ఉన్న మంటపంలో ఆళ్వార్ కట్టియాన్ ప్రవేశించాడు. ఆయనను మూడు సార్లు చుట్టి వచ్చాడు. తర్వాత సాష్టాంగ నమస్కారం చేసి నిలబడ్డాడు.

"ఓం హరాం క్రీం, వషట్టు!" అని పెద్దగా ఉచ్చరించి, "గురుదేవా! సెలవివ్వండి!" అన్నాడు.

అనిరుద్ధులు చిరునవ్వుతో, "తిరుమలై! ఏమిటిలా నామీద పెద్ద బండను వేస్తున్నావు? ఎందుకు నన్ను సెలవివ్వమని అడుగుతున్నావు?" అన్నారు.

"ఈ దాసుడు అవలంబించిన 'శ్రీ వైష్ణవ సంప్రదాయాన్ని, 'ఆళ్వార్ కట్టియాన్' అన్న పేరును మీకు కైంకర్యం చేసే భాగ్యాన్ని ఈ మహాసముద్రంలో అర్పించేసి, వీరశైవ కాళాముఖ సంప్రదాయాన్ని చేబట్టబోతున్నాను. చేత ఒక కపాలం పట్టుకొని, 'ఓం హ్రీం క్రీం వషట్టు!' అన్న మహామంత్రాన్ని జపిస్తూ ఊరూరా తిరుగుతాను! తలపైన జటా మకుటం, ముఖం మీద పొడపైన గడ్డాన్ని పెంచుకొని, ఎదురొచ్చిన వీరవైష్ణవుల బుర్రలు ఈ బడితెతో బద్దలు కొడతాను!..."

"అయ్యా! ఆగాగు! నా బుర్రకు కూడ అదే గతేనా?"

"గురుదేవా! మీరు ఇంకా శ్రీవైష్ణవ సంప్రదాయాన్ని పాటిస్తున్నారా?"

"తిరుమలై! అందుగురించి నీకేల సందేహం? నన్నెవరనుకొన్నావు?"

"మీరెవరు? ఆ విషయంలోనే నాకు సందేహం వచ్చేసింది. రెండు నదుల మధ్య ప్రతిష్ఠించబడి, సకల భువనాలను కాపాడే శ్రీ రంగనాథుని సేవే జీవన పరమార్థమని ఎంచిన అణ్బిల్ అనంతాళ్వార్ స్వాముల మునిమనమలు మీరే కద?..."

"అవునయ్యా! నేనే!"

"శ్రీమన్నారాయణుని నామ మహిమను ప్రపంచానికి వేనోళ్ళ చాటి చెప్పిన అణ్బిల్ అనిరుద్ధ భట్టాచార్యుల మనుమలు మీరే కద?"

"అవును! నేనే! ఆ మహానుభావుని పేరే నాకు కూడ పెట్టారు!"

"ఆళ్వారుల తేనెలొలికే మధుర కీర్తనలను పాడి, భక్త కోటిని పరవశింపజేసిన నారాయణ భట్టాచార్యుల సాక్షాత్ ప్రథమ పుత్రులు మీరే కద?"

"అవునయ్యా! అవును!"

"శ్రీరంగనాథుడు నెలకొన్న పొణ్ణరంగ దేవాలయంలో ప్రతి దినం నంద దీపం వెలిగించి యాత్రికులకు వెండి పళ్ళాలలో అన్నం వడ్డించి సేవ చేసిన మహిళామణి సుపుత్రులు కూడ మీరే కద?"

"సందేహమే లేదు!"

"అలాగైతే నాకళ్ళు నన్ను మోసం చేస్తున్నాయా? నా కళ్ల ముందు నేను చూస్తున్నది అబద్ధమా? నా రెండు చెవులతో నేను వింటున్నది కూడ అబద్ధమా?"

"ఏం చెబుతున్నావోయీ! నీ కళ్లమీద, చెవులమీద సందేహం పుట్టేటట్లు ఏం జరిగిందిప్పుడు?"

"తమరు ఈ ఊరి శివాలయానికి వెళ్ళి అభిషేకం చేయించారని నా చెవులారా విన్నాను."

"అది నిజమే! నీ చెవులు నిన్ను మోసం చేయలేదు."

"తమరు శివాలయానికి వెళ్ళి వచ్చినందుకు ఆనవాళ్ళు తమ దివ్య దేహంమీద నా కళ్ళకు కనిపించడం కూడ నిజమే కాబోలు!"

"అది కూడ నిజమే!"

"ఈ కలియుగంలో శ్రీమన్నారాయణుడే దైవమని, ఆళ్వార్ పాశురాలే వేదమని, హరినామ సంకీర్తనమే మోక్షానికి మార్గమని నాకు నేర్పించిన గురుదేవులు మీరే కద?"

"అవును; అందుకేమిప్పుడు?"

"గురుదేవులైన మీరే చెప్పేదొకటి, చేసేదొకటైతే, శిష్యుడనైన నేనేం చేయాలి?"

"తిరుమలై! నేను శివాలయానికి వెళ్ళి దర్శనం చేసుకొని వచ్చిన విషయం గురించే కద చెబుతున్నావు?"

"గురుదేవా! అక్కడ ఏ దేవుని దర్శించారు?"

"సందేహమేల? నారాయణమూర్తినే!"

"రామేశ్వర దేవాలయంలో లింగరూపంలో ఉన్నాడని కద విన్నాను? అందుకే కద ఇక్కడి వీరశైవ భట్టారకులందరు నన్ను చుట్టుముట్టారు?"

"అబ్బాయ్! శ్రీనగరిలో అవతరించిన మన శఠగోపస్వామి భక్తుడవనే కద నీవు నామం ధరిస్తున్నావు? అది నిజమే కద?"

"అందులో సందేహమేమి?"

"నమ్మాళ్వార్ చల్లని వాక్కులను కాస్త గుర్తు తెచ్చుకో. నీవు మరిచిపోయివుంటే నేనే చెబుతాను విను:

<< లింగాన్ని ప్రతిష్ఠించిన్ పౌరాణికులు, జైనులు, శాక్యులు, .... >>

ఇలా శఠగోపాచార్యులే అన్నప్పుడు శివలింగంలో నేను నారాయణుని దర్శించడం తప్పా?"

"ఆహా! శఠగోపుల వాక్కే వాక్కు! లింగాన్ని పూజించే వారిని జైనులతోను, శాక్యులతోను చేర్చేసి పక్కకు తోసేశారు, చూడండి!"

"అబ్బాయ్! నీ తర్క బుద్ధి నిన్ను వదిలి ఎప్పుడు పోతుందో తెలియదు. మన శఠగోపాచార్యులు ఇంకా ఏం చెప్పారో విను:

<< పంచ భూతాలై, సముద్రమై, శివుడై ,,,>>

ఉన్నవాడు శ్రీమన్నారాయణ మూర్తే అని నోరారా చెప్పారు. ఇంకా విను, తిరుమలై! విని నీ సందేహాలను తుడిచేసుకో!

<< ఆ మధుర పాశురాన్ని అనువదించవలసి ఉంది >>

విన్నావా, తిరుమలై! 'ముక్కంటి'ని మన శఠగోపాచార్యులు పిలిచి తమ తలపైన ఆసీనుడు కమ్మని ప్రార్థిస్తున్నారు! నీవేమో నేను శివాలయానికి వెళ్ళినందుకే ఆక్షేపిస్తున్నావు!..."

"గురుదేవా! మన్నించాలి; నా అపచారాన్ని క్షమించాలి! నమ్మాళ్వార్ పాశురాలనన్నింటినీ తెలుసుకోనందువల్ల  అనవసరమైన జగడాలలో తల దూరుస్తున్నాను. తమరిని కూడ సందేహించాను. ఇక నాకు ఒక వరాన్నిచ్చి అనుగ్రహించండి."

"ఏం వరం కావాలో చెబితే ఇవ్వగలనో లేనో ఆలోచించవచ్చు."

"తిరుక్కురునూర్ వెళ్ళి అక్కడే ఉండిపోదామనుకొంటున్నాను. మన శఠగోపాచార్యుల వేయి పాశురాలను సేకరించి, తర్వాత ఊరూరా వెళ్ళి ఆ పాటలను పాడాలనుకొంటున్నాను..."

"ఆ ఆశ నీకెందుకు పుట్టింది?"

"ఉత్తర వేంగి నుంచి తిరిగి వచ్చేటప్పుడు వీరనారాయణ పురపు పెరుమాళ్ల కోవెలలో కొన్ని పాశురాలను పాడాను. అది విని ఆ సన్నిధిలో నిత్య కైంకర్యం చేసే ఈశ్వర భట్టు అనే ఒక పెద్దాయన ఆనంద బాష్పాలు రాల్చారు..."

"ఈశ్వర భట్టు మహాభక్తుడు; మంచి శిష్టాచార సంపన్నుడు."

"ఆయన బాలకుమారుడు ఆయన పక్కనే నిలబడి నా పాటలను విన్నాడు. ఆ బాలకుని పాలుగారే ముఖం పాశురాలను విని పూర్ణచంద్రుని లాగ ప్రకాశించింది. 'మిగిలిన పాటలు కూడ తెలుసా?' ఆ చిన్నారి అమాయకంగ అడిగాడు. 'తెలియదు' అని చెప్పేందుకు నాకు సిగ్గేసింది. ఆళ్వార్ల సేవకే ఎందుకు నా ఈ జీవితాన్ని అంకితం చేయకూడదు అనిపించింది. నేడా అభిప్రాయం దృఢపడింది..."

"తిరుమలై! అందరూ తమ తమ స్వధర్మాలను పాటించాలని గీతాచార్యులు చెప్పారని నీకు తెలుసు కద?"

"అవును, గురుదేవా!"

"అళ్వార్ల పాశురాలను సేకరించడానికి, ప్రచారం చేయడానికి ఎందరో మహానుభావులు

అవతరిస్తారు. అలాగే ఆళ్వార్ల పాటలలోని దేవసారాంశతత్వాలను వివరించి ఉత్తర భాషల మూలంగా పలు విదేశాలలో నెలకొల్పే అవతార మూర్తులు కూడ జన్మిస్తారు. నీవు, నేను రాజ్య సేవను స్వధర్మంగా స్వీకరించిన వారము. చోళ చక్రవర్తి సేవకు మన సర్వస్వాన్ని (తను, మన, ప్రాణాలను) అర్పిస్తామని ప్రమాణం చేసిన విషయన్ని మరిచిపోయావా?..."

"లేదు, గురుదేవా! కానీ అది ఉచితమా అని ఒక సందేహమేర్పడి నా మనసును బాధిస్తోంది. ముఖ్యంగా తమ గురించి కొన్ని చోట్ల ప్రజలు మాట్లాడుకోవడం వింటే..."

"ఏం మాట్లాడుకొంటున్నారు?"

"తమకు చక్రవర్తి పది ఎకరాల భూమి మాన్యంగా రాసిచ్చినందువల్ల మీరు వైష్ణవ సంప్రదాయాన్ని విడిచిపెట్టేశారని చెప్పుకొంటున్నారు. జాతి ధర్మాన్ని ఉల్లంఘించి ఓడ ప్రయాణం చేసినట్లు కూడ చెబుతున్నారు...."

"ఆ అసూయాపరులు చెప్పేది నీవు పట్టించుకోకు. మన జాతి వారు కూపస్థ మండూకాలుగా ఉండాలని వారి అభిప్రాయం. చక్రవర్తి నాకు పది ఎకరాలు మాన్యంగా ఇచ్చింది నిజమే. దాన్ని తామ్ర శాసనాలలో రాసి ఇచ్చారు. కానీ అంతకు నాలుగు సంవత్సరాలకు మునుపే నేను చక్రవర్తికి ముఖ్య మంత్రినయ్యానని నీకు తెలుసు కద?"

ఆళ్వార్ కట్టియాన్ మౌనందాల్చాడు.

"చక్రవర్తికి, నాకు ఎప్పుడు స్నేహమయ్యిందన్న విషయమైన నీకు తెలుసా? మేమిద్దరం చిన్నప్పుడు ఒకే ఆచార్యుల వద్ద చదివాము. తమిళం, ఉత్తర దేశభాష కూడ నేర్చాము. గణితం, ఖగోళ శాస్త్రం, తర్కం, వ్యాకరణం అన్నీ చదివి నేర్చుకొన్నాము. అప్పుడల్లా సుందర చోళులు సింహాసనమెక్కబోతున్నారని ఎవరూ ఊహించలేదు. ఆయన గాని, నేను గాని అందు గురించి ఆలోచించను కూడ లేదు. రాజాదిత్యులు, గండరాదిత్యులు పరమపదించి అరింజయులు పట్టానికి వస్తారని ఎవరూహించారు? అరింజయులకు అంత చిన్న వయసులో దుర్మరణం సంభవించి సుందర చోళులు పట్టానికి వస్తారని ఎవరు కలగన్నారు? సుందర చోళులు సింహాసనమెక్కితే అందువల్ల చాల చిక్కులు ఎదురౌతాయని ఆయన అనుకొన్నారు. నేను తోడుండి సహాయం చేస్తే సింహాసనమెక్కుతానని, లేకపోతే లేదని అన్నారు. రాజ్య నిర్వహణలో ఆయనకు సహాయం చేస్తానని అప్పుడు మాటిచ్చాను. ఆమాటను ఇప్పటికీ నిలబెట్టుకొంటున్నాను. ఇదంతా నీకు తెలియదా, తిరుమలై?"

"తెలుసు, గురుదేవా! నాకొక్కడికి తెలిసి ఏం ప్రయోజనం? ప్రజలకు తెలియదు కద? పల్లెల్లోను, పట్టణాలలోను పుకార్లు పుట్టించేవారికిది తెలియదు కద?"

"పనికి రాని మాటలు [வம்பு] మాట్లాడేవారి మాటలను నీవు పట్టించుకోకు. నీవందుగురించి దిగులు పడకు. వంశపారంపర్యంగా వస్తున్న ఆచార్య వృత్తిని వదిలేసి ఈ రాజ సేవలో దిగినందు గురించి

నేనే ఒకప్పుడు ఆత్మక్షోభకు గురయ్యాను. కానీ గత రెండు రోజుల్లో నాకటువంటి ధర్మ సందేహం కించిత్తు కూడ కలగలేదు. తిరుమలై! నేను రామేశ్వరంలోని గుడిని చూసేందుకు రాలేదని, మామిడి తోపుకు వెళ్ళేందుకే ఇక్కడికి వచ్చానని నీకు తెలుసు కద?"

"అలాగనే నేనూహించుకొన్నాను, గురుదేవా!"

"నీవూహించింది నిజమే. ఆకాలంలో సుందరమూర్తి చూసి, పరవశించి వర్ణించినట్లుగానే పాలాడి నదీతీరంలో మామిడి తోపుంది.

"అంత అద్భుతంగా వర్ణించిన మామిడి తోపును ఆయన చూడకనే వర్ణించ సాధ్యమా? ఈ రామేశ్వర ద్వీపం నుంచే నిక్కి చూసి ఆ మామిడి తోపును వర్ణించారంటున్నారు కొందరు కూపస్థ మండూక పండితులు. అలాంటివారు చెప్పేవి నీవు పట్టించుకోకు..."

"స్వామీ! మామిడితోపులోని ప్రకృతి అందాలను చూసి పరవశించేందుకా మీరా క్షేత్రానికి వెళ్ళి వచ్చారు?"

"లేదు; నిన్నక్కడికి పంపించే ఉద్దేశం ఉండడం వల్ల దాని గురించి కూడ నీకు చెప్పాను. నేను వెళ్ళింది యువరాజు అరుళ్మొళి వర్మను చూసేందుకు...."

"యువరాజును చూశారా, గురుదేవా?" అని ఆళ్వార్ కట్టియాన్ అడిగాడు. అతడి గొంతులో ఇప్పుడిప్పుడే కాస్త ఉత్సాహమూ, కుతూహలం కాన రాసాగాయి.

"ఆహా! నీకు కూడ యువరాజును గురించి వినాలన్న ఆశ పుట్టుకొచ్చేసింది కద? తిరుమలై! అవును, నేను యువరాజును చూశాను; లంక నుంచి విన వస్తున్న విచిత్రమైన సమాచారాలు ఎంత వరకు నిజమన్నది స్వయంగా చూసి తెలుసుకొన్నాను. తిరుమలై! లంకాధిపతి మహీంద్రున వద్ద ఒక పెద్ద సైన్యముండేది. ఆ సైన్యం ఇప్పుడు లేనే లేదు. ఆ సైన్యం ఇప్పుడేమైందో తెలుసా? సూర్య కిరణాలు సోకి ఆవిరైన మంచు బిందువుల్లాగ ఆవిరైపోయింది! అతడి సైన్యంలో పాండ్య దేశంనుంచి, చేర దేశం నుంచి వచ్చి చేరిన వీరులు చాల మంది ఉండేవారు. వారందరూ మన యువరాజు సైన్యాధిపత్యం వహిస్తున్నారని వినగానే ఆయుధాలను కింద పడేశారు. ఒకరిని చూసి ఇంకొకరన్నట్లు అందరూ వచ్చి మన సైన్యంలో చేరిపోయారు! మహీంద్రుడు ఎలా యుద్ధం చేస్తాడు? పారిపోనే పోయాడు. పర్వత ప్రదేశమైన రోహణంలో వెళ్ళి దాక్కొన్నాడు. కాబట్టి అక్కడ మన వీరులు యుద్ధం చేసేందుకు శత్రువులే లేరు!"

"మరైతే మన యువరాజు సైన్యంతో బాటు తిరిగి వచ్చేయడమే కద? ఇంకా అక్కడుండడమెందుకు? మన వీరులకు ఆహారధాన్యాలు పంపించే రగడంతా ఎందుకు?"

"శత్రువులు లేరని చెప్పి వెనుదిరగవచ్చు. కానీ యువరాజుకది ఇష్టం లేదు. నాకుకూడ అందులో నమ్మకం లెదు. యువరాజు సైన్యంతో ఇటు తిరగగానే అటు మహీంద్రుడు గుహనుంచి బయటకు వచ్చి యుద్ధం మొదలెడతాడు. దానివల్ల ప్రయోజనమేమి? ఒకటి, లంక రాజు, ప్రజలు మనకు

స్నేహితులు కావాలి. లేదా మన పులిజెండా అక్కడ నిరంతరంగా ఎగిరేటట్లు నెలకొల్పాలి. యువరాజు ఈ రెండు ప్రయత్నాల్లోను నిమగ్నమైవున్నారు. లంకలో మనవీరులిప్పుడేం చేస్తున్నారో తెలుసా? పాత యుద్ధంలో అనురాధపురం పూర్తిగా నాశనమైపోయింది. అక్కడి పురాతన బౌద్ధ విహారాలు, గుళ్ళు, గోపురాలు - అన్నీ విరిగి పడివున్నాయి. యువరాజు ఆజ్ఞ ప్రకారం ఆ కట్టడాలన్నిటినీ పునర్నిర్మిస్తున్నారు!"

"బాగుంది, బాగుంది! శైవము, వైష్ణవము రెండింటినీ వదిలేసి యువరాజు ఒక వేళ శాక్య వంశంలో చేరిపోయారో, ఏమో! దాన్ని కూడ మీరామోదిస్తారా?"

"నేను, నీవు ఆమోదించినా ఒకటే, లేకపోయినా ఒకటే. మనలాంటి వాళ్ళు మనమతమే గొప్పదని పోట్లాడుతుండవచ్చు; కానీ ఒక రాజ్యాన్ని ఏలే రాజు తన ప్రజలు అనుసరించే మతాలన్నిటినీ ఆదరించి పరామర్శించాలి. ఈ నిజాన్ని ఎవరి ప్రేరేపణ / ఉద్బోధన లేకనే యువరాజు తానే గ్రహించారు. సందర్భం చిక్కగానే చేసి చూపించారు!

"తిరుమలై! ఇది కూడ విను! మన యువరాజు అరచేతిలో శంఖ చక్రాలున్నాయని నీవు వినే ఉంటావు. కానీ ఆయన చేతులను చాచి చూపమని నేనెప్పుడూ అడగలేదు. శంఖ చక్ర రేఖలు ఉండనీ, లేకపోనీ - ఒకటి నిశ్చయంగా చెబుతున్నాను. ఈ భూమండలాన్ని ఏకఛత్రాధిపతిగా ఏలేవారొకరుంటే అది మన యువరాజు అరుళ్మొళి వర్మ ఒక్కరే. పుట్టుకతోనే అటువంటి దైవ కటాక్షంతో కొందరు పుడతారు. కాసేపటికి మునుపు కొందరు వర్తక పెద్దలు, కైక్కోళ్ సేనాధిపతులు వచ్చి నాతో మాట్లాడారు, విన్నావు కద? యువరాజు కోసమంటే మన వర్తకులు - ధనమే పరమార్థంగ ఎంచి బతికేవారు - ఎంత ధారాళంగా ఇస్తున్నారు చూశావా? కొన్ని రోజులకు మునుపు పొదిగై కొండ శిఖరాన ఒక తపోయోగిని చూశాను. ఆయన జ్ఞాన నేత్రంగల మహానుభావుడు. ఆయన ఏమన్నాడో తెలుసా? 'పులికి మల్లే, పిల్లికి కూడ ఒక రోజు వస్తుంది. ఇప్పుడు దక్షిణ నాడు ఉచ్ఛ స్థాయిని చేరుకొనే సమయం వచ్చింది. చాల కాలంగా ఈ పుణ్య మహాభారత భూమిలో మహా చక్రవర్తులు, వీరాధివీరులు, మహా జ్ఞానులు, మహా కవులు ఉత్తర నాడులోనే జన్మిస్తూ వస్తున్నారు. కానీ ఉత్తర భారతానికి త్వరలో దుర్గతి పట్టబోతోంది. హిమాలయాలకు అవతలినుంచి ఒక మొరటు జాతివారు దండెత్తి వచ్చి, ఉత్తర భారతాన్ని ఛిన్నాభిన్నం చేస్తారు. దేవాలయాలను, విగ్రహాలను విరగగొట్టి నాశనం చేస్తారు. సనాతన ధర్మానికి పెద్ద ఆపద కలగబోతోంది. అప్పుడు మన ధర్మం, వేదశాస్త్రాలు, గుళ్ళు, సంప్రదాయాలు - అన్నిటినీ మన దక్షిణ దేశమే కాపాడబోతోంది. వీరాధివీరులైన చక్రవర్తులు ఈ దక్షిణ దేశంలో ఉదయించి నలుదిక్కులా తమ సామ్రాజ్యాన్ని విస్తరిస్తారు. మహాజ్ఞానులు, పండితోత్తములు, భక్త శిరోమణులు ఈ దక్షిణ దేశంలో జన్మిస్తారు!' అని ఆ పొదిగై పర్వత శివ యోగి చెప్పారు. ఆ యోగి దూర దృష్టి నిజమవుతుందని ఇప్పుడు నాకు నమ్మకం పుడుతోంది, తిరుమలై!"

“స్వామీ! మీరేమేమో గాలిమేడలు కడుతున్నారు. కానీ అక్కడ రాజ్యం పునాదులనే పెకలించి నాశనం చేయజూస్తున్నారు. గురుదేవా! నేను చూసిందంతా మీరూ చూసి, నేను విన్నదంతా మీరూ వినివుంటే ఇంత కుతూహలంతో ఉండరు. ఈ చోళ సామ్రాజ్యానికి రాబోయే ప్రమాదాన్ని తెలుచుకొని కలతబారిపోతారు...”

“తిరుమలై! అవును, నేనూ మరిచేపోయాను. అత్యుత్సాహం నా ఎరుకను కప్పేసింది. నీవు నీ ప్రయాణంలో తెలుసుకొన్న విషయాలను ఇంకా విననే లేదు. చెప్పు, వింటాను. ఎంతటి భయంకరమైన వార్తలైనా జంకకుండ చెప్పు, వింటాను!”

“స్వామీ! ఇక్కడ చెప్పమని ఆజ్ఞాపిస్తున్నారా? ఆ వార్తలు వింటే వాయుభగవానుడే వణికిపోతాడు! సముద్ర రాజు స్తంభించిపోతాడు! పక్షులు వింటే,ఎగిరే శక్తిని కోల్పోయి కింద పడిపోతాయి! ఆకాశవాణి, భూదేవి కూడ అవాక్కైపోతారు. అటువంటి వార్తలను ఇలా బహిరంగంగా చెప్పమని ఆజ్ఞాపిస్తున్నారా?”

“అలాగైతే నాతో రా! గాలి చొరని పాతాళ గుహ ఒకటి ఈ దీవిలో ఉంది. అక్కడికి వచ్చి వివరంగా చెప్పు!” అన్నారు అనిరుద్ధ బ్రహ్మరాయలు.

~~~
~~~

# అధ్యాయము - 13

## "పొన్నియిన్ సెల్వన్"

**వంతిదేవుడు** నాగద్వీపంలో ఒక మూల దిగి మామిడితోపు వైపు నడిచి వెళుతున్న అదే సమయంలో, అనిరుద్ధులు ఆళ్వార్ కట్టియాన్ రాజ్య పరిస్థితి గురించి వివాదించుకొంటున్న అదే సమయంలో, కుందవై, కొడుంబాళూర్ రాకుమారి వాణతి అంబారి అమర్చిన ఏనుగుమీద తంజావూరును సమీపిస్తున్నారు.

యువరాకుమారి కొంతకాలంగా తంజావూరుకు వెళ్ళకూడదని నిశ్చయించుకొని, పళైయారైలోనే ఉంటూవచ్చింది. అందుకు పలు కారణాలున్నాయి - తంజావూరులో అంతఃపుర స్త్రీలు విడిగా నివసించేందుకు కావలసినన్ని అంతఃపురాలు ఇంకా నిర్మించబడలేదు. చక్రవర్తి ప్రధాన అంతఃపురంలోనే అందరు స్త్రీలు కూడ ఉండాలి. తక్కిన అంతఃపురాలను పళువేట్టరయ్యర్లు, తక్కిన అధికారులు ఆక్రమించేసుకొన్నారు. పళైయారైలో అంతఃపుర స్త్రీలు స్వేచ్ఛగా ఉండగలిగేవారు. తమ ఇష్టం వచ్చినట్లు బయటకు వెళ్ళవచ్చు, తిరిగి రావచ్చు. కానీ, తంజావూరులో పళువేట్టరయ్యర్ల కట్టుబాట్లకు లొంగి ఉండాలి. అటువంటి కట్టుబాట్లు, నిబంధనలు యువరాకుమారికి ఇష్టం లేదు. అంతేగాక, పళువూర్ యువరాణి నందిని దర్పం, అహంభావ ప్రవర్తన కుందవైకి విసుగును, కోపాన్ని పుట్టించాయి. అంతఃపుర స్త్రీలు పళైయారైలో ఉండడమే చక్రవర్తి కోరిక కూడాను. ఈ కారణాల వల్ల కుందవై ఇంతకాలం పళైయారైలోనే వసించసాగింది. ఆరోగ్యం బాగాలేని తండ్రికి సేవ చేయాలనే కోరికను కూడ అదిమిపెట్టేసుకొంది.

~

కానీ, వంతిదేవుడు వచ్చి వెళ్ళినప్పటినుంచి ఆమె మనసులో ఒక మార్పు కలిగింది. రాజ్యంలో భయంకరమైన సంఘటనలు, కుట్రలు జరుగుతున్నప్పుడు మనం మాత్రం ఉల్లాసంగా పడవలో సల్లాపాలాడుతూ, పూలతోటలో ఆడి పాడుతుండడం ఉచితమా? అన్న తొండైనాడులో ఉన్నాడు; తమ్ముడేమో లంకలో ఉన్నాడు. వారిద్దరూ లేనప్పుడు రాజ్య వ్యవహారాలను మనం చూసుకోవాలా, వద్దా? రాజధానిలో జరుగుతున్న సంఘటనల గురించి అంతరంగ గూఢచారులు, దూతల మూలంగా తెలుసుకొని తనకు తెలియజెప్పమని అన్న అడుగుతున్నాడు కద? పళైయారైలో ఉంటే తంజావూరులో జరుగుతున్న విషయాలెలా తెలుస్తాయి?

వంతిదేవుడు తెలియజేసిన విషయాలేమో అతి భయంకరంగా ఉన్నాయి. పళువేట్టరయ్యర్లు తమ అంతస్తును మీరి అధికారం చెలాయిస్తుండడం కుందవైకి సుతరామూ ఇష్టం లేదు. ఇప్పుడేమో,

సింహాసనం గురించే కుట్ర మొదలు పెట్టేశారు! పాపం, పరమ సాధువు ఆ మధురాంతకుని కూడ తమ వలలో వేసేసుకొన్నారు. చోళసామ్రజ్యపు చిన్న చిన్న రాజులు, సామంతులు, పెద్ద అధికారులు పలువురిని తమ వశం చేసుకొన్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియదు. వీరి కుట్ర, వంచన, దురాశ ఎంతవరకు వెళుతుందో ఎవరికి తెలుసు? సుందర చోళ చక్రవర్తి ప్రాణాలకే ఎసరు పెట్టినా ఆశ్చర్యం లేదు! పెట్టరు అని ఎలా చెప్పగలం? చక్రవర్తి కుమారులిద్దరూ లేని సమయంలో ఆయనకేమైన జరిగితే, మధురాంతకుని సింహాసనమెక్కించడం అతి సులభం కద? అందుకు ఏం చేసినా చేస్తారు! వారికి ఉపాయం తట్టకపోయినా ఆ రాక్షసి నందిని నేర్పిస్తుంది. వారు జంకినా ఇది ఎగదోస్తుంది. ఇక తంజావూరులో తండ్రి దగ్గర మనముండడమే మంచిది. ఈ కుట్రలు ఎంతదూరం వెళతాయో గమనించ వచ్చు. అంతేగాక తమ ప్రియమైన తండ్రిని దగ్గరుండి చూసుకోవచ్చు.

సాధువైన మధురాంతకుని వీరెందుకు సింహాసనమెక్కించజూస్తున్నారు? న్యాయం, ధర్మం కోసమా? కానే కాదు! మధురాంతకునికి పట్టం కడితే అతన్ని తమ చేతిలో కీలుబొమ్మగా చేసుకొని, తాము తమ ఇష్టం వచ్చినట్లు తమ కార్యాలను నడిపించుకోవచ్చనే! తర్వాత నందిని వేసిందే చోళసామ్రాజ్యంలో చట్టమవుతుంది! అమె అధికారానికి భయపడి తక్కిన వారు బతకాలి. ఆమె ముందు తక్కిన అంతఃపుర స్త్రీలు చేతులు కట్టుకొని నిలబడాలి! ఛీఛీ! అటువంటి పరిస్థితికి తావివ్వడమా? నేనొకతెను ఉన్నంతవరకు అది జరగనే జరగదు. చూద్దాం ఆమె సామర్థ్యాన్ని!

~

పళైయారై విడిచి, తంజావూరులో వసించడం తనకు శ్రమ కలిగిస్తుందనడం నిజమే! తలిదండ్రులిద్దరు, "అక్కడ సుఖంగా ఉండక, ఇక్కడికెందుకు వచ్చావు?" అని అడుగుతారు.. స్వేచ్ఛ అన్నదే లేకుండ పోతుంది. తన పెళ్ళి గురించి ఎవరైన మాటెత్తుతారు. అది వినడమే తనకిష్టం లేదు. నందినిని కొన్నిసార్లు చూడవలసిన/కలవవలసిన  సందర్భాలు వస్తాయి. ఆమె అహంకారపూరిత ప్రవర్తనను తాను సహించలెదు. కానీ వీటన్నిటి గురించి ఆలోచిస్తూ, వాటికిప్పుడు ప్రాముఖ్యతనివ్వడం ఉచితమా? రాజ్యానికి పెద్ద అపాయం కలగబోతోంది; తండ్రి ప్రాణాలకు అపాయం కలగవచ్చనే భయంకూడ ఉంది. ఇటువంటి పరిస్థితిలో తాను ఉండవలసిన చోటు తంజావూరే కద?

ఇదంతా గాక, ఇంకొక ముఖ్యకారణముంది - అది వంతిదేవుని గురించి ఏదైన సమాచారం దొరుకుతుందనే ఆశే. వంతిదేవుడు కోడిక్కరై వైపు వెళ్ళాడని తెలిసి అతన్ని పట్టి తేవడానికి పళువేట్టరయ్యర్లు మనుషులను పంపారని తాను విన్నది. శక్తి యుక్తులలో ఆరితేరిన ఆ యువకుడు వీరి చేత చిక్కుబడతాడా? ఒకవేళ పట్టుబడ్డా తంజావూరుకే తీసుకొని వస్తారు. ఆ సమయాన మనమక్కడుండడం చాల అవశ్యం కద? ఆదిత్య కరికాలన్ పంపించిన దూతను వారంత సులభంగా ఏం చేయలేరు. ఏదైన నింద మోపి శిక్ష విధించాలి. అందుకనే శంబువరయ్యర్ కుమారుని వెన్నుపోటు పొడిచి

చంపజూశాడన్న నిందను మోపారు. అది అబద్ధం అనడంలో సందేహమే లేదు! కానీ అదిఅబద్ధమని నిరూపించాలి. గందమారన్తో మాట్లాడి అతని మాటను తెలుసుకోవడం చాల ఉపయోగకరంగా ఉంటుంది.

~

ఇలా ఎన్నెన్నో క్లిష్ట సమస్యలు, ఆలోచనలతో కుందవై మనసు నిండివుండగా, అమెతో బాటు ఏనుగు అంబారీలో ప్రయాణిస్తున్న ఆమె నేస్తం, చెలికత్తె వాణతి మనసు పాలవలె స్వచ్ఛంగా, పాలరాతిలాగ పారదర్శకంగా ఒకే ఒక్క విషయం గురించి ఆలోచిస్తూంది. అది యువరాజు అరుళ్మొళి వర్మ లంక నుంచి ఎప్పుడు తిరిగి వస్తారన్నదే.

“అక్కా! ఆయనను వెంటనే రమ్మని తాళపత్రసందేశం రాసి పంపించారు కద? వస్తే ఎక్కడికి వస్తారు? పళైయారైకా, తంజావూరుకా?” అని అడిగింది వాణతి.

వీరు తంజావూరుకు వెళ్ళినప్పుడు ఆయన పళైయారైకి వెళితే ఏం చేయాలన్నదే ఆమె దిగులు.

ఏవో ఆలోచనల్లో మునిగివున్న యువరాకుమారి కుందవై వాణతి వైపు తిరిగి చూసి, “ఎవరి గురించి అడుగుతున్నావు? పొన్నియిన్ సెల్వన్ గురించేనా?” అన్నది.

“అవునక్కా! ఆయన గురించే. ఆయనను మీరు తరచూ 'పొన్నియిన్ సెల్వన్'అని పిలుస్తారు. కానీ అందుకు కారణం నాకింతవరకు చెప్పలేదు. తర్వాత చెబుతానని దాటేస్తున్నారు. ఇప్పుడైన చెప్పండి. తంజావూరు కోట ఇంకా చాల దూరం ఉంది. ఈ ఏనుగేమో తాబేటి నడకతో నడుస్తోంది!” అన్నది వాణతి.

“ఈ ఏనుగు ఇంతకన్న వేగంగ నడిస్తే మనం దీని వెన్నుపైనుంచి కింద పడిపోతామంతే! అది సరే, తక్కోలం పోరులో ఏం జరిగిందో తెలుసా?”

“అక్కా! ఆయనకు 'పొన్నియిన్ సెల్వన్' అన్న పేరెలా వచ్చిందో చెప్పండి!”

“ఒసే దొంగా! నీవది మరిచిపోవులాగుంది. సరే, చెబుతాను, విను!” అని కుందవై రాకుమారి చెప్పనారంభించింది.

సుందర చోళ చక్రవర్తి పట్టాభిషిక్తుడైనప్పుడు ఆయన కుటుంబ జీవనం చాల ఉల్లాసంగ, ఆనంద మయంగా ఉండేది. అంతఃపురపు పడవలో కుటుంబ సమేతంగా పొన్ని నదిలో వ్యాహ్యాళికి వెళ్ళేవారు. అటువంటి సమయంలో పడవలో చాల సందడిగా, సరదాగా ఉండేది. వీణాగానం కావేరి నది గలగలతో పోటీ పడుతుండేది. అప్పుడప్పుడు ఎవరైన హాస్య సంభాషణ చేస్తే గలగలమని నవ్వులు కురిసేవి.

కొన్నిసార్లు పెద్దవారు తమలో తాము మాట్లాడుకొంటుండేవారు. పిల్లలు పడవలో ఇంకొకవైపు కేరింతలు కొడుతుండేవారు. కొన్నిసార్లు అందరూ కలిసి సరదాగా మాట్లాడుకొంటూ మైమరచిపోయేవారు.

ఒకరోజు పడవలో చక్రవర్తి, రాణిగారు, వారి పిల్లలు కూర్చొని కావేరిలో ఉల్లాసంగా విహరిస్తున్నారు. ఉన్నట్లుండి, “బిడ్డ ఎక్కడ? బిడ్డ అరుళ్మొళి ఎక్కడ?” అన్న గాభరాతో కూడిన గొంతు

వినిపించింది. అరుళ్మొళికి అప్పుడు వయసు ఐదేళ్ళు. కుందవైకి ఏడు. అంతఃపురంలో అందరికీ ముద్దు బిడ్డ అరుళ్మొళి. కానీ అందరికన్న అతడిమీద ప్రీతిగొన్నది అతడి అక్క కుందవై. పడవలో బిడ్డ లేదన్న విషయాన్ని మొదట గమనించింది ఆమే. వెంటనే పైన చెప్పినట్లు కేకవేసింది. అందరూ అదిరిపడ్డారు. పడవలో అక్కడా, ఇక్కడా వెతికారు. కానీ ఆ చిన్న పడవలో వెతికేందుకు అంత పెద్ద చోటెక్కడిది? ఎంత వెతికినా బిడ్డ కనిపించలేదు. కుందవై, ఆదిత్యుడు అరవసాగారు. రాణులు ఏడ్వనారంభించారు. పడవ నడిపేవారిలో కొందరు నదిలోకి దూకి వెతికారు. సుందర చోళ చక్రవర్తి కూడ అదే విధంగా నదిలోకి దూకబోయారు. కానీ ఎక్కడని వెతకడం? నది వెల్లువ బిడ్డను ఎంతదూరం లాక్కొని వెళ్ళివుంటుందని చెప్పగలం? బిడ్డ ఎప్పుడు వెల్లువలో పడ్డాడో ఎవరికి తెలుసు? ఎటువెళ్ళి వెతకాలని సరైన గురిలేకుండ నదిలోకి దూకిన వారు నలువైపుల ఈది వెతికారు. బిడ్డ కనిపించలేదు. ఇంతలో పడవలోని కొందరు రాణులు, చెలికత్తెలు మూర్ఛిల్లి పడిపోయారు. వారిని చూసేవారు లేరు. స్పృహవున్నవారు 'ఓ' అని ఏడ్పు మొదలుపెట్టగా, పడవ గగ్గోలెత్తింది. అది విని నది ఒడ్డున చెట్లమీద కూర్చొనివున్న పక్షులు ఆశ్చర్యపోయి మౌనందాల్చాయి.

~

ఉన్నట్లుండి ఒక అద్భుతమైన దృశ్యం వారి కళ్లముందు గోచరించింది. పడవకు కాస్త దూరంలో నది వెల్లువ మధ్య ఆ దృశ్యం కనిపించింది. ఒక స్త్రీరూపం బిడ్డను తన రెండు చేతుల్లో ఎత్తి పట్టుకొని వుండడం కనిపించింది. ఆ స్త్రీ ఆకారం నడుం వరకు నదిలో మునిగి మరుగైవుంది. ఆమె బంగారు వన్నె ముఖం, ఎద, ఎత్తిన చేతులు మాత్రమే అగుపించాయి. అందులోను ఆమె ఎత్తిపట్టుకొన్న బిడ్డ చాలవరకు మరుగుపరుస్తున్నాడు. అందరిలాగనే చక్రవర్తి కూడ ఆ దృశ్యాన్ని చూశారు. వెంటనే నదిలోకి దూకి అటువైపు వేగంగా ఈదుకొంటూ వెళ్ళారు. చేతులు చాచి బిడ్డను తీసుకొన్నారు. ఇంతలో పడవకూడ వారి దగ్గరకు వచ్చేసింది. పడవలోని వారు బిడ్డను సుందర చోళ చక్రవర్తి చేతులనుంచి తీసుకొన్నారు. చక్రవర్తిని కూడ చేయూతనిచ్చి పడవలోకెక్కించుకొన్నారు. చక్రవర్తి పడవలోకెక్కగానే తెలివి తప్పి పడిపోయారు. అందరూ ఆయనను, బిడ్డను గమనించడంలో నిమగ్నమైపోయారు. బిడ్డను కాపాడిన ఆ మహోన్నత స్త్రీమణి ఏమైందని ఎవరూ గమనించలేదు. ఆమె రూపం ఇలా ఉంటుందని చూసి గుర్తు చెప్పగలిగేటట్లు కూడ ఆమెను ఎవరూ గమనించలేదు. “బిడ్డను కాపాడింది నేను!” అని బహుమతి అడిగేందుకు ఆమె రానూ లేదు. కాబట్టి కావేరి మాతే యువరాజు అరుళ్మొళి వర్మను కాపాడిందని అందరూ ఏక కంఠంతో నిర్ధారించారు. ప్రతియేడు ఆ రోజు పొన్ని నదికి పూజలు చేసేందుకు ఏర్పాట్లు చేయబడ్డాయి. అప్పటివరకు అంతఃపురంలో అందరికీ ముద్దుబిడ్డడైన అరుళ్మొళి వర్మ అరోజు నుంచి 'పొన్ని ముద్దు బిడ్డ / పొన్నియిన్ సెల్వన్' అయ్యాడు. ఆ సంభవం తెలిసిన రాజ కుటుంబీకులందరు 'పొన్నియిన్ సెల్వన్' అనే పిలవసాగారు.

~~~
~~~

# అధ్యాయము - 14

## "రెండు పూర్ణ చంద్ర బింబాలు"

**ఆ** రోజు తంజావూరు మహా సంభ్రమంగా ఉంది. చాల కాలంగా రాజధానికి రాని యువరాకుమారి కుందవై మనసు మార్చుకొని ఇప్పుడు వస్తూందంటే ఆ నగర ప్రజలకు ఇంకేం కావాలి? చోళ సామ్రాజ్యంలో ఆమె అందం, తెలివి, వివేకం, దయాళుగుణం గురించి తెలియని వారు లేరు. ప్రతిరోజు ఒక్కసారైన ఏదో ఒక నెపం/వ్యాజ్యంతో ఆమె పేరు తలుచుకొని మాట్లాడని వారుండరు. ఈయేడు యువరాకుమారి కుందవై నవరాత్రి ఉత్సవాలకు అంతఃపురంలోనే ఉంటుందని తెలిసి వారి ఉత్సాహం, కుతూహలం రెట్టింపైంది. కాబట్టి ఈ రోజు వస్తుందని తెలిసి తంజావూరు కోట వాకిట ఒక జన సముద్రమే కూడింది. పూర్ణచంద్రోదయాన్ని చూసి ఉప్పొంగే జల సముద్రం లాగ, ఆ జన సముద్రం ఉప్పొంగిన ఉత్సాహం, ఉత్కంఠతో ఎదురు చూస్తూంది.

చివరికి పూర్ణ చంద్రుడు ఉదయించాడు. ఏల? రెండు పూర్ణ చంద్రులు ఒకే సారి ఉదయించాయి! తంజావూరు కోట వాకిట కుందవైదేవి తన పరివారంతో వచ్చి చేరినప్పుడు, కోట తలుపులు ఒక్కసారిగా తెరుచుకొన్నాయి. దేవిని ఆహ్వానించి తీసుకొని వెళ్ళేందుకు అంతఃపుర పరివారాలు బయటకు వచ్చారు. ఆ పరివారం ముందు వరుసలో ఇద్దరు పళువేట్టరయ్యర్లూ ఉన్నారు. అంతేకాదు; వారి వెనుక ముత్యాలు పొదిగిన ఒక దంతపు పల్లకీ వచ్చింది. ఆ పల్లకి పట్టు తెర తొలగిన వెంటనే లోపల పళువూర్ యువరాణి నందినీదేవి సుందర వదనం కనిపించింది.

కుందవై ఏనుగు పైనుంచి, నందిని పల్లకి నుంచి కిందకు దిగారు. నందిని వేగంగా ముందుకు వచ్చి కుందవై దేవికి స్వాగతం పలికింది. ఆ స్వాగతాన్ని కుందవైదేవి చిరునవ్వుతో అంగీకరించింది.

చోళ దేశపు ఇద్దరు మహా సౌందర్య వతులను ఒక్క చోట చూసిన వెంటనే ప్రజల ఉత్సాహం కట్టలు తెంచుకొని పొంగి పోర్లింది. నందిని మేను  బంగారు వన్నె; కుందవై మేను ఎర్ర తామర వన్నె. నందిని ముఖం పూర్ణ చంద్ర బింబంలాగ గుండ్రమైనది; కుందవై ముఖారవిందం చేయి తిరిగిన శిల్పి మలిచిన శిల్పం లాగ కాస్త కోలగా ఉంటుంది, నందిని నల్లని కనులు రెక్కలు విప్పిన భ్రమరాలలాగ విప్పారి ఉంటాయి; కుందవై దేవి నీలి కనులు నీలోత్పల పుష్పాల రేకులలాగ ఆకర్ణాంతం విస్తరించి ఉంటాయి. నందిని ముక్కు కాస్త చప్పిడిగా, నున్నగా గంధంతో చేసినట్లుంటుంది; కుందవై ముక్కేమో సంపంగి మొగ్గలాగ పొడవుగా మొనదేలి ఉంటుంది. నందిని పెదవులు కాస్త మందంగా పగడాలలాగ ఉంటాయి. కుందవైదేవి అధర ద్వయం తేనెలొలికే దానిమ్మ గింజల్లాగ మెరుస్తున్నాయి. నందిని తన జడను కొప్పువేసుకొని పూలమాలతో అలంకరించుకొంది. కుందవై శిరోజ సంపదేమో, 'సౌందర్యానికి ప్రతిరూపమేమో' నన్నట్లు

ఆమె శిరస్సుపై పెట్టని మకుటం లాగ విరాజిల్లుతూంది.

ఇలాగ ఆ ఇద్దరు వనితామణుల అందాన్ని, అలంకారాన్ని వేర్వేరుగా విడదీసి పోల్చి చూసుకొని అందరూ ఆనందించారని చెప్పలేము. మొత్తానికి, ఇద్దరూ సాటిలేని సౌందర్యవతులని వారు గ్రహించారు.

నందిని పైన ఆ నగర ప్రజలకు అంతవరకు ఒకవిధమైన అయిష్టం, అసూయ ఉండేవి. కుందవైదేవిని ప్రజలందరూ తమ కులదైవమంత భక్తితో చూసేవారు. కానీ ఇప్పుడు పళువూర్ యువరాణి కోట దాటి వచ్చి కుందవైదేవిని స్వాగతించడం వారికి చాల కుతూహలాన్ని కలిగించింది.

ప్రజలిలా అనంద సముద్రంలో మునిగి ఉండగా నందినికి, కుందవైదేవికి మధ్య జరిగిన సంభాషణ రెండు మెరుపులు ఒకదాన్నొకటి ఢీకొన్నట్లు కొనసాగింది.

"దేవీ! స్వాగతం! మమ్మల్ని పూర్తిగా మరిచిపోయారేమోననుకొన్నాము. యువరాకుమారి కరుణ ఎల్లలు లేనిదని నేడు తెలుసుకొన్నాము'' అన్నది నందిని.

"అదెలాగ, రాణీ! దూరంగా ఉంటే మరిచిపోయానని అర్థమా? మీరు పళైయారైకి రానందువల్ల మమ్మల్ని మరిచిపోయినట్లు భావించ వచ్చా?" అన్నది కుందవై.

"తేనెలొలికే పూవుపైపు తేనెటీగలు సహజంగానే ఆకర్షితమౌతాయి. పిలవనవసరం లేదు. సుందరమైన పళైయారైకి అందరూ వస్తారు. ఈ అవలక్షణమైన తంజావూరు కోటకు తమరు వేంచేయడం తమ కరుణను, పెద్దతనాన్ని చాటుతోంది కద?"

"అదేమలా చెబుతున్నారు? తంజైపురి అవలక్షణమైన నగరమా? ఇక్కడ సౌందర్యాన్నే చెర పట్టి ఉంచినప్పుడు..." అన్నది యువరాకుమారి.

"నేనూ అలాగనే విన్నాను - చక్రవర్తిని ఇక్కడ చెరపట్టి ఉంచారని. ఇక దిగులు లేదు. ఆయనను విడిపించేందుకు మీరు వచ్చేశారు కద?" అని నందిని అన్నప్పుడు ఆమె కళ్లలో ఒక్క క్షణం కత్తి మెరుపు కనిపించి మాయమైంది.

"బాగుంది! సుందర చోళ చక్రవర్తిని చెరపట్టేందుకు ఇంద్రాది దేవతలకు కూడ సాధ్యం కాదు. చిన్న మనుషులకెలా సాధ్యం? నేను దాన్ని గురించి చెప్పలేదు. సౌందర్య దేవత నందినిని గురించి చెప్పాను..."

"బాగా చెప్పండి దేవీ! వారి చెవిన పడేటట్లు చెప్పండి. నన్ను చెరసాలలో ఉంచినట్లే ఉంచారు పళువూర్ రాజు. తమరు కాస్త సిఫారసు చేసి..."

"నా సిఫారసు ఏం పనికొస్తుంది? తమరిని బంధించినది మామూలు చెరసాలలో కాదు కద? ప్రేమ పంజరంలో కద? అందులోను..."

"అవును, దేవీ! అందులోను ముసలివాని ప్రేమ పంజరంలో/చెరసాలలో. అందునుంచి

విడుదలే లేదు! ఏదో పాతాళ చెరసాల అంటున్నారు కద అందరు? అందులోనుంచైన బయట పడవచ్చుగాని..."

"అవును, రాణీ! అందులోను మనకు మనమే వేసుకొన్న సంకెళ్ళనుంచి, మనకు మనమే వెతికి వెళ్ళి బందీలైన చెరసాలనుంచి విడుదల కష్టమే! సీత, సావిత్రి మొదలైన పతివ్రతలను అనుసరించే వారు విడుదల కోరను కూడ కోరరు!... అదిగో, అక్కడ ఏమా కేకలు, కలకలం?" అన్నది కుందవై.

~

నిజంగానే అప్పుడు కోట వాకిలికి కాస్త దూరంలో గుమిగూడివున్న స్త్రీల గుంపు నుంచి ఆ కేకలు వినవచ్చాయి. స్పష్టంగా వినరాకపోవడం వల్ల కుందవై, నందిని ఆ గుంపు దగ్గరికి వెళ్ళారు. నిజానికి అవి అరుపులు కావు. కాస్త స్పష్టంగా వినిపించినప్పుడు అవి అరుపుగావు, వారి కోరికలనే పెద్దగా చెబుతున్నారని తెలిసింది. తరచూ అంతఃపురానికి వచ్చి కుందవైదేవిని చూసేందుకు అనుమతి కావాలని, నవరాత్రి ఉత్సవాలు జరిగే రోజుల్లో కోటలోపలికి వచ్చేందుకు ఉన్న కట్టుబాట్లను సడలించాలని కోరారు.

"దేవీ! తమ భర్తకుగాని, బావమరిదికి గాని చెప్పి వీరిని కోటలోపలికి వచ్చేందుకు అనుమతి ఇప్పించండి. కేవలం ఈ ఆడవాళ్లవల్ల ఏమంత అపాయం కలగబోతుంది? పళువూర్ సహోదరుల గజబలం నలువైపుల విస్తరించివుంది కద?" అన్నది కుందవై.

"అదేమి సముద్రతీరంతో నిలిపివేశారు? వారి ఆజ్ఞలు, ఏనుగులు సముద్రాలు దాటి వెళుతున్నాయి. అందుకు ఋజువు త్వరలోనే దొరుకుతుంది!" అని చెప్పి నందిని నవ్విన చిరునవ్వు కుందవై హృదయాన్ని చీల్చివేసింది. 'ఈ పాతకి మాట అంతరార్థం ఏమై ఉంటుంది?' అని ఆలోచించింది కుందవై.

ఇంతలో నందిని పెద్ద పళువేట్టరయ్యర్ని చేతిసైగతో దగ్గరకు రమ్మంది. తర్వాత ఆ స్త్రీసమూహం తెలియజేసిన కోర్కెను, కుందవైదేవి కోరికను తెలియజేసింది.

"యువరాకుమారి మాటకు ఎదురేది?" అన్నారు పెద్ద పళువేట్టరయ్యర్. తర్వాత ప్రజల కోలాహలంతోబాటు కోటలోపలికి ప్రవేశించారు.

~

ఆ రోజు మొదలు కొన్నిరోజులపాటు. తంజావూరు నగరం, చుట్టుపక్కల ఉన్న పల్లెలు, పట్టణాలు ఎల్లలెరుగని కుతూహలం, ఉత్సాహంలో మునిగి తేలాయి. కుందవైదేవి తంజావూరుకు వేంచేసినప్పుడు నవరాత్రి ఉత్సవం దగ్గరపడుతూంది. పళువేట్టరయ్యర్ కూడ తమ మాట నిలబెట్టుకొన్నారు. నిరాటంకంగా ప్రజలు ఆ పదిరోజులు కోటలోపలికి ప్రవేశించేందుకు, బయటకు వెళ్ళేందుకు అనుమతినిచ్చారు. కోట తలుపులు సదా బార్లా తెరిచి ఉంచబడ్డాయి. కోట లోపలి అంతఃపురాలలోను, బయట ఊళ్లలోను అనేక కార్యక్రమాలు ముమ్మరంగా, కోలాహలంగా కొనసాగాయి.

వాటిని చూసి ఆనందించేందుకు ప్రజలు తండోపతండాలుగా వచ్చి గుమిగూడారు. ఆ గుంపుల మధ్య తరచూ రెండు పూర్ణ చంద్రులు ఒక్కటిగా ఉదయించినట్లు అగుపించసాగారు. ఆ దృశ్యాన్ని చూసిన ప్రజల సంతోషానికి ఎల్లల్లేవు. కానీ, బయట ఇంత ఉత్సవ కుతూహలం, సందడి కనిపించినా, ఆ ఇద్దరు స్త్రీమణుల హృదయాల్లో అగ్ని పర్వతాలు నిప్పులుగక్కుతున్నాయి. పళువూర్ యువరాణికి, పళైయారై యువరాకుమారికి మధ్య ఎడతెరపి లేకుండ వాగ్యుద్ధం కొనసాగుతూంది. వాగ్బాణాలతోను, తీక్షణ వీక్షణాస్త్రాలతోను ఆ ఇద్దరు సౌందర్యవతులు ఒకరితోనొకరు ద్వంద్వ యుద్ధం చేయసాగారు. ఆ పోరాటంలో రెండువైపుల పదునైన కత్తులు రాసుకొన్నప్పుడు నిప్పురవ్వలు లేచాయి. చీకటి కమ్మిన ఆకాశంలో రెండు మెరుపులు ఒకదాన్నొకటి కత్తిరించజూసినప్పుడు ఆరెండూ విలవిల్లాడాయి. రెండు అందమైన ఆడపులులు ఒకదాన్నొకటి పంజాగోళ్లతో గీరి రక్తసిక్తం చేశాయి. భయంకర సౌందర్యం కలిగిన రెండు నాగ సర్పాలు పడగెత్తి ఆడుతూ, తమ సన్నటి, పొడవాటి ఎర్రని నాలుకలను చాచి ఒకదాన్నొకటి మింగజూశాయి.

ఈ విచిత్రమైన పోరాటంలో వారు ఉత్సాహోద్రేకాన్నీ పొందారు; మనోవేదనను కూడ అనుభవించారు.

నగర ప్రజల ఉత్సాహంలోను పాలుపంచుకోక, ఆ ఇద్దరు చంద్రమతుల పోరాటాన్ని అర్థం చేసుకోలేక ఒక ఆత్మ విలవిల్లాడింది. కొడుంబాడూర్ రాకుమారి వాణతికి ఇప్పుడల్లా కుందవైదేవితో మాట్లాడేందుకే అవకాశం దొరకడం లేదు. అక్కతోబాటు అన్నిచోట్లకు వెళుతోందిగాని, ఆమె మనసు ఎందులోను మగ్నం కావడంలేదు. తనలోనే ఒక ప్రపంచాన్ని సృష్టించుకొని అందులో సంచరించసాగింది.

~~~
~~~

# అధ్యాయము - 15

## నడిరాత్రి ఒక దీనార్తనాదం

చోళ దేశంలో ఆ కాలంలో ఆటపాటలు, కళలు చాల ఉన్నత స్థాయినందుకున్నాయి. నటనం, నాటకం ఒక్కటిగా అభివృద్ధి చెందాయి. తంజావూరు పేరు ప్రసిద్ధమయ్యేటట్లు చాలమంది కళాకారులు ఉదయించారు. ఆకాలంనాటి కరుప్పూర్ దేవర్ అనే ఒక శివ భక్తుడు తంజావూర్ నగరం గురించి ఎన్నో గీతాలలో వర్ణించాడు.

<< ఆ సుందర, మధుర శ్లాఘ్య గీతాన్ని అనువదించవలసి ఉంది >>

తంజావూరు నగరంలో నాటక కళ వృద్ధి చెందుతున్నందుకు తగినట్లు ఆ నగరంలో చాల నాటక శాలలు వెలిశాయి. ఆ నాటక శాలల్లో అతి ప్రసిద్ధమైన శాల చక్రవర్తి అంతఃపురంలోనే ఉంది!

కొత్త కొత్త నాటకాలను రూపొందించి ప్రదర్శించే పలువురు కళాకారులు తంజావూరులో వసించేవారు. అంతకు మునుపు పురాణేతిహాసాల్లోని కథలనే నాటకాలుగా కట్టి ప్రదర్శించడం అలవాటు. కొంతకాలంగా ఆ నాటక కళాకారులు ఇంకొకవైపు తమ దృష్టిని సారించి విజయం సాధిస్తూ వస్తున్నారు. చరిత్రలో ప్రసిద్ధికెక్కిన వీరుల వృత్తాంతాలను నాటకాలుగా రూపొందించి ప్రదర్శించనారంభించసాగారు. వారి కాలానికి కొంతకాలం మునుపు జీవించిన వీరుల గాథలను కూడ నాటకరూపంలో ప్రదర్శించారు. అటువంటి వీరులు చోళవంశంలోగాక ఇంకెక్కడ అగుపిస్తారు? కాబట్టి కరికాల్ వలవన్, విజయాలయ వర్మ, పరాంతక వర్మ మొదలైన చోళ రాజుల వీరగాథలను నాటకాలుగా కట్టి నటించారు.

~

నవరాత్రి ఉత్సవాలలో చక్రవర్తి అంతఃపురంలో చోళరాజుల వీర చరిత్ర నాటకాలు మూడురోజుల పాటు ప్రదర్శించబడ్డాయి. చిత్రవిచిత్రంగ అమర్చబడ్డ ఆ నాటక శాలకు ఎదురుగా, బయలు వెన్నెల మైదానంలో వేలకొద్ది ప్రజలు వచ్చి ఆ నాటకాలను చూసి ఆనందించారు. అంతఃపుర స్త్రీలు కూర్చొని చూసేందుకు ప్రత్యేకంగా ఒక ఎత్తైన, పట్టు పరదాలు వేసిన మంటపం అమర్చబడివుంది. అక్కడ మహారాణులు, రాకుమార్తెలు, వారి చెలికత్తెలు, స్నేహితురాళ్ళు కూర్చొని నాటకాలను చూశారు. ఆ సమయాల్లో కుందవైదేవి చెంతనే నందిని వచ్చి కూర్చొనేది. ఇది కొందరు అంతఃపురస్త్రీలకు నచ్చలేదు. కానీ దాన్ని వారు మనసులోనే అదిమి పెట్టుకొని ఉడికిపోయారే తప్ప, ఇంకేమీ చేయలేకపోయారు. పెద్ద పళువేట్టరయ్యర్, పళువూర్ యువరాణి - వీరిద్దరి కోపానికి గురికావడానికి ఎవరికి ధైర్యం ఉంటుంది? యువరాకుమారే ఆ గర్విష్టికి అంత విలువిచ్చి మర్యాద చేస్తున్నప్పుడు తక్కిన వారు ఏపాటి?

చోళరాజులను గురించిన మూడు నాటకాలలో పరాంతక చోళుని గురించిన నాటకం అప్పటిలో

చాల ప్రసిద్ధంగా ఉండేది. ఆరోజానాటకం చూస్తున్న ప్రేక్షక ప్రజల్లో ఆసక్తి, ఉత్సాహం కొత్తగా పుట్టుకొచ్చాయి.

అప్పటివరకు చోళసామ్రాజ్యాన్నేలిన మహారాజులలో సుందరచోళ చక్రవర్తి తాతగారైన కోప్పరకేసరి పరాంతక చోళుల వీరత్వం చాల పేరుగాంచినది. ఆయన సుమారు నలభైయారు సంవత్సరాలపాటు రాజ్యమేలారు. వీరి కాలంలో చోళ సామ్రాజ్యం పెరిగి విస్తరించింది. లంక నుంచి తుంగభద్రానది వరకు ఆయన ఆజ్ఞ చెలామణి అయ్యేది. పలు యుద్ధాలలో గొప్పగొప్ప విజయాలు సాధించారు. 'మదురైని, లంకను గెలిచిన కోప్పరకేసరి వర్మ' అన్న బిరుదును పొందారు. తిల్లై చిదంబరంలోని దేవాలయానికి స్వర్ణ తులాభారం కైంకర్యం చేసి కీర్తిప్రతిష్టలు గాంచారు. వీరి జీవిత చరమదశలో కొన్ని ఓటములెదురై రాజ్యం చిన్నదైంది. కానీ ఈయన యశస్సు మాత్రం ఏమాత్రం తగ్గలేదు. ఉత్తరాన రెట్టైమండలం నుంచి సముద్రం వంటి మహాసైన్యంతో దండెత్తివచ్చిన కణ్ణర్ దేవన్ అనే రాజుతో తక్కోలం అన్న చోట చివరిగా ఒక మహాయుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో పరాంతకుని పెద్దకొడుకైన రాజాదిత్యుడు, ఈ భరత ఖండం మునుపెన్నడు చూడని మహావీరుడు, సైన్యాధిపత్యం వహించి ఆ కణ్ణర్ దేవన్ సైన్యాన్ని తుడిచి పెట్టి ఏనుగుపైన ఉన్నపళంగానే అసువులు బాసి వీర స్వర్గం పొందాడు. ఆ మహావీరుని బాణం చొచ్చుకొని పోయిన శరీరాన్ని అలాగే ఊరికి తెచ్చి అంతఃపురంలోపలికి తీసుకొని వెళ్ళారు. పరాంతక చక్రవర్తి, వారి రాణులు, రాజ్యం కోసం ప్రాణాలు ధారవోసిన ఆ వీర పుత్రుని శరీరాన్ని తమ మధ్య పెట్టుకొని భోరుమన్నారు. తెర వెనుక నుంచి ఒక అశరీర వాణి, "ఏడ్వకండి! యువరాజు రాజాదిత్యులు మరణించలేదు; చోళదేశపు ప్రతి ఒక్కరి హృదయంలోను నెలకొనివున్నారు!" అని ఘోషించింది. ఈ చివరి దృశ్యంతోటి నాటకం ముగిసింది.

ఆ తరానికి ముందు తరాలలో జరిగిన వీర సాహసకృత్యాలతో నిండిన ఆ నాటకాన్ని చూసి ప్రజలందరూ చాల ఆనందించారు. కానీ నాటకం మధ్యలో సభలో కలకలం రేగింది. అందుకు కారణమిది: పరాంతకుని కాలంలో జరిగిన యుద్ధాలలో ఆయనకు ఇద్దరు సామంతరాజులెప్పుడూ తోడుగా ఉండేవారు. ఒకరు కొడుంబాళూర్ సామంతరాజు; ఇంకొకరు పళువూర్ రాజు. ఈ ఇద్దరూ చోళ వంశంతో బంధుత్వం కలుపుకొన్నవారు - కూతురునిచ్చి పుచ్చుకొన్నవారు. ఇద్దరూ రెండు చేతులలాగ పరాంతకునికి సేవ, సహాయం చేశారు. ఎవరు కుడి చేయి, ఎవరు ఎడమ చేయి అని చెప్పలేము. ఇద్దరినీ తన రెండు కళ్ళలాగ ఎంచి ఆదరించాడు పరాంతక చక్రవర్తి. ఇప్పుడు అధికారం చెలాయిస్తున్న పెద్ద పళువేట్టరయ్యర్ పెదనాన్న పరాంతక చోళునికి సహాయం చేసినవాడే. ఆయన పేరు పళువేట్టరయ్యర్ కందన్ అముదూర్. లంకలో ప్రాణాలు విడిచిన కొడుంబాళూర్ చిన్న వేళార్ తండ్రే (అంటే వాణతి తాతగారు) పరాంతక దేవులకు తోడుండి సహాయం చేసిన కొడుంబాళూర్ చిన్నరాజు.

~

పరాంతక దేవుల కథను నటించిన బృందంవారు పైన వివరించిన ఇద్దరు చిన్న రాజుల మధ్య

ఎటువంటి హెచ్చుతగ్గులు చూపించకుండ అతిజాగ్రతగా నాటకాన్ని నడిపించారు. ఇద్దరి వీర యశస్సును బాగా ఎత్తి చూపించారు. పరాంతక దేవులు ఆ ఇద్దరు వీరులను సమానంగా సన్మానించిన విషయాన్ని కూడ ఎత్తి చూపించారు.

అయినప్పటికీ సభికులు, ప్రేక్షకులు అటువంటి సమభావాన్ని కలిగివుండలేదన్నది త్వరలోనే విశదమైంది. వారిలో కొందరు కొడుంబాళూర్ పక్షమని, ఇంకొందరు పళువూర్ పక్షమని తెలియవచ్చింది. కొడుంబాళూర్ నాయకుని వీరకృత్యాలను రంగస్థలంపైన చూపించినప్పుడు సభలో ఒకవైపున జయఘోషలు వినవచ్చాయి. పళువూర్ నాయకుడు మేడమీదికి వచ్చిన వెంటనే ఇంకొందరు జయజయధ్వానాలు చేశారు. మొదట ఈ పోటీ తక్కువ స్థాయిలో ఉండి, పోను పోను పెరిగి పెద్దది కాసాగింది. నాటకం మధ్యలో తరచూ << 'నావలో నావల్ ' >> అన్న ఘోషలు వినరాసాగాయి.

సభలో లేచిన ఈ స్పర్థాఘోషలు కుందవైదేవికి ఉత్సాహాన్నిచ్చాయి. కొడుంబాళూర్ పక్షంవారి జయఘోషలు లేచినప్పుడు పక్కనున్న వాణతిని చూసి, "చూశావా, వాణతీ! ఇప్పుడు మీవారి బలం పెరిగింది!" అనేది. కల్లాకపటం తెలియని వాణతికూడ అందుగురించి తన సంతోషాన్ని వ్యక్తపరిచేది. పళువూర్ పక్షంవారి ఘోష లేచినప్పుడు యువరాణి నందిని వైపు చూసి, "రాణీ! ఇప్పుడు మీ పక్షం బలం పుంజుకొంది!" అనేది. కానీ ఇది నందినికి ఉత్సాహం కలిగించలేదన్న విషయం ఆమె ముఖ కవళికలనుంచి స్పష్టమైంది. ఇలా ఒక పోటీ ఏర్పడడం, అందులో ప్రజలు బహిరంగంగా పాల్గొనడం, ఇంకా యువరాకుమారి కుందవై దాన్ని ఎగదోయడం, ఆ అల్పజీవి వాణతికి తనను సమానంగా పరిగణించి, పరాచికాలాడడం నందిని మనోజ్వాలను ఇంకా ఎగదోసింది. కోపించుకొని లేచి వెళ్ళిపోదామా అని చాల సార్లు అనుకొంది. అలా చేస్తే ఆ పోటీని పెద్దగా తీసుకొని తన ఓటమిని ఒప్పుకొన్నట్లవుతుందని భావించి పళువూర్ యువరాణి పళ్ళు గిట్ట కరుచుకొని కూర్చొంది.

~

ఇదంతా కుందవై గమనిస్తూ వచ్చింది. నందిని మనఃస్థితిని అద్దంలాగ ఎత్తి చూపిస్తున్న ఆమె ముఖాన్ని చూసి అది గ్రహించింది. కానీ ఇంకొక విషయం యువరాకుమారికి తెలియని మర్మంగా నిలిచింది.

పోరులో పాండ్యరాజు ఓడిపోవడం, లంకకు పారిపోయి ఆ రాజు శరణు కోరడం, లంకాధిపతి సహాయం/అండ చిక్కక మణిమకుటాన్ని, రత్నహారాన్ని అక్కడే వదిలేసి చేరనాడుకు పారిపోవడం మొదలైన ఘట్టాలను నాటకంలో చూపించినప్పుడు సభికులందరు ఎనలేని ఉత్సాహాన్ని, హర్షాతిరేకాన్ని వెలిబుచ్చారు. కానీ నందిని ముఖం మాత్రం మిక్కిలి మనోవేదనను ప్రతిఫలించింది. అందుకు కారణం ఏమై ఉండవచ్చని కుందవై చాల ఆశ్చర్యపడింది. కాస్త మాట్లాడించి చూద్దామని, "చక్రవర్తి కూడ మనతోబాటు ఈ అద్భుతమైన నాటకాన్ని చూడలేకపోయారు కద? తాతగారు సాధించిన ఈ కార్యాలను ఈయనకూడ తన జీవితకాలంలో సాధించారు కద? నాన్నగారి ఆరోగ్యం బాగైతే..." అన్నది.

"ఆయన ఆరోగ్యం తనంతట తానే బాగుపడుతుంది. ఆయన ముద్దులకూతురైన తమరు ఇక్కడకు వచ్చేశారు కద. లంకనుంచి మూలిక కూడ త్వరలో దొరికితే చక్రవర్తి ఆరోగ్యం శీఘ్రంగానే బాగుపడుతుంది." అన్నది నందిని.

"లంకనుంచి మూలిక వస్తోందా? అదేమిటి?" అన్నది కుందవై.

"ఏమీ తెలియనట్లు అడుగుతున్నారేం? లంకనుంచి మూలికను తెచ్చేందుకు పళైయారై వైద్యుని మనిషిని పంపించారట కద? మీరే ఒక మనిషిని తోడు పంపించి సహాయం చేశారట కద? అది అబద్ధమా?"

కుందవై పెదవి కరుచుకొంది. చూసేందుకు పలువరుస అందంగా ఉన్నా, కొరకబడ్డ పెదవి మాత్రం నొప్పెట్టింది. అదృష్టవశాత్తు అదే సమయాన సభలో << 'నావలో నావల్' >> అన్న జయఘోష లెవడంతో ఆ సంభాషణ అక్కడితో ఆగిపోయింది.

~

సుందర చోళ చక్రవర్తి సిరిసంపదలు, దయా దాన గుణాలు మరింత వర్ధిల్లాలని, ఆయన దీర్ఘాయుష్షుతో జీవించాలని దీవించి నాటకాన్ని ముగించారు. సభ ముగిసి, సభికులందరు ఆనంద లహరిలో తేలియాడుతూ తమతమ ఇళ్ళకు వెళ్ళారు. సామంతరాజులు, రాణులు, వారి వారి పరివారాలు కూడ తమతమ అంతఃపురాలకు వెళ్ళిపోయారు. తర్వాత చక్రవర్తిని వాణమాదేవి, తక్కిన అంతఃపురస్త్రీలు చోళ వంశపు కులదైవమైన దుర్గాదేవి ఆలయానికి బయలుదేరారు.

చక్రవర్తి ఆరోగ్యం బాగుపడాలని మలైయమాన్ రాజకుమారి ఎన్నో నోములు నోస్తున్నారు. తరచు దుర్గాదేవి ఆలయానికి వెళ్ళి ప్రార్థనలు చేయడం కద్దు. నవరాత్రి సమయాన తొమ్మిది రోజులు ప్రతిరాత్రి విశేషపూజలు జరిపించారు. ప్రతిరాత్రి మహారాణి అర్ధజాము పాటు పూజ చేసిన తర్వాతే తిరిగి రావడం అలవాటు. అంతఃపురస్త్రీలలో పలువురు పెద్దలు మహారాణితోబాటు వెళ్ళేవారు.

పడుచు పిల్లలను దుర్గాదేవి ఆలయానికి వెంట తీసుకువెళ్ళే సంప్రదాయం లేదు. ఒక్కొక్కసారి పూజారులకు పూనకం వచ్చి భయంకరంగా ఆడుతారు. శాప వృత్తాంతాలను చెబుతారు. అటువంటి సన్నివేశాలను చూసి పడుచుపిల్లలు భయపడవచ్చని వారిని వెంట తీసుకొని వెళ్ళేవారు కాదు.

కానీ, యువరాకుమారి కుందవైకి, "నీవు భయపడతావు!" అని చెప్పగల ధైర్యం ఎవరికుంది? ఆ తొమ్మిది రోజులూ కుందవై తన తల్లులతో దుర్గాదేవి ఆలయానికి వెళ్ళి ప్రార్థనలు చేసింది. ఆ సందర్భాలలో వాణతి అంతఃపురంలో ఒంటరిగా ఉండవలసి వచ్చేది.

పరాంతక దేవుల నాటకం జరిగిన రాత్రి వాణతి మనసు ఉత్సాహంతో పొంగింది. తన కులపూర్వీకులు చేసిన వీరకృత్యాలను రంగస్థలంపైన చూసి ఆమె చాల గర్వపడింది. దానికితోడు లంకలోజరిగిన యుద్ధంలో అసువులు బాసిన తన తండ్రి జ్ఞాపకాలు, అందుకు పగ తీర్చుకోవడానికి

(వాణతి  అంచనా ప్రకారం) లంకకు దండెత్తి వెళ్ళిన యువరాజు జ్ఞాపకం ఎడతెరపి లేకుండ వచ్చి ఆమెను ఉక్కిరిబిక్కిర్ చేయసాగాయి. నిద్ర ఏమాత్రం పట్టలేదు. యువరాకుమారి ఆలయం నుంచి తిరిగివచ్చి ఆరోజు నాటకం గురించి మాట్లాడిన తర్వాత నిద్ర పట్టవచ్చేమో; అంతకు ముందు నిద్ర రావడం అసాధ్యం.

ఊరక పడుకొని దొర్లుతుండడం కన్న పైమేడకు వెళ్ళి కాసేపు పచార్లు చేస్తే మనసుకు ఉల్లాసం కలుగుతుంది కద అనుకొంది. మేడపైనుంచి చూస్తే తంజావూరు నగరం పూర్తిగా కనిపిస్తుంది. దుర్గాదేవి ఆలయాన్ని కూడ చూడవచ్చు. ఇలా ఆలోచించి వాణతి పడకనుంచి లేచి వెళ్ళింది. ఆ అంతఃపురం వాణతికి చాల కొత్త, అపరిచితమైనది. అయినాకూడ మేడపైని వెన్నెల డాబాను కనిపెట్టడం అంత కష్టమేమీ కాదు. విశాలమైన వరాండాలు, రెండువైపులా స్తంభాలు, రాత్రి దీపాలు ఉండగా ఏం కష్టం?

దారులన్నీ చుట్టి చుట్టి రాసాగాయి. అంతకు మునుపు దేదీప్యమానంగ వెలుగుతుండిన దీపాలలో చాల దీపాలు ఇప్పుడు ఆరిపోయివున్నాయి. కొన్ని పొగచూరి మసక మసగ్గా వెలుగుతున్నాయి. ఆక్కడక్కడ మూలల్లో దాదులు పడుకొని నిద్రపోతున్నారు. వారిని లేపి దారి అడగడానికిష్టపడక వాణతి తానే ఒంటరిగా ముందుకు వెళ్ళసాగింది. ఆ అంతఃపురపు దారులకు ఒక ముగింపే లేనట్లుంది.

ఉన్నట్లుండి ఒక గొంతు వినిపించింది. అది ఒక దీనమైన బలహీనస్వరంలాగ అనిపించింది. అది విని వాణతి ఒళ్ళు గగుర్పొడిచింది; గడగడ వణికింది. ఆమె కాళ్ళు నేలకంటుకొన్నట్లు ముందుకు కదలలేదు.

మళ్ళీ ఆ గొంతు, “నన్ను కాపాడేవారెవరూ లేరా?” అన్నది.

ఆఁ! ఇది చక్రవర్తి గొంతులాగుంది కద? ఏం ఆపదో తెలియడం లేదు కద? ఒంట్లో బాగులేకపోవడం వల్లనా? లేక, ఇంకేమైన కారణం ఉందా? చక్రవర్తిని మొదలైన ప్రౌఢస్త్రీలందరూ గుడికి వెళ్ళిపోయారు కద? చక్రవర్తి పక్కన ఎవరూ లేరా? అయినా వెళ్ళి చూద్దాం.

~

వణుకుతున్న కాళ్ళను మెల్లగా ఎత్తి ముందడుగు వేసింది వాణతి. ఆ గొంతు కింది అంతస్తునుంచి వస్తున్నట్లనిపించింది. అక్కడ దారికూడ ఆగిపోయింది. వంగి చూస్తే కింద ఒక విశాలమైన మంటపం కనిపించింది. ఆహా! చక్రవర్తి శయనాగారం కద ఇది? అవును; అదిగో అక్కడ పడుకొనివున్నది చక్రవర్తే. ఒంటరిగా పడుకొనివున్నారు. పైగా ఏదో పలవరిస్తున్నారు. అదేమిటో విందాం!

“ఒసే పాతకీ! నిజమేనే! నేను నిన్ను చంపింది నిజమే! కావాలనే చెప్పలేదు. కానీ నీ చావుకు నేనే కారణం. అందుకు ఏం చేయమంటావు? ఇరవై అయిదేళ్ళయ్యాయి. ఇంకా నా చుట్టూ తిరుగుతున్నావే, నీ ఆత్మకు శాంతి అన్నదే లేదా? నాకు నెమ్మదినివ్వవా? ఏం ప్రాయశ్చిత్తం చేయాలో చెప్పు! అలాగే చేస్తాను. నన్ను వదిలేయ్! అయ్యో! నన్ను దీని క్రూర బంధనాలనుంచి విడిపించేవారే లేరా?

అందరూ నా దైహిక అనారోగ్యానికి మందు వెతుకుతున్నారు కద! నా మనోవ్యాధిని పోగొట్టి కాపాడేవారే లేరా? పో! పో! వెళ్ళిపో! లేదు, వెళ్ళకు! నిలు! నేనేం చేయాలని చెప్పేసి పో! ఇలా నన్ను మౌనంగా వేపుకు తినకు! నోరు తెరిచి ఏదైన చెప్పేసి పో!"

ఈ మాటలు వాణతి చెవిన సీసాన్ని కరిగించి పోసినట్లు పడ్డాయి. ఆమె నశాళం నుంచి పాదాల వరకు ఒక్క ఊపు ఊపినట్లైంది. తనకు తెలియకనే కిందకు వంగి చూసింది. మంటపంలో నాలుగువైపులా చూపులు సారించగలిగినంతవరకు చూసింది.

చక్రవర్తికి ఎదురుగా కాస్త దూరంలో ఒక ఆకారం నిలబడివుంది. అది ఒక స్త్రీ రూపం. సగం మాత్రమే కనిపిస్తూంది. మిగిలిన సగం స్తంభపు నీడలోను, దీపపు పొగలోను మరుగైంది. కనిపించినంత వరకు ఆ ఆకారం ... ఆః! పళువూర్ యువరాణి లాగ ఉంది కద? ఇదేమి కలా? చిత్రభ్రమా? లేదు! నిజమే! అదిగో ఆ స్తంభం వెనుక దాక్కొని ఉన్నది పెద్ద పళువేట్టరయ్యర్ కద? సందేహం లేదు! ఆయనే! పళువూర్ యువరాణిని చూసా చక్రవర్తి అలా మాట్లాడుతున్నారు? "నిన్ను చంపింది నిజమే!" అని అరిచారు కద? దాని అర్థమేమి?

ఉన్నట్లుండి వాణతికి మైకం కమ్మి పడిపోతానేమోననిపించి తల గిర్రున తిరగసాగింది. లేదు. ఆ అంతఃపురమే తిరుగుతున్నట్లనిపించింది. ఛీఛీ! ఇక్కడ మైకం వచ్చి పడిపోకూడదు!

పళ్ళు గిట్ట కరుచుకొని వెనుదిరిగింది వాణతి. కానీ తిరిగి వెళ్ళే దారి అంతులేనట్లనిపించింది. ఆమె పడక గది రానే రాదనిపించింది. వీలు కాదు! ఇక ముందుకు నడవడం వీలుకాదు! నిలబడేందుకు కూడ వీలు కాదు....

కుందవై దేవి గుడినుంచి తిరిగివచ్చినప్పుడు వాణతి తన గదికి కాస్త దూరాన స్పృహ తప్పి పడి వుండడాన్ని గమనించింది.

~~~
~~~

# అధ్యాయము - 16

## సుందర చోళుని భ్రమ

**మరునాడు** ఉదయం సుందర చోళ చక్రవర్తి తన ముద్దుల కుమార్తెను పిలుచుకొని రమ్మని కబురు పంపారు. సేవకులు, దాదులు, వైద్యులు మొదలైన వారందరిని దూరంగ ఉండమని ఆజ్ఞాపించారు. కుందవైని తన దగ్గర కూర్చోబెట్టుకొని ఆప్యాయంగా వీపు నిమిరారు. ఆయన చెప్పదలచుకొన్నది చెప్పలేక సతమతమవుతున్నారని గ్రహించింది కుందవై.

"నాన్నా! నా మీద కోపమా?" అని అడిగింది.

ఆయన కళ్ళు చెమ్మగిల్లాయి.

"నీపైన ఎందుకమ్మా కోపం?" అన్నారు.

"మీ మాటమీరి తంజావూరుకు వచ్చినందుకు!" అన్నది.

"అవును; నా ఆజ్ఞ మీరి వచ్చివుండకూడదు. ఈ అంతఃపురం వయసులో ఉన్న ఆడపిల్లలు నివసించదగింది కాదు. ఇది నిన్న రాత్రి జరిగిన సంభవం నుంచి నీకే తెలిసివుంటుంది."

"ఏ సంభవం గురించి చెబుతున్నారు, నాన్నా?"

"ఆ కొడుంబాళూర్ అమ్మాయి మూర్ఛిల్లి పడిపోయిన విషయం గురించే చెబుతున్నాను. ఆ అమ్మాయికిప్పుడెలా ఉంది?"

"ఆమె ఈ రోజు బాగానే ఉంది, నాన్నా! పళైయారైలో కూడ తరచు ఇలా స్పృహతప్పి పడిపోయేది. కాసేపటికల్లా కోలుకొనేది."

"ఆమెను అడిగావా, అమ్మా! నిన్న రాత్రి ఈ అంతఃపురంలో ఏమైన విన్నదా, చూసిందా అని?"

కుందవై కాసేపు ఆలోచించి, "అవును, నాన్నా! మేమందరం దుర్గాదేవి ఆలయానికి వెళ్ళినప్పుడు తాను ఒంటరిగా డాబామీదికి వెళ్ళజూసిందట. అప్పుడెవరో జాలిగొలిపేటట్లు కుమిలిపోతూ మాట్లాడడం వినిపించిందట. అది విని ఆమె చాల భయపడిందట" అన్నది.

"అలాగే నేనూ అనుకొన్నాను. ఇప్పుడైనా తెలుసుకొన్నావా, బిడ్డా! ఈ అంతఃపురాన్ని దెయ్యం పట్టుకొంది. మీరిక్కడ ఉండవద్దు. వెళ్ళిపొండి!" అని చక్రవర్తి అన్నప్పుడు ఆయన ఒళ్ళు వణకడం, ఆయన వెర్రిపట్టిన వాడి కళ్లలాగ ఎక్కడో చూస్తూండడం కుందవై గమనించింది.

"నాన్నా! అలాగైతే మీరు మాత్రం ఇక్కడెందుకుండాలి? అమ్మ ఇక్కడెందుకుండాలి? అందరమూ పళైయారైకి వెళ్ళిపోవచ్చు కద? ఇక్కడికి వచ్చినందువల్ల మీ ఆరోగ్యమేమీ బాగుపడ్డట్లు కనిపించడం లేదు కద?" అన్నది.

చక్రవర్తి పేలవంగా నవ్వి, "నా ఆరోగ్యం ఇంకెక్కడ బాగుపడబోతుంది? ఆ ఆశ నాకు పూర్తిగా అడుగంటిపోయింది!" అన్నారు.

"ఎందుకలా నిరాశపడాలి, నాన్నా? పళైయార్రై వైద్యులు మీ జబ్బును నయం చేయవచ్చంటున్నారు."

"ఆయన చెప్పిన మాట విని నీవుకూడ లంకనుంచి మూలికను తెచ్చేందుకు మనిషిని పంపావని విన్నాను. బిడ్డా! నీకు నాపైనున్న ప్రేమకు అదే పెద్ద సాక్ష్యం."

"తండ్రిపైన కూతురు ప్రేమ, ఆప్యాయత కలిగివుండడం తప్పా, నాన్నా!"

"అందులో తప్పేమీ లేదు. ఇంతటి పితృవాంఛ కలిగిన కూతురిని కనడం నా భాగ్యం. లంకనుంచి మూలికను తేవడానికి మనిషిని పంపడం కూడ తప్పేమీ కాదు. కానీ నీవు లంకనుంచైన తెప్పించు, శావక ద్వీపం నుంచైన తెప్పించు, దేవలోకం నుంచి అమృతాన్నానైన తెప్పించు. నేనీ జన్మలో కోలుకోను..."

"అయ్యయ్యో! అలా అనకండి!" అన్నది యువరాకుమారి.

"నా ఆజ్ఞను కూడ మీరి ఇక్కడకు వచ్చావే, తల్లీ! అందుకు నిజంగా సంతోషపడుతున్నాను. ఎప్పుడో ఒక రోజు నా మనసు విప్పి నిజాన్ని నీకు చెప్పాలనుకొన్నాను. అందుకు తగిన సందర్భం ఇప్పుడు దొరికింది! చెబుతాను, విను! ఒంటికి జబ్బు చేస్తే మందిచ్చి మాపవచ్చు. కానీ నాది మనోవ్యాధి. దానికి మందెక్కడ?"

"తండ్రీ! ముల్లోకాలను ఏలే మీకు అలా ఏం దిగులు ఉండ సాధ్యం?"

"కవుల అతిశయోక్తులను నీవు కూడ వల్లె వేస్తున్నావా/ చెబుతున్నావా, తల్లీ! నేను ముల్లోకాలను ఏలే చక్రవర్తిని కాను. ఒక లోకాన్ని ఏలే చక్రవర్తినీ కాను. అందులో ఒక మూల ఒక చిన్న భాగాన్ని ఏలే రాజును మాత్రమే. దీని భారాన్నే నేను మోయలేకపోతున్నాను..."

"మీరెందుకు మోయాలి నాన్నా? రాజ్య భారాన్ని మోసేందుకు తగిన సమర్థులు లేరా? మాణిక్యాలవంటి ఇద్దరు సుపుత్రులున్నారు మీకు. ఇద్దరూ రెండు సింహపు పిల్లలు; వీరాధివీరులు. ఎటువంటి భారాన్నైనా మోయగలిగిన వారు..."

"కూతురా! అది తలుచుకొంటేనే నాకు గుండె గుబేలుమంటోంది. నీ సహోదరులిద్దరూ సాటిలేని మేటి వీరులే. నిన్ను పెంచినట్లే వారిని కూడ నా కంటికి రెప్పలాగ పెంచాను. వారికి ఈ రాజ్యాన్నిస్తే, దానితోబాటు ఒక శాపభారాన్ని కూడ ఒప్పజెప్పడం సబబేనా?"

"అలా ఏం శాపం ఉండగలదీ రాజ్యానికి? పావురం కోసం తన ఒంట్లోంచే మాంసాన్ని కోసిచ్చిన శిబి, లేగదూడ కోసం తన కొడుకునే అర్పించిన మనునీతి చోళుడు మన పూర్వీకులు. కరికాల్ వలవన్, పెరునర్కిళ్ళి ఈ రాజ్యాన్నేలారు. తన శరీరంపైన తొంభైయారు యుద్ధగాయాలను భరించిన విజయాలయ

వర్మ ఈ సింహాసనాన్ని అధిష్ఠించి పాలించారు. కావేరి నదీతీరం వెంబడి నూటయెనిమిది ఆలయాలు నిర్మించిన ఆదిత్య చోళులు, విమాన గోపురానికి బంగారు తొడుగు చేయించి దాన్ని స్వర్ణగోపురంగా మార్చేసిన పరాంతకులు ఈ రాజ్యాన్ని విస్తరించారు. శివభక్తికే తమ జీవితాన్ని అర్పించిన శివభక్త శిరోమణి గండరాదిత్యులు ఏలిన ధర్మరాజ్యమిది. ఇటువంటి రాజ్యం మీద ఏ శాపం ఉండగలదు? నాన్నా! మీరేదో చిత్త భ్రమకు లోనయ్యారు! ఈ తంజావూరు కోటను విడిచి మీరు బయట పడితే..."

"నేనిక్కడినుంచి బయలుదేరితే మరుక్షణం ఏమవుతుందో నీకు తెలియదు! సుందరమైన పళైయారైని విడిచి చెరసాల వంటి ఈ కోటలో సుఖంగా ఉండేందుకు వచ్చాననుకొంటున్నావా? కుందవై! నేనిక్కడ ఉండడం వల్ల పురాతనమైన ఈ చోళ సామ్రాజ్యం ఛిన్నాభిన్నం కాకుండ కాపాడుకొంటూ వస్తున్నాను. నిన్న రాత్రి నాటకం జరుగుతున్నప్పుడు ఏం జరిగిందని ఆలోచించి చూడు! వెన్నెల డాబా ముందువైపు నుంచి నేనంతా గమనిస్తూ వచ్చాను. నాటకాన్ని మధ్యలోనే ఆపించేద్దామనుకొన్నాను."

"తండ్రీ! ఇదేమి? నాటకం చాల బాగుండింది కద? చోళ వంశపు గొప్పతనాన్ని తెలుసుకొని నా మనసెంత ఉప్పొంగిందో! ఎందుకని ఆపించాలనుకొన్నారు? నాటకంలో మీకు ఏ ఘట్టం నచ్చలేదు?"

"నాటకం బాగానే ఉంది. అందులో నాకేతప్పూ కనిపించలేదు. ప్రేక్షకుల గురించే చెబుతున్నాను. కొడుంబాళూర్ పక్షము, పళువూర్ పక్షమూ లేపిన స్పర్థ-ప్రతిస్పర్థా ఘోషలు నీవు గమనించలెదా?"

"గమనించాను, నాన్నా!"

"నేనొకడిని ఇక్కడ ఉన్నప్పుడే వీరిలా ప్రవర్తిస్తున్నారు కద? నేను లేకపోతె ఏమవుతుందో ఆలోచించు! నేను తంజావూరు వదిలిన వెంటనే ఈ ఇరు పక్షాల మధ్య యుద్ధం మొదలవుతుంది. శ్రీకృష్ణ పరమాత్మ కులం వారైన యాదవులు ఎలా ఒకరినొకరు చంపుకొని నాశనమైపోయారో అలాగే వీరు కూడ తుడిచిపెట్టుకు పోతారు. వీరితోబాటు ఈ మహాసామ్రాజ్యం కూడ నశించిపోతుంది."

"నాన్నా! మీరు ఈ చోళ సామ్రాజ్యానికి సర్వాధికార చక్రవర్తి. పళువేట్టరయ్యర్లు గాని, కొడుంబాళూర్ వేళార్లుగాని మీరు కాలితో వేసిన చట్టాన్ని తలతో చేయవలసిన బాధ్యత కలిగిన వారు. వారు హద్దు మీరి నడుచుకొంటే వారి వినాశాన్ని వారే కొనితెచ్చుకొన్నవారవుతారు. మీరెందుకు దిగులు పడాలి?"

"బిడ్డా! గత నూరేళ్ళుగా ఈ రెండు కులాల వీరులు ఈ సామ్రాజ్యానికి ఎనలేని సేవ చేస్తూ వస్తున్నవారు. వారి సేవ, సహాయం లేకపోతే ఈ సామ్రాజ్యం ఇంత పెద్దదయ్యేదా? వారు నశిస్తే, ఈ సామ్రాజ్యం కూడ బలహీనమవుతుంది కద?"

"నాన్నా! ఆ రెండు పక్షాలలో ఒక పక్షం వారు మీకు విరుద్ధంగా కుట్ర పన్నుతున్నారని తెలిసి కూడ..."

చక్రవర్తి కుందవైని ఆశ్చర్యంగా చూశారు. "ఏం చెబుతున్నావమ్మా? నాకు విరుద్ధంగా కుట్రా?

ఎవరు చేస్తున్నారు?" అని అడిగారు.

"నాన్నా! తమ నిజమైన సేవకులుగా నటిస్తూ వస్తున్న కొందరు తమకు విరుద్ధంగా రహస్యకూటమిగా చేరి కుట్ర పన్నుతున్నారు. తమ పుత్రులకు సింహాసనార్హత లేకుండ చేసి, ఇంకొకరికి పట్టం కట్టేందుకు కుట్ర పన్నుతున్నారు..."

"ఎవరికి? ఎవరికి? నీ సహోదరులకు పట్టం లేకుండ చేసి, ఇంకెవరికి పట్టం కట్టజూస్తున్నారు?" అని సుందర చోళ చక్రవర్తి ఆదుర్దాగా అడిగారు.

కుందవై గొంతు తగ్గించి, "చిన్నాన్న మధురాంతకునికి, నాన్నా! మీరు జబ్బుతో మంచం పట్టివుండడం వల్ల వీరింతటి భయంకరమైన ద్రోహాన్ని చేయబూనుతున్నారు..." అన్నది.

వెంటనే సుందర చోళ చక్రవర్తి కాస్త నిటారుగా కూర్చొని, "ఆహా! వారి ప్రయత్నం ఒకవేళ ఫలిస్తే ఎంత బాగుంటుంది!" అన్నారు.

కుందవై అదిరిపడింది!

"నాన్నా! మీ కన్న కొడుకులకు మీరే శత్రువులవుతారా?" అన్నది.

"లేదు. నా కొడుకులకు నేను శత్రువును కాను. వారికి మేలు చేయడానికే ఇష్టపడుతున్నాను. శాపానికి గురైన ఈ రాజ్యం వారికవసరం లేదు. మధురాంతకుడు గనక ఒప్పుకొంటే..."

"చిన్నాన్న ఒప్పుకోవడానికేం? ధారాళంగా ఒప్పుకొంటారు. రేపే పట్టం కట్టించుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. అలా మీరు చేయబోతున్నారా? నా అన్న సమ్మతం అడగవద్దా?"

"అవును. ఆదిత్యుని తప్పక అడిగే తీరాలి. వాడిని అడిగితే మాత్రం చాలదు. నీ పెదనానమ్మ సమ్మతించాలి..."

"కొడుక్కి పట్టం కడతారంటే తల్లి వద్దంటుందా?"

"ఎందుకు వద్దనదు? నీ పెదనానమ్మను నీవిన్నాళ్ళు ఎరిగివున్నా కూడ వారిని నీవర్థం చేసుకోలేదా? శెంబియన్ మహాదేవి ఆనాడు చెప్పడం వల్లనే నేను సింహాసనమెక్కాను, ఆదిత్యునికి యువరాజు పట్టం కట్టాను. కుందవై! నీ పెదనానమ్మకు నీవంటే చాల మక్కువ, ప్రేమ. నీవు వారికి నచ్చజెప్పి మధురాంతకునికి పట్టం కట్టేందుకు ఒప్పుకోవడానికి సమ్మతింపజేయి!..."

కుందవై అవాక్కైంది.

"తర్వాత కంచికి వెళ్ళు. నీ అన్న ఆదిత్య కరికాలన్‌కి చెప్పి, 'ఈ శాపభూయిష్టమైన రాజ్యం నాకు వద్దు' అని వాడు చెప్పేటట్లు చేయి. మధురాంతకునికే పట్టం కట్టేద్దాం. తర్వాత మనమంతా శాపం తీరి నెమ్మదిగా ఉండవచ్చు" అన్నారు చక్రవర్తి.

"నాన్నా! తరచూ శాపమంటున్నారు కద? ఏ శాపం గురించి చెబుతున్నారు?" అని అడిగింది కుందవై.

"అమ్మాయీ! పూర్వ జన్మ ఒకటుందని నీవు నమ్ముతావా? పూర్వ జన్మ జ్ఞాపకాలు ఈ జన్మలో అప్పుడప్పుడు వస్తాయంటారు కద, అందులో నీకు నమ్మకముందా?"

"నాన్నా! అవన్నీ పెద్ద పెద్ద మాటలు. నాకేం తెలుసు ఆ విషయాల గురించి?"

"మహావిష్ణువు దశావతారాల గురించి చెబుతారు కద? బుద్ధ భగవానుడు తన చివరి అవతారానికి మునుపు చాల అవతారాలెత్తాడంటారు కద? ఆ అవతారాల గురించి ఎన్నో కథలు చెబుతున్నారు కద?"

"వినివున్నాను, నాన్నా!"

"భగవంతునికి, అవతారపురుషులకు అలాగైతే, సాధారణ మనుషులకు పూర్వజన్మ అనేది ఉండదా?"

"ఉండవచ్చు, నాన్నా!"

"కొన్నిసార్లు నాకు కూడ పూర్వజన్మ జ్ఞాపకాలొస్తున్నాయమ్మా! వాటి గురించి ఇంతవరకు ఎవరికీ చెప్పలేదు. చెబితే ఎవరూ నమ్మరు కూడాను; అర్థంకూడ చేసుకోరు. నాకు శారీరక అనారోగ్యంతోబాటు చిత్త భ్రమ కూడ పట్టుకొందంటారు. వైద్యులను తీసుకొచ్చి నన్ను ఇబ్బంది పెట్టడం చాలదని మాంత్రికులను కూడ తీసుకొస్తారు..."

"అవును, నాన్నా! ఇప్పటికే అలా కొంత మంది చెబుతున్నారు. మీ జబ్బు మందులతో నయం కాదు; మాంత్రికులను పిలుచుకొని రావాలంటున్నారు..."

"చూశావా? మరి నీవలా అనుకోవు కదా? నేను చెప్పేది విని నవ్వేయవు కద?" అన్నారు చక్రవర్తి.

"అడగాలా, నాన్నా! మీమనసు ఎంతగా నొచ్చుకొనివుందో నాకు తెలియదా? మీరు చెప్పేది విని నేను నవ్వుతానా?" అన్నది కుందవై చెమ్మగిల్లిన కళ్లతో.

"నాకు తెలుసమ్మా! అందుకే ఇంకెవరికీ చెప్పని విషయాన్ని నీకు చెబుతున్నాను. నా పూర్వజన్మ జ్ఞాపకాల్లో కొన్ని చెబుతాను, విను!" అని చెప్పనారంభించారు సుందర చోళ చక్రవర్తి.

~

నలువైపులా సముద్రం ఆవరించిన ఒక అందమైన ద్వీపం. ఆ దీవి నిండా పచ్చని చెట్లు ఏపుగా పెరిగివున్నాయి. చెట్లులేని చోట దట్టమైన పొదలు. సముద్ర తీరాన ఒక పొదలో ఒక యువకుడు దాక్కొని వున్నాడు. కాస్త దూరాన సముద్రంలో విప్పిన తెరచాపతో పయనిస్తున్న ఒక నావను పరీక్షగా చూస్తున్నాడు! అది మరుగయ్యే వరకు చూస్తూ నిలబడ్డాడు. తర్వాత, "అమ్మయ్య! బతికిపోయాం!" అని పెద్దగా నిట్టూర్చాడు.

ఆ యువకుడు రాజ వంశంలో పుట్టిన వాడు. కానీ రాజ్యమేలేందుకు అర్హత లేనివాడు!

రాజ్యమేలే ఆశకూడ అతడికి లేదు. అతడి తండ్రికి ముందు పుట్టిన సహోదరులు (అంటే అతడి పెదనాన్నలు) ముగ్గురుండేవారు. కాబట్టి రాజు కావడం గురించి కలలో కూడ అనుకోలేదు; ఆ ఆశకూడ లేదు. సముద్రానికి అవతల ఉన్న దేశాలమీద దండయాత్రకు వెళ్ళిన సైన్యంతోబాటు తానుకూడ వెళ్ళాడు. ఒక చిన్న దండుకు నాయకుడుగా నియమించబడ్డాడు. యుద్ధంలో అతడి సైన్యం ఓడిపోయింది. లెక్కలేనంత మంది మరణించారు. అతడు నాయకత్వం వహించిన దండులో కూడ అందరూ చనిపోయారు. ఆ యువకుడు మాత్రం ప్రాణాలకు తెగించి ఎన్నో సాహస కృత్యాలు చేశాడు. కానీ అతన్ని మృత్యువు వరించలేదు. ఓడిపోయి పారిపోయిన సైన్యంలో ప్రాణాలతో తప్పించుకొన్నవారు నది ముఖద్వారం వద్దకు చేరారు. తమ దేశానికి తిరిగి వెళ్ళేందుకు ఆయత్తం కాసాగారు. కానీ ఆ యువకుడు మాత్రం తిరిగి వెళ్ళడానికి ఇష్టపడలేదు. తన కులపూర్వీకులు మహావీరులని పేరు ప్రఖ్యాతులుగాంచిన వారు. అటువంటి కులానికి తనవల్ల అపకీర్తి తేవడానికి అతడిష్టపడలేదు. కాబట్టి, సముద్రంలో ఓడ వెళుతున్న మార్గాన ఒక అందమైన దీవి కనిపించినప్పుడు, ఎవరికీ తెలియకుండ మెల్లగా సముద్రంలోకి జారుకొన్నాడు. ఈదుకొంటూ వెళ్ళి ఆ దీవిని చేరుకొన్నాడు. ఓడ కనుమరుగయ్యేవరకు వేచిచూశాడు. తర్వాత చెట్టెక్కి ఒక కొమ్మపైన కూర్చొని చుట్టూ పరికించ చూశాడు. ఆ దీవి అందం అతడి మనస్సునాకట్టుకొంది. కానీ ఆ దీవిలో మనుష్య సంచారమే కనబడలేదు. అప్పుడది అతడికి ఒక కొరత అని అనిపించలెదు. పైగా అతడి ఉత్సాహం మరింత పెరిగింది. చెట్టుకొమ్మనానుకొని అలాగే కూర్చొని, భవిష్యత్తు గురించి పగటి కలలు కనసాగాడు.

ఉన్నట్లుండి ఒక మనుష్య స్వరం, అందులోను ఒక స్త్రీ ఆర్తనాదం, వినిపించింది. చటుక్కున తిరిగిచూశాడు. ఒక యువతి కేకలేస్తూ పరుగెడుతుండడం కనిపించింది. ఆమెను వెన్నంటి ఒక భయంకరమైన ఎలుగుబంటి పరుగెడుతూంది. యువకుడు చూస్తూండగానే ఆ ఎలుగు యువతికి అతి సమీపాన వచ్చేసింది. ఇంకే ఉపాయం ఆలోచించేందుకు సమయం కూడ లేదు. యువకుడు చెట్టుకొమ్మ మీదినుంచి ఛెంగున కిందకు దూకి, చెట్టుకానించి ఉంచిన తన ఈటెను తీసుకొని, ఎలుగుబంటి పైకి గురి చూసి విసిరాడు. ఈటె ఎలుగుబంటికి తగిలింది. అది ఏడు లోకాలు అదిరిపడేలా ఎలుగెత్తి గర్జించి వెనక్కు తిరిగింది. అమ్మాయి బతికిపోయింది. కానీ ఆ యువకుడు అపాయంలో చిక్కుకొన్నాడు. గాయపడ్డ ఎలుగుబంటి అతడిమీదికి లంఘించింది. యువకుడికి, ఆ ఎలుగుబంటికి మధ్య తీవ్రమైన ద్వంద్వయుద్ధం మొదలైంది. చివరికి ఆ యువకుడే గెలిచాడు.

~

గెలుపొందిన యువకుని కళ్ళు వెంటనే నలువైపుల వెతికాయి. దేన్ని వెతికాయి అని మొదట ఆ యువకునికే తెలియలేదు. తర్వాత చటుక్కున తెలిసింది. అతడి కళ్ళు వెతుకుతున్న యువతి ఎత్తుగా, కాస్త వంకరగా ఉన్న ఒక కొబ్బరిచెట్టు వెనక, దానికానుకొని నిలబడివుంది. ఆమె కళ్లలో ఆశ్చర్యమూ,

ముఖంలో సంతోషమూ కనిపించాయి. ఆమె అడవిలో జీవించే యువతి, నాగరిక జీవనం తెలియనిది అని ఆమె తీరుతెన్నులు, బట్టలు తెలియజేశాయి. కానీ ఆమె అందానికి సాటి ఈ లోకంలో ఇంకేదీ లేదన్నంత అందంగా ఉంది. ఆమె అక్కడ నిలబడ్డ తీరు, ఒక సాటిలేని మేటి చిత్రకారుడు గీసిన చిత్రంలాగుంది. ఆమె నిజానికి మానవ స్త్రీ అయినాకూడ, ఈ భూలోకంలో పుట్టిన స్త్రీ కాజాలదు - అని ఆ యువకుడు భావించాడు. మెల్లగా ఆమెను సమీపించాడు. అతడెదురు చూసినట్లు ఆమె మాయమైపోలేదు. దానికి బదులు అతడెదురు చూడనట్లు అక్కడినుంచి పరుగెత్తింది. యువకుడు ఆమె వెనకే కాస్త దూరం పరుగెత్తాడు. కానీ చాల దూరం పరుగెత్తలేకపోయాడు. ఎలుగుతో పోరాడి చాల అలిసిపోయినందువల్ల. పైగా ఒక ఆడపిల్ల వెంట పరుగెత్తడం అనాగరికమని తలచాడు. 'ఈ చిన్న దీవిలో ఎక్కడికి పోతుంది? మళ్ళీ చూడకపోతామా?' అనుకొని ఆగిపోయాడు. సముద్రతీరం వెంబడి నడిచి వెళ్ళి తెల్లని ఇసుకలో పడుకొని సేదదీరాడు. అతడు ఎదురు చూసింది వృధాపోలేదు. కాసేపటికల్లా ఆ అమ్మాయి తిరిగివచ్చింది. తనతోబాటు ఒక పెద్దాయనను కూడ తీసుకొని వచ్చింది. వచ్చిన వ్యక్తి లంకాద్వీప తీరం వెంబడి చేపలు పట్టుకొని జీవించే 'కరైయర్' (తీరం వారు) అనే జాతికి చెందిన వాడని తెలుసుకొన్నాడు. అతడి మూలకంగా ఆ యువకుడు ఒక ముఖ్యమైన విషయాన్ని తెలుసుకొన్నాడు. అదేమంటే ఆ పిల్ల మంచి సమయాన వచ్చి అతడి ప్రాణం కాపాడిందని. అతడు చెట్టు కొమ్మపైన కూర్చొని ఓడనే పరీక్షగా చూస్తున్నప్పుడు అతడి వెనుక నుంచి ఒక ఎలుగు బంటి అతన్ని పరీక్షగా చూస్తూందట. తర్వాత చెట్టు ఎక్కనారంభించింది. ఇదంతా చూసిన ఆ పిల్ల ఎలుగుబంటిని ఇంకొకవైపుకు లాగేందుకు, అతన్ని హెచ్చరించేందుకు అలా కేక వేసింది. ఎలుగు చెట్టుసెక్కే ప్రయత్నం మానేసి, ఆమె వెన్నంటి పరుగెత్తింది.

~

ఇది వినగానే ఆ యువకుడికెలా అనిపించి ఉంటుందో మరి చెప్పాలా? తనను కాపాడిన ఆ యువతికి తన కృతజ్ఞతను తెలుపుకొన్నాడు. కానీ ఆమేమో బదులుగా ఒక్క మాటకూడ పలకలేదు. ఆ యువకుడు ఆమెతో మాట్లాడిన మాటలన్నిటికీ ఆమెతో వచ్చిన మనిషే బదులిచ్చాడు. ఇది ఆ యువకునికి మొదట కాస్త ఆశ్చర్యాన్ని కలిగించింది. నిజమేమని తెలిసిన తర్వాత మొదట ఆశ్చర్యపోయి, తర్వాత జాలిపడ్డాడు - ఆమె మాటరాని మూగది, వినలేని చెవిటిది. అది తెలియగానే అతడికి ఆమెపైన అనురాగం పదిరెట్లైంది. ఆమె మూగతనం, చెవిటితనం ఒక కొరతగానే అనిపించలేదతనికి. నోటితో చెప్పలేని అద్భుతమైన విషయాలను, అంతరంగ రహస్యాలను ఆమె కళ్ళే చెప్పాయి. ఆ కంటి భాషకు దీటైన భాష ఈ లోకంలో ఇంకేది? అదే విధంగా, ఆమె శ్రవణశక్తికి బదులు ఆమె నాసిక బహునిశితంగాను, సూక్ష్మంగాను ఉండడాన్ని గమనించాడు. దట్టమైన అడవిలో చాలదూరంలో ఎక్కడో చెట్ల వెనుక ఉన్న అడవి మృగమిది అని ఆమె వాసన పట్టి చెప్పగలదు. కానీ ఇదంతా ఎందుకు? రెండు హృదయాలు ఒకటైనపుడు తక్కిన విషయాల గురించి దిగులెందుకు? ఆ యువకునికి ఆ దీవి స్వర్గంలాగే తోచింది. రోజులు, నెలలు, ఏళ్ళు -

ఇలాగ గడిచిపోయాయి. ఎన్ని రోజులు, లేక ఎన్నేళ్ళు ఇలా గడిచాయో అని లెక్క మరిచిపోయాడు.

~

ఆ యువకుని ఈ స్వర్గలోక జీవనానికి ఒక రోజు ఉన్నట్లుండి ముగింపు వచ్చింది. ఓడ ఒకటి వచ్చి ఆ దీవి దగ్గర ఆగింది. పడవల్లోను, తెప్పల్లోను చాల మంది వచ్చి దిగారు. వాళ్ళెవరని చూద్దామని ఆ యువకుడు వారిని సమీపించాడు. తనను వెతుక్కొంటూ వచ్చిన వారేనని గ్రహించాడు. అతడి దేశంలో అనుకోని, ఎదురుచూడని సంఘటనలు కొన్ని జరిగాయి. అతడి పెదనాన్నలిద్దరూ యుద్ధంలో మరణించారు. ఇంకొకరికి పుత్రసంతానం లేదు. కాబట్టి ఒక పెద్ద సామ్రాజ్యం అతడికోసం వేచివుందని గ్రహించాడు. అతడిప్పుడొక పెద్ద సందిగ్ధంలో పడ్డాడు. ఆ అందమైన దీవిని, ఆ దీవిని స్వర్గంగా మార్చిన ఆ మూగపిల్లను విడిచిపెట్టి వెళ్ళేందుకు అతడి మనసొప్పలేదు. అదే సమయంలో తన ఊరిని, బంధువులను చూడవచ్చన్న ఆశ అతన్ని పట్టి లాగింది. అతడి మాతృ దేశాన్ని అపాయం నలువైపులా కమ్ముకొందని కూడ గ్రహించాడు. రణభేరి అతిదగ్గరలో మోగడం అతడికి వినిపించింది (metaphorical). ఇది అతడొక తుది నిర్ణయం తీసుకోవడానికి కీలక కారణమైంది. “తిరిగి వస్తాను. నా కర్తవ్యాన్ని నెరవేర్చి వస్తాను" అని ఆ అమ్మాయికి వేయి సార్లు నచ్చజెప్పి బయలుదేరాడు. అడవిలో పుట్టి పెరిగిన ఆ పిల్ల నాగరిక ప్రపంచంలోని మనుషుల మధ్య మసలేందుకు సుతరామూ ఇష్టపడలేదు. యువకుడు పడవెక్కినప్పుడు ఆమె ఆ పాత కొబ్బరి చెట్టునే మళ్ళీ ఆసరాగా తీసుకొంది. ఆ వంగిన కొబ్బరి చెట్టుపైన కూర్చొని ఆ యువకుడు పడవెక్కి ఓడను చేరేవరకు చూస్తూంది. ఆమె రెండు కళ్ళు రెండు కన్నీటి కుండల్లాగ కనిపించాయి. ఆ యువకుడు చివరికి మనసును రాయి చేసుకొని ఓడెక్కాడు.

~

“కుందవై! ఆ చేపలవారి పిల్ల అలా నిలబడి చూస్తూన్న దృశ్యం ఉంది చూశావా? ఆ జ్ఞాపకం నా మనోనేత్రం ముందు కనిపిస్తూంది. మరిచిపోదామని ఎంత ప్రయత్నించినా సాధ్యం కావడం లేదు. దానికన్న శోకమైన దృశ్యం, తలుచుకొంటేనే ఒళ్ళు జలదరించే దృశ్యం ఇంకొకటి పదేపదే కనిపిస్తూంది. రాత్రింబగళ్ళు, నిద్రిస్తున్నప్పుడు, మెలకువగా ఉన్నప్పుడు కూడ అది నన్ను వేపుకొని తింటూంది. అదికూడ చెప్పనా?” అని సుందర చోళ చక్రవర్తి తన్ ప్రియపుత్రికను చూసి అడిగారు.

గద్గద స్వరంతో, “చెప్పండి, నాన్నా!” అన్నది కుందవై.

~~~
~~~

# అధ్యాయము - 17

**ఇంతవరకు** సుందర చోళ చక్రవర్తి ఎవరో మూడోవ్యక్తిని గురించి చెబుతున్నట్లు చెప్పుకొంటూ వచ్చారు.

"నా ముద్దుల కూతురా! సాధారణంగా ఒక తండ్రి తన కూతురికి చెప్పకూడని విషయాలను నీకీరోజు చెప్పబోతున్నాను. ఇంతవరకు ఎవరికీ చెప్పని విషయాలను కూడ మనసువిప్పి చెబుతాను. ఈ లోకంలోనే నా స్నేహితుడు అనిరుద్ధునికి మాత్రమే ఈ విషయాలు తెలుసు; అతడికీ పూర్తి వివరాలు తెలియదు. ఇప్పుడు నా మనసులో జరుగుతున్న పోరాటం అతడికి తెలియనే తెలియదు. కానీ నీకంతా చెప్పబోతున్నాను. మన కుటుంబంలో ఎవరికైన ఒక్కరికి తెలిసివుండాలి. నీ తల్లికి చెప్పేందుకు నా నోరు పెగలదు. నీ అన్నకు, తమ్ముడికి చెప్పలేను. నీకే చెప్పాలని కొంతకాలంగా అనుకొంటున్నాను. అందుకు సందర్భం ఇప్పుడు కుదిరింది. అందుకు కావలసిన ధైర్యంకూడ ఇప్పుడే వచ్చింది. నీవు నా పరిస్థితిని చూసి నవ్వవు; నా మనోగాయాన్ని మాపేందుకు ప్రయత్నిస్తావు; నా కోరిక నెరవేరేందుకు సహాయం కూడ చేస్తావు! ఈ నమ్మకంతో నేను నీకు చెబుతున్నాను...

"ఆ దీవినుంచి ఓడెక్కి బయలుదేరాను. కోడిక్కరై చేరాను. నా తాతగారైన పరాంతక సుందర చక్రవర్తి ఈ తంజావూరు అంతఃపురంలో విడిదిచేశారని తెలిసి తిన్నగా ఇక్కడికి వచ్చాను.

"నేనిక్కడికి వచ్చి చేరినప్పుడు ఆయన మరణోన్ముఖులైవున్నారు. ఆయన మనసు చాల గాయపడివుందప్పుడు. నలభైఏళ్లపాటు ఆయన కష్టపడి నిర్మించిన మహారాజ్యం ఛిన్నాభిన్నమైపోయింది. ఆయన తర్వాత సింహాసనమెక్కవలసిన రాజాదిత్యులు తక్కోలం యుద్ధంలో మరణించారు. అదే యుద్ధంలో తీవ్రంగా గాయపడ్డ నా తండ్రి అరింజయులు బ్రతుకుతారో లేరో అన్న స్థితిలో ఉన్నారు. కణ్ణర్రదేవుని సైన్యాలు తొండైమండలాన్ని చేజిక్కించుకొని ముందుకు రాసాగారు. దక్షిణాన పాండ్యులు మళ్ళీ తలెత్తుతున్నారు. లంకలో చోళసైన్యం ఓడిపోయి వెనుదిరిగారు. అనేక యుద్ధాలలో చోళ సామ్రాజ్యపు వీరాధివీరులు పలువురు మరణించారు. ఈ వార్తలన్నీ ఒక్కటిగ వచ్చి ముదిప్రాయంలో ఉన్న పరాంతక చక్రవర్తి మనసును చాల గాయపరిచాయి. ఈ పరిస్థితిలో నన్ను చూడగానే ఆయన ముఖం విప్పారింది. నేను చిన్నబిడ్డగా ఉన్నప్పటినుంచే నేనంటే నా తాతగారికి చాల ప్రీతి, ఆప్యాయతాను. నన్ను ఎక్కడికీ పంపించక తనతోబాటు అంతఃపురంలోనే పెట్టుకొన్నారు. హఠం పట్టి లంకకు వెళ్ళాను. అక్కడినుంచి తిరిగి వచ్చిన వారిలో నేను లేనని తెలిసి ఆయన మనసు విరిగిపోయింది. నేను బతికున్నానో లేనో కూడ తెలియనందువల్ల గుంపులు గుంపులుగా మనుషులను పంపారు.

"చివరికి ఒక గుంపు నన్ను వెతికి కనిపెట్టారు. నేను తంజావూరుకు వచ్చి చేరిన వెంటనే గాయపడ్డ ఆయన మనసు కాస్త శాంతించింది. ఆయన అంతిమకాలంలో క్షీణించిన చోళ సామ్రాజ్యం నావల్ల

మళ్లీ పైకి వస్తుందని ఆయనకు ఎలాగో నమ్మకం పుట్టింది. ఆ నమ్మకానికి జ్యోతిష్కులు ఇంకా బలాన్నిచ్చారు. అందుకు తగినట్లు, ఆయనకు నలుగురు కొడుకులున్నా, మనుమడైన నేనొక్కడిని మాత్రం మిగిలాను. చక్రవర్తి మెల్లని స్వరంతో నన్ను దగ్గరకు రమ్మని పిలిచి, నా తల నిమిరి, ""అబ్బాయీ! నా తర్వాత నీ పెదనాన్న గండరాదిత్యుడు సింహాసనమెక్కుతాడు. ఆ తర్వాత ఈ చోళ సామ్రాజ్యం నీకు చెందుతుంది. నీ కాలంలోనే ఈ చోళ సామ్రాజ్యం మళ్ళీ వర్ధిల్లబోతూంది!" అని ఆయన చాలసార్లన్నారు. చోళ సామ్రాజ్యపు గొప్పతనాన్ని నెలకొల్పడమే నా జీవిత లక్ష్యం కావాలని చెప్పి, అలా నా దగ్గర మాట కూడ తీసుకొన్నారు.

~

"నా తాతగారు నామీద ఎంత ప్రీతిగొని ఉండేవారో, నేనాయన మీద అంతే భక్తిగొన్నవాడిని. కాబట్టి ఆయన మాటను శిరసావహించి నెరవేర్చాలని నిశ్చయించాను. కానీ నామనసులో నెమ్మది లేదు. సముద్రం మధ్య ఆ దీవిలో ఎలుగుబంటికి ఎరగాకుండ నన్ను కాపాడిన ఆ యువతి గతి ఏమి? చోళ సామ్రాజ్యపు సింహాసనం మీద ఒక కిందిజాతి మూగపిల్ల విలసిల్లడం సాధ్యమా? అంతఃపుర జీవనం ఆమెకు సరిపడుతుందా, ఏమి? దేశప్రజలు, నగర పౌరులు నన్ను చూసి నవ్వరా? ... ఈ ఆలోచనలన్నీ నామనసును పట్టి పీడించసాగాయి. ఇది మాత్రమేగాక, నా పెదనాన్న గండరాదిత్యులు ఇటీవల మళ్ళీ వివాహం చేసుకొన్నారు. ఆయనను పెళ్ళిచేసుకొన్న భాగ్యవతి మళవరయ్యర్ కులపు ఆడపడుచు అన్న విషయం నీకు తెలిసిందే. మొదటి భార్యకు సంతానం కలగలేదంటే రెండవ భార్యకు కూడ కలగరని ఎలా చెప్పగలం? పెదనాన్నకు మగబిడ్డ పుడితే రాజ్యం నాకెలా వస్తుంది? కానీ అటువంటి సందేహం ఎవరికీ కలగకూడదని మహాత్ముడైన నా పెదనాన్న కోరుకొన్నారు కాబోలు. పరాంతక చక్రవర్తి దివంగతులైన తర్వాత గండరాదిత్యులకు పట్టాభిషేకం జరిగింది. అదే సమయంలో నాకు యువరాజు పట్టాభిషేకం జరగాలని నా పెదనాన్న – కొత్త చక్రవర్తి - ఏర్పాట్లు చేసేశారు.

"నా ముద్దుల కూతురా! ఇప్పుడు నీ తమ్ముడు అరుళ్మొళి మీద ప్రజలెంత అభిమానంగొనివున్నారో, ఆ కాలంలో ప్రజలు నామీద అంతటి అభిమానం, ప్రీతిగొనివుండేవారు. అంతఃపురంలో పట్టాభిషేకం జరిగేటప్పుడు, బయట వేలకొద్ది ప్రజలు వేచివున్నారు. కొత్తగా పట్టం కట్టుకొన్న చక్రవర్తి, యువరాజు ఒక్కటిగా వారికి దర్శనమివ్వాలని వారి కోరిక. అలాగే నా పెదనాన్న, నేను కలిసివచ్చి ఈ అంతఃపురపు పైమేడ మీద నిలబడ్డాము. కింద గుమిగూడిన ప్రజలు ఒక మహాసముద్రంలాగే కనిపించించారు. అందరి ముఖాలు మమ్మల్ని చూడగానే విప్పారాయి. మనం యువరాజుగా పట్టం కట్టుకొన్న విషయం గురించి ఇంత మంది ప్రజలు కుతూహలపడుతున్నారు కద? అదలా ఉండగా, మనమేమో ఎక్కడో ఒక కంటికి కనిపించని దీవిలో అడవి మధ్య బతికే ఒక మూగపిల్ల గురించి దిగులు పడడం ఏం న్యాయం? ఇంతమంది ప్రజల సంతోషం/ఆనందం ముఖ్యమా? ఒక మూగపిల్ల బతుకు

ముఖ్యమా? ...

ఇలా ఆలోచిస్తూ, తలెత్తి మమ్మల్నే చూస్తున్న ప్రజలందరి ముఖాలను నిదానంగా పరికించి చూడసాగాను. వారిలో ముసలివారు. యువతులు, యువకులు, చిన్న పిల్లలు - అందరూ ఉన్నారు. అందరూ ఉత్సాహంగా కనిపించారు. కానీ ఉన్నట్లుండి ఒక ముఖం, ఒక ఆడపిల్ల ముఖం, శోకం నిండిన ముఖం, కన్నీళ్ళు నిండిన ముఖంతో నన్నే దీనంగా చూస్తున్న ముఖం - కనిపించింది. అంత పెద్ద గుంపులో ఆ ఒక్క ముఖం నా కళ్ళను ఎలా ఆకట్టుకొందో తెలియదు. తర్వాత అక్కడినుంచి నా కళ్ళు కదలలేదు. ఆ ముఖం రానురాను పెద్దది కాసాగింది; నా దగ్గరకే వస్తున్నట్లనిపించింది. చివరికి ఆ పెద్ద జనసమూహం, నా దగ్గర నిలబడ్డ నా సన్నిహితులు, అంతఃపురం, తంజావూరు కోట, భూమి, ఆకాశం అన్నీ మరుగైపోయి ఆ ముఖం మాత్రమే దేవి పరమేశ్వరి విశ్వరూపంలాగ నా ముందు అగుపించింది. నా తల తిరిగింది; కాళ్ళు వణికాయి; స్పృహ తప్పింది.

‘‘అలాగే మైకం వచ్చి పడిపోయానని, పక్కనున్న వాళ్ళు నన్ను పడిపోకుండ పట్టుకొన్నారని తర్వాత తెలుసుకొన్నాను. పట్టాభిషేకానికి సంబంధించిన కార్యాలతో నేను చాల అలిసిపోయానని అందరూ అనుకొన్నారు. ప్రజలకు దర్శనమిచ్చింది చాలని నన్ను అంతఃపురంలోకి తీసుకొని వెళ్ళారు. నాకు తెలివి వచ్చిన తర్వాత నా స్నేహితుడు అనిరుద్ధుని ఏకాంతంగా కలిసి, నేను చూసిన దృశ్యాన్ని చెప్పాను. ఆ మూగపిల్ల గుర్తులు చెప్పి, ఎలాగైన ఆమెను వెతికి పిలుచుకొని రావాలని ఆజ్ఞాపించాను. తంజావూరు మూలమూలలా వెతికినా అటువంటి పోలికలు కలిగిన మూగపిల్ల కనబడలేదని అనిరుద్ధుడు వచ్చి చెప్పాడు. ఆ దృశ్యం నా చిత్తభ్రమై ఉండవచ్చన్నాడు నా మిత్రుడు! నేనతడిపైన కోపించుకొని, 'నీవీ మాత్రం సహాయం చేయలేకపోతే నీవేం స్నేహితుడివి?' అన్నాను. తంజావూరు కోట బయటి నుంచి సముద్రంవైపు వెళ్ళే కాలి బాటల వెంబడి మనుషులను పంపి వెతకమన్నాను. అలాగే చాల మంది మనుషులు ఆ బాటల వెంబడి కడలి తీరం వరకు వెళ్ళి వెతికారు. వెళ్ళినవారు సముద్రతీరాన ఉన్న దీపగృహపు కాపలాదారుని ఇంట ఒక మూగపిల్ల ఉన్నట్లు కనుగొన్నారు. ఆమె పిచ్చిదానిలాగ కనిపించిందట. ఎన్నో సైగలతో విషయాన్ని ఆమెకు విషయాన్ని తెలియజేయ ప్రయత్నించి విఫలురైనారట. ఆమె వారితో తంజావూరుకు రావడానికి ముమ్మాటికీ ఒప్పుకోలేదట. వారు ఈ వార్త తీసుకొని రాగానే ఏం చేయాలో తోచక మనసు కలతబారింది. రెండురోజులు ఆ దిగులుతోనే ఉన్నాను. ఆమెను మరిచిపోవడానికి ఎంత ప్రయత్నించినా వీలుపడలేదు. రాత్రింబగళ్ళు అదే జ్ఞాపకం రాసాగింది. రాత్రి ఒక్క క్షణం కూడ నిద్రపట్టదు. తర్వాత అనిరుద్ధుని వెంట తీసుకొని కోడిక్కరైకి వెళ్ళాను. గుర్రాలు ఎంతవేగంగా వెళ్ళగలవో అంత వేగంగా వెళ్ళాను. వెళ్ళేటప్పుడు నా కలత ఇంకా ఎక్కువైంది. ఆ మూగపిల్ల అక్కడ కనిపిస్తే తర్వాత ఆమెనేం చేయాలన్న సమస్య నా మనసులో ఒక పెద్ద కల్లోలాన్ని రేపింది. తంజావూరుకో, పళైయారైకో ఆమెను తీసుకొని వెళ్ళి, 'ఈమే నా రాణి!' అని చెప్పడమా? అలా ఆలోచించినప్పుడు నా మనసు, ఒడలుకూడా కుంగిపోయాయి.

"నా బంగారూ! ఆ రోజుల్లో నేను దేహసౌందర్యంలో సాటిలేని వాడని నాకు పెద్ద పేరుండేది. నేను దాన్ని ఒక పొగడ్తగానే ఎంచలేదు. కానీ దాని గురించే ఎప్పుడూ మాట్లాడుతుండేవారు. నా తాతగారి పేరైన 'పరాంతకుడు' అన్న పేరు నాకు పెట్టినా, అది పూర్తిగా మరుగుపడిపోయేటట్లు నా పేరును"సుందర చోళుడు' అని మార్చేశారు. అలా పేరొందిన నేను, నాగరికతే తెలియని ఒక మూగపిల్లను అంతఃపురానికి ఎలా తీసుకురాను? లేకపోతే ఆమెనేం చేయను? - ఇలా పలువిధాలుగా ఆలోచించి సుడులు తిరుగుతున్న మనసుతో కోడిక్కరై చేరాను. ఆ మహాతల్లి నాకా కష్టం లేకుండ చేసేసింది. నా మనుషులు వెనుదిరిగిన మరుసటిరోజే దీపగృహం పైకెక్కి సముద్రంలోకి దూకేసిందట. ఆ రోజు అమావాస్య గాలి బలంగా వీస్తూంది. సముద్రం ఉప్పొంగి దీపగృహం చుట్టూ సుడులు తిరుగుతున్నాయి. ఆమె ఆ సముద్రపుటలలను అలాగే కాసేపు చూస్తూ నిలబడిందట. ఆమె తరచూ అలా దీపగృహం మీద నిలబడి సముద్రాన్ని చూస్తూండడం పరిపాటి అట. కాబట్టి ఎవరూ అంతగా పట్టించుకోలేదట! ఉన్నట్లుండి కెవ్వుమన్న కేక అలల హోరును మీరి వినిపించిందట. తర్వాత ఆమె కనిపించలేదట! ఒక స్త్రీరూపం దీపగృహం మీదినుంచి తలకిందులుగా సముద్రంలోకి పడిపోవడం ఒకదిద్దరు చూశారట. పడవలు తీసుకొని వచ్చి వీలైనంతవరకు సముద్రంలో వెతికి చూశారుగాని ఆమె దొరకలేదు. కల్లోలపూరితమైన ఆ కడలి ఆమెను మింగేసిందని తీర్మానించవలసి వచ్చింది.

"ఈ వార్త వినగానే నా గుండెలో ఈటె దూసుకొని పోయినట్లు బాధ, ఆవేదన కలిగాయి. కానీ కాసేపటికల్లా ఒక విధమైన ప్రశాంతత నెలకొంది నా మనసులో. నా ఎదలో ఆమెనేంచేయాలన్న ప్రశ్న ఇక లేదు. అందుగురించి ఆలోచించి మనసును కల్లోల పరుచుకోవలసిన అవసరం లేదు!

"దుఃఖమూ, ప్రశాంతతా మిళితమైన ఈ విచిత్రమైన వేదనతో తంజావూరుకు వెనుదిరిగాను. రాజ్యకార్యాలపై మనసును మళ్ళించాను. యుద్ధాలకు వెళ్ళాను. నీ తల్లిని పెళ్ళాడాను. వీరపుత్రులను కన్నాను. నిన్ను నా కూతురుగా పొందే భాగ్యం కూడ కలిగింది....

"అయినా, చనిపోయిన ఆ నిర్భాగ్యురాలిని నేను మరువలేకపోయాను. కొన్నిసార్లు నా కలలో ఆ భయంకర దృశ్యం - నేనే నా కళ్ళతో చూసిన ఆ దృశ్యం - కనిపించి వేధించేది. దీపగృహశిఖరం నుంచి ఒక స్త్రీరూపం తలకిందులుగా సముద్రంలోకి పడ్డ ఆ దృశ్యం నా కలలోను, స్పృహలోను కనిపించసాగింది. కలలో ఆ భయంకర దృశ్యం కనిపించినప్పుడల్లా నేను అదిరిపడి కేకలు వేస్తూ లేచేవాడిని. పక్కన పడుకొన్నవారు, 'ఏమైంది? ఏమైంది?' అని అడిగేవారు. నీతల్లి నన్ను ఎన్నోసార్లు అడిగింది. కానీ నేను నిజం చెప్పలేదు. 'ఏమీ లేదు' అని కొన్నిసార్లు దాటేసేవాడిని. లేకపోతే యుద్ధరంగపు భయంకర దృశ్యాలను ఊహించి చెప్పేవాడిని. కాలక్రమేణా ఆ భయంకర దృశ్యం నన్ను విడిచిపెట్టి వెళ్ళింది. విడిచి వెళ్ళిందని ఇటీవలివరకు నేననుకొన్నాను. కానీ బతికున్నవారికన్న చనిపోయినవారు చాలక్రూరులని అనిపిస్తూంది. కూతురా! మూగదాని ఆత్మ నన్ను వదిలిపెట్టి పోలేదు. కొంతకాలంగా అది నాకు మళ్ళీ

కనిపించి వేధిస్తూంది! అమ్మా! చనిపోయిన వారు మళ్ళీ బతికివస్తారని నీవు నమ్ముతావా...?"

~

ఇలా చెప్పి చక్రవర్తి తన దృష్టిని ఎక్కడో దూరంగా సారించి వెర్రిగా చూడసాగారు. ఆయన చూసిన దిక్కున ఏమీ లేదు, నిజమే! కానీ ఆయన ఒళ్ళు వణకడం కుందవై గమనించింది. ఆమెకాయన పైన ఎనలేని జాలి కలిగింది. కళ్లలో నీరుబికింది. తండ్రి ఎదలో తన ముఖాన్ని దాచుకొని కన్నీళ్ళు విడిచింది. అందువల్ల ఆయన వణుకు కూడ తగ్గినట్లనిపించింది. తర్వాత తలెత్తి తండ్రిని చూసి, "నాన్నా! ఈ భయంకరమైన వేదనను ఇన్నాళ్ళు మనసులో దాచుకొని కుమిలిపోతున్నారు. అందుకే మీ ఒళ్ళుకూడ కుంగిపోయింది. ఇప్పుడు నాకు చెప్పేశారు కదా? ఇకపైన మీరు కోలుకొంటారు!" అన్నది.

అది విని సుందర చోళ చక్రవర్తి నవ్విన నవ్వులో వేదనతోబాటు అపనమ్మకం కూడ కలగలిసివుంది. ఆయనిలా అన్నారు:-

"కుందవై! నీవు నమ్మలేదు. చనిపోయినవారు మళ్లీ బతికివస్తారని నీవు నమ్మడం లేదు. అయినా కూడ, అదిగో ఆ స్తంభం పక్కన, స్తంభదీపం వెనుక, ఆ పాపి ఆత్మ నిన్న కనిపించింది. నా కళ్లతో నేనే చూశాను. దాన్ని నమ్మకపోవడం ఎలా సాధ్యం? నేను చూసింది ఒట్టి భ్రమే అయితే, నీ స్నేహితురాలి మాటేమి? ఆమె దేన్నో చూసి, దేన్నో విన్నందువల్లనే కద తెలివితప్పి పడిపోయింది? ఆమెను పిలుచుకొని రా, కుందవై! నేనే స్వయంగా అడిగి తెలుసుకొంటాను!" అని సుందర చోళ చక్రవర్తి ఉద్వేగంతో అన్నారు.

"నాన్నా! వాణతి ఒట్టి బెదురుగొట్టు! కొడుంబాళూర్ వీర వేళార్ల వంశంలో ఇది ఎలా పుట్టిందో తెలియదు. చీకట్లో స్తంభాన్ని చూసినా బెదిరిపోయి మైకం వచ్చి పడిపోతుంది. దాన్ని అడిగి ఏమీ ప్రయోజనం లేదు - అదేమీ చూసీ ఉండదు, వినీ ఉండదు."

"అలాగా? సరే పోతేపోనీ, ఆమె సంగతి వదిలేద్దాం. నేను చెప్పవలసింది ఇంకా ఉంది, విను! చనిపోయినవారు మళ్ళీ లేచివస్తారని నాకు కూడ చాలకాలం నమ్మకం ఉండేదికాదు. అటువంటి దృశ్యాలు వట్టి చిత్తభ్రమే అనుకొన్నాను. కావేరి నదిలో మనమంతా విహారానికి వెళ్ళినప్పుడు బిడ్డ అరుళ్మొళి ఉన్నట్లుండి కనిపించకుండ పోయిన విషయం నీకు గుర్తుంది కదా? మనమందరం ఏం చేయాలో దిక్కుతోచక బెంబేలు పడుతున్నప్పుడు ఒక స్త్రీ పొన్ని నది వెల్లువ నుంచి బిడ్డను పైకి తీసి ఇచ్చింది. బిడ్డను తక్కినవారు తీసుకొన్న వెంటనే ఆమె మరుగైపోయింది. దీని గురించి మనమెన్నోసార్లు మాట్లాడుకొన్నాము. మీరందరు కావేరిమాతే బిడ్డను కాపాడిందని తీర్మానించారు. కానీ నా కంటికేం కనిపించిందో తెలుసా? ఆ చేపలు పట్టేవారి (బెస్త) జాతికి చెందిన ఆ మూగపిల్లే బిడ్డను కాపాడి ఇచ్చినట్లు అనిపించింది. ఆనాడు కూడ నేను వెంటనే తెలివి తప్పిపడిపోయానన్న విషయం నీకు గుర్తుంది కదా? బిడ్డకు కలిగిన ప్రమాదం వల్లనే నేనలా మూర్ఛిల్లానని అందరూ అనుకొన్నారు. కానీ నిజమది కాదు. ఇన్నాళ్ల తర్వాత నీకు చెబుతున్నాను - బిడ్డను కాపాడిన స్త్రీరూపం ఆమె ఆత్మారూపమే అని

నాకనిపించినందువల్లే నేను తెలివి తప్పాను...

"కుమారీ! నీ అన్నకు యువరాజు పట్టం కట్టినరోజు గుర్తుందా? ఆనాడు ఆదిత్య కరికాలన్ రాజమాతల ఆశీర్వాదం తీసుకోవడానికి అంతఃపురానికి వచ్చాడు కద? వాడివెంట నేనూ వచ్చాను. అదే మూగపిల్ల ఆత్మ అంతఃపుర స్త్రీల మధ్య నించొని ఆదిత్యుని వైపు కఠోర వీక్షణాలు సారించడం చూశాను. మళ్ళీ ఇంకొకసారి ప్రజ్ఞ కోల్పోయాను. తర్వాత మళ్ళీ ఆ సంభవం గురించి ఆలోచించినప్పుడు ఒక సందేహం పుట్టింది. ఆమె అలా కరికాలన్ వైపు క్రూరంగా చూడవలసిన అవసరమేమి? అది కూడ నా చిత్తభ్రమేమోననుకొని ఊరకుండిపోయాను. కానీ ఈసారి తంజావూరుకు వచ్చిన తర్వాత ఆ సందేహమంతా తీరిపోయింది. ఒకానొకప్పుడు - ఆమె బతికున్నప్పుడు - ఆమె ముఖం చూసి ఆమె మనసులో ఉన్నది గ్రహించేవాడిని; ఆమె పెదవుల కదలికలనుంచి ఆమె చెప్పదలచుకొన్నదేమిటని తెలుసుకొనేవాడిని. ఆ శక్తిని నేను మళ్ళీ పొందాను! కుందవై! నాలుగైదు సార్లు నడిరాత్రి నాముందు ప్రత్యక్షమై నాకు హెచ్చరిక ఇచ్చేసింది. 'నన్ను చంపేశావే! అందుకు నిన్ను క్షమిస్తున్నాను. కానీ మళ్ళీ పాపం చేయకు! ఒకరికి చేరవలసిన రాజ్యాన్ని ఇంకొకడికివ్వకు!' అని ఆమె చెప్పడాన్ని నేను అర్థం చేసుకొన్నాను. ఆమెకు మాట్లాడే శక్తి వచ్చి మాట్లాడితే ఎలా తెలుసుకొనేవాడినో అంత తేటగా తెలుసుకొన్నాను. కూతురా! దాన్ని నెరవేర్చేందుకు నీవే నాకు సహాయం చేయాలి. శాపానికి గురైన ఈ రాజ్యం - ఈ చోళ సింహాసనం - నా కొడుకులకు వద్దు! దీన్ని మధురాంతకునికి ఇచ్చేద్దాం..."

~

కుందవై ఇప్పుడాయన మాటలకడ్డుపడి, "నాన్నా! ఏమంటున్నారు? ఊరూ, వాడా ఒప్పుకొని జరిపించిన కార్యాన్ని ఇప్పుడు మార్చవలసిన అవసరమేమి? మీరు మార్చినా, లోకం ఒప్పుకొంటుందా?" అని అడిగింది.

"లోకం ఒప్పుకొంటేనేమి, లేకపోతేనేమి? ధర్మం ఇది అని తెలుసుకొని చేయవలసిన కర్తవ్యం నాది. నేనీ చోళ సామ్రాజ్యానికి యువరాజుగా, తర్వాత చక్రవర్తిగా పట్టం కట్టుకొన్నప్పుడే నాకు మనశ్శాంతి లేకుండ పోయింది. మనస్సాక్షి నన్ను వేధిస్తోంది. పెద్దాయన కొడుకు బతికుండగా చిన్నవాడి కుమారుడనైన నేను సింహాసనమెక్కిందే తప్పు. ఆ పాపఫలాన్ని నేనిప్పుడు అనుభవిస్తున్నాను. నా కుమారులు కూడ అటువంటి పాపానికి ఎందుకు గురికావాలి? ఆదిత్యునికీ రాజ్యం వద్దు; అరుళ్మొళికీ రాజ్యం వద్దు; ఈ రాజ్యంతోబాటు వచ్చే శాపంకూడ వద్దు. నేను ప్రాణాలతో ఉండగానే మధురాంతకునికి పట్టం కట్టేయాలి. తర్వాత కరికాలన్ కంచిలో కట్టించిన స్వర్ణమాళిగలో నెమ్మదిగా కాలం వెళ్ళబుచ్చుతాను..."

"నాన్నా! పెద్దనానమ్మ ఇందుకు సమ్మతించాలి కద?"

"కూతురా! అందుకే కద నీ సహాయం కోరుతున్నాను! ఏదో ఒక కారణం చెప్పి పెద్దనానమ్మను

ఇక్కడికి రప్పించు. ఆహా! ఎన్నెన్నో తెలిసిన ఆ మహాతల్లికి ఈ ధర్మ సూక్ష్మం ఎందుకు తెలియలేదు? నన్నెందుకు ఈ పాపం చేసేందుకు పురిగొల్పారు? తన సొంత కొడుకుపైన ఎందుకంత కోపం? తల్లి స్వభావానికే విరుద్ధంగా నడుచుకోవాలని ఎందుకంత హఠం? మధురాంతకుడు అప్పుడేమో శివభక్తుడై సన్యాసినవుతానని చెబుతుండేవాడు. అప్పుడు అది న్యాయమేననిపించింది అందరికీ. ఇప్పుడు వాడికే రాజ్యమేలే ఆశ పుట్టినప్పుడు ఇంకొకరికి ఎలా పట్టం కట్టగలం?"

"నాన్నా! రాజ్యమేలే ఆశ ఉండవచ్చు; అందుకు తగిన అర్హత ఉండాలి కద?"

"ఎందుకు లేదు? మహానుభావుడైన గండరాదిత్యులకు, మహాజ్ఞానియైన మళవరయ్యర్ కుమారికి పుట్టిన కుమారునికి ఎలా అర్హత లేకుండ పోతుంది?"

"అర్హత ఉండవచ్చు; దేశప్రజలు అందుకు ఒప్పుకోవాలి కద?"

"ప్రజల అభిప్రాయం అడిగేటట్లయితే, వారు నీ తమ్ముడికి వెంటనే పట్టం కట్టాలని అంటారు. అది న్యాయమా? అరుళ్మొళి మాత్రం అందుకు ఒప్పుకొంటాడా?... ఇదంతా వ్యర్థాలోచన తల్లీ! ఎలాగైన నీ పెదనానమ్మను త్వరలో ఇక్కడికి పిలుచుకొని రా! నేను యముడితో పోరాడుతున్నానని రాసి పంపించు; నన్ను ప్రాణాలతో చూడాలంటే వెంటనే బయలుదేరి రావాలని రాసి పంపించు..."

"అదేమీ అవసరం లేదు, నాన్నా! తంజావూరు తళికుళత్తార్ ఆలయానికి కైంకర్యం చేయాలని పెదనానమ్మ ఎప్పటినుంచో కోరుకొంటున్నారు. దాన్ని ప్రస్తావిస్తూ ఇప్పుడు ఇక్కడికి రావడం అత్యవసరమని రాసి పంపుతాను. అంతవరకు మీరు సహనంతో ఉండండి, నాన్నా!"

తండ్రికి ఇలా నచ్చజెప్పి కుందవై తన నివాసానికి తిరిగి వెళ్ళింది. దారిలో తల్లి వాణమాదేవిని కలిసి మాట్లాడింది. "అమ్మా! ఇకమీదట నాన్నగారిని ఒక్క క్షణం కూడ విడిచి ఉండకండి! తక్కిన వారు వెళ్ళి చేయవలసిన పూజలు చేయనీ!" అన్నది.

కుందవై మనసులో కొంతకాలంగా కమ్ముకొన్న సందేహమేఘాలు ఇప్పుడు కాస్త వీడాయి. చిమ్మ చీకటిలో కాస్త వెలుతురు కనబడసాగింది. తన తండ్రికి, సహోదరులకు విరుద్ధంగా ఏదో కుతంత్రమో, కుట్రో జరుగుతోందని ఆమె మనసు గ్రహించింది. కానీ అది ఎటువంటి కుట్ర, ఎటువంటి మలుపులు తిరగబోతూంది అన్న విషయం ఆమెకు ఇంకా పూర్తిగా అర్థం కాలేదు. చోళ సామ్రాజ్యానికి, ఆ సామ్రాజ్యం మీద తన సహోదరులకున్న హక్కుకు పెద్ద అపాయం మూడిందని గ్రహించింది. ఆ అపాయం నుంచి వారిని కాపాడవలసిన బాధ్యత కూడ తనమీదుందని నమ్మింది.

~~~
~~~

# అధ్యాయము - 18

## "ద్రోహాలలో ఏది అతి నీచమైనది?"

**పురాతన** తమిళనాడు చరిత్రను చదివినవారు ఆరోజుల్లో స్త్రీలు సాంఘిక జీవనంలో ముందడుగు వేసి ప్రముఖంగా పాల్గొనేవారని ఎరుగుదురు. రాజవంశంలో పుట్టిన మహిళలు చాల గౌరవించబడేవారు. చోళవంశంలో పుట్టిన రాజకులస్త్రీలు స్వంత ఆస్తి హక్కు కలిగివుండేవారు. ఒక్కొక్కరికి వంశపారంపర్యంగా గ్రామాలు, మాన్యం భూములు ఉండేవి. ఈ ఆస్తులను, ఆభరణాలను వారు ఎలా ఉపయోగించారనేది గమనించాలి. పలువురు వేర్వేరు ఆలయాలలో కైంకర్యం చేసేందుకు వాటిని వినియోగించారు. ఆలయ దీపాలు వెలిగించడం, మాలలు అర్పించడం, ప్రవాసులకు, యాత్రికులకు, శివభక్తులకు తీర్థామృతం చేసి వడ్డించడం - మొదలైన వాటికి పలు రాజవంశ స్త్రీలు ఏర్పాట్లు చేయించేవారు. ఆ ఏర్పాట్లను శిలాశాసనాలు లేదా తామ్ర ఫలకాలలో రాయించారు.

అంతఃపురస్త్రీలు ఆలయ కైంకర్యం/సేవ చేయడం ఆరోజుల్లో సంప్రదాయంగా ఉంటే, సుందర చోళచక్రవర్తి ముద్దుల కుమార్తె కుందవై మాత్రం తన ఆస్తులను ఇంకొక విధంగా ఉపయోగించింది. జబ్బుపడ్డ తన తండ్రిని చూసో ఏమో, దేశమంతటా ధర్మ వైద్యశాలలు నెలకొల్పాలని నిశ్చయించింది. పళైయారైలో తన తాతగారైన పరాంతక చోళ చక్రవర్తి పేరున ఒక వైద్యశాలను స్థాపించిన విషయం మనం ఇప్పటికే చూశాము. అలాగే తంజావూరులో తన తండ్రిపేరున ఒక వైద్యశాలను నెలకొల్పేందుకు ఏర్పాట్లు చేయించింది. ఈ విజయ దశమి దినం ఆ వైద్యశాల ఉద్ఘాటనకు, అందు గురించిన దాన శాసనాలను రాయించేందుకు ఏర్పాట్లు చేయబడ్డాయి.

~

తంజావూరు కోట బయట ఉన్న పురంపాడిలోని పెరుమాళ్ళ కోవెల ఎదురుగా ఉన్న గరుడ మంటపంలో సుందర చోళ చక్రవర్తి ధర్మవైద్యశాల ప్రారంభోత్సవం జరిగింది. గరుడాళ్వార్ అమృతం తీసుకొని వచ్చిన ఆలయం కావడం వల్ల, విష్ణుదేవాలయానికి చెందిన ఆ గరుడ మంటపంలో వైద్యశాలను ఏర్పాటు చేయించింది కుందవైదేవి. ఈ వైభవాన్ని చూసేందుకు తంజావూరు నగర ప్రజలు, చుట్టుపక్కల గ్రామస్థులు అసంఖ్యాకంగా వచ్చి చేరారు. చక్కగా వస్త్రాభరణాలతో అలంకరించుకొని వచ్చిన స్త్రీలు, పురుషులు, పిల్లలతో అక్కడ చాల సందడిగా ఉంది. చక్రవర్తిగారి మంత్రులు, చిన్న, పెద్ద అధికారులు, శిలాశాసనాలు చెక్కేవారు, తామ్రపత్రాలు రాసే విశ్వకర్మలు, అంతఃపురపు పనివారు లెక్కలేనంతమంది వచ్చి చేరారు. తమ్మెట, కొమ్ముబూరా మొదలైన వాద్యాలను దిక్కులు పిక్కటిల్లేలాగ వాయిస్తూ వేళక్కార దండు సైనికులు వచ్చారు. తంజావూరు కోట కాపలా వీరులు శూలాలు, కత్తులతో వీరప్రహారాలు చేస్తూ వచ్చారు.

పళువేట్టరయ్యర్లు ఇద్దరూ ఏనుగుపైనెక్కి గంభీరంగా వచ్చారు. మధురాంతకులు ఒక తెల్ల గుర్రం మీద ఎక్కలేక ఎక్కి వచ్చి చేరారు. యువరాకుమారి కుందవై, ఆమె చెలికత్తెలు, అంతఃపుర ప్రౌఢవనితలు పల్లకీలలో వచ్చారు. ఇంకొకవైపు నుంచి పళువూర్ రాణి నందిని తాటి చిహ్నం పొదిగిన ఒక దంతపు పల్లకిలో వచ్చింది.

అంతఃపురస్త్రీల కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన నీలి పట్టు వస్త్రం పరిచిన పందిరి కింద కుందవైదేవి, పళువూర్ రాణి, అంతఃపుర ప్రౌఢవనితలు ఆసీనులయ్యారు.

తర్వాత పెద్ద పళువేట్టరయ్యర్ సంజ్ఞామూలకంగ అనుమతి ఇవ్వగా, కార్యక్రమం మొదలైంది. ముందు వాచకులు 'మంత్రించిన నీరు' అన్న దేవారాలను పాడారు. యాళ్, మద్దెల మొదలైన పక్కవాద్యాలతో కూడిన ఆ ఇంపైన గానలహరిని విని ప్రజలు మైమరచారు. ఆ మహాజనసముద్రంలో అప్పుడు పూర్తి నిశ్శబ్దం నెలకొంది. కానీ అంతఃపురస్త్రీలు ఆసీనులైవున్న చోట మాత్రం ఇద్దరు మెల్లగా మాట్లాడుకోవడం వినిపించింది. నందిని కుందవైదేవి దగ్గరకొచ్చి కూర్చొని, “దేవీ! ఒకానొకప్పుడు సంబంద పెరుమాళ్ ఈ పాటను పాడి తిరుమంజనం పూసి పాండ్యరాజు జబ్బును నయం చేశారు కద? ఇప్పుడెందుకా పాటకు ఆ శక్తి లేదు? పాటకు శక్తి లేకపోయినా, తిరుమంజనానికి శక్తి లేకుండపోయింది కద? మందులు, మాకులు, వైద్యులు, వైద్యశాలలు - ఇవన్నీ ఈ కాలంలో అత్యవసరమైనాయి కద?” అన్నది.

“అవును, రాణీ! ఆ కాలంలో ధర్మం ఉచ్ఛస్థితిలో ఉండేది. అందువల్ల మంత్రజలానికి అంతటి శక్తి ఉండేది. ఇప్పుడు లోకంలో పాపం పెరిగిపోయింది. రాజులకు విరుద్ధంగా కుట్రలు పన్నే ద్రోహులు దేశంలో పుట్టుకొస్తున్నారు. ఇలాంటివి మనం మునుపు విని ఎరుగుదుమా? అందుకే మంత్రానికి శక్తి తగ్గిపోయి మందుల అవసరం ఏర్పడుతోంది!” అని చెప్పి యువరాకుమారి కుందవై పళువూర్ రాణి ముఖాన్ని పరీక్షగా చూసింది.

నందిని ముఖంలో ఎటువంటి మార్పు తోచలేదు. “అలాగా? రాజుగారికి విరుద్ధంగా కుట్రపన్నే ద్రోహులు ఈ నాట ఉన్నారా? వారెవరు?” అని అమాయకంగా అడిగింది.

“అదే నాకూ తెలియడం లేదు. కొందరు ఒకరిని చెబుతున్నారు. ఇంకొందరు వేరొకరని చెబుతున్నారు. ఏది నిజమని తెలుసుకోవడానికి కొన్నాళ్ళు ఇక్కడే ఉండి చూద్దామనుకొంటున్నాను. పళైయారైలో ఉంటే లోకం పోకడ ఏం తెలుస్తుంది?” అన్నది కుందవై.

“మంచి నిర్ణయం తీసుకొన్నారు. నన్నడిగితే మీరు ఇక్కడే ఉండడం మంచిది. లేకపోతే రాజ్యం మట్టికొట్టుకు పోతుంది. నేనుకూడ మీకు నా చేతనైన సహాయం చేస్తాను. మా ఇంట ఒక అతిథి ఉన్నాడు. అతడు కూడ మీకు సహాయం చేయవచ్చు!” అన్నది.

“ఎవరా అతిథి?” అని అడిగింది కుందవై.

"కడంబూర్ శంబువరయ్యర్ కొడుకు గందమారన్. మీరతడిని ఇంత క్రితం చూసి ఎరుగుదురా? కొబ్బరి చెట్టంత ఎత్తుగా బలంగా ఉంటాడు. ఎప్పుడూ 'ద్రోహి', 'గూఢచారి' అని గొణుగుతున్నాడు. కాసేపటి కిందట రాజద్రోహం గురించి చెప్పారు కద? దాని కన్న పెద్ద ద్రోహం ఏమిటో తెలుసా?"

"బాగా తెలుసు. పాణిగ్రహణం చేసిన భర్తకు, స్త్రీగా పుట్టిన ఒక వనిత ద్రోహం చేస్తే అది రాజద్రోహం కన్న నీచమైనది!"

ఇలా చెప్పి కుందవై మళ్ళీ నందిని ముఖాన్ని పరీక్షగా చూసింది. ఆమె ఎదురుచూసిన మార్పేమీ కనిపించలేదు. నందిని ముఖంమీద మునుపటిలాగనే మోహన మందహాసం విరిసింది.

"మీరు చెప్పింది చాల ఒప్పే; కానీ గందమారన్ ఒప్పుకోడు. 'అన్నిటికన్న నీచమైనది మిత్రద్రోహం' అంటాడు. అతని ప్రాణస్నేహితుడని చెప్పుకొనే ఒకడు గూఢచారిగా మారడమేగాక, అతన్ని వెన్నుపోటు పొడిచి పారిపోయాడట. అప్పటినుంచి ఇలా పలవరిస్తున్నాడు."

"ఎవరా నీచుడు?"

"ఎవరో వంతిదేవుడట! తొండైమండలంలో తురువల్లం అనే ఊరిని ఒకప్పుడు ఏలిన వాణర్ కులానికి చెందిన వాడట! మీకు తెలుసా?"

"ఎప్పుడో, ఎక్కడో విన్నట్లుంది. తర్వాత ఏమైంది?"

"తర్వాతేమి? గందమారన్ని వెన్నుపోటు పొడిచి పారిపోయాడు. ఆ గూఢచారిని పట్టుకోవడానికి నా బావమరిదిగారు మనుషులను పంపారని వినికిడి!"

""అతడు గూఢచారి అని ఖచ్చితంగా ఎలా తెలుసు?"

"అతడు గూఢచారో, కాదో నాకేం తెలుసు? శంబువరయ్యర్ కొడుకు చెప్పింది మీకు చెబుతున్నాను. మీరు కావాలంటే అతన్నే ప్రత్యక్షంగా అడిగి అన్ని వివరాలు తెలుసుకోవచ్చు."

"అవును. శంబువరయ్యర్ కుమారుని నేనుకూడ తప్పక చూసి తీరాల్సిందే. అతడు బతికిందే పునర్జన్మ అని విన్నాను. అప్పటినుంచి పళువూర్ అంతఃపురంలోనే ఉన్నాడా?"

"అవును. గాయపడ్డ మరుసటిరోజు పొద్దున అతన్ని తీసుకొనివచ్చి మా అంతఃపురంలో పడవేశారు. గాయానికి చికిత్స చేయవలసిన బాధ్యతకూడ నా తలమీదే పడింది. మెల్లగ బతికి బయట పడ్డాడు. గాయం ఇంకా పూర్తిగా మానలేదు!"

"మీరు పక్కనుండి పరామర్శిస్తున్నప్పటికీ ఇంకా నయం కాలేదంటే ఆశ్చర్యమే. అలాగే కానివ్వండి, రాణీ! నేనతన్ని తప్పక వచ్చి చూస్తాను. శంబువరయ్యర్ కుటుంబం/కులం నిన్న, మొన్నటిది కాదు కద? పరాంతక చక్రవర్తి కాలంనుంచి వీరకృత్యాలకు ఖ్యాతిగాంచినది కద?"

"అందుకనే నేను చెప్పాను - గందమారన్ని చూసే నెపంతోనైన మాపేద ఇంటికి మీరు దయచేయవచ్చు కద?" అన్నది నందిని.

~

ఇంతలో దేవారాలు పాడడం ముగిసి, దాన శాసనాల వాచకం మొదలైంది. మొదట సుందర చక్రవర్తి ఆదేశాన్ని చదివారు. “మా కుమార్తె కుందవై రాకుమారికి మేము సర్వ మాన్యంగా ఇచ్చిన నల్లూర్ మంగలం గ్రామపు రాబడి మొత్తాన్ని యువరాకుమారి తంజావూరు పురంపాడి వైద్యశాలకు ఇవ్వడానికి నిర్ణయించడం వల్ల, ఆ గ్రామపు భూములన్నిటిపైన పన్ను తీసివేయడమైనది ” అని ఆ తామ్రపత్రంలో చక్రవర్తి తెలియజేశారు. శ్రీమంత్ర తాళపత్ర నాయకులు దాన్ని చదివిన తర్వాత ధనాధికారి పళువేట్టరయ్యర్కి ఇవ్వగా, ఆయన దాన్ని రెండుచేతులా స్వీకరించి, కళ్లకద్దుకొని గణకులకిచ్చి దాన్ని లెక్కలో పదిలం చేయమని ఆదేశించారు.

తర్వాత కుందవై రాకుమారి దాన శిలాశాసనం చదవడమైంది. పైన సూచించిన గ్రామపు రైతులు ఆ గ్రామపు సర్వమాన్య భూములపైన సర్వహక్కులను అనుభవిస్తూ, ఏడాదికి రెండు వందల పుట్ల వడ్లు, వైద్యశాలకు  చికిత్స కోసం వచ్చే ప్రజలకు ప్రతిరోజ యాభై పడుల ఆవు పాలు, ఐదు పడుల మేక పాలు, రెండు వందల కొబ్బరి బొండాలు పంపించ వలసిందని ఆ శిలాశాసనంలో చెక్కబడింది. అంతేగాక, చెక్కిన వారి పేరు, ఆ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన అధికారుల పేర్లు కూడ అందులో చెక్కబడ్డాయి.

ఆ శిలాశాసనాన్ని చదివిన తర్వాత, ఈ వైభవంలో పాల్గొనడానికి వచ్చిన నల్లూర్ మంగల గ్రామ పెద్దలకు ఆ శిలాశాసనం ఒప్పజెప్పబడింది. గ్రామపెద్దలు దాన్ని భయభక్తులతో దాన్ని స్వీకరించి పక్కనే ఉన్న ఏనుగుమీద పెట్టించారు. అప్పుడు, “మదురై జయించిన సుందర చోళ చక్రవర్తి వర్ధిల్లాలి!” అన్న జయఘోషలు అన్ని వైపులా మారుమోగాయి. ఆ ఘోషతోబాటు వంద డోలు వాద్యాల ఘోష చేరి ఆకాశాన్నంటింది. తర్వాత వరుసక్రమంగా, “యువరాకుమారి కుందవైదేవికి జయహో!”, “వీరపాండ్యుని జయించిన వీరాధివీరులు ఆదిత్య కరికాలన్కి జయహో!”, “లంకను జయించిన అరుళ్మొళి వర్మకు జయహో!”, “శివజ్ఞాన గండరాదిత్యుల కుమారులు మధురాంతకులకు జయహో!” అని ఘోష ప్రతిఘోషలు మారుమోగాయి. చివరిగా, “ధనాధికారి, ధాన్య భండారాధికారి పన్ను విధించే దేవరు పెద్ద పళువేట్టరయ్యర్కి జయహో!”, “తంజావూర్ కోట దళాధిపతి చిన్న పళువేట్టరయ్యర్కి జయహో!” అన్న ఘోషలు లేచినప్పుడు, ఆ ఘోషల శబ్దస్థాయి తగ్గిపోయింది. పళువూర్ వీరులు మాత్రం ఆ జయఘోషలు చేశారు తప్ప సాధారణ ప్రజలు అందులో ఉత్సాహంతో పాల్గొనలేదు. అప్పుడు పళువూర్ రాణి ముఖం చూడాలని కుందవై ప్రయత్నించిందిగాని వీలుపడలేదు. ముఖ్యంగా ఆదిత్య కరికాలన్ గురించి చేసిన జయఘోషలు లేచినప్పుడు నందిని ముఖాన్ని చూసివుంటే, ఉక్కు హృదయం కలిగిన కుందవై రాకుమారి కూడ చాల దిగులు పడివుండేదనడంలో సందేహం లేదు.

~~~
~~~

# అధ్యాయము - 19

## "గూఢచారి పట్టుబడ్డాడు!"

**ఈ** రోజు జరిగిన సంభవాలు పెద్ద పళువేట్టరయ్యర్కి చాల చిరాకును కలిగించాయి. చక్రవర్తి గారి పిల్లలమీద ప్రజలకున్న భక్తి విశ్వాసాలను తెలియబుచ్చడానికి ఇది ఒక సందర్భంగా మారిపోయింది కదా? "ప్రజలట ప్రజలు! తెలివిలేని గొడ్లు! నలుగురు ఏదారిన పోతే నాలుగువేల జనాలు అదే దారిన పోతారు! సొంత తెలివితేటలు ఉపయోగించడానికి ఎంత మందికి చేతనవును?" అని తనలోతానే చాలసార్లు చెప్పుకొని ఉడికిపోయారు. "చక్రవర్తి స్వర్గం చేరేలోపల రాజ్యాన్ని నాశనం చేసేసే వెళతారు లాగుంది! 'ఈ ఊరుకు పన్ను రద్దు చేసేయి!' 'ఆ గ్రామాన్ని పన్నురహితంగ చేసేయి!' అని ఆజ్ఞాపిస్తూ వెళుతున్నారు! కొంతకాలానికి పన్నులు కట్టే గ్రామాలే ఉండవు. కానీ యుద్ధరంగానికి ఖర్చులకు ధనం, ఆహారధాన్యాలు పంపిస్తూనే ఉండాలి ఎక్కడినుంచి పంపడం?" అని ఆయన గొంతెత్తి అరవడం విన్న ఆయన మనుషులే కాస్త భయపడ్డారు. "అన్నా! ఇలా అరిచి ఏం ప్రయోజనం? సమయం వచ్చినప్పుడు చేతల్లో చూపించాలి!" అని చిన్న పళువేట్టరయ్యర్ ఆయనకు హితబోధ చేయవలసివచ్చింది.

కుందవై తమ అంతఃపురానికి రాబోతూందని తెలిసి ఆయన కోపం, చిరాకు ఎల్లలు దాటాయి. నందిని వద్దకు వెళ్ళి, "ఇదేమిటి, నేను విన్నది నిజమేనా? ఆ రాక్షసి ఇక్కడికెందుకు రావాలి? ఆమెను నీవే ఇక్కడికి ఆహ్వానించావట? ఆమె నిన్ను అవమానించిందంతా మరిచిపోయావా?" అని అడిగారు.

"ఒకరు నాకు చేసిన మేలు నేను మరువను, ఇంకొకరు నాకు చేసిన కీడును కూడ నేను మరువను. ఇంకా నా ఈ స్వభావం మీకర్థం కాలేదా?" అన్నది నందిని.

"అలాగైతే ఆమె ఇక్కడికెందుకు వస్తూంది?"

"ఆమె ఇష్టం, వస్తుంది! చక్రవర్తి కూతురనే గర్వంతో వస్తూంది!"

"నీవెందుకు పిలిచావట?"

"నేను పిలవలేదు. తానే తనను ఆహ్వానించుకొంది. 'శంబువరయ్యర్ కుమారుడు మీ ఇంట ఉన్నాడట! నేను చూసేందుకు వస్తాను! రావాలి!' అన్నది. 'రావద్దు' అని నేను చెప్పగలనా? అలా చెప్పగలిగే కాలం వస్తుంది. అప్పటివరకు నేనీ అవమానాలను సహిస్తూండవలసిందే."

"నేను సహిస్తూ ఉండలేను. ఆమె వచ్చేసమయంలో నేనిక్కడ ఉండను. ఈ నగరంలోనే నేనుండ సాధ్యం కాదు. మళపాడిలో కాస్త రాజకార్యం ఉంది. వెళ్ళివస్తాను."

"అలాగే చెయ్యండి, నాధా! నేనే చెబుదామనుకొన్నాను. ఆ విషసర్పాన్ని నాకు వదిలేయండి. మీరు తిరిగి వచ్చినప్పుడు ఏదైన విచిత్రమైన సంగతులు వింటే ఆశ్చర్యపోకండి..."

“ఎలాంటి వింతలు?”

“కుందవై గందమారన్ని పెళ్ళాడుతుందనో, ఆదిత్య కరికాలన్ ఆ గందమారన్ చెల్లెలిని పెళ్ళాడుతాడనో మీరు వినవచ్చు...”

“అయ్యయ్యో! ఇదేమి, నీవు చెబుతున్నది? అలా జరిగితే మన మంత్రాలోచనలన్నీ ఏం కాను?”

“మాట జరిగితే కార్యం జరుగుతుందా, ఏమి? మధురాంతక దేవరికే తర్వాతి పట్టం అని మీ స్నేహితులందరికీ చెప్పుకొస్తున్నారు కద? నిజానికి అలా జరగబోతుందా? ఆడదానిలాగ వయ్యారంగా నడిచే ఆ మధురాంతకునికి పట్టం కట్టేందుకా మనం ఇంత కష్టపడుతున్నాము?” అని నందిని తన నల్లని కళ్ళతో పెద్ద పళువేట్టరయర్ని నిశితంగా చూసింది. ఆ చూపుల శక్తికి తట్టుకోలేక ఆ ముసలాయన తల వంచి ఆమె చేతులను తన చేతులలోకి తీసుకొని కళ్లకద్దుకొని, “నా చిన్నా! ముద్దూ! బంగారూ! ఈ చోళ సింహాసనం మీద చక్రవర్తినిగా నీవు విరాజిల్లే రోజు త్వరలోనే వస్తుంది!” అన్నారు.

~

గందమారన్ తనను కుందవై చూసేందుకు రాబోతూందని తెలిసినప్పటినుంచి కంగారుతో తబ్బిబ్బైపోసాగాడు. కుందవై బుద్ధి కుశలత, సౌందర్యం, తక్కిన సుగుణాలు దేశమంతటా సువిదితం కద? అటువంటి యువరాకుమారి తనను చూడ రావడం ఎంతటి గర్వకారణమైన విషయం? అందుకోసం ఒకటేమిటి, వంద కత్తిపోట్లు తిని మంచమెక్కవచ్చుకద? అరెరె! ఇటువంటి గాయం యుద్ధరంగంలో తన ఎదమీద తగిలి, తాను మంచమెక్కి ఉండకూడదా? అప్పుడు కుందవైదేవి వచ్చి తనను చూస్తే ఎంత గౌరవంగ ఉంటుంది? అలాగాక, ఒక స్నేహితుడు చేసిన ద్రోహం గురించి అందరి ముందు పాడిన పాటే కద ఆమె ముందుకూడ పాడాలి?

మధ్యమధ్య ఆ స్త్రీశిరోమణి కుటుంబీకులకు విరుద్ధంగా అతడు పాల్గొంటున్న రహస్య కార్యాల గురించిన జ్ఞాపకాలు అతన్ని పట్టి పీడించాయి.

గందమారన్ మంచి యోగ్యుడైన అబ్బాయి. మంత్ర తంత్రాలు, కల్లా కపటం ఎరుగని వాడు. నందిని మోహన సౌందర్యం అతడికి వెర్రెత్తించినా, ఆమె ఇంకొకరి పత్ని అన్న విషయం గుర్తుంది కాబట్టి తన మనసుకు పగ్గం వేసి ఉంచాడు. కానీ కుందవై రాకుమారి ఇంకా పెళ్ళి కాని అమ్మాయి. ఆమెతో ఎలా నడుచుకోవాలి? ఎలా మాట్లాడాలి? మనసులో వంచనాలోచనలుంచుకొని పైకి తీయగా మాట్లాడడం వీలవుతుందా? లేక ఆమె అందం చూసి మైమరచిపోయి తన శపథాన్ని చేజారవిడిచేంతగా తన మనసు చెదిరిపోతుందా? అలా జరగడానికి ఏమాత్రం తావివ్వకూడదు... ఆః! యువరాకుమారి తనను చూసేందుకు ఎందుకిక్కడికి రావాలి? రానీ, రానీ! ఏదైన మూర్ఖంగా మాట్లాడి మళ్ళీ ఇక్కడికి రాకుండ చేసేద్దాం.

~

ఇలా గందమారన్ తీసుకొన్న నిర్ణయం కుందవైదేవిని చూసిన వెంటనే మటుమాయమైపోయింది. ఆమె మోహన సౌందర్యం, పెద్దతనం, ఒద్దిక, తీయదనం నిండిన హిత వాక్యాలు అతని నిర్ణయాన్ని సడలింపజేశాయి. అతడి కల్పనాశక్తి పొంగిపొర్లింది. తన గొప్పతనాన్ని చెప్పుకోవడానికి ఇష్టంలేని వాడిలాగ నటించి, అదే సమయాన ఆమె కోరిక మేరకు చెబుతున్నవాడిలాగ తన వీర కృత్యాలను గురించి గొప్పలు చెప్పుకొన్నాడు. తన భుజాలపైన, చేతులపైన, ఎదపైన యుద్ధాలలో పడ్డ గాయాలను ఇష్టంలేని వాడిలాగ చూపించాడు. "ఆ మిత్రద్రోహి వంతిదేవుడు నన్ను గుండెల్లో పొడిచి చంపివుంటే కూడ దిగులుండేది కాదు. వెన్ను పోటు పొడిచి పారిపోయాడనే నాకు విచారంగా ఉంది. అందుకే వాడి ద్రోహం గురించి చెప్పవలసివస్తూంది. లేకపోతే పోరులో వెన్ను చూపి పారిపోయిన అపకీర్తి కద వస్తుంది? భుజం పైనో, గుండెల్లోనో పొడిచివుంటే వాడిని క్షమించేసేవాడిని!" అని గందమారన్ భావోద్వేగంతో చెప్పుకొచ్చినప్పుడు కుందవైకి అది నిజమేమోననిపించింది. వంతిదేవుడు ఇలా చేసివుంటాడా, అతని విషయంలో మనం మోసపోయామా అన్న సందేహం కూడ కలిగింది కుందవైకి. జరిగింది వివరంగా చెప్పమని కుందవై అడగగా, గందమారన్ వివరించాడు. అతని కల్పనాశక్తిని చూసి నందినే ఆశ్చర్యపోయింది.

"చూడండి, దేవీ! కడంబూరులో దిగినరోజే నన్ను ఏమార్చేశాడు. వచ్చిన పని ఇదీ అని చెప్పలేదు. ఇక్కడికొచ్చి ఏదో నకిలీ రాజముద్ర చూపించి కోట లోపలికి చొరబడ్డాడు. వెళ్ళి చక్రవర్తిని కూడ చూసి వచ్చాడు. ఆదిత్య కరికాలన్ గారి దగ్గర నుంచి తాళపత్ర సందేశం తీసుకొచ్చానని కట్టుకథలు చెబుతున్నాడు. అంతేనా? తమ పేరును కూడ ఉపయోగించుకొని, తమకు కూడ తాళపత్రసందేశం తీసుకొచ్చానని చెప్పగానే కోట దళపతికి సందేహం పుట్టుకొచ్చేసింది. వాడు గూఢచారై ఉండవచ్చని సందేహించి, వాడిపైన నిఘావేసి ఉంచారు. ఎలాగో తప్పించుకొని పారిపోయాడు. ఆ విషయంలో వాడి సామర్థ్యాన్ని మెచ్చుకోవాలి. నేనీ విషయాలన్నీ విన్నప్పుడు నా స్నేహితుడు పగవారి గూఢచారి అని నమ్మనే లేదు. వాడి స్వభావంలోనే కొన్ని కోణంగితనాలున్నాయి. అలా ఏదో తుంటరి పని చేశాడనే గట్టిగా నమ్మాను. 'వాడిని ఎలాగైనా వెతికి పట్టి తీసుకొని వచ్చి మీకప్పగిస్తాను. వాడిని మీరు క్షమించాలి' అని కోట దళపతి వద్ద మాట తీసుకొని బయలుదేరాను. అందరి ముందు నా స్నేహితుడిని అవమానపరచడానికి ఇష్టపడలేదు కాబట్టి నా వెంట ఎవరినీ తీసుకొని వెళ్ళలేదు. ఎలాగూ కోట ప్రాకారం నుంచే బయటకు వెళ్ళాలి కద? ముందుగానే బయట చేరివున్నా, చుట్టూ ఉన్న అడవుల్లోనే కద ఉండాలి? అందుకే ఉత్తర నదీతీరం వెంబడి వెళ్ళాను. ఒకడు నిట్ట నిలువుగా ఉన్న కోట గోడ వెంబడి కిందికి దిగడం మసక వెన్నెల వెలుతురులో కనిపించింది. వెంటనే అక్కడికి వెళ్ళి నిలబడ్డాను. వాడు కిందికి దిగిన వెంటనే, 'మిత్రమా! ఇదేం పని?' అని అడిగాను. ఆ ఛండాలుడు వెంటనే నా గుండెల మీద ఒక్క గుద్దు గుద్దాడు. ఏనుగులు గుద్దినా చెక్కు చెదరని నా వక్షస్సుకు వీడి గుద్దులొక లెక్కా? కానీ, మంచి ఉద్దేశంతో

వాడిని వెతుక్కొంటూ వచ్చిన నన్ను వాడలా గుద్దడం నేనోర్చుకోలేకపోయాను. నేనూ వాడినొక గుద్దు గుద్దాను. ఇద్దరూ ద్వంద్వ యుద్ధం చేశాము. అర్ధ గడియలోపల వాడు శక్తి కోల్పోయాడు. నన్ను మన్నించమని అడిగాడు. నేనూ వాడిని క్షమించేసి, 'నీవు వచ్చిన కారణమేమిటో నిజం చెప్పు! నేను నీకు కావలసిన సహాయం చేస్తాను!' అన్నాను. 'అలసటగా ఉంది. ఎక్కడైనా కూర్చొంటాను' అన్నాడు. 'సరే' అని చెప్పి తీసుకొని వెళ్ళాను. ముందు దోవ చూపిస్తూ వెళ్ళాను. ఉన్నట్లుండి ఆ పాపి నన్ను కత్తితో వెన్ను పోటు పొడిచాడు! అర్ధ జానెడు కత్తి లోపలికి దిగిపోయింది. తలతిరిగి కింద పడిపోయాను. ఆ మిత్రద్రోహి తప్పించుకొని పారిపోయాడు! నాకు స్పృహ వచ్చి కళ్ళు తెరిచి చూసినప్పుడు ఒక మూగ వనిత ఇంట ఉండడాన్ని గమనించాను..."

గందమారన్ చెప్పిన కట్టుకథ విని నందిని తనలోనే నవ్వుకొంది. కుందవై ఆ కథను ఎంతవరకు నమ్మాలో తీర్మానించుకోలేకపోయింది.

"మూగ స్త్రీ ఇంటికి ఎలా వచ్చి చేరారు? ఎవరు తీసుకొని వచ్చారు?" అని అడిగింది.

"అదే నాకూ అర్థంకాని మర్మంగా ఉంది. ఆ మూగదానికి ఏమీ తెలియదు.  తెలిసినా చెప్పలేకపోయింది. ఆమెకొక కొడుకున్నాడట. ఆరోజునుంచి అతడు కూడ కనిపించడం లేదట. ఎలా మాయమయ్యాడని తెలియదు. అతడు తిరిగి వస్తే అడగవచ్చు. లేదా పళువూర్ వీరులు నా స్నేహితుని పట్టుకొని వచ్చేవరకు వేచివుండవలసిందే...!"

"అతడు పట్టుబడతాడని అనుకొంటున్నారా?"

"దొరక్క ఎక్కడికి పోతాడు? రెక్కలు కట్టుకొని ఎగిరిపోగలడా? అందుకోసమే, వాడిని చూసేందుకే ఇక్కడ వేచివున్నాను. లేకపోతే ఇప్పటికి మావూరికి తిరిగి వెళ్ళిపోయేవాడినే. ఇంకా వాడికోసం పళువూర్ రాజుల వద్ద మన్నింపు కోరి, పొందవచ్చనే నమ్మకం ఉంది."

"అయ్యా! మీ పెద్దతనమే పెద్దతనం!" అన్నది యువరాకుమారి. ఆమె మనసులో 'వంతిదేవుడు పట్టుబడకూడదు! ద్రోహి అయినా కూడ!' అని గట్టిగా కోరుకోసాగింది.

అదే సమయాన ఒక అంతఃపురపు దాది ఒకతె పరుగెత్తి వచ్చి, "అమ్మా! గూఢచారి దొరికిపోయాడు! పట్టేశారు!" అని పెద్దగా అంది.

నందిని, కుందవై -ఇద్దరి ముఖాల్లోను వేదన కనిపించింది. నందిని త్వరలోనే తన ముఖ కవళికలను మార్చుకొంది. కుందవైకది సాధ్యంకాలేదు.

~~~
~~~

# అధ్యాయము - 20

## రెండు ఆడ పులులు

**గూఢచారిని** పట్టి బంధించి వీధిలో తీసుకొని వస్తున్నారని దాది వచ్చి చెప్పగానే, అక్కడున్న ముగ్గురి మనసులు కలవరపడ్డాయి. కుందవై మనస్సు అందరికన్న ఎక్కువగా గాభరా పడింది.

"దేవీ! మనం వెళ్ళి ఆ గడుగ్గాయి గూఢచారి ముఖం ఎలా ఉందో చూద్దామా?" అని అడిగింది నందిని.

కుందవై జంకుతూ, "మనకెందుకు వాడి గురించి?" అన్నది.

"అలాగైతే సరే!" అని కాస్త వెటకారంగా అన్నది నందిని.

"నేను వెళ్ళి చూసి వస్తాను" అని గందమారన్ కష్టపడుతూ లేచాడు.

"వద్దు! మీరు నడవలేరు, పడిపోతారు!" అన్నది నందిని.

కుందవై మనసు మార్చుకొన్నదానిలాగ, "వీరి ప్రియస్నేహితుడెలా ఉంటాడో మనంకూడ చూద్దాం! ఈ అంతఃపురపు పైమేడ నుంచి చూస్తే కనబడుతుంది కద?" అన్నది.

"బాగా కనబడుతుంది; నాతో రండి!" అని చెప్పి నందిని దారి తీసింది.

"దేవీ! వాడు నా స్నేహితుడే అయితే, మామగారికి చెప్పి నేను వాడిని కలిసి మాట్లాడే అవకాశం కల్పించాలి!" అన్నాడు గందమారన్.

"అతడు మీ స్నేహితుడని మాకెలా తెలుస్తుంది?" అన్నది నందిని.

"అలాగైతే నేనూ వచ్చి తీరాలి!" అని గందమారన్ పడుతూ లేస్తూ వారి వెంట నడిచాడు.

~

ముగ్గురూ అంతఃపురపు డాబా ముందు భాగానికి వెళ్ళారు. కాస్తా దూరాన ఏడెనిమిది గుర్రాలు వస్తుండడం కనిపించింది. వాటిపైన శూలాలు చేతబట్టిన వీరులు వస్తున్నారు. గుర్రాల మధ్య ఒకడు నడిచి వస్తున్నాడు. అతడి చేతులు వెనక్కి విరిచి కట్టబడివున్నాయి. అతన్నలా కట్టిన తాడు రెండు కొసలను రెండువైపుల గుర్రాల పైనున్న వీరులు పట్టుకొని వస్తున్నారు.

ఆ వీరులకు కాస్త వెనక చోద్యం చూసేందుకు గుమిగూడిన జనాలు వస్తున్నారు.

అంతఃపురం మేడపైనున్న వారికి గుర్రాల మధ్య చేతులు కట్టబడి నడిచి వస్తున్న వాడి ముఖం మొదట సరిగా కనిపించలేదు.

ఊరేగింపు దగ్గరకు వచ్చేవరకు ఆ అంతఃపురం మేడపైన మౌనం గూడుకట్టుకొంది.

ఉత్కంఠ, దిగులు రెండూ నిండిన కళ్లతో కుందవైదేవి దగ్గరపడుతున్న ఊరేగింపును ఏకాగ్రతలో

చూడసాగింది.

నందినేమో వీధిలోకి చూడడం, వెంటనే కుందవై ముఖాన్ని చూడడం చేస్తూంది.

గందమారన్ అక్కడ గూడుకట్టుకొన్న మౌనాన్ని భంగం చేశాడు.

"కాదు; వీడు వంతిదేవుడు కాడు!" అన్నాడు.

కుందవై ముఖం విప్పారింది.

అప్పుడు ఆ వినోదమైన ఊరేగింపు అంతఃపురం మేడ కిందికి వచ్చింది.

తాడుతో కట్టబడి గుర్రాల మధ్య నడుస్తూ వస్తున్న ఆ బందీ తలెత్తి పైకి చూశాడు.

అతడు వైద్య కుమారుడని కుందవై వెంటనే గ్రహించింది.

తలెత్తి చూసినవాడు ఏదో చెప్పబోయినవాడిలాగ నోరు తెరిచాడు.

అంతలో అతన్ని రెండువైపుల కట్టబడివున్న తాడు అతన్ని ముందుకు లాక్కొని వెళ్ళిపోయింది.

కుందవై తన సంతోషాన్ని బయటపడనీయకుండ, "ఇదేం పిచ్చితనం? ఇతన్నెందుకు బంధించి తీసుకొని వెళుతున్నారు? ఇతడు పళైయారై వైద్య కుమారుడు కద?" అన్నది.

"ఓ! అలాగా? మా మరిదిగారి మనుషులెప్పుడూ ఇలాగే చేస్తారు. నిజమైన నేరస్థుడిని వదిలేసి ఇంకొకరినెవరినైన పట్టి తీసుకొని వచ్చి ఇబ్బంది కలిగిస్తుంటారు!" అన్నది నందిని.

ఇంతలో గందమారన్, "వంతిదేవుడు వీరి చేతికి అంత సులభంగా దొరుకుతాడా? నా స్నేహితుడు పెద్ద ఇంద్రజిత్తు కద? నన్నే ఏమార్చిన వాడు వీళ్ళ చేతికి చిక్కుతాడా?" అన్నాడు.

"ఇంకా అతన్ని మీ స్నేహితుడని చెప్పుకొంటున్నారే?" అన్నది నందిని.

"ద్రోహిగా మారిపోయాడు; అయినా నా మనసులో వాడిమీదున్న ప్రేమ మాసిపోలేదు!"

"ఒకవేళ మీ ప్రియమిత్రుడిని వీళ్ళు చంపి పడేసి ఉండవచ్చు. ఈ వీరులు ఇద్దరు గూఢచారులను వెన్నంటి కోడిక్కరైకి వెళ్ళినట్లు విన్నాను" అని చెప్పేసి నందిని కుందవై ముఖాన్ని పరికించి చూసింది. "చంపేసి ఉండవచ్చు" అన్న మాట కుందవై మనసు విలవిల్లాడేలా చేసిందని గ్రహించింది.

**ఒసే గర్విష్ఠీ! నీపైన పగతీర్చుకోవడానికి మంచి ఆయుధం దొరికింది! దాన్ని పూర్తిగా ఉపయోగించుకోకపోతే నేను పళువూర్ రాణినే కాను! చూస్తూండు!**

కుందవై తన మనసులోని కలతను, దిగులును కోపంగా మార్చుకొని, "గూఢచారులట, గూఢచారులు! వట్టి వాచాలత! రాను రాను ఈ ముసలాళ్ళకు బుద్ధి క్షీణించిపోతూంది! ఎవరిని చూసినా సందేహమే! ఈ వైద్యకుమారుని నేను కద కోడిక్కరైకి మూలిక తీసుకొని రమ్మని పంపించింది? ఇతన్ని ఎందుకు పట్టి బంధించి తీసుకొని వచ్చారు? ఇప్పుడే వెళ్ళి మీ మరిదిగారిని అడగబోతున్నాను!" అన్నది.

"ఓహో! మీరు పంపించిన మనిషా ఇతడు? దేవీ! సందేహమన్నారు కద? ఇప్పుడు నాకు కూడ ఒక సందేహం కలుగుతూంది. మూలికను తీసుకొని రావడానికి ఇతన్ని మాత్రమే పంపించారా? లేక, ఇతడికి తోడుగా ఇంకొకడిని కూడ పంపించారా?" అని అడిగింది నందిని.

"ఇతడికి తోడుగా ఇంకొకరిని కూడ పంపించాను! ఇద్దరిలో ఒకరిని లంకకు వెళ్ళమని చెప్పాను."

"ఆహా! ఇప్పుడు నాకంతా అర్థమైపోయింది! నేను సందేహించినట్లే జరిగింది."

"నాకేమీ అర్థం కావడం లేదు. ఏం సందేహిస్తున్నారు? ఏం జరిగింది?"

"ఇక సందేహం లేదు. రూఢిగా తెలుసు. దేవీ! మీరు పంపించిన మనిషి మీకు తెలిసినవాడా? అపరిచితుడా?"

~

కుందవై కాస్త జంకుతూ, "కొత్త మనిషేమిటి? కంచి నుంచి తాళపత్ర సందేశం తీసుకొని వచ్చినవాడు; నా అన్న పంపించిన వాడు" అన్నది.

"వాడే! వాడే!"

"ఎవడే?"

"వాడే గూఢచారి! చక్రవర్తికి తాళపత్ర సందేశం తీసుకొని వచ్చినట్లు ఇక్కడ కూడ చెప్పాడట..."

"ఏ కారణం వల్ల మీరతన్ని గూఢచారి అని సందేహిస్తున్నారు?"

"నాకేం తెలుసు దాని గురించి? అదంతా మగవాళ్ల విషయం! చూడబోతే అతడు సందేహాస్పదంగానే నడుచుకొన్నాడు. లేకపోతే, ఎందుకు రాత్రికి రాత్రే పారిపోవాలి? ఈ సాధు మనిషిని ఎందుకు వెన్నుపోటు పొడిచి పారిపోవాలి?"

"ఈయన్ని వెన్నుపోటు పొడిచింది అతడే అని నేను నమ్మడం లేదు. అలా వెన్నుపోటు పొడిచివుంటే ఈయన్నెందుకు మోసుకొని వెళ్ళి ఆ మూగవనిత ఇంటికి చేరుస్తాడు?"

"దగ్గరుండి చూసినట్లు చెబుతున్నారే, దేవీ! ఏమిటో ఆ గూఢచారిపైన మీకు చాల దయ కలిగినట్లుంది. అతడి దగ్గర ఏదో మంత్రశక్తి ఉండాలి. ఈయన కూడ అతన్ని తన స్నేహితుడనే చెప్పుకొంటున్నారు కద? - ఎలాగైతేనేం? పోయిన ప్రాణం తిరిగిరాదు. అతన్ని ఈ వీరులు చంపేసి ఉంటే..."

కుందవై ముఖంలో స్వేదబిందువులు కనిపించాయి/మొలిచాయి. కనులెర్రబడ్డాయి. గొంతు పూడుకుపోయింది. గుండె గుబగుబ కొట్టుకొంది. "అలా జరిగి ఉండదు! ఏనాడూ అలా జరగబోదు!" అని తనలో తానే చెప్పుకొంది.

"ఈయన చెబుతున్నట్లు ఆ గూఢచారి అంతటి సమర్థుడైతే..." అన్నది నందిని.

"అవును, దేవీ! వంతిదేవుడు ఈ మనుషుల చేతికి ఏనాడూ చిక్కడు, చిక్కబోడు!" అన్నాడు

గందమారన్.

"ఇప్పుడు చిక్కకుంటే ఇంకొకరోజు చిక్కుతాడు!" అన్నది నందిని.

కుందవై పళ్ళు గిట్టకరుచుకొని, "రేపు ఏం జరుగుతుందో ఎవరికి తెలుసు?" అన్నది.

తర్వాత కోపంగా, "చక్రవర్తి జబ్బు పడిందీ పడ్డారు గాని, ఈ రాజ్యమే తలకిందులైపోతూంది! మూలిక తీసుకొని రావడానికి నేను పంపించిన మనుషులను పట్టి బంధించడానికి వీరికేం అధికారం ఉంది? ఇదిగో, ఇప్పుడే నా తండ్రి వద్దకు వెళ్ళి అడుగుతాను!" అన్నది.

"దేవీ! జబ్బుతో మంచం పట్టిన చక్రవర్తిని ఈ విషయమై ఎందుకు కష్టపెట్టాలి? నా మరిదిగారినే అడగవచ్చు కద? మీ ఆజ్ఞ ఒకవేళ ఆయనకు తెలియక పోవచ్చు. తెలియజేస్తే ఆ ప్రకారం నడుచుకొంటారు. ఈ చోళ సామ్రాజ్యంలో యువరాకుమారి కోరికకు వ్యతిరేకంగా నడుచుకోవడానికి ఎవరికి ధైర్యముంది?" అన్నది నందిని.

ఆ రెండు ఆడపులుల మధ్య ఆ రోజు జరిగిన యుద్ధంలో నందినే గెలిచింది. కుందవై హృదయం చాల గాయపడింది. ఆ గాయాలను బయట పరచకుండడానికి యువరాకుమారి చాల కష్ట పడవలసింది.

~~~
~~~

# అధ్యాయము - 21

## పాతాళ చెరసాల

**జీవితం** లాంటి అర్థం కాని వింత ఇంకొకటి లేదు. సుఖం ఎప్పుడు వస్తుంది, దుఃఖం ఎప్పుడు కలుగుతుంది అని ఎవరు చెప్పగలరు? ఆకాశం తేటగా ఉంటుంది. ఉన్నట్లుండి మబ్బులు కమ్ముకొని ఉరుములు మెరుపులతో కుండపోతగా వర్షం కురుస్తుంది. ప్రపంచంలో గాలి అన్నదే లేనట్లనిపిస్తుంది కొన్నిసార్లు. చెట్ల ఆకులు కూడ కదలవు. ఉన్నట్లుండి ఎక్కడినుంచో సుడిగాలి వీస్తుంది. దాని వేగానికి పెద్ద పెద్ద చెట్లే కూకటి వేళ్ళతో పెకలించుకొని కూలిపోతున్నాయి. కాసేపటి క్రితం నయనానందకరంగా ఉన్న నందన వనాలు హనుమాన్ నాశనం చేసిన (అ)శోకవనాలుగా మారిపోతున్నాయి.

కుందవై జీవితంలో ఇప్పుడు అటువంటి సుడిగాలి వీస్తూంది. కొంతకాలం క్రితంవరకు ఆమెకు దిగులన్నదే తెలియకుండేది. జీవితమన్నది ఒక సుదీర్ఘ/నిరవధిక ఆనంద ఉత్సవంగా నడుస్తూ వచ్చింది. ఆటపాటలు, కవనం, చిత్రలేఖనం, అలంకారం, ఉద్యానవన విహారాలే జీవితంగా రోజులు గడిచేవి. తండ్రి, తల్లులు, తమ్ముడు, మంత్రులు, ఆచార్యులు, దాదులు, చెలికత్తెలు యువరాకుమారిని కంటికి రెప్పలా చూసుకొనేవారు. దుఃఖం అన్నది ఎలా ఉంటుందన్నది కావ్యాలలో, నాటకాలలో ఉన్న కల్పనల మూలంగా మాత్రమే ఆమెకు ఎరుక ఇప్పటి వరకు.

అటువంటి భాగ్యశాలికి దుఃఖం కలిగినప్పుడు ఒకదాని మీద ఇంకొకటిగా వచ్చి పడ్డాయి. తండ్రి పరిస్థితి చాల దిగులు కలిగిస్తూంది. రాజ్యానికి పెద్ద పరీక్షా సమయం వచ్చింది. అన్న, తమ్ముడు ఇద్దరూ దూరదేశాల్లో ఉన్నారు. ఇదీ అని చెప్పలేని ఒక పెద్ద విపత్తు చోళ కులానికి కలగబోతోందని జ్యోతిష్కులు నిగూఢంగా చెబుతున్నారు. దేశంలో రహస్యంగా కుట్రలు జరుగుతున్నాయి. దేశప్రజలు గుర్తు తెలియని భీతికి లోనైవున్నారు.

ఉక్కు/వజ్ర హృదయం కలిగిన వీరుల వంశంలో పుట్టిన కుందవై ఇదంతా ధైర్యంగా నిభాయించుకోగలిగిన ధీరవనితే. తన వంశానికి, రాజ్యానికి రాగల ఆపదలనన్నింటినీ తన కుశాగ్ర బుద్ధితో ఎదుర్కొని తన వంశాన్ని, కాపాడుకోగలనన్న గట్టి నమ్మకం ఆమెకుంది.

కానీ ఆమె జీవితంలో ఒక చిన్న సంభవం - ఎదురుచూడని ఒక కలయిక – ఆమె వజ్ర హృదయం మెత్తబడడానికి, మనోధైర్యం సడలడానికి కారణమై కూర్చొంది.

ఆమె వంతిదేవుని మొట్టమొదట చూసి కలిసినప్పుడు - అంతవరకు మొగ్గగా ఉన్న ఆమె హృదయం పూవై విరిసింది.

కానీ ఏం దురదృష్టం - అదే సమయాన ఒక నల్ల తుమ్మెద ఆ పూవులోపల దూరి తన విషపు కొండితో ఆ సుతిమెత్తని పూరేకులను పొడవసాగింది! అమ్మమ్మ! ఎంతటి వేదన!

~

ఆ వాణర్ కులవీరుడు ఒకవేళ పట్టుబడివుండవచ్చనే ఆలోచనే ఎంతటి వేదననిచ్చింది? అతడు చంపబడివుండవచ్చన్న కఠినమైన వార్త తన హృదయాన్ని ఎలా చీల్చింది? దాన్ని బయటకు చూపించుకోకుండడానికి ఎంత కష్టపడవలసివచ్చింది?

కన్నవారు, బంధువులు, తోబుట్టువులు, ప్రాణానికి ప్రాణమైన చెలికత్తెలు, స్నేహితురాళ్ళు ఎందరో ఉండగా - ఎవరో దారిన పోయేవాడి గురించి - ఆకస్మాత్తుగా రెండుమూడు సార్లు కలిసినవాడి గురించి తన హృదయమెందుకింత తల్లడిల్లిపోతూంది?

ఇదంతా ఆలోచించడానికి, కారణాలు వెతికి ఆరా తీయడానికి తీరిక లేదు. మీనమేషాలు లెక్క పెట్టక, శకునాలు చూడక, చేయవలసిన పనిని వెంటనే చేయాలి...

~

కాబట్టి ఆ రోజు మధ్యాహ్నమే యువరాకుమారి చిన్న పళువేట్టరయ్యర్ మాళిగకు వస్తున్నట్లు చెప్పి పంపించింది కుందవై. ఆ మాళిగ అంతఃపుర స్త్రీలు యువరాకుమారిని కుతూహలంతో ఆహ్వానించారు. ఆప్యాయతతో ఉపచారాలు చేశారు. కుందవై వారితో కాసేపు పిచ్చాపాటీ మాట్లాడిన తర్వాత చిత్రమంటపానికి వెళ్ళింది. అక్కడ వేచివున్న చిన్న పళువేట్టరయ్యర్ ఆమెను సాదరంగా అహ్వానించి, అక్కడి చిత్రాలను వివరించసాగారు. యువరాకుమారి కూడ ఆ చిత్రాలను చూస్తూ, ఆయన చెబుతున్న వివరాలను వింటూ వచ్చింది.

~

చివరి చిత్రం దగ్గరికి రాగానే, కుందవై కోట దళపతిని తలెత్తి చూసి, “అయ్యా! పళువేట్టరయ్యర్లు చోళ వంశానికి ఎనలేని సేవ చేశారు!” అన్నది.

“అమ్మా! అది మా భాగ్యం!” అన్నారు కాలాంతక గండరు.

“ఆ సేవకంతటికీ చోళ సామ్రాజ్యం తగదనడంలో సందేహం లేదు...”

“అమ్మా! ఏమా మాట?”

“అయినా చక్రవర్తి చివరి రోజులు దగ్గర పడి కైలాసయాత్ర చేసే ముందే సామ్రాజ్యాధికారాలు చేజిక్కించుకోవడానికి ఎందుకు తొందర?”

ఈ మాటలు ఆయన హృదయాన్ని ఈటెల్లాగ పొడిచాయని ఆయన ముఖమే ఎత్తిచూపింది. ఆయన నుదుటిమీద స్వేద బిందువులు కానవచ్చాయి. మీసాలు వణికాయి. కాళ్ళు చేతులు గడగడలాడాయి.

ఆయన నెత్తిమీది చెమట తుడుచుకొని కుందవైదేవిని చూసి, “అమ్మా! ఇదేమి ఇంతటి ఆగ్రహం? వాగ్బాణాలతో నన్ను యమలోకానికి పంపించాలనా మీ ఉద్దేశం?” అన్నారు.

“అంతటి శక్తి నాకు లేదని మీకు తెలుసు. కాలాంతకుల దరికి రావడానికి యముడే జంకుతాడు కద? నాలాంటి అబలకది సాధ్యమా?”

“తల్లీ! ఇటువంటి కఠోర వాక్యాలకన్న సీసం కరిగించి నా చెవిన పోయవచ్చు కద? దేవి ఇంతటి పాషాణ కరుణ చూపడానికి ఈ సేవకుడు చేసిన నేరమేమి?”

“తమ నేరం గురించి మాట్లాడడానికి నేనెవరిని? నా తప్పేమనే మీరిప్పుడు చెప్పవలసివుంది. నా తండ్రి జబ్బు నయం చేయడానికి మూలిక తీసుకొని రమ్మని మనిషిని పంపడం నా తప్పా?”

“లేదు, తల్లీ! అది ఏనాడూ తప్పు కాబోదు!”

“పళైయారై వైద్య కుమారుని మూలికను తెమ్మని కోడిక్కరైకి నేను పంపించానని మీకు తెలుసా?”

“తెలుసమ్మా!”

“ఈ రోజు ఆ వైద్య కుమారుని తాటితో కట్టి బంధించి మీ వీరులు వీధిలో లాక్కొని రావడాన్ని నేను చూశాను. అలా ఆజ్ఞాపించింది మీరే కద? అతన్ని పంపించింది నేనేనని తెలిసే కద మీరిలా చేశారు?”

“అవును, రాకుమారీ! కానీ వాడు గూఢచారి అని తెలియకుండ మీరతన్ని పంపించి ఉండవచ్చు కద?”

“పళైయారై వైద్యకుమారుడు - గూఢచారి? ఆ కట్టుకథను నన్ను కూడ నమ్మమంటున్నారా?”

“తల్లీ! అతడే ఒప్పుకొన్నప్పుడు నమ్మాలి కద?”

యువరాకుమారి కాస్త అదిరిపడి, “తానే ఒప్పుకొన్నాడా? అదెలా? ఏం ఒప్పుకొన్నాడు?”

“తనతో వచ్చినవాడు ఇంకొక గూఢచారి అని వీడు ఒప్పుకొన్నాడు. ఆ ఇంకొకడు నిజానికి మూలిక కోసం రాలేదని, లంకలో ఎవరికోసమో రహస్య సందేశం తీసుకొని వెళుతున్నాడని వీడు ఒప్పుకొన్నాడు...”

“ఆ వైద్యకుమారుడొక మూర్ఖుడు; ఏదో నోటికి వచ్చినట్లు పేలాడు. ఆ ఇంకొతన్ని పంపించింది కూడ నేనేనని మీకు తెలుసు కద?”

“తెలుసు, తల్లీ! కానీ అతడు మిమ్మల్ని ఏమార్చేశాడన్న విషయం కూడ తెలుసు. వంతిదేవుడన్న పేరుగల ఆ యువకుడు నిజానికి గూఢచారే...”

“కానేకాదు; అతను కంచి నుంచి నా అన్న రాసి పంపించిన తాళపత్ర సందేశాన్ని తీసుకొని వచ్చినవాడు.”

“యువరాకుమారీ! అతడు చక్రవర్తికి కూడ యువరాజు వద్దనుంచి తాళపత్రం తీసుకొని

వచ్చాడు. ఐతేనేమి? గూఢచారులు ఇలా ఏదో ఒక ఉపాయం పన్ని తమ కార్యాన్ని సాధించుకొంటారన్నది మీకు విదితమే కద?"

"అయ్యా! వంతిదేవుడు గూఢచారి అనడానికి ఋజువేమి?"

"అతడు గూఢచారి కాకపోతే, రాజబాటను వదిలి అడ్డదారిన నడుస్తాడేల? కుడంద్దై జ్యోతిష్కులను చక్రవర్తి జాతక ఫలం గురించి అడగనేల?"

"చక్రవర్తి జాతకం గురించి నేను కూడ ఆ జ్యోతిషుకులను అడిగాను; అందువల్లనేమి?"

"చక్రవర్తి ప్రియకుమారియైన మీరు అడగడం వేరు; సంబంధం లేని ఎవడో దారిన పోయేవాడు అడగడం వేరు. శత్రువుల గూఢచారి అయితేనే అలా అడిగేందుకు ప్రయత్నిస్తాడు."

"అది మీ ఊహ. ఇంకేమైన కారణముందా?"

"బహిరంగంగా నా అనుమతి తీసుకొని కోటలోపల ప్రవేశించి ఉండవచ్చు. కానీ అలా చేయక, పళువూర్ రాజముద్ర ఉన్న ఉంగరాన్ని చూపించి ఎందుకు దూరాలి? పెద్ద పళువేట్టరయ్యర్ ఇచ్చారని ఎందుకు అబద్ధం చెప్పాలి?"

"ఆ రాజాంగుళీయకాన్ని మరి ఎవరిచ్చారట?"

"అది ఇంకా తెలియదు. ఆరా తీయాలి."

"అది కనిపెట్టలేక మీ మనుషులేం చేశారు?"

"అమ్మా! నా మనుషులు మాంత్రికులు కారు. గూఢచారిని పట్టుకొన్న తర్వాతే కద వాడికా రాజముద్ర ఎలా దొరికిందని అడిగి తెలుసుకోవాలి?"

"అతడు నిజం చెబుతాడని ఏం నిశ్చయం?"

"నిజం చెప్పించడానికి దారులున్నాయి, తల్లీ! పాతాళ చెరసాల ఉండనే ఉంది. గూఢచారికి ఇది కూడ తెలిసే ఉంది. అందుకే రహస్యంగా రాత్రికి రాత్రే కోటనుంచి తప్పించుకొని పారిపోయాడు. శంబువరయ్యర్ కుమారుని కూడ వెన్నుపోటు పొడిచి పారిపోయాడు!"

"అతడే వెన్నుపోటు పొడిచాడని ఏం సాక్ష్యం?"

"గందమారన్ చెప్పిన మాటే."

'అది చాలదు! అతడు గందమారన్ని వెన్నుపోటు పొడవలేదని నేను చెబుతున్నాను."

"తల్లీ! మీరు దగ్గరుండి చూశారా?"

"లేదు. కానీ ఒకరి ముఖాన్ని చూసి అతడు నేరస్థుడా కాదా అని చెప్పడం సాధ్యం."

"ఆ దుష్ట గూఢచారి చాల భాగ్యశాలి. ఎలాగో మీ అభిమానాన్ని చూరగొన్నాడు. ఆ భాగ్యం నాకు లభించలేదు కద?"

"అయ్యా! అతన్ని మళ్ళీ గూఢచారి అని ఎందుకంటున్నారు?"

"తల్లీ! అతడు గూఢచారి కాకపోతే వీధి వేషగాళ్లతో చేరి ముఖానికి ముసుగు (mask) వేసుకొని పళైయారై నగరంలోపలికి ఎందుకు చొరబడాలి? మారువేషం వేసుకొని ఎందుకు కోడిక్కరై నదీముఖద్వారానికి ప్రయాణమయ్యాడు? అతడు గూఢచారి కాకపోతే నా మనుషులను చూసిన వెంటనే ఒక రోజంతా ఎందుకు కోడిక్కరైలో దాక్కోవాలి? రాత్రి కాగానే పడవెక్కి లంకకు వెళ్ళడమెందుకు?"

"ఓహో! అతడు పడవెక్కి తప్పించుకొని పారిపోయాడా? మీ మనుషులు అతన్ని పట్టుకోలేకపోయారా?" అని కుందవై ప్రశ్నించినప్పుడు కుతూహలం ధ్వనించింది.

"అవును, తల్లీ! ఆ మాయావి గూఢచారి నా మనుషులను మోసగించేసి పారిపోయాడు. ఈ మూర్ఖులు అతన్ని వదిలేసి ఈ వైద్యకుమారుని పట్టి తెచ్చారు..."

"అయ్యా! గూఢచారి ఎలాగైన పోనీ. వైద్యకుమారుని నేను పంపించాను. అతడు నిరపరాధి అన్నది నిశ్చయం/నిజం. అతన్ని వెంటనే విడుదల చేయాలి."

"అమ్మా! వీడు గూఢచారి కాకపోయినా, గూఢచారికి సహాయంగా ఉంటూ వచ్చినవాడు. ఏవేవో కట్టుకథలు చెప్పి నా మనుషులను ఏమార్చాడు. గూఢచారి దాక్కోవడానికి, పడవెక్కి పారిపోవడానికి సహాయం చేసిన వాడు..."

"అదంతా ఎలా ఉన్నా, వైద్యకుమారుని విడుదల చేసే తీరాలి..."

"ఆ బాధ్యతను తీసుకోవడానికి నేను సిద్ధంగా లేను. దేశం నలుదిక్కుల నుంచి అపాయాలు కమ్ముకొస్తున్నాయి. శత్రువులు దండెత్తి రావడానికి సిద్ధమవుతున్నారు. వీరపాండ్యుని ఆపత్కాల సహాయక బృందం చోళ సామ్రాజ్యాన్ని సమూలంగా నాశనం చేస్తామని శపథం చేశారు. దేశమంతటా కుట్రలు  జరుగుతున్నాయి..."

"కుట్ర పన్నే వారినందరినీ చెరసాలలో వేయడమైతే, అక్కడ తావే ఉండదు."

"చోటు ఉన్నంతవరకు వేయవచ్చు కద?"

"నిజమైన కుట్రదారులను, ద్రోహులను చెరలో వేయడానికి కాస్త చోటు మిగల్చండి. అయ్యా! వైద్యకుమారుని వెంటనే విడుదల చేయండి!"

"ఆ బాధ్యతను నేను తీసుకోలేను, తల్లీ!"

"చక్రవర్తి ఆజ్ఞాపిస్తే చేస్తారా? లేక, దాన్ని కూడ ధిక్కరిస్తారా?"

"అమ్మణ్ణీ! దీనికి చక్రవర్తి ఆదేశం అక్కరలేదు. యువరాకుమారి కోరిక ఏమిటో, చక్రవర్తికి అదే వేదవాక్కు అన్నది జగద్విదితం. ఇదిగో పాతాల చెరసాల తాళం చెవి మీకు ఒప్పంగించేస్తున్నాను. మీరే వెళ్ళి తలుపు తీసి విడుదల చేయండి. ఇంకా ఎవరినైన విడుదల చేయాలంటే ధారాళంగా చేయండి. అందువల్ల రాగల లాభనష్టాలకు బాధ్యత మీదే...."

ఇలా చెప్పి కోట దళపతి ఒక పెద్ద తాళం చెవిని తీసి ఇచ్చారు. కుందవై పొంగివస్తున్న తన

కోపాన్ని అదుపులో పెట్టుకొని, “అలాగే కానివ్వండి! ఆ లాభనష్టాలకు నేనే బాధ్యత తీసుకొంటాను!” అని చెప్పి తాళంచెవి తీసుకొంది.

“ఈ చోళ దేశానికి ఏదైనా కీడు మూడితే అందుకు ఇద్దరు స్త్రీలే కారణమౌతారు" అన్నారు తంజావూరు కోట దళపతి.

“నేను ఒకతెను. ఆ ఇంకొక స్త్రీ ఎవరు?”

“ఇంకెవరు? పళువూర్ యువరాణి నందినే!”

కుందవై చిరునవ్వు నవ్వి, “చోళ సామ్రాజ్య సర్వాధికారితో నన్ను పోల్చి చెబుతున్నారే! ఇది వింటే పెద్ద పళువేట్టరయ్యర్ మిమ్మల్ని దేశం నుంచి బహిష్కరిస్తారు!” అన్నది.

“చాల మంచిదవుతుంది! ఆరోజు కోసమే ఎదురు చూస్తున్నాను!” అన్నారు చిన్న పళువేట్టరయ్యర్.

~~~
~~~

# అధ్యాయము - 22

## చెరలో సేందన్ అముదన్

**తంజావూరు** కోటలోపల బంగారు నాణాలు ముద్రించే టంకశాల ఇంకొక చిన్న కోటలాగుండేది. ఆ శాల ముందు కాపలా తంజావూరు కోట ముందున్నంత బలంగా ఉంది. ఆ రోజు సాయంత్రం కుందవై, వాణతి స్వర్ణ టంకశాలను చూసేందుకు వెళ్ళినప్పుడు బంగారు నాణాలు ముద్రించేవారు పని ముగించి ఇంటికి బయలుదేరే సమయం. కాపలా వారు ఆ పనివారిని తనిఖీ చేసి బయటకు పంపేందుకు ఆయత్తమవుతున్నారు. ఆ స్వర్ణాచారులు ముఖద్వారం వద్దకు వచ్చి కూర్చొన్నారు. అప్పుడు అంతఃపుర రథం వచ్చి టంకశాల ముందు నిలిచింది. కుందవై, వాణతి రథం నుంచి దిగారు. వారిని చూడగానే కాపలాదారులు, స్వర్ణాచారులు మైమరచి నిలబడి, “యువరాకుమారికి జయహో!”అని ఘోషించారు. టంకశాల అధిపతి పరుగెత్తి వచ్చి, రాకుమార్తెలను ఉత్సాహంతో స్వాగతించారు. లోపలికి తీసుకొని వెళ్ళి బంగారు కరిగించే అగ్నిగుండం, నాణాలను అచ్చువేసే మూసలు, అచ్చువేసిన నాణాలు మొదలైన వాటిని చూపించారు. ఆరోజు ముద్రించబడిన నాణాలు ఒక పక్క కుప్పగా పోయబడివున్నాయి. ఆ పసిమి బంగారు నాణాల కాంతి కళ్లకు మిరుమిట్లుగొలిపాయి. ఒక్కొక్క నాణెం మీద, ఒకవైపు పులి, ఇంకొకవైపు ఓడ ముద్రించబడివున్నాయి.

“చూశావా, వాణతీ! చాల కాలం నుంచి ఈ చోళసామ్రాజ్యానికి ప్రపంచం నలువైపుల నుంచి బంగారం వస్తూండేది. భూమార్గం ద్వారాను వచ్చేది. ఓడల్లో సముద్రమార్గాన కూడ వచ్చేది. ఇప్పటివరకు ఆ బంగారాన్నంతటినీ మోసే బాధ్యత చోళదేశపు స్త్రీలమీదే ఉండేది. ఆభరణాలుగా చేసి వాటిని మోయలేక మోస్తూ వచ్చారు. కొంతకాలంగా చోళదేశపు స్త్రీలకు ఆ భారం తగ్గుతూ వస్తూంది. మన ధనాధికారి పెద్ద పళువేట్టరయ్యర్ ఆ బంగారాన్నంతటినీ కరిగించి కళ్ళు మెరిసేలా నాణాలను ముద్రించే ఏర్పాటు చేయించేశారు!” అన్నది కుందవై.

“అక్కా! ఇందువల్ల ఏం సౌకర్యం?” అని అడిగింది వాణతి.

“ఏం సౌకర్యమా? నీవెంతటి అమాయకురాలివి? ఇలా నాణాలుగా ముద్రిస్తే, 'ఇంత బంగారం' అని తూకం వేయకనే తెలుసుకోగల సౌకర్యం. ప్రజలు రాజ్యాంగానికి పన్ను కట్టే సౌకర్యం. వర్తకులు విదేశాలతో వ్యాపారం చేసేందుకు వస్తుమార్పిడి చేసుకొనే కష్టం తప్పుతుంది. బంగారు నాణాలనిచ్చి వస్తువులను కొనుక్కోవచ్చు, అమ్మవచ్చు. అందుకే చోళదెశపు వర్తకులు మన ధనాధికారి పెద్ద పళువేట్టరయ్యర్ని దీవిస్తున్నారు. ఇంకా ఒక విషయం చెబుతాను, విను!” అని కుందవై గొంతు తగ్గించి ఇలా అన్నది: “చక్రవర్తికి, చక్రవర్తి కుటుంబానికి విరుద్ధంగా కుట్రచేసే వారికి ఈ నాణాలు చాల అనుకూలం.

ఎంతటి నిజాయితీపరులనైన ఈ నాణాలతో ద్రోహులుగా మార్చేయవచ్చు కద?" అన్నది.

కుందవై చివరిగా అన్న మాట దగ్గరే నిలబడివున్న టంకశాల అధికారి చెవికి మెత్తగా వినిపించాయి. ఆ అధికారి, "అవును, తల్లీ! అటువంటి భయంకరమైన వదంతులు ఇటీవల వినవస్తున్నాయి. అందుకే నేను ఈ టంకశాల కాపలాను ఇంకా అధికం చేశాను. దీని కింద ఉన్న పాతాళ చెరసాలకు వచ్చేవారు, వెళ్ళేవారు అధికమయ్యారు!" అన్నారు.

"వచ్చేవారున్నారు సరే, వెళ్ళేవారు కూడ ఉన్నారా?" అని అడిగింది కుందవై.

"అవును, తల్లీ! అది కూడ ఉంది. ఈ రోజు పొద్దున ఒకడిని తీసుకొని వచ్చారు. ఒక ఘడియ తర్వాత తీసుకొని వెళ్ళిపోయారు!" అని ఆ అధికారి చెప్పారు.

అది ఎవరై ఉండవచ్చని కుందవై ఆశ్చర్యంలో మునిగింది.

~

టంకశాలలో జరిగే రకరకాల పనులను పర్యవేక్షించిన తర్వాత వెనుకవైపు నుంచి ముందుకు వెళ్ళారు. వెనుకవైపు గోడలో ఒక చిన్న తలుపు కనిపించింది. దాన్ని తెరుచుకొని ముందుకు వెళ్ళారు. అక్కడ వెలుతురు చాల తక్కువగా ఉంది. నలువైపుల నుంచి ఒళ్ళు జలదరింపజేసే ఉరుములు వినిపించాయి. ఒక సేవకుడు దివిటీ పట్టుకొని వచ్చి నిలబడ్డాడు. దాని వెలుతురులో నలువైపుల పరికించి చూసినప్పుడు బోన్లు, వాటిలో బంధించబడివున్న పులులు కనిపించాయి. వాటిలో కొన్ని పెద్ద పులులు; కొన్ని చిరుత పులులు. కొన్ని పడుకొనివున్నాయి. ఇంకొన్ని బోనుల్లో అసహనంగా తిరుగాడుతున్నాయి. వాటి కళ్ళు అక్కడి మసక వెలుతురులో నిప్పుకణికల్లాగ మెరుస్తున్నాయి.

కుందవై వాణతి చేతిని గట్టిగా పట్టుకొని, "ఏమే! భయంగా ఉందా? ఇక్కడ మూర్ఛిల్లి పడిపోకు!" అన్నది.

వాణతి మెత్తగా నవ్వేసి, "పులిని చూసి ఏం భయమక్కా! పులి మీ వంశానికి కాపలా కద?" అన్నది.

"ఒక్కోసారి కాపలా వాళ్ళే శత్రువులతో చేతులు కలుపుతారు కద? అప్పుడు అపాయం అధికమౌతుంది కద?"

"లేదక్కా! ఒకవేళ కాపలా మనుషులు అలా ద్రోహం చేయవచ్చు. కానీ ఈ పులులు అలా చేయవు!"

"చెప్పలేము. ఈ పులులు ఎన్నో రాజద్రోహులను తిన్నవి. వాళ్ల రక్తం వీటి ఒంట్లో కలిసివుంటుంది కద?"

భయమే లేదని కాసేపటి క్రితం ధైర్యంగా అన్న వాణతి శరీరం ఇప్పుడు కాస్త వణికింది.

"అక్కా! ఏమంటున్నారు? సజీవంగా ఉన్న మనుషులను ఈ పులులకు ఆహారంగా వేస్తారా?" అని అడిగింది.

"అలా చేయరు. ఈ టంకశాల కింద పాతాళ చెరసాల ఉందని చెప్పాను కద? అందులోకి వెళ్ళేందుకు, తిరిగి వచ్చేందుకు ఒకటే దారి. ఆ దారి ఈ పులి మంటపంలో ఉంది. చెరసాల నుంచి ఎవరైనా తప్పించుకోజూశారంటే వారు ఈ పులి మంటపం గుండానే బయటకు వెళ్ళాలి. అప్పుడు పులులకు ఎరౌతారు!"

"శివశివా! ఎంతటి క్రూరత్వం!"

"రాజకీయమంటే అలాగే! కరుణా ఉంటుంది; క్రూరత్వమూ ఉంటుంది. వాణతీ! ఒకవేళ నన్నీ పాతాళ చెరసాలలో పడేయవచ్చు. చిన్న పళువేట్టరయ్యర్ నాతో మాట్లాడింది వినివుంటే..."

"బాగుందక్కా! మిమ్మల్ని పట్టి చెరసాలలో వేసే ధైర్యం, సామర్థ్యం కలవారు ఏడేడు లోకాల్లోను లేరు. అలా ఎవరైనా చేయ ప్రయత్నిస్తే ఈ భూమి రెండుగా చీలి తంజావూరు నగరాన్నే మింగేయదా? అందుగురించి నాకు దిగులు లేదు. తమ పళైయారై వైద్యకుమారుని గురించే దిగులు పడుతున్నాను. ఆ సాధువైన అబ్బాయి తప్పించుకోవడానికి ప్రయత్నించి ఉండడు కద?"

"ఆ అబ్బాయి సాధువే! కానీ ఎవరు ఎప్పుడు ఎలా మారిపోతారో చెప్పలేము కద?"

పులుల గర్జన మరింత పెరిగింది.

కాపలావాడిని చూసి, "పులులకు చాల కోపంలాగుందే?" అన్నది కుందవై.

"కాదు, తల్లీ! చక్రవర్తిగారి కుమార్తెకు ఇవి స్వాగతం పలుకుతున్నాయి!" అని చమత్కారంగా అన్నాడా కాపలావీరుడు.

"మంచి స్వాగతమే!" అన్నది కుందవై.

"అంతేగాక పులులకు ఆహారం వేసే సమయం కావస్తూంది. అందువల్ల కూడ అవి అలా గుర్రుమంటున్నాయి!"

"అలాగైతే మనం ఇక్కడినుంచి త్వరగా వెళ్ళిపోదాం. చెరసాల ద్వారం ఎక్కడుంది?"

~

ఇంతలో వారు మంటపంలో ఒక మూలకు చేరుకొన్నారు. కాపలావాళ్ళు ఒక పులిబోనును పక్కకు జరిపారు, అక్కడ నేలలో పొదగబడిన ఒక ద్వారం కనిపించింది. ఇద్దరు మనుషులు వంగి ఆ తలుపును బయటివైపుకు తెరిచారు. కిందకు వెళ్ళేందుకు మెట్లు కనిపించాయి. వాటి వెంబడి ఒక్కొక్కరే కిందకు దిగి వెళ్ళారు. చీకటి ఇంకా ఎక్కువైంది. ఇద్దరు సేవకులు పట్టుకొన్న దివిటీనుంచి, పొగవల్ల మసక వెలుతురు మాత్రమే వస్తూంది. అడ్డదిడ్డంగా ఇరుగ్గా ఉన్న ఆ దారి వెంబడి ఒకరి వెనుక ఒకరు వరుసగా వెళ్ళవలసి వచ్చింది.

అక్కడ పులుల గర్జనలు,  ఉరుములు ఒళ్ళు జలదరింపజేస్తే, ఇక్కడ నలువైపుల నుంచి లేచిన దీనమైన, శోకపూరితమైన మనుష్య స్వరాలు మనసు చెదరి, ఒళ్ళు వణికేలా చేశాయి.

కానీ, ఆ దీన స్వరాల మధ్య, వింతల్లో వింత! - ఒక ఇంపైన స్వరం ఒక భక్తి గీతాన్ని పాడడం వినవచ్చింది.

<< బంగారం లాగ మెరిసే మేను చుట్టూ పులి తోలు చుట్టుకొని విరాజిల్లుతున్న

శివుని పొగుడుతూ పాడిన భక్తి గీతం - నాలుగు పాదాలు >>

ఆ పాతాళ చెరసాలలో గదులు తిన్నగా ఒక వరుసలో లేవు. ముందు, వెనుకా, అడ్డ దిడ్డంగా, వంకర టింకరగా ఉన్నాయి. ఒక్కొక్క గది ముందు వెళ్ళి కాపలావాడు దివిటీ ఎత్తి పట్టాడు. కొన్ని గదుల్లో ఒక్కొక్కరే ఉన్నారు. ఇంకొన్ని గదుల్లో ఉన్నవారిని గోడలో పొదిగిన ఇనుప వలయాలకు గొలుసులతో కట్టి బంధించివున్నారు. కొన్నిగదుల్లో బందీలు కట్టబడకుండ స్వేఛ్ఛగా వదిలేయబడివున్నారు. ఒక్కొక్క గదిలో ఉన్నవారి ముఖం దివిటీ వెలుతురులో కనిపించగా, కుందవై తల అడ్డంగా ఊపగానే అందరూ ముందుకు వెళ్ళసాగారు.

మధ్యలో వాణతి ఒకసారి, “ఇదేమి కష్టం? వీరిని ఎందుకిలా గదుల్లో కుక్కేసివున్నారు? న్యాయ విచారణ ఏమీ లేదా?” అని అడిగింది.

అందుకు కుందవై, “సాధారణ నేరాలకు న్యాయ విచారణ ఉంటుంది. రాజ్యానికెదురగా కుట్ర చేసినవారు, విదేశీ గూఢచారులు, వారికి సహాయం చేసిన వారు - వీరిని మాత్రమే ఇక్కడ బంధిస్తారు. వారినుంచి తెలుసుకోవలసిన నిజాలు తెలిసి వస్తే విడుదల చేస్తారు! కానీ కొందరి నుంచి నిజాలేమీ తెలియరావు/రాబట్టలేము. ఏమైన ఉంటేనే కద చెప్పేందుకు? వారి గతి అధోగతే!” అన్నది.

ఇంతలో, “***బంగారు మేనుగలవాడా!***” అన్న పాట అతి దగ్గరలో వినిపించింది. ఆ గది దగ్గరకు వెళ్ళి దివిటీని ఎత్తి పట్టుకొన్నప్పుడు అక్కడ ఒక అబ్బాయి ఉండడం కనిపించింది. ఇప్పటికే మనకు తెలిసిన అబ్బాయే అతడు - సేందన్ అముదన్.

అతని నిరపరాధమైన, కల్లా కపటం తెలియని, పాలుగారే ముఖం రాకుమార్తెల ఆసక్తిని చూరగొంది.

కుందవై అతన్ని చూసి, “పాడుతున్నది నీవేనా?” అన్నది.

“అవును, తల్లీ!” అన్నాడా అబ్బాయి.

“చాల ఉత్సాహంతో ఉన్నట్లున్నావే?”

“ఉత్సాహానికి ఏం కొరత, తల్లీ! ఇందుగలడందులేడన్న ఆ దైవం నాతో ఇక్కడే ఉన్నాడు!”

“పెద్ద జ్ఞానిలాగ మాట్లాడుతున్నావే? నీవెవరు? బయట ఏం చేస్తూండేవాడివి?”

"నేను పెద్ద జ్ఞానినీ కాను, చిన్న జ్ఞానినీ కానమ్మా! బయట ఉన్నప్పుడు పూలమాలలు కట్టి దేవునికి సమర్పిస్తుండేవాడిని. ఇక్కడ పాటల మాలలు కట్టి తృప్తి పడుతున్నాను!"

"నీవు జ్ఞానివి మాత్రం కాదు; కవి కూడ అని అనిపిస్తూంది. నీకు ఈ ఒక్క పాట మాత్రమే తెలుసా? ఇంకా ఏమైనా పాటలు వచ్చా?"

"ఇంకొన్ని పాటలు వచ్చు. కానీ ఇక్కడికి వచ్చినప్పటినుంచి ఈ పాటే పాడుతున్నాను."

"ఎందుకని?"

"ఇక్కడికి వచ్చేటప్పుడు టంకశాల గుండా వచ్చాను. ఇంతవరకు నేను చూసివుండని అపరంజి బంగారాన్ని చూశాను. అది 'బంగారు మేను' కలిగిన శివపరమాత్మను నాకు గుర్తు చేసింది..."

"అదృష్టశాలివి నీవు! బంగారం చూస్తే కొంతమందికి అనేక రకాల ఆశలు పుట్టుకొస్తాయి. నీకు శివుని పూజ్యశరీరం గుర్తుకొచ్చింది. నీకు కన్నవారు, చుట్టాలు ఎవరూ లేరా?"

"తల్లి మాత్రం ఉంది. తంజావూరు కోట బయట తామర కొలను వద్ద ఉంది."

"ఆ తల్లి పేరేమి?"

"వాణి అమ్మ."

"నేను ఆ తల్లిని చూసి నీవిక్కడ ఉత్సాహంగా ఉన్నావని చెబుతాను."

"ప్రయోజనం లేదు, తల్లీ! నా తల్లికి చెవులు వినిపించవు, మాటా రాదు."

"ఓహో! నీ పేరు సేందన్ అముదనా?" అని యువరాకుమారి ఆశ్చర్యంతో అడిగింది.

"అవునమ్మా! ఈ పేదవాని పేరు మీకెలా తెలిసింది?"

"ఏ కారణం వల్ల నిన్ను ఇలా చెరలో బంధించారు?"

"నిన్నటి వరకు నేను చేసిన నేరమిది అని తెలియలేదు. ఈ రోజే తెలిసింది!"

"ఏమని తెలిసింది?"

"గూఢచారి ఒకనికి నేను సహాయం చేశానని నన్ను పట్టి బంధించి ఈ చెరసాలలో పడవేశారని తెలిసింది."

"అదేమి? ఏ గూఢచారికి నీవు సహాయం చేశావు?"

"తంజావూరు కోట వాకిట ఒకరోజు బయటి ఊరినుంచి వచ్చిన ఒక ప్రయాణీకుని కలిశాను. అతడు రాత్రి ఉండడానికి చోటు కావాలని అడిగాడు. నా ఇంటికి తీసుకొని వెళ్ళాను. కానీ అతడు గూఢచారి అని కలలో కూడ ఊహించలేదు..."

"అతడి పేరేమిటో తెలుసా?"

"తన పేరు వంతిదేవుడని అన్నాడు. పాత వాణర్ కులానికి చెందిన వాడని కూడ అన్నాడు..."

కుందవై, వాణతి ఒకరినొకరు చూసుకొన్నారు. ఇద్దరి మనసులు ఒకటై మాట్లాడుకొన్నాయి.

వాణతి సేందన్ అముదన్ వైపు చూసి, "అంతా వివరంగా చెప్పు." అన్నది.

~

సేందన్ అలాగే వివరంగా చెప్పాడు. వంతిదేవుని తాను కోటవాకిట కలిసినప్పటినుంచి, పళువూర్ మనుషులు తనను నదీతీరాన చూసి పట్టి బంధించినప్పటివరకు వివరంగా చెప్పాడు.

"ఎవరో ముందు వెనక తెలియని, దారిన పోయేవాడికి ఎందుకంత దూరం సహాయం చేశావు?" అని అడిగింది వాణతి.

"తల్లీ! కొందరిని మనం చూసిన వెంటనే వారిపైన ప్రీతి, ఆప్యాయత కలుగుతాయి. వారికోసం ప్రాణమైన ఇవ్వవచ్చనిపిస్తుంది. కారణం ఏమని చెప్పను? ఇంకొంత మందిని చూస్తే చంపేద్దామనిపిస్తుంది. ఈరోజు నాతోబాటు ఇంకొకతన్ని ఈ గదిలో బంధించారు. వాడిపైన నాకు వచ్చిన కోపానికి అంతులేదు. అదృష్టవశాత్తు కాసేపటికి మునుపు పళువూర్ యువరాణి మనుషులు వచ్చి వాడిని విడుదల చేసి తీసుకొని వెళ్ళిపోయారు!..."

"ఇలా కూడ జరుగుతుందా?" అని కుందవై తన ఎర్రటి పెదవిని పళ్లతో కరుచుకొంది. భృకుటి ముడిపడింది. కోపంతో కూడిన నిట్టూర్పు తన్నుకొచ్చింది.

"అంత తొందరగా విడుదల చేయించుకొని తీసుకొని వెళ్ళింది ఎవరిని? నీకు తెలుసా?" అని అడిగింది.

"తెలియకేం? ఎవరో పళైయూరై వైద్య కుమారుడట!"

"అతనలాగ అంతటి తగని మాటలేమన్నాడు, బాబూ? అతన్ని చంపేటంతటి కోపమెందుకు వచ్చింది నీకు?"

"కోడిక్కరైలో నా మామకూతురు పూంగుళలి ఉంది. ఆమె గురించి వీడు అనుచితంగా మాట్లాడాడు. అందుకే నాకు వాడిపైన నాకంత కోపం వచ్చింది. అయినా వాడు ఒక మంచి సమాచారం చెప్పినందువల్ల పోతే పోనీ అని వదిలేశాను."

"ఏమా మంచి సమాచారం?"

"నా మిత్రుడు వంతిదేవునితోనే వీడు కోడిక్కరైకి వెళ్ళాడు. అక్కడ ఈ ఛండాలుడు నా స్నేహితునికి ద్రోహం చేసి, అతన్ని పళువూర్ మనుషులకు పట్టివ్వజూశాడు. అది సాధ్యం కాలేదు..."

"సాధ్యం కాలేదా? అంటే ఆ గూఢచారి తప్పించుకొన్నాడా?" అని వాణతి, కుందవై ఇద్దరూ ఒక్కసారిగా అడిగారు. ఇది తెలుసుకోవడానికే కద వారు ఈ పాతాళ చెరసాలకు వచ్చారు?

"అవునమ్మా! నా మిత్రుడు తప్పించుకొన్నాడు. రాత్రికి రాత్రే పూంగుళలి అతన్ని పడవలో సముద్రమార్గాన లంకకు తీసుకొని వెళ్ళిపోయిందట! వెతుక్కొంటూ వెళ్ళిన వారు మోసపోయారు. ఈ పాతకుడూ మోసపోయాడు!"

~

వనితామణులిద్దరూ ఒకరినొకరు చూసుకొన్నారు. వారిద్దరి మనస్సుల్లో పొంగిన సంతోషాన్ని వారి వదనాలు ప్రతిఫలించాయి.

కుందవై సేందన్ అముదన్ని చూసి, "బాబూ! ఒక గూఢచారి తప్పించుకొని పారిపోవడం గురించి ఇంత సంతోషపడుతున్నావు కద? నిన్ను చెరలో వేసింది తప్పేమీ కాదు!" అన్నది.

"తల్లీ! ఆ నేరానికి నన్ను చెరలో వేస్తే, మీ ఇద్దరిని కూడ నా పక్క గదిలో వేయాలి!" అన్నాడు.

స్త్రీమణులిద్దరూ గలగల నవ్వేసారు. చీకటి కమ్ముకొన్న ఆ పాతాళ చెరసాలలో సేందన్ అముదన్ పాట ఎంత విచిత్రంగా ధ్వనించిందో, వారి నవ్వుకూడ అపూర్వంగా ధ్వనించిందా చెరసాల గోడల మధ్య.

"నీవు చాల తెలివైన వాడివి. మా చెడ్డవాడివి కూడ. నీవిక్కడే ఉంటే, పాటలు పాడి ఇక్కడున్న తక్కినవారిని కూడ చెడగొట్టేస్తావు. కోట దళపతికి చెప్పి నిన్ను వెంటనే విడుదల చేయించిన తర్వాతే ఇంకేమైన ఆలోచించాలి!" అన్నది కుందవై.

"తల్లీ! అలా చేయకండి. నా పక్కగదిలో ఒకడున్నాడు. వాడూ రోజుకు మూడుసార్లు, "నీవు నాకొక పాటను నేర్పించు! నేర్పిస్తే, పాండ్య వంశపు మణి మకుటం, రత్నహారం లంకలో ఎక్కడ దాచిపెట్టబడివున్నాయో చెబుతాను!" అంటున్నాడు. ఆ రహస్యాన్ని తెలుసుకొనేవరకు నన్ను ఇక్కడే ఉండనివ్వండి!" అన్నాడు సేందన్ అముదన్.

"పాపం! అలా నీకు పిచ్చి పట్టేవరకు ఇక్కడే ఇలాగే ఉంటానంటున్నావా? తర్వాత నీతల్లి గతి ఏమి?" అని చెప్పి కుందవై అక్కడినుంచి బయలుదేరగా, తక్కినవారు కూడ ఆమె వెంట వెళ్ళారు.

అర గడియ లోపల కొందరు సేవకులు వచ్చి సేందన్ అముదన్ని విడుదల చేసి, తంజావూరు కోట వాకిలి బయట వదిలి పెట్టారు.

~~~
~~~

# అధ్యాయము - 23

## నందిని సందేశం

**ఆ** రోజు సాయంత్రం నందిని లతామంటపంలో హంసతూలికా తల్పంపైన కూర్చొని ఒక పత్రం రాస్తూంది. రాసిందేమో కొన్ని వాక్యాలే. కానీ రాసేటప్పుడు కొన్నిసార్లు ఆమె శరీరం సుడిగాలిలో చిక్కుకొన్న లేతతీగెలాగ వణికింది. తరచూ పెద్దగా నిట్టూర్చింది. ఆ చల్లని వేళలో పక్కన దాది నిలబడి వింజామర వీస్తున్నా, ఆమె పాలరాతి నుదురుపైన ముత్యాలలాగ స్వేదబిందువులు మొలిచాయి. ఆమె రాసిన పత్రం:

"యువరాకుమారా! జంకుతూ, భయపడుతూ ఈ తాళపత్ర సందేశాన్ని రాయడానికి తెగిస్తున్నాను. రాజ్యంలో పరిస్థితి గురించి పలువిధాలైన వార్తలు వినవస్తున్నాయి. మీరు దేన్నీ పట్టించుకోవడం లేదు. జబ్బుతో మంచం పట్టిన తమ తండ్రిగారు ఎన్నిసార్లు చెప్పి పంపించినా మీరు తంజావూరుకు రాలేదు. ఇందుకు కారణం నేనేనా అన్న ఆలోచన నన్ను వేధిస్తూంది. నన్ను ఒక్క సారి చూసి మాట్లాడితే అన్ని సందేహాలనూ తీర్చేస్తాను. అందుకు అందలం దిగివస్తారా? తంజావూరుకు రావడం ఇష్టం లేకపోతే కడంబూర్ మాళిగలో కలవవచ్చు. నేను ఈరోజు మీ నానమ్మ స్థానంలో ఉన్నాను. మనం కలిసి మాట్లాడేందుకు ఏం ఆక్షేపణ ఉండగలదు? ఈ సందేశాన్ని తీసుకొని వచ్చే వీర కుమారుడు, శంబువరయ్యర్ కుమారుని మీరు పూర్తిగా నమ్మవచ్చు. అతని ద్వారా ఏ సందేశమైన చెప్పి పంపించవచ్చు.

ఇట్లు - దురదృష్టం తోబుట్టిన అభాగ్యశాలి నందిని."

నిజంగానే జంకుతూ, భయపడుతూ, ఆలోచించి, ఆలోచించి పైన చెప్పబడిన పత్రాన్ని రాసిన తర్వాత, వింజామర వీస్తున్న దాదిని చూసి, "వెళ్ళవే! వెళ్ళి కడంబూర్ రాకుమారుని వెంటనే పిలుచుకొని రా!" అన్నది నందిని.

దాది అలాగే వెళ్ళి గందమారన్ని పిలుచుకొని వచ్చి, కాస్త దూరంగా ఒదిగి నిలబడింది.

గందమారన్ కళ్ళు ఆమెను నేరుగా చూడలేక, కిందికి వాలాయి. ఎక్కడో తోటవైపు చూస్తూ నిలబడ్డాడు.

"అయ్యా! కూర్చోండి!" అన్న నందిని గొంతులోని వణుకు, గందమారన్ని తలెత్తి ఆమె ముఖాన్ని పరికించి చూసేలా చేసింది.

నందిని ముందుకు మాట్లాడుతూ, "కుందవై దేవిని చూసిన కళ్ళతో నన్ను చూడలేకపోవడంలో ఆశ్చర్యం లేదు!" అని చిరునవ్వు నవ్వింది.

ఆ మాటలు గందమారన్ హృదయాన్ని చీల్చాయి. ఆమె చిరునవ్వేమో అతడి తల తిరిగేగా చేసింది.

ఉద్వేగంతో తడబడుతూ, "వేయి కుందవైలు ఒక్క నందినికి సాటిరారు!" అన్నాడు.

"కానీ యువరాకుమారి చిటికెన వేలు ఆడిస్తే స్వర్గానికి వెళ్ళి ఇంద్రుని సింహాసనాన్ని కూడ తెచ్చిస్తారు. నేను బతిమాలి వేడుకొన్నా కూర్చోరు!"

గందమారన్ వెంటనే ఎదురుగా ఉన్న వేదికమీద కూర్చొని, "తమరు ఆజ్ఞాపిస్తే బ్రహ్మలోకానికి వెళ్ళి బ్రహ్మ తలనే నరికి తెస్తాను!" అన్నాడు.

~

నందిని గడగడా వణికింది. గందమారన్ని నేరుగా చూడక ఇంకోవైపు చూస్తూ, "శివుడు కొట్టేసింది పోగా, బ్రహ్మకు ఇంకా నాలుగు తలలు మిగిలివున్నాయి. మీరు ఇంకొక తల కొట్టేసినా, బ్రహ్మ ఇంకా బతికే ఉంటాడు!" అన్నది.

"దేవీ! ఇంకేమైన మాట్లాడండి. కుందవై దేవిని పొగుడుతూ నా ముందు మాట్లాడకండి. మిత్రద్రోహియైన వంతిదేవుని వెనకేసుకొని మాట్లాడిన వైనం తలుచుకొంటే నా రక్తం ఉడికిపోతోంది!" అన్నాడు గందమారన్.

"అయినాకూడ ఈరోజు ఉదయం మీకల్పనాశక్తి అపారమన్నది నిజమే! మీకు, మీమిత్రునికి మధ్య జరిగిన యుద్ధాన్ని ఎంత బాగ కల్పించి చెప్పారు?" అన్న నందిని మాటలు గందమారన్ని కాస్త సిగ్గుపడేలా చేశాయి.

"వాడిని ఎక్కడ, ఎలా కలిశాను అని చెప్పాలి కద? అందుకే అలా చెప్పాను. వాడు నన్ను వెన్నుపోటు పొడిచింది నిజమే కద?" అన్నాడు.

"అయ్యా! ఆ రోజు జరిగిందంతా మీరింకొకసారి గుర్తు తెచ్చుకోవడం మంచిది కద?" అన్నది నందిని.

"మీరు కూడ నా మాటలను సందేహిస్తున్నారా, ఏమి?"

"సందేహించడం లేదు గాని, మీరు కొన్ని విషయాలను మరిచిపోయారు. వంతిదేవుని ఎప్పుడైన పట్టి బంధించి తీసుకొని వస్తారు. అప్పుడు మీరతని మీద మోపే నేరాలు నిజమని ఋజువు కావాలి కద?"

"అందులో నాకెలాంటి శ్రద్ధాలేదు. వాడిని ఇక క్షమించేసేందుకే ఇష్టపడుతున్నాను."

"తమ ఉదార గుణాన్ని, పెద్దతనాన్ని మెచ్చుకొంటున్నాను. కానీ, మనలో మనం నిజాన్ని నిశ్చయం చేసుకోవడం మంచిది. ఆరాత్రి జరగిందంతా మళ్ళీ ఇంకొకసారి గుర్తు తెచ్చుకొని చూడండి. నేల మాళిగ గుండా మీరు వచ్చినప్పుడు మీరు నన్ను, పళువేట్టరయ్యర్ని దారిలో కలిశారు. మీకది గుర్తుందా?"

"బాగా గుర్తుంది. నా కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు అది మరిచిపోను, పోలేను!"

"అప్పుడు మీరేమన్నారో కూడ గుర్తుంది కద?"

"ఏమన్నానో గుర్తులేదు. మిమ్మల్ని చూసి మైమరచిపోయాను."

"కానీ, మీరన్న మాటలు నాకు బాగా గుర్తున్నాయి. 'అయ్యా! తమ కుమారి అందం గురించి నేనెంతో విన్నాను. కానీ అదంతా వాస్తవంతో పోలిస్తే హస్తిమశకాంతరమే!' అన్నారు!..."

"అయ్యయ్యో! నేనలా అన్నానా? అందుకే ఆయన ముఖం అంతగా ఎర్రబారింది! ఇప్పటికీ నేనంటే ఆయనకు ఇష్టం లేదు..."

నందిని నవ్వేసి, "ఆయన మిమ్మల్ని ఇష్టపడకపోతే ఫరవాలేదు; మీకు ఆయన నచ్చారు కద? అది చాలు!"

"దేవీ! నిజం చెబుతున్నాను. మీదగ్గర దాచడం వల్ల ప్రయోజమనేముంది? నాకు ఆయన నచ్చలేదు!" అన్నాడు గందమారన్.

"అయినాకూడ ఫరవాలేదు! నాకాయన నచ్చారు; అదే చాలు! ఇటువంటి భర్తను పొందడానికి నేనెంతటి తపస్సు చేశానో కద?" అన్నది.

ఇది విన్న గందమారన్ మనసు కలతబారింది. ఏం ఉత్తరం చెప్పాలో తోచక ఊరకున్నాడు.

"అది పోతేపోనీ. నేల మాళిగలో మిమ్మల్ని చూసిన తర్వాత ఏం చేశారు?" అని అడిగింది నందిని.

"దివిటీ పట్టుకొన్న కాపలవాడు దారి చూపిస్తూ ముందు వెళ్ళాడు. నేను మిమ్మల్ని గురించి ఆలోచిస్తూ వెంట వెళ్ళాను. రహస్య ప్రాకారపు గోడ తలుపు తెరిచి కాపలావాడు ముందుకు నడిచాడు. నేనూ ఆ ద్వారం గుండా దూరాను. వెంటనే ఎవరో వెన్నులో పొడిచారు. అంత వరకే జ్ఞాపకముంది. వంతిదేవుడు నేనక్కడికి వస్తానని ఎలాగో తెలుసుకొని అక్కడే బయట పేచివున్నాడనిపిస్తుంది..."

"లేదయ్యా! మీరనుకొంటున్నది చాల పొరపాటు. బయట ఆయన పేచి ఉండనేలేదు."

"మీరు కూడ వారి పక్షమే మాట్లాడుతున్నారా?"

"నేనెందుకు ఆయన పక్షం మాట్లాడాలి? అందువల్ల నాకేమి లాభం? లేక అతడికి మాత్రమేం లాభం? ఇలాగే జరిగివుండాలని నాకిప్పుడు నిశ్చయంగా తెలుస్తోంది."

"చెప్పండి, దేవీ! ఎలా జరిగివుండాలని చెప్పండి!"

"వంతిదేవుడు బయట పేచివుండలేదు!..."

"మరి ఎవరు పేచివున్నారు బయట?"

"ఇంకెవరూ లేదు; వంతిదేవుడు బయట పేచివుండలేదనే కద చెప్పాను? అతడు ఆ బొక్కసపు నేల మాళిగలోనే దాక్కొని పేచివున్నాడు!"

"ఏమేమి? అదెలా సాధ్యం దేవీ?"

"అతడా రోజు ఉన్నట్లుండి మాయమైపోయాడు. ఎలా మాయమై ఉండవచ్చు? మీరే ఆలోచించి చూడండి! అతడు ఎలాగో బొక్కసపు నేలమాళిగలో దూరి దాని రహస్యాలన్నీ తెలుసుకొన్నాడు. తర్వాత మిమ్మల్ని వెంబడించి వచ్చివుండాలి. తలుపు తెరిచిన వెంటనే మిమ్మల్ని వెనుకవైపు నుంచి పొడిచి ముందుకు తోసేసి  తాను కూడ బయట పడ్డాడు. తర్వాత అతడి మనస్సాక్షే అతన్ని తొలిచివుండాలి. అందుకే మిమ్మల్ని ఆ మూగదాని ఇంటికి తీసుకొని వెళ్ళి పడేసి పారిపోయాడు!..."

"దేవీ! మీరు చెప్పినట్లే జరిగివుండాలి. సందేహం లేదు. ఇన్నాళ్ళు ఇది నా బుద్ధికి తట్టలేదు; ఇంకెవరికీ తట్టలేదు కూడాను. ఈ చోళ సామ్రాజ్యంలో అతి చురుకైన బుద్ధి ఉన్న వారెవరని అడిగితే మీరేనని చెబుతాను. తెలివిగల వాళ్ళున్నారు. సౌందర్యం కలవారున్నారు. కానీ రెండూ ఉన్నవారిని బ్రహ్మ సృష్టిలో కనిపించడం అపూర్వం. మీలోనే అందం, తెలివి రెండూ ఉండడం చూస్తున్నాను!" అని పరవశంతో అన్నాడు గందమారన్.

"అయ్యా! మీరిప్పుడన్న మాటలు మనఃపూర్వకంగా అన్న మాటలేనా? లేక కొందరు పురుషులు పరస్త్రీల ముందు చేసే ముఖస్తుతా?"

"ముఖస్తుతి కాదు; సత్యంగా నా మనసులో ఉన్నమాటే చెప్పాను."

"అలాగైతే నన్ను పూర్తిగా నమ్ముతారా? నమ్మి నాకొక సహాయం చేస్తారా?"

"నేను చేయగలిగిన కార్యమేదైనా చేయడానికి సిద్ధంగా ఉన్నాను."

"నాకోసం మీరు కంచికి వెళ్ళాలి."

"కాశీకి వెళ్ళమన్నా వెళతాను!"

"అంత దూరం వెళ్ళనవసరం లేదు. కంచిలో ఉన్న యువరాజు ఆదిత్య కరికాలన్ గారికివ్వడానికి ఒక వినతి పత్రం ఇస్తాను. దాన్ని వారికివ్వాలి. ఇచ్చి, వారిని తమ కడంబూర్ మాళిగకు అతిథిగా ఆహ్వానించాలి..."

"దేవీ! ఇదేం మాట? తమ భర్త, నా తండ్రి, తక్కిన పలువురు చోళదేశ ప్రముఖులు రాజ్యం గురించి చేస్తున్న సమాలోచన మీకు తెలియదా?"

"బాగా తెలుసు. అది మాత్రంగాక ఇంకా కొన్నివిషయాలు కూడ తెలుసు. అయ్యా! తమ కుటుంబం, నా కుటుంబం ఇంకా పలు ప్రముఖుల కుటుంబాలు  ఒక పెద్ద అపాయానికి గురి కాబోతున్నాయి. అందుకు కారణం ఎవరు తెలుసా?"

"చెప్పండి, దేవీ!"

"ఈ రోజు మధ్యాహ్నం ఇక్కడికి అతిథిగా వచ్చిందే, ఆ పాతకే!"

"అయ్యయ్యో! యువరాకుమారినా చెబుతున్నారు?"

"ఆ విషసర్పాన్నే సూచించి చెబుతున్నాను. పాము కాలు పాముకు తెలుసు. కుందవై కుట్ర ఈ నందినికి మాత్రమే తెలుసు. మీ స్నేహితుడు వంతిదేవుని లంకకు పంపించింది. ఎందుకు తెలుసా? మూలిక తీసుకొని రావడానికన్నది ఒట్టి అబద్ధం! సుందర చోళ చక్రవర్తి బతకాలని ఆమె పరితపించిపోవడం లేదు. ఆయన తర్వాత మధురాంతకులు గాని, ఆదిత్యులు గాని పట్టానికి రాకూడదు. తన ముద్దుల తమ్ముడు అరుళ్మొళి వర్మ సింహాసనమెక్కాలని ఆమె ఉద్దేశం. అరుళ్మొళి పట్టానికి వస్తే ఈమె తన ఇష్టం వచ్చినట్లు ఆడవచ్చు, ఆడించవచ్చు. తర్వాత చోళ సామ్రాజ్య చక్రవర్తి ఎవరో తెలుసా? మీ స్నేహితుడు వంతిదేవుడు!..."

"ఆహా! అలాగా? దీన్ని ఎలాగైన అడ్డగించే తీరాలి. నా తండ్రికి, పళువూర్ రాజుగారికి వెంటనే తెలియజెప్పాలి!"

"వారికి చెప్పి ప్రయోజనం లేదు. వారు నమ్మరు. కుందవై తంత్రాన్ని ప్రతి తంత్రంతోనే గెలవాలి. మీరు సహాయం చేస్తే గెలవవచ్చు!"

"అజ్ఞాపించండి, దేవీ!"

"ఇదిగో, ఈ తాళపత్రాన్ని అతి జాగరూకతతో తీసుకొని వెళ్ళి కంచిలో ఉన్న యువరాజుగారికి ఇవ్వాలి. ఇస్తారా?" అని చెబుతూనే, చుట్టివున్న తాళపత్రాన్ని ముందుకు చాచింది. నందిని మోహపు వలలో పడి మతి పోగొట్టుకొన్న గందమారన్ చుట్టిన తాళపత్రాన్ని, దాన్ని పొందుపరచవలసిన వెదురుబొంగును తీసుకోవడానికి బదులు నందిని చేతిని పట్టుకొని, "తమ కోసం ఏమైనా చేస్తాను!" అన్నాడు.

అప్పుడు టపటపమని ఒక శబ్దం వినిపించింది. పళువేట్టరయ్యర్ అంతఃపురంనుంచి లతామంటపానికి వచ్చే దారిన వేగంగా వస్తున్నారు. ఉన్నట్లుండి ఎదురు చూడని వారు రావడంతో దాదులు అదిరిపడి పక్కకు తొలగారు. అక్కడ లతామంటపం చూరునుంచి వేలాడుతున్న ఒక వలయంలో గొలుసుతో కట్టబడ్డ ఒక చిలుక కూర్చొనివుంది. వచ్చిన వేగంలో తనకు తెలియకుండానే ఆ చిలుకను చేత పట్టుకొన్నారు. మనసులో ఉన్న కోపం చేతిగుండా ముందుకు దూకింది. చిలుక రెక్కలూ టపటపా కొట్టుకొన్నాయి. పళువేట్టరయ్యర్ క్రూరమైన పట్టు కలిగించిన తీవ్రమైన బాధను తట్టుకోలేక 'కీచు'మని అరిచింది!

~~~
~~~

# అధ్యాయము - 24

## సెగ తగిలిన మైనం

చిలుక కీచుమని అరిచిన శబ్దం, దాది భయంతో వేసిన కేక – రెండు కలిసి నందినిని, గందమారన్ని ఉలిక్కిపడేలా చేశాయి. గందమారన్ తిరిగిచూశాడు. పళువేట్టరయ్యర్ వస్తున్నారని తెలియగానే అతడి మనసులో గుబులు కలిగింది. కాసేపటికి మునుపు పళువేట్టరయ్యర్ తనకు నచ్చలేదని తానన్న మాట ఆయన చెవిన పడిందా అన్న సందేహం కలిగింది. అంతకన్న భీకరమైన ఆలోచన – నందిని గురించి, తన గురించి ఆయన ఏమైన తప్పుగా భావిస్తున్నారేమోనన్న భయం - అతడికి భయాన్ని, దిగులును పుట్టించాయి. ముదుసలితనంలో పెళ్ళిచేసుకొన్నవారి పోకడే వేరు కద? అందుకే ఆయన అంత కోపంతో వస్తున్నారేమో? వచ్చి ఏం చేయబోతున్నారో తెలియదు. అన్నిటికీ సిద్ధంగా ఉండవలసిందే!

ఇదంతా ఒక్క త్రుటిలో గందమారన్ మనసులో ఉవ్వెత్తున లేచిన ఆలోచనాతరంగాలు. కానీ ఆరోజు అతడికి ఒక పెద్ద విచిత్రాన్ని చూసే అవకాశం దొరికింది. అతడనుకొన్నదానికంతటికీ వ్యతిరేకంగా ఆ విచిత్రం జరిగింది. పళువేట్టరయ్యర్ దగ్గరకు రాగానే నందిని నల్ల తుమ్మెదల్లాంటి తన కళ్లతో ఆయనను చూస్తూ, "నాథా! మీరు తిరిగి రావడానికి ఇంకా ఎన్నాళ్ళు పడుతుందో అనుకొన్నాను! మంచివేళగా తిరిగి వచ్చేశారు!" అన్నది. ఆమె ముఖాన్ని చూసి, ఆమె మాటలు వినగానే ఆయన కోపావేశాలన్నీ గాలికి ఎగిరిపోయాయి. నిప్పులో పెట్టిన మైనంలాగ కరిగిపోయారు. ఒక వెకిలి నవ్వు నవ్వి, "అవును. వెళ్ళిన కార్యం ముగిసింది. తిరిగి వచ్చేశాను" అన్నారు.

తర్వాత గందమారన్ని చూసి, "ఈ అబ్బాయి ఇక్కడేం చేస్తున్నాడు? ఏదైనా ప్రేమగీతం రాసి తీసుకొచ్చాడా?" అని అడిగేసి తన పరిహాసాన్ని గురించి తానే నవ్వారు.

గందమారన్ ముఖం ఎర్రబడింది. కానీ నందిని ఆయన కన్న పెద్దగా నవ్వి, "ఈయనకు ప్రేమంటే ఏమిటో తెలియదు; కవిత్వమూ రాదు. యుద్ధంలో గాయపడ్డం మాత్రమే తెలుసు. మంచివేళ, గాయం మానిపోయింది. ఊరికి వెళ్ళాలంటున్నారు!" అన్నది.

"ఈ కాలపు అబ్బాయిల వీరత్వాన్నేమనాలి? ఇరవైనాలుగు యుద్ధాల్లో పోరాడి అరవైనాలుగు గాయాలు పడ్డాకూడ మంచమెక్కలేదు. వీడికి గాయం మానడానికి ఒక పక్షంకన్న ఎక్కువ సమయమే పట్టింది. కానీ నా గాయాలన్నీ భుజాలమీద, ఎదమీద, తలమీద, ముఖం మీద తగిలినవి. కానీ ఈ పిల్లాడిది వెన్నుపోటు కద? అందుకే ఇన్నాళ్ళు పట్టింది మానడానికి. న్యాయమే!" అని చెప్పేసి మళ్ళీ పరిహాసంగా నవ్వారు.

గందమారన్ కోపంగా లేచి నిలబడి, "అయ్యా! తమరు నా తండ్రి స్థానంలో ఉన్నారు. కాబట్టి మీ

పరిహాసాన్ని భరిస్తున్నాను!" అన్నాడు.

"లేకపోతే ఏం చేసేవాడివోయ్?" అని పళువేట్టరయ్యర్ తమ ఒరలోని కత్తిపిడి మీద చేయివేశారు.

నందిని అప్పుడు అడ్డు వచ్చి, "నాధా! ఈయనకు వెన్నులోనే కాదు, మనసులో కూడ గాయమైందని మీకు తెలుసు కద? స్నేహితుడైనవాడు తననిలా వెన్నుపోటు పొడిచేసి పారిపోయాడన్న ఆలోచన ఈయన మనసులో పెద్ద గాయాన్ని కలిగించింది. వెన్నులో గాయం మానినా, మనసులోని గాయం ఇంకా మానలేదు. ఆ గాయాన్ని కెలికేటట్లు మీరు మాట్లాడకూడదు కద? ఆరోజు రాత్రి, ఈయన గాయపడ్డ రాత్రి, ఏం జరిగిందో మీకు తెలియదా, ఏమి?" అంటూ నందిని ఆయనను చూసిన చూపులో ఏదో గూఢార్థం ఉండివుండాలి! పళువేట్టరయ్యర్ ముఖ కవళికలు వెంటనే మారిపోయాయి.

"అవును; నీవు చెబుతున్నది సరైనదే! పాపం, వీడు అమాయకమైన పిల్లాడే! వీడి తండ్రేమో నా ప్రాణస్నేహితుడు. వీడు ఏదో తెలియనితనంతో మాట్లాడిన మాటను నేను పెద్దగా తీసుకోకూడదు. అదలా ఉండనీ. నందినీ! ఒక ముఖ్యమైన విషయం చెప్పేందుకు ఇప్పుడిక్కడికి వచ్చాను. అది వీడికి కూడ తెలియవలసిన విషయమే. లంకలోని మామిడితోపులో ఒకడిని గూఢచారి అని సందేహించి పట్టి బంధించారట. యువరాజు అరుళ్మోళి వర్మకు ఉద్దేశించిన ఒక తాళపత్రం కూడ అతడి వద్ద ఉందట. బహుశ అతడే గందమారన్ స్నేహితుడే అని అనిపిస్తూంది. చూశావా? మన మనుషులకు చిక్కకుండ లంకకు పారిపోయాడు!" అన్నారు పళువేట్టరయ్యర్.

ఒక్క క్షణంపాటు నందిని ముఖంలో కలిగిన మార్పును తక్కిన ఇద్దరూ గమనించలేదు.

"అరె! తప్పించుకొని పారిపోయాడా? లంకకు పారిపోయాడా?" అని గందమారన్ మోసపోయిన ధోరణిలో అన్నాడు.

"నాధా! అతడు తప్పించుకొని పారిపోయిన విషయం నాకేమీ ఆశ్చర్యం కలిగించడం లేదు. తమ సహోదరులు ఈ కోట కాపలాకు తగరు అని నేను మీకెన్నోసార్లు చెప్పాను కద! ఆయన పంపించిన మనుషుల సామర్థ్యం కూడ అంత మట్టుకే కద ఉంటుంది?" అన్నది నందిని.

"ఇంతకు ముందు నీవలా అన్నప్పుడు అది నాకు సరి అనిపించలేదు. ఇప్పుడు నాక్కూడ అలాగే అనిపిస్తూంది. ఇంకా ఒక వింత విను! మామిడితోపులో చిక్కిన గూఢచారి దగ్గర మన పళువూర్ రాజముద్ర ఒకటి ఉందట. అది వాడికి ఎలా దొరికిందని వాడు చెప్పలేదట!..."

~

నందిని చిన్నగా నిట్టూర్చి, "ఇదేమి వింత? పళువూర్ రాజముద్ర అతడికెలా దొరికిందట? ఇందుకు మీ తమ్ముని ఉత్తరమేమి?" అన్నది.

"వాడా? వాడు చెప్పింది వింటే నీకు నవ్వే వస్తుంది! ఆ రాజముద్ర నీ దగ్గరినుంచే ఆ

గూఢచారికి దొరికివుండాలంటున్నాడు!" అని చెప్పేసి పెద్ద పళువేట్టరయ్యర్ పడీపడీ నవ్వారు.

ఆ నవ్వుకు ఆ లతామంటపమే ఒక్క ఊపు ఊగినట్లనిపించింది. అంతఃపురపు నందన వనంలోని చెట్లన్నీ గడగడ వణికాయి.

నందిని కూడ ఆయనతో బాటు నవ్వుతూ, "నా మరిదిగారున్నారు చూశారూ, ఆయన బుద్ధిచతురతకు ఈ ఏడేడు లోకాల్లో ఎవరూ సాటి రారు!" అన్నది.

"ఇంకా నీ మరిది ఏం చెబుతున్నాడో తెలుసా? మంచి చోద్యమే! అది తలుచుకొంటే మళ్ళీ నవ్వొస్తోంది! తంజావూరు కోటకు నీవు పల్లకిలో తిరిగి వస్తున్నప్పుడు ఆ ఇంద్రజిత్తు నిన్ను కలిసి మాట్లాడాడట. తర్వాత ఆ మాయావి ఈ అంతఃపురంలోకి వచ్చాడట/దూరాడట. కాబట్టి నీవే ఆ రాజముద్రను వాడికి ఇచ్చివుండాలట! అలా కాకపోతే, నీ దగ్గరకు ఎవడో ఒక మంత్రవాది తరచూ వస్తుంటాడు కద, వాడి ద్వారా ఆ మాయావికి దొరికివుండాలట! తన మూర్ఖత్వాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఇలా ఏవేవో కల్పించి చెబుతున్నాడు!" అని పెద్ద పడువేట్టరయ్యర్ తన పొడవాటి పళ్ళన్నీ కనిపించేలాగ మళ్ళీ హహ్హహ్హ అని నవ్వారు.

"నా మరిదిగారి బుద్ధి చాతుర్యాన్ని నేను సందేహించింది చాల తప్పు. ఆయన బుద్ధి చాల చురుకైనదే. కానీ ఇదంతా విని మీరింకా ఊరకున్నారేమి? అదే నాకాశ్చర్యంగా ఉంది!" అన్నది నందిని. ఆ వెంటనే ఆమె ముఖ కవళికలు మళ్ళీ మారాయి. ముఖంలో నువ్వులు గుగ్గిళ్ళు పేలాయి. కళ్ళనుంచి నిప్పురవ్వలు దూసుకొచ్చాయి.

పలు యుద్ధాల్లో ఎన్నో శూలాలను, కత్తులను ఎదుర్కొన్న ఆ ఉక్కు మనిషి నందిని కోపానికి తట్టుకోలేక తడబడ్డారు. ఆయన చూపుల్లోను, మాటల్లోను ఉన్నట్లుండి మెత్తదనం అగుపించింది.

"దేవీ! నేనదంతా విని ఊరకున్నాననుకొన్నావా? వాడి చేతగానితనం గురించి చాల కఠినంగా మాట్లాడి వాడిని ఏడ్పించేశాను. నీవది వినివుంటే నీవే వాడిపైన జాలిపడేవాడివి!" అన్నారు.

~

ఇదంతా వింటున్న గందమారన్ పెద్ద సంకటంలో పడ్డాడు. నందిని పట్ల కాస్త భయమూ, పళువేట్టరయ్యర్ పైన కాస్త జాలి కలిగాయి. వీరి దాంపత్య వ్యవహారాల్లో చిక్కుబడకుండ మెల్లగా జారుకోవాలనుకొన్నాడు. గొంతు సవరించుకొని, "అయ్యా!..." అన్నాడు.

నందిని అడ్డుపడి, "నా మరిదిగారి సామర్థ్యాన్ని గురించి మాట్లాడుతూ ఈయనను మరిచేపోయాము. ఈయన ఊరికి వెళతానంటున్నారు. వెళ్ళవచ్చు కద?" అని అడిగింది.

"ధారాళంగా వెళ్ళవచ్చు. ఇతడిన్నాళ్ళు ఇక్కడ ఉండిపోవడం గురించే వీళ్ల తండ్రి దిగులుపడుతుంటారు!"

"వీరి ద్వారా ఒక తాళపత్ర సందేశం పంపగోరుతున్నాను. పంపవచ్చు కద?"

"తాళపత్రమా? ఎవరికి?"

"కంచిలో ఉన్న యువరాజుగారికి!"

పళువేట్టరయ్యర్ సందేహంతో నందినిని, గందమారన్ని మార్చి మార్చి చూసి, "నీవు యువరాజుకు పత్రం రాస్తున్నావా? ఎందుకు?" అని అడిగారు.

"యువరాకుమారి కుందవై తన తమ్మునికి పత్రం రాసి ఈయన స్నేహితుని ద్వారా లంకకు పంపించింది. మరి పళువూర్ రాణి అన్నగారికెందుకు తాళపత్రం రాసి పంపించకూడదు?" అన్నది నందిని.

"వీడి స్నేహితుడు తీసుకొని వెళ్ళిన తాళపత్రం యువరాకుమారి కుందవై రాసినదా? అది నీకెలా తెలుసు?" అని పళువేట్టరయ్యర్ అడిగారు.

"మరెందుకు మంత్రవాది తరచూ నా దగ్గరకు వస్తున్నాడట? వాడు మంత్రం వేసి తెలుసుకొన్నదీ విషయం. నా మరిదిగారి మనుషుల సామర్థ్యం తెలుసు కద? పళువూర్ రాజముద్ర ఆ గూఢచారి దగ్గర ఉందని కనిపెట్టి చెప్పినవాళ్ళు తాళపత్రం రాసింది కుందవై అని చెప్పలేదు, చూడండి!"

"రాజముద్ర గురించి కూడ మన మనుషులు చెప్పలేదు. అనిరుద్ధ బ్రహ్మరాయలు రామేశ్వరానికి వెళ్ళి తిరిగి వచ్చారు. ఆయన తీసుకొని వచ్చిన వార్త..."

"ఆ బ్రాహ్మణుడైన కుందవై దేవి తాళపత్రం గురించి మీకు చెప్పారా?"

"లేదు!"

"నాథా! నేను మీకు చేసిన హెచ్చరికను ఎంచి చూడండి. ఈ రాజ్యంలో ఉన్నవారందరూ మిమ్మల్ని వంచింపజూస్తున్నారని మీకు నేను చెప్పలేదా? అది నిజమని మీకు ఇప్పుడైనా తెలుస్తోందా, లేదా? మంత్రవాది చెప్పింది మాత్రమే నేను నమ్మడం లేదు. కోడిక్కరై నుంచి పట్టి బంధించి తీసుకొని వచ్చిన వైద్యకుమారుని కూడ విచారించి తెలుసుకొన్నాను. వాడుకూడ దాన్ని దృఢపరిచాడు. యువరాకుమారి తన తమ్మునికి తాళపత్రం రాసి పంపించిదని చెప్పాడు!" అన్నది.

~

పళువేట్టరయ్యర్కి కళ్లకు గంతలు కట్టి అడవిలో వదిలి పెట్టేసినట్లనిపించింది. గందమారన్ని చిరాగ్గా చూశారు. ఆ పిల్లాడి సమక్షాన ఇదంతా మాట్లాడడం ఆయనకు నచ్చలేదు.

అది గ్రహించిన నందిని, "మన కథ ఉండనే ఉంది. ఈయన ప్రయాణాన్ని ఎందుకు ఆలస్యం చేయాలి?" అని చెప్పేసి, గందమారన్ని చూసి, "అయ్యా! కంచిలో ఉన్న యువరాజుగారికి ఈ తాళపత్రాన్ని తిన్నగా తీసుకొని వెళ్ళి ఇవ్వాలి. ఆయన దీనికి బదులుగా ఏదైన రాసి ఇస్తే అత్యంత జాగరూకతతో తీసుకొని రావాలి. మీ కడంబూర్ మాళిగకు ఆహ్వానించ మరిచిపోకండేం?" అన్నది.

"నా తండ్రికి ఏం చెప్పను? ఇది పళువూర్ రాజుగారి కోరిక అని చెప్పనా?" అని కాస్త జంకుతూ అడిగాడు.

"ధారాళంగా చెప్పవచ్చు. నా కోరికే పళువూర్ రాజుగారి కోరిక. నాధా! ఏమంటారు?" అన్నది నందిని.

"ఔనౌను!" అని తలాడించారు పళువేట్టరయ్యర్. ఆయనకు ఏమీ అర్థం కాలేదు. తల గిర్రున తిరిగింది. నందినికి వ్యతిరేకంగ మాట్లాడేందుకు కూడ ఆయనకు సాధ్యం కాలేదు.

~

గందమారన్ వెళ్ళిన తర్వాత నందిని పళువేట్టరయ్యర్ని తన అయస్కాంతపు కళ్ళతో చూస్తూ, చిలుక పలుకులతో, "నాధా! మీకు నామీద నమ్మకం తగ్గిపోయినట్లుంది. నా మరిదిగారి దుర్భోధలు గెలిచినట్లున్నాయి!" అన్నది.

"ఎంతమాత్రం కాదు, నందినీ! నా చేతబట్టిన శూలంపైన, నా ఒరలోని కత్తిపైన నమ్మకం తగ్గినా, నీపైన నా నమ్మకం తగ్గదు. వీర స్వర్గంపైన నేను నమ్మకం కోల్పోయినా, నీ మాటల పైన నమ్మకం కోల్పోను!" అన్నారు.

"అది నిజమైతే ఆ అబ్బాయి సమక్షాన నన్నెందుకు ప్రశ్నలడిగారు? నాకు అవమానంగా ఉంది!" అని నందిని అన్నప్పుడు ఆమె కళ్ళలో నీళ్ళుబికాయి.

పెద్ద పళువేట్టరయ్యర్ విలవిల్లాడిపోయారు. "వద్దు, నా కన్నా! ఇలా నన్ను శిక్షించకు!" అని చెప్పి, నందిని కళ్లలో పొంగిన కన్నీళ్లను తుడిచి ఓదార్చారు.

"అయినా, నీ పనులు కొన్ని నాకర్థం కావడం లేదు. ఏమి, ఎలా, ఎందుకు అని అడిగేందుకు నాకు హక్కులేదా?" అన్నారు.

"అడిగేందుకు మీకు హక్కుంది. చెప్పేందుకు నాకు బాధ్యత ఉంది. ఎవరు లేదన్నారు? అన్యుల ముందు అడగవద్దని మాత్రమే అన్నాను. ఇప్పుడేమైనా అడగండి!" అన్నది నందిని.

"ఆదిత్య కరికాలన్‌కి ఎందుకు పత్రం రాసి పంపించావు? వాడిని కడంబూర్ మాళిగకు ఎందుకు ఆహ్వానించావు? వాడే కద మన ఉపాయం నెరవేరేందుకు ప్రధమ విరోధి?" అన్నారు పళువేట్టరయ్యర్.

"కాదు, కాదు! ఆదిత్య కరికాలన్ మన ప్రధమ విరోధి కానేకాడు. ఆ పళైయార్రై ఆడ పామే మన ప్రధమ విరోధి. ఆమెను నేనెందుకు మన అంతఃపురానికి ఆహ్వానించాను? అదే కారణం కోసమే ఆదిత్యుని కడంబూర్ మాళిగకు ఆహ్వానించమన్నాను. నాధా! నేను తరచూ చెబుతూ వస్తున్నది గుర్తు తెచ్చుకోండి. యువరాకుమారి కుందపై ఇంకేదో పన్నాగం పన్నుతోంది అని చెబుతూ వచ్చాను కద? అది ఏమని ఇప్పుడు కనిపెట్టేశాను. తక్కిన అందరినీ పక్కకు తోసేసి తన ముద్దుల తమ్ముడు అరుళ్మొళి వర్మను తంజావూరు సింహాసనమెక్కించడమే ఆమె ఉద్దేశం. అందుకే ఆమె లంకకు దూతను పంపించింది. అందుకే

ఇప్పుడు తంజావూరుకు వచ్చింది. ఆమె ఎత్తుకు పై  ఎత్తు వేసి ఆమె ఉద్దేశం నెరవేరకుండ చేయాలి. కంచికి నేను పత్రం పంపించిన కారణం ఇప్పుడు తెలుస్తోంది కద?" అంటూ నందిని పళువేట్టరయర్ని చూసిన చూపు ఆయన మనసును ఒక్క ఊపు ఊపి, మతి స్థిమితం తప్పేలా చేసింది.

ఏమీ తెలియకపోయినా, "అవును, తెలుస్తోంది!" అని తలాడించాడా వృద్ధవీరుడు.

"నాథా! మీరు, మీ పూర్వీకులు సాధించిన మహాకార్యాల వల్లనే ఈ చోళ సామ్రాజ్యం ఇంతగా పెరిగి విస్తరించింది. ఈ తంజావూరు స్వర్ణ సింహాసనం పైన ఒక్క రోజైన మీరు కూర్చొని పరిపాలన చేసేవరకు నా కళ్ళు నిద్రపోవు! అంతలోపల మీకు నాపైన ఎటువంటి సందేహం కలిగినా, మీ ఒరలోని కత్తితో ఒక్కవేటుతో నన్ను చంపేయండి!" అని ఆవేశంతో అన్నది నందిని.

"నా కన్నా! నా ముద్దూ! ఇటువంటి కర్ణ కఠోరమైన మాటలతో నన్ను చిత్రవధ చేయకు!" అన్నారు పెద్ద పళువేట్టరయ్యర్.

~~~
~~~

# అధ్యాయము - 25

## మామిడి తోపు మహానగరం

**మన** కథానాయకుడు వంతిదేవుని మనం విడిచిపెట్టి చాల కాలమైంది. తంజావూరులోనే ఉండిపోయాము. కొన్నిరోజులే అయినా, చాల కాలం లాగనిపిస్తోంది.

ఈ కొన్ని రోజుల్లో వంతిదేవుడు లంకాసముద్రతీరం వెంబడి నడిచివెళ్ళి పాలావి నది ఒడ్డున ఉన్న మామిడితోపు నగరాన్ని చేరాడు.

రామేశ్వరపు సముద్రానికవతల, లంకాసముద్రతీరాన ఉన్న ఆ నగరం తిరుజ్ఞాన సంబందర్ కాలంలోను, సుందరమూర్తి కాలంలోను ఉన్నట్లే ఇప్పుడు కూడ పచ్చని చెట్లతోను, దట్టమైన తోపులతోను కంటికింపుగా కనిపిస్తోంది. మామిడి చెట్లు, పనస చెట్లు ఆ తీరం వెంబడి ఏపుగా పెరిగివున్నాయి. అరటిచెట్లు, కొబ్బరి చెట్లు, ఆ చెట్లపైన కోతులు ఉయ్యాలలూగుతున్నాయి. తుమ్మెదల ఝుమ్మని ఝుంకారం చేస్తున్నాయి. చిలుకలు కమ్మగా పాడుతున్నాయి.

ఆ నగరపు కోట గోడలను సముద్రపుటలలు తాకి జలజలమని శబ్దం చేయసాగాయి.

మామిడితోపు నగరపు నదీముఖద్వారంలో పెద్ద పెద్ద ఓడలనుంచి చిన్న చిన్న పడవల వరకు అన్నీ దగ్గర దగ్గరగా నిలిచివున్నాయి. వాటినుంచి తీరానికి దించబడ్డ సరుకులు గుట్టలు గుట్టలుగా పడివున్నాయి.

ఇవన్నీ సంబందర్ - సుందరమూర్తి కాలంలోనే ఉన్నా, ఇప్పుడింకొన్ని మార్పులు కానవచ్చాయి. ఆ నగరపు వీధుల్లో కేతీశ్వర దేవాలయానికి వెళ్ళే భక్త కూటములు అంతగా కనిపించడం లేదు. భక్తులు దైవ భక్తి గీతాలను పాడి పరవశించిన చోటల్లా ఇప్పుడు యుద్ధవీరులు కనిపిస్తున్నారు. కత్తులు, కటారులు, శూలాలు చేతబట్టిన వీరులు అక్కడక్కడ తిరుగాడుతూ కనిపించారు.

గత నూరేళ్ళుగా ఆ నగరం పలు యుద్ధాలకు కేంద్రంగా ఉంటూ వచ్చింది. తమిళనాడు నుంచి లంక మీదికి యుద్ధానికి వచ్చిన సైన్యాలలో అధికభాగం అక్కడే దిగి విడిది చేసేవారు. తిరిగివెళ్ళే దండ్లుకూడ అక్కడే ఓడెక్కేవారు. నగరం చాల సార్లు చేతులు మారింది. కొంతకాలం లంకాధీశ్వరుల చేతిలో, ఇంకొంతకాలం పాండ్యరాజుల చేతుల్లో ఉండేది. పరాంతక చోళుని కాలం నుంచి చోళుల అధీనంలో ఉంటూ వస్తూంది.

~

అటువంటి మహానగరపు కోట వాకిట వంతిదేవుడొకనాడు వచ్చి నిలబడ్డాడు. కోట లోపలికి వెళ్ళి చోళ సేనాధిపతిని చూడాలన్నాడు. కాపలావీరులు సుతరామూ ఒప్పుకోలేదు. కడంబూర్ మాళిగ

లోపలికి ప్రవేశించేందుకు ఉపయోగించిన యుక్తినే ఇక్కడకూడ ప్రయోగిద్దామనుకొని, వాళ్ళను తోసుకొని లోపలకు చొరబడజూశాడు. వాళ్ళు వెంటనే అతన్ని పట్టి కోట దళపతి దగ్గరకు తీసుకొని వెళ్ళారు. వంతిదేవుడు యువరాజు అరుళ్మొళి వర్మకు ఒక ముఖ్యమైన తాళపత్ర సందేశాన్ని తీసుకొని వచ్చానని, అందుగురించి సేనాపతికి మాత్రమే చెప్పగలనని కోట దళపతికి చెప్పాడు. భటులు అతన్ని తనిఖీ చేసి, పొన్నియిన్ సెల్వన్‌కి ఒక తాళపత్ర సందేశం, పళువూర్ రాజ చిహ్నం కలిగిన ఒక ఉంగరం అతని దగ్గర ఉన్నట్లు కనుగొన్నారు.

కొడుంబాళూర్ పెద్ద వేళార్ బూది విక్రమ కేసరి అప్పుడు లంకలో ఉన్న చోళ సైన్యానికి అధిపత్యం వహిస్తున్నారు. కాపలావీరులు వెళ్ళి ఆయనకు ఈ విషయం తెలియజేశారు. అప్పుడు సేనాధిపతి ముఖ్య మంత్రి అనిరుద్ధ బ్రహ్మరాయలతో మాట్లాడుతున్నారు. ఆయనతో బాటు రామేశ్వరం వరకు వెళ్ళడానికి ఆయత్తమవుతున్నారు. కాబట్టి తిరిగి వచ్చి విచారిస్తానని, అంతవరకు ఆ వీరుని కాపలాలో ఉంచమని చెప్పి వెళ్ళారు.

తర్వాత కాపలా భటులు వంతిదేవుని తీసుకొని వెళ్ళి ఒక పాడుబడ్డ మాళిగలోని ఒక గదిలో వేసి తాళం పెట్టారు. వాకిట కాపలా కూడ పెట్టారు.

వంతిదేవుడు సుదూర ప్రయాణం వల్ల చాల అలిసిపోయివున్నాడు. కాబట్టి తనను చెరబట్టి బంధించినందుకు చాల సంతోషపడ్డాడు. ఒకటి రెండు రోజులు ఎక్కడ తిరుగాడక విశ్రాంతి తీసుకోవచ్చు కద?

మొదటిరోజు అతడికి అటువంటి విశ్రాంతి దొరికింది. కానీ రెండవరోజు ఒక బెడద వచ్చి పడింది.

అతడి పక్క గదినుంచి ఏవేవో విచిత్రమైన శబ్దాలు వినరాసాగాయి. ఎవరో ఒకతను ఇంకొకడిని గద్దించాడు. వాడి వీరావేశపు మాటలు చాల బలంగా ఉన్నాయి. “ఇదిగో!” “ఛీఛీ!” “పోపో!” “దగ్గరకు రాకు!” “దగ్గరికి వస్తే చంపేస్తాను!” “జాగ్రత్త!” “నీ ప్రాణం నీది కాదు!” “యమ లోకానికి పంపించేస్తాను!” “ఒక్క తన్నుతో నీ ప్రాణం ఎగిరిపోతుంది!” అని పక్కగదిలో ఒకడు అరుస్తుండడం వినిపించింది. ఎవరిని చూసి అతడలా అరుస్తున్నాడో తెలియలేదు. ఒక్కడి గొంతు మాత్రమే వినిపించింది. కానీ అందుకు బదులే వినిపించడం లేదు. ఎవరైన పిచ్చి పట్టిన యుద్ధవీరుడేమో అన్న సందేహమేర్పడింది వంతిదేవునికి. అలాగైతే రాత్రంతా మనకు నిద్ర లేనట్లేనా? కాస్త నిద్రపోదామంటే అందుక్కూడ పెద్ద ఆటంకం ఏర్పడింది కద!...

“చెబితే వినవా? ఊరకే వెళ్ళవా? సరే, నిన్నేం చేస్తానో చూడు!”

ఈ మాటల వెన్వెంటనే వంతిదేవుని గదిలో ఏదో దబ్బున పడింది. పడుకొనివున్న వంతిదేవుడు అదిరిపడి లేచాడు. పడ్డది ఏమని పరికించి చూశాడు. తనకు తెలియకుండానే నవ్వొచ్చింది. గలగలా నవ్వేశాడు. ఎందుకంటే ఆ పక్కగదినుంచి వచ్చి పడ్డది ఒక పిల్లి!

“ఓహో! నీకు నవ్వడం కూడ  తెలుసా? నవ్వు, నవ్వు! మళ్ళీ ఇక్కడికి మాత్రం రాకు!” అన్నదా గొంతు.

పక్కగదిలోనివాడు ఎవడో పిచ్చివాడనడంలో సందేహం లేదు. కాకపోతే పిల్లితో ఇలా వాదిస్తాడా?  లేక పిల్లి మనిషిలాగ నవ్వుతుందని అనుకొంటాడా? కానీ అందులోను విచిత్రమేమంటే ఆ గొంతు తనకు బాగ పరిచయమున్న గొంతులాగుంది. ఎక్కడో, ఎప్పుడో విన్న గొంతులాగుంది. అయితే ఎవరి గొంతు? ఎక్కడ విన్న గొంతు? ఎంత ఆలోచించి చూసినా గుర్తుకు రావడం లేదు!

ఎవరైతేనేమని వంతిదేవుడు మళ్ళీ పడుకొన్నాడు. కళ్ళు మూసుకొని నిద్రపోజూశాడు. కానీ నిద్రపోలేకపోయాడు. కాసేపటికల్లా అరికాళ్ళకు ఏదో మెత్తగా, నున్నగ తగిలింది. కళ్ళు తెరిచి చూస్తే ఆ పిల్లి. అయ్యో దేవుడా! దీన్ని కాళ్ళదగ్గరుంచుకొని ఎలా నిద్రపోవడం? తన్ని పక్కకు తోశాడు. అది పక్కకు వెళ్ళింది. మళ్ళీ కళ్ళు మూసుకొన్నాడు. మళ్ళీ అతని పక్క, చేతిమీద ఏదో మెత్తగా తగిలింది. కళ్ళు  తెరిచి చూస్తే మళ్ళీ అదే పిల్లి అతడి పక్క పడుకొని గారం పోయింది!

మళ్ళీ చేత్తో పట్టి పక్కకు తోశాడు. పిల్లి దూరం వెళ్ళింది. మళ్లీ కళ్ళు మూసుకొన్నాడు. ఆ పిల్లి అతడి తల దగ్గర పడుకొని తన తోకతో అతడి ముఖాన్ని, తలను నిమరసాగింది.

శూలాన్ని, కత్తిని నిర్భయంగా ఎదుర్కోగల ఆ వీరుడు ఆ పిల్లి తన తోకతో అలా నిమరడాన్ని ఓర్చుకోలేకపోయాడు. లేచి నిలబడి ఆ పిల్లి గొంతు పట్టుకొని పైకెత్తాడు. రెండు గదుల మధ్యనున్న గోడ పైభాగం విరిగిపడి ఒక టొరియ కనిపించింది. దాని గుండా పిల్లిని విసిరేశాడు.

~

పక్కగదిలో కాసేపు ఒకటే రగడ, గడబిడ వినిపించింది.  మనిషి కేకలతో బాటు పిల్లి కరాబిరా అరవడం కలిసి వినరావచ్చింది. పిల్లి మ్యావ్-మ్యావ్ శబ్దం కాసేపు వినిపించి తర్వాత ఆగిపోయింది. పూర్తి నిశ్శబ్దం నెలకొంది.

వంతిదేవుడు కళ్ళుమూసి గాఢనిద్రలోకి జారిపోయాడు. సగం నిద్రలో ఒక మంచి కల వచ్చింది. అందులో యువరాకుమారి కుందపై అతడి దగ్గరకు వచ్చి కూర్చొని తల నిమిరింది. ఆహ్! పిల్లి తోకకు, యువరాకుమారి చేతివేళ్లకు ఎంత తేడా?

చటుక్కున మళ్ళీ మెలకువైంది. కల చెదిరిపోయిందే అని విచారపడ్డాడు.

“ఎవరక్కడ? పిల్లిని ఎత్తి విసిరిందెవరు?”

వంతిదేవుడు బదులు చెప్పలేదు; మౌనందాల్చాడు. ఆఁ! పిల్లి గీరడం లాంటి శబ్దం వస్తూందే! లేదు, లేదు! ఎవరో గోడెక్కడానికి ప్రయత్నిస్తున్నారు!

వంతిదేవుడు లేవలేదు. పడుకొన్న పళంగా చెవులు రిక్కించి వినసాగాడు. కానీ ముందు జాగ్రత్తగా చేయి కత్తి పిడిమీద ఉంచాడు.

గోడ పైభాగానున్న బొక్కనుంచి మొదట రెండు చేతులు కనబడ్డాయి. తర్వాత ఒక తలపాగా కనిపించింది. దానికింద ఒక ముఖం పైకి వచ్చి కిందకు తొంగి చూసింది.

ఆః! ఇతడు ఆళ్వార్ కట్టియాన్ కద? తలపాగా పెట్టుకొన్నందువల్ల కాస్త వ్యత్యాసంగా కనిపిస్తున్నాడు. కానీ ఆళ్వార్ కట్టియాన్ అన్నదాంట్లో సందేహం లేదు.

ఇతడు ఎందుకు, ఎలా ఇక్కడకు వచ్చాడు? మనమిక్కడ ఉన్న విషయం తెలిసే వచ్చివుండాలి! సహాయం చేయ వచ్చాడా? లేక, ఆటంకం కలిగించడానికి వచ్చాడా?

వంతిదేవుడు లేచి కూర్చొని, “ఓ వీర వైష్ణవా! రండి! రండి! శివ పుణ్యస్థలమైన తిరుకేతీశ్వరానికి స్వాగతం! స్వాగతం!” అన్నాడు.

“తమ్ముడూ! నీవేనా? అనుకొన్నాను! ఇంకెవరిలా బెల్లం కొట్టిన రాయిలాగ ఇలా బదులివ్వక కూర్చొని ఉండగలరు?” అని చెబుతూనే గదిలోకి దూకాడు ఆళ్వార్ కట్టియాన్.

~~~
~~~

# అధ్యాయము - 26

## రక్తం కోరిన కత్తి!

ఆ వీర వైష్ణవుడు అక్కడికి ఎలా వచ్చాడు, ఎందుకు వచ్చాడు అన్న విషయం గురించి వంతిదేవునికి దిగులు పట్టుకొంది. దాన్ని బయటకు చూపించుకోక, ఇలా సంభాషణను ముందుకు కొనసాగించాడు.

"ఏం విచిత్రం? కాసేపటికి మునుపే కద మీగురించి తలుచుకొన్నాను. తలెత్తి చూస్తే మీరు గోడెక్కి దూకుతున్నారు. 'వరమిచ్చే దైవం చూరు చీల్చుకొని ఇస్తుంది' అని చెబుతారు కద, అది నిజమే!" అన్నాడు.

"అబ్బాయీ! నీవు కాసేపటికి మునుపు నన్ను తలుచుకొన్నావా? ఎందుకు? ఈ నరమానవుని తలుచుకోవడానికి బదులు సాక్షాత్ ఆ శ్రీరామ చంద్రుని తలుచుకొంటే ఏదైనా ఫలముంటుంది..."

"మీ నోట్లో చక్కెర వేయాలి. మొదట నేను రామునే తలుచుకొన్నాను. లంకకు వచ్చేటప్పుడు అటువైపు సముద్రతీరాన రామేశ్వర దేవాలయ గోపురాన్ని చూశాను.  అక్కడే కద రాముడు శివపూజ చేసి రావణుని చంపిన పాపాన్ని ప్రక్షాళన చేసుకొన్నాడు అని అనుకొన్నాను...."

"నిలు, తమ్ముడూ! నిలు!"

"నిలబడలేను, స్వామీ! నడిచి, నడిచి, నిలబడి నిలబడి నా కాళ్ళు పూర్తిగా అలిసిపోయాయి. వాటికి విశ్రాంతి కావాలి. మీరు కూడ కూర్చోండి. తర్వాత, రాముని తలుచుకొన్నానా? వెంటనే రామభక్తుడైన హనుమంతుని తలుచుకోగానే మీరు గుర్తుకొచ్చారు. వెంటనే తలెత్తి చూస్తే, మీరే వచ్చేశారు. గోడెక్కి దూకివచ్చారా? లేక హనుమంతుని లాగ సముద్రాన్నే ఆకాశామార్గాన దాటి వచ్చారా?"

"తమ్ముడూ! మహాభక్త శిఖామణి హనుమంతుడేక్కడ? కేవలం ఒక మానవమాత్రుడిని నేనెక్కడ? హనుమంతుడు లంకకు వచ్చి ఎందరో రాక్షసులను హతమార్చాడు. నేను కేవలం ఒక పిల్లిని తరిమి కొట్టలేకపోయాను. ఇదిగో చూడు! ఆ పిల్లి నా కాళ్ళను గీరి ఎలా గాయపరిచిందో?" అని ఆళ్వార్ కట్టియాన్ తన కాళ్ళపైన ఏర్పడ్డ గాయాలను చూపించాడు.

"అరెరే! ఇలా జరిగిందా? కానీ, కేవలం ఒక పిల్లితో మీరు జగడానికి దిగిన కారణమేమి?"

"నేను దానితో జగడం మొదలుపెట్టలేదు. అదే నాతో కయ్యానికి కాలు దువ్వింది..."

"అదెలా, స్వామీ?!"

"నేను నిన్ను వెతుక్కొంటూ వచ్చాను. కాపలా వాళ్ళ కళ్ళలో కారం కొట్టి పెరటివైపు నుంచి

గోడెక్కి దూకాను. కింద నేను దూకే చోట ఆ పిల్లి కావాలనే తన తోకను చాచి పెట్టింది. నాకాలు దాని తోకను మెల్లగానే తాకింది. కానీ ఆ పాపిష్టి పిల్లి తన కాలిగోళ్ళతో నా కాళ్ళను గీరనారంభించింది. తమ్ముడూ! నేను చెప్పబోయేది బాగా విను! పులితోనైనా పోరాడవచ్చు. ఏనుగుతోనైనా పోరాడవచ్చు! కానీ పిల్లితో మాత్రం జగడానికి దిగనేకూడదు!"

"స్వామీ! ఆ రహస్యం నాకిప్పుడు తెలిసిపోయింది!"

"ఏ రహస్యం?"

"ఆ పిల్లి నా గదిలోకి కూడ వచ్చింది. నా తలను, ముఖాన్ని తన తోకతో నిమిరింది. చనువుగా నా పక్కన పడుకొని గారాలు పోయింది. కానీ నన్ను గీరలేదు. మిమ్మల్ని మాత్రమే అటకాయించి గాయపరిచింది. వీర వైష్ణవులంటే పడని వీరశైవ మార్జాలమది!..."

"ఓహో! అలాగా? ఈ ఆలోచన నాకు తట్టనే లేదు. వీర శైవమార్జాలమని తెలిసివుంటే నా బడితెతో దానికి మంచి బడితె పూజ చేసేవాడినే?"

"మీ చేతిలో బడితె లేకుండడమే మంచిది. ఈ క్షేత్రానికి వచ్చినప్పటినుంచి నా ఒంట్లో వీరశైవ రక్తం ఉడుకుతోంది. ఒరలోని నా కత్తి 'వీర వైష్ణవ రక్తం కావాలి' అని ఏడుస్తోంది. మీరు నాకు చేసిన గొప్ప సహాయాలను దృష్టిలో పెట్టుకొని నాకత్తిని అదుపులో ఉంచుతున్నాను!"

"అబ్బాయి! నేను నీకు ఏ సహాయమూ చేయలేదే?"

"స్వామీ! తమ సహోదరి పళువూర్ యువరాణి గురించి మీరు నాకు చెప్పలేదా?"

"అవును, చెప్పాను."

"పళువూర్ యువరాణి కడంబూర్ దగ్గర మూసిన పల్లకిలో వెళుతున్నప్పుడు ఒకసారి తెర తొలగగా, ఆమెను మీరు నాకు వేలెత్తి చూపించారు కద?"

"అవును, అందువల్లనేమి?"

"వస్తున్నా, వస్తున్నా! అదే పల్లకి తంజావూర్ కోట సమీపంగా వెళుతున్నప్పుడు మళ్ళీ చూశాను. పల్లకి బోయీలు కావాలని వచ్చి నా గుర్రాన్ని గుద్దారు. నేను న్యాయం కోరడం కోసం పల్లకి తెరను తొలగించాను..."

"లోపల ఉన్నదెవరు?"

"సాక్షాత్ పళువూర్ యువరాణి నందినే!"

"ఓహో! నీవు అదృష్టశాలివి! నేనెంత ప్రయత్నించినా ఆమెను చూడలేక పోయాను. నీకా అదృష్టం కలిగింది!"

"అదృష్టం వచ్చేటప్పుడు అలాగే తానే వస్తుంది!"

"తర్వాత?"

"నేను మీపేరు చెప్పాను. దేవికి మీరు ఒక ముఖ్యమైన సందేశాన్ని చెప్పి పంపిన విషయం చెప్పాను."

"నేనూ ఎంతో మందిని చూశాను గాని, నీలాగ జంకూ గొంకూ లేకుండ అబద్ధాలు చెప్పగల వారిని ఈ లోకంలోనే చూడలేదు..."

"వైష్ణవులుగారూ! నా తాత ముత్తాతలకు కవులంటే చాల ప్రియమట. వారే స్వయంగా చాల కవితలు రాశారట..."

"అందుకిప్పుడేమి?"

"కవి పరంపరలో వచ్చిన నా ఒంట్లో ఆ రక్తం పరుగెడుతోంది. అందుకే ఒక్కొక్కసారి కల్పనాశక్తి పొంగి పొర్లుతోంది. మీవంటి పామరులు దాన్ని 'అబద్ధం' అంటారు..."

"మంచిది. తర్వాతేం జరిగింది?"

"నా కల్పనాశక్తికి ఆశ్చర్యపోయిన నందినీదేవి తన పళువూర్ రాజ చిహ్నం ఉన్న ఉంగరాన్ని నాకిచ్చి, అంతఃపురానికి వచ్చి తనని చూడమంది..."

"వెళ్ళి చూశావా?"

"మరి చూడకుండ ఉంటానా? వెంటనే వెళ్ళి చూశాను. నా వీర ధీర పరాక్రమాలను నేనే చెప్పగా విని నాకు ఒక ముఖ్యమైన పని ఒప్పజెప్పింది."

"ఏమా కార్యం?"

"ఈ లంకలో పాండ్య వంశపు మణిపకుటం, ఇంద్రుడిచ్చిన రత్నమాల ఉన్నాయట. వాటిని లంక రాజకుటుంబీకులు ఎక్కడో కొండల్లో దాచిపెట్టారట. 'ఆ నగలను ఎలాగైన వెతికి తీసుకొని రా' అని చెప్పి పంపించింది. అది ఇంత కష్టమైన పని అని నాకు తెలియకపోయింది..."

"పెద్ద పళువేట్టరయ్యర్ బొక్కసంలో వెయ్యి గాడిదలు మోసేటంతటి నగలున్నాయంటారు. అదంతా యువరాణికి చాలదా? సరే. తీసుకొని వస్తే నీకేం బహుమానం ఇస్తుందని చెప్పింది?"

"చిన్న పళువేట్టరయ్యర్ని కోట దళపతి స్థానం నుంచి తీసేసి నన్ను కోట దళపతిగా నియమిస్తానంది..."

"తమ్ముడూ, తమ్ముడూ! నీకు కోట దళపతి పదవి దొరికితే నేను నిరాటంకంగా కోట లోపలికి రావచ్చు కద?"

"భలే బాగుంది. నాకు తంజావూరు కోట దళపతి పదవి దొరికే అవకాశం ఎక్కడ? నేనిక్కడ వచ్చి చిక్కుకొన్నాను కద?" అని వంతిదేవుడు చాల దిగులుతో అన్నాడు.

"ఎందుకు చిక్కుపడ్డావు? నిన్నెందుకిక్కడ బంధించారో తెలుసా?" అని ఆళ్వార్ కట్టియాన్ అడిగాడు.

"పళువూర్ యువరాణి ఇచ్చిన రాజముద్రకు ఇక్కడ కూడ పలుకుబడి ఉంటుందనుకొని నాతోబాటు తెచ్చాను. అదే నేను చేసిన పొరబాటు..."

"అది  తప్పే! పెద్ద తప్పే! ఇక్కడ సేనాపతి కొడుంబాళూర్ పెద్ద వేళార్ కద? కొడుంబాళూర్ వంశానికి, పళువూర్ వంశానికి మధ్య ఉన్న వైరం నీకు తెలియదా?"

"అది తెలియకే వచ్చి చిక్కుపడ్డాను. ఏం చేయాలో తోచడం లేదు."

"తమ్ముడూ! దిగులుపడకు!"

"దిగులు పడక...?"

"నిన్ను విడుదల చేసేందుకే నేనిక్కడికి వచ్చాను..."

"ఓహో!"

"నేను నిన్నొకసారి ఒక సహాయం కోరాను. నీవు నిరాకరించావు. కానీ నేనిప్పుడు నీకు సహాయం చేయవచ్చాను. లేచి నాతో రా! ఈ క్షణమే ఈ చెరనుంచి తప్పుకొందాం!"

"వైష్ణవా! మీరు ఇక్కడినుంచి వెంటనే వెళ్ళిపొండి!"

"ఎందుకు బాబూ?"

"నా ఒరలో ఉన్న కత్తి 'ఒక వీర వైష్ణవుని రక్తం కావాలి!' అని ఆవేశపడుతోంది!"

"అడిగితే అడగనీ! నా ఒంట్లో కావలసినంత రక్తం ఉంది. దానిక్కాస్త ఇచ్చేస్తే సరి. నీవు లేచి నాతో రా!"

"లేదు! నేను రాను!"

"కారణమేమి?"

"నాకు నిద్ర ముంచుకొస్తోంది. ఎన్నో రాత్రులుగా నాకు నిద్రలేదు. ఈ రోజు రాత్రి బాగ నిద్రపోదామని నిశ్చయించుకొన్నాను. అందుకే ఆ పిల్లిని కూడ ఎత్తి విసిరేశాను."

"తమ్ముడూ! ఏం ఇలా మాట్లాడుతున్నావు? యువరాకుమారి కుందవైదేవి నీకు ఒప్పజెప్పిన కార్యాన్ని ఇలాగేనా నెరవేర్చడం? 'ఈ తాళ పత్ర సందేశాన్ని పొన్నియిన్ సెల్వన్ చేతికి అందజేసేవరకు రాత్రింబగళ్ళు చూడక ప్రయాణం చేస్తానని ఒప్పుకోలేదా?" .. ఇలా చెప్పి ఆళ్వార్ కట్టియాన్ తన బొడ్లో ఉన్న తాళపత్ర సందేశాన్ని తీసి వంతిదేవునికిచ్చాడు.

దాన్ని అతి శ్రద్ధాభక్తులతో తీసుకొన్నాడు వంతిదేవుడు. ఇంతవరకు ఆళ్వార్ కట్టియాన్ తన రహస్యాలను (తన నోటినుంచే) తెలుసుకొని తనను వంచింపజూస్తున్నాడని అతడు భావించాడు. అది తప్పని ఇప్పుడు తెలుసుకొని అతడి గురించిన తన అభిప్రాయాన్ని మార్చుకొన్నాడు.

"ఈ తాళపత్రం నీచేతికెలా వచ్చింది?" అని అడిగాడు.

"సేనాధిపతి బూది విక్రమ కేసరి ఇచ్చారు. పళువూర్ రాజముద్రను కూడ తిరిగి ఇచ్చేశారు.

ఇక, నీవెప్పుడు ప్రయాణానికి సిద్ధమంటే అప్పుడు బయలుదేరవచ్చు అన్నారు..."

“వైష్ణవులు గారూ! మీకు నా మనఃపూర్వక కృతజ్ఞతలు."

“కృతజ్ఞతలన్నీ కూడబెట్టుకో. సమయం వచ్చినప్పుడు ఇద్దువుగాని."

“అయ్యా! యువరాజు ఇప్పుడెక్కడున్నారో తెలుసా?"

“అది ఎవరికీ తెలియదు. అనురాధ పురం నుంచి పర్వత దేశానికి బయలుదేరి వెళ్ళారు. వెతికి తెలుసుకోవాలి. నీవెంట దారి చూపడానికి వెళ్ళమని సేనాధిపతి నన్ను ఆజ్ఞాపించారు. నీకిష్టమైతే నీవెంట వస్తాను..."

వంతిదేవునికి మళ్ళీ కాస్త సందేహం కలిగింది.

“స్వామీ! బయలుదేరే ముందు నేను సేనాధిపతిని చూడవచ్చా?"

“తప్పక చూడవచ్చు. ఆయన్ను చూసిన తర్వాతే బయలుదేరాలి. వాణతిదేవి గురించి సేనాధిపతికి తెలియజెప్పకుండ వెళ్ళవచ్చా?" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

ఇది విన్న వంతిదేవుడు ఈ వైష్ణవునికి నిజంగానే మంత్రవిద్యలు వచ్చా అని ఆశ్చర్యపోయాడు.

~~~
~~~

# అధ్యాయము - 27

## అడవి దారి(లో)

**కొడుంబాళూర్** పెద్ద వేళారైన సేనాధిపతి బూది విక్రమకేసరి వయసు మళ్ళిన అనుభవశాలి. ఎన్నో యుద్ధాలలో పాల్గొని అపారమైన అనుభవాన్ని గడించినవారు. చోళవంశంతో అతి సన్నిహిత స్నేహమూ, బంధుత్వమూ కలిగిన వారు.

ఆయన తమ్ముడైన చిన్న వేళార్ కొన్నేళ్ళకు మునుపు లంక యుద్ధంలో వీర మరణం పొందారు. ఆయనతో వెళ్ళిన సైన్యంకూడ ఓటమి పొంది తిరిగి వచ్చింది. అందుకు ఎలాగైనా ప్రతీకారం తీర్చుకోవాలన్న పంతంతో వయసు మీద పడ్డా సైన్యాధిపత్యం తానే వహించి లంకకు వచ్చి అక్కడ దిగారు.

పళువేట్టరయ్యర్లు కలిగించిన ఆటంకాల వల్ల యుద్ధాన్ని సరిగా కొనసాగించలేకపోయారని ఇంతకు మునుపే చూశాం కదా? చాల కాలం నుంచి ఆ ఇద్దరు రాజుల మధ్య కొనసాగుతున్న వైరం ఇందువల్ల ఇంకా ఎక్కువైంది.

కాబట్టి, పళువూర్ రాజముద్రతో సేనాధిపతి బూది విక్రమకేసరి చేత చిక్కుబడ్డ వంతిదేవుని పాట్లు చెప్పనవసరం లేదు కదా? అదృష్టవశాత్తు ముఖ్యమంత్రి అనిరుద్ధ బ్రహ్మరాయలతో ఈ విషయాన్ని ప్రస్తావించే సందర్భం వచ్చింది. వంతిదేవుని గురించిన నిజాన్ని ఆళ్వారి కట్టియాన్ ద్వారా అప్పటికే తెలుసుకొన్న అనిరుద్ధులు అతన్నే (ఆళ్వార్ కట్టియాన్) సేనాపతి వద్దకు వెళ్ళి నిజాన్ని తెలియజెప్పమని తొందరగా పంపించారు.

~

వాణర్ కుల వీరకుమారుని ఎగాదిగా చూసిన సేనాధిపతి బూది విక్రమకేసరికి అతడి పట్ల మంచి అభిప్రాయమే ఏర్పడి ఉండాలి. అందుకే, ఆప్యాయంగా, "తమ్ముడూ! నిన్నిక్కడ బాగా చూసుకొన్నారా? భోజనానికి, పడుకోవడానికి వసతి బాగుందా?" అని అడిగారు.

"ఔను, సేనాధిపతీ! ఏ కొరతా లేకుండ చూసుకొన్నారు. చెప్పిన పని చేసేందుకు వాకిట ఎప్పుడూ నలుగురైదుగురు సేవకులుండేవారు. బసకు ధారాళమైన చోటు దొరికింది. రాత్రి భోజనానికి ఒక పిల్లిని పంపించారు. దాన్ని నేను తినబోగా, ఈ వీర వైష్ణవులు వచ్చి చెడగొట్టేశారు. ఆ వీరశైవ మార్జాలానికి ఈ వీరవైష్ణవులను చూడగానే కోపం వచ్చేసింది. ఆయన్ను తన పంజా గోళ్లతో గీరేసి పారిపోయింది!" అన్నాడు.

సేనాధిపతి, "ఓహో! ఈ అబ్బాయి చాల తమాషాగ మాట్లాడుతున్నాడే! తిరుమలై! ఇతడు చెప్పిందంతా నిజమేనా?" అని అడిగారు.

“సేనాధిపతీ! ఇతడి పూర్వీకులు మంచి కవులట. కాబట్టి ఇతడిలో కూడ కల్పనాశక్తి అధికంగానే ఉంది. అది తప్ప, ఇతడు చెప్పిందంతా నిజమే. నేను ఇతడిని చూడడానికి వెళ్ళిన చోట ఒక పిల్లి నా కాళ్ళను బాగా గీరేసింది!” అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

అతడి ఒంటి మీద ఏర్పడ్డ గాయాలను చూసి సేనాధిపతి పడీ పడీ నవ్వారు. “ఒక పిల్లి నీకింతటి ఇక్కట్టు కలిగించిందా? మంచి వేళగా ఈ వీరుడు నీకు తోడుగా వస్తున్నాడు అడవి దారిన వెళ్ళేందుకు...”

“సేనాధిపతీ! నాకు ఎవరి తోడూ అవసరం లేదు. నా చేత బడితే చాలు. అది తీసుకొని ఇతన్ని చూడ వెళ్ళిందే పొరపాటైపోయింది...”

“అలాగైతే అడవి దారిన వెళ్ళేటప్పుడు నీవే ఇతడికి తోడుగా ఉండు! కానీ వెళ్ళేముందు ఇతడికి మంచి భోజనమిప్పించి బయలుదేరు! తమ్ముడూ! ఇప్పుడు లంకలో భోజనవసతులకు కాస్త కొరతగా ఉంది. ఇక్కడున్న చెరువుల కట్టలన్నిటినీ మహీంద్రుని మనుషులు కొట్టేసి వెళ్ళిపోయారు. కాబట్టి నీటి ఎద్దడి వల్ల వ్యవసాయం సరిగా సాగడం లేదు. వ్యవసాయం చేసేందుకు మనుషులు కూడ లేరు. ఈ దేశప్రజలే పస్తులుంటున్నారు. మన వీరులకు ఎలా ఆహారం దొరుకుతుంది? మన చోళదేశం నుంచి చాలినంత పప్పు బియ్యాలు పంపించడం లేదు...”

“సేనాధిపతీ! అది నాకు తెలిసిన విషయమే. పళైయార్రై వీరుల వాడల గుండా యువరాకుమారి వెళ్ళేటప్పుడు ఆ ఇళ్ళ ఆడపడుచులు ఆమెతో మొరపెట్టుకోవడాన్ని విన్నాను. ‘మా భర్తలు, కొడుకులు లంకలో పస్తులుంటున్నారట కద...’ అని మొరపెట్టుకొని ఏడ్చారు...”

“ఓహో! ఈ విషయం అక్కడిదాకా చేరిందా? మంచిది, మంచిది! దానికి యువరాకుమారి కుందవైదేవి ఏం బదులిచ్చారు?”

“ ‘సేనాధిపతి పెద్ద వేళార్ లంకలో ఉన్నంతవరకు మన వీరులను ఆకలితో చావనివ్వరు. మీరేం దిగులు పడకండి’ అని ఓదార్చారు...”

“ఆహా! యువరాకుమారి అలా అన్నారా? ఈ లోకంలో ఎన్నో రాజవంశాలలో ఎంతో కీర్తి ప్రఖ్యాతులు గాంచిన రాకుమార్తెలు పుట్టారు. కానీ మన యువరాకుమారి కుందవైదేవికి సాటి ఎవరూ లేరు!”

“అదే వరుసలో వారి తర్వాత చెప్పదగ్గ రాకుమారి ఇంకొకరున్నారు, సేనాధిపతీ!”

“అదెవ్వరు, తమ్ముడూ?”

“కొడుంబాళూర్ యువరాకుమారి వాణతీదేవే!”

“ఆహా! ఈ అబ్బాయి భలే గడుసువాడే! తన కల్పనాశక్తితో నన్నే మైమరపింపజేస్తాడు కాబోలు. తమ్ముడూ! పళైయార్రైలో మా కులదీపాన్ని నీవు చూశావా?”

“చూశానయ్యా! యువరాకుమారి కుందవైదేవి తోటే ఎప్పుడూ ఉండేవారిని చూడకుండ ఎలా సాధ్యం? వైద్యుల ఇంటినుంచి నన్ను సాగనంపేందుకు ఇద్దరూ ఒక్కటిగానే ఏనుగెక్కి వచ్చారు. దీపాన్ని వెలుతురు, పుష్పాన్ని సుగంధమూ, ఒంటిని నీడా ఎలా వదిలిపెట్టకుండ సర్వదా ఉంటాయో, వాణతీదేవి కూడ యువరాకుమారి కుందవైదేవిని విడిచిపెట్టక వెంట వెంటనే ఉంటుంది...” అన్నాడు వంతిదేవుడు.

“అరెరే! ఈ అబ్బాయి చాల బుద్ధిశాలి! తిరుమలై! ఈ అబ్బాయిని మన బొక్కసశాలకు తీసుకొని వెళ్ళి కావలసినంత వస్త్రాభరణాలను ఇప్పించి తీసుకొని వెళ్ళు!”

“అయ్యా! ప్రస్తుతానికి అన్నీ బొక్కసంలోనే ఉండనీ! తిరిగివెళ్ళేటప్పుడు తీసుకొని వెళతాను.”

“తమ్ముడూ! వాణతి గురించి కుందవైదేవి ఏమీ చెప్పి పంపలేదా?”

“సేనాధిపతీ! మీవద్ద నేను అబద్ధం చెప్పేందుకు ఇష్టపడడం లేదు.”

“ఎప్పుడూ, ఎవరివద్దా అబద్ధం చెప్పకు, తమ్ముడూ!”

“ఈ వీర వైష్ణవుల విషయంలో మాత్రం నన్ను మన్నించండి.  ఈయనకు నేను నిజం చెబితే నా తల వేయి ముక్కలుగా పేలిపోతుంది...”

“వద్దు, వద్దు! అంటే యువరాకుమారి నాకే సందేశమూ చెప్పి పంపించనట్లుంది!”

“మీకే సందేశమూ చెప్పి పంపలేదు. కానీ...”

“కానీ, ఏమి?”

“ఎవరికి పంపించాలో వారికోసం చెప్పి పంపించారు. వాణతీదేవి గురించి యువరాజుకు కొన్ని సంగతులను నేరుగా చెప్పమని చెప్పి పంపించారు...”

“నీవంటి బుద్ధిశాలి అబ్బాయిని నేనింతవరకు చూడనేలేదు!” అని చెప్పి సేనాధిపతి పెద్ద వేళార్ వంతిదేవుని హృదయానికి హత్తుకొన్నారు. తర్వాత,

“సరే! ఇక వృధా కాలయాపన వద్దు; బయలుదేరండి!” అన్నారు.

“అయ్యా! ఈ వీర వైష్ణవులు తప్పక నాతోబాటు వచ్చేతీరాలా? నేనొక్కడినే వెళ్ళకూడదా?”

“ఇతడు నీతో రావడం గురించి నీకేం ఆక్షేపణ?”

“నాకేం ఆక్షేపణ లేదు. నా ఒరలో ఉన్న కత్తి శుద్ధ వీరశైవ ఖడ్గం. అది 'వీర వైష్ణవ రక్తం కావాలి' అని చాల రోజులుగ అడుగుతోంది. నన్ను మీరి అది బయటకు వస్తే ఆయన గతి అపాయకరంగా మారిపోతుందేననే నా దిగులు...”

“అలాగైతే ఈ కత్తిని ఇక్కడే వదిలిపెట్టేసి ఇంకొక కత్తిని తీసుకో! తిరుమలై నీతో రాకపోతే నీవు యువరాజును వెతికి పట్టుకోలేవు. ఆయన ఉండే చోటు ఎవరికీ తెలియదు. పైగా యువరాజుకివ్వడానికి ఇతడు కూడ ఒక ముఖ్యమైన తాళపత్రం తీసుకొని వస్తున్నాడు. కాబట్టి ఇద్దరూ ఒక్కటిగా వెళ్ళడమే మంచిది! దారిలో ఒకరితోనొకరు దెబ్బలాడుకొని కార్యం చెడగొట్టేయకండి!”

ఇలా చెప్పేసి, పెద్ద వేళార్ మళ్ళీ వంతిదేవుని దగ్గరకు తీసుకొని అతడి చెవిలో రహస్యంగా ఇలా చెప్పారు:-

"తమ్ముడూ! ఇతడివల్ల నీ కార్యానికి ఎటువంటి ఆటంకమూ రాదు. కానీ అప్రమత్తంగా ఉండు! యువరాజు వద్ద ఇతడేం చెబుతాడో విని నాకు వచ్చి చెప్పు!"

ఆళ్వార్ కట్టియాన్ని తనవెంట గూఢచారిగా పంపుతున్నారని మొదట అనుకొన్నాడు వంతిదేవుడు. కానీ ఇప్పుడు అతడిపైన తననే గూఢచారిగా ఏర్పాటు చేయడమైంది. ఈ ఏర్పాటు వంతిదేవునికి చాల నచ్చింది.

~

వంతిదేవుడు, ఆళ్వార్ కట్టియాన్ ఇద్దరు వీరులు తోడు రాగా, ఆ రాత్రే బయలుదేరారు.

ప్రయాణం మొదలు పెట్టి రెండు రోజుల పాటు తూర్పుగా ప్రయాణించారు. మొదట కాస్త దూరం వరకు ఊళ్ళు కనిపించాయి. పోను పోను అడవి ప్రదేశం అధికం కాసాగింది. మొదట చిన్న చిన్న చెట్లతో చిట్టడవిగా మొదలై, పోను పోను ఆకాశాన్నంటే ఎత్తైన చెట్లతో దట్టంగా మారింది. మధ్య మధ్య కొన్ని చెరువులు కనబడ్డాయి. కానీ వాటి కట్టలన్నీ కొట్టివేయబడివున్నాయి. కాబట్టి నీరు చెరువుల్లో నిండక ఇష్టం వచ్చినట్లు నాలుగు వైపులా పారుతోంది! చెరువులు ఎండిపోయివున్నాయి. ఇంకొన్ని చోట్ల విశాలమైదానాల్లో నీరు నిలిచివుంది. పాలావి నది గట్టు కొట్టివేయబడి ఉండడం వల్ల నది నీరు నది వెంబడి పారక, నది బయట ఇష్టం వచ్చినట్లు పారుతుండడం వల్ల మైదాన ప్రదేశాల్లో నీళ్ళు నిలిచివుంది.

వారు ఈ దృశ్యాలన్నీ చూస్తూ ముందుకు సాగారు. చాల కాలంగా కొనసాగుతున్న యుద్ధం వల్ల జరిగిన నష్టాలను ఆళ్వార్ కట్టియాన్ వంతిదేవునికి ఎత్తి చూపించి వివరిస్తూ వెళ్ళాడు. యుద్ధం ఎంత క్రూరమైనదోనని అతడు తరచూ చెబుతూ వచ్చాడు. అందుగురించి ఇద్దరి మధ్య బలమైన వివాదం జరిగింది.

~

రెండురోజుల తర్వాత ప్రయాణపు దిశ మారింది. తూర్పుదిశనుంచి దక్షిణానికి మారింది. అడవులు దట్టం కాసాగాయి. మైదాన ప్రదేశాలు పోయి, గుట్టలు, గుండ్ల కొండలు ఎదురుపడసాగాయి. ఇంకా దూరంలో పర్వతశ్రేణులు ఆకాశాన్నంటే ఎత్తైన శిఖరాలతో కనిపించాయి. అడవులు భయంకరంగా కనిపించాయి. పక్షుల ఇంపైన కిలకిలారావాలతో బాటు ఏవేవో ఘోరమైన శబ్దాలు కలిసి వినబడసాగాయి.

అటువంటి అడవిదారుల్లో అడవి మృగాల వల్ల రాగల అపాయాల గురించిన ప్రస్తావన వచ్చింది. నక్కలు, చిరుత పులులు, ఎలుగుబంట్లు, ఏనుగులు మొదలైన జంతువులు ఆ అడవుల్లో ఉన్నాయని ఆళ్వార్ కట్టియాన్ చెప్పాడు.

"నక్కలు గుంపుగా వస్తే అపాయం కద?" అని అడిగాడు వంతిదేవుడు. కడంబూర్ మాళిగలో

తాను కన్న భయంకరమైన కల అతడికి గుర్తుకు వచ్చింది.

“నక్కల గుంపు కన్న ఒంటి నక్క వేసే ఈల చాల అపాయకరమైంది!” అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

“అదెలా, స్వామీ?”

“ఈ అడవిలో నక్కలు, చిరుతలు ఒక్కటిగా చేరి వేటకు వెళతాయి. చిరుత అక్కడక్కడ పొంచివుంటుంది. నక్క అటు ఇటు పరుగెత్తి ఎరను వెతుకుతుంది. మనిషినో, జింక వంటి సాధు జంతువును చూస్తే ఏక స్వరంలో ఈల వేస్తుంది. వెంటనే చిరుత దూకి వచ్చి ఎరను చంపుతుంది. ఇలా చిరుతకు గూఢచారి పని చేసే నక్కకు ’ఓరి’అని పేరు (Tamil)...”

ఇలా వారు మాట్లాడుతూ వెళుతుండగా ఉన్నట్లుండి సముద్రపు హోరు వంటి శబ్దం వినిపించింది. “సముద్రతీరం నుంచి చాల దూరం వచ్చేశాం కద? ఇదేం శబ్దం?” అని అడిగాడు వంతిదేవుడు.

“పక్కన ఎక్కడో చెరువో, కాలువో ఉండాలి. అందులో నీరు తాగడానికి ఏనుగుల మంద వస్తున్నట్లుంది!” అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

“అయ్యయ్యో! ఏనుగుల మందలో మనం చిక్కుకొంటే...?”

“దాని గురించి ఏమాత్రం భయం లేదు. మందలో వచ్చే ఏనుగులు మననేం చేయవు. మనం ఒదిగి నిలబడితే వాటి దారిన అవి వెళ్ళిపోతాయి. మనవైపు తిరిగి కూడ చూడకుండ!”

ఇంతలో వారితో వచ్చిన వీరుల్లో ఒకడు చెట్టెక్కి నలువైపులా చూశాడు.

“అయ్యా! అయ్యా! ఒంటి ఏనుగు వస్తోంది! మదపుటేనుగు! చెట్లను విరగదోస్తూ వస్తోంది!” అన్నాడు.

“అయ్యో! ఇదేమి సంకటం! ఎలా తప్పుకోవడం?” అని ఆళ్వార్ కట్టియాన్ భీతితో అటూ ఇటూ చూశాడు.

“ఏనుగుల మందంటే భయం లేదన్నారు. ఒంటి ఏనుగంటే ఎందుకింత భయం?” అని అడిగాడు వంతిదేవుడు.

“మదించిన ఒంటి ఏనుగు వెయ్యి మామూలు ఏనుగులకు సమానం. దాని మూర్ఖత్వం ముందు ఎవరూ ఎదురు నిలబడలేరు...”

“మా ముగ్గురి చేత శూలాలున్నాయి. మీ చేత బడితె ఉంది కద?”

“ఒక మదపుటేనుగును వేయి శూలాలు కూడ ఎదిరించలేవు. అదిగో అక్కడ నిటారుగా ఉన్న ఒక పెద్ద గుండ్రాయి కనిపిస్తోంది చూడండి! దాని పైన ఎక్కి నిలబడితే దాన్నుంచి తప్పించుకోవచ్చేమో. పరుగెత్తి వెళ్ళండి!”

ఇలా అంటూనే ఆళ్వార్ కట్టియాన్ ఆ పెద్ద గుండ్రాయి వైపు పరుగెత్తాడు. తక్కిన వారు కూడ వెంట పరుగెత్తారు. కానీ కాస్త దూరం వెళ్ళగానే వారి దారిలో ఒక లోతైన, నిటారైన పల్లం ఉండడాన్ని గమనించారు. దాని అంచు దగ్గరకు వచ్చి నిలబడ్డారు. ఏనుగేమో అతి వేగంగా వారిని సమీపిస్తోంది. మనుషులను చూడగానే దాని మదపిచ్చి అధికమైవుండాలి. ఆ మదపుటేనుగు తొండాన్ని పైకెత్తి ఘీంకరించినప్పుడు బ్రహ్మాండాలు బద్దలు కాకపోవడం విచిత్రమే. దాన్ని విన్న నలుగురూ చెవులు మూసుకొన్నారు. తలా ఒక వైపు పరుగెత్తారు.

ఏనుగు ఇంకా దగ్గరకు వచ్చేసింది. ఆళ్వార్ కట్టియాన్ని గురిగా పెట్టుకొని అతనున్న వైపే రాసాగింది. ఇంకా రెండడుగులు అటువైపు వేస్తే ఆళ్వార్ కట్టియాన్ అధోపాతాళంలో పడిపోతాడు. పక్కకు పరుగెత్తడానికి అవకాశం లేదు - చెట్లు, పొదలు దట్టంగా పెరిగివున్నాయి. పరుగెత్తి తప్పించుకోకపోతే ఎలా?

వంతిదేవుడు చేతి శూలాన్ని పైకెత్తాడు. కానీ ఆ మదపుటేనుగును ఇంద్రుని వజ్రాయుధం కూడ ఆపలేదనిపించిందతనికి. శూలాన్నెత్తిన చేయి బలహీనంగా కిందికి జారింది.

అదే సమయాన ఆళ్వార్ కట్టియాన్ చేసిన పని వంతిదేవునికి నవ్వు తెప్పించింది. చేత బడితెను ఎత్తి పట్టుకొని, “నిలు! నిలు! అలాగే నిలబడు! ముందుకు వచ్చావో చచ్చావ్! నిన్ను చంపి, గుంట తవ్వి పాతేస్తాను! జాగ్రత్త!” అని ఆళ్వార్ కట్టియాన్ ఆ మదపుటేనుగును చూసి అరిచాడు.

~~~
~~~

# అధ్యాయము - 28

## రాజబాట

మదించిన ఏనుగు ఆళ్వార్ కట్టియాన్ చేతిలోని బడితెకు, అతడి గద్దింపులకు బెదిరిపోతుందా, ఏమి? తొండాన్ని ఇంకా పైకెత్తి పట్టుకొని, దారిలో అడ్డం వచ్చిన చెట్లను విరగదోస్తూ ముందు ముందుకు రాసాగింది.

ఇంకొక్క క్షణంలో ఆళ్వార్ కట్టియాన్ గతి అధోగతే అనడంలో సందేహం లేదు!

తోడు వచ్చిన ఇద్దరు వీరులూ నించొన్న చోటే నిలబడి, 'హోయ్' 'హోయ్' అని అరిచారు.

వంతిదేవుడు చేతినుంచి జారిపడ్డ శూలాన్ని చేతిలోకి తీసుకొని చివరిగా ఇంకొక్క ప్రయత్నం చేద్దామనుకొన్నాడు.

అదే సమయాన ఆళ్వార్ కట్టియాన్ తన చేతి బడితెను ఆ మదపుటేనుగు పైకి గురి చూసి విసిరాడు.

మరు క్షణం ఆళ్వార్ కట్టియాన్ మాయమైపోయాడు!

అతడి తలపాగా గాలిలోకెగిరి ఒక చెట్టుకొమ్మ పైన చిక్కుకొంది.

ఆళ్వార్ కట్టియాన్ ఏమైవుంటాడని ఆలోచించేలోపు అంతకన్న ముఖ్యమైన సంభవం ఒకటి జరిగింది!

అతను మరుగైన స్థలానికి చాల దగ్గరగా వెళ్ళిన ఆ ఏనుగు ఉన్నట్లుండి ముంగాళ్ళమీద కిందికొరిగింది.

ఆ వన ప్రదేశమంతా మారుమోగేటట్లు ఒక భీకర ఘీంకారం వినిపించింది.

మరుక్షణం కొండంతటి ఆ ఏనుగు రూపం పూర్తిగా మాయమైంది!

ఆ ఏనుగు పాతాళం వంటి ఆ పల్లంలో దొర్లి పడ్డప్పుడు దాని వెంట దొర్లి పడ్డ గుండ్రాళ్ళు లేపిన దుమ్ము నలువైపులా లేచింది.

ఏం జరిగిందని ఆలోచించి అర్థం చేసుకోవడానికి వంతిదేవునికి కాసేపు పట్టింది.

ఆళ్వార్ కట్టియాన్ వెనుక పెద్ద పల్లం (ఇంత క్రితం మనం చూసిందే) ఉండడం వల్ల బడితె విసిరిన వేగానికి జారి వెల్లికిలా ఆ పల్లంలో పడిపోయాడు.

అతని వైపే దూసుకొచ్చిన ఆ మదపుటెనుగు కూడ ముంగాళ్ళు రెండూ పల్లంలో పెట్టేసి జారిపడిపోయింది. తర్వాత సంభాళించ చూసీ దానికి సాధ్యం కాలేదు. దాని కొండంతటి శరీరమే దానికి శత్రువై ఆ పల్లంలోకి తోసేసింది!

మదపుటేనుగుకు, మదపుటేనుగు లాంటి ఆళ్వార్ కట్టియాన్‌కి ఒకేసారి మరణం సంభవించింది!

దీన్ని గ్రహించిన వెంటనే వంతిదేవుని ఒళ్ళు జలదరించింది. అతడి హృదయం కూడ వేదనతో బరువెక్కింది.

ఆ వీర వైష్ణవుని పైన మొదట ఏర్పడ్డ సందేహాలన్నీ ఈ ప్రయాణంలో తొలగిపోయి ఒక విధమైన స్నేహభావం, ఆప్యాయత కలిగాయి.

అటువంటి వ్యక్తికి ఇటువంటి గతా పట్టాలి?

అతడి సహాయం, తోడు లేకుండ తాను ఒప్పుకొన్న కార్యాన్ని తానే ఒంటరిగా నెరవేర్చాలి కద అన్న దిగులుకూడ పట్టుకొంది.

వైష్ణవుడు, ఏనుగు పల్లంలో పడి మరుగైన చోటికి వచ్చి వంతిదేవుడు ఆ పల్లంలోకి పరీక్షగా చూశాడు.

మొదట ఒకటే దుమ్ము, ధూళిగా ఉండి స్పష్టంగా కనిపించలేదు.

మెల్ల మెల్లగ దుమ్ము కాస్త అణగి, ఏనుగు దొర్లి పడ్డ దారిన చెట్లు, పుట్టలు, రాళ్ళు ధ్వంసమై ఉండడం కనిపించింది.

“ఏం తమ్ముడూ! ఊరకే నిలబడి చోద్యం చూస్తున్నావా? ఒక చేయి అందించి పైకెత్త కూడదా?” అన్న గొంతు విన్నవెంటనే వంతిదేవుడు అదిరి పడ్డాడు.

ఆశ్చర్యం వల్ల  తడబడి కింద పడిపోకుండ నిలదొక్కుకొని మెల్లగా ఆ గొంతు వినిపించిన వైపు తిరిగి చూశాడు.

ఏనుగు దొర్లిపడ్డ దారికి అంటుకొన్నట్లు పక్కనే ఉన్న ఒక నిటారైన చెట్టు ఊడను పట్టుకొని ఆళ్వార్ కట్టియాన్ వేలాడుతుండడం కనిపించింది.

వంతిదేవుని కుతూహలాన్ని గురించి ఇక అడగాలా? వెంటనే తమాషా మాటలు నోట వచ్చేశాయి.

“ఓహో! వైష్ణవులు గారూ! గజేంద్రునికి మాత్రం మోక్షాన్నిచ్చేసి మీరు మాత్రం త్రిశంకు స్వర్గంలో ఉండిపోయారేం?” అని చెబుతూనే వీరులను చప్పట్లు తట్టి పిలిచాడు.

వంతిదేవుడు తన నడుముకు కట్టుకొన్న బట్టను తీసి ఒక చివరను ఆ వీరుల చేతికిచ్చి గట్టిగా పట్టుకొమ్మని చెప్పి ఇంకొక చివరను కిందకు విడవగా, ఆళ్వార్ కట్టియాన్ దాన్ని పట్టుకొన్నాడు. పైనున్న ముగ్గురూ కష్టపడి అతన్ని ఎలాగో లాగి పైకి చేర్చారు.

~

కాసేపు ఆళ్వార్ కట్టియాన్ పెద్దగా నిట్టూరుస్తూ ప్రజ్ఞ తప్పిన వాడిలాగ కింద పడివున్నాడు.

తక్కిన ముగ్గురూ అతని చుట్టూ కూర్చొని అతనికి శైత్యోపచారాలు చేసి అతన్ని లేపేందుకు ప్రయత్నించసాగారు.

ఉన్నట్లుండి లేచి నిలబడి, "బయల్దేరండి! చీకటి పడేలోపు రాజబాటకు చేరుకోవాలి. నా తలపాగా ఎక్కడ? బడితె ఎక్కడ?" అన్నాడు.

"ఏమీ తొందర లేదు. మీరు కాసేపు విశ్రాంతి తీసుకోండి. తర్వాత బయలుదేరుదాం" అన్నాడు వంతిదేవుడు.

అప్పుడు ఒక ఒంటి నక్క ఊల వేయడం వినిపించింది.

ఇంకొక వైపు నుంచి ఇంకొక నక్క తన మధురగీతాన్ని ప్రారంభించింది.

వంద, రెండు వందల గోష్టి గానం మొదలైంది.

మిట్ట ప్రదేశంలో ఉన్న అడవి నుంచి పల్లపు ప్రదేశంవైపు చరచరా అనేక వన్య మృగాలు రాసాగాయి.

పొదల్లో మరుగ్గా వెళ్ళే చిరుతలే ఆ చరచరమని కదిలే శబ్దాలకు కారణమని ఎవరూ చెప్పనవసరం లేదు.

పల్లానికి పైన ఆకాశంలో గ్రద్దలు, రాబందులు గిరికీలు కొట్టనారంభించాయి.

"ఏనుగు మరణమన్నది సాధారణమైన విషయం కాదు. కాసేపటికల్లా చాల దూరం నుంచి కూడ మాంసం తినే మృగాలు, పక్షులు ఇక్కడికి వచ్చి చేరుతాయి, గజేంద్రుని శరీరాన్ని భక్షించేందుకు. మనం కూడ వాటికి ఆహారమైపోతాం. వెంటనే బయలుదేరండి!" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

అతని మాటకు ఇప్పుడు వంతిదేవుడు ఎదురు చెప్పలేదు.

నలుగురూ అడవి దారిన ఎంత వేగంగా వీలవుతుందో అంత వేగంగా ముందుకు సాగారు.

సూర్యుడు అస్తమించే సమయానికి రాజబాటను చేరుకొన్నారు.

~

రాజబాటలో వచ్చేవాళ్ళు, పోయేవాళ్ళు, బండ్లు, వాహనాలతో ఒకటే కోలాహలంగా ఉంది.

ఏనుగుల పైన అతి సామాన్యంగా ఎక్కి వస్తున్నవారిని చూసి వంతిదేవుడు ఆశ్చర్యపోయాడు. "ఇలాంటి మృగమేనా అడవిలో అంతటి భీతిగొల్పింది?" అని మళ్లీ మళ్ళీ తలుచుకొని ఆశ్చర్యపోయాడు.

"ఈ రాజబాట ఎక్కడినుంచి ఎక్కడికి వెళుతోంది? మనమిప్పుడెక్కడున్నాము? ఎక్కడికి వెళుతున్నాము?" అని అడిగాడు.

"అనురాధపురం నుంచి సింహగిరికి వెళ్ళే రాజబాటకు వచ్చి చేరామిప్పుడు. తంబళ్ళి ఇంకా అర్ధ కోసు దూరం ఉంది. రాత్రికి అక్కడకు వెళ్ళి చేరవచ్చు" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

"రాజబాట వెంబడి సుఖంగా వచ్చివుండవచ్చు కద? ఎందుకు అడవి దారిన వచ్చాం?"

"రాజబాట వెంబడి వచ్చివుంటే దారి పొడుగునా మనని వంద చోట్ల ఆపి శోధించేవారు/తనిఖీ చేసేవారు. అనురాధపురంలో పూర్తిగా ఆపేసేవారు. మనం ఎవరిని వెతుక్కుంటూ వచ్చామో, వారు సింహగిరి వైపు వెళ్ళారని విన్నాను. అందుకే అడ్డ దారిన వచ్చాను. ఇక ఆయనను కనిపెట్టబోతున్నామో, లేదో? ఇంకెక్కడికీ వెళ్ళకుండ ఉండాలి!" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

రాజబాట పొడుగునా ఊళ్ళు, బజార్లు, కమ్మరి, వడ్రంగుల కర్మాగారాలు కనిపించాయి. వాటిలో నివసిస్తున్నవారు చాలవరకు సింహళీయులనిపించింది.

రాజబాటలో తమిళనాడుకు చెందిన యుద్ధవీరులు అటూ ఇటూ తిరుగాడుతూ కనిపించారు. కానీ రెండువైపులా వసిస్తున్న సింహళీయులు ఎటువంటి ఆటంకమూ లేకుండ నిర్భయంగా తమతమ పనులను చేసుకొంటూ వెళుతున్నారు.

"ఈ ప్రదేశమంతా ఇప్పుడు ఎవరి వశంలో ఉంది?" అని అడిగాడు వంతిదేవుడు.

"చోళసైన్యం తంబళ్ళై వరకు కైవసం చసుకొంది. దాని తర్వాత ఉన్న సింహగిరి మహీంద్రుని అధీనంలో ఉంది."

"ఇటువైపు వసిస్తున్న ప్రజలు?"

"చాలవరకు సింహళీయులే. 'పొన్నియిన్ సెల్వన్' ఇక్కడకు వచ్చిన తర్వాత యుద్ధం పోకడే మారిపోయింది. చోళవీరులకు, మహీంద్రుని వీరులకు మధ్యే కద పోరు? కాబట్టి సామాన్య ప్రజలు నిర్భయంగా తిరగవచ్చు. బౌద్ధ గురువుల సంబరానికి అంతులేదు. అనురాధపురంలో పాడుబడ్డ బౌద్ధవిహారాలనన్నింటినీ పునర్నిర్మించాలని మన యువరాజు ఆజ్ఞ వేశారట! విన్నావా ఈ సంగతి? బౌద్ధులు ఎందుకు సంతోషపడరు? యువరాజును కలిసి మాట్లాడేటప్పుడు 'మీరు చేస్తున్న పని నాకేమాత్రం నచ్చలేదు' అని చెప్పేయబోతున్నాను!"

"తప్పక చెప్పండి! మీకు నచ్చని పని చేసేందుకు ఈ యువరాజెవరు? ఆయనకేం కొమ్ములు మొలిచాయా?" అన్నాడు వంతిదేవుడు.

"ఆయనకు కొమ్ములు మొలవలేదు, తమ్ముడూ! అది నిజమే! కానీ ఆయన దగ్గర ఏదో ఒక శక్తి ఉంది. ఆయన వెనక ఏం కొరత చెప్పినా, ఆయన ఎదురుపడగానే మైమరచిపోతున్నారు. యువరాజును ఎదిరించి మాట్లాడే శక్తి ఎవరికీ లేదు. అటువంటి శక్తి - యువరాజును తన ఇష్టం వచ్చినట్లు నడిపించుకొనే శక్తి - ఒక్కరికి మాత్రమే ఉంది..."

"ఔనౌను! వీర వైష్ణవులైన ఆళ్వార్ కట్టియాన్ శక్తి ఎవరికి తెలియదు? మదించిన ఏనుగును ఒక బడితె విసిరి గెలిచిన వారికి యువరాజు ఒక లెక్కా?"

"నేను చెప్పింది నీవు సరిగ్గా అర్థం చేసుకోలేదు తమ్ముడూ! పొన్నియిన్ సెల్వన్ ఎక్కడ? ఈ పేద వైష్ణవుడెక్కడ? మదపుటేనుగును బడితె చేతబట్టి ఎదిరించగలను; పులినీ, ఎలుగును, సింహాన్ని ఒట్టి

చేతులతోనే ఎదిరించగలను. కానీ పొన్నియిన్ సెల్వన్ ముందు నిలబడ్డప్పుడు నా ధైర్యమంతా ఎక్కడికో ఎగిరిపోతుంది. గొంత ఎండిపోతుంది. నోటి నుంచి ఒక్క మాట రావడం బ్రహ్మ ప్రయత్నమైపోతూంది..."

"ఆయనను ఏలే శక్తిగలవారని మరి ఇంకెవవరి గురించి చెప్పారు?"

"అది లోకమెరిగిన విషయం కద? నీకు తెలియదా? యువరాకుమారి కుందవైదేవి గురించే చెప్పాను. ఆమె వాక్కే ఆయనకు వేదవాక్కు!"

"ఓహో! పళైయారై యువరాకుమారి గురించా చెప్పారు? మీ సహోదరి పళువూర్ యువరాణి నందిని గురించే చెబుతున్నారనుకొన్నాను!" అన్నాడు వంతిదేవుడు.

"నందిని కూడ అపూర్వ శక్తి కలిగినదే. కానీ ఆమె శక్తి ఇంకొక విధమైనది."

"ఎలా? ఏం తేడా?"

"ఒకడు నరకంలో పడబోతుంటే అతన్ని ఆపి, కాపాడి స్వర్గానికి తీసుకొని వెళ్ళగల శక్తి కుందవైది. అది ఒక విధమైన శక్తి. నందిని ఏం చేస్తుందో తెలుసా? ఆమె శక్తి ఇంకా ఒక బారెడెత్తు ఎక్కువే అని చెప్పాలి. నరకాన్నే స్వర్గమని చెప్పి సాధించి, నమ్మింపజేసి, నరకంలోనే సంతోషంగా గంతులేసేటట్లు చేసేస్తుంది!"

~

వంతిదేవునికి ఒళ్ళు జలదరించింది. నందిని గుణగణాలను, భయంకర మోహన శక్తిని ఎంత బాగా తూకం వేసి వెలకట్టి ఉంచాడీ వైష్ణవుడు! నందిని ఇతని సహోదరి అన్నది నిజమా?

వంతిదేవుడు ఈ ఆలోచనల్లో దీర్ఘంగా మునిగిపోవడం వల్ల ఇంకేమీ అడగలేదు. కాసేపు మౌనంగా నడిచాడు.

ఆ మౌనాన్ని భంగం చేస్తూ కొన్ని గుర్రపు డెక్కల శబ్దం వినిపించింది - వారికి ఎదుటి వైపు నుంచి. త్వరలో నాలుగు గుర్రాలు అతి వేగంగా నాలుగు కాళ్ళ సవారీ చేస్తూ రాసాగాయి. సుడిగాలి లాగ దుమ్ము లేపుకొంటూ మెరుపు మెరిసి మాయమైనట్లు ఆ గుర్రాలు మన పాద చారులను దాటుకొని ముందుకు వెళ్ళాయి. కానీ అంతలోపల ఆ రౌతుల్లో ఒకని ముఖాన్ని చూసి గుర్తుపట్టగలిగాడు వంతిదేవుడు! ఆహా! వీడు పార్థిబేంద్రుడు కద? కంచిలో ఉన్న యువరాజు అంతరంగ స్నేహితుడు కద? మనమంటే అంతగా ఇష్టం లేనివాడు కద? వీడు ఎక్కడికి వచ్చి ఎక్కడికి వెళుతున్నాడు? ఎందుకు లంకకు వచ్చాడు? ఎప్పుడు వచ్చాడు?

మన ప్రయాణీకులను దాటి వెళ్ళిన గుర్రాలు కాస్త దూరం వెళ్ళగానే, గంభీరమైన ఒక స్వరం "ఆగండి!" అని ఆజ్ఞాపించింది.

గుర్రాలు ఆగాయి. తర్వాత ఇటువైపు తిరిగాయి. వారి నాయకుడిలాగ కనిపించిన వాడు ముందు రాగా తక్కిన వారు అతని వెంట వచ్చారు.

ముందు వచ్చిన వాడు, వంతిదేవుడనుకొన్నట్లుగానీ, మనం ఇప్పటికే మహాబలిపురం (మామల్లపురం) లో చూసిన పార్థిబేంద్ర పల్లవుడే!

అతడు వంతిదేవుని పరికించి చూసి, “ఇదేమయ్యా! నీవెలా ఇక్కడికి వచ్చి చేరావు? తంజావూరులో నీవు ఉన్నట్లుండి మాయమైపోయావన్నారే? పళువేట్టరయ్యర్లు నిన్ను ఇప్పటికి ముగించేసి ఉంటారని కద అనుకొన్నాను?” అన్నాడు.

“పళువేట్టరయ్యర్లు నన్ను అంత సులభంగా ముగించేయగలరా? నేను పాత వాణర్ కులానికి చెందినవాడిని కద?”

“ఔనౌను! ఎలాగైన తప్పించుకొని ప్రాణాలు కాపాడుకోవడంలో నీకు ఎవరూ సాటిలేరు కద?...”

“అయ్యా! ప్రాణాలు కాపాడుకోవలసిన సందర్భంలో ప్రాణాలు కాపాడుకొంటాను. ప్రాణమివ్వవలసిన పరిస్థితి వస్తే అందుకు జంకను. అలాంటి పరిస్థితి వస్తే, మీవంటి పురాతన పల్లవ వంశవీరుని చేత చావు కోరుకొంటానే తప్ప కేవలం పళువేట్టరయ్యర్ల చేత చస్తానా?” అని అంటూనే తన ఒర నుంచి కత్తిదూశాడు వంతిదేవుడు.

“ఛఛ! నీతో నన్ను యుద్ధం చేయమంటావా? అదీ ఈ పరదేశంలో? వద్దు, తమ్ముడూ, వద్దు! యువరాజు నీకొప్పగించిన పని ఏమైంది?”

“చేసి ముగించేశానయ్యా! చక్రవర్తికి ఇమ్మని ఇచ్చిన పత్రాన్ని చక్రవర్తికి ఇచ్చేశాను. యువరాకుమారికి ఇమ్మని ఇచ్చిన పత్రాన్ని ఆమెగారికి ఇచ్చేశాను.”

"ఇక్కడికెందుకు వచ్చావు?”

“లంకను చూడాలని నాకు చాల రోజులుగా ఆశగా ఉండేది. కాబట్టి ఈ వైష్ణవులతోబాటు బయలుదేరి వచ్చాను....”

“ఆహా! ఈ మనిషిని కూడ నేను ఎక్కడో చూసినట్లుందే!”

“అవును, మహారాజా! చూసివున్నారు. నా సహోదరి గురించి ఏమైనా తెలుసా అని విచారించేందుకు ఆదిత్యుల వద్దకు వచ్చాను. అప్పుడు మీరు కూడ ఆయన పక్కనే ఉన్నారు!...”

“అదెవరు నీ సహోదరి?”

“ఇప్పుడు పళువూర్ యువరాణిగా చెలామణి అవుతున్న నందినే!”

“ఆహా! ఆ విషసర్పం వల్ల నాడు కలిగిన దురంతాలను తలుచుకొంటే ఆమెకు సహోదరుడైన కారణానికి నిన్ను ఉరికంబమెక్కించాలి!”

“మహారాజా! ఎప్పుడో ఒక రోజు నేను ఉరికంబమెక్కే చావాలని శపథం చేశాను. ఆరోజు మీరు వచ్చి ఆ కైంకర్యాన్ని మీ చేతులమీదుగానే జరిపించేస్తే...”

“నిన్ను నేను ఉరి కంబమెక్కించగలనా? అందుకు వందమంది కావాలి. అదలా ఉండనీ. మీరు

వచ్చిన దారిలో యువరాజు గురించిన సమాచారం ఏమైనా తెలిసిందా? ఆయన అనురాధపురానికి వచ్చేశారేమో తెలుసా?" అని పార్థిబేంద్రుడు అడిగాడు.

"అదంతా నాకేం తెలుసు మహారాజా! అడవి దారిన వచ్చాం. ఆ అడవిలో ఒక మదపుటేనుగు తరుముకొచ్చింది! అప్పుడు చూడండి...."

"చాలు, నీ కథ! ఎవరు చూడవచ్చారు? రేపు నేనే నిన్ను ఉరికంబమెక్కించి నీకోరిక నెరవేర్చవచ్చు!" అని అంటూనే పార్థిబేంద్రుడు గుర్రాన్ని తిప్పాడు.

ఆళ్వార్ కట్టియాన్ పార్థిబేంద్రునితో మాట్లాడుతూనే అతడి వెంట వచ్చిన వారిని పరికించి చూసుకొన్నాడు.

అందరూ గుర్రాలను తిప్పుకొని వెళ్ళిన తర్వాత ఆళ్వార్ కట్టియాన్ వంతిదేవుని చూసి, "తమ్ముడూ! అ తక్కిన ముగ్గురు మనుషులను చూశావా? వారిలో ఎవరినైనా నీవింతకు మునుపు చూశావా?" అని అడిగాడు.

"లేదు, వారిని ఇంతకు మునుపు చూడనే లేదు!" అన్నాడు వంతిదేవుడు.

"అవును. నీవింతకు మునుపు వారిని చూడ సాధ్యంలేదు. కానీ వారిలో ఇద్దరిని నేను ఇంతకు మునుపు చూశాను. తిరుప్పురంపయం పళ్ళిప్పడై (వీర దేవాలయం)లో నడిరాత్రి చూశాను! అబ్బ! ఎంతటి భయంకరమైన శపథం చేశారు?" అని అన్నప్పుడు ఆళ్వార్ కట్టియాన్ ఒళ్ళంతా గడగడ వణికింది.

"ఏమంతటి భయంకరమైన శపథం చేశారు?"

"చోళ వంశాన్నే సమూలంగా నాశనం చేస్తామని శపథం చేశారు!"

"అయ్యయ్యో!"

"వీళ్ళు ఎలా మనకన్న ముందు ఇక్కడికి వచ్చి చేరారో తెలియడం లేదు! భలే తెలివైన వారు! ఈ మొరటు పల్లవుని ఎలాగో పట్టుకొన్నారు చూడు!" అని చెప్పేసి ఆళ్వార్ కట్టియాన్ మౌనందాల్చాడు.

వంతిదేవునికి కోడిక్కరైలో తాను తెలుసుకొన్న ఒక విషయం గుర్తుకొచ్చింది. అతను కోడిక్కరై చేరేందుకు ఒక రోజు మునుపే ఇద్దరు మనుషులు తొందర తొందరగా లంకకు వెళ్ళారని, పూంగుళలి అన్న వారిని పడవలో ఎక్కించుకొని తీసుకొని వెళ్ళాడని విన్నాడు కద?

వీరిలో ఆ ఇద్దరు ఉన్నారా? అలాగైతే వీరికి, పార్థిబేంద్రునికి ఎలాంటి సంబంధం ఉండగలదు?

నలుగురూ తంబళ్ళై అనే బౌద్ధ పుణ్యక్షేత్రాన్ని సమీపించారు.

~~~
~~~

# అధ్యాయము - 29

## ఏనుగు మావటి

సుమారు రెండు వేల ఏళ్ళ క్రితం - అంటే మన కథ జరిగిన కాలానికి వెయ్యేళ్లకు మునుపు - లంకలో 'వలహం బాహువు' అనే సింహళ రాజు ఉండేవాడు. అతని కాలంలో కూడ తమిళసైన్యం లంకమీద దండెత్తి వెళ్ళాయి. అప్పుడు ఆ సింహళరాజు తన రాజధానిని వదిలి తంబళ్ళై అనే చోట కొండ గుహల్లో దాక్కొన్నాడు. తర్వాత మళ్ళీ సైన్యాన్ని కూడదీసుకొని వెళ్ళి అనురాధపురాన్ని తిరగి కైవసం చేసుకొన్నాడు. అతనికి అభయమిచ్చిన కొండ గుహను ఇంకా తొలిచి పెద్దది చేసి ఒక గుడి కట్టాడు. బుద్ధ భగవానునికి తన కృతజ్ఞతను తెలియజేసుకోవడానికి ఆ గుహలో చిన్నవి, పెద్దవి పలు బుద్ధ విగ్రహాలను నిర్మింపజేశాడు. వందలకొద్ది శిల్పాలను చెక్కిన ఆ శిల్పులకు తమ శిల్పచాతుర్యాన్ని పూర్తిగా చూపించామన్న తృప్తి కలగలేదు. అందుకే హిందూమత దైవాలు కొన్నింటిని కూడ శిల్పరూపంలో చెక్కి బుద్ధుని శిల్పాల మధ్య ప్రతిష్ఠించారు. ఆ అద్భుత శిల్ప కళా ఖండాలను ఇప్పుడు కూడ తంబళ్ళై అనే ఊరిలో ఉన్న గుహల్లోని దేవాలయాల్లో చూడవచ్చు.

వంతిదేవుడు ఆ పుణ్యక్షేత్రంలో ప్రవేశించినప్పుడు ఒక కొత్త లోకంలో ప్రవేశించినట్లే అనిపించిందతనికి. అప్పుడే వికసించిన పూల సువాసన అతడికి మైకం కలిగించింది. వీధి చివర్లలో తామర మొగ్గలు, సంపంగి పూలు కుప్పలు కుప్పలుగా పోయబడివున్నాయి. భక్తులు ఆ పూలను అందమైన తాటాకు బుట్టల్లో నింపుకొని గుళ్ళకు వెళుతున్నారు. స్త్రీపురుషులతో నిండిన ఆ భక్త కూటములు వీధుల నిండా వెళుతున్నారు. కావి/కాషాయ వస్త్రాలు ధరించిన సన్యాసులు కూడ అక్కడక్కడ కనిపించారు. "సాధు! సాధు!" అన్న ఘోషలు భక్త కూటమి నుంచి వినవచ్చాయి.

~

ఇవన్నీ వంతిదేవునికి అమితాశ్చర్యాన్ని కలిగించాయి. ఆళ్వార్ కట్టియాన్ని చూసి, "మనం యుద్ధకేంద్రానికి వస్తున్నామనుకొన్నాను. కానీ ఇది చూస్తే బౌద్ధ క్షేత్రంలాగ ఉంది కద?" అని అడిగాడు.

"అవును, బాబూ! వెయ్యేళ్ళుగా ప్రసిద్ధిగాంచిన బౌద్ధక్షేత్రం కద ఇది?" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

"కానీ ఇది చోళ సైన్యం అధీనంలో ఉందన్నారు కద?"

"అవును. ఇప్పుడూ అదే చెబుతున్నాను."

"చోళవీరులెవ్వరూ ఇక్కడ కనిపించడం లేదేమి?"

"ఊరి బయట సైన్యపు గుడారాలలో, ఇళ్ళలో ఉన్నారు. అది యువరాజు ఆజ్ఞ."

“ఏ యువరాజు?”

“ఏల? మనం ఎవరిని వెతుక్కొంటూ వచ్చామో ఆ యువరాజే!”

“దాన్ని గురించి మిమ్మల్ని అడగాలనుకొన్నాను. యువరాజును ఇక్కడ వెతికేసి 'లేదు' అని చెప్పి పార్థిబేంద్రుడు వెనుదిరిగాడు కద? మనం ఇక్కడ ఆయనకోసం వెతకడం వల్ల ప్రయోజనమేమి?”

“ఆ పల్లవుడు 'లేదు' అని చెప్పేస్తే నేను నమ్మేస్తానా? నేనే వెతికి తెలుసుకొంటాను. హిరణ్య కశ్యపుడు 'హరి' అన్న దైవం లేదన్నాడు. ప్రహ్లాదుడు దాన్ని నమ్మాడా?”

“ఓ వీర వైష్ణవులు గారూ! మన దేశంలో శైవులతో విరామం లేకుండ దెబ్బలాడుతుంటారు కద? ఇక్కడ ఇందరు బౌద్ధ సన్యాసులు వస్తూ పోతూ ఉన్నారు. వారిని చూసి కూడ మీరూరకున్నారేం? ఏమి కారణం? మంది ఎక్కువున్నారని భయపడ్డారా?”

“తమ్ముడూ? భయం అంటే ఏమి? అదెలా ఉంటుంది?”

“నల్లగా భూతాకారంలో ఉంటుంది. ఏనుగంత పెద్దదిగా ఉంటుంది. మీరెప్పుడూ చూడలేదా?”

“లేదు" అని చెప్పేసి ఆళ్వార్ కట్టియాన్ వీధి ఓరగా నించొని చోద్యం చూస్తున్న ఇద్దరు మనుషులను సమీపించాడు. వారు తమిళులలాగ కనిపించారు. వారితో కాసేపేదో మాట్లాడేసి తిరిగి వచ్చాడు.

“వైష్ణవులుగారూ! వారిని ఏమడిగారు? 'విష్ణువు పెద్దవాడా? బుద్ధుడు పెద్దవాడా?' అని అడిగారా? ఇక్కడ ఎవరినడిగినా 'బుద్ధుడే పెద్ద' అని చెబుతారు. ఇక్కడి బుద్ధ శిల్పాలు ఎంతెంత పెద్దగా బ్రహ్మాండంగా ఉన్నాయో చూడలేదా?”

“తమ్ముడూ! నా వైష్ణవాన్నంతా రామేశ్వరంలో మూట కట్టి పెట్టేసి ఇక్కడికి రాజకార్యం మీద వచ్చాను. తెలియదా?”

“మరి వారితో ఏం మాట్లాడారు? యువరాజు గురించి విచారించారా?”

“లేదు; ఈ రోజు ఈ ఊళ్ళో ఏం విశేషం అని అడిగాను.”

“వారేం చెప్పారు?”

“ఇద్దరు చైనా యాత్రికులు ఇక్కడికి వస్తున్నారట. అందుకోసం బౌద్ధవిహారంలో ఉత్సవం జరుగుతోందట. అందుకే ఊళ్లో ఈ సందడి, కోలాహలం అని చెప్పారు.”

“చైనా యాత్రికులు ఎక్కడినుంచి వస్తున్నారట?”

“నిన్న ఇక్కడికి వచ్చి, తర్వాత సింహగిరికి వెళ్ళారట. ఇప్పుడు అక్కడినుంచి తిరిగి వస్తున్నారట. ఇంకాసేపట్లో ఇక్కడికి వచ్చేస్తారని కూడ చెప్పారు.

“సింహగిరి ఎక్కడుంది?”

"ఇక్కడినుంచి ఒక కోసు దూరంలో ఉంది. ఇంకా సింహళుల అధీనంలో ఉంది. పగటివేళైతే ఇక్కడినుంచే చూడవచ్చు. సింహగిరి పైన ఒక బలమైన కోట ఉంది. అక్కడి ఒక గుహలో అద్భుతమైన చెరిగిపోని వర్ణచిత్రాలున్నాయి. వాటిని చూసేందుకే ఆ చైనా యాత్రీకులు అక్కడికి వెళ్ళివుండాలి. కొండెక్కి దిగేందుకు చాల కష్టపడే ఉంటారు... అదిగో చూడు!"

~

ఆళ్వార్ కట్టియాన్ వేలెత్తి చూపించిన వైపు నుంచి అలంకరించబడ్డ ఒక ఏనుగు వస్తుండడం కనిపించింది. దాని అంబారీలో ఇద్దరు కూర్చొనివున్నారు. వారి రూపురేఖలు, కట్టుబట్టలు చూస్తే వారే ఆ చైనా యాత్రీకులని తెలుస్తోంది. ఏనుగు మావటి ఒకడు చేత అంకుశంతో దాని మెడమీద కూర్చొనివున్నాడు. ఏనుగు చుట్టూ గుమిగూడిన ప్రజలు అనేక రకాలుగా ఘోషిస్తున్నారు.

"చూశావా?" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

"చూశాను! చూశాను! అమ్మమ్మ! ఎంత పెద్ద ఏనుగు? పక్కన ఏదైనా పల్లముందేమో చూద్దామా?"

"అవసరం లేదు. వీధిలో కాస్త పక్కకు ఒదిగి నిలబడితే చాలు."

అలాగే, ఏనుగు దగ్గరకు రాగానే పక్కకు ఒదిగి నిలబడ్డారు.

ఏనుగు వారిని దాటి వెళ్ళింది. గుంపు కూడ వారి వెనకే వెళ్ళింది.

వంతిదేవుడు ఏనుగు అంబారీలో ఉన్న యాత్రికులపైనే దృష్టి ఉంచాడు. బౌద్ధక్షేత్రాన్ని దర్శించేందుకు ఎంతో దూరం ప్రయాణం చేసి, ఎన్నో సముద్రాలు దాటి వచ్చిన ఆ యాత్రికుల భక్తిని తలుచుకొని ఆశ్చర్యపోయాడు. వారికి ఇన్ని ఉపచారాలు జరగడం న్యాయమే. కానీ యుద్ధం జరుగుతున్నప్పుడు కూడ వీరి యాత్రకు భంగం కలగకుండడం ఎంత ఆశ్చర్యం? యువరాజు అరుళ్మొళి వర్మ చేసిన ఏర్పాటే అయివుండాలి. ఇలాంటి ఉదారబుద్ధితో గొప్పకార్యాలు చేయగలిగిన వారు ఆయనొక్కడే. అయితే ఇప్పుడాయనెక్కడున్నారు? ఆయనను వెతికి పట్టుకోవడం సాధ్యమా? ఈ వైష్ణవునితో కష్టపడి ఇంత దూరం వచ్చిందంతా వృధా అయిపోతుందా...?

"తమ్ముడూ! చూశావా?" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

"చూశాను."

"ఏం తెలిసింది?"

"చైనా యాత్రికుల ముఖం చప్పిడిగా ఉంది. వారి బట్టలు విచిత్రంగా ఉన్నాయి..."

"యాత్రికుల గురించి నేనడగలేదు."

"మరి?"

"ఏనుగు మావటిని గమనించి చూశావా అని అడిగాను."

"ఏనుగు మావటినా? నేను గమనించనే లేదే?"

"భలే ఉంది. ఆ ఏనుగు మావటి చూపు అనుకోకుండ మనమీద పడ్డప్పుడు అతని కళ్లలో మెరిసిన మెరుపును గమనించలేదా?"

"అదేమి? ఏనుగు మావటి కళ్లలో దివిటీలున్నాయా అలా జ్వలించేందుకు?"

"భలేవాడివి నీవు! నీ అజాగ్రతను చూసి ఆశ్చర్యపోవాలా లేక ఇంత ముఖ్యమైన కార్యాన్ని నీకప్పగించిన ఆ యువరాకుమారి నమ్మకాన్ని తలుచుకొని ఆశ్చర్యపోవాలో తెలియడం లేదు. పోతేపోనీ, నాతో రా!"

ఏనుగుకు, ఏనుగు చుట్టూ గుమిగూడిన జనాలకు కాస్త దూరంగా ఇద్దరూ ముందుకు సాగారు.

~

బౌద్ధవిహారపు వాకిట చేరగానే ఏనుగు ఆగింది. తర్వాత ఏనుగు మావటి ఏదో చెప్పగానే ఏనుగు ముంగాళ్ళు మడిచి కూర్చొంది. యాత్రికులు దిగారు. బౌద్ధవిహారపు వాకిట గుంపుగా నిలబడ్డ బౌద్ధ భిక్షువులు వారిని స్వాగతించారు. శంఖాలు ఘోషించాయి. గంటలు గణగణ మోగాయి. విహారపు మేడపైనుంచి పూలవర్షం కురిసింది. "బుద్ధం శరణం గఛ్ఛామి" అన్న ఘోష మారుమోగింది. చైనా యాత్రికులిద్దరూ లోపలికి వెళ్ళారు.

యాత్రికులు దిగేందుకు మునుపే కిందకు దిగిన మావటి, వారు వెళ్ళిన తర్వాత ఏనుగును లేపి నడిపించుకొని వెళ్ళాడు. కాస్త దూరాన నిలబడ్డ నలుగురిని చూసి, వారిలో ఒకనికి ఏనుగును ఒప్పజెప్పాడు. ఇంకొకనితో ఆళ్వార్ కట్టియాన్ని చూపించి ఏదో చెప్పాడు. మిగిలిన ఇద్దరిని తన వెంట తీసుకొని వీధి మలుపు తిరిగి మాయమైనాడు.

ఏనుగు మావటి ఎవరికి ఆళ్వార్ కట్టియాన్ని చూపించి ఏదో చెప్పాడో అతను వారి దగ్గరకు వచ్చి, ఆళ్వార్ కట్టియాన్తో, మెల్లని స్వరంలో, "అయ్యా! నాతో రావడానికి సమ్మతమేనా?" అని అడిగాడు.

"అందుకోసమే వేచివున్నాను!" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

"ఆనవాలేమైనా ఉందా?"

సేనాధిపతి ఇచ్చిన కొడుంబాళూర్ రాజ ముద్ర ఉన్న ఉంగరాన్ని చూపించాడు ఆళ్వార్ కట్టియాన్.

"సరే! నా వెంట రండి" అని చెప్పి అతడు ముందు నడవగా, వీరు అతని వెంట వెళ్ళారు. ఊరు దాటగానే ఒక ఇరుకైన అడవి దారి కనబడింది. దాని వెంబడి కాస్త దూరం వెళ్లగానే దారికి కాస్త ఎడంగా ఉన్న ఒక పాడుబడ్డ మంటపాన్ని చేరారు. అక్కడ కాసేపు వేచివుండాలి అని వారిని తీసుకొచ్చినవాడు తెలియజేశాడు. తర్వాత అతను ఒక చెట్టెక్కి వారు వచ్చిన దారినే పరీక్షగా చూడసాగాడు.

"ఇదంతా ఏదో మాయ లాగుందే? నాకేం అర్థం కావడం లేదు!" అన్నాడు వంతిదేవుడు.

"అంతా కాసేపట్లో అర్థమౌతుంది. కాస్త ఓపిక పట్టు!" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

ఆ పాడుబడ్డ మంటపం వెనుక రెండు గుర్రాలు కట్టబడివున్నాయి. రెండే గుర్రాలుండడం వంతిదేవునికి కాస్త దిగులు కలిగించింది.

ఏనుగు మావటి గురించిన మర్మం ఏమైవుంటుంది? అతని ముఖాన్ని ఒకేఒక్క క్షణం మాత్రమే వంతిదేవుని కళ్ళు సరిగ్గా చూశాయి. తర్వాత అతని గురి చైనా యాత్రికుల వైపు మళ్ళింది. ఏనుగు మావటి ముఖాన్ని గుర్తుచేసుకోవడానికి చాల ప్రయత్నించాడు గాని ఏమీ గుర్తుకు రాలేదు.

"వైష్ణవులుగారూ! ఆ ఏనుగు మావటి ఎవరు? నాకు చెప్పకూడదా?"

"ఎవరై ఉండవచ్చు? నీవే ఊహించి చూడు, తమ్ముడూ!'"

"ఏనుగు మావటే 'పొన్నియిన్ సెల్వనా'?"

"ఆయన కళ్లలో మెరిసిన కాంతిని బట్టి చూస్తే అలాగే అనిపిస్తూంది."

"మీలాగే ఆయనను తక్కినవారు తెలుసుకొనివుండరా?"

"ఉండరు. చైనా యాత్రికులకు యువరాజు ఏనుగు మావటిగా పనిచేస్తారని ఎవరూహించగలరు? పైగా ఈ ఊరి జనాలు యువరాజును చూసిందేలేదు!"

"చైనా యాత్రికులు సింహగిరినుంచి వచ్చారన్నారు కద?"

"అవును."

"సింహగిరి ఇంకా సింహళుల వశంలో/అధీనంలో ఉందన్నారు కద?"

"అవును."

"మరి, శత్రువుల మధ్యకా వెళ్ళి తిరిగివచ్చారు యువరాజు?"

"సింహగిరి మాత్రమేనా? పగవారి అధీనంలో ఉన్న మహియంగణం, శమంతబాటం మొదలైన క్షేత్రాలకు చైనా యాత్రికులతో వెళ్ళి వచ్చారు యువరాజు."

"ఎందుకని అటువంటి అపాయాన్ని ఎదుర్కొంటున్నారు యువరాజు?"

"ఆ క్షేత్రాలను, అక్కడి అద్భుత శిల్ప, చిత్ర కళా ఖండాలను చూడడమంటే ఆయనకు చాల ఇష్టం."

"భలే ఆశ! భలే యువరాజు! ఇటువంటి చిన్నపిల్లాడి బుద్ధివున్న యువరాజునా పట్టాభిషిక్తులైన తక్కిన రాజులందరూ గౌరవించేటటువంటి ఏకఛత్రాధిపతి అవుతారని ఆ కుడంద్తె జ్యోతిష్కులు చెప్పారు?"

"కుడంద్తె జ్యోతిష్కులు అలా చెప్పారా, తమ్ముడూ?"

"మీరు దాన్ని నమ్ముతారా?"

"నేను జోస్యాన్ని నమ్మను. జోస్యం చూడవలసిన అవసరమూ నాకు లేదు."

"మరి..."

"జోస్యం చూడకుండానే నాకు నిశ్చయంగా తెలుసు..."

~

ఉన్నట్లుండి గుర్రపు డెక్కల చప్పుడు వినిపించింది. వారున్న స్థలాన్ని సమీపిస్తూ అతి దగ్గరలో వినిపించింది. చెట్టుపైకెక్కి చూస్తున్నవాడు వేగంగా కిందికి దిగి, రెండు గుర్రాలను పట్టుకొని వచ్చాడు. ఒక గుర్రం పైకి తానెక్కి కూర్చొన్నాడు. ఆళ్వార్ కట్టియాన్ని ఇంకొక గుర్రం పైకెక్కమన్నాడు. "కాసేపట్లో కొన్ని గుర్రాలు ఈ దారి వెంబడి వెళతాయి. వాటిని వెన్నంటి మనం కూడ వెళ్ళాలి" అన్నాడు.

వంతిదేవుడు, "నాకు గుర్రం?" అని అడిగాడు.

"ఈయనను మాత్రమే పిలుచుకొని రమ్మని నాకు ఆజ్ఞ!"

"ఎవరి ఆజ్ఞ?"

"అది తెలియజేయడానికి నాకు అధికారం లేదు."

"యువరాజుగారిని నేను వెంటనే చూడాలి. అతి ముఖ్యమైన సందేశాన్ని తీసుకొని వచ్చాను."

"అందుగురించి నాకేమీ తెలియదయ్యా!"

"ఆళ్వార్ కట్టియాన్, "తమ్ముడూ! కాస్త ఓపిక పట్టు! నేను వెళ్ళి యువరాజుగారిని చూసి మాట్లాడి నిన్ను కూడ పిలుచుకొని వచ్చే ఏర్పాటు చేస్తాను" అన్నాడు.

"వైష్ణవా! నేను తీసుకొని వచ్చిన సందేశం అతిముఖ్యమైనది, అత్యవసరమైనది. అది మీకు తెలియదా?"

"ఆ తాళపత్రాన్ని నాకివ్వు! నేనే ఇచ్చేస్తాను."

"అది సాధ్యం కాదు."

"అలాగైతే కాస్త ఓపిక పట్టు; వేరే దారిలేదు!"

"వేరే దారి లేదా?"

"లేనే లేదు!"

వంతిదేవుని మనసు కుతకుతలాడింది. ఆళ్వార్ కట్టియాన్ని యువరాజు వద్దకే తీసుకొని వెళుతున్నారన్న విషయంలో సందేహం లేదు. ఆళ్వార్ కట్టియాన్ యువరాజుకు ఏం చెబుతాడని గమనించమని సేనాధిపతి చెప్పారు. అదిప్పుడు వీలు కాకుండ పోతుంది కద?

గుర్రాలు దగ్గరకు వచ్చేశాయి. వారున్న స్థలాన్ని దాటి మెరుపు వేగంతో ముందుకు దూసుకు వెళ్ళాయి.

~

మంటపంలో గుర్రాలపైన సిద్ధంగా ఉన్న ఇద్దరూ వాటి ముక్కుతాళ్లను లాగి వాటిని బయలుదేరదీశారు. అప్పుడు ఎవరూ ఎదురు చూడని సంఘటన ఒకటి జరిగింది. వంతిదేవుడు గుర్రంపైన కూర్చొనివున్న వాడి కాలు పట్టుకొని ఒక్క ఊపుతో లాగాడు. అతడు ధడేల్మని గుర్రంపైనుంచి కింద పడ్డాడు. వంతిదేవుడు ఎగిరి గుర్రం పైన కూర్చొన్నాడు. గుర్రం ముందుకు దూసుకు వెళ్ళింది. ఆళ్వార్ కట్టియాన్ గుర్రం కూడ ముందుకు దూసుకు వెళ్ళింది. కింద పడ్డ మనిషి పైకి లేచి ఒక కేక వేసి తన ఒరలో ఉన్న కత్తిదూసి గురి చూసి విసిరాడు. వంతిదేవుడు అది ఊహించి ముందుకు వంగి గుర్రం వెన్నుకంటుకొని గుర్రాన్ని ముందుకు పోనిచ్చాడు. కత్తి దూసుకొని వెళ్ళి దూరాన ఉన్న ఒక చెట్టు బోదెలో లోతుగా దిగబడింది. గుర్రాలు రెండూ వాయువేగంతో పరుగెత్తాయి.

ముందు వెళ్ళిన మూడు గుర్రాల వెంబడి అతి దగ్గరగాను గాక, అతి దూరంగాను గాక ఈ రెండు గుర్రాలు సాగాయి. “మంచి పని చేశావు, తమ్ముడూ!” అని చెప్పి ఆళ్వార్ కట్టియాన్ ఉత్సాహపరిచాడు. కానీ వంతిదేవుడేమీ బదులు చెప్పలేదు. ఇది ఎక్కడ దేంట్లో ముగియబోతోందో అన్న దిగులు అతడి మనసును గాఢంగా కమ్ముకొంది. ఒక అమ్మాయి మాటకు విలువిచ్చి, సముద్రం దాటి ఈ దూరదేశానికి వచ్చి, ఇటువంటి సంకటంలో చిక్కుపడ్డాం కద అన్న చింతన ఉదయించిందతని మనసులో.

గుర్రాలు వాయువేగ, మనోవేగాలతో ఇరుకైన అడవి దారి గుండా ముందుకు దూసుకు వెళ్లసాగాయి.

~~~
~~~

# అధ్యాయము - 30

## ద్వంద్వ యుద్ధం

**ముగింపు** లేని అడవిదారి వెంబడి వెళుతున్నట్లనిపించింది వంతిదేవునికి. ఈ వైష్ణవుడు మనని నిజంగానే మోసం చేసేశాడా? మనని శత్రువులకు ఒప్పజెప్పబోతున్నాడా?

రెండువైపులా దట్టమైన అడవులు. ఆ అడవులను కమ్ముకొన్న చిమ్మచీకటి. ఆ కీకారణ్యంలో ఎటువంటి అపాయాలు, విపత్తులు పొంచివున్నాయో తెలియదు. చిరుతలు, ఎలుగుబంట్లు, విషజంతువులు - వీటితోబాటు శత్రువులు కూడ పొంచివుండవచ్చు. ఎవరికి తెలుసు? దక్షిణదిశలో చోళసైన్యం వశపరుచుకొన్నది తంబళ్లై అన్నారు కద? మరి ఇతను మనని ఎక్కడికి తీసుకొని వెళుతున్నాడు?

అదృష్టవశాత్తు కాస్త వెన్నెల వెలుతురుంది. చంద్రకిరణాలు ఆకాశాన్నంటుతున్న వృక్ష శిఖరాగ్రాలతో దోబూచులాడుతున్నాయి. అందువల్ల ఏర్పడ్డ చలన కాంతి అప్పుడప్పుడు వారు వెళుతున్న దారిపైన పడుతోంది. ముందు మూడు గుర్రాలు వెళుతుండడం ఒక్కొక్కసారి క్రీనీడలాగ కనిపిస్తోంది. కానీ గుర్రపు డెక్కల చప్పుడు మాత్రం నిరంతరంగా వినిపిస్తోంది.

ఉన్నట్లుండి ఇంకేవో శబ్దాలు వినవచ్చాయి. అడవి మధ్య ఎదురు చూడలేని శబ్దాలు. పలువురు మనుషుల కోలాహల శబ్దం. కుతూహలంగా ఆడిపాడుతున్న శబ్దం. ఆ! ఆ చెట్లమధ్య వెలుతురు కనిపిస్తోంది. దివిటీలతో బాటు పెద్ద పొయ్యిలు మండుతున్న వెలుతురు కనిపించింది. ఆహా! అ అడవిలో చావడి వేసుకొని కుతూహలంగా ఉన్న ఈ వీరులెవ్వరు? చోళనాడు వీరులా? లేక శత్రుసైన్యానికి చెందిన వారా?

~

అందుగురించి వంతిదేవుడు ఆలోచనానిమగ్నుడైనది కొన్ని క్షణాలు మాత్రమే. కానీ ఆ స్వల్పావధిలో ముందు వెళుతున్న గుర్రాలు చటుక్కున ఆగడమూ, వాటిలో ఒకటి గిర్రున వెనక్కి తిరగడమూ వంతిదేవుడు గమనించలేదు. తిరిగిన గుర్రం వంతిదేవుని గుర్రం వైపు అతివేగంగా రాసాగింది. దాని పైనున్నతను వంతిదేవుని వైపు వాలి, లాగి ఒక్క గుద్దు గుద్దాడు. ఆ గుద్దు అదురుబాటుకు స్థిమితం తప్పిన వంతిదేవుని ఒక మోకాలు పట్టుకొని లాగి తోశాడు ఆ అజ్ఞాత వీరుడు. వంతిదేవుడు ధడేల్మని కిందపడ్డాడు. వచ్చిన వేగానికి అతని గుర్రం అతివేగంతో కాస్త దూరం వెళ్ళి ఆగింది.

ఇంతలో అతన్ని కిందపడదోసిన వీరుడు గుర్రం పైనుంచి కిందకు దూకి వంతిదేవుని సమీపించాడు. దిగ్భ్రమించి తడబడుతూ పైకి లేస్తున్న వంతిదేవుని ఒర నుంచి కత్తిని లాగి అవతలికి

విసిరేశాడు. వెంటనే వంతిదేవునికి కొత్త శక్తి వచ్చింది. దానికి తోడు ఉక్రోషం పొంగుకొచ్చింది. ఒక్క గెంతుతో లేచి నిలబడ్డాడు. రెండు చేతులను గట్టిగా బిగించి వజ్ర ముష్టితో తనను అటకాయించిన వీరుని ఒక్క గుద్దు గుద్దాడు. గుద్దు తిన్న మనిషి ఊరకుంటాడా? అతడూ తన చేతి లాఘవాన్ని చూపించాడు. ఇద్దరి మధ్య బ్రహ్మాండమైన ద్వంద్వ యుద్ధం జరిగింది. ఘటోత్కచుడు, హిడింబుడు పోరాడినట్లు పోరాడారు. నేలమీద దొర్లి పొర్లాడారు. వేటగాడి వేషం ధరించి వచ్చిన శివపరమాత్మ,అర్జునుడు కుస్తీ పట్టినట్లు కిందపడి పొర్లాడారు. అష్ట దిగ్గజాల్లో రెండు తమ స్థానాలను వదిలి ఇవతలికి వచ్చి ద్వంద్వ యుద్ధం చేసినట్లు ఒకరినికరు ఢీకొన్నారు.

~

ఈ అపూర్వ ద్వంద్వ యుద్ధాన్ని వంతిదేవుని వెంట వచ్చిన ఆళ్వార్ కట్టియాన్, వారికి మునుపు వచ్చిన వీరులు కాస్త దూరం తొలగి నిలబడి ఆశ్చర్యంతో చూడసాగారు. చెట్టుకొమ్మల మధ్యనుంచి అప్పుడప్పుడు వస్తున్న వెన్నెల వెలుతురులో వారా అద్భుత యుద్ధాన్ని రెప్పవేయకుండ చూడసాగారు.

త్వరలోనే అడుగుల చప్పుడు వినిపించింది. వెలిగించిన దివిటీలను పట్టుకొని, చెట్లను, చెట్ల కొమ్మలను తొలగించుకొని కొందరు వీరులు అక్కడికి వచ్చారు. అలా వచ్చిన వీరులు కూడ ఆ అద్భుత యుద్ధాన్ని ఆశ్చర్యంతో చూడసాగారు. కాసేపట్లో అక్కడ ఒక పెద్ద గుంపే కూడింది.

చివరిగా వంతిదేవుడు కింద తోయబడ్డాడు. అతన్ని తోసిన వీరుడు అతని ఛాతీమీద కూర్చొని అతని నడుం చుట్టు కట్టబడివున్న బట్టను విప్పి తీసుకొన్నాడు. అందులో దాచివున్న తాళపత్రాన్ని చేజిక్కించుకొన్నాడు. దాన్ని అడ్డగించేందుకు వంతిదేవుడు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది.

తాళపత్రం చేతికి చిక్కిన వెంటనే ఒక్క గెంతుతో లేచి నిలబడి, చుట్టూ దివిటీలతో నిలబడ్డ వీరులను సమీపించాడు. ఆ వీరుడు ఇంకొక సైగ చేయగానే ఇద్దరు వీరులు పరుగెత్తుకొని వచ్చి వంతిదేవుడు పైకి లేవకుండ గట్టిగా అదిమి పట్టుకొన్నారు.

వంతిదేవుడు పట్టలేని ఉక్రోషంతోను, కోపంతోను, “ఓ పాపిష్టి వైష్ణవా! ఇటువంటి మిత్రద్రోహం చేయవచ్చా? వాడి చేతినుంచి తాళపత్రాన్ని తీసివ్వు!” అని అరిచాడు.

“బాబూ! అది నావల్ల కాని పని!” అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

“ఛీఛీ! నీవంటి పిరికిపందను చూసిందే లేదు! నిన్ను నమ్మి నీతో వచ్చాను కద, అది నా బుద్ధి తక్కువ!” అన్నాడు వంతిదేవుడు.

ఆళ్వార్ కట్టియాన్ ఎలాంటి తొందర లేకుండ గుర్రం మీదినుంచి దిగి, వంతిదేవుని సమీపించి అతని చెవిలో, “వెర్రి బాగులవాడా! తాళపత్రం ఎవరిచేతికి చిక్కాలో వారికి చేరింది! ఎందుకు ఏడుస్తున్నావు?” అన్నాడు.

దివిటీ వెలుతురులో తాళపత్రాన్ని చదువుతున్న వీరుని ముఖాన్ని తక్కిన వీరులు చూసేశారు. వెంటనే ఒక మహత్తైన కుతూహలారావం లేచింది.

"పొన్నియిన్ సెల్వన్ వర్ధిల్లాలి!"

"అన్య రాజ కాలాంతకునికి జయహో!"

"మా యువరాజుకు జయహో!"

"చోళకుల దీపానికి జయహో!"

అన్న జయఘోషలు ఆ ప్రదేశంలో మారు మోగాయి. వారి జయఘోషల శబ్దానికి ప్రతిధ్వనిలాగ ఆ చెట్లలో నిద్రిస్తున్న పక్షులు నిద్రనుంచి లేచి రెక్కలను టపటపా కొట్టుకొంటూ పలురకాలైన శబ్దాలు చేశాయి.

ఇంతకు మునుపు వచ్చిన వీరులేగాక ఇంకా చాలమంది వీరులు ఏం విశేషం అని తెలుసుకోవడానికి చెట్టుకొమ్మల్ని తొలగించుకొని గబగబా అక్కడికి వచ్చారు. గుంపు పెద్దది కావడాన్ని గమనించిన ఆ అజ్ఞాత వీరుడు చుట్టూ ఒకసారి చూసి, "మీరందరూ గుడారానికి వెళ్ళి విందుకు కావలసిన ఏర్పాట్లు చేయండి. కాసేపట్లో నేను వచ్చేస్తాను" అని చెప్పగా వారందరూ ఆ స్థలాన్ని వదిలి వేగంగా వెళ్ళారు.

~

బాగా గుద్దులు, దెబ్బలు తిన్న వంతిదేవుడు నేలమీద కూర్చొన్న పళంగా ఇదంతా చూస్తున్నాడు. ఆ దెబ్బల నొప్పినంతా మరిచిపోయేటటువంటి ఆశ్చర్యకడలిలో మునిగిపోయాడతడు.

"ఆహా! ఈయనేనా యువరాజు అరుళ్మొళి వర్మ? ఈయన చేతిలో ఏమంతటి బలం? ఏమా వేగం? మొటిక వేసినా ఉంగరపువేలితో వేయాలంటారు కద? గుద్దులు తిన్నా యువరాజు చేత తినాలి! ఈయనలో అర్జునుని అందం, గాంభీర్యం ఉన్నాయి! భీమసేనుని దేహబలముంది! ఊరూ, వాడా ఈయనను వేనోళ్ళ పొగడడంలో ఆశ్చర్యం లేదు!" అని అనుకొన్నాడు.

ఈ కథకు ఈ పేరిచ్చిన రాకుమారుని, తమిళనాడు చరిత్రలోనే సాటిలేని వీరాధివీరుని, చోళరాజ వంశాన్ని చెరిగిపోని కీర్తిగాంచిన అమరకులంగా చేసిన వారిని, పిదప కాలంలో రాజరాజ చోళుడు అని పేరుగాంచబోతున్న అరుళ్మొళివర్మను ఇలా సమయంగాని సమయంలో, అసందర్భ పరిస్థితిలో, రాజకుల చిహ్నాలేమీ లేకుండ పాఠకులకు పరిచయం చేసేటటువంటి పరిస్థితి వచ్చేసింది. అది పాఠకులకు కాస్త కొరత కలిగించే విషయమే! కానీ ఏం చేయడం? మన కథానాయకుడు వంతిదేవుడే ఆయనను ఇప్పుడే కలిశాడంటే, మరి మనం ఆయనను ఇంతకు మునుపెలా చూడ సాధ్యం?

~

అరుళ్మొళి దేవరు వంతిదేవుని చూసి, అతన్ని సమీపించారు. మళ్ళీ తమ ముష్టిబలాన్ని

పరీక్షించేందుకు వస్తున్నారేమోనని వంతిదేవుడు ఒక్కక్షణం అదిరిపడ్డాడు.

“ప్రియతమా! స్వాగతం! సుస్వాగతం! సుందర లంకాద్వీపానికి స్వాగతం! చోళదేశపు వీరాధివీరులతో చేరేందుకు కడలిదాటి ఇంతదూరం వచ్చారు కద? అలా వచ్చిన మీకు నేనిచ్చిన స్వాగతం నచ్చిందా? లేక అది చాలదు, ఇంకాస్త పటాటోపమైన స్వాగతం కావాలంటారా?” అని చెప్పి యువరాజు చిరునవ్వు నవ్వారు. వంతిదేవుడు ఒక్క దూకుతో ఎగిరి లేచి నిలబడి, నమస్కారయుతంగా, “యువరాజా! తమ సహోదరి ఇచ్చిన తాళాపత్రం మీకు చేరిపోయింది. నా కర్తవ్యం కూడ తీరిపోయింది. ఇక ఈ ప్రాణాన్ని కాపాడుకోవలసిన అవసరం నాకు లేదు. తమకు ఇష్టమైతే ఇంకాసేపు యుద్ధకాండ కొనసాగించవచ్చు!” అన్నాడు.

“ఆహా! మీకేం బదులివ్వను? మీప్రాణం గురించి మీకిక దిగులు లేదు. ఆ దిగులు ఇక నాది. లేకపోతే రేపు యువరాకుమారికి నేనేం బదులివ్వను? మిత్రమా! ఇప్పుడు నేను చదివిన తాళపత్ర సందేశం నా అక్కగారి స్వహస్తంతోనే రాయబడినట్లుంది. దాన్ని ఆమె స్వయంగా మీకిచ్చారా?” అని అడిగారు యువరాజు.

“అవును, యువరాజా! యువరాకుమారి దివ్య హస్తాలనుంచి స్వయంగా ఈ తాళపత్రాన్ని స్వీకరించే భాగ్యం నాకు లభించింది. తర్వాత రాత్రింబగళ్ళు ఎక్కడా ఆగక ప్రయాణం చేసి వచ్చాను" అన్నాడు వంతిదేవుడు.

“అది స్పష్టంగా తెలుస్తూంది. లేకపోతే ఇక్కడికి ఇంత త్వరగా రా సాధ్యమా? ఇటువంటి అరుదైన సహాయం చేసిన మీకు ఏం ప్రత్యుపకారం చేయబోతున్నాను?” అని చెప్పి యువరాజు వంతిదేవుని హృదయానికి హత్తుకొన్నారు. అప్పుడు వంతిదేవుడు స్వర్గలోకాన్నే చూశాడు. అతని ఒంటి నొప్పులన్నీ ఎగిరిపోయాయి.

~~~
~~~

# అధ్యాయము - 31

## "ఏలేల సింగన్" ఆట

**అడవి** మధ్య ఉన్న ఒక కొలను చుట్టూ ఎత్తుగా వలయాకారంలో పెరిగివున్న చెట్ల మధ్య ఉన్న బయలు ప్రదేశంలో సుమారు వేయిమంది చోళవీరులు గుడారాలు వేసుకొని విడిదిచేసివున్నారు. వారి భోజనం కోసం పెద్ద రాతి పొయ్యిలమీద బ్రహ్మాండమైన గంగాళాలలో అన్నం ఉడుకుతోంది. కుండల్లోను, అండాల్లోను వివిధ ఆహార పదార్థాలు వండబడుతున్నాయి. వాటినుంచి వెలువడుతున్న సువాసనలు వీరుల నోరూరజేస్తున్నాయి. భోజనం సిద్ధమయ్యేవరకు పొద్దు పుచ్చేందుకు ఆటపాటలు మొదలయ్యాయి. ఇంతలో వారి మనసులను చూరగొన్న యువరాజే అక్కడికి వేంచేయడంతో వారి ఉత్సాహం ఎల్లలు దాటింది. వారి విడిది ఎల్లల కాపలా దండు దళపతి చాల శ్రమపడి వారందరిని బుద్ధిగా మసలుకొనేటట్లు చేశారు. అందరినీ శాంతంగా అర్ధ వర్తులాకారంలో కూర్చొండజేశారు.

ఒక మహావృక్షాన్ని కొట్టి, దాని కాండం మాత్రం నేలకు కాస్త పైవరకు వదిలిపెట్టి ఉంచారు. యువరాజు వచ్చి ఆ వృక్షకాండసింహాసనం పైన కూర్చొన్నారు. ఇప్పుడాయన ఏనుగు మావటి వేషంలో లేరు. శిరస్సున స్వర్ణకిరీటం, భుజకీర్తులు, వక్షస్సున ముత్యాలమాల, నడుము చుట్టూ పట్టుపీతాంబరం ధరించివున్నారు. ఆయన చుట్టూ దళపతి, వంతిదేవుడు, ఆళ్వార్ కట్టియాన్ కూర్చొన్నారు.

యువరాజును ఆనందింపజేసేందుకు ఏర్పాటు చేయబడిన 'ఏలేల సింగన్' ఆట మొదలైంది.

ఇప్పుడు చోళవీరులు లంకలో చాలభాగం కైవసం చేసుకొన్నట్లు వెయ్యేళ్లకు మునుపు కూడ తమిళవీరులు లంకను కైవసం చేసుకొన్నారు. అప్పుడు ఆ తమిళవీరుల నాయకుడుగా విరాజిల్లినవాడు ఏలేల సింగన్. లంకరాజు అతని చేత తరిమివేయబడి కొంతకాలం కొండగుహల్లో దాక్కొన్నాడు. అతడి బాలకుమారుని పేరు దుష్టగమను. వీడు మాచెడ్డ వీరుడు. లంకారాజ్యాన్ని మళ్ళీ ఏలేల సింగన్ చేతినుంచి కైవసం చేసుకోవాలని చాలకాలం నుంచి కలగంటున్నాడు. ఆవీరుడు చిరుప్రాయంలో ఉన్నప్పుడు ఒకరోజు పడకలో చేతులను, కాళ్లను మడిచి పెట్టుకొని ముణగదీసుకొని పడుకొనివున్నాడు. అప్పుడతని తల్లి, "బిడ్డా! ఎందుకు నీవే నిన్నిలా కుంచించుకొని/కుదించుకొని పడుకొన్నావు? ధారాళంగా కాళ్ళు చేతులు చాచుకొని పడుకోవచ్చు కదా?" అని అడిగింది. అందుకు దుష్టగమను. "తల్లీ! నన్ను ఒకవైపు తమిళవీరులు నొక్కుతున్నారు. ఇంకొకవైపు కడలి అదుముతోంది. నేనేం చేయను? అందుకే ఒంటిని కుంచించుకొని పడుకొన్నాను!" అన్నాడు. అటువంటి బాలవీరుడు యుక్తవయసు వచ్చినప్పుడు సైన్యాన్ని కూడదీసుకొని ఏలేల సింగన్ పైన దండెత్తివెళ్ళాడు. అతను తీసుకొని వెళ్ళిన దండు ఛిన్నాభిన్నమై చెదరిపోయారు. అప్పుడు దుష్టగమను ఒక యుక్తి పన్నాడు. ఏలేల సింగన్ ఉన్నచోటికి వెళ్ళి,

అతనికెదురుగా నిలబడి, "రాజా! తమ పెద్దసైన్యం ముందు నా చిన్న సైన్యం నిలబడలేక చెదరి పారిపోయింది. నేనొక్కడినే మిగిలాను. తమరు శుద్ధవీరకులంలో పుట్టినవారు. కాబట్టి ఒంటరిగా నిలబడి ద్వంద్వ యుద్ధం చేసేందుకు ఆహ్వానిస్తున్నాను. ఇద్దరిలో ఎవరు గెలిస్తే వారికే లంకారాజ్యం దక్కుతుంది. ఓడిపోయినవారికి వీర స్వర్గం దొరుకుతుంది!" అన్నాడు.

దుష్టగమను తెగింపును, వీరత్వాన్ని చూసి ఏలేల సింగన్ ఆశ్చర్యపోయాడు. కాబట్టి ద్వంద్వయుద్ధానికి ఒప్పుకొన్నాడు. మధ్య వచ్చి అడ్డగించవద్దని తన వీరులకు ఆజ్ఞ వేశాడు. ద్వంద్వ యుద్ధం ప్రారంభమైంది. ఈ సంగతి తెలిసి చెదరి పారిపోయిన దుష్టగమను వీరులు కూడ తిరిగి వచ్చి చేరారు. అందరూ ద్వంద్వయుద్ధాన్ని రెప్పవేయకుండ చూడసాగారు. పోరు చాలసేపు సాగింది. దుష్టగమనేమో తన జన్మహక్కును తిరిగి పొందాలనే ఆక్రోశం, ఉక్రోషాలతో పోరాడసాగాడు. ఏలేల సింగన్ ఆ యువకుని పైని జాలి వల్ల పూర్తి బలాన్ని ప్రయోగించి పోరాడడం లేదు. కాబట్టి చివరికి ఏలేల సింగన్ మరణించాడు. దుష్టగమను పట్టం కట్టుకొన్న వెంటనే ఏలేల సింగన్ మరణించిన చోట పళ్ళిప్పడై (వీరాలయం) కట్టించి, అతని వీరత్వాన్ని దయాగుణాన్ని పొగిడి వ్యాపింపజేశాడు.

~

ఈ అపూర్వ చరిత్రాంశాన్ని చోళవీరులు యువరాజు అరుళ్మొళి వర్మ ముందు నాటకరూపంలో నటించి చూపారు. ఏలేల సింగన్ అసువులు బాసిన దృశ్యంలో నటించిన్ వీరుడు నిజంగానే చనిపోయాడా అనిపించేటట్లు నటించాడు. చూస్తున్న యువరాజు, తక్కిన వారు కూడ తరచూ 'ఆహా!' 'ఓహో!' అని ఘోషిస్తూ వారిని ఉత్సాహపరిచారు.

నాటకం జరుగుతున్నప్పుడు ఒకసారి యువరాజు ఆళ్వార్ కట్టియాన్ని చూసి, "తిరుమలై! తంబళై గుహాలయంలో దుష్టగమనుకు, ఏలేల సింగనికి మధ్య జరిగిన ద్వంద్వ యుద్ధాన్ని చెరగని చిత్రరూపంలో చిత్రీకరించారు. దాన్ని మీరు చూశారా?" అని అడిగారు.

"లేదయ్యా! తంబళ్ళై వీధుల్లో వస్తున్నప్పుడే మిమ్మల్ని చూసేశాను. కాబట్టి గుహకు వెళ్ళేందుకు తీరిక దొరకలేదు" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

"ఆహా! ఆ గుహల్లో ఉన్న శిల్పాలను కూడ చూడాలి! తిరుమలై! మన దివ్య తమిళనాడులో ఎన్నో శిల్పచిత్రాలున్నాయి. కానీ వాటిని మించిన మహత్తైన అద్భుతాలు ఈ దీవిలో ఉన్నాయి!" అన్నారు యువరాజు.

"యువరాజా! ఈ దేశంలోని శిల్పచిత్రాలెక్కడికీ పారిపోవు. వాటినెప్పుడైనా చూడవచ్చు. కానీ తమ దర్శనం దొరకడం అలా కాదు కద? మంచి సమయానికి మేము వచ్చాము. కాబట్టి మిమ్మల్ని చూడగలిగాము! మాకన్న ముందు ఇక్కడికి వచ్చిన పార్థిబేంద్ర పల్లవుడు మిమ్మల్ని వెతికేసి 'ఇక్కడ లేదు' అని తిరిగి వెళుతుండగా మేమతన్ని దారిలో చూశాము" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

"అవును; నా అన్నగారి ప్రియమిత్రుడు వచ్చి వెతికేసి వెళ్ళినట్లు దళపతికూడ చెప్పారు. ఆయన ఎందుకు వచ్చాడని ఊహించి చెప్పగలవా?"

"నిశ్చయంగానే చెప్పగలను. తమను కంచికి పిలుచుకొని రమ్మని ఆదిత్య కరికాలన్ ఆయనను ఇక్కడికి పంపించారు."

"అరెరె! నీకది తెలుసా? మరి నీ స్నేహితుడు ఇంత జాగ్రత్తగా తీసుకొని వచ్చిన ఈ తాళపత్రంలో ఏం రాసివుందో అది కూడ నీకు తెలుసా?"

"తమను వెంటనే పళైయారై వచ్చి చేరమని తమ అక్కగారు రాసిపంపారు. యువరాజా! కుందవైదేవి అంతరంగంగా ఈ తాళపత్రాన్ని రాసి మన వాణర్ కులవీరునికి ఇచ్చినప్పుడు పక్కనున్న లతామంటపంలో దాక్కొని నేను గమనించాను..."

తిరుమలై వెనుక నిలబడివున్న వంతిదేవుడు అతడి వీపును గట్టిగా గిల్లాడు.

ఆళ్వార్ కట్టియాన్ తన వీపును గట్టిగా చరుచుకొని, "ఇది చాల చెడ్డ అడవి; రాత్రి సమయంలో కూడ తుమ్మెదలు కరుస్తున్నాయి!" అన్నాడు.

యువరాజు కాస్త కోపంతో, "ఛఛ! నా ప్రియ సహోదరి విషయంలో కూడ నీవు నీ గూఢచారి బుద్ధిని వదులుకోలేదు కద?" అన్నారు.

"అది తెలుసుకొన్నాను కాబట్టే వీడిని ఇంత భద్రంగా ఇక్కడికి తీసుకొని వచ్చి చేర్చగలిగాను. యువరాజా! వీడు దారి పొడుగునా ఇక్కట్లలో చిక్కుకోకుండ కాపాడుతూ వచ్చేందుకు నేను పడ్డ పాట్లు ఆ బుద్ధ భగవానునికే తెలుసు. అనురాధపురంగుండా వచ్చివుంటే వీడు తప్పక ఇక్కడికి చేరేవాడు కాదు. దారిలో ఎవరితోనైన దెబ్బలాటకు దిగి చచ్చివుండేవాడు. అందుకే అడవిదారిన తీసుకొని వచ్చాను. అక్కడకూడ వీడు ఒక మదపుటేనుగుతో యుద్ధానికి దిగజూశాడు. నా చేతి బడితెతో దాన్ని సంహరించి వీడిని క్షేమంగా తీసుకొని వచ్చాను!" అన్నాడు.

"ఓహో! ఇతన్ని నా దగ్గరకు భద్రంగా తీసుకొని వచ్చి చేర్చేందుకే నీవు లంకకు వచ్చావా, ఏమి?"

"లేదయ్యా! నావంతుకు నేను కూడ మీకొక సమాచారాన్ని తీసుకొని వచ్చాను."

"అదేమి? త్వరగా చెప్పు!" అన్నారు యువరాజు.

"ముఖ్యమంత్రి అనిరుద్ధులు మీరు ఇంకొంతకాలం లంకలోనే ఉండడం ఉచితం అని చెప్పిపంపారు."

"ఇలా ముగ్గురు పెద్దలు మూడు విధాలు సందేశం పంపితే నేను దేన్ని వినాలి/పాటించాలి?" అన్నారు అరుళ్మొళి వర్మ.

అప్పుడు వంతిదేవుడు కలగజేసుకొని, "యువరాజా! మన్నించాలి! తమరు వినవలసింది

తమ అక్కగారి మాటనే!" అన్నాడు.

"ఎందుకలా చెబుతున్నారు?"

"ఎందుకంటే తమ అక్కగారి మాటకే విలువివ్వాలని తమ హృదయం చెబుతోంది. అలా ఒకవేళ మీరు ఆమె మాట వినకపోయినా, నేను విని తీరాలి. తమను ఎలాగైన పిలుచుకొని రమ్మని నన్ను ఆజ్ఞాపించారు" అన్నాడు వంతిదేవుడు.

యువరాజు వంతిదేవుని తేరిపారజూసి, "ఇటువంటి వీర స్నేహితుడు దొరకాలని నేను ఎన్నాళ్ళుగానో తపస్సు చేస్తున్నాను!" అన్నారు.

~~~
~~~

# అధ్యాయము - ౩ 2

# కిల్లి వలవన్ ఏనుగు

**ఆట** ముగిసేందుకు, వంట సిద్ధం కావడానికి సరిగ్గా కుదిరింది. కట్టలు కట్టలుగా తామరాకులు తెచ్చి ఆ వీరుల ముందు విస్తరాకులుగా పరిచారు. తర్వాత పొంగల్, పరమాన్నం తీసుకొని వచ్చి వడ్డించారు.

వీరులు భుజించనారంభించిన తర్వాత యువరాజు పంక్తుల వెంబడి వెళుతూ వారిని విచారిస్తూ వచ్చారు. అక్కడక్కడ ఆగి వారి ఆరోగ్యం గురించి విచారించారు. వారి ఊరూ, పేరూ విచారించారు. అలా విచారించబడ్డవారు ఆనంద సముద్రంలో తేలియాడారు.

అప్పటికే చోళదేశపు వీరులు యువరాజుపైన ఎనలేని అభిమానం గొనివున్నారు. ఇటీవల ఆ అభిమానం పదిరెట్లు పెరిగింది. మాతృదేశం నుంచి తమకు కావలసిన ఆహార పదార్థాలను రప్పించేందుకు ఆయన పెద్ద ప్రయత్నాలు చేశారని, చేస్తున్నారని వారెరుగుదురు. దానికి తోడు సాధారణ యుద్ధవీరులతో సమంగా కలివిడిగా మసలుతూ వారి యోగక్షేమాలను విచారించడం వారికి మరింత ఉత్సాహాన్నిచ్చింది. అటువంటి సంపన్న/గొప్ప/ఉత్కృష్ట గుణాలే ఆయనను వారి ప్రీతికి మరింత పాత్రుడిని చేశాయి.

కాబట్టి వీరులు యువరాజును అక్కడక్కడే నిలపజూశారు. ధైర్యంచేసి ఆయన్ను ఏదైనా ప్రశ్నలడిగారు. ముఖ్యంగా పలువురు వీరులు ఆయన్ను అడిగిన ప్రశ్న, "పులత్తియ నగరం మీద దండెత్తేదెప్పుడు?" అన్నదే. అందుకు బదులుగా యువరాజు, "పులత్తియ నగరంపైన దండెత్తి ఏం ప్రయోజనం? మహీంద్రుడు రోహణ నగరానికి కద పారిపోయాడు?" అని కొందరికి చెప్పారు. "కాస్త ఓపిక పట్టండి. వర్షఋతువు దాటనీ" అని ఇంకొందరికి చెప్పారు. యుద్ధం చేయకుండ సోమరితనంగా పడివుండడం గురించిన అసంతృప్తిని కొందరు వెల్లడించారు. ఇంకొందరు, "మీరు నెలకొకసారైన ఇలా వచ్చి మమ్మల్ని చూసి వెళితే మేము ఓపికగా ఉంటాము" అన్నారు.

~

పంక్తి పరామర్శ ముగిసిన తర్వాత యువరాజు వారికోసం ఏర్పాటు చేసిన సైన్య శిబిరానికి వెళ్ళారు. వంతిదేవుని, ఆళ్వార్ కట్టియాన్ని తమతో తీసుకొని వెళ్ళారు.

"ఈ వీరుల ఉత్సాహాన్ని చూశారు కద? తంజావూరునుంచి తగిన సహకారం లభించివుంటే, ఇప్పటికి ఈ లంకాద్వీపం పూర్తిగా మనవశమై ఉండేది. మంచి అవకాశం వృధాగా చేజారిపోయింది. ఈ వానాకాలంలో యుద్ధం చేయలేము. ఇంకా మూడు, నాలుగు నెలలు మన వీరులు ఊరకుండవలసిందే!" అన్నారు.

ఇది విన్న ఆళ్వార్ కట్టియాన్, "యువరాజా! ఇందుగురించి మీరు దిగులు పడడం నాకు చాల ఆశ్చర్యంగా ఉంది. అక్కడేమో చోళ సామ్రాజ్యానికే పెద్ద ముప్పు రాబోతూంది! విజయాలయ వర్మ స్థాపించిన రాజ్యం, పరాంతకుల వల్లను, సుందరచోళ చక్రవర్తి వల్లను విస్తరింపబడ్డ సామ్రాజ్యం అంతర్గత అపాయాల వల్ల ఛిన్నాభిన్నం కాబోతూంది!" అన్నాడు.

"అవునవును! మీరిద్దరూ చాల ముఖ్యమైన సమాచారాన్ని తీసుకొని వచ్చారు. నేనేమో ఈ చిన్న నిరాశను వెలిబుచ్చుతున్నాను. మంచిది; ఇప్పుడు మీరు చెప్పవలసిందంతా వివరంగా చెప్పండి. ముందు మీరు ఆరంభించండి!" అని యువరాజు వంతిదేవుని సూచించారు.

~

వంతిదేవుడు వెంటనే తన కథను చెప్పనారంభించాడు. కంచి నుంచి తాను బయలుదేరినప్పటినుంచి తాను చూసినవి, విన్నవి అన్నీ వివరంగా చెప్పాడు. పలు అపాయాలనుంచి తప్పుకోవడానికి తాను చేసిన సాహస కృత్యాల గురించి ఎక్కువగా చెప్పుకోవడం ఇష్టం లేనివాడిలాగ కనబడుతూనే, తన ప్రతాపాలను చెప్పుకొన్నాడు. చివరిగా, "అయ్యా! తమ తండ్రిగారిని చెరలో ఉంచినట్లు పెట్టివున్నారు. దగ్గరి బంధువులు, పెద్ద అధికారులు, సామంత రాజులు కూడబలుక్కొని కుట్ర పన్నుతున్నారు. దీనంతటివల్ల తమ సహోదరి పెద్ద దిగులులో మునిగిపోయివున్నారు. కాబట్టి మీరు వెంటనే బయలుదేరి నాతో పళైయారైకి రావాలి. ఒక్క క్షణం కూడ ఆలస్యం చేయకూడదు!" అని చెప్పి ముగించాడు.

తర్వాత ఆళ్వార్ కట్టియాన్ తన వృత్తాంతాన్ని చెప్పాడు. తర్వాత వంతిదేవుడు చెప్పినవన్నింటినీ ఆమోదించాడు. దానితోబాటు తిరుప్పురంపయం పళ్ళిప్పడై (వీరాలయం) వద్ద నడిరాత్రి హంతకులు కొందరు పన్నిన కుట్రను గురించి కూడ చెప్పాడు. చోళదేశం పరిస్థితి ఇంత అపాయంలో ఉండడం వల్ల యువరాజు ప్రస్తుతం అక్కడికి రాకుండడమే మంచిదని ముఖ్యమంత్రి అనిరుద్ధులు చెప్పి పంపించిన సందేశాన్ని మళ్లీ నొక్కి వక్కాణించాడు.

"తమరు చోళదేశానికి తిరిగి రాకుండడమే కాదు; ఇక్కడ కూడ దండయాత్రలను కొనసాగించకుండాలని ముఖ్యమంత్రి అడుగుతున్నారు. సైన్యాలన్నిటినీ కూడదీసుకొని ఉత్తర లంకకు చేరుకోవాలని కూడ కోరుతున్నారు. కుట్రదారులు త్వరలోనే బయటపడి తమ నిజస్వరూపాన్ని చూపిస్తారు. అప్పుడు లంకలో ఉన్న తమసైన్యం చాల ఉపయోగపడుతుందని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. పాండ్యదేశంలో ప్రస్తుతమున్న కైక్కోళర్ దండు, పణ్ణియర్ దండు, వేళాళర్ దండు - ఈ మూడు సైన్యాలు యువరాజు కోసం తమ తను, మన, ప్రాణాలను అర్పించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ విషయాన్ని కూడ తమకు తెలియజేయమని ముఖ్యమంత్రి ఆజ్ఞాపించారు!" అన్నాడు ఆళ్వార కట్టియాన్.

"తిరుమలై! తమ గురువుగారు ఏమనుకొంటున్నారు తమ గురించి? పాటలీ పుత్రపు

చాణక్యులనుకొంటున్నారా? నా బంధువులు, తోబుట్టువులతో నేను యుద్ధానికి దిగాలంటున్నారా?" అని యువరాజు కోపంగా అడిగారు.

"లేదయ్యా! ఆ అర్థంతో చెప్పలేదు. కానీ, చక్రవర్తికి విరుద్ధంగా కుట్ర పన్నుతున్నవారిని - చోళసామ్రాజ్యానికి ద్రోహం చేయబూనుతున్నవారిని - సమయం చూసి దండించాలి అంటున్నారు. అందుకు సహాయం చేయడం తమ కర్తవ్యం కదా?" అన్నాడు తిరుమలై.

"అందుకు నేనెలా అధికారినౌతాను? కుట్ర జరుగుతున్నది నిజమైతే అందుకు తగిన ప్రతిచర్య తీసుకోవలసింది చక్రవర్తి కదా? నా తండ్రి ఆజ్ఞ లేనిదే నేనెలా ఈ కార్యంలో పాల్గొనగలను?" అన్నారు యువరాజు.

అప్పుడు వంతిదేవుడు కలగజేసుకొని, "యువరాజా! మీ తండ్రి ఇప్పుడు తమ స్వాధీనంలో లేరు. పళువేట్టరయ్యర్లు వారిని చెరలో ఉంచినట్లు ఉంచారు. ఎవరూ దగ్గరికి రాలేనట్లు అంతఃపురంలో పెట్టివున్నారు. తమ అన్నగారేమో తంజావూరుకు రానని శపథం పట్టారు. ఈ పరిస్థితిలో సామ్రాజ్యాన్ని కాపాడడం తమ కర్తవ్యం కదా? వెంటనే పళైయారైకి రావడం తమ కర్తవ్యం కదా?" అన్నాడు.

"యువరాజు పళైయారైకి రావలసిన అవసరమేమి? అదే నాకర్థం కావడం లేదు!" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

యువరాజు కాసేపు దీర్ఘంగా ఆలోచించిన తర్వాత, "రాజ్యకాంక్ష చాల చెడ్డది. రాజ్యం పైన ఆశవల్ల ఈ లోకంలో ఏమేమి పాపాలు జరుగుతున్నాయి? ఈరోజు సింహగిరి కోటకు వెళ్ళి వచ్చాను కదా? ఆకోట వృత్తాంతం మీకు తెలుసా?" అన్నారు.

"నేను వినలేదు" అన్నాడు వంతిదేవుడు.

"చెబుతాను వినండి! సుమారు ఐదు వందలేళ్లకు మునుపు ఈ లంకారాజ్యాన్ని ధాతుసేనుడు అనే రాజు పరిపాలించేవాడు. అతనికి ఇద్దరు కుమారులుండేవారు. ఒకని పేరు కాశియవన్; రెండవవాడి పేరు మగల్లన్. ధాతుసేనుని సేనాధిపతి, కాశియవన్ కూడబలుక్కొని కుట్ర పన్నారు. కాశియవన్ తన సొంత తండ్రినే చెరసాలలో బంధించి సింహాసనమెక్కాడు. మగల్లన్ సముద్రం దాటి తమిళనాడుకు పారిపోయాడు. కొన్నాళ్ల తర్వాత ధాతుసేనుని చెరసాల చుట్టూ గోడ కట్టించి అతన్ని చెరసాలలోనే చంపేశారు. ఈ క్రూర పాపాన్ని చేసిన కాశియవన్కి తన సహోదరుడైన మగల్లన్ తిరిగి వచ్చి తన మీద పగతీర్చుకొంటాడనే భయం పట్టుకొంది. అందుకని ఈ సింహగిరి కొండకు వచ్చాడు. దీని శిఖరంపైన కోట కట్టుకొని అందులో వసించసాగాడు. నిటారుగా ఉన్న కొండగాబట్టి పగవారెవ్వరూ అంద సులభంగా పైకెక్కి రాలేరనుకొన్నాడు. ఇలా పద్దెనిమిది సంవత్సరాలపాటు దాక్కొని బతికాడు. చివరికి ఒకరోజు మగల్లన్ పాండ్యరాజును తోడుతీసుకొని వచ్చాడు. సింహగిరి కోటను సమీపించాడు. అది చూసి కాశియవన్ బెంబేలెత్తిపోయాడు. అంతకాలం కోటలో దాక్కొని బతికినవాడు మొండి ధైర్యంతో బయటకు వచ్చి పోరాడి

చచ్చాడు! అటువంటి పాతకుడు - తండ్రిని చంపిన పాపి - కట్టిన కోటలోపల కొన్ని అద్భుతమైన వర్ణ చిత్రాలున్నాయి. ఈరోజు చైనా యాత్రికులతో వెళ్ళినప్పుడు చూశాను. అహ్! ఆ చిత్రాల సౌందర్యాన్ని ఏమని వర్ణించను? అనేక వందల సంవత్సరాల క్రితం చిత్రించబడినవి. కానీ ఇప్పటికీ ఏమాత్రం చెక్కు చెదరకుండ నవనూతనంగా ఉన్నాయి..."

"అయ్యా! నేనొక ప్రశ్న అడగవచ్చా?" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

"ధారాళంగా అడగవచ్చు."

"సింహగిరి కోట ఇంకా పగవారి అధీనంలోనే కద ఉంది?" అని అడిగాడు ఆళ్వార్ కట్టియాన్.

"అవును; దాన్నిప్పుడు కైవసం చేసుకొనే ప్రయత్నం చేస్తే వృధాగా విపరీత ప్రాణ నష్టం కలుగుతుంది..."

"దాన్ని గురించి నేనడగడం లేదయ్యా! పగవారి కోటలోపల మీరు ప్రవేశించడం ఉచితమా అని అడుగుతున్నాను. చైనా యాత్రికులకు ఏనుగు మావటిగా మీరు వెళ్ళవలసిన అగత్యం ఏం వచ్చింది? ఏనుగు మెడమీద మిమ్మల్ని చూడగానే నాకళ్ళను నేనే నమ్మలేకపోయాను. మీ తీరైన కనుబొమలను చూసిన తర్వాత నా సందేహం తీరిపోయింది. మీరటువంటి ప్రాణాపాయాలను కొనితెచ్చుకోవచ్చా?"

"నా ప్రాణం మాత్రం అంత విలువైనదా, తిరుమలై? ఈ లంకకు వచ్చి ఎంతమంది చోళదేశపు వీరులు ప్రాణాలర్పించారు?"

"వారు యుద్ధరంగంలో అసువులు బాసారు. మీరు అనవసరంగా మిమ్మల్ని అపాయానికి గురి చేసుకొన్నారు!"

"అనవసరం కాదు; రెండు కారణాల వల్ల అలా చేశాను - సింహగిరి చిత్రాలను చూడాలని నాకు ఎప్పటినుంచో కోరికవుండేది. అది ఈరోజు నెరవేరింది..."

"యువరాజా! రెండవ కారణం?"

"పార్థిబేంద్ర పల్లవుడు త్రికోణమలైకి వచ్చి దిగిన వెంటనే, నాకు సమాచారం అందింది. నాకీరోజు ఆయనను చూడాలనిపించలేదు. ఎందుకంటే..."

"ఎందుకంటే..."

"మామిడితోపుకు ముఖ్యమంత్రి వచ్చి దిగారని కూడ నాకు తెలిసింది. ఇద్దరు పెద్దలనుంచి సందేశం వస్తే మొదట ఏది అందుతుందో దాని ప్రకారమే కద నేను నడుచుకోవాలి?"

"ఆహా! అలా చెప్పండి! నా పక్షమే గెలిచింది!" అన్నాడు వంతిదేవుడు కుతూహలంగా.

"రాజా! వీడు మమ్మల్ని తంత్రంతో ఏమార్చేశాడు..."

"లేదు; అతను నన్ను ఏమార్చలేదు. నేనే మోసపోయాను. నన్ను తీసుకొని వచ్చేందుకు ఏర్పాటు చేసిన వీరుని గుర్రంపైనుంచి తోసేసి ఆ గుర్రంపైన తానెక్కి రావడాన్ని నేను గమనించాను. ఇతనికి

నేనొక పాఠం నేర్పాలనుకొంటున్నాను..."

"భలే పాఠం నేర్పుతారు! ఒక్కొక్క పాఠమూ ఒక్కొక్క వీసెడుంది. ఇప్పటికీ తలుచుకొంటే నా వీపు, ఛాతీ నొప్పెడుతున్నాయి! సందేశం తీసుకొని వచ్చిన దూతను ఇలాగేనా స్వాగతించడం? పోతే పోనీ. మీరు గనక నాతోబాటు పళైయారైకి వచ్చేటట్లయితే..."

"నాకొక పాతపాట గుర్తుకొస్తోంది! తిరుమలై! నా పూర్వీకులలో పెరుంగిళ్ళి వలవన్ అని ఒక రాజుండేవాడు. ఆయన దగ్గర ఒక విచిత్రమైన ఏనుగుండేది. దాని ఒక కాలు కంచిలో ఉండగా, ఇంకొక కాలు తంజావూరును తొక్కుతుండేది; మూడోకాలు ఈ లంకను తొక్కేది; నాలుగోది ఉరైయూరులో ఊని స్థిరంగా ఉండేది.

<< ఆ కుతూహలమైన పాటను అనువదించవలసి ఉంది >>

అని అద్భుతమైన కల్పనాశక్తితో పాడారొక కవి. ఈ లంకలో మందలు మందలుగా వేలకొద్దీ ఏనుగులున్నాయి. ఉండి ఏం ప్రయోజనం? కవీశ్వరులు కల్పించి చెప్పిన ఏనుగులాంటిది ఒక్కటున్నా నేను ఒకేసారి కంచిలోను, పళైయారైలోను, మదురైలోను, లంకలోను ఉండవచ్చు కద?"

కవి కల్పించిన ఏనుగు గురించి విన్నవెంటనే వంతిదేవుడు, ఆళ్వార్ కట్టియాన్ పడీ పడీ నవ్వారు.

"అటువంటి ఏనుగు లేదు కద? మీరేం చేయబోతున్నారు?" అని అడిగాడు ఆళ్వార్ కట్టియాన్.

"పళైయారైకి రావడమని తీర్మానించడమైంది కద?" అన్నాడు వంతిదేవుడు.

"మీ వివాదాన్ని కాస్త ఆపండి. రేపు అనురాధపురానికి వెళదాం. అక్కడ పార్థిబేంద్ర పల్లవుని నేనెలాగూ కలవాలి. ఆయన చెప్పేది విన్న తర్వాత తీర్మానించాలి" అన్నారు యువరాజు.

~~~
~~~

# అధ్యాయము - 33

## శిల్పం చెప్పిన సందేశం

**మరునాడు** సూర్యోదయానికి మునుపే అరుళ్మొళి వర్మ, ఆళ్వార్ కట్టియాన్, వంతిదేవుడు అనురాధపురానికి బయల్దేరారు. కాస్త దూరం అడవిబాటలో ప్రయాణించిన తర్వాత రాజబాటెక్కారు. యువరాజు తక్కిన వీరులెవ్వరినీ తన వ్యక్తిగత భద్రత కోసం వెంట తీసుకొని రాకపోవడం వంతిదేవునికి చాల ఆశ్చర్యం కలిగించింది. ప్రాతఃకాలంలో ఇరువైపులా దట్టమైన చెట్లున్న ఆ రాజబాట వెంబడి ప్రయాణించడమే ఒక ఆనందానుభవం. పళైయార్తై యువరాకుమారి తనకు ఒప్పజెప్పిన కార్యాన్ని తాను నెరవేర్చేశానన్న పెద్ద సంతృప్త భావం అతని హృదయంలో పొంగుతూంది. అది మాత్రమా? ఎన్నో ఏళ్ళుగా అతని హృదయంలో పొంగుతూన్న కోరిక కూడ ఇప్పుడు నెరవేరింది. చోళనాడు ముద్దుల కొడుకును చూడడం కూడ నెరవేరింది. దేశప్రజలు ఏ వీరకుమారుని వీర ప్రతాపాలను, మహోన్నత గుణాలను వేనోళ్ళ పొగడుతున్నారో - ఆ రాజకుమారుని కలవడమైంది. ఆ కలయిక ఎంత విచిత్రమైంది/అపూర్వమైంది? - అరుళ్మొళి వర్మ ఒక విచిత్రమైన వ్యక్తి అని తాను విన్నది నిజమే! ఉన్నట్లుండి గుర్రాన్ని వెనక్కు తిప్పి, తనను అటకాయించి ఉక్కిరిబిక్కిరి చేసేశారు కద? ఆయన సేనకు నాయకత్వం వహించి వెళ్ళిన చోటల్లా గెలుపు మీద గెలుపు పొందుతుండడంలోని రహస్యం కూడ ఇదేనేమో! పగవారు ఎదురుచూడని చోట, ఎదురుచూడని సమయాన ముట్టడించడమే ఈయన ప్రత్యేకత కాబోలు! కానీ ఈయనకు వచ్చి చేరుతున్న నిరంతర విజయాలకు కారణం ఇది మాత్రమేనా? సేన వీరులతో ఈయన ఎంత హుందాగా నడుచుకొంటారు? ఎలా తమ అభిమానానికి వశపరిచి ఉంచుకొంటున్నారు?

యుద్ధవీరులు మాత్రమేనా? తాము జయించిన దేశప్రజలను కూడ ఎలా ఆకట్టుకొంటున్నారు? ఇటీవల మహాయుద్ధం జరిగిన నాడు ఇదని చెప్పగలమా? వీధుల్లో ప్రజలు ఎంత ఉల్లాసంగా తిరుగాడుతున్నారు? ఇరువైపుల ఉన్న గ్రామాలలో ప్రజలు ఎంత నిర్భయంగా, దిగులు లేకుండ తమ తమ పనులను చేసుకొంటున్నారు? ప్రజల ముఖాలలో భీతిగాని, దుఃఖంగాని ఛాయామాత్రంగానైన కనిపించడంలేదు కద? పిల్లలు, ఆడవాళ్ళు గలగల నవ్వే శబ్దం కూడ అప్పుడప్పుడు వినిపిస్తూంది కద? ఇదేమి వింత? ఈయన ఎంత విచిత్రమైన మనిషి? - 'జయించిన నాడు నుంచి ఆహార పదార్థాలు తీసుకోకూడదు' అని హఠం పట్టి చోళదేశం నుంచే సైన్యాలకు కావలసిన ఆహారధాన్యాలను రప్పించాలని చెప్పడమూ, అందుగురించి పళువేట్టరయ్యర్లకు ఏర్పడ్డ కోపమూ, వారు సుందరచోళ చక్రవర్తికి పుకార్లు చెప్పడమూ - ఇవన్నీ వంతిదేవునికి గుర్తుకొచ్చాయి. ఆదిత్య కరికాలన్ క్రూర యుద్ధ కృత్యాలను,

అరుళ్మొళి వర్మ దయాగుణం నిండిన యుద్ధ ధర్మాన్ని పోల్చి చూసుకొన్నాడు. ఆదిత్య కరికాలన్ గురించి ఏవిధమైన కొరత చెప్పడమూ అతనికిష్టమయ్యేది కాదు. కానీ అనురాధపురానికి వెళ్ళే దారికిరువైపుల వసిస్తున్న గ్రామస్థుల విప్పారిన ముఖాలను చూసినప్పుడల్లా అలా పోల్చుకోకుండ ఉండలేకపోతున్నాడు. అమ్మమ్మ! కరికాలన్ యుద్ధం చేసి వెనుదిరిగిన చోట ఇటువంటి దృశ్యం చూడగలమా? ఎక్కడ చూసినా భీభత్సం, ఏడ్చే గొంతులే కద?

ఇటువంటి అపూర్వమైన గుణాలు కలిగిన యువరాజుతో ఎన్నో విషయాల గురించి మాట్లాడాలని, ఎన్నెన్నో కార్యాల గురించి అడగాలని వంతిదేవుని మనసు తహతహలాడింది. గుర్రాలపైనెక్కి అతివేగంగా వెళుతున్నప్పుడు మాట్లాడేందుకు అవకాశమెక్కడ? - అవును, మాట్లాడేందుకు వారికి ఒకే ఒక సందర్భం దొరికింది.

~

అనురాధపురం పొలిమేరలు సమీపిస్తున్నప్పుడు దారికి ఒక పక్కగా బుద్ధ  భగవానుని పెద్ద విగ్రహమొకటి వంతిదేవునికి కనిపించింది. ఇటువంటి శిల్పాలు లంకలో అనేక చోట్ల ఉండడం వల్ల వంతిదేవుడు ఆ శిల్పంమీద అంతగా ఆసక్తి కనబరచలేదు. కానీ పొన్నియిన్ సెల్వన్ ఆ శిల్పాన్ని సమీపించగానే గుర్రాన్ని లాగిపట్టి నిలపగానే వంతిదేవుడు కూడ ఆగవలసి వచ్చింది. కాస్త ముందు వెళుతున్న ఆళ్వార్ కట్టియాన్ కూడ గుర్రాన్ని ఆపి వీరి వద్దకు వచ్చాడు.

పొన్నియిన్ సెల్వన్ కాసేపు ఆ బుద్ధ భగవానుని విగ్రహం ముందు తదేకంగా చూస్తూ నిలబడ్డారు.

“ఆహా! ఎంతటి అద్భుతమైన కళ?”

“నాకే ఆశ్చర్యమూ కలగడం లేదు. ఈ నాట ఎక్కడ చూసినా ఇటువంటి బ్రహ్మాండమైన బుద్ధ శిల్పాలను స్థాపించివున్నారు. ఎందుకని తెలియడం లేదు!” అన్నాడు వంతిదేవుడు.

యువరాజు వంతిదేవుని చూసి చిరునవ్వు నవ్వారు. “మనసులో ఉన్నది ఉన్నట్లు చెబుతున్నారు. అది నాకు చాల సంతోషాన్ని కలిగిస్తూంది!” అన్నారు.

“యువరాజా! వల్లవరయ్యర్ ఈ రోజునుంచి నిజమే చెప్పాలని నిర్ణయం తీసుకొన్నారు!” అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

“వైష్ణవా! అంతా సహవాస దోషమే! వీర నారాయణపురంలో మిమ్మల్ని చూసినప్పటినుంచి నా నాలుకపైన కల్పనాశక్తి తాండవమాడుతోంది! యువరాజును చూసినప్పటినుంచి నిజం చెప్పే అలవాటు వచ్చేసింది!” అన్నాడు వంతిదేవుడు.

వారి వాగ్వ్యుద్ధాన్ని యువరాజు పట్టించుకోలేదు. శిల్పాన్ని గమనించడంలో పూర్తిగా మునిగిపోయారు.

"లోకంలోనే శిల్పకళయొక్క అద్భుతాన్ని పరిపూర్ణంగా ప్రదర్శించగలిగే రూపాలు రెండే రెండు - ఒకటి నటరాజ స్వామి; రెండవది బుద్ధ భగవానుడు" అన్నారు.

"కానీ నటరాజ రూపాన్ని మన నాట ఇంత బ్రహ్మాండంగా సృష్టించడం లేదు కదా?"

"లంకను పూర్వకాలంలో ఏలిన రాజుల్లో కొందరు మహాపురుషులు. వారు ఏలిన రాజ్యం చిన్నది. బుద్ధ భగవానుని పైన వారికున్న భక్తిని ఇలా బ్రహ్మాండమైన శిల్పాలను చెక్కించి చూపించుకొన్నారు. ఈ దేశంలో ఉన్న బుద్ధ శిల్పాలను, విహారాలను, స్థూపాలను చూసిన తర్వాత మన చోళదేశంలోని అతి చిన్న శివాలయాలను తలుచుకొంటే నాకు సిగ్గుగా ఉంది" అన్నారు పొన్నియిన్ సెల్వన్.

ఇలా చెప్పి యువరాజు గుర్రంపైనుంచి దిగి బుద్ధ విగ్రహాన్ని సమీపించారు. శిల్పం పాదపద్మాలను, ఆ పాదాలను అలంకరించివున్న తామరమొగ్గలను కాసేపు తదేకంగా చూశారు. తర్వాత ఆ బుద్ధ విగ్రహం పాదాలను తాకి నమస్కరించి, తిరిగి వచ్చి గుర్రమెక్కారు.

గుర్రాలు కాస్త మెల్లగా సాగాయి. "ఏమేమి? యువరాజు బౌద్ధమతంలో చేరిపోతారు లాగుందే!" అని వంతిదేవుడు తిరుమలైతో అన్నది యువరాజు చెవిన పడింది.

పొన్నియిన్ సెల్వన్ వారిద్దరిని చూసి, "బుద్ధ భగవానుని పైని నా భక్తి కారణభూతమైనది. ఆ బుద్ధ శిల్ప పాదపద్మాలు నాకొక ముఖ్యమైన సందేశాన్ని తెలియజేశాయి!" అన్నారు.

"ఆహా! మా చెవిన ఏమీ పడలేదే?"

"మౌన భాష మూలంగా ఆ సందేశం నాకు లభించింది."

"ఏమా సందేశం? మాకు చెప్పవచ్చా?"

"ఈ రోజు రాత్రి పన్నెండు గంటలకు అనురాధపురంలోని సింహ తార తటాకం వద్దకు నేను రావాలని బుద్ధభగవానుని పాదపద్మాలు నాకు చెప్పాయి!" అన్నారు పొన్నియిన్ సెల్వన్.

~~~
~~~

# అధ్యాయము - 34

## అనురాధపురం

**సూర్యుడస్తమించే** సమయానికి వారు అనురాధపురాన్ని సమీపించారు. లంకారాజ్యంలోనే సుప్రసిద్ధమైన ఆ రాజధాని నగరాన్ని దూరంనుంచే చూసి ఆశ్చర్యసముద్రంలో మునిగిపోయాడు వంతిదేవుడు. అనురాధపురం గురించి పలువురు చెప్పింది అప్పటికే వినివున్న వంతిదేవుడు వారి వర్ణనలనుంచి ఆ మహానగరం ఎలా ఉంటుందో ఊహించుకొన్నాడు. కానీ ఆ మహానగరం అతడి ఊహలనన్నింటినీ మించిపోయింది. ఆహా! ఈ నగరపు కోట గోడ ఎంత పెద్దది? ఎలా ఎంత పొడవుగా రెండువైపులా సాగింది? ఎక్కడ ఆ గోడ మలుపు తిరుగుతోందని కూడ కనిపించడం లేదు కద? ఆ ప్రాకారం లోపల ఎన్నెన్ని గోపురాలు. స్థూపాలు, మంటప శిఖరాలు తలెత్తి గంభీరంగా నిలబడివున్నాయి? ఒకదానికొకటి ఎంతదూరంగా నిలబడివున్నాయి? కంచి, పళైయార్రై, తంజావూరు మొదలైన నగరాలు ఈ మహానగరం ముందు ఏపాటి? అశోక చక్రవర్తి కాలంలో పాటలీపుత్రం, విక్రమాదిత్యుని కాలంలో ఉజ్జయిని, కరికాల్ వలవన్ కాలంలో కావేరిపట్నం బహుశ ఇంత వైభవంగా ఉండేవేమో! ఇప్పుడున్న ఏ పట్టణాన్ని ఈ మహానగరంతో పోల్చలేము...!

నగర ప్రాకారం, దాని ప్రధాన ద్వారం దగ్గరపడేకొద్ది నగరానికి వెళుతున్న ప్రజల గుంపుకూడ అధికం కాసాగింది. గృహస్థులు, స్త్రీలు, పురుషులు, పిల్లలు పెద్ద పెద్ద గుంపులుగా వెళుతున్నారు. అందులో తమిళులు, సింహాళీయులు మిళితమైవున్నారు. అందరూ రథోత్సవానికి వెళుతున్నట్లు చాల కుతూహలంగా వెళుతున్నారు. వారిలో కొందరు మన ముగ్గురు ప్రయాణీకులను గమనించేసి, వేలెత్తి చూపించనారంభించారు. అది గమనించిన పొన్నియిన్ సెల్వన్ తక్కిన ఇద్దరికి సైగ చేసి రాజబాటనుంచి పైదొలగి అడ్డదారిన ముందుకు సాగారు. చెట్ల మరుగున ఉన్న ఒక కృత్రిమమైన కొండపాదం వద్దకు వచ్చి గుర్రాన్ని ఆపారు. వెంట వచ్చిన ఇద్దరినీ చూసి, “గుర్రాలు బాగ అలిసిపోయివున్నాయి. అవి కాసేపు సేదదీరనీ. బాగా చీకటి పడ్డ తర్వాత బయలుదేరుదాం!” అన్నారు.

ముగ్గురూ గుర్రాల మీది నుంచి దిగి, ఒక బండమీద కూర్చొన్నారు.

“ప్రజలు ఇంత పెద్ద గుంపులుగా వెళుతున్నారే? ఈ రోజు కూడ నగరంలో ఏదైన ఉత్సవమా?” అని అడిగాడు వంతిదేవుడు.

“ఈ నాడులో జరిగే ఉత్సవాలలో అన్నిటి కన్న పెద్దది ఈరోజు జరుగుతున్నదే!” అన్నారు యువరాజు.

“లంకలో  ఏదో యుద్ధం జరుగుతోందని విన్నాను. ఇక్కడికి వచ్చి చూస్తే ఒకటే

ఉత్సవమయంగా ఉందే!" అన్నాడు వంతిదేవుడు.

"పళైయారైలో శ్రీజయంతి ఉత్సవం జరిగిందని మీరు చెప్పలేదా?"

"అవును; కానీ పళైయారై చోళదేశంలో ఉంది..."

"అనురాధపురం లంకలో ఉంది. అందువల్లనేమి? చోళదేశంలోను సుందర చోళ చక్రవర్తి పరిపాలనే; లంకదేశంలోను వారి *రాజదండం* పరిపాలనే...!"

"కానీ ఈ నగరంలో శత్రువులున్నారు కద?"

"శత్రువులెక్కడో ఉన్నారు. కానీ అందుకు ఇక్కడున్న ప్రజలేం చేయగలరు? యుద్ధ రంగంలో యుద్ధం జరగవలసిందే; ఊరులో ఉత్సవం జరగవలసిందే!...తిరుమలై! నీవేమంటావు?" అన్నారు యువరాజు.

"ఇక్కడ బాహ్య శత్రువులున్నారు. ఆక్కడ అంతఃశత్రువులున్నారు. బాహ్య శత్రువులకన్న అంతశ్శత్రువుల వల్లనే అపాయం ఎక్కువ. కాబట్టి యువరాజు ఇక్కడే ఉండి, యుద్ధమూ, ఉత్సవమూ జరపాలని ఈ దాసుని మనవి!" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

"ఇది బాగుంది. బాహ్య శత్రువులకన్న అంతశ్శత్రువులే ఎక్కువ అపాయకారణమైతే, యువరాజు మరి అక్కడ కద ఉండాలి? అపాయం ఎక్కువ ఉన్న చోటే వీర పురుషులు ఉండవలసిన చోటు కద?" అన్నాడు వంతిదేవుడు.

"వీరత్వం అంటే, పెర్రిబాగులవాడిలాగ కుట్రదారులు, హంతకుల మధ్య వెళ్ళి చిక్కుకోవడం అని అర్థమా? మరి వీరాధివీరుడవైన నీవు అలా వెళ్ళి చిక్కుకో! ఇక్కడికెందుకు పారిపోయి వచ్చావు?" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

"చాలు, చాలు! మీరిక్కడ ఒక యుద్ధం ప్రారంభించకండి!" అని వారిని సమాధానపరిచారు అరుళ్మొళి వర్మ.

చీకటి పడ్డ తర్వాత ముగ్గురూ నగరం లోపల ప్రవేశించారు. ఆరోజు యాత్రికులనెవ్వరినీ కోట వాకిట అడ్డగించి ఆపలేదు. అందరినీ నిరాటంకంగా లోపలికి ప్రవేశపెట్టారు. కాపలా వారు ఊరకే చూస్తూ నిలబడ్డారు. గుంపులో గుంపుగా మన కథాపురుషులు ముగ్గురూ నగరం లోపల ప్రవేశించారు.

~

అనురాధపురం వీధుల్లో కూడ ప్రజలు తండోపతండాలుగా తిరుగాడుతూ కనిపించారు. "సాధు! సాధు!" అన్న ఘోష తరచూ వినపడసాగింది. అక్కడక్కడ పాడుబడ్డ మేడలు, విహారాలను చూశాడు వంతిదేవుడు. అలాగే పునర్నిర్మించబడుతున్న కట్టడాలు కూడ కనబడ్డాయి వంతిదేవునికి. పునర్నిర్మాణం యువరాజు ఆనతి మేరకే జరుగుతుండాలని తీర్మానించుకొన్నాడు వంతిదేవుడు. ఆయన ఇలా ఒక విచిత్రమైన కార్యం చేస్తుండడం వెనక ఆయన ఉద్దేశమేమై ఉండగలదు? వెయ్యేళ్ళుగా తమిళనాడుతో

తరచూ పోరాడుతున్నారీ సింహళ రాజులు. అటువంటి పగవారి రాజధానిని కాల్చి నేలమట్టం చేయడానికి బదులుగా, పాడుబడ్డ భవంతులను, కట్టడాలను పునర్నిర్మింపజేసి ఉత్సవాలకు అనుమతి కూడ ఇస్తున్నారేమి? ఇదేమి విచిత్రం! ఇందులో ఏదో ఒక మర్మం ఉండేతీరాలి. అవునవును! అలాగే ఉండాలి. చోళనాడులో ఈయనకు ఏ హక్కూలేదు. పట్టపు యువరాజు ఆదిత్య కరికాలన్ ఉన్నారు. ఆయనతో పోటీ చేసేందుకు మధురాంతకులున్నారు. కాబట్టి ఈ లంకాద్వీపంలో  యువరాజు తనదైన రాజ్యాన్ని స్థాపించుకొని స్వతంత్ర రాజుగా ఏలేందుకు ఇష్టపడుతున్నారు కాబోలు! - ఎవరికెరుక? ఈయన కోరిక నెరవేరినా నెరవేరవచ్చు!  కుడంద్రై జ్యోతిష్కులు చెప్పారు కద? “అరుళ్మొళి వర్మగారు ధ్రువ నక్షత్రం వంటివారు! ఆయనను నమ్మినవారికి ఏ కొరతా ఉండదు!” అని. అటువంటి వీరపురుషుని వద్దకు తాను వచ్చి చేరింది తలుచుకొని అతని మనసు ఆనందంతో ఉప్పొంగింది.

~

ప్రహరీగోడలు విరిగిపడివిన్న ఒక చీకటి కమ్ముకొన్న పాత మాళిగ వాకిట వచ్చి నిలబడి గుర్రాలపైనుంచి దిగారు మన కథాపురుషులు. ఆ స్థలం ప్రధాన వీధుల నుంచి కాస్త దూరంగా ఉంది. కాబట్టి అక్కడ జనసంచారం లేదు. యువరాజు మూడుసార్లు చప్పట్లు తట్టారు. వెంటనే ఇంద్రజాలంలాగ మాళిగ ఒక వైపు ఒక  తలుపు తెరుచుకొని దారి ఏర్పడింది. మనుషులెవ్వరూ ఉన్నట్లు కనిపించడం లేదు. యువరాజు చీకటిలోనే ముందుకు సాగారు. వంతిదేవుడు వెనక్కి తిరిగి గుర్రాల గతేమిటని దిగులుగా/సాలోచనగా చూశాడు. యువరాజు, "గుర్రాలకు దారి తెలుసు!” అని చెప్పి వంతిదేవుని చేయి పట్టి లాక్కొని వెళ్ళారు. కాస్త దూరం చీకటిలోనే నడిచారు. తర్వాత, 'మిణుకు మిణుకు' మని కాస్త వెలుతురు కనిపించింది. దాని వెనక ప్రకాశవంతమైన వెలుతురు తోచింది. అది ఒక పాత అంతఃపురపు లోపలి భాగమని వంతిదేవుడు గ్రహించాడు.

“ఇక్కడ కాస్త అప్రమత్తంగానే ఉండాలి. మహాసేన చక్రవర్తి అంతఃపురం ఇది. ఉన్నట్లుండి చక్రవర్తి ఇక్కడికి విజయం చేసి మనని తరిమికొట్టజూసినా ఆశ్చర్యం లేదు!” అన్నారు యువరాజు.

“మహాసేనులు ఎవరు?” అని అడిగాడు వంతిదేవుడు.

“మహాసేనులు ఆరు వందలఏళ్ళకు మునుపు ఈ లంకారాజ్యాన్ని ఏలిన చక్రవర్తి. ఆయన జనసామాన్యానికి చాల ఉపకారాలు చేశారు. కాబట్టి ఆయన ఆత్మ ఇంకా ఈ నగరంలో తిరుగాడుతోందని జనం నమ్ముతున్నారు. ఆయన ఆత్మ బట్టలు లేక ఎక్కడ కష్టపడుతుందోనని చెట్లకు బట్టలు కట్టివుంచుతున్నారు! ఈ అంతఃపురంలో కూడ ఆయన తర్వాత ఎవరూ నివసించడం లేదు. ఊరికే వదిలిపెట్టేశారు!” అన్నారు యువరాజు.

యువరాజుకు, ఆయనతో వచ్చినవారికి ఉపచారాలు చేసేందుకు సేవకులు ఉన్నారక్కడ. స్నానం చేసి, భోజనం చేసిన తర్వాత ముగ్గురూ ఆ అంతఃపురపు పైడాబాకు వెళ్ళారు. వారు నిలబడ్డ

చోటినుంచి చుట్టుపక్కల అంతా చూడవచ్చు. కానీ వారిని కింద ఉన్నవారు చూడలేరు. అటువంటి చోటు ఎంచుకొని ఆసీనులయ్యారు.

"అయ్యా! రాత్రి పన్నెండు గంటలకు ఎక్కడికో రావాలని బుద్ధుని శిల్పం సందేశమిచ్చిందని చెప్పారు కద?" అన్నాడు వంతిదేవుడు.

"ఇంకా సమయముంది. చంద్రుడు ఇప్పుడే కద ఉదయిస్తున్నాడు? అదిగో ఆ స్థూపం శిఖరానికి ఎదురుగా చంద్రుడు వచ్చిన వెంటనే బయలుదేరుదాం!" అన్నారు యువరాజు.

యువరాజు వేలెత్తి చూపించిన చోట ఒక పెద్ద కొండవంటి స్థూపం కనిపించింది. బుద్ధ భగవానుని దివ్య శరీరం నుంచి పడ్డ ధూళిని అడుగున ఉంచి దానిపై కట్టిన స్థూపం కాబట్టి 'ధాతు గర్భం' అని పిలవబడింది. ధాతుగర్భం అన్న పేరే కాలక్రమేణా 'ధాతుపా' గా రూపాంతరం చెందింది.

"ఎందుకని ఇంత పెద్ద కట్టడాలను కట్టారు?" అని (అమాయకంగా) అడిగాడు వంతిదేవుడు.

"మొట్టమొదట బుద్ధభగవానుడు ఎంత పెద్దవాడని ప్రజలకు తెలియజెప్పేందుకు ఇంత పెద్ద కట్టడాలను కట్టారు. తర్వాత వచ్చిన రాజులేమో తామెంత పెద్దవారని చెప్పుకోవడానికి వాటికన్న పెద్ద స్థూపాలను కట్టించారు!" అన్నారు యువరాజు.

కాసేపటికల్లా సముద్రఘోష వంటి ఒక పెద్ద ఆరవం వినిపించింది. వంతిదేవుడు ఆ మహాఘోష వస్తున్నవైపు తిరిగిచూశాడు. ఒక పెద్ద సేనాసముద్రం వంటి జనకూటమి - అంతం లేనట్లు వీధుల వెంబడి విస్తరించిన జనసమూహం - రావడం కనిపించింది. ఆ జనసమూహం మధ్య నల్ల తిమింగలాల్లాగ వందల కొద్ది ఏనుగులు కనిపించాయి. కడలి నీట ప్రతిబింబించే ఆకాశ నక్షత్రాల లాగ వేలకొద్ది దివిటీలు ప్రకాశవంతంగా వెలుగుతున్నాయి.

వంతిదేవుడు, "ఇదేమి? శత్రుసేనలు దండెత్తి వస్తున్నట్లు కద ఉంది?" అన్నాడు.

"కాదు, కాదు! ఇదే లంకలో అతి పెద్ద ఉత్సవమైన పొహరాత్ ఉత్సవం!" అన్నారు యువరాజు.

ఊరేగింపు దగ్గర పడుతున్న కొద్ది వంతిదేవుని ఆశ్చర్యం అధికం కాసాగింది. అటువంటి దృశ్యాన్ని అతడు తన జీవితంలో ఎన్నడూ చూడలేదు. మొదట సుమారు ముప్పై ఏనుగులు ముందుకు వచ్చాయి. అన్నీ బంగారపు పట్టీలతో అలంకరించబడ్డ ఏనుగులు. వాటి మధ్య ఆ ఏనుగుల గుంపుకు నాయకత్వం వహిస్తున్నట్లు కనిపిస్తున్న ఒక ఏనుగు తక్కిన వాటికన్న గంభీరంగా ఉండడమేగాక తక్కిన వాటికన్న అధికంగా అలంకరించబడి ఉంది. దాని వీపు మీద నవరత్నాలు పొదిగిన ఒక బంగారు పేటిక ఉంది. దానిపైన ఒక బంగారపు గొడుగు అమర్చబడివుంది. ఆ ఏనుగు చుట్టూ ఉన్న ఏనుగులమీద బౌద్ధ భిక్షువులు ఆసీనులై వెండి పిడి అమర్చివున్న వింజామరలు వీస్తున్నారు. ఏనుగుల మధ్య స్తంభ దీపాలు, దివిటీలు, ఇంకా పలురకాలైన దీపాలను పట్టుకొని పలువురు వస్తున్నారు. నల్లటి గుండ్రాళ్ళ వంటి ఏనుగులు, వాటి ఆభరణాలు, బౌద్ధ భిక్షువులు వీస్తున్న వింజామరలు, వేవేల దీపాలు, దివిటీల కాంతి సోకి

ధగధగ మెరుస్తూ కళ్ళు మిరుమిట్లుగొలుపుతున్నాయి.

ఏనుగుల వెనక ఒక పెద్ద జనసమూహం. ఆ గుంపు మధ్య సుమారు ఒక వంద మంది విచిత్రమైన వస్త్రాలను, ఆభరణాలను ధరించి నటప్రదర్శనలు చేస్తున్నారు. వారిలో పలువురు ఢమరుకం/బుడత లాంటి వాద్యాన్ని వాయిస్తూ ఆడసాగారు. ఇంకా పలువిధాలైన వాద్యాలు ఘోషించసాగాయి. అబ్బబ్బ! ఏం ఆట! కడంబూర్ మాళిగలో దేవరాళన్, దేవరాట్టి ఆడిన ఆట దీని ముందు దిగదుడుపే కద! ఒక్కొక్కసారి ఆటగాళ్ళు గిర్రున గాలిలోకెగిరి గాలిలోనే రెండు, మూడు గిరికీలు కొట్టి నేలమీదికి వచ్చారు. అలా వారు తిరిగినప్పుడు వారి కుచ్చెళ్ళలాగ మడతలు పెట్టిన బట్టలు భూచక్రం గొడుగుల్లాగ విప్పుకొన్నాయి. ఇలా వందమంది ఒకేసారి పైకెగిరి సుడి తిరిగి కిందకు దూకిన దృశ్యాన్ని చూసేందుకు రెండు కళ్ళు చాలవు! కనీసం రెండు వేల కళ్ళు కావాలి! కానీ అటువంటప్పుడు లేచిన ఘోషను వినేందుకు రెండు వేల చెవులు చాలవు! అలా బుడతలు, మద్దెలలు, చిడతలు, తామ్ర తాళవాద్యాలు, తమ్మెటలు, కొమ్ముబూరాలు ఒక్కసారిగా ఘోషించి, వినేవాళ్ల చెవులు దిబ్బెళ్ళు పడేలా చేశాయి.

~

ఈ ఆటగాళ్ళు, వారి చుట్టూ గుమిగూడిన జనాలు ముందుకు కదలగానే ఇంకొక ముప్పై ఏనుగులు, ఇంతకు మునుపు వచ్చినవాటిలాగే దేదీప్యమానంగా అలంకరించబడినవి ముందుకు వచ్చాయి. అందులో కూడ ముఖ్యమైన ఏనుగుపైన ఒక అందమైన బంగారు పెట్టె ఉంది. దానిపైన బంగారపు గొడుగు నీడ పడుతోంది. చుట్టూ ఉన్న ఏనుగులపైనున్న బౌద్ధ భిక్షువులు వింజామరలు వీస్తున్నారు. ఈ ఏనుగుల గుంపు వెనుకకూడ ఆటగాళ్ళు వచ్చారు. వీరి మధ్య రతి, మన్మధుడు, ముక్కంటియైన శివపరమాత్మ వేషాలు ధరించిన వారు నిలబడ్డారు. చుట్టూ నిలబడ్డవారు ఆడి, పాడి గెంతులేశారు.

"ఇదేమి? శివపరమాత్మ ఇక్కడికెలా వచ్చారు?" అని అడిగాడు వంతిదేవుడు.

"గజబాహు అనే లంకాదేశపు రాజు శివపరమాత్మను తీసుకొని వచ్చాడు. తర్వాత ఆయన హఠం పట్టి ఇక్కడే ఉండిపోయారు!" అన్నారు యువరాజు.

"ఓ వీరవైష్ణవులుగారూ! చూశారా? ఎవరు గొప్ప దైవమని తెలుస్తోందా?" అని వంతిదేవుడు అడిగి నోరు మూసేలోపు ఇంకొన్ని ఏనుగులు అదేవిధమైన అలంకారాలతో అక్కడికి వచ్చేశాయి. ఆ ఏనుగుల తర్వాత వచ్చిన ఆటగాళ్ళ మధ్య గరుత్మంతుని లాగ ముక్కు, రెక్కలు కట్టుకొన్న ఆటగాళ్ళు ఎగురుతూ, తిరుగుతూ, దూకుతూ, గెంతుతూ మహా ఆర్భాటంగా ఆడారు.

"అబ్బాయీ! ఇక్కడ గరుడవాహనం పైన మా పెరుమాళ్ళు వేంచేస్తున్నారు!" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

మళ్ళీ ఇంకొక ఏనుగుల గుంపు వచ్చింది. వాటి వెనుక వచ్చిన ఆటగాళ్ళేమో ఖడ్గాలు, శూలాలు పట్టుకొని భయంకరమైన యుద్ధవిన్యాసాలను ప్రదర్శిస్తూ వచ్చారు. తాళానికి, ఆటకు తగినట్లు వారి చేతులలోని ఆయుధాలు ఒకదానితోనొకటి ఢీకొని ఠణేల్ ఠణేల్మని శబ్దం చేశాయి.

అందరికన్న చివరిగా వచ్చిన ఏనుగుల గుంపు వెనుక వచ్చిన ఆటగాళ్ళందరూ రెండు చేతులా సిలంబాలు (కర్రసాము చేసే కర్రలు) పట్టుకొని ఆడారు. వారు ఆడేటప్పుడల్లా అన్ని సిలంబాలూ ఒక్కసారిగా ధనాల్ ధనాల్మని శబ్దించాయి. వారి ఆట ఒక్కోసారి అతి ఉగ్రంగాను, ఒక్కోసారి ప్రశాంతంగా లలిత కళలాగ ఉంది.

ఈ దృశ్యాలన్నింటినీ చూసి,  పలువిధాలైన విచిత్రశబ్దాలను విని భ్రమించి నిలబడ్డ వంతిదేవునికి యువరాజు ఈ మహోత్సవ వృత్తాంతాన్ని, అర్థాన్ని చెప్పనారంభించారు.

~

తమిళనాడు రాజులు, లంకాధిపతులు స్నేహపూర్వకంగా ఉండిన రోజులూ ఉన్నాయి. లంకాధీశుడైన గజబాహు, చేరదేశపు రాజు శెంగుట్టవన్ అలా స్నేహంగా ఉండేవారు. చేరన్ శెంగుట్టువన్ కన్నగి అనే పత్నీదైవానికి ఉత్సవం జరిపినప్పుడు గజబాహు అక్కడికి వెళ్ళాడు. ఆ నాడులో జరిగిన తక్కిన ఉత్సవాలను కూడ చూసి ఆనందించాడు. తర్వాత చేరన్ శెంగుట్టువన్ లంకకు వచ్చినప్పుడు గజబాహు పెద్ద ఉత్సవం జరిపాడు. తమిళనాడులో ప్రజలకు ముఖ్యదైవమైన శివపరమాత్మ, విష్ణువు (పెరుమాళ్ళు), కార్తికేయుడు, పత్నీదైవం మొదలైన నాలుగు దైవాలకు ఒకేసారి ఉత్సవం జరిపించాడు. ఈ ఉత్సవాల్లో ప్రజలు పొందిన కుతూహలాన్ని, ఆనందాన్ని చూసి, ప్రతి ఏటా ఈ ఉత్సవాలు జరిపించాలని తీర్మానించాడు. బుద్ధ భగవానునికి ప్రధమ స్థానమిచ్చి తక్కిన నాలుగు దైవాలు వెనక వచ్చే ఏర్పాటు చేశాడు. అప్పటినుంచి లంకలో ఈ మహోత్సవాలు స్థిరంగా నెలకొని ప్రతి ఏటా జరుగుతూ వస్తున్నాయి.

"కానీ దైవాలు ఎక్కడా కన్పించడం లేదే?" అన్నాడు వల్లవరయ్యన్.

"ఒక్కొక్క ఏనుగుల గుంపులోను నాయకత్వం వహిస్తూ వచ్చిన ఏనుగు పైని పేటికను చూశారా?"

"చూశాను! దైవాలను ఆ పెట్టెల్లో పెట్టి తాళం వేసివుంచారా? తప్పించుకొని తమిళనాడుకు పారిపోకూడదని?"

ఇది విన్న పొన్నియిన్ సెల్వన్ నవ్వేసి, "అలాకాదు; మొదట  వచ్చిన ఏనుగుపైన పెట్టె లోపల బుద్ధుని పన్ను ఒకటిని భద్రంగా తాళం వేసివుంచారు. బౌద్ధమతస్తులు ఈ లంకారాజ్యంలో భద్రపరిచి కాపాడుకొనే అమూల్యమైన నిధుల్లో అది మొదటిది. కాబట్టి ఆ పుణ్య వస్తువును అందమైన పెట్టెలో భద్రపరిచి ఊరేగింపుకు  తీసుకొని వచ్చారు!" అన్నారు.

"వెనక వచ్చే పెట్టెల్లో ఏముంది?" అని అడిగాడు వంతిదేవుడు.

"శివుడు, విష్ణువు, మురుగన్ (సుబ్రమణ్యుడు), కన్నగి మొదలైన వారి పళ్ళు దొరకలేదు! కాబట్టి ఆయా దైవాల ఆలయాల్లో వారికి అలంకరించే దివ్యాభరణాలను భద్రంగా పెట్టెల్లో పెట్టి తీసుకొని వెళుతున్నారు!" అని యువరాజు వివరించారు.

వంతిదేవుడు కాసేపు ఆలోచనానిమగ్నుడయ్యాడు. తర్వాత, "ఆహా! మీకు బదులు పళువేట్టరయ్యర్ గనక ఈ దేశం మీద దండెత్తి వచ్చివుంటే...!" అన్నాడు.

ఆ సమయాన వహోత్సవపు చివరి భాగం ఆ వీధి చివర మలుపు తిరిగి వెళ్ళింది. వాద్య ఘోష, ప్రజల కోలాహలం తగ్గు ముఖం పట్టింది.

"నిర్దేశించిన సమయానికి ఇంకా ఒక గంట కాలం మాత్రమే ఉంది. పదండి వెళదాం!" అని యువరాజు మేడపైనుంచి దిగారు. ఆయనతోబాటు తక్కిన ఇద్దరూ దిగారు. దిగి వీధిలోకి వచ్చారు. ఊరేగింపు వెళ్ళిన దిక్కుకు సరిగ్గా వ్యతిరేకదిశలో వెళ్ళారు. నగరప్రజలందరూ ఆ తిరునాళ్ళలో పాల్గొంటున్నందువల్ల వీరు వెళ్ళిన వీధుల్లో జనసంచారమే లేదు. కాసేపటికల్లా ఒక చెరువు గట్టుకు వచ్చి చేరారు. ఆ చెరువు నిండి అలలు గట్టును తాకుతున్నాయి. చంద్రకిరణాలు ఆ అలలమీద పడి అవి వెండి అలల్లాగ మెరుస్తున్నాయి.

~

వారు ఆ చెరువు గట్టు దిగి కిందకు వెళ్ళారు. ఆ చోట సంపంగి పూల సువాసన అలుముకొనివుంది. ఇంకా పలురకాలైన పూలచెట్లలో పూలు గుత్తులు గుత్తులుగా విరబూసివున్నాయి. అక్కడక్కడ కృత్రిమమైన కొండలు, మెట్లున్న కొలనులు కనిపించాయి. అటువంటి తటాకం ఒకదానిపైన అమరివున్న సింహశిల్పం నోటినుంచి నీరు ధారగా పడుతోంది. ఆ తటాకం ఒడ్డు దగ్గరికి ముగ్గురూ వెళ్ళి నిలబడ్డారు.

అనురాధపురం బయట దారి పక్కన వారు చూసిన బుద్ధ శిల్పం వంతిదేవుని మనోనేత్రం ముందు నిలిచింది. ఆ శిల్పం పాదపీఠం పైన అమర్చిన తామర మొగ్గలను యువరాజు లెక్క పెట్టి 'పన్నెండు' అన్నారు. అవి పన్నెండు గంటలను సూచించాయి కాబోలు. ఆ మొగ్గలకు దగ్గర ఉన్న సింహం ముఖం లాంటి పాత్ర కూడ వంతిదేవునికి గుర్తుంది. ఆ పాత్ర ఈ సింహం నోటి నుంచి నీరు పడుతున్న తటాకాన్ని సూచించింది కాబోలు!

ఇదంతా సరేగాని, ఇక్కడికి ఎవరు, ఎందుకు యువరాజుగారిని రమ్మన్నారు? ఇందులో ఏమేమి అపాయాలు ఎదురౌతాయోతెలియదు కద? ఆయుధాలేమీ తీసుకొని రాకూడదని యువరాజు నిషిద్ధం చేయడంలో అర్థమేమి? ఒకవేళ ఇక్కడ ఏమైన ప్రేమాయణం జరగబోతూందా?

ఈ ఆలోచన రాగానే వంతిదేవుని మనసు అల్లకల్లోలమై, సముద్రాలు దాటి పళైయారైకి ఎగిరి వెళ్ళింది. యువరాకుమారి కుందవై, వాణతీదేవి అతని మనోనేత్రం ముందు నిలిచారు.

యువరాజును ఎలాగైన మాట్లాడించి/మాటల్లోకి దించి విషయం రాబట్టాలని, “అయ్యా! ఈ స్థలాన్ని చూస్తే పాతకాలపు నందనవనం లాగ కద ఉంది?” అన్నాడు వంతిదేవుడు.

“అవును; ఇది ఒకప్పుడు అంతఃపుర నందనవనం ఉన్నచోటే! వెయ్యేళ్ళకు మునుపు ఈ నందనవనాన్ని అంటుకొన్నట్లు దుష్టగమనుని అంతఃపురం ఉండేది. అదిగో చూడు! ఆ అంతఃపురపు కొన్ని భాగాలు పాడుబడిపోక ఇంకా నిలిచివున్నాయి!” అన్నారు యువరాజు.

వంతిదేవుడు అక్కడికి కాస్త దూరంలో కనిపించిన పాత అంతఃపుర భాగాలను చూసి, “ఆ కట్టడాలు అంతఃపురానికి చెందినవి కావచ్చు. ఈ తటాకంలో రాకుమార్తెలు జలక్రీడలు చేస్తూ ఉండివుండవచ్చు!” అన్నాడు.

“ఈ నందన వనంలో జరిగిన విచిత్రమైన సంభవం ఇంకొకటుంది. వెయ్యేళ్ళకు మునుపు జరిగిందది. దుష్టగమను కుమారుడైన 'సాలి' అనేవాడు ఇక్కడ పచార్లు చేస్తున్నప్పుడు ఒక అమ్మాయి ఈ తటాకం నుంచి బిందెతో నీరు తీసుకొని వెళ్ళి పూలచెట్లకు పోస్తుండడం చూశాడు. చూసి ఆమె ప్రేమలో పడ్డాడు. ఆమె ఒక ఛండాలుని కూతురని, ఆమె పేరు 'అశోకమాల' అని తెలుసుకొన్నాడు. ఛండాలుని కూతురైనా, ఆమెనే పెళ్ళాడుతానని హఠం పట్టాడు. 'అలాగైతే నీవు సింహాసనమెక్కే అర్హత, హక్కు కోల్పోతావు!' అన్నాడు తండ్రి. 'నాకు సింహాసనం వద్దు; ఆశోకమాలే కావాలి' అని సాలి వాహనుడు చెప్పేశాడు. ఈ లోకంలో అలా చెప్పగల ఇంకొక రాకుమారుడున్నారంటారా?”

పొన్నియిన్ సెల్వన్ ఇలా అన్నప్పుడు, కోడిక్కరై కడలిలో పడవ నడిపే 'సముద్ర కుమారి' వంతిదేవునికి గుర్తొచ్చింది. ఆహ్! ఈయన కూడ ఆ అమ్మాయిని జ్ఞాపకం చేసుకొని ఈ కథను చెబుతున్నారా, ఏమి?

పూంగుళలి ప్రస్తావన ఎలా తీసుకొద్దామని అతను ఆలోచిస్తున్నప్పుడు అక్కడ ఒక విచిత్రమైన సంఘటన జరిగింది. సింహధార తటాకానికి వెనుకవైపు గోడలో, లోపలివైపుగా లోతుగా, ఇద్దరు పట్టేలాగ ఒక రాతి ఆసనముంది. అలా అమర్చబడిన గదిలో ఒకవారగా ఉన్నట్లుండి దీపం వెలుతురు కానవచ్చింది. దీపాన్ని పట్టుకొన్నవారి చేయి ముందుగా బయటకు వచ్చింది. తర్వాత ఒక బౌద్ధ భిక్షువు దివ్యాననం ప్రత్యక్షమైంది.

వంతిదేవుడు ఆ ఇంద్రజాల దృశ్యాన్ని అలవిలేని ఆశ్చర్యంతో చూస్తూ నిలబడ్డాడు. ముందేం జరగబోతోందనే ఆతురత/ఉత్సుకతతో కాసేపు ఊపిరి కూడ వదలలేదు.

~~~
~~~

# అధ్యాయము - 35

## లంకారాజ్య సింహాసనం

**భిక్షువు** తన చేత పట్టిన దీపం వెలుతురులో ఒకసారి చుట్టుపట్ల పరికించి చూశారు. యువరాజు, ఆయన స్నేహితులు అక్కడ నిలబడి ఉండడం గమనించారు కాబోలు. మరుక్షణం దీపం, దాని వెలుతురు మరుగయ్యాయి. కాసేపటికల్లా భిక్షువు తటాకం మెట్లమీదుగా నడిచి రావడం కనిపించింది. ఆయన యువరాజు నిలబడివున్న చోటికి వచ్చారు. వెన్నెల వెలుతురులో ఆయన ముఖాన్ని తేరిపారజూశారు.

"దేవప్రియా! స్వాగతం! మిమ్మల్ని చైతుల్య భిక్షువుల సంఘం ఎదురుచూస్తూంది. మహాదేరో గురువు కూడ విజయం చేశారు. సూచించిన సమయానికి మీరు సరిగ్గా వచ్చి చేరినందుకు నా మనసు చాల సంతోషపడుతోంది" అన్నారు.

"స్వామీ! ఈ చిన్న వానిలో ఎన్నో లోపాలున్నాయి. కానీ, ఇచ్చిన మాటను తప్పను అని ప్రతినబూనాను. ఆ మాటను ఎప్పుడూ తప్పలేదు!" అన్నారు పొన్నియిన్ సెల్వన్.

"ఈరోజు సూర్యాస్తమయం వరకు మీరు చేరలేదని తెలిసింది కాబట్టి మీరు ఈరోజు వస్తారో రారోనని దిగులు కలిగింది."

"ముందుగా వచ్చివుం టే, బహుశ నా మాటను నెరవేర్చలేకపోయివుండేవాడినేమో. అందుకే సూచించిన సమయానికి వచ్చి చేరాను."

"అవును, అవును! ఆకాశంలో జ్యోతిర్మయంగా ప్రకాశించే సూర్యుని కప్పేసేందుకు అనేక మేఘాలు కమ్ముకొంటున్నాయి. కానీ బుద్ధ భగవానుని దయ అనే పెనుగాలి వల్ల చెదరిపోతున్నాయి. అదలా ఉండనీ! ఇక్కడ నిలబడ్డవారెవరు? మీ నమ్మకానికి పూర్తిగా పాత్రులైనవారేనా? ఇచ్చిన మాటను తప్పక నెరవేర్చగలవారా?" అని అడిగారు భిక్షువు.

"స్వామీ! నా రెండు చేతులను నేను ఎలా నమ్ముతున్నానో, ఆలాగే నా ఈ స్నేహితులను నేను నమ్ముతున్నాను. మీకు ఇష్టం లేకపోతే వీరిని ఇక్కడే వదిలిపెట్టి మీతో ఒంటరిగా రావడానికి సిద్ధంగా ఉన్నాను!" అన్నారు యువరాజు.

"లేదు, లేదు! అంత పెద్ద బాధ్యతను తీసుకోవడానికి నేను సిద్ధంగా లేను. నేను మిమ్మల్ని తీసుకొని వెళ్ళే స్థలం చాల సురక్షితమైనదేగాని, చాల పొడవైన దారి వెంబడి వెళ్ళవలసివుంది. ఏ స్తంభం వెనుక ఏ అపాయం పొంచి ఉంటుందో ఎలా చెప్పగలం? వీరిద్దరు తప్పక మన వెంట రానీ!" అన్నారు భిక్షువు.

ఇదంతా వింటున్న వంతిదేవుని మనసు కలతబారింది/ఆందోళనాపూరితమైంది. వెనకాముందు తెలియన తనమీద యువరాజు ఇంతటి పరిపూర్ణమైన నమ్మకం ఉంచి, ఇటువంటి అంతరంగమైన కార్యానికి పిలుచుకొని వచ్చినందుకు అతని మనసు ఆనందంతో ఉప్పొంగింది. ఈరోజు రాత్రి ఒక ముఖ్యమైన సంఘటన జరగబోతూంది. అది ఏమైవుండగలదన్న ఆలోచన అతని ఉద్విగ్నతను అధికం చేసింది.

~

భిక్షువు ముందు వెళుతూ దారి చూపగా తక్కిన వారు ఆయనను అనుసరించి వెళ్ళారు. తటాకం మెట్లమీదుగా వెళ్ళి, వెనుకవైపు రాతిగోడను తొలిచి నిర్మించిన గదిలోపలికి ప్రవేశించారు. దాని ఒక మూలకు వెళ్ళి భిక్షువు ఏదో చేశారు. వెంటనే ఒక దారి ఏర్పడింది. లోపల వెలుతురు కూడ కనిపించింది. భిక్షువు అక్కడ ఉంచిన దీపాన్ని చేత తీసుకొన్నారు. తక్కిన ముగ్గురూ లోపలికి రాగానే దారి మూసుకొంది. బయట సింహం నోటినుంచి పడుతున్న జలపాతం ఇప్పుడు చాల మెల్లగా వినిపిస్తూంది. లేకపోతే కొన్ని క్షణాల మునుపటి వరకు తటాకం ఒడ్డున నిలబడ్డామన్నదే వారివల్ల నమ్మశక్యం కాకపోయేది.

ఇరుకైన సొరంగ మార్గం గుండా వెళ్ళారు వారు. దారి ఎన్నెన్నో మలుపులు తిరిగి వెళ్ళింది. అంతమేలేని దారిలాగ ముందుకు వెళుతూనే ఉందాదారి. వారి అడుగుల చప్పుడు, దాని ప్రతిధ్వని భీతిగొల్పింది. మధ్యమధ్య వంతిదేవునికి యువరాజు మోసపోయి ఏదో ఒక వలలో చిక్కుకొన్నారేమోనన్న సందేహం కూడ కలిగింది.

ఇరుకైన దారి వెడల్పవుతూ, అవుతూ చివరికి ఒక మంటపం వద్దకు వారిని చేర్చింది. ఆహా! ఎంతటి అద్భుతమైన మంటపం! భిక్షువు చేతి దీపం వెలుతురులో మసక మసకగా ఆ మంటపం కొద్దిగానే కనిపించింది. కానీ ఆ మంటపం స్తంభాలు పాలరాతితో చేయబడ్డవని స్పష్టంగా తెలిసింది. నాలుగువైపుల బుద్ధుని శిల్పాలు దర్శనమిచ్చాయి. నిల్చొన్న బుద్ధులు, పడుకొన్న/శయనిస్తున్న బుద్ధులు, యోగముద్రలో ఉన్న బుద్ధులు, ప్రార్థిస్తున్న బుద్ధులు... ఇలా పలు బుద్ధ భగవానుని శిల్పాలు అమర్చబడివున్నాయి.

ఆ పాలరాతి మంటపాన్ని దాటి వెళ్ళారు వారు. మళ్ళీ ఒక ఇరుకైన దారి; మళ్ళీ ఇంకొక మంటపం. ఈ మంటపం స్తంభాలన్నీ తామ్రపు రేకులతో కప్పబడివున్నాయి. ఈ మంటపపు పైకప్పులో రాగిరేకులు, వాటిమీద పలువిధాలైన చిత్రలేఖనాలు, మంటపం నలువైపులా బుద్ధ భగవానుని శిల్పాలు. ఇలా, అపూర్వమైన పసుపు పచ్చని చెట్ల దిమ్మెలతో చేయబడిన స్తంభాల మంటపం, ఏనుగు దంతాలతో చేయబడ్డ స్తంభాల మంటపం, స్వర్ణ రత్న ఖచిత స్తంభ మంటపం - వీటన్నిటినీ దాటి వెళ్ళారు. అతివేగంగా నడిచి వెళ్ళినా కూడ, వంతిదేవుడు అక్కడక్కడ స్తంభాలను తాకి చూస్తూ వెళ్ళాడు. యువరాజు

వాటన్నిటినీ పట్టించుకోక తమ దృష్టిని ముందుకే సారించి వెళుతుండడం అతనికి అమితాశ్చర్యాన్ని కలిగించింది.

~

లోహ మంటపాలనన్నింటినీ దాటి చివరికి ఒక సాధారణమైన నల్లరాతి మంటపానికి వచ్చి చేరారు. కానీ ఆ విశాలమైన మంటపంలో ఒక అపూర్వమైన్ దృశ్యం కనిపించింది. వెనకటి మంటపాల్లో బుద్ధ భవగానుని శిల్పాలు తప్ప మానవమాత్రులెవరూ లేరు. ఈ నల్లరాతి మంటపంలో పలువురు బౌద్ధ భిక్షువులు సమావేశమైవున్నారు. వారి ముఖమండలాలు తేజోవంతమై ప్రకాశిస్తున్నాయి. వారి మధ్య మహాదేరో గురువు ఒక పీఠంపైన ఆసీనులైవున్నారు. వారికెదురుగా ఒక నవరత్న ఖచిత సింహాసనం ఉంది. దాని పక్కనే ఒక పీఠంపైన మణిమకుటం, కరవాలం, దండం అమర్చబడివున్నాయి. మంటపంలో నలువైపులా దీపాలు వెలుగుతున్నాయి. ఆ దీపకాంతిలో స్వర్ణ సింహాసనం, మణిమకుటం, కరవాలం ధగధగా మెరుస్తున్నాయి.

యువరాజు, అతని అనుచరులు ఆ మంటపంలో ప్రవేశించిన వెంటనే, ఆ భిక్షువులందరూ లేచి నిలబడి "బుద్ధం శరణం గఛ్చామి" “ధర్మం శరణం గఛ్చామి" “సంఘం శరణం గఛ్చామి" అని ఘోషించారు.

యువరాజు మహాదేరో గురువును సమీపించి ఆయనకు సాష్టాంగ నమస్కారం చేశారు.

భిక్షువుల అధ్యక్షులు ఒక సాధారణ పీఠాన్ని యువరాజుకు చూపించి దానిమీద ఆసీనులుకమ్మని వేడుకొన్నారు!

“మహాగురుదేవా! ఈ చిన్నవాని ముందు ప్రాయంలోను, ధర్మంలోను పెద్దవారైన మీరు ముందు ఆసీనులు కావాలి!” అని యువరాజు వేడుకొన్నారు.

~

అధ్యక్ష మహాగురువు తమ పీఠంమీద ఆసీనులు కాగానే యువరాజు కూడ తమకు సూచించబడ్డ పీఠంమీద ఆసీనులైనారు.

“దేవతల ప్రీతికి పాత్రుడవైన యువరాజా! మీ రాక ఈ మహాబోధిసంఘానికి మిక్కిలి సంతోషాన్నిచ్చింది. మేము విధించిన నిబంధనలన్నింటికీ ఒప్పుకొని పలు శ్రమలకు లోనై ఇక్కడికి వచ్చారు. బుద్ధ భగవానుని దయ తమపైన పరిపూర్ణంగా ఉందనడానికి ఇంకే ఆధారమూ అవసరం లేదు!” - ఇలా మహాగురు పాళీ భాషలో చెప్పగా యువరాజును తీసుకొని వచ్చిన భిక్షువు తమిళభాషకు అనువదించి చెప్పారు. తక్కిన భిక్షువులు "సాధు! సాధు!” అని ఘోషించి తమ సంతోషాన్ని వెలిబుచ్చారు.

మహాదేరో  ఇంకా ముందుకు ఇలా చెప్పసాగారు: “లంకాద్వీపానికి బౌద్ధ ధర్మాన్ని తీసుకొని వచ్చిన భరతవర్షానికి మేమెప్పుడూ ఋణపడివుంటాము. కానీ ఆదికాలంనుంచి మీదేశం నుంచి దండెత్తి వచ్చిన చోళులు, పాండ్యులు, మళయాళీలు, కళింగులు పలు అత్యాచారాలు చేశారు. బౌద్ధ విహారాలను,

భిక్షువుల మఠాలను, గురుకులాలను నాశనం చేసి దేవతల శాపానికి గురయ్యారు. మీ దేశంవారిని ఎందుకనాలి? ఈ దేశపు రాజులే అటువంటి ఘోరకృత్యాలను చేసివున్నారు. బౌద్ధ సంఘంలో చీలికలు కలిగించారు. తమ హేయ కృత్యాలను ఎదిరించిన భిక్షువుల విహారాలను పడగొట్టారు. అగ్నికి ఆహుతం చేశారు. రెండు కోసుల పొడవు, అర్ధకోసు వెడల్పు ఉన్న ఈ విశాల పుణ్య నగరంలో ఒకప్పుడు అర్ధ విస్తీర్ణం మేరకు బౌద్ధ విహారాలే ఉండేవి. వాటిలో ఇప్పుడు చాలవరకు విరిగిపడి శిథిలావస్థలో ఉన్నాయి. పాడుబడ్డ విహారాలను పునర్నిర్మించాలని ఏ రాజు, రాజ వంశస్థుడు ఇంతవరకు ఆలోచించలేదు, ఆజ్ఞాపించలేదు. అటువంటి భాగ్యం యువరాజు అరుళ్మొళి వర్మకే దక్కింది. దేవప్రియా! తమ ఈ కార్యాన్ని బుద్ధ సంఘం చాల మెచ్చుకొంటోంది..."

యువరాజు తలవొగ్గి నమస్కరించి మహాగురువు దీవెనలను స్వీకరించారు.

"ఈ భిక్షువు పైన ముప్పైమూడు కోట్ల దేవతలు ఆవహించివున్నారు. దేవతలు కరుణతో చెబుతున్నది వినండి!" అన్నారు మహాదేరో.

~

ఆవేశపూరితుడైన ఆ భిక్షువు నోటినుంచి అస్పష్టంగా ఏవేవో మాటలు అతివేగంగా వెలువడ్డాయి. ఆయన మాట్లాడడం ఆపిన వెంటనే అధ్యక్ష భిక్షువు ఇలా చెప్పారు: "ముప్పైమూడు కోటి దేవతలూ మిమ్మల్ని ఆశీర్వదిస్తున్నారు. పూర్వకాలంలో దేవానాంప్రియుడైన అశోక వర్ధనుడు భరత భూమిని ఏక ఛత్రం కింద పాలించి బౌద్ధ ధర్మాన్ని ప్రపంచమంతటా విస్తరింపజేశారు. అటువంటి మహాసామ్రాజ్యానికి మీరు చక్రవర్తి అవుతారని దేవతలు ఆశీర్వదిస్తున్నారు. అశోకుని వలెనే మీరుకూడ బౌద్ధ ధర్మాన్ని వ్యాపింపజేయాలని కోరుతున్నారు. అశోకుడు పాటలీపుత్ర ధర్మసింహాసనాన్ని అధిష్ఠించి చేసిన మహాధర్మకార్యాలను మీరు ఈ పవిత్ర అనురాధపుర సింహాసనాన్ని అధిష్ఠించి చేయాలని దేవతలు ఆజ్ఞాపిస్తున్నారు. యువరాజా! దేవతల ఆజ్ఞకు మీ బదులేమి?"

ఇది వినగానే యువరాజు, "మహాగురుదేవా! దేవతలు శక్తిమంతులు. వారు చిత్తం వచ్చినట్లు నడుచుకొంటారు. కానీ వారు ఈ దాసునికి ఆజ్ఞాపిస్తున్న పని ఏమని వివరంగా తెలియడం లేదు కద?" అన్నారు.

"అది నేనే చెబుతాను" అని చెప్పి అధ్యక్ష భిక్షువు సంజ్ఞ చేయగానే, పూనకం వచ్చిన భిక్షువును అవతలికి తీసుకొని వెళ్ళారు. తర్వాత భిక్షువుల పెద్ద ఇలా చెప్పారు. "యువరాజా! ఇదిగో ఇక్కడ మీముందున్న సింహాసనాన్ని చూడండి. మణిమకుటాన్ని చూడండి. రాజదండాన్ని చూడండి. ఈ దేశపు రాజ వంశానికి చెందిన రాజులందరూ, ఈ సింహాసనాన్ని అధిష్ఠించి, ఈ మణిమకుటాన్ని ధరించి, ఈ రాజదండాన్ని చేత ధరించిన తర్వాతనే బుద్ధ సంఘం చేత అంగీకరించబడ్డ రాజులుగా పరిగణించబడ్డారు. దుష్టగమను చక్రవర్తి, దేవానాంప్రియ దిశ్శరు, మహాసేనులు అధిష్ఠించిన సింహాసనమిది! వారు శిరస్సున

ధరించిన కిరీటమిది! వారు చేతబట్టిన రాజదండమిది! ఇటువంటి పురాతన సింహాసనం మీకోసం వేచివుంది. దీనినధిష్ఠించడానికి, ఈ మణిమకుటాన్ని ధరించి, రాజదండాన్ని చేతబట్టేందుకు మీకు సమ్మతమేనా?"

~

ఇదంతా చాల శ్రద్ధగా వింటున్న వంతిదేవుడు చాల ఉద్రేకపడ్డాడు. యువరాజును ఎత్తి ఈ క్షణమే ఆ సింహాసనంమీద కూర్చోబెడితేనేం అన్న ఆలోచన వచ్చిందతనికి. కానీ యువరాజు ముఖకవళికలలో ఎలాంటి మార్పూ కానరాలేదు.

మునుపటిలాగనే ప్రకాశవంతమైన స్వరంతో, "అధ్యక్షా! అదెలా సాధ్యం? ఈ సింహాసనాన్ని అధిష్ఠించిన మహీంద్రుడు ఇంకా జీవించేవున్నాడు కద? ఆయన ఉన్న చోటు తెలియకపోయినా..." అని చెప్పి ఆపారు.

"యువరాజా! లంకారాజ్యపు రాజవంశం మారాలన్నది దేవతల ఆజ్ఞ. అది జరిగే తీరుతుంది. గంగానది పారే వంగదేశం నుంచి వచ్చిన విజయరాఘువుడు స్థాపించిన ఈ వంశంలో ఎందరో మహారాజులు ఉదయించారు; ధర్మ పరిపాలన చేశారు. కానీ పిదపకాలంలో ఈ వంశం అనేక క్రూర కృత్యాలను చేసి దేవతల శాపానికి గురైంది. ఈ వంశంలో జన్మించిన వారిలో కొడుకును చంపిన తండ్రి, తండ్రిని చంపిన కొడుకు, అన్నను చంపిన తమ్ముడు, తమ్ముని చంపిన అన్న, కొడుకునే చంపిన తల్లి - ఇలా మహాపాతకాలను చేసిన ఈ వంశస్థులు బౌద్ధ ధర్మాన్ని పరిపాలింప అనర్హులని దేవతలు ఆజ్ఞాపిస్తున్నారు. చివరిగా సింహాసనమెక్కిన మహీంద్రుడు లంకాసింహాసనపు హక్కును కోల్పోయాడు. అతనికి సంతతి కూడ లేదు. కాబట్టి రాజవంశం ఎలాగు మారేతీరాలి. అలా రాజవంశం మారేటప్పుడు కొత్త వంశపు మూలపురుషుని ఎంపిక చేసే హక్కు, అధికారం ఈ సంఘానికి ఉంది. ఈ సంఘంవారు కూడ మిమ్మల్ని ఎంపిక చేయాలని కోరుతున్నారు. మీరు సమ్మతిస్తే ఈ రాత్రే పట్టాభిషేక మహోత్సవం చేసేయవచ్చు...."

అప్పుడు ఆ మంటపంలో భూగర్భంలోను, సముద్రపు లోతుల్లోను నెలకొని ఉండేటటువంటి నిశ్శబ్దం గూడుకట్టుకొంది. వంతిదేవుని ఉద్వేగం శిఖరాగ్రాన్ని చేరింది.

అప్పుడు పొన్నియిన్ సెల్వన్ తన పీఠంమీదినుంచి లేచి నిలబడి బౌద్ధ భిక్షువుల సంఘానికి నమస్కరించారు. వంతిదేవుని ఉత్సుకత, కుతూహలం ఎల్లలు దాటాయి. యువరాజు సింహాసనం మీద కూర్చోగానే తానే మణిమకుటాన్ని తీసి యువరాజు శిరస్సున ధరింపజేద్దామనుకొన్నాడు.

యువరాజు ఇలా అన్నారు: "మహాత్ములారా! మీకు నా వందనాలు. ఈ చిన్నవానిపై ఎనలేని ప్రీతి, నమ్మకం ఉంచి ఈ సింహాసనాన్ని నా ముందుంచినందుకు నా నమస్కారాలు. కానీ మీరు నన్నిప్పుడు చేయమని అడుగుతున్నది నన్ను మీరినది. నేను చోళదేశంలో పుట్టి పెరిగినవాడిని. ఆ దేశపు మట్టిలో పండిన ధాన్యంతోను. ఆ దేశంలో పారే నదుల నీటితోను పెరిగిన దేహమిది. నా తండ్రి

సుందర చోళ చక్రవర్తి ఆజ్ఞ మేరకు ఇక్కడకు వచ్చినవాడిని. ఆయన కోరిక తెలుసుకోకుండ నేను ఏమీ చేయలేని వాడను..."

అప్పుడు భిక్షువుల గురువు కలగజేసుకొని ఇలా అన్నారు:- "యువరాజా! తమ తండ్రి సుందర చోళ చక్రవర్తి ఈరోజు స్వతంత్రం లేక చెరలో ఉన్నట్లు ఉండడం మీరెరగరా?"

"అవును; నా తండ్రి జబ్బుపడి మంచం పట్టివున్నారు. కాళ్ళ స్వాధీనం కోల్పోయారు. కానీ ఆయన పేరుతో, - ఆయన వద్ద అధికారం పుచ్చుకొని - చోళదేశాన్ని ఏలుతున్న వారి ఆజ్ఞకు నేను లోబడినవాడిని. వారి ఆజ్ఞ లేనిదే నేనీ సింహాసనాన్ని అంగీకరిస్తే అది దేశద్రోహం, రాజద్రోహం కూడ అవుతుంది..."

"అలా మీరు భావిస్తుంటే, తంజావూరుకు ఒక దూతల గోష్టిని పంపడానికి సిద్ధంగా ఉన్నాము. మీ తండ్రి బౌద్ధ ధర్మం మీద చాల ప్రీతిగొన్నవారు. మా విన్నపాన్ని నిరాకరించరు..."

"ఈ దేశప్రజలున్నారు కద? వారి సమ్మతం లేనిదే రాజ్యాన్ని చేబట్టడానికి ఎవరికి అధికారం ఉంది?"

"తమను రాజుగా పొందడాన్ని తమ జన్మ హక్కుగా భావిస్తారీ దేశప్రజలు..."

"అందరూ సమ్మతించవచ్చు; ఆనందపడవచ్చు. ఈ లోకంలో ఇంకెవ్వరి కోరిక కన్న నేను అధికంగా ఎంచేది నా అక్కగారి కోరికనే. నాతల్లి నన్ను కన్నది. పొన్ని నది నన్ను కాపాడింది. కానీ నా అక్క నా జ్ఞానాన్ని పెంచి నా జ్ఞాననేత్రాన్ని తెరిపించింది అటువంటి నా సహోదరి కోరిక కన్న నా మనసులో ధ్వనిస్తున్న ఒక చిన్న గొంతు ఆజ్ఞే నాకు మేలైనది, విలువైనది. మహాపురుషులారా! మీరు ఈ చిన్నవానికి మనస్ఫూర్తిగా ఇచ్చే ఈ భాగ్యాన్ని స్వీకరించమని నా మనసు చెప్పడం లేదు! దయచేసి నన్ను మన్నించి దీవించండి!..."

మళ్ళీ ఆ మహాసభలో కాసేపు మౌనం నెలకొంది. వంతిదేవుని నాడులు, నరాలు పటపట కొట్టుకోవడం అతని చెవిన మాత్రం పడింది.

~

కాసేపటి తర్వాత అధ్యక్ష భిక్షువు ఇలా అన్నారు:- "యువరాజా! మీ ఉత్తరం మాకు అధికాశ్చర్యాన్ని కలిగించలేదు. అది ఒక విధంగా నేనెదురుచూసిందే. అందుకే ఈ లంకా సింహాసనాన్ని అధిష్టించేందుకు అందరికన్న మీరే అధికంగా అర్హులని తెలుస్తోంది. ధర్మ సూక్ష్మం తెలిసిన మాకు ఇందులో కించిత్తు సందేహం కూడ లేదు. కానీ తమను బలవంతం చేయడం కూడ మాకిష్టం లేదు. ఆలోచించడానికి అవకాశమిస్తున్నాము. ఒక సంవత్సరం తర్వాత మీకు ఇదే విధంగా చెప్పి పంపిస్తాము. అప్పుడు వచ్చి మీ తీర్మానాన్ని తెలియజేయుదురు గాక! ... ఒక విషయం మాత్రం గుర్తుండనీ... ఈ పురాతన అనురాధపురంలో అనేక బౌద్ధ విహారాలు మూర్ఖ యుద్ధ క్రూరత్వం వల్ల పాడుబడివున్నాయి. కానీ ఈ

మహాబోధి విహారానికి ఎటువంటి హాని, కీడు కలగలేదు. ఎందుకంటే ఇది భూతలం కింద తొలిచి కట్టబడ్డ విహారం. ఇక్కడికి వచ్చేదారి ఇప్పుడు ఇక్కడ సమావేశమైవున్న బుద్ధ సంఘం పెద్దలకు మాత్రమే తెలుసు. మాలో ఒకరు దారి చూపకపోతే మీరిక్కడికి రాలేరు. లంకాధిపతులు జీవితంలో ఒకే ఒక్కసారి, బుద్ధ సంఘం చేత పట్టం కట్టించుకోవడానికి మాత్రమే, ఇక్కడికి పిలుచుకొని రాబడతారు. అటువంటి పునీతమైన రహస్యమార్గమున్న విహారం ఇది. ఇక్కడికి మీరు వచ్చింది, వెళ్ళింది, ఇక్కడ జరిగింది బయట ఎవరికీ చెప్పకూడదు. తమ స్నేహితులు కూడ చెప్పకూడదు. చెబితే అతి కఠినమైన దేవ శాపానికి గురి కావలసివస్తుంది!"

"అధ్యక్షా! శాపం అవసరం లేదు; బయట ఎవరికీ చెప్పకూడదని మాట ఇచ్చిన తర్వాతే నా స్నేహితులను ఇక్కడికి తీసుకొని వచ్చాను. ఇచ్చిన మాటను నేను ఏనాడూ తప్పను!" అన్నారు పొన్నియిన్ సెల్వన్.

~

అర్ధ ఘడియ తర్వాత ముగ్గురూ అనురాధపురం వీధుల్లో నడుస్తున్నారు. వంతిదేవుడు అంతవరకు అదిమిపెట్టుకొన్న తన భావోద్వేగాన్ని వెళ్ళగక్కాడు.

"చోళదేశపు సిరిసంపదలు గొప్పవే. కానీ ఈ లంకకు సాటిరావు. ఇటువంటి రత్నద్వీపపు సింహాసనం తానే వస్తే తన్నేశారేమి? ఇదేం వెర్రిబాగుల తనం? మిమ్మల్ని ఆహ్వానించి మణిమకుటాన్ని ఇవ్వడానికి వచ్చిన భిక్షువులనేమనుకోవాలి? మీ తర్వాత అర్హుడనైన వాడిలాగ నేను కూడ స్తంభాలతోబాటు స్తంభంలాగ నిలబడ్డాను కద? నాకైనా ఇవ్వకూడదా?" అని ఏవేవో పేలసాగాడు.

యువరాజు అతన్ని సమాధానపరిచేందుకు ప్రయత్నించారు. "దుష్టగమను కుమారుడు సాలి, అశోకమాల అనే పిల్ల ప్రేమ కోసం ఈ లంకాసింహాసనాన్ని త్రోసిపుచ్చాడని చెప్పాను కద? అది మీ చెవిన పడలేదా?" అన్నారు.

"అంతా చెవికెక్కింది. అలా మీరు ఏ అమ్మాయిని ప్రేమిస్తున్నారు? అలా మీరు సింహాసనమెక్కేందుకు అడ్డుపడుతున్న అమ్మాయి ఎవరు?" అని అడిగాడు వంతిదేవుడు.

"ఒక్కరు కాదు; ఇద్దరు. సత్యం, ధర్మం అనే ఇద్దరు అమ్మాయిలను నేను ప్రేమిస్తున్నాను. వారికోసమే లంకారాజ్యపు మణిమకుటం వద్దన్నాను."

"యువరాజా! మిమ్మల్ని చూస్తే లేతప్రాయంవారు. కానీ, మాటలు మాత్రం వయోధికుల వలె ఉంది."

"మనలో ఎవరు వయసు మీద పడ్డవారు, ఎవరి ప్రాయం/ఆయుష్షు తీరబోతున్నదని ఎవరికి తెలుసు?"

ఇలా వారు మాట్లాడుకొంటున్నప్పుడు వీధి వారగా ఒక పాడుబడ్డ పాత మాళిగ పక్కగా నడిచి

వెళుతున్నారు.

వీధికి అవతలి వైపునుంచి ఎవరో చేతులు తట్టే శబ్దం వినిపించింది.

శబ్దం వచ్చిన చోట ఒక ఆకారం కనిపించింది.

“ఇలా రండి!” అని చెప్పి, యువరాజు వీధిని దాటి ఆ ఆకారం వైపు వెళ్ళారు.

తక్కిన వారు కూడ ఆయన వెంట వెళ్ళారు.

వారు వీధిని సగం దాటేలోపు వెనకనుంచి పెద్ద గడబిడ శబ్దం వినిపించింది. తిరిగిచూస్తే ,వారు ఏ పాత మాళిగ పక్కగా నడుస్తూ వచ్చారో దాని పైమేడ ముందు భాగం విరిగి పడుతుండడం కనిపించింది!

వారు తక్షణం వీధి దాటకుంటే అది వారిపైనే పడివుండేది!!

ఒక్కక్షణంలో ముగ్గురూ బతికిపోయారు! అది కూడ ఎటువంటి కారణజన్ములు!

“మనలో ఎవరికి ఎప్పుడు ఆయువు తీరుతుందో ఎవరు చెప్పగలరు?” అని పొన్నియిన్ సెల్వన్ చెప్పిన మాట ఎంత నిజం?

ఇలా నడివీధిలో వంతిదేవుడు ఆలోచిస్తుండగా, తక్కిన ఇద్దరూ వీధిని దాటి అవతలి వైపుకు చేరుకొన్నారు.

వంతిదేవుడు మళ్ళీ వారిని సమీపించినప్పుడు అక్కడ నిలబడ్డ ఆకారం వెన్నెల వెలుతురులో స్పష్టంగా కనిపించింది.

తన కళ్ళముందు చూస్తున్నది నమ్మడమా వద్దా అన్న సందేహం కలిగిందతనికి.

ఇదేం పిచ్చా? ఇదెలా సాధ్యం?

తంజావూరులో పళువేట్టరయ్యర్ అంతఃపురంలో చూసిన నందిని ఇక్కడ, అనురాధపురం వీధుల్లో ప్రత్యక్షం కావడమెలా సాధ్యం? మధ్యరాత్రి/నడిరాత్రి ఇక్కడకు వచ్చి ఎందుకు నిలబడాలి?

మరుక్షణం ఆ ఆకారం అదృశ్యమైంది. తక్కిన ఇద్దరు మాత్రం అక్కడే నిలబడివున్నారు.

~~~
~~~

# అధ్యాయము - 38

## చిత్రాలు మాట్లాడాయి!

[అధ్యాయాలు 36, 37 క్లుప్తంగా:

అరుళ్మొళి వర్మ లంకకు వచ్చిన కొత్తలో ఆయన దండు విడిది చేసిన స్థలం చుట్టూ ఒక మూగ వనిత తిరుగాడుతుండేది. యువరాజు ఆమెను దగ్గరగా చూసినప్పుడు, తాను బిడ్డగా ఉన్నప్పుడు కావేరి నదిలో మునిగిపోకుండ కాపాడింది ఆమేనని గ్రహించారు. యువరాజు విడిది చేసిన (పాత) మాళిగ అపాయకరమైనదని ఆ మూగవనిత గ్రహించి ఆయనను అక్కడినుంచి వెళ్ళిపొమ్మని హెచ్చరించింది.

అనురాధపురం వీధుల్లో యువరాజు, ఆళ్వార్ కట్టియాన్, వంతిదేవుడు మహాబోధి విహారం నుంచి తిరిగి వస్తున్నప్పుడు ఒక పాడుబడ్డ మాళిగ పైమేడ ముందు భాగం విరిగి వారిపైన పడబోగా, పైన వర్ణించిన మూగవనిత ప్రత్యక్షమై చేతులు చరిచి వారిని హెచ్చరించి కాపాడింది.

ముగ్గురూ యువరాజు విడిది చేసే ఇంటికి వెళ్ళి పడుకొన్నారు. కానీ వారిలో ఎవరికీ నిద్రపట్టలేదు. యువరాజు లంకలో ఆ మూగవనితను తాను చూసి కలిసిన వృత్తాంతాన్ని వారికి వివరించారు... ఇక చదవండి! ]

**యువరాజు** చటుక్కున కథ ఆపేసి, "మీకేమైనా కాలి చప్పుడు వినిపించిందా?" అని అడిగారు.

కథ వినడంలో పూర్తిగా మునిగిపోయిన మిత్రులిద్దరూ తమకేమీ వినబడలెదన్నారు.

ఆళ్వార్ కట్టియాన్ కాస్త నిదానించి, "మనం కూర్చొన్న చోటు మునుపటి కన్న వేడిగా ఉందే?" అన్నాడు.

"ఏదో పొగ కంపు కూడ వస్తోంది!" అన్నాడు వంతిదేవుడు.

"అయ్యా! ఈ స్థలంలో అపాయమేమీ లేదు కదా?" అని దిగులుతో అడిగాడు ఆళ్వార్ కట్టియాన్.

"అపాయం ఏదైన ఉంటే కావేరియమ్మ తప్పక వచ్చి హెచ్చరిస్తుంది! దిగులు వద్దు!" అని చెప్పి కథను ముందుకు సాగించారు యువరాజు.

"ఆ స్థలాన్ని వదిలిపెట్టి వెంటనే దండును తరలించుకొని బయలుదేరాము. అయినప్పటికీ మన వీరుల్లో పదిమందికి చలిజ్వరం పట్టుకొంది. అబ్బబ్బ! ఆ చలిజ్వరం చాల చెడ్డది. ఎటువంటి వీరుడినైనా భీరువుగా మార్చేస్తుంది. యుద్ధంలో ఒళ్ళంతా గాయాలైనా చెక్కు చెదరని / మనసు సడలని వీరులు మూడు రోజులు ఆ జ్వరం వచ్చి పడుకొంటే బెంబేలెత్తిపోయి, "ఊరికి వెళ్ళాలి' అని కలవరింతలు మొదలు

పెడతారు. చోళుల కులదైవమైన ఆ దుర్గాదేవే ఆ మూగవనిత రూపంలో వచ్చి మమ్మల్ని హెచ్చరించిందని నమ్ముతున్నాను. ఆ తర్వాత కూడ దేవి నన్ను చేయి విడువలేదు. నేను వెళ్ళిన చోటికల్లా ఆమె నా వెంబడే వచ్చేది. క్రూర వన్య మృగాలు, కొండ చిలువలు, పొంచివున్న శత్రువులు - ఇటువంటి పలు అపాయాల నుంచి నన్ను కాపాడింది. ఉన్నట్లుండి ఎలా ప్రత్యక్షమయ్యేదో, అలాగే అదృశ్యమయ్యేది. ముఖ భావాలతోను, చేతి సైగల మూలంగాను మాట్లాడడం నేర్చేసుకున్నాను. చాల వరకు ఆమె మనసులో ఉన్నది నేను తెలుసుకోగలిగేవాడిని. అంతేకాదు; ఆ మహిళామణి కంటికి కనిపించకపోయినా చుట్టుపక్కల ఎక్కడున్నా నేను ఆమె ఉనికిని తెలుసుకోగలిగేవాడిని. ఇప్పుడు కూడ ... సరే; మీరు వెళ్ళి మీమీ పడక గదుల్లో పడుకోండి. నిద్ర రాకపోయినా నిద్రిస్తున్నట్లు ఉండండి! వేగంగా!" అన్నారు యువరాజు.

అలాగే ఇద్దరూ వెళ్ళి పడుకొన్నారు. కళ్ళను మూసుకోవడానికి కూడ ప్రయత్నించారు. కానీ ఉద్వేగం వల్ల వారి కనురెప్పలు వాల నిరాకరించాయి.

~

చూస్తుండగానే వెన్నెల పడుతున్న మేడ పైని వసారా సమీపాన ఒక ఆకారం వచ్చి నిలబడింది. వీధిలో విరిగి పడ్డ మేడ దగ్గర చూసిన ఆ స్త్రీరూపమే. అతి మెల్లగా 'ఉస్' అన్న శబ్దం వచ్చిందక్కడినుంచి. యువరాజు లేచి ఆ వసారా వద్దకు వెళ్ళారు. బయట నిలబడ్డ ఆకారం ఏదో సైగ చేసింది. యువరాజు ఆ గదిలో పడుకొనివున్న తన స్నేహితులను చూపించారు. దానికీ సంజ్ఞారూపంలో సమాధానం వచ్చింది.

వెంటనే అరుళ్మొళి వర్మ స్నేహితులనిద్దరినీ తన వెంట తీసుకొని ఆ మాళిగ నుంచి బయటకు వచ్చారు. ఆ మూగ వనిత వెళ్ళిన దారిన ముగ్గురూ మౌనంగా నడిచి వెళ్ళారు. రెండువైపులా దట్టంగా ఉన్న చెట్లతో చీకటి కమ్ముకొన్న ఆ దారిన చాల దూరం వెళ్ళిన తర్వాత ఉన్నట్లుండి వెన్నెల వెలుతురులో ఒక అపురూపమైన దృశ్యాన్ని చూశారు. నల్లని పెద్ద ఏనుగులనేకం వరుసగా నిలబడి బ్రహ్మాండమైన స్తూపాన్నొకదాన్ని కాపలా కాస్తున్నాయి. అది చూసిన వెంటనే వంతిదేవునికి ఊపిరాగిపోయినట్లనిపించింది. ఆ మూగవనితేమో ఏ మాత్రం జంకక ఆ ఏనుగుల వైపు నడక సాగించింది. ఆళ్వార్ కట్టియాన్ వంతిదేవుని చెవిలో, "ఆ ఏనుగు శిల్పాలు ఎంత సజీవంగా కనిపిస్తున్నాయి కదూ?" అన్న తర్వాతే అతడి భయం తీరింది. కానీ అతని ఆశ్చర్యం వీడలేదు.

ఒకదానికొకటి ఆనుకొని నిలబడి ఆ కొండవంటి స్తూపాన్ని మోస్తున్నట్లు నిలబడ్డ ఆ ఏనుగు శిల్పాలన్నిటికీ రెండేసి దంతాలున్నాయి. ఒకేఒక్క ఏనుగుకు మాత్రం ఒక దంతం విరిగివుంది. ఆ మూగవనిత ఆ ఏనుగును సమీపించి దాని కాలి కిందవున్న ఒక పెద్ద నల్ల రాతిని పక్కకు జరిపింది. జరిగిన చోట మెట్లు కనిపించాయి. ఆ మెట్ల మీదుగా ఆమె కిందికి వెళ్ళగా, తక్కిన వారు ఆమె వెంట వెళ్ళారు. మెట్లు దిగి ఇరుకైన దారిన కాస్త దూరం వెళ్ళగానే ఒక మంటపం కనిపించింది. అందులో రెండు

పెద్ద ప్రమిదలు వెలుగుతున్నాయి.

~

ఆ రెండు ప్రమిదల్లో ఒక దాన్ని ఇంకాస్త పెద్దది చేసి చేతికి తీసుకొందా మూగవనిత. యువరాజును మాత్రం తనతో రమ్మని సైగ చేసి ముందుకు సాగింది. తక్కిన ఇద్దరికీ అది కాస్త నిరాశను, దిగులును కలిగించింది. కానీ ఆమె ఆ మంటపంలోని కుడ్య చిత్రాలను యువరాజుకు చూపిస్తోందని తెలియగానే వారు కాస్త స్థిమితపడ్డారు.

~

యువరాజు ఆ మంటపం గోడల పైన చూసిన చిత్రాలు ఏదో ఒక కథలో జరిగిన సంభవాలను వరుసక్రమంలో చిత్రాలుగా చిత్రించినట్లు అనిపించింది. బుద్ధ భగవానుని పూర్వ జన్మ వృత్తాంతాలను విహారాలలో చిత్రించినట్లు ఉన్నాయా చిత్రాలు కూడాను. కానీ ఇవి బుద్ధుని వృత్తాంతాలను వర్ణించడం లేదు. ఒక మానవ స్త్రీ కథే చిత్రించబడివుంది.. ఆ చిత్రాలలోని స్త్రీ ముఖం ఇప్పుడు దీపం పట్టుకొని ఆ చిత్రాలను చూపిస్తున్న మూగవనిత ముఖాన్ని ఇంచు మించు పోలివుంది. కాబట్టి ఈ మూగవనిత తన వృత్తాంతాన్నే చిత్రరూపంలో వర్ణించిందని యువరాజు తేలికగా గ్రహించారు.

వాటిలో మొదటి చిత్రం సముద్రం మధ్య ఉన్న ఒక దీవిలో ఒంటరిగా ఉన్న ఒక ఆడపిల్ల, కాస్త దూరంలో చెక్క పడవలో చేపలు పడుతున్న ఆమె తండ్రి చిత్రించబడివున్నారు. తర్వాత ఆమె అడవి దారిన వెళ్ళింది. తర్వాతి చిత్రంలో ఒక చెట్టు కొమ్మ మీద ఒక యువకుడు కూర్చొని ఉన్నాడు. అతను చూడడానికి రాకుమారుని లాగ ఉన్నాడు. అదే చెట్టు ఇంకొక వైపు నుంచి ఒక ఎలుగుబంటి పైకెక్కుతోంది. రాకుమారుడు దాన్ని గమనించకుండ ఇంకొక వైపు చూస్తున్నాడు. ఆ అమ్మాయి ఒక కేక వేసి పరుగు లంకించుకొంది. ఎలుగు ఆ అమ్మాయిని తరుముకొని వెళ్ళింది. అది గమనించి ఆ యువకుడు చెట్టు దిగి ఆ ఎలుగు వైపు శూలాన్ని విసిరాడు. ఎలుగుబంటికి, ఆ యువకుడికి మధ్య ద్వంద్వ యుద్ధం జరిగింది. ఆ పిల్ల ఒక కొబ్బరి చెట్టునానుకొని ఆ యుద్ధాన్ని చూడసాగింది. చివరికి ఎలుగుబంటి చచ్చిపడింది. యువకుడు ఆ అమ్మాయిని సమీపించి, తన కృతజ్ఞతను తెలుపుకొన్నాడు. కానీ ఆమె బదులు చెప్పక కన్నీరు విడిచింది. తర్వాత ఆమె పరుగెత్తి వెళ్ళి తన తండ్రిని పిలుచుకొని వచ్చింది. వచ్చిన ముసలివాడు తన కూతురు మూగదని తెలియజేశాడు. రాకుమారుడు మొదట విచారపడ్డాడు. తర్వాత విచారం తొలగి, ఆమెతో స్నేహం కలుపుకొన్నాడు. అడవి పూలు కోసుకొచ్చి మాల కట్టి ఆమె మెడలో వేశాడు. ఇద్దరూ చెట్టాపట్టాలేసుకొని అడవిలో తిరిగారు.

ఒక రోజు ఒక పెద్ద ఓడ ఆ దీవి దగ్గరకొచ్చింది. దాని నుంచి కొందరు వీరులు దిగి ఆ దీవి లోపలికి వచ్చారు. రాకుమారుని వెతికి కనిపెట్టి, ఆయనకు వందనాలు సమర్పించారు. అతన్ని ఓడకు రమ్మని బ్రతిమాలుకొన్నారు. రాకుమారుడు ఆ అమ్మాయిని ఓదార్చి సెలవు తీసుకొన్నాడు. పడవలోకెక్కి

వెళ్ళిపోయాడు. ఆ అమ్మాయి అతడు వెళ్ళిపోయిన తర్వాత చాల దుఃఖపడి ఏడ్చింది. అది ఆమె తండ్రి చూశాడు. ఒక పడవలో ఆమెనిక్కించుకొని సముద్రం దాటి వెళ్ళాడు. దీపస్తంభం ఒకదాన్ని చేరుకొని ఒడ్డున దిగాడు. అక్కడ ఒక కుటుంబం వారిని స్వాగతించింది. అందరూ ఎడ్ల బండెక్కి ప్రయాణమై వెళ్ళారు. కోట లోపలవున్న పట్టణాన్ని చేరారు. అక్కడ అంతఃపురపు పైమేడలో రాకుమారుడు శిరస్సున కిరీటంతో నిలబడివున్నాడు. వస్త్రాభరణాలతో పలువురు అతడి చుట్టూ నిలబడివున్నారు. అది చూసిన ఆ లేతవయసు చిన్నదాని మనసు కలతబారింది. ఒక్క పరుగుతో సముద్రపుటొడ్డు చేరింది. దీపస్తంభపు మేడ పైకెక్కి కిందకు దూకేసింది. పడవలో అటువైపుగా వెళుతున్న ఒకతను  అది చూసి, వెంటనే ఆమెను సమీపించి, నీటినుంచి ఎత్తి కాపాడి తన పడవలోకెక్కించుకొన్నాడు. ఆమెకు దెయ్యం పట్టిందనుకొని ఆమెను ఒక గుడికి తీసుకొని వెళ్ళి వదిలి పెట్టాడు. గుడి పూజారి ఆమెకు విభూతి పూసి వేపాకులతో కొట్టాడు.

ఎవరో ఒక పెద్ద రాణి స్వామి దర్శనానికి ఆ గుడికి వచ్చింది. పూజారి ఆ అమ్మాయి గురించి రాణికి చెప్పాడు. రాణి గర్భం ధరించివుంది. అలాగే ఆ అమ్మాయి కూడ గర్భిణి అని గ్రహించింది. పల్లకిలో ఎక్కించుకొని అంతఃపురానికి తీసుకొని వెళ్ళింది. అంతఃపురపు తోటలో ఆ అమ్మాయికి ఇద్దరు పిల్లలు పుట్టారు. రాణి వచ్చి ఆ బిడ్డల్లో ఒక దాన్ని తాను పెంచుకొంటానంది/పెంచుతానంది. మొదట, ఆ చేపలవారి పిల్ల నిరాకరించింది. తర్వాత కాసేపాలోచించింది. ఇద్దరు బిడ్డలూ అంతఃపురంలోనే పెరగనీ అని తీర్మానించింది. అర్ధరాత్రి ఎవరికీ చెప్పకుండ/చెప్పుకోకుండ పారిపోయింది. చాల కాలం అడవిలో తిరుగాడింది. కానీ బిడ్డలను చూడాలనే ఆశ అప్పుడప్పుడూ కలిగేది. నది ఒడ్డుసే వెళ్ళి చెట్ల వెనక మరుగ్గా నిలబడేది. పడవలో రాజు, రాణి, పిల్లలు వచ్చేవారు. దూరాన్నుంచే చూసేసి వెళ్ళిపోయేది. ఒకసారి ఒక బిడ్డ పడవ నుంచి జారి పడిపోయింది. అది ఎవరూ గమనించలేదు. ఆమె నీటిలో మునిగి బిడ్డను తీసిచ్చింది. వెంటనే నది వెల్లువలో మునిగి అవతలి గట్టెక్కి అడవిలో మాయమైంది.

~

ఈ సంఘటనలన్నీ సజీవ చిత్రాలుగా ఆ మంటపం గోడలపైన చిత్రించబడి ఉన్నాయి. యువరాజు అమితాసక్తితోను, సంభ్రమంతోను ఆ చిత్రాలను చూస్తూ వచ్చారు. చివరి చిత్రం ముందు వచ్చి నలబడగానే, ' నదిలో మునిగిపోకుండ కాపాడబడ్డది నేను, కాపాడింది నీవు!' అని సైగలతో చూపించారు. ఆ మూగవనిత యువరాజును హత్తుకొని తల నిమిరింది.

తర్వాత మంటపపు ఇంకొక మూలకు యువరాజును పిలుచుకొని వెళ్ళింది. అక్కడ చిత్రించబడ్డ ఇంకొన్ని చిత్రాలను చూపించింది. అవి ఆమె స్వీయ చరిత్ర చిత్రాలు కావు. యువరాజుకు సంభవించగల అపాయాలను చిత్రరూపంగాను, సంజ్ఞారూపంగాను హెచ్చరించింది.

ఇదంతా వంతిదేవుడు, ఆళ్వార్ కట్టియాన్ మంటపంలో ఒక పక్కగా నిలబడి చూస్తున్నారు.

నందిని ముఖాన్ని, ఈ మూగవనిత ముఖాన్ని వంతిదేవుడు చాల సార్లు మనసులో పోల్చి చూసుకొన్నాడు. అతని మనసులో అనేక ఆలోచనలు పుట్టాయి; పలు సందేహాలు తలెత్తాయి, వాటి గురించి మాట్లాడేందుకు అది తగిన సందర్భం కాదని ఊరకున్నాడు.

ఏనుగు శిల్పాలు రక్షగా ఉన్న ఆ భూగర్భ మంటపం నుంచి బయటకు వచ్చారు వారు. మూగవనిత వారిని తన వెంట తీసుకొని స్తూప శిఖరం గురిగా పెట్టుకొని ఎక్కసాగింది. ఆమె దేహబలాన్ని చూసి తక్కినవారు ఆశ్చర్యపోయారు. వంతిదేవునికి చాల అలుపొచ్చింది. కానీ బయటకు చెప్పుకోక ఎక్కసాగాడు.

స్తూపం సగం ఎత్తు వరకు ఎక్కిన తర్వాత కాస్త ఆగి చుట్టూ చూశారు. నగరంలో ఒకవైపు అగ్నిజ్వాలలు పైకెగసి ఉధృతంగా కాలుతుండడం కనిపించింది.

"ఆహ్! మహాసేన చక్రవర్తి అంతఃపురం నిప్పంటుకొని కాలుతోంది!" అన్నారు యువరాజు.

"మనం పడుకొన్న చోటా?"

"అవును, అదే!"

"మనమక్కడ పడుకొని నిద్రపోయివుంటే...?"

"మనం కూడ అగ్నిదేవునికి ఆహారమైపోయివుండేవారమేమో!"

"అదే మనం పడుకొనివుండిన అంతఃపురమని ఇంతదూరం నుంచి చూసి ఎలా చెప్పగలుగుతున్నారు?"

"మంటపం లోపల మనం చూసిన చిత్రాలు నాతో మాట్లాడాయి!"

"మాతో మాట్లాడలేదే?"

"అందులో ఆశ్చర్యమేమీ లేదు కద? చిత్రాలు ఒక ప్రత్యేక భాషలో మాట్లాడుతాయి. ఆ భాష తెలిసిన వారు మాత్రమే వాటిని అర్థం చేసుకోగలరు."

"ఆ చిత్రాలు మీకు ఇంకా తెలియజెప్పాయి?"

"నా కుటుంబానికి చెందిన పలు రహస్యాలను తెలియజెప్పాయి. లంకాద్వీపాన్ని వెంటనే వదిలిపెట్టి వెళ్ళాలని కూడ చెప్పాయి!"

"చిత్రాల భాషకు జయహో! వైష్ణవులుగారూ! నా పక్షమే గెలిచింది!" అన్నాడు వంతిదేవుడు.

"యువరాజా! చిత్రాలు అంతటితో ఆగలేదు. 'లంకలో ఉన్నంతవరకు కప్పుకింద పడుకోకు; ఇళ్ల పక్కన నడిచి వెళ్ళకు; చెట్ల కింద నిలబడకు' అని చెప్పలేదా?" అని అడిగాడు ఆళ్వార్ కట్టియాన్.

"బాగా చెప్పారు! మీకెలా తెలిసింది?"

"మీకు చిత్రాల భాష తెలుసు. ఈ దాసునికి అభినయ భాష తెలుసు. తమ కులదైవం మీతో మాట్లాడుతున్నప్పుడు ఆ దైవం ముఖభావాలను గమనిస్తూ వచ్చాను!" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

"సంతోషం. రాత్రి ఇంకా ఒక జాము మాత్రమే మిగిలివుంది. ఈ స్తూపం శిఖరాన్ని చేరి, కాసేపైన నిద్రించి పొద్దు పొడిచిన తర్వాత బయలుదేరుదాం!" అన్నారు యువరాజు.

~

మరునాడు ఉదయం సూర్యకిరణాలు చుర్రుమనిపించి వంతిదేవుని నిద్రలేపాయి. క్రితం రాత్రి జరిగిన సంఘటనలు చాలవన్నట్లు కుట్రదారులు, ఇంటికి నిప్పంటించేవారు, మూగవారు, చెవిటివారు, చెట్లెక్కే ఎలుగుబంట్లు, దెయ్యాలు, పిశాచాలు, బౌద్ధ భిక్షువులు, మణిమకుటాలు ఒకటే గందరగోళంగా వంతిదేవుని కలలోకొచ్చి వేధించాయి. సూర్యుని వెలుతురులో అవన్నీ మాయ స్వప్నాలై మరుగైనాయి. గందరగోళమూ, భీతీ ఎగిరిపోయాయి.

యువరాజు, ఆళ్వార్ కట్టియాన్ అప్పటికే లేచి ప్రయాణానికి సిద్ధమై ఉండడాన్ని గమనించాడు వంతిదేవుడు. అతడు కూడ ఆదరా బాదరా ఆయత్తమైనాడు. ముగ్గురూ స్తూపం పైనుంచి కిందకు దిగారు. ప్రధానవీధుల గుండానే నడుస్తూ మహామేఘ వనం వైపు వెళ్ళారు. ఆ వనం మధ్య సుమారు పదిహేను వందల ఏళ్ళపాటి పురాతనమైన, అతి పవిత్రమైన బోధి వృక్షం ఉంది.

భిక్షువులు, భిక్షువులు కాని భక్తులు పలువురు ఆ చెట్టు చుట్టూ ప్రదక్షిణం చేస్తూ, పూలు సమర్పిస్తూ పూజిస్తున్నారు.

యువరాజు కూడ ఆ బోధివృక్షానికి నమస్కరించారు. "ప్రపంచంలో రాజులు పోతారు; వారేలిన రాజ్యాలు గతించిపోతాయి. కానీ ధర్మం ఎన్నటికీ చిరస్థాయిగా నిలిచివుంటుందనడానికి ఈ బోధివృక్షమే నిదర్శనంగా ఉంది!" అని తక్కిన ఇద్దరినీ చూసి చెప్పారు. అలా చెబుతూనే చుట్టూ పరికించి చూశారు. ఒక మూలలో మూడు గుర్రాలు ప్రయాణానికి సిద్ధంగా ఉన్నాయి. మూడు గుర్రాలను పట్టుకొని ముగ్గురు మనుషులు నిలబడివున్నారు.

యువరాజు వారిని సమీపించగానే వారు విప్పారిన ముఖాలతో ఆయనకు నమస్కరించారు. యువరాజు వారిని ఏదో అడిగి తెలుసుకొన్నారు. వంతిదేవుని చూసి, "రాత్రి కాలిపోయింది మనం పడుకొన్న మహాసేనుని అంతఃపురమే! మనం కూడ దానితోబాటు కాలిపోయామేమోనని వీరు భయపడ్డారు. మనని ప్రాణాలతో చూసిన వెంటనే వీరు సంతోషం పట్టలేకపోయారు.!" అన్నారు.

"పదిహేను వందల సంవత్సరాల వయసైన రావి చెట్టు ఇంకా నిలబడి ఉండడమేమో నిజమే. కానీ ధర్మం ఎప్పుడో చచ్చిపోయింది!" అన్నాడు వంతిదేవుడు.

"ఇంకొకసారి అలా అనకు. నేనొకడిని ఇంకా బతికుండగా ధర్మం ఎలా చచ్చిపోతుంది?" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

ముగ్గురూ గుర్రాలెక్కి ప్రయాణమయ్యారు. అనురాధపురం నగర ఉత్తర ద్వారం గుండా బయటకు వెళ్ళారు. తిరునాళ్ళ గుంపులు ఇంకా అన్నిచోట్ల సందడిగా తిరుగుతుండడం వల్ల వీరివెవరూ

గమనించలేదు.

అనురాధపురానికి ఈశాన్య దిశగా ఒక కోసు దూరంలో మహిందలై అనే చిన్న పట్టణముంది. “అశోక చక్రవర్తి కుమారుడైన మహీంద్రుడు మొట్ట మొదట ఈ పట్టణంలోనే దిగి బౌద్ధ ధర్మాన్ని ఉపదేశించనారంభించాడు! ఎటువంటి భాగ్యశాలి ఆయన! సాయుధులైన సైనికులను తీసుకొని దేశాలు జయించడానికి వెళ్ళలేదాయన. హంతకుల చేతికి చిక్కక దాక్కొని మరుగ్గా తిరగవలసిన అగత్యమూ ఆయనకు కలగలేదు!” అన్నారు యువరాజు అరుళ్మొళి వర్మ.

“ఆయన భాగ్యమంతమాత్రమే!” అన్నాడు వంతిదేవుడు.

యువరాజు నవ్వారు.

“మీరు ఎప్పుడూ నన్ను విడిచి వెళ్ళకూడదు. మీరు పక్కనుంటే ఎటువంటి కష్టమైనా సంతోషంగా మారిపోతుంది!” అన్నారు యువరాజు.

“అదే విధంగా ఎటువంటి సంతోషమైనా కష్టమైపోతుంది!” అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

ఈ సమయాన బాటలో వారి దారికెదురుగా ఒక ధూళి దుమారం కనిపించింది. చాల గుర్రాలు నాలుగు కాళ్ల సవారీ చేస్తూ రావడం వినిపించింది. కాసేపటికల్లా ఒక చిన్న గుర్రాల దండు కనిపించింది. గుర్రాల పైని వీరులు చేత పట్టిన శూలాల మొనలు ఉదయ సూర్యుని కాంతిలో తళుక్కున మెరిశాయి.

“అయ్యా! ఒర నుంచి కత్తి దూయండి!” అని హెచ్చరించాడు వంతిదేవుడు.

~~~
~~~

# అధ్యాయము - ౩ 9

## "ఇదిగో యుద్ధం!"

**వంతిదేవుడు** "ఒర నుంచి కత్తి దూయండి!" అనగానే యువరాజు, "ఇదిగో దూసేశాను!" అని ఒర నుంచి పట్టా కత్తిని దూశారు. అదే సమయాన వంతిదేవుడు కూడ ఒరనుంచి కత్తిని దూశాడు. అవి బ్రహ్మాండమైన రాక్షస కత్తులు. అనురాధపురపు బోధివృక్షం కింద గుర్రాలతో వచ్చిన ఆ మనుషులు వాటిని వారికిచ్చారు.

యువరాజు గుర్రం పైనుంచి కిందకు దూకి, "రా దిగి! నీ అధిక ప్రసంగాన్ని నేనిక ఓర్చలేను! అటో ఇటో తేల్చుకొనే ఇక్కడినుంచి కదలాలి!" అని కఠినంగా అన్న వెంటనే వంతిదేవుడు అవాక్కయ్యాడు. ఇది వేళాకోళమో, లేక గంభీరమైన ద్వంద్వ యుద్ధానికి పిలుపో అతనికి అర్థం కాలేదు. అయినా యువరాజు గుర్రంమీదినుంచి నేలమీదికి దిగేసినందువల్ల అతడు కూడ గుర్రం దిగవలసివచ్చింది.

"ఏమయ్యా! ఎందుకు జంకుతున్నారు? నిన్న రాత్రి నన్ను అవమానపరచజూశారు కద? మీ తాతగారి అంతఃపురం వాకిట నా తాతగార్లు వచి వేచివుండేవారని చెప్పలేదా? వారి గొడుగు మొదలైన వస్తువులను దోచేసుకొనిపోగా వారు కుమిలిపోయారని చెప్పలేదా మీరు? అది తలుచుకొనేకొద్దీ నేను తట్టుకోలేకపోతున్నాను. అటో ఇటో తేల్చేసిన తర్వాతే ఇక్కడినుంచి బయలుదేరాలి!" అని చెబుతూనే యువరాజు పట్టాకత్తిని రెండుచేతులా పట్టుకొని గిరగిరా తిప్పుతూ వంతిదేవుని సమీపించారు.

అవును; అది మామూలు కత్తి కాదని చెప్పాం కద? ఎటువంటి బలశాలైన దాన్ని ఒక చేత్తో ఎత్తి నిలబెట్టడమే ఒక పెద్ద కార్యం. రెండు చేతులతో పట్టుకొంటేనే కత్తిని తిప్పడానికి గాని, ఎదుటి వ్యక్తిని ఎదిరించి పోరాడడానికి గాని సాధ్యమవుతుంది.

~

యువరాజు పట్టాకత్తిని అలా రెండుచేతులా పట్టుకొని తిప్పుతుంటే అంతఃపురంలో సుఖభోగాలనుభవిస్తూ పెరిగిన కోమల స్వభావియైన రాకుమారుని లాగ అగుపించలేదు. పాతకాలపు వీరులైన భీముడు, అర్జునుడు, అభిమన్యుడు, అరవాన్ లాగ మెరిసిపోయారు. ఇంకా, తన శరీరాన తొంభైయారు యుద్ధగాయాలను భరించిన విజయాలయ చోళుని, ఏనుగుపైన స్వైర విహారం చేసిన రాజాదిత్యుని లాగ, వారి వంశంలో వచ్చిన వారు తానని గుర్తుచేసేటట్లు వీరగంభీరంగా అగుపించారు.

వంతిదేవుడు కూడ పట్టాకత్తిని రెండు చేతులా పట్టుకొని గిరగిరా తిప్పనారంభించాడు. మొదట అతని మనసులో దిగులు, జంకు గూడుకట్టుకొన్నాయి. పోనుపోను మనసు దిటవైంది. వీరావేశం

పట్టుకొంది. ఎదుటి వ్యక్తి తన గౌరవానికి పాత్రుడైన యువరాజన్న విషయాన్ని కూడ మరిచిపోయాడు. ఎందుకీ ద్వంద్వయుద్ధమన్న ఆలోచన కూడ మరుగైంది. ప్రత్యర్థి చేత గిరగిర తిరుగుతున్న కత్తి మాత్రమే అతని కంటి ముందు నిలిచింది. ఆ కత్తిని తప్పించుకోవడమెలా, దాన్ని పక్కకు కొట్టేసి ప్రత్యర్థిని గాయపరచడమెలా అన్న విషయం మీదే తన మనసును కేంద్రీకరించాడు.

కత్తులు గిరగిరా తిరగడమూ, ఒకదానికొకటి ఢీకొని 'ఠణాల్' 'ఠణాల్' అన్న శబ్దపు వేగమూ మొదట మంద్రస్థాయిలో మొదలై, తర్వాత మధ్యమ స్థాయికి, చివరికి ఉఛ్ఛస్థాయికి చేరుకొన్నాయి.

యువరాజుగారి ఈ విచిత్రకార్యం మొదట ఆళ్వార్ కట్టియాన్‌కి అర్థం కాలేదు. కానీ అందులో ఏదో ఒక గూఢార్థం, ఉద్దేశం ఉండాలని అనుకొన్నాడు. వస్తున్నవారిని అడ్డగించి ఆపేందుకు, వారు ఫలానా వారని తెలుసుకొని అందుకు తగినట్లు తాను చేయవలసిన ఉపాయాన్ని నిర్ణయించడానికి ఇది ఒక పన్నాగం కావచ్చు. అందుకే ఆ ఇద్దరు వీరుల గుర్రాలను దారి మధ్య అడ్డంగా నిలబెట్టి వాటి ముక్కుతాళ్ళను చేత పట్టుకొని నిలబడ్డాడు ఆళ్వార్ కట్టియాన్.

~

ఆ బాటలో ఎదుటివైపు నుంచి వస్తున్న అశ్వవీరులు దగ్గరపడ్డారు. వారి మధ్య పులి జెండా ఎగురుతుండడం చూడగానే ఆళ్వార్ కట్టియాన్ దిగులు వీడిపోయింది. వస్తున్న వారు మనవారే, కానీ ఎవరై ఉండవచ్చు?

వారిలో ముందుగా వచ్చిన వందిమాగధులు  డప్పు వాయిస్తూ ఆ విషయాన్ని విశదం చేశారు:

"లంకాయుద్ధంలో మహీంద్రుని సేనలను తరిమి కొట్టిన చోళ సేనాధిపతి - వైగైనది పోరులో వీరపాండ్యుని తలగొన్న కొడుంబాళూర్ పెద్ద వేళార్ - బూది విక్రమ కేసరి మహారాజు విజయం చేస్తున్నారు! పరాక్! బహు పరాక్!" అన్న పిడుగులాంటి గొంతు వినిపించింది.

"పల్లవ కులదీపం - వైగైనది పోరులో వీర పాండ్యుని శిరస్సుగొన్న వీరాధివీరులు - ఉత్తర పెన్న యుద్ధంలో వేంగి సైన్యాలను నిర్మూలించిన పరాక్రమ భూపతి - పార్థిబేంద్ర వర్మ వేంచేస్తున్నారు! పరాక్!" అన్న ఇంకొక పిడుగు లాంటి గొంతు గర్జించింది.

అశ్వవీరుల వెంట అంబారీతో ఒక పెద్ద ఏనుగు వచ్చింది.

ఇంకాస్త దూరంలో వస్తున్న పదాతిదళం ధూళొ దుమారంలో మసక మసగ్గా కనిపించారు.

ముందు వచ్చిన అశ్వవీరులు దారిలో ఎదురు వచ్చిన ఆటంకం వల్ల అసంతృప్తి చెందినవారిలాగ కనిపించారు.

"ఎవరది?" "తొలగండి!" "దారి వదలండి!" అన్న గొంతులు వినిపించాయి.

తర్వాత ఆ గుంపులో 'గుసగుస' అని రహస్య సంభాషణలు ,'ఆహా!' 'ఓహో!' అన్న ఆశ్చర్య

సూచక స్వరాలూ వినిపించాయి.

అశ్వవీరులు గుర్రాలపైనుంచి కిందకు దూకారు. ఖడ్గ యుద్ధం చేస్తున్న ఆ ఇద్దరు వీరుల చుట్టూ గుమిగూడి నిలబడ్డారు.

బూది విక్రమకేసరి, పార్థిబేంద్రుడు కూడ తమ తమ గుర్రాల మీదినుంచి దిగేశారు. వీరుల ముందు వరుసలో వచ్చి నిలబడ్డారు.

పార్థిబేంద్రుడు ఉద్రిక్తుడై, సేనాపతి విక్రమకేసరిని చూసి, "చూశారా? వల్లవరయ్యన్ గురించి నేను చెప్పింది నిజమా, తప్పా? ఒట్టి అధిక ప్రసంగి! యువరాజు ముందే తన చేతి వాటం చూపించేశాడు! దీన్ని చూస్తూ మనం ఊరకుండడమా?" అని తన చేతిలోని కత్తిని పైకెత్తాడు.

బూది విక్రమకేసరి అతడి చేతిని పట్టుకొని అడ్డగించారు.

"కాస్త ఓపిక పట్టండి, చూద్దాం! ఎంతటి అద్భుతమైన ఖడ్గ యుద్ధం! ఇలాంటి ద్వంద్వ యుద్ధాన్ని చూసి ఎన్నాళ్ళైంది?" అన్నారు.

కాస్త వెనక వచ్చిన పదాతిదళం - సుమారు మూడు వందల మంది - కూడ వచ్చి చేరారు. చుట్టూ వర్తులాకారంలో నిలబడి చోద్యం చూడసాగారు.

~

ఇంతలో ఏనుగు పైని అంబారీ నుంచి ఒక అమ్మాయి కిందకు దిగింది. గుర్రాలకు, వీరులకు మధ్య దారి చేసుకొంటూ ముందుకు వచ్చి నిలబడి ద్వంద్వ యుద్ధాన్ని చూడసాగింది.

అప్పుడు ఆమె ముఖంలో కనిపించిన కుతూహలం ఇంతింతని చెప్పలేము. కత్తులు అటూ ఇటూ వేగంగా తిరిగినప్పుడు ఆమె కళ్ళు కూడ వాటిననుసరిస్తూ వేగంగా అటూ ఇటూ తిరిగాయి. పోరాడుతున్నవారు అటూ ఇటూ దూకినప్పుడు ఆమె నడుం అటూ ఇటూ ఆడింది. కాసేపటి తర్వాత తన జడలో తొడిమతోబాటు తురుముకొన్న నీలోత్పల పుష్పాన్ని చేత తీసుకొని దాన్ని అటూ ఇటూ ఊపసాగింది. కత్తుల విన్యాసానికి తగినట్లు తాళం వేస్తున్నట్లు ఆమె చేతిలోని పూతొడిమ కూడ తిరిగింది - ఆ అమ్మాయి ఎవరని పాఠకులకు నేను చెప్పనవసరం లేదు; ఎవరో పోల్చుకొన్నారా? అవును, పూంగుళలిని మీరు ఎలా మరువగలరు?

కాసేపటివరకు ఆమె ముఖానికెదురుగా యువరాజు కనిపించేటట్లు వారు పోరాడుతున్నారు. కొద్దికొద్దిగా జరిగి అర్ధ వృత్తం తిరిగి వచ్చారు. చివరికి వంతిదేవుని ముఖం పూంగుళలికి ఎదురుగా వచ్చింది. మధ్య మధ్య వంతిదేవుని కళ్ళు తమ చుట్టూ పెరుగుతూ వచ్చిన వీరుల గుంపును గమనించసాగాయి. అప్పుడు పూంగుళలిని కూడ చూసేశాడు. ఉన్నట్లుండి ఆమెనక్కడ చూసిన ఆశ్చర్యం వల్ల అతని ఏకాగ్రత ఒక్క క్షణంపాటు చెదరింది. ఆ ఒక్క క్షణమే యువరాజుకు కావలసినంత అవకాశాన్నిచ్చింది. వంతిదేవుని కత్తిపైన దేవేంద్రుని వజ్రాయుధంలాగ యువరాజు కత్తి దిగి వచ్చింది.

వాణర్ కులవీరుడు తడబడ్డాడు. అతడు చేతబట్టిన పట్టాకత్తి జారి కింద పడింది.

~

అప్పుడు చుట్టూ గుమిగూడిన వీరులు చేసిన హాహాకారం, ఘోష సముద్రఘోషను మరిపించింది. అంతటి ఘోషను మించి ఒక యవ్వనవతి/జవరాలు నవ్విన నవ్వే వినిపించింది.

వంతిదేవుడు కింద పడ్డ కత్తిని మళ్ళీ ఎత్తేందుకు ప్రయత్నించాడు.

అంతలో యువరాజు ముందుకు దూకి వచ్చి అతన్ని గట్టిగా హత్తుకొన్నారు.

"మీరు నా కత్తికి ఓడిపోలేదు. కత్తికి కత్తిగా నాతో సమానంగా యుద్ధం చేశారు. కానీ ఒక ఆడపిల్ల చూపుల కత్తికి ఓడిపోయారు! ఇందులో అవమానమేం లేదు. ఎవరూ దానికతీతులు కారు!" అన్నారు.

వంతిదేవుడు అందుకేదో బదులు చెప్పబోయాడు. అంతలో సేనాధిపతి బూది విక్రమకేసరి, పార్థిబేంద్రుడు వారి దగ్గరకొచ్చేశారు.

"యువరాజా! ఈ అబ్బాయిని నేనే మీ దగ్గరకు పంపించాను! వీడు మీతో ఏమైన తప్పుగా నడుచుకొన్నాడా? కాసేపు మేమంతా గాభరా పడిపోయాము! " అన్నారు సేనాధిపతి.

"అవును, దళపతీ! ఈయనగారి వేధింపును నేనిక ఓర్చుకోలేకపోయాను! 'లంకలో యుద్ధం జరుగుతోందన్నారే? ఎక్కడ? ఎక్కడ?' అని అడిగి నన్ను వేపుకు తినేశారు! 'ఇదిగో యుద్ధం!' అని చూపించేశాను!" అన్నారు యువరాజు.

యువరాజిలా చెప్పగానే మళ్ళీ చుట్టూ గుమిగూడిన వీరులు జయఘోష చేశారు.

~

సేనాధిపతి వంతిదేవుని సమీపించి అతని వెన్ను తట్టారు. "అబ్బాయీ! ఇలాంటి కత్తి యుద్ధం చూసి ఎన్నాళ్ళైంది! యువరాజుగారికి తగిన తోడు నీవు! ఆయనకు కొన్నిసార్లు ఇలాగే చేతుల తీట పడుతుంది! 'కుంజర మల్లు' అని బిరుదుగాంచిన పరాంతక చక్రవర్తి వంశంలో పుట్టినవారు కద? ఆయనతో ముఖాముఖి నిలబడి యుద్ధం చేయలేనివారు చాల రోజులు ఆయన స్నేహితులుగా ఉండలేరు!" అన్నారు.

ఇంతలో యువరాజు పార్థిబేంద్ర పల్లవుని సమీపించి, "అయ్యా! మీరు నన్ను వెతుక్కొంటూ వచ్చారని విన్నాను. మిమ్మల్ని కలవడానికే వేగంగా వచ్చాను. కంచిలో నా అన్నగారు క్షేమమా? మా తాతగారు ఎలా ఉన్నారు?" అని అడిగారు.

"అన్నగారు, తాతగారు మీకు అతిముఖ్యమైన సందేశాన్ని చెప్పి పంపారు. లంకకు వచ్చి మిమ్మల్ని వెతికి పట్టుకోవడంలోనే నాలుగైదు రోజులు వ్యయమైనాయి. ఇక ఒక్క క్షణం కూడ ఆలస్యం చేయకూడదు..." అని పార్థిబేంద్రుడు చెప్పేంతలో, యువరాజు:-

"ముఖ్యమైన కార్యం కాకపోతే మీరే స్వయంగా ఎందుకు వస్తారు? ఇక ఒక్క క్షణం కూడ

ఆలస్యం చేయకూడదు. ఇప్పుడే సందేశాన్ని తెలియజెప్పాలి!" అన్నారు.

అప్పుడు వారిని సమీపించిన సేనాధిపతి, "నడిదారిలో ఇందరి మధ్య ఏమీ మాట్లాడలేము. అదిగో, ఆ పాడుబడ్డ మంటపం ఉంది కద? అక్కడికి వెళ్ళి కూర్చొని మాట్లాడుకొందాం! అదృష్టవశాత్తు లంకలో పాడుబడ్డ మంటపాలకు కొరత లేదు!" అన్నారు.

బాటకు అవతల కాస్త దూరంలో కనబడ్డ ఆ మంటపంవైపు అందరూ నడిచారు.

~~~
~~~

# అధ్యాయము - 40

## మంత్రాలోచన

**ఆ** మంటపం వైపు వెళ్ళేటప్పుడు వంతిదేవుడు ఆళ్వార్ కట్టియాన్ని సమీపించి, "ఇదేమి? యువరాజిలా చేస్తున్నారు? ఆ రోజు ఉన్నట్లుండి మల్ల యుద్ధానికి దిగారు; ఈ రోజు కత్తి యుద్ధానికి దిగారు. ఒక మాట చెప్పేసి యుద్ధానికి దిగకూడదా? యువరాజుతో స్నేహం చాల అపాయాలతో కూడివుంటుంది కాబోలు!" అన్నాడు.

అది యువరాజు చెవిన పడింది. ఆయన వారి పక్కకు వచ్చి, "అవునయ్యా! నాతో స్నేహం చాల ఆపదలతో కూడినదే. నిన్న రాత్రి అది మీకే తెలిసి ఉండాలి కద? ఆపదలకు లోనుకాకూడదంటే నేనున్న చోటుకు కనీసం పది కోసుల దూరంలో ఉండాలి!" అన్నారు.

"యువరాజా! నేనా అర్థంతో చెప్పలేదు. మీ పక్కన నిలబడి ఏ ఆపదనైనా ఎదుర్కోవడానికి నేను సిద్ధమే. కానీ మీరే ఇలా ఉన్నట్లుండి..."

అప్పుడు మన వీర వైష్ణవుడు కలగజేసుకొని, "ఇది నీకు తెలియలేదా తమ్ముడూ? ఎదురుగా వస్తున్నవారు ఎవరని గ్రహించి అందుకు తగినట్లు ప్రతిచర్య తీసుకోవడానికి యువరాజు ఈ ఉపాయం పన్నారు! వస్తున్నవారెవరైనా, కత్తియుద్ధమంటే కాస్త నిలబడి చూస్తారు కద?" అన్నాడు.

యువరాజు, "తిరుమలై చెప్పేది కూడ సరిగానే ఉంది. నా జాతక విశేషం కూడ ఒకటుంది. నాతో ఎవరైనా స్నేహంగా ఉంటే వారికి, తక్కిన వారి అసూయాద్వేషాలు తప్పక సిద్ధిస్తాయి. కాబట్టి నేనెవరితోనైనా స్నేహంగా ఉంటే వారితో అప్పుడప్పుడు ద్వంద్వ యుద్ధం చేయడం నా అలవాటు. దీన్ని పెద్దగా పట్టించుకోనివారు మాత్రమే నా స్నేహితులుగా ఉండగలరు!" అన్నారు.

"అలాగైతే సరే! ఇకపైన మీరు యుద్ధం మొదలుపెట్టక ముందు నేనే ఆరంభించేస్తాను. యువరాజా! తమకు సందేశాన్ని తీసుకొని వచ్చిన నేను ఒక ముఖ్యమైన సందేశాన్ని చెప్ప మరిచాను. అది ఇప్పుడు చెప్పగోరుతున్నాను! చెప్పే తీరాలి. మీకు వినడానికిష్టం లేకపోతే మళ్ళీ కత్తి దూయండి!" అన్నాడు వంతిదేవుడు.

"వద్దు! సంగతేమిటో చెప్పండి. వింటాను."

"మన చుట్టూ నిలబడ్డవారి మధ్య ఒక అమ్మాయి చేత తొడిమతో ఉన్న కుముద పుష్పాన్ని పట్టుకొని నిలబడింది కద, ఆమె చూపులకు నేను ఒడిపోయానని కూడ మీరన్నారు కద? ఆ అమ్మాయి ఎవరో తెలుసా?"

"తెలియదు; సరిగ్గా చూడలేదు. చూసే అలవాటు కూడ లేదు."

"యువరాజా! ఆమే మీకు ఒక సందేశం చెప్పి పంపించింది. చెప్ప మరిచిపోయాను. చెప్పేందుకు అవకాశం దొరికితేనే కద? మిమ్మల్ని చూసి కలిసినప్పటి నుంచి ద్వంద్వ యుద్ధం చేయడం, తలపైన ఇల్లు విరిగి పడకుండ తప్పించుకోవడం తప్ప, ఇక దేనికీ సమయం దొరకలేదు కద? కాబట్టి చెప్పడానికి తగిన సందర్భం చిక్కలేదు. ఉన్నట్లుండి ఆ అమ్మాయిని చూసినప్పుడు, 'అరెరె! చెప్పడం మరిచిపోయాం కద!' అని గుర్తుకు వచ్చింది. అప్పుడు కాస్త ఆదమరిచాను. మీరు నా కత్తిని కొట్టేశారు..."

"అదలా ఉండనీ; ఆమె ఎవరు? ఆమె ఎందుకు సందేశం పంపాలి?"

"అయ్యా! ఆమే పూంగుళలి."

"చాల అందమైన పేరు. కానీ నేనింతవరకు వినలేదు."

"అయ్యా! 'సముద్రకుమారి అన్న పేరు గుర్తుందా?"

"సముద్ర కుమారి - సముద్రకుమారి - అలా నాకు ఏపేరూ గుర్తుకు రావడం లేదే! ఆమెను చూసినట్లు కూడ జ్ఞాపకం రావడం లేదే!"

"దయచేసి కాస్త జ్ఞాపకం చేసుకోండి. మీకు జ్ఞాపకం లేదంటే ఆమె మనసు విరిగిపోతుంది. కోడిక్కరైలో మీరు ఓడను చేరేందుకు సిద్ధమౌతున్నారు. అప్పుడు ఒక అమ్మాయి ఒంటరిగా తానే పడవ నడుపుకొంటూ వచ్చి ఒడ్డు చేరింది. మీరు ఆశ్చర్యంతో చూశారు. ఆమె కూడ మీరందరూ ఎవరని తెలుసుకోవడానికి  మిమ్మల్ని సమీపించింది. 'ఈ అమ్మాయి ఎవరు?' అని మీరు దీపస్తంభ గృహాధిపతిని అడిగారు. ఆయన 'ఈమె నా కుమార్తె' అని బదులిచ్చారు. మీరు వెంటనే, 'ఓహో! ఈమె మీ కుమార్తెనా? సముద్రకుమారి అని కద అనుకొన్నాను?' అన్నారు. దాన్ని ఆ అమ్మాయి మరిచిపోకుండ గుర్తు పెట్టుకొంది. ఆ అమ్మాయి సహాయంతోనే నేను కడలి దాటి లంకకు రాగలిగాను..."

"మీరిలా వివరంగా చెప్పిన తర్వాత కొద్దికొద్దిగా గుర్తుకొస్తోంది. కానీ కోడిక్కరై సముద్రకుమారికి ఇక్కడ అనురాధపురంలో ఏం పని? వీరితో ఎందుకిక్కడికి వచ్చింది? ఒకవేళ మిమ్మల్ని వెతుక్కొంటూ..."

"కాదు; అది అసాధ్యం. నన్ను వెతుక్కొంటూ రావడం ఉచితం కాదు. ఆమె ఎవరినైనా వెతుక్కొంటూ వచ్చిందంటే అది మిమ్మల్ని వెతుక్కొనే వచ్చి ఉండాలి. ఎందుకని నాకు తెలియదు!"

~

ఇలా మాట్లాడుతూనే వంతిదేవుడు సేనాధిపతితో కాస్తదూరంలో వస్తున్న పూంగుళలిని చూశాడు. ఆమె  తల వంచుకొని నడుస్తూంది. కానీ ఆమె ధ్యానమంతా యువరాజు పైనే ఉందని గ్రహించాడు. అప్పుడప్పుడూ తన కనుకొనలనుంచి యువరాజును చూస్తూండడాన్ని కూడ గమనించాడు. ఆ సమయాన తాను ఆమె గురించే మాట్లాడుతున్నానని  కూడ ఆమె గ్రహించివుండాలి. లేకపోతే వంచిన తలను ఎత్తకుండ నడవాల్సిన అవసరమేమీ లేదు కద? ఆహా! ఒక్క క్షణం కూడ చూసిన వైపే చూడకుండ చూస్తూన్నాయి కద ఆమె కళ్ళు!

~

పై కప్పు లేకుండ, చెక్కని నల్లరాతి స్తంభాలున్న ఒక మంటపాన్ని వారు చేరారు. చుట్టూ ఎత్తుగా పెరిగిన చెట్లు ఆ మంటపానికి కాస్త నీడనిచ్చాయి. మంటపం మధ్య ఒక ఎత్తైన పీఠం ఉంది. యువరాజు, సేనాధిపతి, పార్థిబేంద్రుడు వెళ్ళి ఆ పీఠంపైన ఆసీనులైనారు.

వంతిదేవుడు, ఆళ్వార్ కట్టియాన్ కాస్త దూరాన నిలబడ్డారు. ఇంకొక వైపు ఒక స్తంభం వెనక పూంగుళలి నిలబడింది. అక్కడినుంచి ఆమె యువరాజును, వంతిదేవుని కూడ చూసేందుకు అనువుగా ఉంది.

ఆ కప్పులేని మంటపం చుట్టూ వీరులందరూ వ్యూహం పన్నినట్లు రెండు వరుసల్లో నిలబడ్డారు.

ఇంకాస్త దూరంలో గుర్రాలు, ఏనుగులు నిలపబడ్డాయి.

యువరాజు పార్థిబేంద్రుని చూసి, “నా అన్నగారు, తాతగారు ఏం సందేశం పంపారు? వినేందుకు చాల కుతూహలంతో ఎదురుచూస్తున్నాను!” అన్నారు.

“యువరాజా! చోళరాజ్యం ఒక పెద్ద ఆపదకు లోను కాబోతోంది. అది మీకు తెలిసే ఉంటుంది...”

“అవునయ్యా! చక్రవర్తి చాల కాలంగా జబ్బుపడివున్నారు....”

“అపాయం అది మాత్రమే కాదు; సామ్రాజ్యానికే పెద్ద అపాయం రాబోతోంది. పెద్ద పదవుల్లో ఉన్న అధికారులే ద్రోహులుగా మారారు. చక్రవర్తికి, పట్టపు యువరాజుకు, మీకు విరుద్ధంగా కుట్ర పన్ననారంభించారు. తమ అన్నగారికి పట్టానికి హక్కులేదని చెప్పేసి శివభక్త వేషధారియైన మధురాంతకునికి పట్టం కట్టాలని తీర్మానించివున్నారు. పళువేట్టరయ్యర్లు, శంబువరయ్యర్లు, జంటగొడుగుల రాజాళియార్లు, మళపాడి మళవరయ్యర్లు, ఇంకా వీరిలాంటి పలు ద్రోహులు గుమిగూడి కుట్ర చేస్తున్నారు. కానీ వారి కుట్ర గురించి మనం ఏమాత్రం దిగులు పడనవసరం లేదు. ఉత్తర సైన్యం, దక్షిణ సైన్యం మన అధీనంలో ఉంది. తిరుక్కోవలూర్ మిలాడుదురైయారూ, కొడుంబాళూర్ వేళార్ మన వైపున్నారు. వీరి సహాయాన్ని, సైన్యాన్ని తోడు తీసుకొని ద్రోహుల కుట్రను ఒక్క క్షణంలో ఛిన్నాభిన్నం చేయవచ్చు. కానీ శత్రువులకు చాలకాలం చోటివ్వకూడదు. ద్రోహుల ప్రయత్నాలను మొలిచేటప్పుడే గిల్లి పారేయాలి. ఇటువంటి పరిస్థితిని ఎంచి మీ అన్నగారు, తాతగారు మిమ్మల్ని వెంటనే కంచికి పిలుచుకొని రమ్మని నన్ను పంపించారు. మీ సహోదరులిద్దరు విడిపోయి ఉండకూడదని, ఒకే చోట ఉండడం చాల ముఖ్యమని మీ తాతగారు నొక్కి వక్కాణించారు. ఇంకా, తమ అన్నగారి మనసులో ఉన్నదికూడ చెప్పేయబోతున్నాను. ఆయనకు ఒకే చోట కూర్చొని రాజ్యమేలడం ఇష్టం లేదు. ఓడెక్కి సముద్రాలు దాటి, అవతలి దేశాలన్నిటినీ జయించి చోళదేశపు పులిజెండాను నాటాలని ఆయన తహతహలాడుతున్నారు. ఉత్తరదేశం వైపు దండెత్తి వెళ్ళేందుకు పళువేట్టరయ్యర్లు అడ్డుపుల్ల వేసినప్పటినుంచి ఆయన పోరు పిచ్చి

పది రెట్లైంది. కాబట్టి మీరు కంచికి వచ్చి చేరిన వెంటనే తంజావూరుపైన దండెత్తి వెళ్ళి కుట్రదారులందరినీ హతమార్చి తుడిచి పెట్టేసి, చోళ సింహాసనంపైన తమకు పట్టం కట్టి కూర్చోబెట్టి..."

అంతవరకు శ్రద్ధాసక్తులతోను, భక్తి గౌరవాలతోను వింటున్న యువరాజు పార్థిబేంద్రుడు చివరగా చెప్పిన మాటను వినగానే, చెవులు మూసుకొని, "వద్దు, వద్దు! అటువంటి విపరీతమైన మాటలను చెప్పకండి! చోళ సింహాసనానికి, నాకు చాల దూరం!" అన్నారు.

"మీకిష్టం లేకపోతే చెప్పను. అది తమ అన్నగారి ఇష్టం, మీ ఇష్టం. మీ సహోదరులిద్దరు వివాదించి తీర్మానించుకోవలసిన విషయం. కానీ, కుట్రదారులను నాశనం చేయడంలో మీరిద్దరు ఒక్కటిగా ఉండడం చాల ముఖ్యం. మీరు వెంటనే కంచికి రండి. పళువేట్టరయ్యర్లను, శంబువరయ్యర్లను సమూలంగా నాశనం చేద్దాం. శివభక్తి వేషధారుడైన మధురాంతకుని శివలోకానికే పంపించేద్దాం. తర్వాత మీరు, మీ అన్నగారు ఆలోచించి తగిన విధంగా తీర్మానించండి!" అన్నాడు పార్థిబేంద్రుడు.

"అయ్యా! అంతా మేమే తీర్మానించడమా? మా తండ్రిగారు - చక్రవర్తి - ఆయన కోరికేమని తెలుసుకోవద్దా? లేక, ఒకవేళ మీరిప్పటికే తెలుసుకొన్నారా? నా అన్నగారికి నాన్నగారినుంచి ఏదైన అంతరంగ సందేశం వచ్చిందా?"

"యువరాజా! ఈ సందర్భంలో నిజం చెప్పక తప్పదు. దాచి పెట్టి ప్రయోజనం లేదు. తమ తండ్రిగారి కోరికను ఇప్పుడు తెలుసుకోవడం సాధ్యమయ్యే పనికాదు. చక్రవర్తి ఇప్పుడు స్వతంత్ర వ్యక్తి కారు. పళువేట్టరయ్యర్ల చెరలో ఉన్నారు. వారి అనుమతి లేకుండ చక్రవర్తిని ఎవరూ చూడలేరు; కలిసి మాట్లాడలేరు. అలాంటప్పుడు ఆయన కోరిక తెలుసుకోవడం ఎలా సాధ్యం? నాన్నగారిని కంచికి రప్పించుకోవడానికి మీ అన్నగారు బ్రహ్మ ప్రయత్నం చేశారు. కంచిలో బంగారు మాళిగ కట్టించారు. చక్రవర్తి విజయం చేసి గృహప్రవేశం చేయాలని ఆహ్వానం పంపించారు. కానీ చక్రవర్తినుంచి ఉత్తరమే రాలేదు..."

"నా తండ్రి జబ్బుపడివుండడమూ, లేచి నడవలేకుండడమూ తెలిసిన విషయమే కద?"

"యువరాజా! తమ తండ్రి ముల్లోకాలకు చక్రవర్తి - కంచికి కాలినడకన రావాలా? రథ, గజ, తురగ దళాలు లేవా? స్వర్ణ రథాలు, ముత్యాల వింజామరలు లేవా? తలపైన మోసుకొని రావడానికి వేలకొద్ది సామంతరాజులు పోటీ పడి రారా? కారణం అది కాదు. పళువేట్టరయ్యర్ల ద్రోహమే కారణం. తంజావూరు అంతఃపురం ఇప్పుడు చక్రవర్తికి చెరసాలగా మారిపోయింది. యువరాజా! మీ తండ్రి ప్రాణాలను కాపాడుకోవాలంటే వెంటనే బయలుదేరి రండి!"

~

ఈ మాటలు యువరాజు మనసును కలచివేశాయన్నది స్పష్టంగా తెలియవచ్చింది. ఎప్పుడూ కళకళలాడుతుండే ఆయన ముఖంలో మొట్టమొదటిసారిగా దిగులు కనిపించింది.

యువరాజు కాసేపు దీర్ఘాలోచనా నిమగ్నుడై, తర్వాత సేనాపతి ముఖాన్ని తలెత్తి చూశారు.

“దళపతీ! మీ ఆలోచన ఏమి? కొన్నాళ్ళ క్రితం ముఖ్యమంత్రి అనిరుద్ధ బ్రహ్మారాయలు ఇక్కడికి వచ్చారు. ఆయన మా తండ్రి గౌరవ మర్యాదలకు. అంతరంగ అభిమానానికి పాత్రులు. ఆయన నన్ను ఇంకొంత కాలం లంకలోనే ఉండమని సలహా ఇచ్చారు. మీరు కూడ అందుకు ఆమోదం తెలిపారు. 'ఇక్కడ యుద్ధమేమీ జరగడం లెదు కద? నేనిక్కడెందుకుండాలి?' అని నేనడిగినప్పుడు మీరు ఉత్తరమిచ్చారు. ముఖ్యమంత్రి ఇదిగో ఇక్కడ నిలబడివున్న వైష్ణవుల చేత మళ్ళీ అదే సందేశాన్ని చెప్పి పంపించారు. నాకు మా అక్కగారంటే ఎంత గౌరవం, ఆమె మాటకు నేనెంత విలువిస్తానన్నది మీకు తెలుసు. వారు గీచిన గీటు నేను దాటను. లంకకు వారు రమ్మన్నందువల్లనే వచ్చాను. యువరాకుమారి ఇదిగో ఈ వాణర్ కులవీరుని చేత తాళపత్ర సందేశం పంపించివున్నారు. ఒకవిధంగా మా అక్కగారి సందేశమూ, పార్థిబేంద్రుల సందేశమూ ఇంచు మించు ఒకే లాగున్నాయి. కానీ వెంటనే బయలుదేరి పళైయారైకు రమ్మని రాసి పంపించారు. మా అన్నగారేమో వెంటనే బయలుదేరి కంచికి రమ్మని వీరి చేత చెప్పి పంపించారు. సేనాపతీ! మీ అభిప్రాయమేమి?” అన్నారు.

“యువరాజా! ఈ రోజు ఉదయం వరకు మీరు లంకలోనే ఉండాలన్న ఉద్దేశంతో ఉన్నాను. నిన్న రాత్రి కూడ చాలసేపు అదే వివాదిస్తూ వచ్చాను. ఈయన చాలసేపు వాదించినా ఒప్పుకోలేదు. కానీ ఈ రోజు ప్రాతఃకాలం, అదిగో అక్కడ నిలబడింది చూడండి, ఆ అమ్మాయి వచ్చి ఒక విషయం చెప్పింది. అది విన్న తర్వాత నా అభిప్రాయాన్ని పూర్తిగా మార్చుకొన్నాను. మీరు వెంటనే వెళ్ళడం అత్యవసరమని నాకనిపిస్తోంది!” అన్నారు లంక సేనాధిపతి.

~

స్తంభం మరుగున నిలబడి కడగంటి చూపుతో తనను చూస్తూన్న పూంగుళలి వైపు తన దృష్టిని సారించారు యువరాజు.

“అభిమన్యుని శత్రువులు నలువైపుల నుంచి ముట్టడించారు. కానీ నన్ను నలువైపుల నుంచి వచ్చే వార్తలే చంపేస్తాయి కాబోలు!” అని తనలో తానే చెప్పుకొన్నారు.

“ఆ అమ్మాయి ఏం సందేశం తీసుకొని వచ్చింది?” అని అడిగారు.

“ఆమే చెప్పనీ!” అన్నారు పెద్ద వేళార్.

పూంగుళలి జంకుతూ ముందుకు వచ్చింది. యువరాజు ముందుకు వచ్చి నిలబడింది. నలువైపుల తిరిగి చూసింది. సేనాధిపతిని చూసింది. పార్థిబేంద్రుని చూసింది. కాస్త దూరాన నిలబడ్డ వంతిదేవుని, ఆళ్వార్ కట్టియాన్ని చూసింది. యువరాజు ముఖాన్ని మాత్రం తలెత్తి చూడలేకపోయింది.

“అమ్మాయీ! చెప్పు త్వరగా!” అన్నారు సేనాధిపతి.

పూంగుళలి ఏదో చెప్పబోయింది గాని నోరు పెగల్లేదు.

“ఆహా! ఈ లోకమే మూగవోయినట్లుంది!” అన్నారు అరుళ్మొళి వర్మ.

అంతే! పూంగుళలి కనురెప్పలను ఎత్తి యువరాజును ఒక్క క్షణం కన్న తక్కువ సమయం చూసింది. అంతలో ఆ కళ్ళలో కన్నీళ్ళుబికాయి. వెంటనే అక్కడినుంచి పరుగెత్తింది. పరుగెత్తి వెళ్ళి దూరాన దట్టమైన చెట్ల మధ్య మరుగైంది.

అందరూ ఆశ్చర్యంతో చూస్తూ నిలబడ్డారు.

అప్పుడు వంతిదేవుడు ముందుకు వచ్చి, "ఈ అమ్మాయి ఇంతకు మునుపు కూడ ఒకసారి ఇలాగే పారిపోయింది. నేను వెళ్ళి వెతికి పట్టుకొచ్చాను. ఇప్పుడు కూడ, మీరు అనుమతిస్తే, నేనే వెళ్ళి పట్టుకొస్తాను!" అన్నాడు.

"అలాగే చెయ్యండి! కానీ, అంతలోపల ఆమె తీసుకొచ్చిన సందేశాన్ని సేనాపతి చెప్పనీ!" అన్నారు యువరాజు.

అందుకు సేనాపతి, "అది రెండు మాటల్లో చెప్పి ముగించవచ్చు. యువరాజా! మిమ్మల్ని చెరపట్టి బంధించి తీసుకొని రావడానికి పళువేట్టరయ్యర్లు రెండు పెద్ద ఓడలను, వాటినిండా యుద్ధవీరులను పంపించివున్నారు. ఆ ఓడలు తొండైమాన్ నది కాలువలో దూరి, ఒక మరుగైన చోటికి వచ్చి నిలబడివున్నాయి!" అన్నారు.

~~~
~~~

# అధ్యాయము - 41

## "అదిగో చూడండి!"

**సేనాధిపతి** బూది విక్రమకేసరి చెప్పిన సంగతి వినగానే యువరాజు ముఖంలో చిరునవ్వు విరిసింది.

"చివరికి నా మనసులో జరుగుతున్న పోరాటం ఒక ముగింపుకు వచ్చేటట్లు కనిపిస్తోంది!" అని తనకు తానే చెప్పుకొన్నారు..

పార్థిబేంద్రుడు ఉగ్రుడైనాడు. "ఏమంటున్నారు సేనాధిపతీ! ఇది నిజమేనా? నాకింతవరకు ఎందుకు చెప్పలేదు? ఈ పిచ్చిపిల్లను మీరు మనతో కట్టి లాక్కొని రావడానికి కారణం ఇప్పుడు కద తెలుస్తోంది? మళ్ళీ అడుగుతున్నాను - పళువేట్టరయ్యర్లు యువరాజును బంధించి తీసుకొని రావడానికి ఓడలను పంపింది నిజమేనా?" అని అడిగాడు.

"అవునయ్యా! ఈ అమ్మాయి కళ్లతో చూసిందీ, చెవులతో విన్నదీ నమ్మేటట్లయితే అది నిజమే!"

"ఆహా! ఆ ముసలాయన, తిరుక్కోవలూర్ మిలాడుదురైయ్యార్ చెప్పింది నిజమైంది! పళువేట్టరయ్యర్ల నిజరూపం తెలుసుకొన్నది ఆయనొక్కరే! సేనాపతీ! ఇటువంటి సంగతి తెలిసిన తర్వాత కూడ ఎందుకు ఊరకున్నారు? పరాంతక చక్రవర్తి కులదీపాన్ని, సుందర చోళ చక్రవర్తి ముద్దుల కుమారుని, దేశమంతా గౌరవించి వేనోళ్ల కొనియాడే యువరాజును, తమిళనాడు ప్రజలందరూ తమ కంటిపాపగా ఎంచే ప్రియతముని, ఆదిత్య కరికాలన్ ముద్దుల తమ్ముని - ఈ అర్భకులైన పళువేట్టరయ్యర్లు చెరపట్టి తీసుకొని రావడానికి మనుషులను పంపేటంత స్థితి వచ్చిందా? ఇంకా ఏం ఆలోచించడం? వెంటనే దండెత్తి వెళ్ళి యువరాజును చెరపట్ట వచ్చినవారిని తుడిచిపెట్టేసి, ఈ లంకాద్వీపంలోనే వారికి సమాధి కడదాం! తర్వాత మనం వేసుకొన్న పథకం ప్రకారం కార్యాన్ని నడుపుదాం! బయలుదేరండి! ఇంకా ఏం తాత్సారం?" అని పార్థిబేంద్రుడు నిప్పులుగక్కాడు.

సేనాధిపతి బూది విక్రమ కేసరి అతన్ని చూసి, "పార్థిబేంద్రా! నీవిలా ఉడికిపోతావనే నేనీ అమ్మాయిని తీసుకొని వచ్చిన సంగతిని నీకు చెప్పలేదు. బాగా ఆలోచించి చేయవలసిన కార్యం. తొందరపడడం వల్ల ప్రయోజనం లేదు!" అన్నారు.

"ఆలోచన చేయడమా? ఏం ఆలోచించాలి? ఎందుకని? యువరాజా! మీరు చెప్పండి. ఇక ఆలోచించడానికేముంది? ఇంతకు మునుపు ఏమైన జంకు/సందేహం ఉంటే, ఇప్పుడది పటాపంచలైపోవాలి కద? పళువేట్టరయ్యర్లను సమూలంగ తుడిచిపెట్టేయాల్సిందే కద?"

"తమను చెరపట్టి బంధించేందుకు - ఈ మాట అనడానికి కూడ నా నోరు పెగలడం లేదు -

అయినా చెప్పవలసివుంది - మిమ్మల్ని చెరపట్ట వచ్చినవారు చక్రవర్తి ఆజ్ఞ మేరకే వచ్చివుంటే ఏం చేయడం? అప్పుడు కూడ వారిని ఎదిరించి పోరాడడమా?"

ఇది విన్న పార్థిబేంద్రుడు పకపక నవ్వేసి, "భలే బాగుంది మీమాట! చక్రవర్తి స్వయంగా ఆజ్ఞాపించే స్థితిలో ఉన్నారా? వారినే పళువేట్టరయ్యర్లు చెరలో ఉంచారు కద?" అన్నాడు.

~

అప్పుడు వంతిదేవుడు కలగజేసుకొని, "పల్లవ దళపతి చెబుతున్నది ముమ్మాటికీ నిజం. నేనే నా కళ్లతో చూశాను. చక్రవర్తిని చెరలో ఉంచినట్లే ఉంచారు. వారి అనుమతి లేనిదే ఎవరూ చక్రవర్తిని చూడలేరు, మాట్లాడలేరు. నేను ఒక మాట చెప్పేందుకు తెగించినందువల్ల వారు నాకిచ్చిన పొట్లు... అబ్బబ్బ! చిన్న పళువేట్టరయ్యర్ ఇనుప చేయి పట్టిన చోట నా చేయి ఇంకా నొప్పెడుతోంది!" అని చెప్పి తన మణికట్టును తడుముకొన్నాడు.

"అలా చెప్పు, వల్లవరయ్యా! నిన్ను గురించి ఏమో అనుకొన్నాను. యువరాజుకు, సేనాపతికి ఇంకొక సారి నొక్కి చెప్పు!" అన్నాడు పార్థిబేంద్రుడు.

యువరాజు, "వద్దు! ఆయన చెప్పవలసిందంతా చెప్పేశారు!" అని చెప్పి, వంతిదేవుని చూసి, "అయ్యా! మీరా అమ్మాయిని వెతికి తీసుకొని వస్తానన్నారు కద? ఇంకా ఎందుకిక్కడే నిలబడ్డారు? ఆమె తీసుకొని వచ్చిన సమాచారాన్ని ఆమె నోటనే విందాం! కాస్త పిచ్చి పట్టిన అమ్మాయిలాగ కనిపిస్తోంది. ఎలాగో మంచి మాటలతో నచ్చజెప్పి ఇక్కడకు తీసుకొని రండి!" అన్నారు.

"వెళుతున్నాను, యువరాజా! ఆమెను వెతికి పిలుచుకొని వస్తాను. కానీ మీరు పళువేట్టరయ్యర్ల చేత బంధించబడడాన్ని నేను చూస్తూ సహించలేను. నా ఒంట్లో ప్రాణం ఉన్నంత వరకు అది జరగని పని!" అని చెబుతూనే వంతిదేవుడు వెళ్ళాడు.

"సేనాధిపతీ! మీ అభిప్రాయమేమని ఇంకా చెప్పలేదే?" అని అరుళ్మొళి వర్మ అడిగారు.

"నా మాట ఇదే - పళువేట్టరయ్యర్లు పంపించిన మనుషులను మీరు కలవకూడదు. పార్థిబేంద్రుడు తీసుకొని వచ్చిన ఓడలో మీరు వెంటనే కంచికి వెళ్ళిపొండి. నేను తంజావూరుకు వెళతాను. అక్కడ చక్రవర్తిని ప్రత్యక్షంగా కలిసి నిజానిజాలు తెలుసుకొంటాను..."

"మీరు తంజావూరుకు వెళ్లడమంటే సింహం నోట తలదూర్చడమే.. వెళితే తిరిగి రారు. అలాగే వెళ్ళి అక్కడున్న పాతాళ చెరసాలలో పడిపోతారు. చక్రవర్తిని చూసేందుకు కూడ వీలుకాదు..."

"ఏమంటున్నావు? ఈ చోళ సామ్రాజ్యంలో నన్ను చెరపట్టగల బలం, ధైర్యం ఎవరికుంది? చక్రవర్తిని నేను కలవకూడదు అని అడ్డగించగల మగతనం ఎవరికుంది? పైగా, అక్కడ ముఖ్యమంత్రి అనిరుద్ధ బ్రహ్మరాయలున్నారు."

“బ్రహ్మరాయలుంటే ఏం ప్రయోజనం? ఆయనే చక్రవర్తిని చూడలేకపోయారు. ఇదిగో ఆయన శిష్యుడిక్కడ నిలబడివున్నాడు కద? ఆయనేం చెబుతాడో వినవచ్చు కద?”

సేనాధిపతి ఆళ్వార్ కట్టియాన్ వైపు చూసి, “అవును; ఈ వైష్ణవుడు ఇక్కడ నిలబడివున్నాడన్న విషయాన్నే మరిచాను. తిరుమలై! ఎందుకిలా మౌనంగా నిలబడ్డావు? కాసేపటి క్రితం యువరాజన్నట్లు నీవు కూడ మూగవాడివైపోయావా, ఏమి?” అన్నారు.

“సేనాపతీ! 'దేవుడు మనకు రెండు చెవులిచ్చాడు, ఒకే నోరిచ్చాడు. కాబట్టి చెవులను బాగా ఉపయోగించి, నోటిని కాస్త తక్కువగా ఉపయోగించు' అని నా గురుదేవులు నాకు ఉపదేశించారు. ముఖ్యంగా, పెద్ద రాజకీయ విషయాల గురించి చర్చ జరుగుతున్న చోట ఆ నియమాన్ని/వ్రతాన్ని తప్పక పాటించాలని చెప్పారు.”

“గురువాక్కు చాల బాగ పాటిస్తున్నావు. ఇప్పుడు మేమే అడుగుతున్నందువల్ల చెప్పు. నీ ఆలోచన ఏమి?”

“దేని గురించి నా అభిప్రాయాన్ని అడుగుతున్నారు, సేనాపతీ!”

“ఇంతసేపూ మాట్లాడుతున్న విషయమే. యువరాజు ఇప్పుడు ఏం చేయడం ఉచితం? లంకలోనే ఉండడమా? లేక, కంచికి వెళ్లడమా?”

“నా నిజమైన అభిప్రాయాన్ని చెప్పనా? యువరాజు అనుమతిస్తే చెబుతాను.”

ఏదో ఆలోచనల్లో మునిగివున్న అరుళ్మొళి వర్మ ఆళ్వార్ కట్టియాన్ని చూసి, “చెప్పు, తిరుమలై! ధారాళంగా మనసు విప్పి చెప్పు!” అని ధైర్యం చెప్పారు.

“ఈ లంకలోనే ఉన్న అతి కఠినమైన కారాగారాన్ని వెతికి అందులో యువరాజును పెట్టి తాళం వేయండి! బయట గట్టి కాపలా కూడ పెట్టండి!”

“ఇదేం పిచ్చి మాట?” అన్నారు సేనాపతి.

“వేళాకోళానికి ఇదేనా సమయం?” అన్నాడు పార్థిబేంద్రుడు.

“నేను వదరడమూ లేదు; వేళాకోళమూ చేయడం లేదు. మనసులో ఉన్నది చెప్పాను. నిన్న రాత్రి యువరాజు అనురాధపురం వీధులగుండా నడిచి వస్తున్నారు. ఉన్నట్లుండి ఒక ఇంటి ముందు భాగం ఆయన తలమీద ఇంచుమించువిరిగి పడింది. తర్వాత మేము ఒక ఇంట్లో పడుకొన్నాము. అర్ధరాత్రి, అదృష్టవశాత్తు ఒక కార్యం మీద లేచి బయటకు వెళ్ళాము. కాసేపటికల్లా ఆ ఇంటికి నిప్పంటుకొని కాలిపోయింది. ఇదంతా నిజమో, కాదో యువరాజునే అడగండి!”

ఇద్దరూ యువరాజు వైపు చూశారు. ఆయన ముఖభావాలు ఆళ్వార్ కట్టియాన్ చెప్పింది నిజమేనని రూఢిపరిచాయి.

“ఈ అపాయాలన్నీ ఎవరిని ఉద్దేశించి జరిగాయని అడగండి. నన్నో, లేక వంతిదేవునో

చంపేందుకు ఎవరైనా ఒక మాళిగను కాల్చేస్తారా?"

పార్థిబేంద్రుడు వెంటనే తుళ్ళిపడి లేచి, "యువరాజును చంపేందుకే ఎవరో ప్రయత్నిస్తున్నారు. ఇందువల్ల యువరాజు నాతో కంచికి రావలసిన అవశ్యకత దృఢపడుతోంది!" అన్నాడు.

"కూడనే కూడదు! యువరాజును మీతో పంపించడం కన్న పళువేట్టరయ్యర్లకు పట్టివ్వడమే నయం!" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

"వైష్ణవా! ఏమన్నావు?" అని కత్తి దూశాడు పార్థిబేంద్రుడు.

సేనాపతి అతన్ని చేయి పట్టి ఆపి, "తిరుమలై! ఎందుకలా చెబుతున్నావు? పార్థిబేంద్ర పల్లవులు చోళవంశానికి ఆప్త మిత్రులన్న విషయం నీకు తెలియదా?" అని అడిగారు.

"తెలుసు, సేనాపతీ, తెలుసు! స్నేహభావం మాత్రముంటే చాలా?"

"పార్థిబేంద్రులు  స్నేహం కోసం ప్రాణం కూడ ఇవ్వగలరని ఎరుగుదువు, తిరుమలై!"

"అది కూడ నిజం కావచ్చు. కానీ నేనొక ప్రశ్న అడుగుతాను. దానికి జవాబివ్వమనండి. మేము నిన్న సాయంత్రం తంటళ్ళై దగ్గర వెళుతున్నప్పుడు వీరితో బాటు ఇద్దరు మనుషులు వస్తుండడం చూశాము! వారు ఎవరు, ఇప్పుడెక్కడున్నారని వీరిని అడిగి చెప్పండి."

పార్థిబేంద్రుడు అదిరిపడ్డాడు. కాస్త జంకుతూనే ఇలా జవాబిచ్చాడు:- "త్రికోణమలైలో వారిని కలిశాను. యువరాజున్న చోటు చూపిస్తామని చెప్పి పిలుచుకొని వచ్చారు. అనురాధపురంలో ఉన్నట్లుండి మాయమైపోయారు. ఎందుకడుగుతున్నావు, వైష్ణవా? వారి గురించి నీకేమైనా తెలుసా?"

"తెలుసు! చోళ వంశాన్ని సమూలంగా నాశనం చేయ శపథం చేసిన వారిలో వారిద్దరున్నారని తెలుసు. నిన్న అనురాధపురంలో యువరాజును చంపజూసిన వారు వారేనని నేనూహిస్తున్నాను.... ఆహా! అదిగో చూడండి!" అని ఆళ్వార్ కట్టియాన్ చూపించాడు.

అతడు వేలెత్తి చూపించిన చోటు మంటపానికి కాస్త దూరంలో ఉంది. దట్టంగా పెరిగిన చెట్ల మధ్య ఒక అందమైన ఆడపిల్ల, ఒక యువకుడు నిలబడి మాట్లాడుతున్నారు. వారు పూంగుళలి, వంతిదేవుడేనని సులభంగా ఊహించవచ్చు. మాట్లాడుతూ, మాట్లాడుతూనే వంతిదేవుడు ఉన్నట్లుండి ఒక చురకత్తిని విసిరాడు. కత్తి ఒక పొదలో వెళ్ళి పడడమూ, 'కెవ్వు'మన్న కేక వినిపించడమూ ఒకేసారి జరిగాయి.

~~~
~~~

# అధ్యాయము - 42

## పూంగుళలి కత్తి

**పాడుబడ్డ** మంటపం నుంచి పరుగెత్తి పారిపోయిన పూంగుళలి ఒంటరిగా ఒక చెట్టు వెనక నిలబడి ఉండడాన్ని గమనించాడు వంతిదేవుడు. ఆమె మెల్లగా వెక్కి వెక్కి ఏడుస్తుండడం వినిపించింది.

అతి మెత్తని స్వరంతో, నయంగా,"పూంగుళలీ!" అని పిలిచాడు.

శబ్దం విన్న పూంగుళలి ఉలిక్కిపడి తిరిగి చూసింది.

"నీవేనా?" అనేసి మళ్ళీ అటువైపు తిరిగింది.

"నేనే! నా పైన నీకెందుకు కోపం?"

"నీపైన నాకెటువంటి కోపమూ లేదు."

"మరి నీవెందుకు చిటపటలాడుతున్నావు?"

"నాకు మగవాళ్ళను చూస్తే ఇష్టం లేదు."

"యువరాజు కూడానా?"

పూంగుళలి మళ్ళీ కళ్లలో నిప్పులుగక్కుతూ వంతిదేవుని చూసింది.

"అవును; ఆయనంటేనే ముఖ్యంగా ఇష్టంలేదు!" అన్నది.

"అలా ఆయన ఏం తప్పు చేశారు?"

"నేను ఆయనకు జ్ఞాపకమే లేదు. నన్నాయన తలెత్తి కూడ చూడలేదు."

"నీవాయనకు బాగా గుర్తున్నావు. నేను నిన్ను గుర్తు చేసిన వెంటనే, 'ఓ! నాకు సముద్రకుమారి తెలియదా?' అన్నారు."

"అబద్ధం చెబుతున్నావు."

"నీవే స్వయంగా వచ్చి అడుగు."

"నేను జ్ఞాపకముం టే, నాతో ఎందుకు ఒక్క మాట కూడ మాట్లాడలేదు?"

"ఆయన మాట్లాడారు; నీవే బదులివ్వకుండ పారిపోయి వచ్చేశావు."

"అలాంటి మాటలను గురించి నేను చెప్పడం లేదు. తెలిసిన వారిని చూస్తే, 'ఏమి? ఎలా ఉన్నావు?' అని విచారించరా? - నీవు చెబుతున్నది అబద్ధం! ఆయన నన్ను తలెత్తి చూడనే లేదు."

"పూంగుళలీ! అందుకు ఒక కారణం ఉంది - యువరాజుకు ఇప్పుడు చాల కష్ట కాలం."

"అలాగని ఎవరు చెప్పారు?"

"అందరు జ్యోతిష్కులూ చెబుతున్నారు. కుడంద్తె జ్యోతిష్కులు నాకే అలా చెప్పారు."

"నీతో ఏం చెప్పారు?"

"యువరాజుకు కొన్నాళ్లపాటు కష్టం మీద కష్టం వచ్చి పడుతుందట. ఆయన తోటివారిక్కూడ కష్టాలు వస్తాయట. ఇది యువరాజుక్కూడ తెలుసు. కాబట్టి ఆయన తనతో ఎవరూ స్నేహంగా ఉండడానికిష్ట పడడం లేదు. తనకు వచ్చే కష్టం తనతోనే పోనీ అని భావిస్తున్నారు."

"మరి నీవు మాత్రం ఆయనతో ఎందుకంత స్నేహంగా ఉన్నావు?"

"నీవు కాసేపటికి మునుపు చూడలేదా? నాతోకూడ దెబ్బలాడి తరిమికొట్ట ప్రయత్నిస్తున్నారు. నడిదారిలో ఏకారణమూ లేనిదే నాతో కత్తియుద్ధానికి దిగారు. మీరందరూ వచ్చినందువల్ల అది ఆగిపోయింది."

"ఆయన తరిమినా కూడ నీవాయనను విడిచి వెళ్ళవా?"

"వెళ్లనే వెళ్లను. ఆయనకు వచ్చే కష్టాలన్నీ నేనుకూడ అనుభవిస్తాను."

"ఆయనంటే నీకంత ఇష్టమా?"

"అవును; చాల, చాల ఇష్టం."

"ఎందుకు?"

"కారణం చెప్పలేను. ఆయనను చూడగానే ఆయన మీద అభిమానం పుట్టుకొచ్చింది..."

"నాకూ అలాగే!" అన్నది పూంగుళలి. వెంటనే తానలా బాహాటంగా చెప్పేసినందుకు సిగ్గుపడి పెదవి కరుచుకొంది.

"నీకు యువరాజంటే ప్రియమని నాకు తెలుసు. అందుకే నిన్ను పిలుచుకొని వెళ్ళడానికి వచ్చాను. నాతో రా!"

"రాను!" అని మొరాయించింది పూంగుళలి.

"రాకపోతే నిన్ను బలవంతంగా లాక్కొని పోతాను."

"దగ్గరికొచ్చావో, ఇదిగో చూడు ఈ చురకత్తి! జాగ్రత్త!" అని పూంగుళలి తన బొడ్లో దోపుకొన్న చురకత్తిని తీసి ఝుళిపించింది.

"ఒసే పాపిష్టి పిల్లా! ఎందుకు నన్ను చంపేందుకు వస్తున్నావు? యువరాజుకు నిన్ను గుర్తు చేసినందుకా?"

"నీవబద్ధం చెబుతున్నావు. ఆయన దగ్గర నీవు నాగురించి ఏమీ చెప్పలేదు!"

""పోతే పోనీ/అదలా ఉండనీ; యువరాజును బంధించి తీసుకొని వెళ్ళేందుకు రెండు ఓడలు వచ్చాయన్నావు కద? అది యువరాజు దగ్గరకు వచ్చి చెప్పేసి ఎక్కడైనా తొలగు!"

"అన్ని వివరాలు సేనాపతికి చెప్పేశాను..."

"యువరాజు నీనుంచే ప్రత్యక్షంగా వినగోరుతున్నారు."

“ఆయన ముందు నేను మూగదాన్నైపోతాను.”

“మూగవాళ్లంటే యువరాజుకు చాల ప్రీతి!”

“ఛీఛీ! నీవు పరిహాసం చేస్తున్నావు!” అని పూంగుళలి కత్తిని పైకెత్తింది.

“అలాగైతే నీవు నాతో రావా?”

“రాను!”

“సరే; నేను వెళుతున్నాను!” అని చెప్పి వంతిదేవుడు రెండడుగులు వేశాడు. ఉన్నట్లుండి వెనక్కు తిరిగి పూంగుళలి చేతిలోని కత్తిని తీసుకొని విసిరేశాడు!

~

విసిరివేయబడ్డ కత్తి రివ్వున దూసుకొని వెళ్ళి ఒక పొదలో పడింది. కత్తి పడ్డ చోటినుంచి 'కెవ్వు'మన్న కేక వినిపించింది.

అది ఒక మనిషి గొంతా, లేక ఏదైన వన్య మృగం కేకా అని సరిగా తెలియలేదు.

వంతిదేవుడు తన చేతినుంచి కత్తిని లాక్కొన్న వెంటనే అతన్ని కోపంగా చూసిన పూంగుళలి ఆ కేక విన్నంతనే అటువైపు చాల ఆసక్తిగా చూసింది. తర్వాత ఇద్దరూ ఒకరినొకరు ఆశ్చర్యంగా చూసుకొన్నారు.

మెల్లగా అడుగులో అడుగులేసుకొంటూ ఆ పొదను సమీపించారు.

మొక్కల పైన, నేల పైన కొత్తగా రక్తం చిందివుండడాన్ని చూశారు.

అదిగాక, అక్కడ మనుషులూ లేరు, మృగాలూ లేవు. పూంగుళలి కత్తికూడ కనిపించలేదు.

“చూశావా, పూంగుళలి! ఇప్పుడైనా నేను చెబుతున్నది నిజమని నమ్ముతావా? యువరాజును నలువైపుల నుంచి అపాయాలు కమ్ముకొస్తున్నాయి. ఏ సమయాన ఎటువైపు నుంచి ఎటువంటి అపాయం వస్తుందో చెప్పలేము. యధాలాపంగా నీ కత్తిని లాగి విసిరేశాను. అందునుంచి ఇక్కడ ఎవరో పొంచి ఉండడం తెలియవచ్చింది. ఎందుకలా ఎవరైనా పొంచివుండాలని ఆలోచించు! యువరాజును సమయం చూసి ముగించేసేందుకే! నేను కోడిక్కరైకి వచ్చిన రోజు క్రితం రోజు మీ అన్న ఇద్దరు మనుషులను పడవలో ఎక్కించుకొని వెళ్ళాడని, వారిమీద నీకు సందేహం కలిగిందని నీవు చెప్పలేదా? అది గుర్తు తెచ్చుకో! ఇటువంటి సమయాన యువరాజు మీద ప్రీతి ఉన్నవారు ఆయనను విడిచి వెళ్ళవచ్చా?” అని వంతిదేవుడు గుక్క తిప్పుకోకుండ చెప్పి ఆపాడు.

“ఆయన నన్ను పొమ్మంటే ఏం చేయను?” అని పూంగుళలి అడిగింది.

“ఆయన పొమ్మన్నా మనం పోకూడదు!”

పూంగుళలి కాసేపాలోచించి, “ఇక్కడ పొంచివున్నది ఎవరో కనిపెట్టవద్దా?” అన్నది.

“అది మనకు సాధ్యం కాని పని. ఈ దట్టమైన అడవిలో ఎక్కడని వెతకడం? చాలసేపు ఆలస్యం

చేస్తే యువరాజుకు నిజంగా కోపం వచ్చేస్తుంది. మనని వదిలేసి అందరూ వెళ్ళిపోతారు! మాట్లాడక నాతో రా!"

"సరే, వస్తున్నా!" అన్నది పూంగుళలి.

~

వంతిదేవుడు, పూంగుళలి మంటపం దగ్గరకు వచ్చిన వెంటనే అక్కడ కూర్చొన్నవారు పైన వివరించిన సంఘటన గురించే మొదట అడిగారు. "ఎందుకలా కత్తిని విసిరేశావు? 'కెవ్వు'మన్న కేక వినిపించింది కద? అదేమి?" అని విచారించారు.

"పొదలో ఏదో మృగమో, సింహమో, నక్కో పొంచివున్నట్లనిపించింది. అందుకని ఈ పిల్ల చేతనున్న కత్తిని తీసి విసిరాను. దగ్గరికి వెళ్ళి చూస్తే ఏమీ లేదు" అన్నాడు వంతిదేవుడు.

"అది పోతే పోనీ. ఈ అమ్మాయిని ఏం అడగాలో అడగండి!" అన్నారు సేనాపతి.

పూంగుళలి తిరిగి వచ్చినప్పటినుంచి యువరాజునే చూస్తూంది. యువరాజు అప్పుడామెను తేరిపారజూశారు.

ఛీఛీ! ఈ మనసెందుకిలా కొట్టుకొంటూంది? గొంతులో ఏదో వచ్చి అడ్డుపడోదేమి? కళ్ళల్లో కన్నీళ్లెందుకుబుకుతున్నాయి? వెర్రిపిల్లా! నీ ధైర్యమంతా ఏమైంది? అలల కడలికి పెనుగాలులకు కించిత్తూ చెక్కుచెదరని నీ మనసెందుకు తడబడుతోంది? అతి భయంకరమైన వేంగి పులి కొరివి కళ్లల్లో కళ్ళు పెట్టి చూడగల నీ కళ్ళెందుకిప్పుడు మసకబారాయి? పిల్లా! మళ్ళీ పిచ్చిపిల్ల అన్న పట్టం కట్టించుకోకు! యువరాజును తలెత్తి చూడు! ఆయన అడిగే ప్రశ్నలకు గంట కొట్టినట్లు బదులివ్వు! నిన్ను ఏం చేసేస్తారు? ఆయన కరుణామయుడు, దయాళువు అని లోకమంతా పొగడుతోంది కద? ఒక అమాయకపు పిల్లను ఏం చేసేస్తారు....!

"సముద్రకుమారీ! నీకు నేను గుర్తున్నానా?" అని ఆయన అడిగిన ప్రశ్న సముద్రపు లోతులనుంచి వస్తున్నట్లు వినిపించింది ఆమె చెవులకు.

~~~
~~~

# అధ్యాయము - 43

## "నేను అపరాధిని!"

"**సముద్రకుమారీ**! నేను నీకు గుర్తున్నానా?"

"పొన్నియిన్ సెల్వా? ఇదేం ప్రశ్న? ఎవరిని చూసి 'గుర్తున్నానా' అని అడుగుతున్నారు? వేవేల సంవత్సరాలపాటు కలిసి మెలిసి తిరిగిన తర్వాత 'గుర్తున్నానా?' అని అడగడం తగునా? లేక, మీరే మరిచిపోయారా? ఎన్నాళ్ళు, ఎన్ని యుగాలు నా చిన్నారి పడవలో ఎక్కి నాతో వచ్చారు మీరు? కడలిలో, అంతులేని కడలిలో, తెల్లని అలల మధ్య, మనమిద్దరం నా చిన్నారి పడవలో ఎన్ని ఉల్లాస యాత్రలు చేశామో మరిచిపోయారా? ఉన్నట్లుండి నలువైపుల నుంచి కారుచీకటి కమ్ముకురాగా, మనమిద్దరం ఒకరికొకరు తోడుగా ఒకరి చేతినింకొకరు పట్టుకొని చాలసేపు నిలబడిందంతా మరిచిపోయారా? భయంకరమైన సుడిగాలి వీచినప్పుడు, కొండెత్తు లేచిన తరంగాలు మన చిన్న పడవను ఢీకొని, ఒక క్షణం ఆకాశానికెత్తి, మరుక్షణం పాతాళానికి తొక్కేసి అల్లకల్లోలం చేసినప్పుడు, మనమిద్దరం ఒకరికొకరు అండగా నిలబడి, ఆ సుడిగాలిని ఎదిరించి నిలబడ్డదంతా మరిచిపోయారా? ఒకసారి మనం ఆకాశవీధిలో ఎగిరి వెళ్ళాం కద? అది మరిచిపోయారా? చుక్కలను ఆకాశంనుంచి కోసి, నా సిగలో ఆభరణాలుగా అలంకరించారు కద, అది కూడ మరిచిపోయారా? పూర్ణచంద్రుని నా ముఖం దగ్గరికి తీసుకొని వచ్చి, "ఇదిగో, నీ అపరంజి ముఖాన్ని ఈ వెండి అద్దంలో చూసుకో' అని చూపించారే, అది కూడ మరిచిపోయారా? ఇంకొకసారి మీరు లోతైన సముద్రంలో మునిగిపోయారు; నా గుండె గుబగుబలాడింది. కాసేపటికల్లా రెండుచేతుల నిండా ముత్యాలు, పగడాలతో పైకి వచ్చి వాటిని మాలగా అల్లి నా మెడలో వేశారు! అది మీరు మరిచిపోయినా, నేను మరువలేను! రాజా! మిట్ట మధ్యాహ్న సమయంలో, నీలి రంగు నీటితో కలకల్లాడుతున్న చెరువు గట్టుపైన పూలగుత్తుల భారంతో వంగిన చెట్టు కొమ్మలు అలంకారంగా నిలిచిన చోట, మెత్తని గడ్డి చాపలమీద మనమిద్దరం ఒకరిముఖాన్నొకరు చూస్తూ ఎన్నెన్ని రోజులు గడిపామో, అదంతా మరిచిపోగలమా? ఆ సమయాల్లో ఆ చెట్ల కొమ్మల మీద నూరు కోయిలలు పాడిన గీతాలను, వేవేల తుమ్మెదలు చుట్టూ తిరుగుతూ చేసిన ఝుంకారాన్ని, వేవేల సీతాకోక చిలుకలు రంగురంగుల రెక్కలనాడిస్తూ చేసిన ఆనంద నాట్యాన్ని నేనెన్నటికీ మరువజాలను! నన్ను చూసి 'గుర్తున్నానా?' అని అడిగారు కద? అలా అడగవచ్చా?"

ఇలా ఏవేవో చెప్పాలని ఆ పిచ్చిపిల్ల మనసు తహతహలాడింది. కానీ ఆమె పగడాల పెదవులేమో, "గుర్తున్నారు!" అన్న ఒక్క మాటను మాత్రమే వెలిబుచ్చగలిగాయి.

"ఆహా! సముద్రకుమారీ! చివరికి నోరు విప్పి మాట్లాడావు కద! లేకపోతే ఈ సుందర లంకాద్వీపంలోని అనేక మణి మంటపాల స్తంభాల పైన విరచించిన అపూర్వశిల్పాలలో నీవొకతెవని అనుకొన్నాను! అదృష్టం కొద్దీ నీవు నోరు విప్పి మాట్లాడుతున్నావు. ఇంకా కొన్ని సంగతులు చెప్పు. నీ ఇంపైన గొంతు వినడానికి నాకెంతో ఆశగా ఉంది. మన సేనాధిపతికి నీవు కొన్ని విషయాలు చెప్పావట. తొండైమాన్ నదిలో రెండు పెద్ద ఓడలు మరుగైన తావున నిలబడివున్నాయని, వాటి నిండా యుద్ధవీరులు వచ్చారని చెప్పావట. అది నిజమే కద, సముద్రకుమారీ! ఆ ఓడలను నీవే నీ కళ్ళతో చూశావా?" అని అడిగారు యువరాజు.

"అవునయ్యా! నా కళ్ళతో చూశాను!" అన్నది పూంగుళలి.

"ఆహా! ఇప్పుడు నీ గొంతు కాస్త వినిపిస్తోంది. నా చెవులు ఆనందంతో నిండాయి. మంచిది; ఆ ఓడలను చూడగానే నీవు నీ పడవను ఒక ఇరుకైన కాలువలోకి నడిపించుకొని వెళ్ళావు. ఓడలు కనుమరగయ్యేవరకు వేచివుండేందుకు దట్టమైన అడవిలోకి వెళ్ళి పడుకొన్నావు. అప్పుడు ఓడ నుంచి కొందరు వీరులు అక్కడికి వచ్చారు. నీవు పడుకొన్న చోటికి పక్కనే వచ్చి నిలబడి వారిలో వారు మాట్లాడుకోసాగారు. వారి మాటలు నీవు వినాలని నీవనుకోలేదు. కానీ అనుకోకుండానే వారి మాటలు నీ చెవిన పడ్డాయి. ఇదంతా నీవు మన సేనాపతికి చెప్పిన విషయాలే కద?"

"జరిగింది జరిగినట్లు చెప్పాను."

"వారి మాటలు విన్న వెంటనే సేనాధిపతిని హెచ్చరించాలని నీకనిపించింది. ఆ వీరులు అవతలికి వెళ్ళగానే నీవు బయలుదేరావు; సేనాధిపతి ఉన్న స్థలాన్ని వెతుక్కొంటూ వేగంగా వచ్చావు! ఎలా వచ్చావు సముద్రకుమారీ?"

"సగం దూరం పడవలో వచ్చాను; తర్వాత అడవిదారిన నడిచి వచ్చాను."

"ఎక్కడికి వెళ్ళే ఉద్దేశంతో బయలుదేరావు?"

"సేనాపతి మామిడితోపు నగరంలో ఉన్నారని ఎంచి, అక్కడికి వెళ్ళే ఉద్దేశంతో బయలుదేరాను. దారిలో ఆయన మహింతలైలో ఉన్నట్లు తెలిసింది. సేనాపతిని చూసి ఈ విషయాన్ని చెప్పేటప్పటికి చాలుచాలనిపించింది. ఎంతమంది దారిలో అడ్డుపడి ఆపడం?" అని చెప్పి పూంగుళలి సేనాపతి ఉన్నవైపు చూసింది. ఆమె చూపులో వేసవికాలపు పిడుగుకు ముందు మెరిసే కత్తిపేటులాంటి మెరుపు మెరిసింది.

"సేనాపతిని చూడడమంటే మాటలా? ఇదిగో, ఇక్కడ నిలబడ్డ వీరు సేనాపతిని చూసేందుకు ఎన్నెన్ని కష్టాలు పడ్డారో వింటే నీవాశ్చర్యపోతావు. అడ్డంకులను పట్టించుకోకుండ పట్టుబట్టి సేనాధిపతిని చూసి ఈ విషయాన్ని చెప్పిందే మంచిదైంది. పూంగుళలీ! సేనాపతికి చెప్పింది నాక్కూడ ఒకసారి చెబుతావా? చెట్లచాటునుంచి విన్నావే, అప్పుడు ఆ వీరులు ఏ విషయం గురించి మాట్లాడుకొన్నారు?"

"రాజా! అది చెప్పేందుకు నా నోరు పెగలడం లేదు..."

“పెద్ద మనసు చేసి నాకోసం ఇంకొక్కసారి చెప్పు.!”

“తమను చెరపట్టి తీసుకొని వెళ్ళేందుకు వచ్చారని మాట్లాడుకొన్నారు.”

“ఎవరి ఆజ్ఞ ప్రకారం అలా వచ్చారన్న విషయం గురించి ఏదైనా మాట్లాడుకొన్నారా?”

“అది నేను నమ్మలేదు. అయ్యా! పళువేట్టరయ్యర్ల కుట్రగానే ఉండాలని నేను అభిప్రాయపడ్డాను.”

“నీ అభిప్రాయాన్ని తర్వాత చెప్పవచ్చు. వారు మాట్లాడుకొన్నది మాత్రం చెప్పు, సముద్రకుమారీ!”

“చక్రవర్తి ఆజ్ఞ మేరకే వచ్చారని మాట్లాడుకొన్నారు.”

“చాల మంచిది. అందుకు కారణమేమైన చెప్పుకొన్నారా?”

“చెప్పుకొన్నారు. మీరు ఈ దేశంలోని బుద్ధగురువులతో జతగూడి ఈ దేశానికి రాజుగా పట్టం కట్టుకోవడానికి పన్నాగం పన్నుతున్నారట. ... ఇలా అన్న ఆ పాపిష్టి వాళ్లను అక్కడే చంపేయాలన్నంత కోపం వచ్చింది...”

“మంచి పనే చేయబూనావు. చక్రవర్తి దూతలను ఎలాంటి కారణం వల్ల కూడ అడ్డగించకూడదని నీకు తెలియదా? సరే, వారింకేమైన ముఖ్యమైన విషయాలు మాట్లాడుకొన్నట్లు నీకు గుర్తుందా?”

“సేనాధిపతికి వారెందుకు వచ్చారని తెలిసిపోతే ఆయన వారిని అడ్డగించ ప్రయత్నించవచ్చనీ, కాబట్టి సేనాధిపతి ఉన్న చోటు తెలుసుకొని తామే స్వయంగా వెళ్ళి రాజాజ్ఞను అందజేసి వెంటనే తమతో యువరాజును తీసుకొని వెళ్ళాలని చెప్పుకొన్నారు....”

“కాబట్టి నీవు వెంటనే సేనాధిపతిని వెతుక్కొంటూ బయలుదేరావుకాబోలు. నాకు చాల పెద్ద సహాయం చేశావు, పూంగుళలీ! కాస్త దూరంగా ఉండు. వీరితో నేను ఒక ముఖ్యమైన విషయమై మంత్రాలోచన చేయవలసి ఉంది. కానీ మునుపటిలాగ చాల దూరం పరుగెత్తి పారిపోయి, మళ్ళీ నిన్ను వెతికి పట్టుకొని రావడానికి వంతిదేవులను పంపించేటట్లు చేయకు!”

సముద్రకుమారి కాస్త అవతలికి వెళ్ళి ఒక స్తంభం వెనక, యువరాజును చూడగలిగేటట్లు, నిలబడింది.

తేనె పాత్రలో మునిగి ఉక్కిరిబిక్కిరై, చివరికి ఎలాగో గట్టెక్కి ఆ తేనెను జుర్రుకొని ఆనందించిన రెండు తుమ్మెదల పరిస్థితిలాగుంది పూంగుళలి స్థితి కూడ. యువరాజు ముఖసౌందర్యమనే మధువును గ్రోలి ఆమె కళ్ళు మత్తెక్కాయి. ఆమె మనసు ఉప్పొంగి ఆకాశవీధిలో విహరించాలని తహతహలాడింది.

~

యువరాజు సేనాధిపతి బూది విక్రమకేసరిని చూసి, “అయ్యా! తరతరాలుగా మా కుటుంబానికి స్నేహితులుగా ఉంటున్న కుల నాయకులు మీరు; నా తండ్రికి ప్రాణస్నేహితులు మీరు; నేను మిమ్మల్ని

నా తండ్రికి సమానంగా భావిస్తున్నాను. మీరు కూడ నన్ను తమ స్వంత కుమారునిగా భావించి చూసుకొంటున్నారు. కాబట్టి నేను నా కర్తవ్యాన్ని నెరవేర్చడానికి సహాయం చేయాలి. అందుకు అడ్డు రాకూడదు!" అన్నారు.

సేనాధిపతి బదులు చెప్పేలోపు పార్థిబేంద్రుని వైపు చూసి, "అయ్యా! మిమ్మల్నికూడ వేడుకొంటున్నాను. మీరు నా ప్రియమైన అన్నగారి ప్రాణస్నేహితులు. నా అన్నగారి మాటను దైవవాక్కుగా ఎంచి గౌరవిస్తాను. కాబట్టి మీమాటను కూడ అంతే గౌరవంతో తీసుకోవడానికి బాధ్యుడనైవున్నాను. మిమ్మల్ని చాల వేడుకొంటున్నాను. నా కర్తవ్యాన్ని నెరవేర్చేందుకు ఎలాంటి ఆటంకమూ కలిగించకూడదు!" అన్నారు.

సేనాధిపతి, పార్థిబేంద్రుడు ఒకరినొకరు చూసుకొన్నారు. ఆ చూపుల ద్వారా ఒకరి భయాన్నొకరికి తెలియజేసుకొన్నారు.

సేనాపతి యువరాజును చూసి, "అయ్యా! మీరు చెబుతున్నది నాకేమీ అర్థం కావడం లేదు. జీవితకాలమంతా యుద్ధరంగాలలో గడిపినవాడిని. నిగూఢార్థ సంభాషణలు నేనర్థం చేసుకోలేను. మీ కర్తవ్యాన్ని నెరవేర్చబోతున్నట్లు చెప్పారు. అలాగంటే ఏమి? ఏ కర్తవ్యాన్ని నెరవేర్చాలనుకొంటున్నారు?" అని అడిగారు.

"ఇప్పుడు నా కర్తవ్యం ఒక్కటే. నా తండ్రి ఆజ్ఞను పాటించడమే. నన్ను పట్టి బంధించి తీసుకొని రమ్మని నా తండ్రి మనుషులను పంపారు. నన్ను వాళ్ళు వెతికి వేసారిపోవలసిన అవసరమేమి? నేనే వారున్న చోటికి వెళ్ళి నన్ను నేను ఒప్పగించుకొంటాను. అదే నేనిప్పుడు నెరవేర్చవలసిన కర్తవ్యం."

"అయ్యా! నా ఒంట్లో ప్రాణం ఉన్నంతవరకు అందుకు నేను సమ్మతించను. దాన్ని నేను అడ్డగించే తీరుతాను!" అన్నాడు పార్థిబేంద్రుడు.

సేనాధిపతి అతన్ని చూసి, "తొందర పడకండి! కాస్త ఓపిక పట్టండి!" అన్నారు. తర్వాత యువరాజును చూసి ఇలా అన్నారు:-

"అయ్యా! తమ కర్తవ్యం గురించి చెప్పారు. నాకూ ఒక కర్తవ్యం ఉంది. దయచేసి వినాలి. కొడుంబాళూర్ వేళార్ బృహత్కుటుంబంలో బతికి ఉన్నవాడిని నేనొక్కడినే. తక్కిన వారందరూ చోళసామ్రాజ్యసేవలో అసువులు బాసారు. బహుశ అందరూ యుద్ధరంగంలో మరణించినవారే. నేనూ అలా ఒకనాడు ప్రాణాలొడ్డుతానేమో - ఎవరికి తెలుసు? కాబట్టి నా మాటలను కాస్త ఓపికతో వినండి. అంతఃపురంలో సుఖంగా పెరిగిన మిమ్మల్ని గత సంవత్సరం దక్షిణసేనకు మాతండ నాయకుడిగా నియమించి పంపించారు చక్రవర్తి. అప్పుడు నన్ను పక్కకు పిలిచి ఇలా చెప్పారు:- 'యువరాజు నన్ను విడిచి వెళ్ళడం నా ప్రాణమే నన్ను శరీరాన్ని విడిచి వెళుతున్నట్లుంది. కానీ నా ఆశ కోసం వాడిని నన్ను అంతఃపురంలో పెట్టుకోకూడదు. వాడు బాహ్యప్రపంచంలోకి వెళ్ళి తీరాలి. కానీ వాడి ప్రాణానికి ఏదైన ఆపద

కలిగితే ఆ క్షణమే నా ప్రాణంకూడ వెళ్ళిపోతుంది. వాడికి ప్రాణాపాయం రాకుండ చూసుకోవడం నీ బాధ్యత...!" అని చక్రవర్తి నన్ను ఆజ్ఞాపించారు. క్రితంయేడు అలా చెప్పి పంపించిన చక్రవర్తి ఇప్పుడు మిమ్మల్ని చెరపట్టి తీసుకొని రమ్మని ఆజ్ఞాపిస్తారా? అలా ఆజ్ఞాపించేటందుకు మీరేం నేరం చేశారు? లంకాసింహాసనాన్ని చేటట్టేందుకు మీరు పన్నాగం పన్నుతున్నారనడం ఎంత సత్యదూరం? ఆ నిందను ఎవరికైనా నమ్మశక్యమా?...?"

కొడుంబాళూర్ పెద్ద వేళార్ ఇంతవరకు చెప్పుకొచ్చిందంతా ఓపికగా వింటూ వచ్చిన యువరాజు ఇప్పుడు అడ్డుపడి ఇలా అన్నారు:-

"ఇంకెవరైనా నమ్మలేకపోవచ్చేమోగాని, నేను నమ్మగలను!"

"ఏమంటున్నారు యువరాజా!"

"లంకాసింహాసనాన్ని చేటట్టేందుకు నేను పన్నాగం పన్నింది నిజమేనంటున్నాను."

~

వంతిదేవుడిప్పుడు ముందుకు వచ్చి, "ఇదేమయ్యా! కాసేపటికి ముందు సత్యం - ధర్మం అని చెప్పుకొచ్చారు. మరిప్పుడేమో ఇంత పెద్ద అసత్యం చెబుతున్నారే...! సేనాపతీ! వీరి మాటలను నమ్మకండి! నిన్న రాత్రి బుద్ధ గురువుల మహాసంఘంలో వీరికి లంకాసింహాసనాన్ని, కిరీటాన్ని ఇచ్చారు. కానీ ఈయనే తిరస్కరించారు. అందుకు ఇంకొక సాక్ష్యం ఇదిగో ఇక్కడ నిలబడ్డ వైష్ణవులే!" అన్నాడు.

పొన్నియిన్ సెల్వన్ చిరునవ్వు నవ్వి, "వంతిదేవా! కుట్ర పన్నేవారు పక్కన సాక్ష్యం పెట్టుకొని కుట్ర పన్నుతారా? మీరిద్దరూ నా పక్కనున్నందువల్లనే నేను లంకాసింహాసనాన్ని, కిరీటాన్ని తిరస్కరించి ఉండవచ్చు కదా?"

వంతిదేవుడు అవాక్కయ్యాడు. యువరాజు సవాలుకు బదులేమీ చెప్పలేకపోయాడు.

యువరాజు ఇంకా ఇలా చెప్పుకొచ్చారు: "వాణర్ కులవీరా! మీకింకా సందేహముంటే అదిగో అక్కడ నిలబడ్డ వైష్ణవులను అడిగి తెలుసుకోవచ్చు. ముఖ్యమంత్రి అనిరుద్ధ బ్రహ్మరాయలు ఆయనకేం చెప్పి పంపారో అడిగి తెలుసుకోవచ్చు. 'బుద్ధ గురువులు తమకు అలా సింహాసనాన్ని ఇవ్వడానికి ప్రయత్నిస్తారు. సాక్ష్యం పక్కన పెట్టుకొని తిరస్కరించండి' అని చెప్పి పంపారా, లేదా అని విచారించి తెలుసుకోండి!"

అది విని అక్కడున్న వారందరూ అదిరిపడి అవాక్కై నిలబడ్డారు.

~

యువరాజు సేనాధిపతిని చూసి ఇలా చెప్పారు:- "అయ్యా! ఇది వినండి. ఈ లంకను జయించి పాలించాలనే కోరిక నా మనసులో ఉండేదనడం నిజం. ఈ పేరాశను నాలో పుట్టించింది నా అక్కగారు. 'తమ్ముడూ! నీవు దేశాలను ఏలేందుకు పుట్టినవాడివి. నీ చేతిలో శంఖ చక్రరేఖలున్నాయి. ఇక్కడ నీకు

చోటు లేదు. కాబట్టి లంకకు వెళ్ళు. లంకాసింహాసనాన్ని చేజిక్కించుకో!' అని యువరాకుమారి తరచూ నాకు చెప్పి నా మనసులో ఆ ఆశను పెంచింది. కాబట్టి నేను అపరాధినే. చక్రవర్తి నన్ను బంధించి తీసుకొని రమ్మని ఆజ్ఞాపించడానికి కారణం లేకపోలేదు..."

"కాస్త ఆగండి, యువరాజా! మీ మనసులో అటువంటి కోరిక ఉదయించిందంటే అది లంకాద్వీపం చేసిన భాగ్యం. అందుకు బాధ్యులు కూడ మీరు కాదు; తమ అక్కగారు యువరాకుమారి కూడ కాదు. సుందర చోళ చక్రవర్తి అందుకు బాధ్యులు. ఆయనే నావద్ద చాలసార్లు చెప్పివున్నారు - లంకాసింహాసనం మీద మిమ్మల్ని కూర్చోబెట్టి చూడాలని. కుందవైదేవికి మొట్ట మొదట చెప్పింది కూడ ఆయనే. తమ తండ్రి కోరికనే తమ సహోదరి తమకు తెలియజేశారు. కాబట్టి మీరు అపరాధి కారు ..."

"సేనాపతీ! నా తండ్రి వద్దకు వెళ్ళేందుకు నేనెందుకు జంకాలి? ఆయనకు జరిగింది జరిగినట్లు చెబుతాను. ఇదిగో వీరిద్దరూ నాకు సాక్ష్యం చెప్పనీ. తర్వాత చక్రవర్తి ఏం ఆజ్ఞ వేస్తారో దాని ప్రకారం నడుచుకోవడం నా కర్తవ్యం..."

పార్థిబేంద్రుడప్పుడు నిప్పులుగక్కాడు:- "సేనాపతీ! ఏవేవో వట్టి మాటలు మాట్లాడుతున్నాము. ఇక దాగుడుమూతలాడడం  వల్ల ప్రయోజనం లేదు. యువరాజుకు నిజాన్ని చెప్పి తీరాలి. మీరు చెబుతారా, లేక నేను చెప్పనా?"

"నేనే చెబుతాను, ఆగండి!" అన్నారు సేనాపతి. చుట్టు పక్కల పరికించి చూసి, తర్వాత ఇలా చెప్పారు:- "యువరాజా! మీ అకళంకితమైన మనసుకు మసి పట్టకూడదని నేను చేసిన ప్రయత్నమంతా విఫలమైంది. ఒక విరసమైన విషయం గురించి మీకు చెప్పవలసివుంది. పెద్ద పళువేట్టరయ్యర్ ఈ ముసలిప్రాయంలో నందిని అనే ఒక అమ్మాయిని పెళ్ళాడిన విషయం మీకు తెలిసిందే. ఆమె ఒక మంత్రగత్తె. భయంకరమైన మంత్ర తంత్రవిద్యలు ఆమెకు తెలుసు. వాటి సహాయంతో ఆమె పెద్ద పళువేట్టరయ్యర్ని తన కాలికింద అదిమిపెట్టుకొనివుంది. ఆమె కాలితో చెప్పిన పనిని ఈయన తలతో చేస్తున్నారు. పురాతన కులంలో పుట్టి పలు వీరకృత్యాలను సాధించిన ఆ పెద్దాయనకు ఇప్పుడు ఇటువంటి దుర్గతి పట్టింది..."

"సేనాపతీ! ఇది నేను వినని విషయం కాదు కదా? చోళదేశ ప్రజలందరికీ తెలిసినదే కదా?" అన్నారు యువరాజు.

"ఆ మంత్రగత్తె శక్తి ఇంతవరకు పెద్ద పళువేట్టరయ్యర్ని మాత్రమే ఆట పట్టిస్తూంది. యువరాజా! మన్నించాలి! ఆమె ఇప్పుడు తన మాయమంత్రాలను చక్రవర్తి మీద కూడ ప్రయోగించనారంభించేసింది. అందుకే ఇటువంటి ఆజ్ఞను - తమను చెరపట్టి తీసుకొని రమ్మనే ఆజ్ఞను - చక్రవర్తి జారీ చేశారు...!"

"సేనాపతీ! హెచ్చరిక! జాగ్రత్త! చక్రవర్తి గురించి అగౌరవంగా ఏమీ మాట్లాడకండి. నా తండ్రి సజీవంగా ఉన్నంతవరకు ఆయన వేసే ఆజ్ఞ ఏదైనా, ఎటువంటి సందర్భంలో వేసినదైనా, అదే నాకు దైవాజ్ఞ..."

"దాన్ని మేము కాదనడం లేదు, యువరాజా! చక్రవర్తి స్వతంత్రానికి మాత్రమే కాదు, ఆయన ప్రాణానికే అపాయం రావచ్చనే జంకుతున్నాను. నందిని గురించిన పూర్తి నిజం నిన్నటి వరకు నాకు కూడ తెలియదు. నిన్న రాత్రి పార్థిబేంద్రుని ద్వారా తెలుసుకొన్నాను. ఆ భయంకరమైన విషయాన్ని మీరు కూడ తెలుసుకోవడం ముఖ్యం.

"మూడేళ్లకు మునుపు మదురై దగ్గర వీర పాండ్యునితో చివరి యుద్ధం జరిగింది కద? అప్పుడు మీ అన్నగారైన ఆదిత్య కరికాలన్, పార్థిబేంద్రుడు, నేను ఒక్కటిగా ప్రతివిషయం గురించి సమాలోచన చేసి నిర్ణయం తీసుకొనేవారం. పాండ్యుని సేనలు సమూలంగా నాశనమయ్యాయి. వీరపాండ్యుడు ఇంతకు మునుపు ఒకసారి ఎడారిలోకి వెళ్ళి దాక్కొన్నట్లు ఇప్పుడు కూడ తప్పించుకొని పారిపోజూశాడు. అందుకు చోటివ్వకూడదని  మేము ముగ్గురం ఎలాగైన వెతికి పట్టుకోవాలని పెద్ద ప్రయత్నం చేశాము. ఈసారి వీరపాండ్యుని తల తీసుకొని వెళ్ళక తంజావూరుకు తిరిగి వెళ్ళకూడదని మేము ముగ్గురం శపథం చేశాము. కాబట్టి ఇంకెవరినీ నమ్మకూడదని మేము ముగ్గురమే వారిని వెంబడించాము. చివరికి ఒక గుడి పక్కనున్న గుడిసెలో వాడు దాక్కొని ఉండడాన్ని కనిపెట్టాము. గుడిసె ముందు మమ్మల్ని కాపలా ఉంచి మీ అన్నగారైన కరికాలనే గుడిసె లోపలకు వెళ్ళారు. వీర పాండ్యుని చంపి వాడి తలను తీసుకొచ్చారు. నేను కూడ మా కార్యం నెరవేరిందని వెనుదిరిగాను. కానీ ఆ గుడిసెలో ఒక చిన్న నాటకం జరిగిందని మాకప్పుడు తెలియలేదు. వీర పాండ్యునికి ఆశ్రయమిచ్చిన ఒక స్త్రీ అడ్డువచ్చి తన ప్రియునికి ప్రాణభిక్ష ఇమ్మని వేడుకొంది. కరికాలన్ ఆమెను తన్ని తోసేసి వీరపాండ్యుని తల నరికి బయటకు తీసుకొచ్చారు. యువరాజా! అలా చోళ వంశానికి జన్మ శత్రువైన వీరపాండ్యుని కాపాడజూసింది ఆ నందినే! ఆమే తర్వాత డెబ్బై ఏళ్ళ ముసలాయనను పెళ్ళాడి తంజావూరుకు వచ్చి చేరి 'పళువూర్ యువరాణి' గా చెలామణి అవుతోంది! ఆమె ఎందుకు, ఏ ఉద్దేశంతో వచ్చివుంటుందని మనం ఊహించుకోవచ్చు కద? వీర పాండ్యుని మరణానికి పగ తీర్చుకోవడానికే వచ్చింది. చోళ వంశాన్ని సమూలంగా నాశనం చేసేందుకే వచ్చింది. అమె దగ్గరకు వెళ్ళిన వారెవ్వరూ ఆమె మోహపు వలలో పడకుండ ఉండడం అరుదు. అదిగో అక్కడ నిలబడ్డ వంతిదేవుడు అందుకు సాక్ష్యం చెబుతాడు. చోళ వంశాన్ని సమూలంగా నాశనం చేయడానికి శపథం చేసివున్న శత్రుకూటమి గురించి అదిగో ఆ వైష్ణవుడు చెబుతాడు. వారికి కావలసిన ధనసహాయమంతా నందినే చేస్తూంది. అది కూడ చోళ రాజ్యపు ఖజానా నుంచి దొంగిలించి! యువరాజా! దురదృష్టవశాత్తు మన చక్రవర్తి కూడ దాని వలలో పడిపోయినట్లున్నారు. మధురాంతకునికి పట్టం కట్టాలని చక్రవర్తే ఆలోచిస్తున్నట్లు కనిపిస్తోంది. కాబట్టి, చక్రవర్తి ఆజ్ఞ అని చెప్పి మీరు తంజావూరుకు వెళ్ళడానికి తరుణం ఇది కాదు ..."

"సేనాపతీ! మీరు చెప్పిన విషయాలు నాకు అమితాశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి. కానీ ఆ వార్తలు నా నిర్ణయాన్ని ఇంకా దృఢపరుస్తున్నాయి. నా తండ్రిని అటువంటి భయంకరమైన అపాయాలు

చుట్టుముడుతున్నప్పుడు  నేను ఉండవలసిన చోటు ఆయన చెంతనే. లంకారాజ్యం నాకెందుకు? ఇక ఆలోచించవలసిందేమీ లేదు. నన్ను అడ్డగించేందుకు ఎవరూ ప్రయత్నించకండి!" అని యువరాజు గంభీరంగా అన్నారు. తర్వాత, స్తంభాన్నానుకొని తమనే తదేకంగా/కన్నార్పకుండ చూస్తున్న పూంగుళలి వైపు తమ దృష్టిని సారించారు.

"సముద్రకుమారీ! కాస్త దగ్గరకు రా!" అన్నారు.

పూంగుళలి అలాగే ఆయనకు దగ్గరగా వచ్చింది.

"అమ్మాయీ! నీవు తీసుకొని వచ్చిన సమాచారం మూలంగా నాకు చాల పెద్ద సహాయం చేశావు. నాకు ఇంకా ఒక సహాయం చేయాలి. చేస్తావా?" అని అడిగారు.

అరెరె! ఇదేమి? ఈ పేద, పడవ పిల్లనా ఈయన సహాయం కోరుతున్నారు? ఈయనకు ఉడతాభక్తిగా సేవ చేసేందుకు వచ్చిన నన్నే సహాయం కోరుతున్నారే! దేవుని వరం అడగ వచ్చాను; కానీ ఆ దేవుడే తన దివ్య హస్తాలను చాచి, 'భిక్షవేయి' అని అడుగుతున్నారేమి? ఇలా మనసులోనే అనుకొని, "యువరాజా! తమ ఆజ్ఞను పాలించడానికి సిద్ధంగా ఉన్నాను!" అన్నది పూంగుళలి.

"సముద్రకుమారీ! నన్ను వెతుక్కొంటూ రెండు ఓడలు తొండైమాన్ నదీ ముఖద్వారం దగ్గరకు వచ్చాయన్నావు కద? ఆ చోటికి నేను అతి శీఘ్రంగా వెళ్ళి చేరాలి. నాకు దారి చూపి పిలుచుకొని వెళతావా?"

"అమ్మాయీ! 'వల్ల కాదు' అని చెప్పు!" అని గర్జించిందొక గొంతు. అది సేనాపతి స్వరమని పూంగుళలి గ్రహించింది.

ఇంతవరకు ఏదో స్వప్నలోకంలో తేలియాడుతున్న పూంగుళలికి ఇప్పుడే తానొక క్లిష్ట పరిస్థితిలో చిక్కుకొన్నానని తెలిసింది. ఏ అపాయం నుంచి ఈయనను తప్పించాలన్న ఆశతో తొందర తొందరగా తాను వచ్చిందో అదే అపాయం నోట తనను తీసుకొని వెళ్ళి పడేయమని యువరాజు తనను కోరుతున్నారు!

"అమ్మాయీ! 'వల్ల కాదు' అని చెప్పు!" అన్న సేనాపతిగారి ఆజ్ఞకు అర్థం ఆమెకు ఇప్పుడు పూర్తిగా స్ఫురించింది. నలువైపులనుంచి వేవేల గొంతులు అమెకు అదే ఆజ్ఞను ఇచ్చాయి. చెట్లు కూడ అదే చెప్పాయి; మంటపం స్తంభాలు కూడ అలాగే ఘోషించాయి; చెట్లపైని పక్షులు కూడ అలాగే చెప్పాయి.

కానీ ఆ అమాయకురాలి మనసులో ఒక చిన్న స్వరం ఇలా అన్నది:- 'పూంగుళలీ! ఇదే నీ అదృష్టావకాశం! యువరాజుకు దోవ చూపి తీసుకొని వెళ్ళడమైతే ఆయనతో రెండు రోజులు గడపవచ్చు. ఆయన చెంత నీవుండవచ్చు. ఆయన నిన్ను చూడనప్పుడు నీవాయనను చూడవచ్చు. ఆయనను తాకి వచ్చే గాలి నిన్ను కూడ తాకుతుంది. ఆయన ధ్వని నీకు తరచూ వినిపిస్తూంటుంది. ఓ అమ్మాయీ! నీవు కంటున్న అందని కలల్లో ఒకటి నెరవేరింది. తర్వాత ఏదేమైతేనేం? పూంగుళలీ! ఒప్పుకో!' అని ఆ చిన్న

స్వరం మనసులో చెప్పింది.

"సముద్రకుమారీ! ఎందుకు జంకుతున్నావు? నీవు నాకీ సహాయం చేయవా? నేనే దారి తెలుసుకొని వెళ్ళవలసిందేనా?" అని యువరాజు అడగగానే ఆమె మనసు దిటవైంది.

"యువరాజా! దారి చూపేందుకు నేను వస్తాను!" అన్నది.

సేనాధిపతి బూది విక్రమ కేసరి అప్పుడు గొంతు సవరించుకొన్నది ఒక చిన్న భూకంపంలాగ మారు మోగింది.

ఆయన ఒకడుగు ముందుకు వచ్చి ఇలా అన్నారు :- "యువరాజా! మీ కోరికకు అడ్డురాను. కానీ నా వేడుకోలును మీరాలకించాలి. తమను చెరపట్టి తీసుకొని వెళ్ళేందుకు వచ్చిన వారికి మిమ్మల్ని ఒప్పజెప్పేంత వరకు మిమ్మల్ని రక్షించడం నా బాధ్యత. నిన్న రాత్రి తమను చంపేందుకు జరిగిన ప్రయత్నాలను గురించి మీ స్నేహితులు నాకు చెప్పారు. వారెవరని నాకు తెలియదు. నా మనసులో ఉన్నది చెబుతున్నందుకు మన్నించండి. ఈ పిల్లపైనే నాకు కాస్త సందేహం ఉంది. ఆ హంతకులకు ఈమె కూడ సహాయం చేస్తుండవచ్చు కద? ఓడల్లో మిమ్మల్ని చెరపట్టి తీసుకొని వెళ్ళడానికి మనుషులు వచ్చారన్నదే ఈ పిల్ల కల్పన కావచ్చు కద? కాసేపటికి మునుపు ఈమె చేతినుంచి తమ స్నేహితుడు చురకత్తి లాక్కొని విసిరేసినప్పుడు ఒక కేక వినిపించింది కద? అది ఎవరి గొంతు? ఈ పిల్ల ధారాళంగా దారి చూపిస్తూ  రానివ్వండి. మన ఏనుగు పైన కూర్చొని ముందు వెళ్ళనీ. కానీ తమతోబాటు తొండైమాన్ నదిలో ఉన్న రెండు ఓడలు కనిపించేంత వరకు నేను వచ్చే తీరుతాను! అది నా కర్తవ్యం!"

సేనాధిపతి మాటలను చిరునవ్వుతో వింటున్న యువరాజు, "అలాగే కానివ్వండి! తమ కర్తవ్య నిర్వహణకు నేను కూడ అడ్డురాను!" అన్నారు.

~~~
~~~

# అధ్యాయము - 44

## ఏనుగుకు మదమెక్కింది!

**అలా** తీర్మానించిన వెంటనే సేనాధిపతి పార్థిబేంద్రుని పక్కకు తీసుకొని వెళ్ళి అంతరంగంగా మాట్లాడారు. తర్వాత తమతో వచ్చిన వీరులకు వేర్వేరు ఆజ్ఞలు జారీ చేశారు.

పార్థిబేంద్రుడు యువరాజు వద్ద సెలవు తీసుకొన్నాడు. "అయ్యా! నేను వచ్చిన పని నెరవేరక వట్టి చేతులతో తిరిగి వెళుతున్నాను. ఇందుకు కరికాలన్ నాపైన చాల కోపగించుకొంటారు. కానీ ఏం చేయడం? మీరు హఠం పడుతున్నారు. నా తప్పులేదు/ప్రయత్నలోపం లేదు. అందుకు ఇక్కడున్న వారందరూ సాక్ష్యం!" అన్నాడు.

యువరాజు, "ఇంత తొందరగా వెళ్ళాలా? మీరు కూడ తొండైమాన్ నది వరకు సేనాధిపతితో వచ్చి వెళ్ళవచ్చు కద?" అన్నారు.

"ఆ పాతకానికి నేను కూడ భాగస్వామిని కాను. నేను వచ్చిన ఓడ త్రికోణమలైలో నిలిచివుంది. అక్కడికి వెళ్ళి ఓడెక్కి వీలైనంత త్వరగా కంచికి వెళ్ళి చేరాలి. కరికాలన్‌కి జరిగిందంతా చెప్పాలి!" అన్నాడు పార్థిబేంద్రుడు.

తర్వాత వంతిదేవుని చూసి, "వల్లవరయ్యా! నీవు నాతో కంచికి రావడం లేదా?" అని అడిగాడు.

వంతిదేవుడు కాస్త ఉలిక్కి పడి, "లేదు; యువరాజుతో వెళ్ళాలనుకొంటున్నాను" అన్నాడు.

"అలాగే; నాతో రానందుకు తర్వాత విచారిస్తావు!" అని చెప్పేసి పార్థిబేంద్రుడు బయలుదేరాడు. సేనాధిపతి ఆజ్ఞ ప్రకారం అతడితో ఇంకొందరు వీరులు కూడ వెళ్ళారు.

వంతిదేవుడు ఆళ్వార్ కట్టియాన్ని చూసి, "ఆ పల్లవుడు చెప్పినదానికి అర్థమేమి? తనతో రానందుకు తర్వాత విచారిస్తానని ఎందుకన్నాడు? నీకేమైనా తెలుసా?" అని అడిగాడు.

"అతడు, సేనాధిపతి కూడబలుక్కొని ఏదో పథకం వేసివున్నారు! దాని వివరాలు తనంతట తానే త్వరలో తెలిసిపోతుంది. నిజానికి ఇప్పుడేర్పడిన సంకటానికి ఈ కొడుంబాళూర్ ముసలాయనే కారణం!" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

"అదెలా? సేనాధిపతి ఏం చేయగలిగి ఉండేవారు?"

"అంతా ఆయన చేసిన పనే. ఆయన కుటుంబానికి చెందిన అమ్మాయి ఒకతె పళైయారైలో పెరుగుతోందని నీకు తెలుసు కద?"

"బాగా తెలుసు. వాణతీదేవినే కద చెబుతున్నారు?"

"అవును. ఆ అమ్మాయిని యువరాజుకిచ్చి పెళ్ళి చేసి లంకాధిపతిగా పట్టం కట్టాలని సేనాపతి ఆశ. బుద్ధగురువులను యువరాజుకు కిరీటాన్ని ఇచ్చేటట్లు పురిగొల్పింది ఆయనే. ఈయనకు తన ప్రయత్నాలను రహస్యంగా చేసేందుకైనా తెలుసా? అదీ లేదు. సమాచారం తంజావూరుకు చేరి/పాకిపోయింది. అందుకే ముఖ్యమంత్రి అనిరుద్ధులు లంకకు వచ్చారు. నన్ను కూడ యువరాజు వద్దకు పంపించారు. వంతిదేవా! ఏదేమైనా, మన ప్రాణాలను మనం జాగ్రత్తగా కాపాడుకోవాలి. యువరాజు లంకాసింహాసనాన్ని తిరస్కరించారని మనమిద్దరం సాక్ష్యం చెప్పవలసి రావచ్చు."

~

ఇంతలో సేనాధిపతి పనులన్నీ ముగిసి, ఆయనతో వచ్చిన దండులోని వీరుల్లో నలుగురు తప్ప తక్కిన వారందరూ వేర్వేరు దిక్కుల్లో బయలుదేరి వెళ్ళారు.

చివరిగా యువరాజు బృందం కూడ బయలుదేరింది. యువరాజు, సేనాధిపతి, వంతిదేవుడు, ఆళ్వార్ కట్టియాన్, వారితోబాటు పైన సూచించిన నలుగురు వీరులు మేలుజాతి గుర్రాలనెక్కి ఉత్తర దిక్కుగా బయలుదేరారు.

వీరి వెంబడి పూంగుళలి కూర్చొన్న ఏనుగు గంభీరంగా నడిచి వెళ్ళింది. పూంగుళలి గాక, దాని పైన మావటి మాత్రమే ఉన్నాడు.

కాస్త దూరం వారు రాజబాట వెంబడి వెళ్ళారు. కానీ రాజబాటలో ప్రయాణం చేయడం సులభం కాదు. దారి పొడుగునా జన సమూహం. యువరాజు ఆ దారిన వస్తున్నారని ప్రజలకు ఎలాగో తెలిసిపోయింది. లంకాద్వీపంలో ఉత్తర భాగాన ఆ కాలంలో తమిళులే అధికంగా ఉండేవారు. కాబట్టి వారంతా అక్కడక్కడ గుమిగూడి, "యువరాజు అరుళ్మొళి వర్మకు జయహో!" "సేనాధిపతి కొడుంబాళూర్ వేళార్కి జయహో!" అని ఘోషించసాగారు. కొన్ని చోట్ల ప్రజలు గుర్రాలను చుట్టుముట్టి వాటి వెంబడే రాసాగారు. రాను రాను అలా వెంబడే వస్తున్న ప్రజల గుంపు పెరిగి పెద్దది కాసాగింది. గుర్రాలు వేగంగా వెళ్ళడం కూడ కష్టసాధ్యం కాసాగింది.

~

యువరాజు ఇందుగురించి సేనాపతితో చర్చించిన తర్వాత రాజబాటను వదిలి అడవిబాట వెంబడి వెళ్ళడమని తీర్మానించారు. ప్రజలను మెల్లగా వదిలించుకొని అడవిదారిన ముందుకు సాగారు. కానీ అడవిదారిన ఎదురయ్యే ప్రాకృతిక/స్వాభావిక అడ్డంకుల వల్ల వారి ప్రయాణం వేగంగా కొనసాగలేదు. కాస్త దూరం వెళ్ళగానే ఒక తామర కొలను కనిపించింది. దాని ఒడ్డుకు రాగానే అవతలి గట్టున ఒక పెద్ద జన సమూహం కనిపించింది. వీరిని చూడగానే ఆ గుంపు నుంచి తప్పెట, డోలు, కొమ్ము బూరా మొదలైన వాద్యాల ఘోష మొదలైంది.

"కాస్త ఆగండి. నేను వెళ్ళి వారెవరని విచారించి తెలుసుకొని వస్తాను!" అని చెప్పి సేనాధిపతి

తమ గుర్రాన్ని ముందుకు దూకించారు. కాసేపటికల్లా తిరిగివచ్చి, "యువరాజు ఇటువైపుగా వస్తున్నట్లు పొరుగు గ్రామానికి ఎలాగో తెలిసిపోయింది. వారంతా యువరాజుకు మర్యాదలు చేసేందుకే ఇక్కడ గుమిగూడారు!" అన్నారు.

ప్రజలు దగ్గరికి వచ్చారు. యువరాజు చుట్టూ తిరిగి వచ్చి ఎనలేని ఆసక్తితో ఆయన్నే చూడసాగారు. మళ్ళీ జయఘోషలు, దీవెనలు లేచాయి. వాటిలో "ఈలం రాజుకు (లంకలోని తమిళ ప్రాంతం) జయహో!" అన్నది అతి పెద్దగా వినిపించింది.

యువరాజు ముఖం చిరునవ్వుతో విప్పారింది. ఆ జనసమూహానికి నాయకుని లాగ కనిపిస్తున్నతన్ని దగ్గరికి పిలిచారు. "వీరెందుకు నాకు ఈలం రాజు పట్టం కడుతున్నారు?" అని అడిగారు. ఆయన చాల భక్తి, వినయాలతో, "రాజా! చాలకాలంగా ఈ ఈలం రాజు లేక ఇక్కట్లు పడుతోంది. పొన్నియిన్ సెల్వన్ ఈ దేశానికి రాజు కావాలన్నది మా కోరిక. ఈ నాడులో నివసిస్తున్న ప్రజలందరి కోరిక కూడ అదే. తమిళులు, సింహళీయులు, బౌద్ధులు, శైవులు, తురుష్కులు - అందరూ అదే కోరుతున్నారు!" అన్నాడు.

యువరాజుకు, ఆయనతో వచ్చిన వారికి విందు భోజనం ఇవ్వడానికి వారు అన్ని ఏర్పాట్లు చేసి వుంచారు. యువరాజు కాదనలేకపోయారు. విందారగించి మళ్ళీ బయలుదేరేటప్పటికి చాల పొద్దైపోయింది.

~

యువరాజుకు ఉపచారాలు జరుగుతున్నప్పుడు వంతిదేవుడు, ఆళ్వార్ కట్టియాన్ ఏకాంతంగా మాట్లాడుకోవడానికి అవకాశం దొరికింది.

"తమ్ముడూ! చూశావా! ఇదంతా సేనాధిపతి పన్నాగమని తెలియడం లేదా? ముందుగానే తన వీరులను పంపించి, యువరాజు వస్తున్న సంగతి తెలియజెప్పి ఈ విందులన్నీ ఏర్పాటు చేయించారు!" అన్నాడు ఆళ్వార కట్టియాన్.

"సేనాధిపతి ఏర్పాట్లే అని ఒకింత తెలుస్తూంది. కానీ ఈ పన్నాగం ఉద్దేశం ఏమై ఉంటుందో తెలియడం లెదు కద? ఇలా ఈ దీవి ప్రజలు చెప్పేది విని నిన్న తిరస్కరించిన లంకాసింహాసనాన్ని ఈరోజు ఆమోదిస్తారనా?" అని అడిగాడు వంతిదేవుడు.

"అది ఒక ఉద్దేశం కావచ్చు. దాని కన్న ముఖ్యమైనది మన ప్రయాణాన్ని ఆలస్యం చేయడమే!" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

"ప్రయాణాన్ని ఆలస్యం చేసి సేనాధిపతి ఏం ఫలితాన్ని ఎదురుచూస్తున్నారు?"

"అది నాకూ తెలియడం లేదు; కానీ త్వరలో తెలిసే తీరాలి! యువరాజు ముఖాన్ని చూడు! ఆయనకిదంతా నచ్చలేదని తెలుస్తోంది కద?"

వంతిదేవుడు యువరాజు ముఖాన్ని చూశాడు. ఉక్రోషంతో మాట్లాడేటప్పుడు కూడ విప్పారి ఉండే ఆయన ముఖంలో ఇప్పుడు నువ్వులు పేలుతున్నాయి. కనుబొమలు ముడివడ్డాయి. కళ్ళు

దీర్ఘాలోచనను సూచించాయి.

అదే సమయాన పూంగుళలి ఆ తామర కొలను అవతలి గట్టున ఒంటరిగా కూర్చొని ఆలోచనల్లో మునిగివుంది. ఈ ప్రయాణం ఆమె ఎదురుచూసినట్లు ఉత్సాహకరంగా ఉన్నట్లు లేదు.

ప్రయాణంలో యువరాజుతో ఏకాంతంగా గడిపే అవకాశం దొరుకుతుందని ఎదురుచూసింది. ఆయన తనతో ఏవేవో మాట్లాడుతారని కలలుగంది. తన మనసులో ఉప్పొంగుతున్న భావాలను ఒకింతైనా వెలిబుచ్చవచ్చని ఆశపడింది. దానికంతా సమయమే దొరకదు లాగుంది. యువరాజు చుట్టూ ఎప్పుడూ కూటమి ఉంటుంది కాబోలు.

ఆయనను శత్రువుల చేతికప్పగించాననే నింద ఒకటే తనకు మిగులుతుంది కాబోలు. ఆ నింద తానెందుకు మోయాలి? ఎందుకు ఇక్కడికిక్కడే ఎవరికీ తెలియకుండ పారిపోకూడదు? సేనాధిపతి కోపంనుంచైనా తప్పించుకొన్నట్లవుతుంది!

ఛ! సేనాపతి కోపం తన్నేం చేస్తుంది? ఎవరి కోపం గాని తననేం చేయగలదు? దానికంతా తాను భయపడడం లెదు. కానీ నా అనుభూతులన్నీ ఎందుకు మట్టిపాలు కావాలి? ఈ హృదయానలం నన్నింకా ఎన్నాళ్ళిలా దహిస్తూంటుంది? ఈ దేహంలో ఎందుకింకా ప్రాణముంది? ఉన్నట్లుండి ఒక పిడుగు పడి నన్ను తీసుకొని పోకూడదా? - ఎన్నోవేలసార్లు ఆశ పడ్డమైంది. ఏమీ ఫలితం దక్కలేదు. ఈ ఊపిరి తనంతట తానే పోదు. తానే ఏదైన చేసేయాలి...!

ఆఁ! ఇదేమి? కలగంటున్నానా? కాదు. కలకాదు. అదిగో ఆ పాడుపడ్డ మంటపం వద్ద యువరాజు స్నేహితుడు నానుంచి లాగి విసిరేసిన నా చురకత్తి (ఇప్పుడు) నా చెంత పడివుందేమి? అదెలా సాధ్యం? దీన్ని ఎవరు విసిరివుంటారు? ఎవరో ఆయన పగవారే విసిరివుండాలి? నన్ను చంపేందుకే! ఎంత దురదృష్టం! నాపైన పడకుండ కాస్త దూరంగా పడింది కద! - ఇదికూడ మన మంచికే. చేత చురకత్తి ఉండనీ. ఆయనకు నేనిచ్చిన మాట నెరవేర్చిన తర్వాత, ఆ పాతకులకు ఆయనను ఒప్పజెప్పిన తర్వాత, ఆయన ఎదుటే ఈ చురకత్తితో పొడుచుకొని చచ్చిపోతాను. ఛీఛీ! ఎందుకలా ఆయన మనసును గాయపర్చాలి? ఆయన వెళ్ళిన తర్వాత తానింకొక పడవెక్కి నడిసముద్రంలోకి వెళ్ళి కత్తితో పొడుచుకొని చావవచ్చు. నా ముద్దుల కత్తీ! నీవు తిరిగి వచ్చేశావు కద? నిన్ను తిరిగి పంపించిన వారికి వందనాలు.

ఒకవేళ యువరాజు మీదికి విసరాలని, గురితప్పి తనమీదికి విసిరారా? అవును! ఆయనకు దారిలో ఎన్నో అపాయాలు ఎదురు కావచ్చని సేనాపతి చెప్పారు కద...? అలా ఒక సందర్భం తనకు దొరకకూడదా? ఆయన పైకి విసిరిన కత్తి తన గుండెల్లో దిగకూడదా? అలా జరిగితే, రక్తం పొంగి ప్రాణం విడిచే సమయాన....!

పూంగుళలి మనసులో ఒక విచిత్రమైన ఆలోచన ఉదయించింది. ఆమె గుండెల్లో కత్తి దిగింది.

రక్తం ధారగా ప్రవహిస్తోంది. యువరాజు పరుగెత్తి వచ్చారు. "అయ్యో! నా కోసం ప్రాణాలు విడుస్తున్నావా?" అని విలపించారు. పూంగుళలి మనసు ఉప్పొంగి ఆమె గుండెల్లోనుంచి రక్తం మరింత ఉధృతంగా ఉబికింది. యువరాజు ఆమెను ఎత్తి తన ఒడిలో వేసుకొన్నారు. ఆమ గుండెల్లోనుంచి ప్రవహించిన రక్తం ఆయన శరీరాన్ని, బట్టలను తడిపేసింది. పూంగుళలి గలగలా నవ్వింది. "యువరాజా! ఇప్పటికైనా నా మనసులో ఉన్నదేమని తెలుసుకొన్నారా?" అని అడిగింది. "ఓ దౌర్భాగ్యురాలా! అది నాకు ముందే తెలుసు కద? ఇందుకా ప్రాణాలు విడుస్తున్నావు?" అని యువరాజు విలపించారు. పూంగుళలి ఆనందానికి ఎల్లల్లేవు. పెద్దగా నవ్వింది....!

"ఏయ్! పిచ్చిపిల్లా!" అన్న కేక వినిపించి పూంగుళలి ఉలిక్కిపడి తలెత్తి చూసింది. ఎదురుగా వంతిదేవుడు నిలబడివున్నాడు.

"యువరాజు ఇప్పటికే ప్రయాణం ఆలస్యమవుతోందని కోపంగా ఉన్నారు. నీవింకా ఆలస్యం చేయవద్దు! లేచి రా!" అన్నాడు. వంతిదేవుడు.

పూంగుళలి నవ్వుతూ లేచి పరుగెత్తి వెళ్ళి ఏనుగు పైకెక్కి కూర్చొంది. కత్తిని ఎదకు హత్తుకొని ముద్దాడింది.

~

అడవిదారిన ఇంకాస్త దూరం వెళ్ళిన తర్వాత ఒక ఎదురుచూడని సంభవం జరిగింది. ప్రయాణీకుల కుడిపైపు నుంచి దట్టమైన చెట్లమధ్యనుంచి 'సర్రు'మని ఒక బాణం దూసుకు వచ్చింది. అది యువరాజునుద్దేశించి వదలబడిందనడంలో సందేహం లేదు. కానీ ఆ బాణం కన్న వేగంగా యువరాజు గుర్రపు ముక్కుతాడును లాగి తిరిగారు. బాణం ఆయనకు అతిసమీపంగా వెళ్ళి ఆయనకవతల వస్తున్న ఆళ్వార్ కట్టియాన్ తలపాగాను ఎగరేసుకొని వెళ్ళింది.

ఆళ్వార్ కట్టియాన్ తల తడుముకొని ఆశ్చర్యంతో అటూ ఇటూ చూశాడు.

సేనాధిపతి బూది విక్రమకేసరి అదిరిపోయారు.

అందరూ అవాక్కై నిలబడ్డారు.

పూంగుళలేమో, ఆ అమ్ము తనకు తగిలి, తన ప్రాణం పోలేదే అని విచారించింది.

అందరూ ఆశ్చర్యం నుంచి కాస్త తేరుకొన్నాక, సేనాధిపతి, "యువరాజా! చూశారా? మిమ్మల్ని ఒంటరిగా పంపించివుంటే ఎంతటి విపరీతం జరిగివుండేది?" అని చెప్పేసి, కాపలాకు వచ్చిన వీరులను అడవిలో వెతకమన్నారు. వారు కాసేపు వెతికి, తిరిగి వచ్చి, "ఎవరూ కానరాలేదు" అన్నారు.

~

సేనాధిపతి ఇక ముందు ప్రయాణానికి ఏర్పాట్లు చేయసాగారు.

"యువరాజును  మధ్యన ఉంచి, మనం నలువైపులా చుట్టుకొని ముందుకు నడవాలి!" అని

వ్యూహం పన్నసాగారు.

అప్పుడు యువరాజు, “సేనాపతీ! ఒక విన్నపం!” అన్నారు.

“అదేం మాట? ఆజ్ఞాపించండి!” అన్నారు సేనాధిపతి.

“నేను ప్రాణాలతో తంజావూరు చేరగోరుతున్నాను. నా తండ్రికి నేను నిరపరాధినని నిరూపించగోరుతున్నాను.....”

“మీ తండ్రి మిమ్మల్ని ఏనాడూ సందేహించరు, యువరాజా!”

“నా తండ్రి మాత్రం కాదు, ప్రజలందరూ ఒప్పుకొనేటట్లు నిరూపించాలనుకొంటున్నాను. ఆ కార్యం నెరవేర్చిన తర్వాత నా ప్రాణాలను గురించి ఒకింత కూడ చింతించను. అంతకు ముందు దారిలో ఊపిరి విడువగోరను...”

“అయ్యా! మీకు ప్రాణాపాయం కలిగేటట్లయితే, ఆ క్షణమే ఈ కొడుంబాళూర్ ఖడ్గాన్ని గుండెల్లో దింపేసుకొంటాను!”

“అందువల్ల ప్రయోజనమేమీ లేదు, చోళ సామ్రాజ్యానికి మహానష్టం కలగడం తప్ప.”

"తమను కోల్పోవడం కన్న పెద్ద నష్టం చోళనాడుకు ఇంకేం రాగలదు? తమకు ఆపద కలగడానికి కారణమైన తర్వాత ఈ కొడుంబాళూర్ కడుపాపి ఒక్క క్షణమైనా సజీవంగా ఉంటాడా?”

“అలాగైతే నా ప్రాణాలను నేనే కాపాడుకోవడం అతి ముఖ్యమైనదిగా తోస్తూంది.”

“దానికన్న ఈ లోకంలో ముఖ్యమైనది ఇంకేమీ లేదు.”

“అందుకు నాకో ఉపాయం తడుతూంది.”

“చెప్పండయ్యా!”

“గుర్రం పైన వెళుతున్నంత వరకు కాసేపటికి మునుపు నాపైకి దూసుకు వచ్చిన బాణం లాంటి అపాయాలు ఎదురుపడుతుండవచ్చు.”

“నడిచి వెళదాం అంటున్నారా? లేక...”

“నాకు ఏనుగుల భాష బాగా తెలుసు; ఏనుగులు నేను చెప్పినట్లు వింటాయని మీకు తెలుసు కద?”

“అవునయ్యా! ఏనుగు మావటి వేషం ధరించి, ఈ లంకలో చాల చోట్లు తిరిగి వచ్చిన సంగతి కూడ తెలుసు!”

“కాబట్టి నేను చెప్పేదేమంటే, మళ్ళీ నేను కాసేపు ఏనుగు మావటినౌతాను. ఇప్పుడు ఏనుగును నడుపుతున్నవాడు కాసేపు నా గుర్రాన్నెక్కి రానీ.”

ఇది విన్న సేనాధిపతి కాస్త గాభరా పడ్డట్లు కనిపించింది. యువరాజు ఆలోచనకు ఎవరైనా ఆక్షేపణ చెప్పరా అని ఆయన ఆశగా అటూ ఇటూ చూశారు. కానీ అందరూ ఊరకున్నారు.

"అయ్యా! ఏనుగు మావటికి గుర్రం నడపడం తెలుసో, లేదో!"

"తెలియకపోతే, నడుచుకొంటూ తిరిగిపోనీ."

"ఆ పిల్ల చాల సంకోచస్తురాలిలాగ ఉంది కద? ఆమె తమతో సరిసమానంగ ఏనుగుపైన కూర్చొని రానంటే...."

"కిందకు దూకి నడిచి రానీ."

"చిత్తం, యువరాజా!"

~

యువరాజు వెంటనే గుర్రం పైనుంచి కిందకు దూకి ఏనుగు దగ్గరకు వెళ్ళారు. పూంగుళలి నల్లని కళ్ళు ఆశ్చర్యంతోను, కుతూహలంతోను విప్పారి ఆయనను చూశాయి. ఏనుగు మావటిని దింపేసి, యువరాజు తాను ఏనుగుపైకి లంఘించి కూర్చొన్నారు.

ఆగిపోయిన ప్రయాణం మళ్ళీ ముందుకు కొనసాగింది.

పూంగుళలి పులకించిపోయింది. ఏనుగు వెన్నుపైనుంచి మేఘాలకు ఎగిరింది. ఆకాశవీధిలో విహరించింది. స్వర్గాన్ని కాస్త చవిచూసి తిరిగి వచ్చింది.

ఆహా! ఇదేమి దేవగానమా? కాదు, కాదు! దేవగానం ఇంత తీయగా ఉంటుందా? యువరాజు కద మాట్లాడుతూంది?

"సముద్రకుమారీ! ఈ ఏనుగు పైన నాతో ఒంటరిగా ప్రయాణం చేయడం నీకయిష్టంగా ఉందా?"

"ఏడేడు జన్మల్లో నేను చేసిన తపస్సువల్ల నాకీ భాగ్యం లభించింది, ప్రభూ!"

"ఉన్నట్లుండి ఈ ఏనుగుకు మదమెక్కి పరుగెత్తనారంభిస్తే నీవు భయపడుతావా?"

"మీరు పక్కనున్నప్పుడు మిన్ను విరిగి మీదపడ్డా భయపడను, ప్రభూ!"

"నీ పడవను ఎక్కడ వదిలిపెట్టి వచ్చావు, పూంగుళలీ?"

"ఏనుగుల కాలువ దగ్గర, ప్రభూ!"

"అవతలి గట్టునా, ఇవతలి గట్టునా?"

"అవతలి గట్టునే సరైన చోటు దొరికింది. అక్కడే నా పడవను కట్టేసి వచ్చాను."

"మరి ఇవతలి గట్టుకెలా వచ్చావు?"

"నీరు పెద్దగా లోతు లేదు కాబట్టి చాలవరకు నడుచుకొంటూనే వచ్చాను. చివర కాస్త దూరం ఈదుకొంటూ వచ్చాను."

"మనం ఏనుగు పైన కూర్చొని ఆ కాలువను దాటుతున్నప్పుడు నీవు నీట పడిపోతే నీవు భయపడుతావా?"

"సముద్రంలో నన్ను తోసినా నాకు దిగుల్లేదు; నేను సముద్రకుమారిని కద? మీరే కద నాకా

పేరిచ్చారు?"

"మనం పడవ ఉన్నచోటికి చేరిన వెంటనే ఇద్దరం పడవెక్కుదాం. నీవే పడవను నడపాలి. పడవలో ఇద్దరితో నీవు పడవను నడపగలవు కద?"

"పదేళ్ల ప్రాయం నుంచి తెడ్లు వేసిన చేతులివి, ప్రభూ! అంతఃపురస్త్రీల చేతుల్లాగ మృదువైన చేతులు కావివి. మీ స్నేహితులు వంతిదేవుని పడవలో లంకకు తీసుకొని వచ్చిన విషయం ఆయన మీకు చెప్పలేదా?"

"చెప్పారు. కానీ ఈరోజు అంతకన్న వేగంగా వెళ్లాలి. తొండైమాన్ నదీముఖద్వారాన వచ్చి నిలిచివున్న ఓడలను అతిశీఘ్రంగా వెళ్ళి చేరాలి."

"యువరాజా! అంతటి క్రూరమైన కార్యాన్ని చేయమని నన్నెందుకు ఆజ్ఞాపించారు? మిమ్మల్ని చెరపట్టేందుకు వచ్చిన వారినుంచి మిమ్మల్ని తప్పించాలని ఉరుకులు పరుగులతో వచ్చాను. మరిప్పుడు మిమ్మల్ని వారికే ఒప్పజెప్పమని నన్ను పురమాయిస్తున్నారు కద? ఈ పేదరాలిమీదు ఎందుకింత కఠినత్వం?"

"పూంగుళలి! నా తండ్రి - చక్రవర్తి - జబ్బు పడివుండడం నీకు తెలుసు కద?"

"తెలుసయ్యా! ఆకాశంలో తోక చుక్క కొన్నాళ్ళుగా కనిపిస్తుండడం గురించి ప్రజలు మాట్లాడుకొంటున్నారని కూడ తెలుసు."

"ఏ క్షణమైన నా తండ్రి జీవితం అంతం కావచ్చు కద?"

పూంగుళలి మౌనందాల్చింది.

"ఆయన ఒకవేళ ఈ లోకాన్ని వదిలిపోయే పరిస్థితి వస్తే, ఆయనకు విరుద్ధంగా నేను కుట్ర పన్నాననే భావంతో ఆయన ఈ లోకాన్ని వదిలిపోవడం మంచిదా?"

"చక్రవర్తి ఏనాడూ మిమ్మల్ని గురించి అలా అనుకోరు. ఇది పళువేట్టరయ్యర్ల కుట్ర!"

"అటువంటి పళువేట్టరయ్యర్లకు కూడ నేను నిరపరాధినని నిరూపించగోరుతున్నాను...."

"ఎందుకు, ప్రభూ?"

"నిజంగానే నాకు రాజ్యమేలాలనే ఆశ లేదు, పూంగుళలీ!"

"ఇంకెందులో మీకు ఆశ, ధ్యాస?"

"పడవెక్కి అంతులేని కడలిలో పయనిస్తుండాలని ఆశ! సముద్రాలకవతల ఈ లంకలాంటి దేశాలెన్నో ఉన్నాయని విన్నాను. ఆ దేశాలన్నిటినీ వెళ్ళి చూడాలని ఆశ! ఆయా దేశప్రజలను చూసి మాట్లాడాలని ఆశ!"

"వింత! ఆశ్చర్యం!"

"ఏది వింత?"

“నా మనసులో నెలకొన్న ఆశే మీ మనసులో కూడ ఉండడం గురించి ఆశ్చర్య పడుతున్నాను. మీరలా సముద్రప్రయాణం చేసేటప్పుడు  నన్ను కూడ మీతో తీసుకొని వెళతారా?”

“ముందు నా కర్తవ్యం నెరవేరుస్తాను. అందుకు నీవు సహాయం చేస్తావు కద?”

“తమ చిత్తం!”

“నీవు కూర్చొన్న పీఠంనుంచి రెండు తాళ్ళు వేలాడుతున్నాయి కద? వాటిని తీసుకొని నిన్ను గట్టిగా కట్టుకో!”

“ఎందుకు, యువరాజా?”

“ఏనుగిప్పుడు మదమెక్కి పరుగెత్తబోతూంది! జాగ్రత్త, పూంగుళలి!”

ఇలా చెబుతూనే యువరాజు ఏనుగు కుంభస్థలాన్ని తడుముతూ దాని చెవిలో ఏదో చెప్పారు.

అంతే! నడక పరుగైంది. తొండాన్ని పైకెత్తి భయంకరంగా ఘీంకరించి పరుగు లంకించుకొంది. అడవిలోని చెట్లన్నీ సుడిగాలిలో చిక్కుకొన్నట్లు విలవిల్లాడాయి; పటపటమని చెట్లు, వాటి కొమ్మలు విరిగి పడ్డాయి. భూమి భూకంపం వచ్చినట్లు అదిరింది. అష్టదిక్కులూ గజగజ వణికాయి. చెట్లపైని పక్షులు భీతితో  టపటపా రెక్కలు కొట్టుకొంటూ ఎగిరిపోయాయి. అడవిలో అక్కడక్కడా నివసిస్తున్న మృగాలు బయటకు వచ్చి నలువైపులా పారిపోసాగాయి.

“అయ్యయ్యో! ఏనుగుకు మదమెక్కినట్లుందే! ఇదేమి విచిత్రం!” అని సేనాధిపతి విస్తుపోయారు.

యువరాజు ఇంతసేపూ చెప్పి హెచ్చరించినప్పటికీ పూంగుళలి ఇప్పుడు భయభ్రాంతులతో వణికిపోయింది.

పూంగుళలి ఒక పెద్ద సముద్రపు సుడిగుండంలో చిక్కుకొంది. యువరాజు కూడ చిక్కుకొన్నారు. ఆ ఏనుగుకూడ చిక్కుకొని గిరగిరా తిగరసాగింది. పూంగుళలి గట్టిగా కళ్ళు మూసుకొంది.

సుడిగాలి వల్ల తోయబడి పరుగెట్టే కారుమేఘాలలాగ ఆ ఏనుగు పరుగెడుతూనే ఉంది.

చివరికి ఏనుగుల కాలువకు చేరుకొంది.

అక్కడ లంకాద్వీపపు ఉత్తర, దక్షిణ సముద్రాలు సంగమిస్తున్నాయి. ఆ జలసంధి యొక్క అతి ఇరుకైన చోటుకే ఏనుగుల రాత్రి అని పేరు. లంకాద్వీపపు ఉత్తరభాగాన్ని,  మధ్యభాగాన్ని ఒకటిగా చేరుస్తున్న ఆ జలసంధిలో ఏనుగు దిగింది. హనుమంతుడు ఎత్తి విసిరేసిన కొండ కడలిలో పడ్డట్లు పడింది.

~~~
~~~

# అధ్యాయము - 45

## చెరసాల ఓడ

**కన్ను** మూసి తెరిచేలోపు 'ఏనుగుల కుంట' అనే ఆ జలసంధి కనుమరుగై వెనక్కు వెళ్ళింది. చెట్లన్నీ వెనక్కు పరుగెత్తాయి. కాలువలు, ఊళ్ళు, గుళ్ళు, మంటపాలు అన్నీ వెనక్కు ఎగిరి వెళ్ళాయి. జింకల గుంపొకటి ఆ ఏనుగుతో పోటీ పడి కాసేపు పరుగెత్త ప్రయత్నించాయి. కానీ అవి కూడ ఓడిపోయాయి. ఏనుగు మాత్రం వేగంగా ముందుకు సాగింది. ఎంతసేపు, ఎంతదూరం అని పూంగుళలికి ఏమీ తెలియలేదు. కానీ ఏనుగు ఇంకా ఈలంలోనే వెళుతూందా అని ఆమెకు ఆశ్చర్యమేసింది. ఇప్పటికి ఆ దీవిని మూడుసార్లు వెళ్ళి వుండవచ్చు! లేదు, లేదు! ఈ ఏనుగు ఇంకా ఈ ఈలం దేశాన్ని దాటి వెళ్ళలేదు. భూలోకపు దక్షిణ మూలనుంచి ఉత్తరానికి వెళుతోంది! దీని వీపు పైనెక్కి నేనుకూడ భూప్రదక్షిణం చేస్తున్నాను. నేను మాత్రమేనా? యువరాజు కూడాను!

మొదట, ఏనుగు మదమెక్కి పరుగెత్తనారంభించగానే పూంగుళలి కాస్త భయపడింది. భయంతో బాటు, ఏం జరుగుతుందోనన్న దిక్కుతోచని తనం కూడ కలిగింది. రెండుమూడు సార్లు యువరాజు వెనక్కు తిరిగి ఆమెను చూసి చిరునవ్వు నవ్వారు. వెంటనే ఆమె భయమూ, భీతీ మరుగైనాయి. అంతులేని ఉత్సాహం ఆమెలో ఉప్పొంగింది. కాసేపటి వరకు ఒక మత్తగజాన్నెక్కి వెళుతూంది. ఇప్పుడు ఉన్నట్లుండి స్వర్గానికే చేరుకొంది. దేవలోకంలో దేవేంద్రుని ఐరావతాన్ని ఎక్కి కూర్చుంది. ఐరావతం ఆకాశవీధిలో విహరిస్తూంది. కల్ప వృక్షాలు ఆమెపైన సుగంధ పుష్పాలను కురిపించాయి. గంధర్వులు మధురంగా పాడుతూ ఆమె వెనుకే ఎగురుతూ రాసాగారు. అప్సరసలు నాట్యం చేస్తూ వచ్చారు. ఊరేగింపు వెళ్ళిన ఆకాశవీధిలో రెండువైపులా నక్షత్రదీపాలు దేదీప్యమానంగా వెలిగాయి! ఇలా పలు యుగాలు గడిచాయి!

ఇదిగో, ఐరావతం వేగం తగ్గింది. ఉన్నట్లుండి భూలోకానికి వచ్చేసింది. ఈలం నాడులోని అడవుల్లోకే వచ్చేసింది. ఏనుగు మావటి వంగి దాని కుంభాన్ని తడుతున్నాడు. దాని చెవిలో ఏదో చెబుతున్నాడు. ఛీఛీ! అతను మావటి కాడు. దేవేంద్రుడు కద? - కాదు, యువరాజు కద ఆయన?

నలువైపులా దట్టంగా చెట్లున్న ఒక కొలను గట్టువద్దకు వచ్చి ప్రశాంతంగా నిలబడింది ఏనుగు.

పూంగుళలి కాస్త దిగులుతో, యువరాజుకు స్వాగతం పలికేందుకు జనకూటమి ఆ కొలను గట్టున వేచివుందా అని పరికించి చూసింది. లేదు! వెన్నంటి గుర్రాలొస్తున్నాయా అని చూసింది. అవికూడ లేవు. కొలనువైపు చూసింది. అందులో పూసిన తామరలు, కలువలు ఆమెను తమ తూళ్ళతో ఆమెను చుట్టుకొన్నాయి. చెంపలమీద, భుజాలమీద, ఒళ్ళంతా చుట్టుకొని అలరించాయి. తర్వాత ఆ పూల తీవెలే

ఆమెను గట్టిగా చుట్టి ఊపిరాడకుండ చేశాయి. ఒంటిని ఒక్కసారి విదిలించుకొని వాటి పట్టునుంచి విడిపించుకొంది. అలా ఒంటిని విదిలించుకొన్న వెంటనే స్వర్గలోకం నుంచి భూలోకానికి వచ్చింది. అది కూడ తలకిందులుగా! ఏనుగు తన ముంగాళ్లను మడిచి వంగింది. తర్వాత వెనక కాళ్లను కూడ మడిచి కూర్చొని నెమ్మదిగా పడుకొంది. యువరాజు ఏనుగు పైనుంచి కిందకు దూకారు. "పూంగుళలీ! ఏనుగుపైనుంచి కిందకు దిగేందుకు మనసు రావడం లేదా?" అని అడిగారు.

పూంగుళలి ఉలిక్కిపడి స్పృహలోకొచ్చింది. "అయ్యో! స్వర్గం నుంచి భూలోకానికి రావడం కష్టమే కద?" అని తనలో తాను చెప్పుకొంటూ దిగింది.

ఏనుగు మళ్ళీ లేచి నిలబడి కొలను గట్టునున్న ఒక పెద్ద చెట్టుకొమ్మను విరిచి తన పెద్ద నోట్లో కుక్కుకొంది.

అరుళ్మొళి వర్మ కొలను గట్టు వెంబడి నడుచుకొంటూ వెళ్ళి ఒక చోట కూర్చొన్నారు. పూంగుళలిని కూడ దగ్గరకు వచ్చి కూర్చోమన్నారు.

~

తేట నీటిలో పూంగుళలి ముఖం ప్రతిబింబించింది. ఏనుగు పరుగు వల్లనూ, ఆ సమయంలో కలిగిన ఉద్వేగం వల్లను ఆమె ముఖం ఎర్రబారి ఎర్ర తామరలాగ అగుపించింది.

నీట కనిపించిన ఆమె ప్రతిబింబాన్ని చూస్తూ యువరాజు, "పూంగుళలి! నీవు నాకు చాల నచ్చావు!" అన్నారు.

తామరలు, కలువలు మళ్ళీ తమ చోటినుంచి పెకలించుకొని వచ్చి ఆమెను చుట్టి ముద్దాడాయి.

"నీవు  నాకెందుకు నచ్చావో తెలుసా?" అని మళ్ళీ అడిగారు యువరాజు.

పూంగుళలి ముందున్న కొలను, అందులోని పూలు, గట్టునున్న చెట్లు గిరగిర తిరిగాయి.

"నాకు తెలిసిన ప్రతివొక్కరూ నేను వారి ఇష్టం ప్రకారం నడుచుకోవాలని ఆశ పడుతున్నారు. నీవొక్కతెవు మాత్రం నేను నా ఇష్టం ప్రకారం నడుచుకోవడానికి  సంతోషంగా సమ్మతించావు! ఈ సహాయాన్ని ఎన్నటికీ మరువను, సముద్రకుమారీ!"

పూంగుళలి శరీరమే ఒక సంగీత వాద్యమై, ఆమె నరాలన్నీ ఆ వాద్యపు తీగలై, బంగారు వన్నె చేతివేళ్ళు ఆ తీగలను మీటి సుమధుర గానాన్ని సృష్టించాయి.

"సేనాధిపతి, పార్థిబేంద్రులు కూడబలుక్కొని నా ప్రయత్నాన్ని ఆపజూశారు! సేనాధిపతి మనం వచ్చేదారిలో పలు విరామ స్థలాలు సృష్టించారు. మనకన్న ముందు తమ వీరులను పంపించి, ఆయా గ్రామస్థులను మనకు ఉపచారాలు చేసేటట్లు ఏర్పాట్లు చేయించారు. పార్థిబేంద్రులు అతివేగంగా త్రికోణమలైకి వెళ్ళిపోయారు. అక్కడినుంచి ఓడెక్కి తొండైమాన్ నదీముఖద్వారానికి మనకన్న ముందు చేరుకోవాలని ఆయన ఉద్దేశం. ఆహా! వారి పన్నాగం నాకు తెలియదనుకొన్నారు! నీ సహాయం వల్ల వారి పన్నాగాన్ని

వమ్ము చేసేశాను..."

పూంగుళలికి చటుక్కున తాను చేసిన పనేమిటని గుర్తుకొచ్చింది. ఆమెను నరకలోకంలో యమదూతలు సజీవంగా గానుగలో వేసి పిండినట్లనిపించింది.

"అయ్యో! వారందరూ మీరు బంధించబడకూడదని మిమ్మల్ని తప్పింపజూశారు. నేనే పాపిని! మిమ్మల్ని చెర పట్టించేందుకు తీసుకొని వెళుతున్నాను!" అని చెప్పేసి వెక్కివెక్కి ఏడ్వసాగింది.

"అరెరె! ఇదేమి? నీగురించి నేనెంతో మంచి అభిప్రాయంగొన్నాను కద? నీవు కూడ వారిలాగ మారిపోయావా?"

"నా స్వయబుద్ధితో ఈ పాతకాన్ని చేయలేదు. మీ ఇంపైన మాటలు విని పిచ్చిదాన్నయిపోయాను. ఇప్పుడు బుద్ధి వచ్చింది. నేను వెళుతున్నాను..." అని చెప్పి పూంగుళలి దిగ్గున లేచింది.

ఆమె మళ్ళీ పరుగెత్తి పారిపోకూడదని యువరాజు ఆమె చేతిని సుతారంగా పట్టుకొన్నారు.

అప్పుడు దేవలోకంలో ఊరకే కాలక్షేపం చేస్తున్న దేవకన్యలు వెన్నెలను గంధంతో రంగరించి ఆమెపైన కురిపించారు.

ఆమె పూర్తిగా శక్తికోల్పోయి, చేష్టలుడిగి, మళ్ళీ కూర్చొంది. రెండు చేతులా ముఖాన్ని కప్పుకొని మళ్ళీ వెక్కివెక్కి ఏడ్వసాగింది.

"సముద్రకుమారీ! నీకు ఒక ముఖ్యమైన విషయం చెప్పాలనుకొన్నాను. నీవింకా ఏడుస్తుంటే చెప్పలేను. వెంటనే బయలుదేరాలంతే...."

పూంగుళలి వెంటనే కళ్ళు తుడుచుకొని తలెత్తి ఆయనను చూసింది.

"అదే సరి; ఇప్పుడు విను! వీరందరూ నేను చెరపట్టబడకూడదని ప్రయత్నిస్తున్నారన్నావు కద? అది నిజమే. ఎందుకో తెలుసా?"

"వారికి మీమీదున్న ప్రేమ వల్లనే! నేనొక్కదాన్నే పాపిష్ఠిదాన్ని...!"

"ఆగాగు! నాపైన అందరికీ ప్రేమే! ఎందుకో తెలుసా? జ్యోతిష్కులు, రేఖా శాస్త్రజ్ఞులు చెబుతున్నారట – నేను మున్ముందు చక్రవర్తిని కాబోతానని. కాబట్టి ఒక్కొక్కరూ నన్ను సింహాసనంలో కూర్చోబెట్టి, నా తలమీద కిరీటాన్ని కూడ మోపేయజూస్తున్నారు. దురాశాపరులు!"

"అయ్యో! వారలా ఆశపడితే అందులో తప్పేమి? ఈ లోకానికి మాత్రమేనా, ముల్లోకాలకు చక్రవర్తి కావడానికి మీరు అర్హతగలవారు కద?"

"ఆహా! నీవు కూడ వారిలాగ మాట్లాడుతున్నావు కద?! అమ్మాయీ! ఈ ప్రపంచంలో అంతఃపురంలాంటి చెరసాల ఇంకొకటి లేదు; సింహాసనం లాంటి బలిపీఠమూ ఇంకొకటి లేదు; కిరీటం ధరించడంలాంటి శిక్ష కూడ ఇంకేదీ లేదు. ఇదంతా ఇతరులకు చెబితే వారు ఒప్పుకోరు. నీపైన

ఒప్పుకొంటావని అనుకొన్నాను..."

పూంగుళలి కనురెప్పలు సీతాకోకచిలుక రెక్కల్లాగ కొట్టుకొన్నాయి. ఆమె మమతానురాగాలు నిండిన కళ్ళతో యువరాజును చూసింది.

"సముద్రకుమారీ! నిజం చెప్పు. నిన్ను జీవితాంతం సింహాసనం మీద కూర్చోమంటే కూర్చొంటావా?" అని అడిగారు యువరాజు.

పూంగుళలి కాసేపు ఆలోచించింది. తర్వాత, "కూర్చోను!" అని తేటగా చెప్పింది.

"చూశావా? మరి నేను మాత్రం ఆ శిక్షను అనుభవించాలని ఎందుకు కోరుకొంటున్నావు?"

"మీరు రాజవంశంలో పుట్టినవారు కద?"

"రాజవంశంలో పుట్టినందువల్లనేమి? అదృష్టవశాత్తు దేవుడు నేనా శిక్షకు లోనుకావడానికి ఇష్టపడలేదు. రాజ్యం ఏలేందుకు నా అన్నగారున్నారు. నా పెదతాతగారి కుమారుడొకరున్నారు కూడ. ఆయన కూడ రాజ్యమేలేందుకు ఆశపడుతున్నారు..."

"ఆహా! అది మీ చెవులకు కూడ చేరిందా?" అన్నది పూంగుళలి.

"భలే అన్నావు! నాకు తెలియకుండ ఉంటుందనుకొన్నావా? కాబట్టి తంజావూరు సింహాసనం తనమీద కూర్చోవడానికి ఎవరూ లేరని వాపోదు. అంతేగాక, నాకు కిరీటం ధరించి రాజ్యమేలే ఆశకూడ లేదు..."

"మరి మీకు దేనిమీద ఆశ?" అని అడిగింది పూంగుళలి.

"అలా అడుగు, చెబుతాను! కాసేపటికి మునుపు ఈ మత్తగజమెక్కి ప్రయాణం చేశాం కద? అలా అడవులు, కొండలు, కోనలు చండమారుతం లాగ తిరగడమంటే ఆశ. ఓడెక్కి సముద్రాలు దాటి ప్రయాణం చేయడమంటే ఆశ. సముద్రాలకవతల ఈ లంకాద్వీపంలాంటి ఎన్నెన్నో ద్వీపాలు, భరతఖండం లాంటి ఎన్నెన్నో ఖండాలు ఉన్నాయని విన్నాను. అక్కడికల్లా వెళ్ళి ఆ దేశాల వింతలు, విశేషాలు చూడాలని ఆశ...!"

యువరాజు చెప్పే మాటలన్నీ అలాగే మింగేసేటట్లు నోరు వెళ్ళబెట్టి వింటూంది పూంగుళలి. ఉత్సాహం ఆపుకోలేక, "మీరు వెళ్ళే చోటికల్లా నన్ను కూడ పిల్చుకొని వెళ్తారు కదూ?" అని అడిగింది.

"నేనిప్పుడు చెప్పినవన్నీ నా ఆశలు. అవి నెరవేరుతాయో లేదో ఎవరికి తెలుసు?" అన్నారు యువరాజు.

పూంగుళలి స్వప్నలోకం నుంచి భూలోకానికి వచ్చింది. "అయ్యో! అలాగైతే మరిప్పుడు మీరు తంజావూరుకెందుకు వెళ్ళాలి?" అన్నది.

"అది చెప్పేందుకే మొదలెట్టాను. అంతలో నీవు మాట మార్చేసి ఎక్కడికో తీసుకొని వెళ్ళిపోయావు. సముద్రకుమారీ! ఈ లంకలో మాటల్లేని ఒక మూగవనిత పిచ్చి పట్టినట్లు తిరుగుతోంది

కద? ఆమె నీకు తెలుసా?” అని అడిగారు యువరాజు అరుళ్మొళి వర్మ.

పూంగుళలి ఆశ్చర్యం పట్టలేక, “తెలుసు, యువరాజా! ఎందుకడుగుతున్నారు?” అన్నది.

“కారణం తర్వాత చెబుతాను. ఆమె నీకు తెలుసా? ఆమె గురించి నీకేం తెలుసు?” అని అడిగారు యువరాజు.

“అయ్యా! నేను చిన్న బిడ్డగా ఉన్నప్పుడే తల్లిని కోల్పోయాను. తర్వాత నాకు తల్లిప్రేమనిచ్చింది ఆ మూగవనితే. ఆమే నా గురువు, దైవం. ఆమె గురించి ఇంకేమడుగుతున్నారు?”

“ఆ మూగవనితకు స్థిరమైన నివాస స్థలమేదైనా ఉందా? ఎప్పుడూ అక్కడా, ఇక్కడా తిరుగుతుంటుందంతేనా?”

“కోడిక్కరైనుంచి లంకను సమీపిస్తున్నప్పుడు భూతదీవి అనే ఒక దీవి ఉంది. అందులో రాతి గుహ ఒకటుంది. అక్కడే ఆ అమ్మ చాలా వరకు ఉంటుంది. అక్కడే నేను మిమ్మల్ని మొట్టమొదట చూశాను.”

“నన్నక్కడ చూశావా?”

“అవును! ఆ గుహలో ఆ అమ్మ కొన్ని అందమైన చిత్రాలను చిత్రించింది. ఆ చిత్రాలలో మీ రూపాన్ని కూడ చూశాను! తర్వాత ఒకరోజు కోడిక్కరైలో మిమ్మల్ని ప్రత్యక్షంగా చూసినప్పుడు, అందుకే భ్రమించిపోయాను.”

“ఓ! నాకిప్పుడంతా అర్థమవుతోంది. విశదం కాని విషయాలు కూడ విశదమవుతున్నాయి. సముద్రకుమారీ! ఆ మూగవనితకు, నాకు ఉన్న సంబంధం కూడ నీకు తెలుసా?”

“ఏదో సంబంధం ఉండాలని ఊహించాను. కానీ, ఇదీ అని తెలియదు!”

“పూంగుళలి! ఆమె నా పెత్తల్లి. న్యాయంగా చూస్తే తంజావూరు సింహాసనం పైన పట్టమహిషిగా కూర్చోవలసింది ఆమె...”

“భగవాన్! అలాగా?”

“కానీ విధిరాత ఇంకో విధంగా ఉంది. ఎవరేం చేయగలరు? నా తండ్రి మనసులో ఏదో ఒక రహస్యమైన దుఃఖం గూడు కట్టుకొని, ఆయనను వేధిస్తోందని నాకనిపించేది. దాని నిజాన్ని ఇప్పుడే కనిపెట్టాను. నా పెదతల్లి చనిపోయిందని నా తండ్రి భావిస్తున్నారు. తమ వల్లనే చనిపోయిందని కూడ భావిస్తున్నారు. ఆమె చనిపోలేదు, బతికేవుందని నేను వెళ్ళి ఆయనకు చెప్పాలి. చెబితే ఆయన మనస్తాపం చల్లారుతుంది. చక్రవర్తి ఆరోగ్యం బాగా లేదని నీకు తెలుసు కద? మనుష్య జీవితం అనిత్యం. ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవరూ చెప్పలేరు. ఆకాశంలో ధూమకేతువు అనే తోక చుక్క కొన్నిరోజులుగా కనిపిస్తోంది. దాని గురించి ప్రజలు పలువిధాలుగా మాట్లాడుకొంటున్నారు. చక్రవర్తి మనసు కూడ అందువల్ల బాధపడుతోందని తెలుస్తోంది.అటువంటి పరిస్థితిలో ఏదైన విపరీతమైన సంఘటన జరిగే

ముందు, నేను కనిపెట్టిన వివరాలను ఆయనకు తెలియజెప్పేయాలి. సముద్రకుమారీ! అందుకే నేను త్వరితంగా తంజావూరుకు వెళ్ళి చేరగోరుతున్నాను. నీవు నాకు చేసే సహాయం ఎంత ముఖ్యమైనదో ఇప్పుడు అర్థమైంది కద?"

~

ఎనలేని ఉద్వేగంతో యువరాజు మాటలు వింటున్న పూంగుళలి పెద్దగా నిట్టూర్చింది. "దైవమా! మనుష్య జీవితంలో ఎందుకిలా సంతోషంతోబాటు ఇంతటి దుఃఖాన్ని కూడ కలిగించావు?" అని తనలో తాను చెప్పుకొంది.

తర్వాత యువరాజును చూసి, "అయ్యా! ఈ దీనురాలి వల్ల మీకేదైనా సహాయం కలిగితే, అది నా పూర్వజన్మ సుకృతం. కానీ ఇందుకు నా సహాయం దేనికి? సేనాధిపతి మొదలైన వారికి చెప్పివుంటే వారు మిమ్మల్ని తంజావూరుకు తీసుకొని వెళ్ళేవారు కద?"

"లేదు; వారెవ్వరికీ ఈ విషయాన్ని చెప్పడానికి నేనిష్టపడలేదు. నన్ను ఎలాగైన సింహాసనమెక్కించాలనే ధ్యాసలో ఉన్నవారికి ఇది ముఖ్యమైన విషయంగా తోచదు. నా తండ్రి అంతరంగ విషయాలను వారికంతా చెప్పుకోవడం నాకిష్టం లేదు. చెబితే వారు అర్థం చేసుకోరు కూడాను. నీనుంచి ఇంకొక సహాయం కూడ కోరుతున్నాను. సముద్రకుమారీ! అందుకే ఏనుగును ఇక్కడ ఆపాను. నాకు చక్రవర్తి పట్టమూ, సామ్రాజ్య సింహాసనమూ ఇచ్చిన జ్యోతిష్కులు నాలు పలు అపాయాలు - గండాలు - ఎదురౌతాయని కూడ చెప్పారు. ఈ ప్రయాణంలో అటువంటిదేమైనా జరిగితే … నా తండ్రిని నేను కలవలేకపోతే, నీవు చక్రవర్తితో మాట్లాడాలి. ఎలాగైన ఆయనను కలిసి, నా పెదతల్లి సజీవంగా ఉందని ఆయనకు తెలియజేయాలి. ఆయన ఇష్టపడితే ఆ మూగతల్లిని ఆయన వద్దకు తీసుకొని వెళ్ళాలి. ఈ కార్యాలన్నీ చేస్తావా, పూంగుళలీ?"

"మీకే అపాయమూ కలగదు; అపాయం మిమ్మల్ని చూసి పారిపోతుంది. క్షేమంగా తంజావూరు వెళ్ళి చేరుతారు…"

"ఒకవేళ నాకేమైనా అయితే నా కోరిక నెరవేరుస్తావు కదూ?"

"తప్పక నెరవేరుస్తాను, యువరాజా!"

"ఈ ముఖ్యమైన కార్యాన్ని నేనింకెవరికి ఒప్పజెప్పగలను? నీవే చెప్పు?"

"నాకు ఒప్పజెప్పవలసిన కార్యాలను ఒప్పజెప్పేశారు కద? ఇక నేను సెలవు తీసుకోనా?" అన్నది పూంగుళలి, దుఃఖంతో పూడుకుపోతున్న గొంతుతో.

"ఆఁ! అదెలా? మనమింకా తొండైమాన్ నదీముఖద్వారం చేరలేదు కద? చోళదేశపు యుద్ధనౌకలు ఇంకా అగుపించలేదు కద? అంతలోపల నీవెలా సెలవు తీసుకోగలవు? కోపించుకోకు. ఇంకాసేపు ఓపిగ్గా నాతో ఉండు. ఏనుగు పైకెక్కి ఇంకాస్త దూరం నాతో రా! పులిజెండా ఎగురుతున్న ఓడలు

కనిపించగానే నీవు నన్ను విడిచి వెళ్ళవచ్చు!" అన్నారు యువరాజు.

~

బదులేమీ చెప్పలేక ఏనుగు నిలబడ్డ చోటువైపు నడక సాగించింది పూంగుళలి. యువరాజు కూడ ఆమె వెంబడే వెళ్ళారు. ఆయన మాట విని ఏనుగు ముంగాళ్ళు మడిచి కూర్చొంది. ఇద్దరూ దాని వీపు మీద కూర్చున్నారు. మునుపటి లాగ ఏనుగును యువరాజు పరుగెత్తించలేదు.. కానీ అది వేగంగానే ముందుకు సాగింది.

"సముద్రకుమారీ! నా కిష్టమైన పనులెన్నిటి గురించో చెప్పాను. మరి నీకిష్టమైన పనులేవని చెప్పాలి కద?" అన్నారు అరుళ్మొళి వర్మ.

"ఎనుబోతు వాహనం మీద వచ్చే యముడంటే నాకు చాల ఇష్టం. అర్ధరాత్రి బండమీద నిలబడి కొరివిదెయ్యాలను చూస్తూ పొద్దు పుచ్చడమంటే నాకు చాల ఇష్టం..."

"భలే విచిత్రమైన గుణాలున్న అమ్మాయివి నీవు!"

"మీ స్నేహితుడు చెప్పినట్లు 'పిచ్చి పిల్ల' అనండి. అందుకు నేను విచారించను. ఇంకా, నా చిన్న పడవలోకెక్కి సముద్రపుటలల్లో తేలియాడుతూ వెళ్ళడమంటే చాల ఇష్టం. అందులోను సముద్రంలో సుడిగాలి వీయడానికి మొదలు పెట్టిందంటే నా ఉత్సాహానికి ఎల్లలుండవు. అప్పుడు పడవ అలల శిఖరాన్నెక్కి ఆకాశాన్నంటుతుంది. మళ్ళీ పాతాళానికి ధడేల్మని పడిపోతుంది. అంతకన్న నాకిష్టమైన పని ఇంకేమీ లేదు. కాసేపటికి మునుపు ఈ ఏనుగు వెర్రెక్కినట్లు పరుగెడుతూ వచ్చింది కద, అది కూడ నాకు అంతటి ఉత్సాహాన్నిచ్చింది!"

"ఆహా! పూంగుళలి! మురుగన్ (సుబ్రమణ్యస్వామి) నీ చిరునవ్వు చూసి వచ్చివుంటే పూర్తిగా ఓడిపోయేవారు. ఏనుగు ముఖం వాడిని (గణపతి) పంపి వళ్ళిని భయపెట్టాడు కద, ఆ ఉపాయం నీ దగ్గర పారేదే కాదు!" అన్నారు యువరాజు.

~

వారు తొండైమాన్ నదీముఖద్వారాన్ని సమీపించినప్పుడు పూంగుళలి, "ఆఁ! ఇదేమి?" అని కేక వేసింది.

"ఏమి? ఏమైంది?" అని ఆదుర్దాగా అడిగారు యువరాజు.

"పులిజెండా ఎగురుతున్న ఓడలు నేను చూసిన చోట లేవేమి? నా గురించి మీరేమనుకొంటారు? సేనాధిపతి సందేహించినట్లే నేను మిమ్మల్ని మోసం చేసి తీసుకొని వచ్చినదాన్నయ్యాను కద?" అన్నది.

"అలా నేనెప్పుడూ అనుకోను, పూంగుళలి! నీవు నన్ను అబద్ధం చెప్పి, వంచించి తీసుకొని వచ్చావనడానికి ఏ ఆధారమూ లేదు..."

"ఎందుకు లేదు? నా ప్రేమ వల వేసి తీసుకొని వచ్చివుండవచ్చు కద? ప్రపంచమంతా అందంలో మన్మధుని, వీర పరాక్రమాలలో అర్జునుని మించిన వారని పొగిడే పొన్నియిన్ సెల్వన్ పైన మోహంగొని ఒక పేదపిల్ల ఇలా చేసివుండవచ్చు కద?"

"అమ్మాయీ! సేనాధిపతి ఒకవేళ ఇప్పుడిక్కడ ఉంటే అలా సందేహపడవచ్చు. కానీ, నీ మనసులోను, నా మనసులోను అటువంటి పిచ్చి ఆలోచనలకు తావు లేదు."

"అయ్యా! పళైయారై అంతఃపురంలో వాణతీదేవి అన్న ఒక రాకుమారి ఉంది కద. ఆమె గురించి మీరిలాగ చెబుతారా?"

"అవునవును. అది నేను మరిచిపోలేదు. ఈ సేనాధిపతి, నా అక్కగారు కూడబలుక్కొని ఆ పిల్లను నా మెడకు కట్టబెట్టజూస్తున్నారు. చోళసామ్రాజ్య సింహాసనం మీద కూర్చోవాలన్న ఆశవల్ల ఆ అమాయకురాలికి కూడ అటువంటి ఆశ పుట్టివుండవచ్చు. దానికి నేను బాధ్యుడిని కాను, పూంగుళలి! అదలా ఉండనీ. నీవు చూసినప్పుడు ఓడలెక్కడ ఉన్నాయి?" అని అడిగారు యువరాజు.

"అదిగో ఆ చివర నిలబడివుండేవి. నాకు చాల బాగ గుర్తుంది!" అన్నది పూంగుళలి.

"అందువల్లనేమి? అటు ఇటు జరిగివుండవచ్చు కద? దేనికీ సముద్రం వైపు వెళ్ళి చూద్దాం!" అన్నారు యువరాజు.

"ఓడలు వెళ్ళిపోయివుంటే మంచిదే. ఇప్పుడెందుకు వెళ్ళి వెతకాలి?" అన్నది పూంగుళలి.

"ఆహా! నీవలా అనుకోవచ్చు. కానీ నాకు దాన్ని మించిన ఆశాభంగం ఇంకేదీ ఉండబోదు!" అన్నారు యువరాజు.

~

మూడు వందలేళ్ళకు మునుపు లంకారాజ్యపు యువరాజైన మానవర్మన్ కంచికి వచ్చి శరణు కోరాడు. అతనికి రాజ్యాన్ని తిరిగి ఇప్పించేందుకు మామల్లపురపు చక్రవర్తి ఒక మహాసైన్యాన్ని పంపారు. ఆ సేనలు ఈ ప్రదేశంలోనే వచ్చి దిగాయి. అప్పుడు తొండైమాన్ నది ఉన్న చోట ఒక చిన్న కుంట మాత్రమే ఉండేది. ఓడలు వచ్చి నిలిచేందుకు, సేనలు దిగేందుకు అనువుగా దాన్ని తవ్వి వెడల్పుగాను, లోతుగాను చేశారు. తర్వాత అది తొండైమాన్ నది అన్న పేరుగాంచింది. ముఖద్వారం వద్ద ఆ నది మలుపులు తిరిగి పారేది. ఇరువైపులా దట్టంగా చెట్లు పెరిగాయి. ఇందువల్ల సముద్రం నుంచి చూసేవారికి కనపడనట్లు ఓడలు మరుగ్గా నిలిచేందుకు వసతిగా ఉండేది.

అలా లోతుగా నీరు నిండిన చోటే యువరాజును పట్టి తీసుకొని వెళ్ళడానికి వచ్చిన ఓడలను చూసింది పూంగుళలి. కానీ ఆ ఓడలు ఇప్పుడా చోట లేవు. అంటే, తెరచాపలు, స్తంభాలు మొదలైనవేవీ కనిపించలేదు. ఇంకా దగ్గరికి వెళ్ళి చూస్తే ఒక విచిత్రమైన దృశ్యం కనిపించింది. ఒక ఓడ నీటి వెల్లువను వదిలి బురదలో లోతుగా కూరుకొనిపోయివుంది. దాని తెరచాపలు, స్తంభాలు మొదలైనవి విరిగి

చెల్లాచెదరైవున్నాయి. అందులో మనుషులెవ్వరూ ఉన్నట్లు కనిపించలేదు. రెండు రోజులకు మునుపు తాను చూసిన ఓడల్లో అది ఒకటి అని పూంగుళలి గ్రహించింది.

యువరాజును చెరపట్టడానికి వచ్చిన ఓడల్లో ఒకటి, తానే బురదలో చెరపట్టబడివుండడం చూసి పూంగుళలి ఆశ్చర్యసముద్రంలో మునిగిపోయింది!

~~~
~~~

# అధ్యాయము - 46

## మనసు ఉప్పొంగింది!

**యువరాజు** ఏనుగు చెవిలో ఏదో మంత్రం ఊదారు. అది పడుకొంది. గబగబా ఇద్దరూ కిందకు దిగారు.ఒడ్డుకు కొట్టుకొని బురదలో కూరుకుపోయిన ఓడను పరీక్షించారు. ఆ ఓడ గతి చూసేందుకు చాల దీనంగా ఉంది. తెరచాపలు, కంబాలు విరిగి చెల్లాచెదరై పడివున్నాయి. ఒకవేళ ఆ విరిగిన ఓడలోపల గాని, చుట్టుపక్కల గాని ఎవరైనా ఉండవచ్చు కద అని సందేహించారు. యువరాజు చేతులు చరిచి శబ్దం చేశారు. పూంగుళలి కూత వేసి చూసింది. ఊహుఁ. దేనికీ బదుల్లేదు. ఇద్దరు నీట దిగి ఓడ అంచును పట్టుకొని ఎక్కారు. ఓడ అడుగుభాగపు బల్లలను పెకలించుకొని నీరు ఇసుక ధారాళంగా లోపలికొచ్చివున్నాయి. ఒక వేళ ఆ ఓడను నీటిలోకి తోసి నడిపించ ప్రయత్నించవచ్చేమో అన్న ఆశ దానితో అడుగంటిపోయింది. ఆ ఓడను అక్కడినుంచి నీటిలోకి తోయడం అసాధ్యం. తీరానికి లాక్కువెళ్ళడానికి ఒక ఏనుగు చాలదు. చాల ఏనుగులు, చాల మంది మనుషులు కావాలి. దాన్ని మళ్ళీ పనికొచ్చేటట్లు మరమ్మత్తు చేసి పునర్నిర్మించేందుకు  చాల మంది వడ్రంగులు ఎన్నో నెలలపాటు పనిచేయాలి.

చెదిరిపడివున్న తెరచాపల మధ్యనున్న పులిజెండాను చేతికి తీసుకొని చూశారు యువరాజు. అది ఆయనకు చాల మనోవేదనను కలిగించిందని స్పష్టంగా తెలియవచ్చింది.

“పూంగుళలి! నీవు చూసిన ఓడల్లో ఒకటేనా ఇది?” అని అడిగారు.

“అలాగే అగుపిస్తోంది. ఇంకొక ఓడ పూర్తిగా మునిగిపోయి తొలగిపోయినట్లుంది!” అన్నది పూంగుళలి. ఆమె గొంతులో కుతూహలం ధ్వనించింది.

“ఏమంత ఉత్సాహం?” అని అడిగారు యువరాజు.

“మిమ్మల్ని చెరపట్టి తీసుకొని వెళ్ళడానికి వచ్చిన ఓడలు మునిగిపోయి తొలగితే, నాకు ఉత్సాహంగా ఉండదా?” అన్నది పూంగుళలి.

“నీవుత్సాహపడడం పొరబాటు, సముద్రకుమారీ! ఏదో విపరీతం జరిగినట్లుంది. పులిజెండా ఎగరవేస్తున్న ఈ ఓడకు ఈ గతి పట్టడం నాకు చాల వేదనను కలిగిస్తోంది. ఇదెలా జరిగిందని కూడ తెలియడం లేదు. దీనిలో వచ్చిన కళాసీలు, వీరులు ఏమైనారని తలుచుకొంటే నా మనసు ఇంకా దిగులుపడుతోంది. ఇంకొక ఓడ మునిగిపోయివుండాలనా చెబుతున్నావు?”

“మునిగిపోయివుంటుందని అనుకొంటున్నాను. అలా అయితే చాల మంచిది.”

"మంచిది కానే కాదు. అలా ఏనాడూ జరగదు. ఈ ఓడకు పట్టిన గతి చూసి ఇంకొక ఓడ బాగా లోతు నీరున్న చోటికి వెళ్ళివుండవచ్చు. ఈ ఓడ ఒడ్డుకు ఎందుకింత దగ్గరగా రావలసి వచ్చిందని కూడ తెలియడం లేదు. చోళదేశపు కళాసీలు వేల సంవత్సరాల కొద్దీ ఓడలు నడిపే నైపుణ్యత, అభ్యాసం ఉన్న పరంపరలో వచ్చిన వారు. వారు ఇటువంటి పొరబాటు ఎందుకు, ఎలా చేశారు? ఎలాగు ఇందులో ఉన్నవారు తప్పించుకొని బయటపడివుండాలి. ఇంకొక ఓడలో ఎక్కి వెళ్ళివుండాలి, లేదా చుట్టుపక్కల ఎక్కడో ఉండాలి! రా! వెళ్ళి చూద్దాం!"

"ఎక్కడికి వెళ్ళి వెతకడం, యువరాజా? సూర్యుడస్తమించి నలువైపుల నుంచి చీకటి కమ్ముకొని వస్తోంది కద?"

"సముద్రకుమారీ! నీ పడవను ఎక్కడ వదిలి వచ్చావు?"

"నా పడవ ఇంచు మించు ఈ నది మధ్యలో కద ఉంది? ఏనుగెక్కి వచ్చినందువల్ల, అదికూడ మీరు ఏనుగును నడుపుకొని వచ్చినందువల్ల ఇంత శీఘ్రంగా ఇక్కడికి వచ్చి చేరాము. పడవలో వచ్చివుంటే ఇక్కడికి వచ్చి చేరేటప్పటికి నడిరాత్రి అయ్యేది!"

"సరే! బాగా చీకటి పడేలోపు ఈ నది ఒడ్డు వెంబడే నడుస్తూ వెళ్ళి చూద్దాం! ఇక్కడున్న చెట్లు సముద్రం కనబడకుండ అడ్డు వస్తున్నాయి. ఒకవేళ రెండో ఓడను సముద్రంలో ఇంకాస్త దూరం తీసుకొని వెళ్ళి నిలిపివుండవచ్చు కద?"

~

ఏనుగును అక్కడే వదిలిపెట్టి ఇద్దరూ నదీతీరం వెంబడి సముద్రం వైపు నడిచి వెళ్ళారు. త్వరలోనే సముద్రతీరం చేరుకొన్నారు. ఆ సమయంలో సముద్రం ప్రశాంతంగా ఉంది. అలల ఆనవాలు కూడ లేదు. కనుచూపు మేర వరకు ఒక నీలి రేకు లాగ కనిపించింది. ఆకాశపు నీలిరంగు, సముద్రపు పచ్చని రంగు చాల దూరం తర్వాత ఒకటయ్యాయి.

ఓడగాని, పడవగాని ఏవీ కనబడలేదు. ఒకటి రెండు పక్షులు తీరం వైపు ఎగిరివచ్చాయి. అంతే!

కాసెపు అక్కడే నిలబడి నలువైపులా తిరిగి చూసేసి, "సరే! పూడిపోయిన ఓడకు పోదాం!" అన్నారు యువరాజు.

ఇద్దరూ వచ్చిన దారినే తిరిగి వెళ్ళారు.

"పూంగుళలీ! నీవు నాకు చేసిన సహాయాన్ని నేనెన్నటికీ మరువను. కానీ ఇక్కడ మనం విడిపోవలసిందే!" అన్నారు యువరాజు.

పూంగుళలి మౌనందాల్చింది.

"నేను చెప్పింది నీ చెవిన పడిందా? నేను ఆ పూడుకొనిపోయిన ఓడలోనే ఉండడానికి

నిశ్చయించుకొన్నాను. సేనాధిపతి తదితరులు ఎలాగూ ఇక్కడికే వస్తారు. వారితో కలిసి ఆలోచించి ముందుకేం చేయాలని నిర్ణయం తీసుకొంటాను. నీకిక ఇక్కడేమీ పనిలేదు. నీ పడవను వెతుక్కొని నీవు వెళ్ళిపో. నా తండ్రిని గురించి నేను చెప్పింది గుర్తుంచుకో..."

పూంగుళలి జంకుతూ అక్కడే ఒక చెట్టునానుకొని నిలబడింది. కిందకు వంగిన ఒక కొమ్మను పట్టుకొంది.

"ఏమి, సముద్రకుమారీ?"

""ఏమీ లేదు, యువరాజా! ఇక్కడే మీదగ్గర సెలవు తీసుకొంటాను. వెళ్ళి రండి!"

"కోపమా, పూంగుళలి?"

"కోపమా? మీపైన కోపించుకోవడానికి ఈ పేదరాలికి ఏం అధికారం ఉంది? అంతటి అహంభావం నాకు లేదు."

"మరి, ఉన్నట్లుండి ఎందుకిక్కడ నిలబడిపోయావు?"

"కోపం లేదయ్యా! అలసట మాత్రమే. నేను నిద్రించి రెండు రోజులయ్యింది. ఇక్కడే కాసేపు పడుకొని, తర్వాత నా పడవను వెతుక్కొంటూ వెళతాను."

అది పౌర్ణమి తర్వాతి రోజు (పాడ్యమి). కాబట్టి ఆ సమయాన చంద్రుడు అప్పుడప్పుడే సముద్రం పైన ఉదయిస్తున్నాడు. చంద్రకిరణాలు మసక మసగ్గా పూంగుళలి ముఖంమీద పడుతున్నాయి.

యువరాజు ఆమె ముఖాన్ని చూశారు. ఆ ముఖంలో గూడు కట్టుకొన్న అలసటను, ఆకలిని గమనించారు. ఆమె కళ్ళు మసకబారి కనురెప్పలు వాలిపోతుండడాన్ని కూడ గమనించారు.

చంద్రుడు ఉదయించినప్పుడు కలువపూలు విచ్చుకొంటాయి. కానీ అప్పుడు పూంగుళలి ముఖ కమలం వాడిపోయివుంది.

"అమ్మాయీ! నిద్రించి రెండు రోజులైందన్నావు. భోజనం చేసి ఎన్ని రోజులైంది?"

"భోంచేసి కూడ రెండురోజులకు పైనే అయ్యింది. మీతో ఉన్నంతసేపూ ఆకలే తెలియలేదు."

"నా మూఢత్వాన్ని ఏమనాలి? ఈ రోజు పొద్దున మేమంతా కడుపు నిండా విందు భోజనం తిన్నాము. 'నీవు తిన్నావా?' అని అడిగేందుకు మరిచిపోయాను కద? రా, పూంగుళలి! నాతో ఆ కూరుకుపోయిన ఓడకు రా! అందులో చెదరిపడ్డ ధాన్యాలను చూసిన జ్ఞాపకం ఉంది. ఆ ధాన్యాలను సేకరించి వండి ఈ రాత్రి భోజనం చేద్దాం. తిన్న తర్వాత నీవు వెళ్ళవచ్చు..."

"అయ్యా! భోజనం చేస్తే అక్కడే పడుకొని నిద్రపోతాను. ఇప్పటికే నా కళ్ళు నిద్రతో మూసుకుపోతున్నాయి."

"అందువల్లనేమి? నీవా పూడుకుపోయిన ఓడలో నెమ్మదిగా నిద్రపో! నేను, ఏనుగు ఒడ్డున ఉండి కాపలా కాస్తాము. పొద్దు పొడిచిన తర్వాత నీవు నీ పడవను వెతుక్కొని వెళ్ళు!"

ఇలా చెప్పి యువరాజు పూంగుళలి చేయి పట్టుకొని ఆమె బరువును తాను మోస్తున్నట్లు ఆమెను నడిపించుకొని వెళ్ళారు. నిజంగానే, ఆమె కాళ్ళు తడబడుతుండడాన్ని గమనించారు. ఆ అమ్మాయి అభిమానానికి, ప్రీతికి ఏడేడు లోకాల్లో సాటి ఏదని తలచినప్పుడు ఆయన కళ్ళు చెమర్చాయి.

~

కూరుకుపోయిన ఓడ దగ్గరకు వారు తిరిగివచ్చినప్పుడు ఆ ఓడ వెనుకభాగం నుంచి పొగ వస్తుండడం చూసి అదిరిపడ్డారు. ఒకవేళ ఆ ఓడకు చెందినవారు తిరిగి వచ్చివుండవచ్చు కద? ఉన్నట్లుండి వారికెదురు వెళితే ఏదైన జరగకూడనిది జరగవచ్చు కద? కాబట్టి మెల్ల మెల్లగా శబ్దం చేయకుండ ఓడను సమీపించారు. చాల దగ్గరకు వెళ్ళిన తర్వాత కూడ మాటలేమీ వినిపించలేదు. మరుగ్గా ఉన్నవారెవరు, ఎంత మంది అని తెలియలేదు. చిలగడ దుంపలు కాల్చుతున్న సువాసన మాత్రం ఘుమఘుమ వచ్చి వారి ముక్కుపుటాలనెగరేసింది. పూంగుళలి పరిస్థితి యువరాజుకు బాగా తెలిసినందువల్ల ఆమె ఆకలిని తీర్చడం మొదటి పని అని తీర్మానించారు. కాబట్టి వచ్చేది రానీ అని ఓడ చుట్టు తిరిగి అవతలి వైపుకు వెళ్ళి చూశారు. అక్కడ పొయ్యి ముట్టించి వంట ఏర్పాట్లు చేస్తున్నది ఒక స్త్రీ అని తెలిసింది. ఎవరా స్త్రీ అని కూడ మరుక్షణమే తెలిసిపోయింది. ఆ మూగవనిత వీరిని చూసి ఆశ్చర్యపడినట్లు అగుపించలేదు. వీరిని ఎదురుచూస్తున్నట్లే అనిపించింది. నోటి మాట సహాయం లేకనే వీరిని స్వాగతించింది. కాసేపటికల్లా అమృతం లాంటి భోజనం కూడ వడ్డించింది. పళైయార్రై అంతఃపురంలో తాను ఆరగించిన రాజరికపు విందుకన్న ఈ మృష్టాన్న భోజనం, కాల్చిన దుంపలు అతి రుచికరంగా తోచాయి యువరాజుకు.

భోజనం చేసిన తర్వాత ముగ్గురూ ఓడ మధ్యభాగానికి వెళ్ళారు. చంద్రుడిప్పుడు బాగా పైకి వచ్చాడు. అక్కడ నిలబడి చూస్తే తొండైమాన్ నది సముద్రంలో కలిసేచోటు, దానికవతల విస్తరించిన సముద్రమూ బాగా కనిపించాయి. సాయంత్రం పచ్చని రేకు లాగ కనిపించిన సముద్రం ఇప్పుడు చంద్రకిరణాలు సోకి వెండి రేకులాగ మెరుస్తూంది.

వారు రాత్రి వేళ, బయలు ప్రదేశంలో ఉన్నా కూడ ఉక్క వల్ల చెమట పట్టసాగింది. గాలి అన్నది ఏమాత్రం వీయడం లేదు. ఇందు గురించి యువరాజు పూంగుళలికి చెప్పింది మూగవనిత ఎలాగో తెలుసుకొంది. ఆకాశంలో చంద్రుని చుట్టూ ఒక బూడిద వన్నె వలయం ఏర్పడివుండడాన్ని వేలెత్తి చూపించింది. "చంద్రుని చుట్టూ అలా వలయం ఏర్పడితే, సుడిగాలి, వాన వస్తాయనడానికి సూచన" అని పూంగుళలి వివరించింది. "సుడిగాలి/తుఫాను తర్వాత రానీ. ఇప్పుడు కాస్త గాలి వీయవచ్చు కద?" అన్నారు యువరాజు. తర్వాత ఆమె ఇంత త్వరగా ఇక్కడికెలా వచ్చిందని ఆశ్చర్యపడ్డారు. "నా అత్తకు ఇది ఒక పెద్ద కార్యమే కాదు; ఇంతకన్న పెద్ద పెద్ద కార్యాలను ఆమె చేసింది!" అన్నది పూంగుళలి. "అదీగాక, ఆమెకు మీరంటే చాల ప్రేమ. ప్రేమ ఇచ్చే శక్తితో దేన్ని సాధించలేము?" అన్నది.

ఈ మాటలు కూడ ఆ మూగ వనిత ఎలాగో తెలుసుకొని పూంగుళలి ముఖాన్ని ఒకవైపుకు తిప్పి చూపించింది. అక్కడ వారు ఎక్కి వచ్చిన ఏనుగు ఉంది. దాని పక్కన ఒక ఎత్తైన మేలు జాతి గుర్రం గంభీరంగా నిలబడి ఉండడం చూసి వీరిద్దరూ ఆశ్చర్యపోయారు.

"వీరు ఈ గుర్రమెక్కి వచ్చారా ఏమి? వీరికి గుర్రపు స్వారీ తెలుసా?" అని యువరాజు ఆశ్చర్యంతో అడిగారు.

"అత్తకు గుర్రపు స్వారీ వచ్చు; ఏనుగు సవారీ వచ్చు; పడవ నడపడం - అన్నీ వచ్చు. ఒక్కోసారి గాల్లోనే ఎగిరివచ్చిందేమో అన్నంత వేగంగా వస్తుంది. ఎలా వచ్చివుండవచ్చు అని మనకు ఆశ్చర్యం వేస్తుంది."

~

యువరాజిప్పుడు ఇంకొక ఆశ్చర్యంలో మునిగివున్నారు. గట్టుమీద గడ్డి మేస్తున్న గుర్రపు గంభీరమైన ముఖమే ఆయనకంత ఆశ్చర్యం కలిగించింది.

"అరబ్బు దేశాల్లో పెరిగే ఉన్నత జాతి గుర్రాలలో ఇంకా మేలైన గుర్రం కద ఇది? ఇక్కడికెలా వచ్చింది?" అని తనలో తానే చెప్పుకొన్నారు.

పూంగుళలి సైగ భాష మూలకంగా ఇందుగురించి మూగరాణిని అడిగింది. (అవును, ఇక మనం ఆమెను 'మూగరాణి' అని పిలవవచ్చు కద?) 'ఏనుగుల కాలువ' పక్కనుంచి ఆ గుర్రం సముద్రం నుంచి తీరానికి వచ్చిందని, గట్టెక్కగానే గతి తప్పి భ్రమించి నిలబడిందని, మూగరాణి దాన్ని ప్రేమతో తట్టి ముద్దాడి మచ్చిక చేసుకొందని, తర్వాత దాని పైకెక్కి వచ్చిందని తెలియజేసింది. ఇది విన్న యువరాజు ఆశ్చర్యం ఇంకా అధికమైంది.

మాట్లాడుతుండగానే పూంగుళలి కనురెప్పలు వాలుతుండడాన్ని గమనించారు యువరాజు. "అప్పుడే నిద్ర వస్తుందన్నావు. వెళ్ళి నిద్రపో!" అన్నారు. ఆయనలా చెప్పడమే ఆలస్యం; పూంగుళలి కాస్త దూరం వెళ్ళి పడుకొని, పక్కనున్న ఒక తెరచాపను దుప్పటిగా కప్పుకొంది. పడుకొన్న కాసేపటికల్లా నిద్రపోయింది.

కానీ నిద్రలో కూడ ఆమె పెదవులు ఒక పాటను మెల్లగా పలకసాగాయి.

"అలల కడలి ----------
ఎద కడలి పొంగనేల?"

ఆహా! ఇదే పాటను వంతిదేవుడు నిన్నంతా కూనిరాగం తీస్తున్నాడు కద? ఈమె నుంచే నేర్చుకొన్నాడు కాబోలు. ఇంకొకసారి సముద్రకుమారి మెలకువగా ఉన్నప్పుడు పూర్తి పాటను పాడమని వినాలనుకొన్నారు యువరాజు. వెంటనే ఆయన ఆలోచన మూగరాణి వైపు మళ్ళింది. ఆహా! అందరికీ ఒక్కొక్కసారి మనసనే కడలి ఉప్పొంగి అల్లకల్లోలమవుతుంది. కానీ నోరు తెరిచి తన భావాలను,

అనుభూతులను చెప్పుకోలేని మూగరాణి సంక్షోభానికి ఉపమానమేది? ఎన్నెన్నో సుఖ, దుఃఖాలు, ఎన్నెన్నో కోపతాపాలు - అన్నిటినీ తన మనసులో అదిమి పెట్టేసుకొంది! ఎంత కాలంగా అదిమి పెట్టింది?

మూగరాణి ఉన్నచోటు వదిలి యువరాజు దగ్గరికి వచ్చి కూర్చొంది. ఆయన తలవెంట్రుకలను ఆప్యాయంగా తడిమి దువ్వింది. ఆయన రెండు కళ్ళను పూలను తాకినట్లు తన బలమైన వజ్రహస్తాలతో మృదువుగా తాకి చూసింది. యువరాజుకు కాసేపు ఏం చేయాలో తోచలేదు. తర్వాత ఆ మూగవనిత పాదాలను తాకి కళ్లకద్దుకొన్నారు. ఆమె ఆ చేతులను పట్టుకొని తన ముఖానికి అద్దుకొంది. యువరాజు చేతులు, చూస్తుండగానే ఆమె కళ్ళనుంచి ధారగా ప్రవహిస్తున్న కన్నీళ్లతో తడిసిపోయాయి.

మూగరాణి సైగతో యువరాజును కూడ పడుకొని నిద్రపొమ్మంది. తాను కాపలా ఉంటానని, దిగులు పడవద్దని చెప్పింది. యువరాజుకు నిద్ర వస్తుందనిపించలేదు. కానీ ఆమె తృప్తి కోసం పడుకొన్నారు. పడుకొన్న చాలసేపటివరకు ఆయన మనోసముద్రం కల్లోలపూరితంగా  ఉంది. తర్వాత కాస్త చల్లగాలి వీయనారంభించగానే, మనసు కూడ చల్లబడి కాస్త నిద్ర పట్టింది.

~

కానీ నిద్రలో కూడ యువరాజు మనసు నెమ్మదిగొనలేదు. అనేక విచిత్రమైన కలలు కన్నారు. అరబ్బు దేశాలు మేలుజాతి గుర్రాన్నొకదాన్నెక్కి మేఘమండలాలను దాటి ఆకాశవీధిలో విహరించారు. అక్కడ దేవేంద్రుడు ఆయనను ఐరావతం మీద ఎక్కించుకొని పిలుచుకొని వెళ్ళాడు. తన రత్న సింహాసనం పైన కూర్చోమన్నాడు. “ఉహుఁ. ఇది నాకు వద్దు. ఈ సింహాసనం మీద నా పెదతల్లి మూగరాణిని కూర్చోబెట్టాలి.” అన్నారు యువరాజు. దేవేంద్రుడు నవ్వి, “ఆమె ఇక్కడకు రానీ. తర్వాత చూద్దాం" అన్నాడు. దేవేంద్రుడు యువరాజుకు దేవామృతాన్నిచ్చి ఆరగించమన్నాడు. యువరాజు దాన్ని కాస్త రుచి చూసి, “ఉహుఁ! ఇది కావేరి జలమంత తీయగా లేదే!” అన్నారు. దేవేంద్రుడు యువరాజును తన అంతఃపురానికి తీసుకొని వెళ్ళాడు. అక్కడ దేవ స్త్రీలు పలువురు కనిపించారు. ఇంద్రాణి యువరాజును చూసి, “ఈ వనితల్లో అందరికన్న అందగత్తెను నీవు పెళ్ళాడవచ్చు" అన్నది. యువరాజు వారందరినీ చూసి, “వీరిలో ఎవ్వరూ పూంగుళలి అందానికి ఆమడ దూరం కూడ రాలేరు" అన్నారు. ఉన్నట్లుండి ఇంద్రాణి యువరాకుమారి కుందవైగా మారిపోయింది. “అరుళ్మొళి! నా వాణతిని మరిచిపోయావా?” అని అడిగింది. యువరాజు, “అక్కా! ఇంకా ఎన్నాళ్ళిలా నన్ను నీ చేతికింద ఉంచుకొంటావు? నీ ప్రేమ చెర కన్న పళువేట్టరయ్యర్ల పాతాళ చెర మేలు! నన్ను విడుదల చేయి! లేకపోతే విరాట రాజు కొడుకు ఉత్తరకుమారుని లాగ అంతఃపురంలోనే ఉండేటట్లు చేసేయి. ఆటపాటలతో కాలం గడుపుతాను" అన్నారు. యువరాకుమారి కుందవై పగడాల వంటి తన పెదవులపైన సంపంగి పూవు వంటి తన చూపుడు వేలుంచుకొని ఆయనను ఆశ్చర్యంతో చూసింది. “అరుళ్మొళి! నీవెందుకిలా మారిపోయావు? ఎవరు నీ మనసును చెడగొట్టారు? అవును, తమ్ముడు! ప్రీతి అన్నది ఒక చెర వంటిదే. అందుకు నీవు కట్టుబడి

ఉండవలసిందే!" అన్నది. "లేదక్కా, లేదు! నీవు చెబుతున్నది తప్పు. ప్రేమ అటువంటి సంకెల కాదు. నీకు చూపిస్తాను, చూడు...! పూంగుళలి! పూంగుళలీ! ఇలా రా!" అని కేక వేశారు.

~

పొద్దు పొడిచే సమయాన గుర్రపు డెక్కల చప్పుడు విని పూంగుళలి దిగ్గున మేల్కొంది. మూగరాణి గుర్రమెక్కి బయలుదేరుతుండడాన్ని గమనించింది. ఆమెను ఆపాలని లేచి పరుగెత్తింది. కానీ ఆమె ఓడ దిగి తీరం చేరేలోపు గుర్రం సుడిగాలి వేగంతో మరుగైంది.

ఉదయ సంధ్యాకాలం చాల మనోహరంగా ఉంది. పూంగుళలి మనసులో ఎన్నడూ లేనంతగా ఉత్సాహం ఉప్పొంగింది. ఉన్న చోటినుంచే ఓడ బల్లపరుపు పైభాగాన్ని చూసింది. యువరాజింకా నిద్రపోతున్నారు. పూంగుళలి నదీతీరం వెంబడి పక్షుల మధురగానాన్ని వింటూ నడవసాగింది. వంగిన ఒక చెట్టు కొమ్మ మీద ఒక పెద్ద చిలక కూర్చొనివుంది. "ఎక్కడికొచ్చావు?" అని అడుగుతున్నట్లు పూంగుళలిని గుచ్చి చూసింది.

"ఓ చిలుక నేస్తమా! ఇంకాసేపట్లో యువరాజు వెళ్లిపోతారు. ఆ తర్వాత నీవే నాకు తోడు. నాతో మాట్లాడుతావు కద?" అని అడిగింది పూంగుళలి.

అప్పుడు "పూంగుళలి! పూంగుళలి!" అన్న పిలుపు వినిపించింది. మొదట ఆ చిలుకే అలా పిలిచిందనుకొంది. కాదు, ఆ పిలుపు ఓడ నుంచి వస్తోందని గ్రహించింది. యువరాజు పిలుస్తున్నారని గ్రహించి పరుగెత్తి వెళ్ళింది. కానీ ఓడ లోపలికెక్కి వెళ్ళి చూస్తే యువరాజింకా నిద్రపోతున్నారు. కానీ ఆయన నోరు మాత్రం "పూంగుళలి! పూంగుళలి!" అని పలవరిస్తుండడాన్ని గమనించింది. అది విని పులకించిన పూంగుళలి, ఆయన దగ్గరకు వెళ్ళి ఆయన నుదుటిని తాకి మేల్కొలిపింది.

యువరాజు నిద్ర, కల రెండూ చెదరి, లేచారు. తూర్పున సూర్యుడుదయిస్తున్నాడు. ఆ సూర్యకాంతిలో పూంగుళలి ముఖం విరిసిన ఎర్ర తామరలాగ ప్రకాశించింది. "నన్ను పిలిచారే, ఎందుకు?" అని అడిగింది. "నిన్ను పేరు పెట్టి పిలిచానా? నిద్రలో ఏదో పలవరించివుంటాను. నిన్న రాత్రి నీవు నిద్రలోనే పాట పాడావు కద? నేను మాట్లాడకూడదా?" అన్నారు.

~

యువరాజు ఉన్నట్లుండి దిగ్గున లేచారు. "ఓ! నేనింత పొద్దెక్కేవరకు నిద్రపోయానే! పెద్దమ్మ ఎక్కడ?" అని అడిగి చుట్టూ చూశారు. ఆ మూగవనిత పొద్దు పొడవక మునుపే గుర్రమెక్కి వెళ్ళిపోయిందని చెప్పింది సముద్రకుమారి.

"మంచి పని చేసింది, సముద్రకుమారీ! నీ అలసట కూడ తీరినట్లుంది. ఇక నీవు కూడ సెలవు తీసుకోవచ్చు. నా ప్రియ స్నేహితులు వచ్చే వరకు నేనిక్కడే ఉండాలి. అంతవరకు ఈ ఓడను పరిశోధించి చూస్తాను!" అన్నారు.

పూంగుళలి, "అదిగో! అటు చూడండి!" అని వేలెత్తి చూపించింది. యువరాజు ఆ దిక్కుగా చూపులు సారించారు. దూరంగా సముద్రంలో ఒక పెద్ద ఓడ వస్తుండడం కనిపించింది. సముద్రతీరం వెంబడి ఒక చిన్న పడవలో ఇద్దరు మనుషులు వస్తుండడం కూడ గమనించారు.

"ఆహా! ఇప్పుడు అన్ని వివరాలు తెలుస్తాయి!" అన్నారు యువరాజు.

తాము అక్కడున్న విషయం తెలియక పడవ సముద్రతీరం వెంబడే వెళ్ళిపోతుందమోనని ఎంచి, యువరాజు ఓడ దిగి నదీతీరం వెంబడి సముద్రతీరం వైపు నడవసాగారు. పూంగుళలి ఆయన వెంట వెళ్ళింది. ఏనుగు కూడ వారి వెంబడే మెల్లగా కదులుతూ వెళ్ళింది.

~

సముద్రతీరానికి వెళ్ళి నిలబడ్డారు. ఓడ వారిని వదిలి దూరంగా వెళ్లసాగింది. పడవ నది దగ్గరకు రాసాగింది. మొదట కాస్త వెనక నిలబడ్డ పూంగుళలి ఆదుర్దా, ఆసక్తి ఎక్కువై ముందుకు వచ్చి నిలబడింది.

యువరాజు దిగులుతో ఉన్నా, పూంగుళలి ఉత్సాహం చూసి ఆయన ముఖంపైన చిరునవ్వు విరిసింది. ఆయన దిగులుకు చాల కారణాలున్నాయి. ఆ ఓడ ఆయనను వదిలి వెళ్లిపోతున్నట్లు, అందులో తాను కూడ వెళ్లవలసిందని ఆయనకనిపించింది. అది మాత్రమే కాదు. దగ్గరపడుతున్న పడవలో ఒక మనిషి తక్కువగా ఉన్నట్లనిపించింది. ఉండవలసిన ఒకరు అందులో లేదు. అవును; అదిగో సేనాధిపతి ఉన్నారు; వెంట వచ్చిన వీరులున్నారు; పడవనడిపేవారున్నారు. కానీ ఆ వాణర్ కుల యువకుడు మాత్రం లేదు. వల్లవరయ్యన్ ఎక్కడ? ఆ ఉత్సాహ పురుషుడు., అసహాయ శూరుడు, నిర్భయ వీరుడు, యువరాకుమారి కుందవై పంపించిన దూత ఎక్కడ....? రెండు రోజుల క్రితం మాత్రమే పరిచయమై స్నేహితుడైనా, యువరాజుకు ఎంతోకాలంగా పరిచయమున్న గాఢస్నేహితుడిలాగ అయ్యాడు. అతని అతిశయ గుణాలు యువరాజును అంతగా ఆకట్టుకొన్నాయి. అతను పడవలో కనిపించకపోయేసరికి, చేతికి చిక్కిన భాగ్యం జారిపోయినట్లనిపించింది యువరాజుకు.

పడవ ఒడ్డుకు దగ్గరగా రాగానే సేనాధిపతి తదితరులు ఒడ్డుమీదికి దూకారు. సేనాధిపతి బూది విక్రమకేసరి పరుగెత్తి వచ్చి యువరాజును హత్తుకొన్నారు.

"అయ్యా! భలే పని చేశారు! మమ్మల్నిలా దిక్కు తోచనట్లు చేయవచ్చా? ఏనుగు మదం ఎలా దిగింది? ఈ మా చెడ్డ ఏనుగు ఇప్పుడు ఎంత సాధువుగా నిలబడివుంది..?! యువరాజా? ఎప్పుడిక్కడికి వచ్చి చేరారు? పళుపేట్టరయ్యర్ల ఓడలను చూశారా? అవి ఎక్కడ?" అని కొడుంబాళూర్ పెద్ద వేళార్ ప్రశ్నల వర్షం కురిపించారు.

"సేనాధిపతీ! మా కథ తర్వాత చెబుతాను. వంతిదేవులెక్కడ? చెప్పండి!" అని అడిగారు.

"ఆ దుడుకు అబ్బాయి అదిగో ఆ ఓడలో వెళుతున్నాడు!"అని సేనాధిపతి దూరాన వెళుతున్న

ఓడను చూపించారు.

"ఎందుకు? ఎందుకు? అది ఎవరి ఓడ? అందులో వంతిదేవులెందుకు వెళుతున్నారు?" అని అడిగారు యువరాజు.

"అయ్యో! నా బుద్ధి అస్తవ్యస్తమైపోయివుంది. ఈ వైష్ణవుని అడగండి! ఇతనికి మీ సమాచారమూ, ఆ యువకుని స్వభావమూ బాగా తెలుసు!" అన్నారు సేనాపతి.

యువరాజు ఆళ్వార్ కట్టియాన్ని చూసి, "తిరుమలై! వంతిదేవులు ఆ ఓడలో ఎందుకు వెళుతున్నారు? తెలిస్తే వెంటనే చెప్పండి!" అన్నారు.

~~~
~~~

# అధ్యాయము - 47

## పిశాచి నవ్వు!

**యువరాజు**, పూంగుళలి ఏనుగెక్కి ముందుకు వెళ్ళిన తర్వాత, వెనక నిలిచిపోయినవారి కథ ఏమని పాఠకులకు మేము చెప్పవలసిన బాధ్యత ఉంది.

"ఏనుగుకు మదమెక్కింది!" అని సేనాధిపతి కేక వేసినప్పుడు తక్కిన వారు కూడ మొదట అలాగే అనుకొన్నారు. ఏనుగును వెన్నంటి గుర్రాలమీద వేగంగా వెళ్ళజూశారు. కానీ అది వారికి సాధ్యం కాలేదు. 'ఏనుగుల దిగుడు' కాలువ చేరగానే వారి ప్రయాణం  ఇక ముందుకు సాగలేక ఆగిపోయింది. అందరికన్న ముందు వెళ్ళిన వంతిదేవుని గుర్రం కాలువలో దిగి బురదలో చిక్కుకుపోయింది. చాల శ్రమపడి దాన్ని బయటకు తెచ్చారు. కానీ ఆ గుర్రం ప్రయాణానికి ఇక ఉపయోగపడదని గ్రహించారు.

సేనాధిపతి బూది విక్రమకేసరి ఏం చేయాలో తోచక తలబాదుకొన్నారు. "నా జీవితంలో ఇటువంటి పొరబాటు చేయలేదు. అందరూ ఊరకే నిలబడ్డారేం? ఏం చేద్దాం? యువరాజును ఎలా కాపాడాలి? ఎవరికైనా ఉపాయం తోస్తే చెప్పండి!" అన్నారు. అప్పుడు ఆళ్వార్ కట్టియాన్ ముందుకు వచ్చి, "సేనాపతీ! నాకొక ఆలోచన తడుతోంది. చెప్పనా?" అన్నాడు.

"చెప్పడానికి ముహూర్తం లెక్కబెడుతున్నావా? తొందరగా చెప్పు!" అన్నారు సేనాపతి.

"నిజానికి యువరాజు ఎక్కి వెళ్ళిన ఏనుగుకు మదమెక్కలేదు."

"ఏం పేలుతున్నావు? మరెవరికి మదమెక్కింది? నీకా?"

"ఎవరికీ మదమెక్కలేదు. మీరు కావాలని ప్రయాణం ఆలస్యం చేస్తున్నారని యువరాజుకు సందేహం పుట్టుకొచ్చింది. కాబట్టి మననుంచి విడివడి వేగంగా వెళ్ళాలని ఏనుగునలా పురిగొల్పి వదిలారు. ఏనుగును మచ్చిక చేసుకొనే విద్యలోని అన్ని రహస్యాలు తెలిసినవారు యువరాజు అన్న విషయం మీకు తెలుసు కద?"

ఇది నిజం కావచ్చు అని సేనాపతికి కూడ అనిపించింది. ఆయన మనసు కాస్త నెమ్మదిగొంది.

"సరే, అలాగే ఉండనీ. అయినా కూడ మనం తొండైమాన్ నదీముఖద్వారం వద్దకు వెళ్ళాలి కద?  అక్కడ ఏం జరుగుతుందో తెలుసుకోవాలి కద?"

"వెళ్లవలసిందే. సముద్రతీరం వెంబడి వెళ్ళి ఎక్కడైన ఒక పడవ దొరికితే అందులో ఎక్కి వెళ్ళడం, లేదా పార్థిబేంద్రపల్లవుల ఓడ వచ్చేవరకు వేచివుందాం."

"వైష్ణవా! మీరు మా చెడ్డవారు. యువరాజు దగ్గర ఇలా ఏదో చెప్పినట్లుంది."

"సేనాధిపతీ! ఈ ప్రయాణం మొదలైనప్పటినుంచి నేను యువరాజుతో మాట్లాడనేలేదు."

ఈ సంఘటన తర్వాత వారు సముద్రతీరం వెంబడి తూర్పుదిక్కుగా వెళ్ళారు.

~

వెనుకటి అధ్యాయాలలో ప్రచురించిన చిత్రాలనుబట్టి[5] లంకాద్వీపం ఉత్తర భాగపు నైసర్గిక స్వరూపాన్ని పాఠకులు ఒకింత ఊహించుకొని ఉండగలరు. లంక ఉత్తరమూలకు ఆ కాలంలో నాగద్వీపమనే ఇంకో పేరుకూడ ఉండేది. ఆ భాగాన్ని, లంకాద్వీపపు తక్కిన (ముఖ్య) భాగాన్ని సముద్రం రెండు వైపులనుంచి విభజిస్తుండేది. ఒక భాగంనుంచి ఇంకొక భాగానికి వెళ్ళే మార్గంలో అతి ఇరుకుగా ఉన్న జలసంధికే 'ఏనుగుల దిగుడు'[6] అన్న పేరుండేది. ఒక్కోసారి ఈ జలమార్గంలో నీరు చాల తక్కువగా ఉండేది. అలాంటప్పుడు అందులో దిగి సులభంగా దాటవచ్చు. తక్కిన సమయాల్లో దాన్ని దాటడం సులభం కాదు. పడవెక్కే దాటాలి.

ఆ కాలంలో లంకాసముద్రతీరం వెంబడి వెళ్ళే పడవలు చాలవరకు మామిడి తోపుకు, త్రికోణమలైకి వెళ్ళేవి. అయినా కూడ, పొరబాటున ఒకటో రెండో పడవలు ఎక్కడైనా దొరకవచ్చని సేనాధిపతి మొదలైనవారు చూసుకొంటూ వెళ్ళారు. చివరికి చేపలు పట్టేవాడి పడవ ఒకటి దొరికింది. అందులో పడవ నడిపేవాడు ఒక్కడు మాత్రమే ఉన్నాడు. వాడు కూడ మొదట రానని మొరాయించాడు. అడుగుతున్నది చోళదేశపు సేనాధిపతి అని తెలిసిన తర్వాత ఒప్పుకొన్నాడు.

పడవెక్కి ఆ సముద్రపు కాలువ (జలసంధి) మార్గాన ముందుకు వెళ్ళారు. కానీ తర్వాత తొండైమాన్ నదీముఖద్వారాన్ని ఎలా చేరుకోవడం? అడవి దారి గుండా నడిచి వెళితే చాలసేపు పడుతుంది. సులభం కూడ కాదు. కాబట్టి ఆ పడవలోనే సముద్రతీరం వెంబడే వెళ్ళి తొండైమాన్ నదీ సంగమ ప్రదేశాన్ని చేరడమని నిశ్చయించారు.

మధ్యరాత్రి వరకు పడవ నడిపేవాడు పడవను నడుపుకొంటూ వెళ్ళాడు. తర్వాత అలిసిపోయి పడవనాపేశాడు. తక్కినవారు సహాయం చేస్తామని చెప్పికూడ ప్రయోజనం లేకపోయింది. 'ఇక మీదట మలుపులు ఎక్కువ. నీటిలో బండలు కూడ ఉంటాయి. పడవ వాటిని గుద్దుకొంటే ముక్కలైపోతుంది. ఇక పొద్దు పొడిచిన తర్వాతే పడవ నడప వీలవుతుంది' అన్నాడు. సేనాధిపతి మొదలైనవారు కూడ అలిసిపోయివున్నారు. కాబట్టి ఒడ్డు మీదికి దిగి ఒక తోపులో పడుకొన్నారు.

వంతిదేవునికి ఇదంతా ఏమీ నచ్చలేదు. ఆళ్వార్ కట్టియాన్తో గొడవకు దిగాడు "ఇదంతా నీవల్ల వచ్చిన సమస్యే!" అన్నాడు.

"నేనేం చేశాను?" అని (అమాయకంగా అడిగాడు ఆళ్వార్ కట్టియాన్.

"నీవు ఏదీ మనసు విప్పి చెప్పవు. నేనూ కడంబూర్ నుంచి చూస్తూ వస్తున్నా. సగం

---

5 ఆ చిత్రాన్ని ఇక్కడ ప్రచురించవలసివుంది .

6 ఏనుగుల మంద ఈ నీటిమార్గంలో అలవాటుగా దాటుతూ వెళ్ళేవి కాబట్టి దీనికి ఏనుగుల మంద అన్న పేరు వచ్చింది. తర్వాతి కాలంలో ఓడల ద్వారా ఏనుగులు ఈ జలసంధి ద్వారా ఎగుమతి కాబడేవి .

చెబుతావు; మిగతా సగాన్ని చెప్పక రహస్యంగా దాచేసుకొంటావు. యువరాజు ఏనుగు పైన వెళ్ళాలని ఎందుకు అనుకొన్నారో నీకు తెలిసినట్లుంది కద? అది నాకు చెబితే నేను కూడ ఏనుగునెక్కి ఆయనతో వెళ్ళేవాడిని కద? ఇంత కష్టపడి వెతికి పట్టుకొన్న యువరాజు చేజారిపోయారు కద? పళైయారైకి వెళ్ళి యువరాకుమారికి ఏం చెప్పాలి?" అని మండిపడ్డాడు వంతిదేవుడు.

"తాళపత్ర సందేశాన్ని యువరాజుకిచ్చిన వెంటనే నీ కర్తవ్యం ముగిసింది కద?" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

"అదేం కాదు. యువరాజును యువరాకుమారి వద్దకు తీసుకొని వెళ్ళి ఒప్పజెప్పిన తర్వాతే నా కర్తవ్యం ముగుస్తుంది. నీవే అందుకు అడ్డం వస్తున్నట్లున్నావు  కద?"

"లేదు బాబూ, లేదు! నేను అడ్డం రానే రాను. రేపే సేనాధిపతి వద్ద సెలవు తీసుకొని నా దారిన నేను వెళ్ళిపోతాను!"

"నీ పని ముగిసింది; యువరాజును వెతికి పట్టి ఇచ్చేశావు, ఇక నీ దారిన నీవు వెళదామనుకొంటున్నావు కాబోలు. అదేం కుదరదు. నీపైన నాకెప్పుడూ కాస్త సందేహమే. అది ఇప్పుడు బలపడుతోంది/దృఢపడుతోంది."

ఇలా కాసేపు దెబ్బలాడుకొన్న తర్వాత నిద్రపోయారు. బాగా అలిసిపోయినందువల్ల కొట్టి పడేసినట్లు నిద్రపోయారు.

~

భళ్ళున తెల్లవారేసమయానికి పడవ తెడ్డు శబ్దం వినిపించి ఆళ్వార్ కట్టియాన్ మొదట మేల్కొన్నాడు. అతని కళ్ల ముందు కనిపించిన దృశ్యం అతన్ని అదిరిపడేటట్లు చేసింది. సముద్రంలో కాస్త దూరాన ఒక పెద్ద ఓడ కనిపించింది. అది తెరచాప విరుచుకొని బయలుదేరడానికి సిద్ధంగా ఉంది. ఆ దిక్కుగా ఒక పడవ తీరం నుంచి వెళుతూంది. ఆ పడవలో పడవ నడిపే వాడితోబాటు ఇంకా ముగ్గురున్నారు. ఆ పడవ నిన్న సాయంకాలం తమను తీసుకొచ్చిన పడవేనని గ్రహించడానికి అతడికి చాల సమయం పట్టలేదు.

ఆ ఓడ ఉన్నట్లుండి ఎలా, ఎక్కడినుంచి పుట్టుకొచ్చిందన్న ప్రశ్నకు సమాధానాన్ని కూడ సులభంగానే ఊహించుకోగలిగాడు. తాము పడుకొన్న స్థలానికి కాస్త దూరంలో ఒక ఓడ బురదలో కూరుకొనిపోయివుంది. ఆ చోటు చెట్లవల్ల కాస్త మరుగ్గావుంది. ఈ రెండో ఓడ అక్కడే దాక్కొనివుండి, పొద్దు పొడవగానే బయలుదేరివుండాలి.

ఆ ఓడ ఎక్కడినుంచి వచ్చింది? ఎక్కడికి వెళుతోంది? అది ఎవరిది? ఆ పడవ ఆ ఓడ వైపు ఎందుకు వెళుతోంది? అందులో ఉన్నవారెవరు?

ఇన్ని ప్రశ్నలూ ఆళ్వార్ కట్టియాన్ మనసులో మెరుపులాగ మెరిసి మాయమైనాయి.

"సేనాధిపతీ! సేనాధిపతీ! లేవండి!" అని అరిచాడు.

సేనాధిపతి, వంతిదేవుడు, తక్కిన ఇద్దరు వీరులు ఉలిక్కి పడి లేచారు.

మొదట సముద్రంలో నిలబడ్డ తెరచాప ఓడ వారికి కంట పడింది.

సేనాధిపతి, "ఓ! అది చోళ దేశపు ఓడే! బహుశ పళువేట్టరయ్యర్లు పంపిన ఓడే కావచ్చు! అందులో యువరాజు వెళుతున్నారేమో! అయ్యో! బాగా నిద్రపోయామే! ఎంతటి పొరబాటు చేసేశాం?" అన్నారు. తర్వాత, "పడవెక్కడ? వెళ్ళి ఓడను పట్టుకోవచ్చేమో చూద్దాం!" అన్నారు.

అంతలో పడవ కూడ వెళుతుండడం చూసి, "అరెరె! అదిగో, వెళుతున్న పడవ మనం ఎక్కి వచ్చిన పడవే కద? అందులో ఉన్న వారెవరు? ఓయ్ పడవబ్బీ! ఆగు!" అని కేక వేశారు.

పడవ నడిపేవాడి చెవిన అది పడిందో లేదో తెలియదు. వాడు పడవను ముందుకు నడుపుకొంటూ వెళ్ళిపోయాడు.

~

ఇదంతా చూస్తూ, వింటూ నిల్చొన్న వంతిదేవుడు, సేనాధిపతి 'యువరాజు ఆ ఓడలో వెళుతున్నారు' అన్నవెంటనే అప్రమత్తుడైనాడు. ఆ తర్వాత ఆయన చెప్పిందేమీ అతడి చెవిన పడనూ లేదు; మనసుకెక్కనూ లేదు. అతను తానిక చేయవలసిందేమన్న విషయంలో సందేహముందా? కాళ్లకు ఆజ్ఞాపించనవసరం కూడ ఉందా? వెంటనే సముద్రంలోకి దూకాడు. అలలను తోసుకొంటూ, వచ్చీ రాని ఈత కొడుతూ, పడవ వైపు వెళ్ళసాగాడు. కాసేపట్లోనే చాల దూరం వెళ్ళిపోయాడు. కానీ తర్వాత నీటి లోతు ఉన్నట్లుండి ఎక్కువైంది. తనకు ఈదడం అంత బాగ రాదు కాబట్టి ఉక్కిరిబిక్కిరయ్యే పరిస్థితి వచ్చింది. "అయ్యో! మునిగిపోతున్నా! కాపాడండి!" అని అరిచాడు. పడవ ఆగింది. అందులో ఒకరితోనొకరు మాట్లాడుకోవడం వినిపించింది. ఎవరో నవ్వడం కూడ వినిపించింది,. పడవ నడిపేవాడు వంగి వంతిదేవునికి చేయిచ్చి పడవలోకి ఎక్కించుకొన్నాడు. వంతిదేవుడు పడవలో కూర్చొన్నాడు. పడవ మళ్ళీ ముందుకు సాగింది.

వంతిదేవుడు పడవలోని వారిని పరికించి చూశాడు. ఒకడేమో తమిళదేశీయుడిలాగనే లేడు. అరబ్బు దేశస్థుడిలాగ ఉన్నాడు. వాడిక్కడికెలా వచ్చాడు? తక్కిన ఇద్దరూ బట్టతో ముఖాలను సగం కప్పుకొనివున్నారు. కానీ తమిళులని తెలియవస్తోంది. అది మాత్రం కాదు. వీరి ముఖాలనెప్పుడో, ఎక్కడో చూసినట్లుంది. ఎప్పుడు? ఎక్కడ? ఆఁ! ఇప్పుడు గుర్తుకొస్తోంది! పార్థిబేంద్రునితో తంబళ్ళై నుంచి తిరిగి వచ్చిన వాళ్ళు కద వీరు? వీరిసే కద ఆళ్వార్ కట్టియాన్ యువరాజును చంపవచ్చిన వారన్నాడు? వీరిలో ఒకడిని ఇంకెక్కడో కూడ చూసినట్లుందే! అవును, మంత్రవాది రవిదాసు కద వీడు? పళువూర్ రాణిని చూడ వచ్చి, ఆమెను హెచ్చరించేందుకు గుడ్లగూబలాగ కూత వేసింది వీడే కద? యువరాజు ఓడలో ఉన్నారని తెలిసే వీడు ఓడకు వస్తున్నట్లుంది! యువరాజుకు ఇంకొక అపాయమా? సరే, సరే! మనం

ఇప్పుడిలా పడవెక్కింది ఎంత మంచిదైంది...?

పడవ ఓడను సమీపించసాగింది. పడవలోని వారు మౌనందాల్చారు. కానీ వంతిదేవునికి మౌనంగా ఉండడం సాధ్యం కాదు కద? కాబట్టి వాళ్ళను మాటల్లోకి దించాలనుకొని, “మీరెక్కడికి వెళుతున్నారు?” అని అడిగాడు.

“తెలియడం లేదా? అదిగో అక్కడ నిలబడివున్న ఆ ఓడ దగ్గరికే వెళుతున్నాం!” అన్నాడు మంత్రవాది. సగం మూసిన నోటినుంచి వినవచ్చిన అతని గొంతు పిశాచి గొంతులాగ వినిపించింది.

“ఓడ ఎక్కడికి వెళుతోంది?” అని మళ్ళీ అడిగాడు వంతిదేవుడు.

“అది ఓడకు వెళ్ళిన తర్వాతే తెలియాలి!” అన్నాడు రవిదాసు.

మళ్ళీ పడవలో మౌనం నెలకొంది. సముద్రంలో ఓంకారనాదం మోగుతోంది.

ఇప్పుడు మంత్రవాది మౌనాన్ని భంగం చేస్తూ, “నీవెక్కడికి వెళుతున్నావు?” అని వంతిదేవుని అడిగాడు.

“నేనా? ఓడకే వెళుతున్నాను" అన్నాడు వంతిదేవుడు.

“ఓడ ఎక్కిన తర్వాత ఎక్కడికి వెళతావు?” అని అడిగాడు రవిదాసు.

“అది ఓడకు వెళ్ళిన తర్వాతే తెలియాలి!” అని అతని సమాధానాన్నే ఒప్పజెప్పాడు వంతిదేవుడు.

~

పడవ ఓడ దగ్గరకు వెళ్ళింది. పైనుంచి ఒక నిచ్చెన కిందకు వచ్చింది. ఒక్కొక్కరే నిచ్చెనెక్కి పైకి వెళ్ళారు. నిచ్చెన పైకి లాగివేయబడక మునుపే వంతిదేవుడు దానిపైకి దూకి దాన్ని పట్టుకొని పైకెక్కసాగాడు. ఓడ పైభాగం నుంచి ఏవో మాటలు వినిపించాయి. కానీ అది అతనికి తెలియని భాష అని తెలిసింది. గబగబా పైకెక్కి ఓడ పైబల్ల మీదికి దూకి, “యువరాజెక్కడ?” అని అరుస్తూ చుట్టుపక్కల చూశాడు.

అప్పుడతను చూసిన దృశ్యం అతని ఉక్కు హృదయాన్నే కాస్త కదిలించేసింది. అక్కడ నిలబడ్డ ఒక్కొక్క అరబ్బు దేశస్థుడు ఒక్కొక్క రాక్షసుడిలాగ కనిపించాడు. అందరూ అతన్ని చిరాగ్గా చూశారు. ఎవరూ అతని ప్రశ్నకు బదులివ్వలేదు.

“ఏదో పెద్ద పొరబాటు చేసేశాం!” అన్న భావం వంతిదేవుని మనసులో కలిగింది. ఇది చోళదేశపు ఓడ కాదు. ఇందులో ఉన్న కళాసీలు తమిళదేశంవారు కారు. పెద్ద పెద్ద గుర్రాలను అమ్మేందుకు వచ్చిన అరబ్బు దేశస్థులు.

ఇందులో యువరాజుండడం అసాధ్యం. తొందరపడి ఈ ఓడలోకి ఎక్కేశాం. ఎలా తప్పించుకోవడం? ఓడ అంచుకు వెళ్ళి వంగి చూశాడు. పడవ తిరిగి వెళుతూంది. “పడవబ్బీ! ఆగు!” అని

అరిచాడు. అలా అరుస్తూనే సముద్రంలోకి దూకజూశాడు. కానీ అంతలో ఒక వజ్రంలాంటి చేయి అతని గొంతు పట్టింది. ఒక్క లాగు, ఒక్క తోపు. వంతిదేవుడు ఎగిరపడి ఓడ మధ్యభాగంలో వచ్చి పడ్డాడు. వంతిదేవునికి విపరీతమైన కోపం వచ్చింది. ఒక్క దూకుతో ఎగిరి నిలబడి తనను తోసిన అరబ్బువాడి ముఖాన్ని లాగి గుద్దాడు. వాడు వెళ్ళి వెనకనున్న తక్కిన అరబ్బువారి మీద పడ్డాడు.

వంతిదేవుని వెనకవైపు నుంచి భయంకరమైన ఉరుము వినిపించింది. సమయానికి తిరిగి చూశాడు. లేకపోతే ఒక చురకత్తి అతని వెన్నులో దిగేదే. వెనక్కి తిరిగిన అదే వేగంతో ఆ కత్తిని పక్కకు కొట్టేశాడు. అది ఓడ బల్లలమీద పెద్దగా శబ్దం చేస్తూ పడి, అక్కడినుంచి ఎగిరి సముద్రంలో పడి మాయమైంది.

మరుక్షణం పలువురు వంతిదేవుని నలువైపుల నుంచి చుట్టుముట్టి పట్టుకొన్నారు. వారిలో నాయకుడిలాగ ఉన్నవాడు ఒక ఆజ్ఞ వేశాడు. వెంటనే వారు ఒక లావాటి తాడును తీసుకొని వచ్చి వంతిదేవుని కాళ్ళు చేతులు కట్టారు. అలా కట్టేటప్పుడు అతని చేతులను వెనక్కి విరిచి కట్టారు. తర్వాత ఆ నాయకుడు చెప్పిన ప్రకారం అతన్ని ఓడ కిందిభాగంలోకి తీసుకొని వెళ్ళి అక్కడ పేర్చివున్న కొయ్య దిమ్మల పైన పడేశారు. కిందికి తీసుకొని వెళుతున్నప్పుడు ఊరకుండక తన్నుకొంటూ విడిపించుకోజూశాడు. ఏమీ ప్రయోజనం లేకపోయింది. వారతన్ని ఆ కొయ్యదిమ్మల్లో ఒకదానితో చేర్చి అతన్ని కట్టి పడేసి పైకి వెళ్ళిపోయారు.

కాసేపటికి ఓడ అటూ ఇటూ ఊగసాగింది. ఓడ ప్రయాణానికి సిద్ధమైందని వంతిదేవుడు గ్రహించాడు. ఓడ ఊగినప్పుడల్లా కొయ్యదిమ్మలు దొర్లి అతని మీద పడసాగాయి. కానీ తన కాళ్ళు చేతులు కట్టబడి ఉండడం వల్ల వాటిని తన పైనుంచి తొలగించుకోలేకపోయాడు.

"ఈసారి తప్పించుకొని బయటపడితే మాత్రం, ఇక ఇలా తొందరపడి ఏ కార్యమూ చేయకూడదు. ఆళ్వార్ కట్టియాన్ లాగ దీర్ఘంగా ఆలోచించి చేయాలి" అని తన మనసులో అనుకొన్నాడు వంతిదేవుడు.

ఆ సమయాన పిశాచి నవ్వులాంటి నవ్వొకటి వినిపించింది. అతికష్టం మీద ముఖాన్ని కాస్త తిప్పి అటువైపు చూశాడు. అక్కడ మంత్రవాది రవిదాసు నిలబడి ఉండడాన్ని గమనించాడు. అయితే అతని ముఖం ఇప్పుడు ముసుగుతో కప్పబడిలేదు.

"ఆహా! ఆ చోళదేశపు పులిని వెతుక్కొంటూ వచ్చాను. పులి దొరకలేదు. అందుకు బదులు ఈ వాణర్ కులపు నక్క చిక్కుబడింది. అంతవరకు అదృష్టమే!" అన్నాడు.

~

పైన వివరించిన సంఘటనల్లో వంతిదేవుడు పడవెక్కి వెళ్ళింది మాత్రమే ఒడ్డుపైనున్న వారికి కనిపించింది. ఓడలోపల జరిగింది ఇదీ అని పడవ నడిపిన వాడికే తెలియదు. వాడు వేగంగా పడవను

నడుపుకొంటూ ఒడ్డుకు వచ్చి చేరాడు.

సేనాధిపతి మొదలైనవారు మళ్ళీ పడవెక్కారు. ఇక ఆ ఓడను వెన్నంటి వెళ్ళి పట్టుకోవడం అసాధ్యం అని తీర్మానించారు. కాబట్టి తొండైమాన్ నది సంగమానికి వెళ్ళి చూడాలనుకొన్నారు. అక్కడ ఇంకొక ఓడ ఉండవచ్చు. అందులో యువరాజు ఇంకా ఉండవచ్చు. ఎలాగూ ఏదైనా సమాచారం దొరుకుతుంది కద?

పడవ నడిపేవాడిని అడిగి చూశారు. వాడి దగ్గరినుంచి వివరాలేమీ రాబట్టలేకపోయారు. "పడవలో పడుకొని నిద్ర పోతున్న నన్ను పొద్దు పొడవక మునుపే ఎవరో వచ్చి తట్టి లేపారు. పడవలో వారిని తీసుకొని వెళ్ళి ఓడకు చేరిస్తే చాల డబ్బులిస్తామన్నారు. మీరు నిద్ర లేచేలోపు వారిని దింపేసి వచ్చేద్దామని వెళ్ళాను. ఇంతకన్న నాకేమీ తెలియదు" అన్నాడు.

~

పైన వివరించిన వృత్తాంతాలలో ఆళ్వార్ కట్టియాన్ తనకు తెలిసిన వివరాలన్నిటినీ, ఒక్కటికూడ విడిచిపెట్టకుండ యువరాజుకు చెప్పాడు.

"యువరాజా! వంతిదేవుడు సముద్రంలోకి దూకగానే నేను కూడ అతని వెనుకే దూకుదామనుకొన్నాను. కానీ సముద్రమంటే కాస్త భయం ఉండడం వల్ల వెనుకంజ వేశాను. అదీగాక ఆ ఓడ గురించి కూడ నాకు కాస్త సందేహమేర్పడింది. అందులో మీరు ఎక్కి వెళ్ళివుండరనిపించింది. ఇంకా, ఆ ఓడ చోళదేశపు ఓడై ఉండసాధ్యమా అన్న సందేహం కూడ కలిగింది. ఇందుగురించి సేనాధిపతితో మాట్లాడాను. ఇద్దరూ ఇక్కడికి వచ్చి చూసి ఒక ముగింపుకు/నిర్ణయానికి రావాలని తీర్మానించాము. ఇక్కడ మిమ్మల్ని చూసిన తర్వాతే మా మనసు కుదుటపడింది!" అన్నాడు.

ఆళ్వార్ కట్టియాన్ చెప్పినదంతా శ్రద్ధగా వింటూ వచ్చిన అరుళ్మొళి వర్మ, "కానీ నా మనసులో నెమ్మది లేదు, తిరుమలై! వంతిదేవులు ఆ ఓడలో వెళుతున్నారు. పళువేట్టరయ్యర్లు అతన్ని పట్టుకొని పాతాళ చెరసాలలో పడవేస్తారు!" అన్నారు.

అప్పుడు సేనాధిపతి, "యువరాజా! ఈ పళువేట్టరయ్యర్ల ధాష్టీకాన్ని, దురహంకారాన్ని ఇంకా ఎందుకు సహించాలి? మీరు అనుమతిస్తే చాలు. ఇప్పుడే, ఈ క్షణమే ఈ పళువేట్టరయ్యర్ల అధికారాన్ని తీసి పడేసి వాళ్ళనే ఆ పాతాళ చెరసాలలో పడేస్తాము!" అన్నారు.

"అయ్యా! నా తండ్రికి విరుద్ధంగా నేను అణుమాత్రంకూడ నడుచుకొంటానని కలలో కూడ ఊహించుకోకండి!" అన్నారు యువరాజు.

అ సమయంలో ఒక గుర్రం వేగంగా వస్తున్న శబ్దం విని అందరూ తిరిగి చూశారు. ఆ గుర్రం వారి సమీపానే వచ్చి ఆగింది. ముక్కుతాడు, కూర్చొనే ఆసనం ఏమీ లేని ఆ గుర్రంమీద వచ్చింది ఒక స్త్రీ అని గ్రహించి వారందరూ ఆశ్చర్యపోయారు.

# అధ్యాయము - 48

## 'నౌకాధిపతి' మరణం

**గుర్రం** మీద వచ్చిన స్త్రీమణి ఎవరని యువరాజుకు తెలిసిపోయింది. వెంటనే ఆ గుర్రంవైపు వేగంగా వెళ్ళారు. పూంగుళలి కూడ వెంట వెళ్ళింది. తక్కిన వారు కాస్త జంకుతూ వెళ్ళారు.

అంతలో మూగరాణి గుర్రం దిగింది. యువరాజు వెనక వస్తున్న గుంపును కాస్త దిగులుతో చూసి, పూంగుళలిని సైగతో దగ్గరకు రమ్మని, ఏదో చెప్పింది. "అత్త అడవిలో ఏదో ఒక విచిత్రం చూసిందట. ఆ చోటికి మిమ్మల్ని రమ్మని పిలుస్తోంది!" అన్నది పూంగుళలి. యువరాజు, తక్కిన వారు కూడ తమతో రావచ్చా అని అడగమన్నారు. మూగరాణి కాసేపు ఆలోచించిన తర్వాత, అంగీకారసూచకంగా తలూపింది.

వెళ్ళేటప్పుడు అందరూ ఆ గుర్రం గురించే మాట్లాడుకొంటూ వెళ్ళారు. అది ఒక మేలు జాతి అరబ్బు గుర్రం. ఈ మూగవనితకు అదెలా దొరికింది? ఇటీవలి కాలంలో ఈ ప్రదేశంలో సైన్యమేదీ వచ్చి దిగలేదు; యుద్ధం కూడ జరగలేదు. అలా ఉన్నప్పుడు ఈ గుర్రం ఈమెకు దొరకడం ఎలా సాధ్యం?

~

తొండైమాన్ నదీముఖద్వారం వద్ద చోళదేశపు ఓడ ఒకటి బురదలో కూరుకుపోయిన వైనం మనం చూశాము. అక్కడినుంచి కాస్త దూరం వరకు లంకాద్వీపపు సముద్రతీరం ఆగ్నేయ దిశగా వంపులు తిరిగి వెళ్ళింది. అలా వెళుతున్నప్పుడు సముద్రం భూభాగంలోకి చొచ్చుకొని వచ్చి చిన్నా, పెద్ద జలద్వీపాలను సృష్టించింది. ఇటువంటి సముద్రపు నీటి వంపు నుంచే వంతిదేవుడు మొదలైనవారు చూసిన ఓడ బయటకు వచ్చి సముద్రంలోకి వెళ్ళింది.

ఇప్పుడా మూగరాణి వారిని ఆగ్నేయదిశగా తీసుకొని వెళ్ళింది - దట్టమైన అడవి గుండా. పోను పోను యువరాజు ఉద్రిక్తత అధికం కాసాగింది. ఏదో ఒక ముఖ్యమైన సంభవాన్ని చూపించేందుకే ఈ మూగవనిత మనని ఇంతదూరం తీసుకొని వెళుతోంది. అదేమై ఉంటుంది? ఉన్నట్లుండి ఆ దృశ్యం వారి కళ్ళ ముందు ప్రత్యక్షమైంది.

అడవిలో కాస్త బయలు ప్రదేశం రాగానే ఒక కొలను కనిపించింది. దాని ఒడ్డున కొందరు మనుషులు చచ్చి పడివున్నారు. శవాల దుర్గంధంతో బాటు ఎండిన రక్తపు దుర్గంధం కూడ వారిని చుట్టుముట్టింది. ఎన్నో యుద్ధాల అనుభవం ఉన్న మన బృందంవారికి నిర్జీవ శరీరాలు, ఎండిన రక్తం కొత్త కాదు. కానీ ఇక్కడ ఏదో ఒక మర్మభూయిష్టమైన, భయంకరమైన సంఘటన జరిగిందని వారందరికీ మనసులో దృఢంగా అనిపించింది.

దగ్గరకు వెళ్ళి చూడగా, వారందరూ తమిళదేశపు ఓడ కళాసీలని తెలిసింది. "వేగం! వేగం! ఎవరైనా ఇంకా ప్రాణాలతో ఉన్నారేమో చూడండి!" అని యువరాజు పెద్దగా కేకవేయగా, అందరూ ఒక్కొక్క శరీరం దగ్గరికి వెళ్ళి పరిశోధించనారంభించారు.

మూగరాణి మళ్ళీ యువరాజుకు సైగ చేసి తనతో పిలుచుకొని వెళ్ళింది. మృతదేహాలు పడివున్న స్థలానికి కాస్త దూరాన ఒక చెట్టు కిందకు తీసుకొని వెళ్ళింది. అక్కడ ఒక ఘోర ఆకారం చెట్టుకానుకొనివుంది. అది మానవ రూపమే గాని ఒళ్లంతా గాయాలు. తలపైన గాయాల నుంచి రక్తం ముఖంపైకి స్రవించి అతిభయంకరంగా కనిపించింది. క్షణక్షణమూ మరణానికి దగ్గరవుతున్న ఆ మానవుని ముఖం యువరాజును చూడగానే విప్పారిన సూచనలు కనిపించాయి. అతడు నోరు తెరిచి ఏదో చెప్ప ప్రయత్నించాడు. కానీ అతని నోరు కూడ రక్తసిక్తమై ఉండడం వల్ల మరింత ఘోరంగా కనిపించాడు.

యువరాజు ఆదుర్దాగా/ఆందోళనతో అతని దగ్గరకు వెళ్ళి కూర్చొన్నారు. "త్వరగా నీరు తెండి!" అని కేక వేశారు.

ఆ మనిషి, "వద్దు యువరాజా! కాసేపటికి మునుపే ఈ స్త్రీమణి నాకు నీరిచ్చింది. లేకపోతే ఇప్పటికి నా ఊపిరి పోయివుండేదే. అయ్యా! తమరికి ద్రోహం చేయవచ్చినందుకు  ఇక్కడే శిక్ష అనుభవించేశాను. పరలోకంలో దేవుడు ఇందుకోసం నన్ను మళ్లీ శిక్షించడు" అన్నాడు.

యువరాజు అతని గొంతు వినగానే, "ఆః! నౌకాదళపతీ! ఇదేం మాట! ఇదంతా ఎలా జరిగింది? మీరు నాకేం ద్రోహం చేయవచ్చారు? ఇదంతా నేను నమ్మనే నమ్మను!" అన్నారు.

"అయ్యా! మీ మంచి గుణం వల్ల అలా చెబుతున్నారు. పళువేట్టరయ్యర్ల ఆజ్ఞ ప్రకారం మిమ్మల్ని చెరపట్టి తీసుకొని వెళ్ళేందుకు వచ్చాను. ఇదిగో ఆజ్ఞాపత్రం!" అని చెప్పి తన ఒడిలో ఉన్న తాళపత్రాన్ని తీసి యువరాజుకిచ్చాడు మరణోన్ముఖుడైన ఆ నౌకాధిపతి.

తాళపత్రాన్ని ఒక్క క్షణంపాటు చూసి, "ఇందులో మీ ద్రోహమేముంది? చక్రవర్తి ఆజ్ఞను నెరవేర్చ వచ్చారంతే! అది గ్రహించి నేనే వేగంగా పరుగెత్తి వచ్చాను. అంతలో ఈ విపరీతం జరిగిపోయింది! త్వరగా చెప్పండి!" అన్నారు యువరాజు.

"త్వరగానే చెప్పాలి. లేకపోతే తర్వాత చెప్పడానికే సాధ్యం కాదు!" అన్నాడు నౌకాధిపతి. తర్వాత అతికష్టం మీద కింది వృత్తాంతాన్ని వివరించాడు:-

చక్రవర్తి ఆజ్ఞను తీసుకొని, నౌకాధిపతి రెండు ఓడలతో నాగపట్టణం నుంచి బయలుదేరాడు. అతనికా పని ఇష్టం లేకపోయింది. కానీ చక్రవర్తి ఆజ్ఞను మీరలేక ఒప్పుకొని బయలుదేరాడు. బయలుదేరేముందు  పళువేట్టరయ్యర్లు అతనికి కొన్ని సూచనలను తప్పక పాటించాలని ఆజ్ఞాపించారు. అవేమంటే:- లంకకు చేరగానే ఓడలను లంగరు వేసి నిలిపి, యువరాజెక్కడున్నారని ఆరా తీయాలి. తర్వాత  తిన్నగా వెళ్ళి ఆయననే కలిసి, చక్రవర్తి ఆజ్ఞను అందివ్వాలి. అంతకు మునుపు కొడుంబాళూర్

సేనాధిపతికి ఈ విషయం తెలియకూడదు. యువరాజుకు చక్రవర్తి ఆజ్ఞను అందించిన తర్వాత ఆయన తనక తానే వస్తే సరి. లేకపోతే బలవంతంగానైనా చెరపట్టి తీసుకొని రావాలి. ఇలా చెప్పి తమ అంతరంగ వీరులు కొంత మందిని కూడ వెంట పంపారు.

నౌకాధిపతి మనసులో ఒక పెద్ద భారంతోనే బయలుదేరి వచ్చాడు.అతని కింద పనిచేస్తున్న కళాసీలు చాల మందికి తాము లంకకు ఎందుకు వెళుతున్నామన్న విషయమే తెలియదు. అందువల్ల అతని మనోవేదన ఇంకా అధికమైంది. వారికి ఈ విషయం ఎలా చెప్పాలో తెలియక బాధపడ్డాడు. తొండైమాన్ నదీముఖద్వారం వద్ద ఓడలను ఆపేసి గాంగేశన్ నదీముఖద్వారం వద్దకు వెళ్ళాడు - యువరాజు ఎక్కడున్నాడో తెలుసుకోవడానికి. యువరాజు ఆ  సమయాన దక్షిణలంక లోపలిభాగంలో ప్రయాణిస్తున్నారని తెలుసుకొని తిరిగి వచ్చాడు.

సేనాధిపతి తిరిగి వచ్చేలోపల కళాసీలకు విషయం తెలిసిపోయింది. ఎలా? పళువేట్టరయ్యర్ల ఆంతరంగికులు కొందరు వెంట వచ్చారు కద? వారి మూలంగా గుట్టు రట్టయింది! నౌకాధిపతి తిరిగి రాగానే ఆయన చుట్టూ గుమిగూడి ఆయన్నిలా నిలదీసి అడిగారు: “పొన్నియిన్ సెల్వన్ని చెరపట్టి తీసుకొని వెళ్ళడానికా వచ్చాము?” నౌకాధిపతి నిజం చెప్పాడు. “ మనం రాజసేవలో ఉన్నవారము. చక్రవర్తి ఆజ్ఞను నెరవేర్చవలసిన వారము" అన్నాడు. వారు "ఇది మావల్ల కాదు. ఇది చక్రవర్తి ఆజ్ఞ కానేకాదు. పళువేట్టరయ్యర్ల ఆజ్ఞ" అన్నారు.

“మరి మీరేం చేయబోతున్నారు?” అని అడిగారు నౌకాధిపతి.

“మామిడితోపుకు వెళ్ళి యువరాజుతో చేరిపోతాము.”

“మామిడితోపులో యువరాజు లేరు కద?”

“లేకపోతే సేనాధిపతి కొడుంబాళూర్ వేళార్ గారి దగ్గర శరణు కోరుతాం.”

సేనాధిపతి ఎంత నచ్చజెప్పినా ప్రయోజనం లేకపోయింది. నౌకాధిపతితో నిలబడేందుకు పళువేట్టరయ్యర్ల మనుషులతో సహా ఒక పదిమందికన్న ఎక్కువ మంది సమ్మతించలేదు. పది మంది సహాయంతో రెండువందల మందిని ఏం చేయగలరు?

“సరే! ఇప్పుడే ఇక్కడినుంచి తొలగండి! తర్వాత వచ్చే పరిణామాలను కూడ అనుభవించండి! నా చేతనైనంత వరకు నా కర్తవ్యాన్ని నేను నెరవేరుస్తాను!” అన్నాడు నౌకాధిపతి.

కళాసీలలో చాలమంది ఒక ఓడలో ఎక్కి మామిడితోపుకు వెళ్ళడానికి సిద్ధమయ్యారు. కానీ కొందరు అందుకు అభ్యంతరం తెలిపారు. కాబట్టి ఆ మొదటి గుంపులోని వారు సముద్రతీరం వెంబడే వెళ్ళ నిశ్చయించారు. కానీ ఈ గడబిడలో ఓడకు లంగరు వేయ మరిచారు. అది అలల ఊయలలో మెల్లగా జరుగుతూ ఒడ్డు దగ్గరకు వెళ్ళి నేలకు కొట్టుకొని బురదలో కూరుకుపోయింది.

~

ఇది జరిగిన తర్వాత నౌకాధిపతి తన ఇంకొక ఓడతో అక్కడే ఉండనిష్టపడలేదు. ఎందుకంటే, గాంగేశన్ నది వద్ద అతడొక సంగతి విన్నాడు - కొన్నాళ్లకు మునుపు అరబ్బు దేశపు ఓడ ఒకటి అక్కడ విరిగి మునిగిపోయిందనీ, దాని నుంచి తప్పి బయటపడ్డ కొందరు మొరటు, మూర్ఖ అరబ్బులు అక్కడ తిరుగాడుతున్నరనీను. కాబట్టి ఒడ్డుకు కొట్టుకొని కూరుకుపోయిన ఓడకు పక్కనే రెండవ ఓడను కూడ నిలిపేందుకు ఇష్టపడలేదు. దాగున్న ఓడను సిద్ధం చేసి అవతలికి తీసుకొని వెళ్ళాడు. లోతుగా ఉన్న చోటికి తీసుకొని వెళ్ళి లంగరు వేసి నిలిపాడు.

తర్వాత నౌకాధిపతి తనతో ఉన్న కళాసీలతో ఒడ్డుకు వచ్చి ఇక ముందు చేయవలసిన కార్యం గురించి చర్చించాడు. తాను ఒంటరిగా వెళ్ళి యువరాజును కలిసి ఆజ్ఞాపత్రాన్ని ఇవ్వడమని, తక్కినవారు అక్కడే ఉండి ఓడను జాగ్రత్తగా కాపాడుతుండాలని చెప్పాడు.

కళాసీలు తమ భయాలను తమ నాయకునికి చెప్పుకొన్నారు. నౌకాధిపతి వారికి ధైర్యం చెబుతుండగానే, అతిభయంకరంగా, వెంట్రుకలు నిక్కబొడుచుకొనేటట్లు  కేకలు వేస్తూ కొందరు మనుషులు వారిని ముట్టడించారు. వారు అరబ్బు దేశస్థులని తెలిసింది. తమిళ కళాసీలు ఆ సమయాన ఎదురుచూడని ముట్టడింపది. యుద్ధానికి ఆయత్తంగాను లేరు, చేత కత్తులు కూడ లేవు. కానీ ధైర్యంగా పోరాడారు. పోరాడి అందరూ అసువులు బాసారు.

“యువరాజా! నేనొక్కడిని మాత్రం మారణగాయాలతో పరుగెత్తి వెళ్ళి దాక్కొని ప్రాణాలను కాపాడుకొన్నాను. జరిగినది ఎవరికైన చెప్పాలనే ఇంతసేపు ఊపిరితో ఉన్నాను. మిమ్మల్నే ప్రత్యక్షంగా చూసి చెప్పే భాగ్యం నాకు దొరికింది. మీకు ద్రోహం చేయదలిచినందుకు ఫలితాన్ని అనుభవించేశాను. పొన్నియిన్ సెల్వ! నన్ను మన్నించేయండి!” అన్నాడు నౌకాధిపతి.

“కర్తవ్యాన్ని నెరవేర్చిన నౌకాధిపతీ! మిమ్మల్ని నేనెందుకు మన్నించాలి? యుద్ధరంగంలో ప్రాణాలు కోల్పోయిన వీరులు చేరుకొనే వీరస్వర్గముంటే మీరందరూ తప్పక వెళ్ళి చేరుతారు! సందేహం లేదు!” అని చెప్పి యువరాజు అగ్నిగుండం లాగ కాలిపోతున్న నౌకాధిపతి తల నిమిరారు.

అప్పుడు ఆ నౌకాధిపతి కళ్లలో కన్నీళ్ళుప్పొంగి తన ముఖంపైని రక్తంతో కలిసి ప్రవహించింది.

అతికష్టం మీద తన చేతులను ఎత్తి యువరాజు చేతులను పట్టుకొని తన కళ్ళకద్దుకొన్నాడు. యువరాజు చేయి నౌకాధిపతి కన్నీళ్లతో తడిసిపోయింది. ఆయన కళ్ళలోను కన్నీళ్ళుబికాయి.

కాసేపటికల్లా నౌకాధిపతి ప్రాణం అతని శరీరాన్ని విడిచింది.

~~~
~~~

# అధ్యాయము - 49

## ఓడకోసం గాలింపు

**నౌకాధిపతి** మృతదేహాన్ని, మరణించిన కళాసీల దేహాలను ఒక చోట పేర్చి, చుట్టుపక్కల దొరికిన ఎండు కట్టెలతో కప్పి దహనం చేశారు.

చితికి నిప్పంటించినప్పుడు యువరాజు కళ్ళనుంచి ధారగా కన్నీళ్ళు కారడం సేనాధిపతి బూది విక్రమకేసరి గమనించారు.

“అయ్యా! ఈ పాతకుల చావు కోసం మీరెందుకు కన్నీళ్ళు విడుస్తున్నారు? మిమ్మల్ని చెరపట్ట వచ్చిన ఈ ద్రోహులకు దేవుడే తగిన శిక్ష విధించాడు కద? మీరెందుకు విచారిస్తున్నారు?” అని అడిగారు.

“సేనాపతీ! వీరు ద్రోహులు కారు; వీరి మరణం గురించి కూడ నేను విచారించడం లేదు. చోళసామ్రాజ్యానికి ఇటువంటి దుర్గతి పట్టిందనే నా విచారం" అన్నారు యువరాజు.

“పోగాలము పళువేట్టరయ్యర్ల వల్లనే దాపురించింది. ఇప్పుడు కొత్తగా ఏమీ రాలేదే?”

“కొత్తగానే వచ్చింది. నౌకాధిపతి ఆజ్ఞను కళాసీలు మీరారంటే అంతకన్న కీడేముంది రాజ్యానికి? సేనాపతీ! ఇది ఒక చిన్న సూచనే! ఇలా చోళసామ్రాజ్యమంతటా చీలికలు ఏర్పడుతాయనే భయపడుతున్నాను! అలా జరిగితే విజయాలయ చోళులు పునాదులు వేసిన ఈ చోళసామ్రాజ్యం ఛిన్నాభిన్నమైపోతుంది కద? ఈ కీడు నామూలంగా రావాలా! మహాభారతంలో దుర్యోధనుడు పుట్టినప్పుడు నక్కలు, తోడేళ్ళు భయంకరంగా ఊల వేశాయట. నేను పుట్టినప్పుడు కూడ నక్కలు, తోడేళ్ళు అలా భయంకరంగా ఊల వేసివుండాలి!” అన్నారు యువరాజు.

“అయ్యా! మీరు జన్మించినపుడు ఈ లోకంలో ఎన్నెన్ని మంచి శకునాలున్నాయో అన్నీ జరిగాయి. మీ జాతకాన్ని గణించిన జ్యోతిష్కులు....”

“చాలు, సేనాపతీ! చాలు! ఈ మాటలు విని విని నా చెవులు దిబ్బెళ్ళు పడిపోయాయి. నా జాతక విశేషమలా ఉండనీ. మనం విడిపోవలసిన సమయం వచ్చింది. సేనాపతీ! మిమ్మల్ని వేడుకొంటాను. నౌకాధిపతి ఆజ్ఞను మీరి వేరుగా వెళ్ళిన కళాసీలు మీ దగ్గరకు వస్తే చేర్చుకోకండి. బంధించి తంజావూరుకు పంపండి.”

“యువరాజా! మనం నౌకాధిపతి మాటను మాత్రమే విన్నాము. ఆ కళాసీలు ఏమంటారో వినాలి కద? ఒక పక్షం మాట మాత్రం విని ఎలా తీర్మానించగలం? అది నీతికి, ధర్మానికి తగునా? మీరు నాతో రండి. ఆ కళాసీలు తిరిగి వచ్చిన తర్వాత వారి మాట కూడ విని ఒక తీర్మానానికి రండి....”

“అయ్యా! అది సాధ్యం కాదు. మీకుచితమనిపించిన విధంగా చేయండి. నేనిక ఒక్క క్షణం కూడ

ఆలస్యం చేయలేను. వెంటనే బయలుదేరాలి. పడవ నడిపేవాడెక్కడ?" అని అడిగారు.

"ఎక్కడికి బయలుదేరాలి యువరాజా? పడవెందుకు?"

"దీని గురించి మీరు మళ్ళీ అడగాలా? వంతిదేవుడు ఎక్కి వెళ్ళిన ఓడకే నేను కూడ వెళ్ళాలి. ఆ వీరాధివీరుడు నా కోసమే కద ఆ అరబ్బుల వశమైన ఓడెక్కి అంతటి భయంకరమైన అపాయానికి లోనైవున్నాడు? అతన్ని నేను విడవగలనా? అది న్యాయమా? ఇప్పటికే నేను చేసిన పాపాలు చాలవని మిత్రద్రోహం కూడ చేయాలా?"

"అయ్యా! మీరు నేనెరిగినంతలో ఏ పాపమూ చేయలేదు. మీరు చెప్పినా లోకం ఒప్పుకోదు. వంతిదేవుడు ఒట్టి మొరటు మనిషి. ముందాలోచన ఏమాత్రం లేదు. తాను తెచ్చుకొన్న అపాయానికి మీరెలా బాధ్యులవుతారు? ఇందులో మిత్రద్రోహమేముంది? యువరాజా! ఎక్కడినుంచో గతి తప్పి వచ్చిన ఆ యువకుని మీ స్నేహితుడని పెద్దగా చెప్పుకోవడమే నాకు నచ్చలేదు. సరిసమాన అంతస్తులో ఉన్నవారే కద స్నేహితులు కాగలరు?"

"సేనాధిపతీ! ఒట్టి మాటలతో కాలం వెళ్ళబుచ్చడం నాకిష్టం లేదు. అతను నా స్నేహితుడు కాకపోయినా కృతజ్ఞత అన్నది ఉండాలి కద? తిరువళ్ళువర్ మొదలుకొని పెద్దలందరూ చెప్పారు కద? 'చోళ వంశస్థులు మేలు మరువని వారు' అన్న కీర్తి నా వల్ల చెడిపోకూడదు. ఈ క్షణమే బయలుదేరి వెళ్ళి ఆ ఓడను వెతికి పట్టుకొంటాను...."

"ఎలా బయలుదేరుతారు? ఎక్కడ వెతుకుతారు, యువరాజా?"

"మీరెక్కి వచ్చిన పడవలోనే బయలుదేరుతాను...."

"కుందేలు సాయంతో పులిని వేటాడడమా? లోతైన సముద్రంలో వెళ్ళే ఓడను ఈ చిన్న పడవెక్కి వేటాడగలమా? పట్టుకొన్నా కూడ, ఆ తర్వాత ఏం చేస్తారు?"

"ఈ పడవెక్కి వెళతాను. అది విరిగిపోతే దాని బల్లలను పట్టుకొని ఈదుతూ వెళతాను. వంతిదేవుని తీసుకొని వెళుతున్న ఓడ ఏడు సముద్రాలకవతల ఉన్నా, తరుముకొంటూ వెళ్ళి పట్టుకొంటాను. పట్టుకొన్న తర్వాత నా స్నేహితుడు వంతిదేవుని కాపాడలేకపోతే, ఆయనతోబాటు నేను కూడ ప్రాణత్యాగం చేస్తాను. పడవ నడిపేవాడెక్కడ?"

ఇలా అంటూనే యువరాజు నలువైపులా చూశారు. పడవవానితో ఒక పక్కగా నిలబడి పూంగుళలి మాట్లాడుతుండడాన్ని గమనించారు. వారున్న చోటువైపు వేగంగా వెళ్ళారు.

~

దగ్గరకు వెళ్ళగానే, పూంగుళలి కళ్ళలో నీరుబుకుతుండగా ఆ పడవబ్బితో ఏదో కోపంగా మాట్లాడుతుండడాన్ని గమనించారు.

"ఆఁ! ఇదేమి? ఇంకొక అంతఃకలహమా?" అన్నారు యువరాజు.

పడవ నడిపేవాడు ఉన్నట్లుండి యువరాజు కాళ్ళమీద పడ్డాడు. "యువరాజా! తెలియక ఈ పాతకానికొడిగట్టాను. డబ్బాశతో చేసేశాను. నన్ను మన్నించండి!" అని భోరుమన్నాడు.

"ఇదేమి...? పూంగుళలి! అందరూ కూడబలుక్కొని నన్ను పిచ్చివాడిని చేసేస్తారులాగుంది. నీవైనా విషయం ఇదీ అని వివరించి చెప్పకూడదా?"

"యువరాజా! ఇంతవరకు చెప్పేందుకు సిగ్గుపడి చెప్పలేదు. ఇప్పుడు చెప్పక తప్పదు. వీడు నా అన్న. మిమ్మల్ని చంప వచ్చిన పాపిష్ఠివాళ్ళనిద్దరినీ వీడే కోడిక్కరైనుంచి పడవలో ఎక్కించుకొని వచ్చాడు. వారు చెప్పినట్లే ఇక్కడుండి, ఈ రోజు పొద్దున వాళ్ళిద్దరినీ మళ్ళీ పడవలో ఎక్కించుకొని మనం చూసిన ఓడకు చేర్చాడట! మీ స్నేహితుడు కూడ అదే ఓడలో ఉన్నాడట..." అన్నది.

"ప్రభూ! నన్ను నరికేయండి. వాళ్ళు అలాంటి దుష్టులని నాకు తెలియలేదు. తెలిస్తే ఈ పని చేసేవాడిని కాను. నన్ను మీ చేత్తోనే చంపేయండి!" అన్నాడు పడవ నడిపేవాడు.

"బాబూ! ఇప్పుడు నీ ప్రాణం నాకు అతిమూల్యమైనది. రా, వెళదాం! ఆ ఓడ దగ్గరకే నన్ను కూడ తీసుకొని వెళ్ళి ఎక్కించు. నీవు నాకు చేసిన కీడుకు అదే ప్రాయశ్చిత్తం. బయలుదేరు.. వెళదాం!" అన్నారు యువరాజు.

~

సముద్రతీరం వెంబడి కాస్త దూరం వెళ్ళగానే ఒడ్డున ఉన్న ఒక పడవ కనిపించింది. పడవ నడిపేవాడు దాన్ని లాగి నీటిలోకి తోశాడు. యువరాజు సముద్రాన్నే పరీక్షగా చూడసాగారు. "అదిగో ఆ ఓడ కనిపిస్తోంది! పట్టేసుకోవచ్చు!" అన్నారు.

సేనాధిపతి కూడ దూరంగా కనిపించిన ఓడను పరీక్షగా చూశారు.

"యువరాజా! పండు జారి పాలలో పడ్డట్లైంది!" అన్నారు.

"ఆహా! అదేమి! మీ నోట కూడ మంచిమాటలు వినవస్తున్నాయే!"

"మన కంటికి కనిపిస్తున్నది మీరనుకొంటున్నట్లు వంతిదేవుని తీసుకొని వెళుతున్న ఓడ కాదు. పార్థిబేంద్రుని ఓడ. త్రికోణమలై వైపు నుంచి వస్తోంది. మనవైపే వస్తోంది. తెలియడం లేదా?"

"అవునవును. అలాగైతే చాల మంచిది. పార్థిబేంద్రులు ఇంకేదో ఉద్దేశంతో వస్తున్నారు. అయినా మంచి సమయానికే వస్తున్నారు. సింహాన్ని పక్కనుంచుకొని చిరుతను వేటాడుదాం...! కానీ ఆ ఓడ ఇక్కడికి వచ్చేంతవరకు నేను వేచివుండను. ఇప్పుడే ఈ పడవెక్కి కాస్త దూరం వెళ్ళి ఓడెక్కుతాను..."

"యువరాజా! మీ పడవలో వచ్చేందుకు...."

"అయ్యా! మీరెవ్వరూ నాతో రానవసరం లేదు. ఇక్కడే ఆగిపోతే నాకు చాల పెద్ద ఉపకారం చేసినవారవుతారు..... తిరుమలై! నీక్కూడా చెబుతున్నాను. నీకెలాగూ సముద్రమంటే భయం కద?"

"అవునయ్యా! నేనూ ఇక్కడే ఆగిపోదామనుకొంటున్నాను. లంకలో ఉన్నంతవరకు మిమ్మల్ని

చూసుకోమనే నాకు ఆజ్ఞ. ఇప్పుడు ముఖ్యమంత్రి మదురైలో ఉన్నారు. ఆయన దగ్గరకు వెళ్ళి జరిగిందంతా చెప్పాలి...”

“అలాగే చేయి. పూంగుళలి! ఇక నీవు కూడ ఇక్కడే ఆగిపోవలసిందే. నీ అన్న గురించి దిగులుపడకు. నేను చూసుకొంటాను. నీ పడవను ఎక్కడో విడిచిపెట్టి వచ్చావని చెప్పావు కద? అది తీసుకొని నీవు నీ దారిన వెళ్ళు. నీవు నాకు చేసిన సహాయాన్ని ఎన్నటికీ మరువను.... ఛఛ! కన్నీళ్ళు తుడుచుకో. చూసేవాళ్ళు ఏమనుకొంటారు?”

ఇలా చెప్పి యువరాజు మూగరాణి వద్దకు వెళ్ళి ఆమె పాదాలను తాకి నమస్కరించబోయారు. కానీ ఆమె ఆయనకడ్డుపడి పైకి లేవనెత్తి తల నిమిరి ఆశీర్వదించారు.

మరునిమిషమే యువరాజు నీట సిద్ధంగా ఉన్న పడవలోకి ఎక్కారు.

ఒడ్డునున్నవారు పడవనే చూస్తూ నిలబడ్డారు.

యువరాజు కూడ వెళుతున్న పడవనుంచి వారిని చూస్తూ వెళ్ళారు.

అందరినీ సాధారణంగా చూసినా, ఆయన కళ్ళు కన్నీళ్ళతో తడిసిన పూంగుళలి ముఖంపైనే నిలిచాయి. ఆశ్చర్యమాశ్చర్యం! దూరమైన కొలది రూపాలు చిన్నవి కావాలి కద? ఒడ్డున ఉన్న తక్కిన వారి రూపాలు చిన్నవి కాసాగాయి. కానీ పూంగుళలి ముఖం రానురాను పెరిగి పెద్దది కాసాగింది; యువరాజును సమీపించసాగింది.

యువరాజు ఒంటిని ఒక్కసారి విదిలించుకొన్నారు. కళ్ళు నులుముకొని చూశారు. మళ్ళీ కళ్ళను ఇంకొకవైపు తిప్పి చూశారు. మునుపటి రాత్రి కలలో కలిగిన ఒక సంభవం ఆయన మనోనేత్రం ముందు నిలిచింది. యువరాకుమారి కుందవై, “తమ్ముడూ! నీకోసం ఇక్కడ వాణతి వేచివుందని మరువకు!” అన్న మాటలు కడలి అలల హోరు మధ్య మెత్తగా ఆయన చెవికి వినిపించాయి.

~~~
~~~

# అధ్యాయము - 50

## "ఆపత్కాల సహాయకులు"

**యువరాజును** పడవలో చూసిన వెంటనే పార్థిబేంద్రుని ఆశ్చర్యానికంతులేకపోయింది.. మొక్కేందుకు వెళ్ళిన దైవం ఎదురుగా వచ్చి దర్శనమివ్వడమేగాక, "ఇష్టమైన వరాలు కోరుకో!" అన్నట్లుంది కద? - కానీ ఇలా వారు పడవలో ఒంటరిగా రావడానికి కారణమేమి? పళువేట్టరయ్యర్ల ఓడలు ఏమైనాయి...? ఇది తన ఓడ అని తెలియక, ఇదే తమను చెరపట్ట వచ్చిన ఓడ అని ఎంచి వస్తున్నారా, ఏమి?

అలా పొరబడి రావడం లేదని త్వరలోనే తెలిసిపోయింది. యువరాజు పడవనుంచి ఓడలోకి ఎక్కిన వెంటనే, తాను అడిగేంతవరకు ఆగక, తానే జరిగిన సంఘటనలన్నింటినీ క్లుప్తంగా చెప్పేశారు. "అరబ్బుల కైవసమైన ఓడలో వంతిదేవుడున్నాడు. అతన్ని ఎలాగైనా కాపాడాలి" అన్నారు.

యువరాజు చెప్పిన విషయాలు పార్థిబేంద్రునికి మిక్కిలి కుతూహలాన్ని కలిగించాయి.

"అంతా మన మంచికే జరిగింది. ఆ మొరటు అబ్బాయి ఇంతటి తొందరపాటు పని చేసివుండకూడదు. కానీ వాడిని ఆ అరబ్బుల చేతిలో విడిచిపెట్టకూడదు. ఆ ఓడ చాల దూరం వెళ్ళివుండదు. ఎలాగైనా తరుముకొని వెళ్ళి పట్టేయవచ్చు" అన్నాడు

తర్వాత నౌకాదళపతిని పిలిచి వివరించాడు.

"అందు గురించి దిగులేల? గాలి మనకనుకూలంగా వస్తుండడం వల్ల సాయంకాలం లోపల ఆ ఓడను పట్టేసుకోవచ్చు. మనను తప్పించుకొని ఆ ఓడ ఎక్కడికి వెళ్ళగలదు? కోడిక్కరై చేరిన తర్వాత సముద్రతీరం వెంబడే కద వెళ్ళాలి?" అన్నాడు నౌకాధిపతి.

~

కానీ వాయుభగవానుని మనోరధం ఇంకోవిధంగా ఉంది. రానురాను గాలి వేగం తగ్గిపోసాగింది. మధ్యాహ్నానికి పూర్తిగా స్తంభించిపోయింది. అలలేవీ లేక సముద్రం ప్రశాంతంగా ఉంది. చెప్పలేని ఉక్క మొదలైంది. సూర్యభగవానుడు తీక్షణంగ ప్రకాశిస్తూ కడలిపైన అగ్నివర్షం కురిపిస్తున్నాడు. సముద్రజలాన్ని తాకిచూస్తే కాలిపోయేటంత వేడిగా ఉండేదేమో. కానీ కడలిని చూసినప్పుడు అది జలసముద్రంలాగ కనిపించలేదు; సలసల కాగుతున్న నూనె కడలి లాగ కనిపించింది. సూర్య కిరణాలు నిటారుగా పడుతున్న చోట అగ్ని సముద్రంలాగ కనిపించింది.

ఓడ ఏమాత్రం కదలడం లేదు. తెరచాపలన్నీ పూర్తిగా విప్పబడివున్నాయి. కానీ ఏం ప్రయోజనం? అలల శబ్దం ఆగిపోయినట్లే తెరచాపల పటపట శబ్దం కూడ ఆగిపోయింది. ఓడ సముద్రాన్ని

చీల్చుకొని ముందుకు వెళ్ళే శబ్దం కూడ లేదు. నిజానికి ఆ నిశ్శబ్దం సహించలేని వేదనను కలిగించింది.

దానికి తోడు యువరాజు మనసులో వంతిదేవుని గురించిన వేదన కూడ అధికమైంది. "ఇలా గాలి వీయడం ఆగిపోయి, ఓడకూడ పూర్తిగా ఆగిపోయిందే! ఇలాగే ఎంతసేపుంటుంది? గాలి ఎప్పుడు మళ్ళీ వీస్తుంది? ఆ ఓడ తప్పించుకొని పారిపోదా?" అని దిగులుతో అడిగారు.

పార్థిబేంద్రుడు నౌకాధిపతిని చూశాడు.

అప్పుడు నౌకాదళపతి, "చాలసేపు ఇలా ఉండదు; ఎక్కడో సుడిగాలి ఏర్పడుతోంది. అది వచ్చి మనని కొట్టినా కొట్టవచ్చు. లేక మన పక్కగా వెళ్ళిపోనూవచ్చు. సుడిగాలి మనని కొట్టినా, కొట్టకపోయినా, కాసేపట్లో సముద్రం కల్లోలమయం కాబోతోంది. ఇప్పుడిలా ప్రశాంతంగా ఉంది కద? రాత్రిలోపల కొండెత్తు అలలు లేచి మన ఓడను గుద్దడం చూస్తాము. ఆకాశాన్నంటే అలల్నీ చూస్తాము. అధోపాతాళాన్నీ చూస్తాము!" అన్నాడు.

"సుడిగాలి ఓడను కొడితే అపాయమే కద?"

"సాధారణమైన అపాయమా? దేవుడు కాపాడితేనే సరి!"

"అలాగైతే మనమా ఓడను పట్టుకోవడం అసాధ్యం!"

"యువరాజా! కడలి, గాలి పక్షపాతం చూపించవు. మనకెదురైన పరిస్థితే ఆ ఓడకూ ఎదురై వుంటుంది. ప్రస్తుతం అదికూడ కదలకుండ నిలబడివుంటుంది..."

"ఒకవేళ తీరం వెంబడి వెళ్ళివుంటే...?" అని అడిగారు యువరాజు.

"సముద్రతీరం వెంబడి వెళ్ళివుంటే అందులో ఉన్నవారు ఒడ్డెక్కి తప్పించుకోవచ్చు! కానీ ఓడ గతి అధోగతే!" అన్నాడు నౌకాధిపతి.

"ఎంతటి అపాయమైనా మనకు కావలసిన వారు మన పక్కనుంటే దిగుల్లేదు!" అన్నారు యువరాజు. ఆయన మనోనేత్రం ముందు వంతిదేవుని కుతూహలం నిండిన ముఖమూ, పూంగుళలి ఉరుముతున్న చూపులు తరచూ రాసాగాయి. వారిద్దరూ ఇప్పుడెక్కడున్నారు? ఏం చేస్తున్నారు? ఏం ఆలోచిస్తున్నారు?

~

నిజంగానే చాల అపాయకరమైన పరిస్థితిలో విడిచి వచ్చిన వంతిదేవుని వద్దకు మనం ఇప్పుడు వెళదాం.

యువరాజును చెరపట్టి తీసుకొని వెళ్ళడానికి వచ్చిన పెద్ద ఓడల్లో ఒక దాని కింది భాగంలో మూటలు, కొయ్య దిమ్మెలు, ఇతర సామాన్లు పడేసివున్న ఒక చీకటి గదిలో ఒక కొయ్యదిమ్మెకు కట్టబడివున్నాడు వంతిదేవుడు. చాలసేపటివరకు ఏమీ తోచక దిమ్మెరపోయి పడివున్నాడు. తన తొందరపాటు వల్ల ఇటువంటి చిక్కులో పడ్డాం కద అన్న ఆలోచన అతన్ని వేధించసాగింది. ఇది ఏం ఓడ,

ఎవరిది, ఇందులో కొందరు మొరటు అరబ్బులు, రవిదాసు ఎలా చేరివుండ సాధ్యం? ఇది ఎక్కడికి వెళుతోంది? తనసేం చేయబోతున్నారు అని తెగ ఆలోచించినా ఏమీ తట్టలేదు. తను తన భవిష్యత్తు గురించి కంటూ వచ్చిన కలలన్నీ ఒట్టి కల్లలే కాబోలు! దీని కన్న పెద్ద కష్టాలనుంచి, అపాయాలనుంచి తాను తప్పించుకొనివున్నప్పుడు, ఈ అపాయం నుంచి తప్పించుకోవడానికి ఒక ఉపాయం దొరకదా అన్న ధైర్యం కూడ ఒక్కోసారి కలిగింది. చూద్దాం; దేహంలో ప్రాణం ఉన్నంతవరకు, బుద్ధి, తెలివి, ధైర్యం ఉన్నంతవరకు ఆశ కోల్పోనవసరం లేదు.

ఈ ఆశ మొలకెత్తగానే చుట్టూ పరికించి చూశాడు. చీకటిలో మొదట కళ్ళు కనిపించలేదు. కాసేపటికి కళ్ళు చీకటికి అలవాటుపడ్డ తర్వాత చుట్టుపక్కల ఉన్నవి మసక మసగ్గా కనిపించసాగాయి. అతనికి చాల దగ్గరగానే పలువిధాలైన ఆయుధాలు కుప్పలుగా పోసివుండడాన్ని గమనించాడు. అతడి ఒళ్ళు చాల గట్టిగానే కట్టబడిందిగాని అతని చేతులు మాత్రం కాస్త వదులుగానే కట్టబడివున్నాయి. చేతి కట్లను సడలించుకొని, చేయి చాచి దగ్గరలోనే ఉన్న ఒక కత్తిని దొరకబుచ్చుకొని కట్లను కోసేయవచ్చు! తర్వాత తన కాళ్లను, ఒంటిని కట్టివున్న తాళ్ళను కోసి తీసేయవచ్చు. కానీ తర్వాత ఏం చేయడం? ఈ చీకటి గదేమో మూయబడివుంది. దీన్నుంచి బయటపడ్డమెలా? బయట పడ్డ తర్వాత అంతమంది మొరటు అరబ్బులతోను, మంత్రవాదితోను,  అతడి జతగాడితోను ఒకేసారి పోరాడగలమా? - అలా పోరాడి వారందరినీ చంపేసినా, తర్వాత ఏం చేయడం? తాను ఒంటరిగా ఓడను నడపగలడా? ఓడలను గురించి తనకు ఏమీ  తెలియదే!

అవును; మళ్ళీ తొందరపడకూడదు. ఓర్పుతో ఉండాలి. తనను వెంటనే చంపక కట్టి పడేసివుండడమే కాస్త ఆశాజనకంగా ఉంది కద? ఏం చేస్తారో చూద్దాం!

కానీ సమయం గడిచేకొద్దీ వంతిదేవుని ఓపిక నశించసాగింది. అతన్ని పొయ్యిలోపల పడేసి ఉడకబెట్టినట్లనిపించసాగింది. - ఆ గదిలో అంత ఉక్కగా ఉంది మరి. అతని ఒళ్ళు విపరీతంగా చెమర్చసాగింది. సముద్రపయాణం ఇంత కష్టంగా ఉంటుందని అతడు కలలోకూడ అనుకోలేదు. పూంగుళలితో ఆరోజు రాత్రి పడవలో వెళ్ళిన అనుభవాన్ని గుర్తు తెచ్చుకొన్నాడు. అప్పుడెంత చల్లని గాలి వీచింది? ఒంటికి ఎంత హితవుగా ఉందా గాలి? దానికీ, దీనికీ ఎంత తేడా?

ఉన్నట్లుండి ఏదో ఒక మార్పు కలగడాన్ని అతడు గ్రహించాడు. అవును; ఓడ కదలికలు నిలిచిపోయాయి. ఓడ ముందుకు కదలక, ఉన్నచోటే ఉన్నట్లు అనిపించింది. ఉక్క ఇంకా ఎక్కువైంది. దాహం ఎక్కువై, గొంతెండిపోయి, నాలుక పిడచకట్టుకుపోయింది. అబ్బ! ఇక చాలసేపు దీన్ని భరించలేము. చేయి చాచి ఒక కత్తిని తీసి కట్లను తెంచుకొని బయటకు వెళ్ళి చూడవలసిందే! ఓడలో ఎక్కడో ఒకచోట తాగేనీరు ఉండకపోదా?

వంతిదేవుడు చుట్టుపక్కల చూశాడు. ఒక మూల కొన్ని కొబ్బరికాయలు కనిపించాయి. ఆహా!

వెన్న ఉండగా, నెయ్యికోసం ఏడ్వనేల? ఆ కొబ్బరికాయలతో ఆకలి, దప్పిక రెంటినీ తీర్చుకోవచ్చు కద?

వంతిదేవుడు చేతికట్లను బాగా సడలించుకొన్నాడు. చేయి చాచి ఒక కత్తిని అందుకోబోయాడు. అంతలో అడుగుల చప్పుడు, తలుపు తీస్తున్న శబ్దం వినిపించాయి. చాచిన చేతిని వెనక్కి తీసేసుకొన్నాడు.

~

మునుపొక సారి వచ్చి వెళ్ళిన మంత్రవాది రవిదాసు, అతని స్నేహితుడు లోపలికి వచ్చారు. ఇద్దరూ వంతిదేవునికి ఇరుపైపుల నిలబడ్డారు.

"ఓడ ప్రయాణం ఎలా ఉందయ్యా? సుఖంగా ఉందా?" అని అడిగాడు రవిదాసు.

"దాహం చంపేస్తోంది! కాస్త నీళ్ళు!" అన్నాడు వంతిదేవుడు.

"ఆఁ! మాకూ దాహంగానే ఉంది. కానీ ఆ పాపిష్టివాళ్ళు ఓడలో నీళ్ళు ఉంచలేదే!" అన్నాడు రవిదాసు.

"కాళికి అందరికన్న ఎక్కువగా ఉంది దాహం. రక్తదాహం!" అన్నాడు రెండోవాడు.

"నేను గుర్తులేనా, తమ్ముడూ? మరిచిపోయావా? కడంబూర్ మాళిగలో కురవై ఆట తర్వాత దేవరాళన్ వచ్చి పూనకం వచ్చినట్లు ఆడాడు కద? 'కాళికాంబకు పెయ్యేళ్ళ రాజవంశపు యువకుని రక్తం కావాలని అడుగుతోంది' అని ఆవేశం వచ్చి అరిచాడు కద?"

"ఆఁ! ఇప్పుడు గుర్తుకొస్తోంది! నీవే ఆ దేవరాళన్!" అన్నాడు వంతిదేవుడు.

"అవును, నేనే! పెయ్యేళ్ల రాజవంశపు రాకుమారుని బలి ఇద్దామని లంకకు వచ్చాను. అది సాధ్యం కాలేదు. ఆ వీరవైష్ణవుని వైకుంఠానికి పంపజూశాము. అది కూడ సాధ్యం కాలేదు. నీవైనా సులువుగా దొరికావు కద? చాల సంతోషం. ప్రస్తుతానికి ఒక చిన్న రాజవంశపు రక్తంతో కాళి తృప్తి పడవలసిందే!" అన్నాడు దేవరాళన్.

"అలాగైతే ఎందుకు ఆలస్యం చేస్తున్నారు?" అని అడిగాడు వంతిదేవుడు.

'వీర యువకుడవైన నిన్ను చూసిన చోట బలి ఇచ్చేయవచ్చా? తీరం చేరిన తర్వాత అందరు పూజారుల్నీ పిలిపించి, ఉత్సవం చేసి కద బలి ఇవ్వాలి? ముఖ్యంగా పూజారిణి రావాలి కద?"

"ఎవరా పూజారిణి?"

"ఎవరో తెలియదా? పళువూర్ యువరాణే!"

వంతిదేవుడు కాసేపాలోచించి, "మీకటువంటి ఉద్దేశమే ఉంటే, ముందు కాస్త నీళ్ళివ్వండి! లేకపోతే దాహంతో ఇక్కడే చచ్చిపోతాను!" అన్నాడు వంతిదేవుడు.

"నీరు లేదు కద, తమ్ముడూ!"

"నీవు మంత్రవాదివి కద?"

"బాగా చెప్పావు! మంత్రం వేసేవున్నాను, చూడు! ఇప్పుడు ఓడ కదలకుండ ఉంది కద? రాత్రి

లోపల సుడిగాలి వీస్తుంది! జడివాన కూడ వస్తుంది!"

"వాన వస్తే నాకేం ప్రయోజనం? మీరు పైబల్ల మీద ఉంటారు. నేనిక్కడ..."

"నీవు కూడ పైబల్లమీదికి రావచ్చు. నాలుక చాచి వాన నీటితో నీ దాహాన్ని తీర్చుకోవచ్చు. మేం చెప్పినట్లు వింటానంటే...."

"ఏమంటున్నారు మీరు?"

"ఆ అరబ్బు పిశాచాలను సముద్రరాజుకు బలివ్వాలని చెబుతున్నాము..."

"ఎందుకు?"

"వారీ ఓడను కళింగ దేశానికి తీసుకొని వెళ్ళాలంటున్నారు. మేము కోడిక్కరైలో గాని, నాగపట్టణంలో గాని దిగేయాలనుకొంటున్నాము. .."

"వారు ఆరు మంది. అదీగాక వాళ్ళు చాల మొరటువాళ్ళు కూడాను..."

"వాళ్ళలో ముగ్గురు నిద్రపోబోతున్నారు; తక్కిన ముగ్గురూ ఇంకా దీర్ఘనిద్రలో మునిగివున్నారు. మనం ముగ్గురం మొదట నిద్రపోతున్న ముగ్గురిని ముగించేస్తే, తర్వాత మనం ముగ్గురం మిగిలిన ముగ్గురిని సంభాళించుకోవచ్చు కద?"

వంతిదేవుడు మౌనందాల్చాడు.

"ఏమంటావు తమ్ముడూ? మా ఆలోచన నీకు సమ్మతమైతే నీ కట్లు విప్పేస్తాము."

~

యువరాజు ముఖం వంతిదేవుని మనోనేత్రం ముందు నిలిచింది. అవును; ఆయన దీన్ని ఏనాడూ ఆమోదించరు.

"నా వల్ల కాదు. నిద్రిస్తున్నవారిని చంపడం నీచత్వం."

"మూర్ఖుడా! చోళదేశపు కళాసీలు నిద్రపోతున్నప్పుడే కద వారిని ఈ అరబ్బులు ముట్టడించి చంపారు?"

"ఇతరులు అలాంటి నీచకార్యం చేస్తే నేను కూడ ఎందుకు చేయాలి?"

"సరే, నీ ఇష్టం!" అన్నాడు రవిదాసు. దగ్గరే పడివున్న ఆయుధాల్లోంచి ఒక పదునైన పట్టాకత్తిని తీసుకొన్నాడు. దేవరాళనేమో చివర ఇనుపగుండు కట్టివున్న ఒక రోకలివంటి ఆయుధాన్ని తీసుకొన్నాడు.

ఇద్దరూ బయటకు వెళ్ళారు. కానీ తలుపుకు గొళ్ళెం వేసి తాళం వేయలేదు.

వారు వెళ్ళిన వెంటనే వంతిదేవుడు చేయి చాచి దగ్గరలో ఉన్న ఒక కత్తిని తీసుకొని కట్లను తెంపేసుకొన్నాడు. ఒక్క దూకుతో లేచి నిలబడి మూలలో ఉన్న ఒక కొబ్బరిని పగలగొట్టి కొబ్బరినీళ్ళు తాగాడు. మిగిలిన కొబ్బరికాయలను ఒక గోనె సంచిలో వేసి మూట కట్టుకొన్నాడు.

తర్వాత, యుద్ధానికి తగిన ఒక కత్తిని చేతికి తీసుకొన్నాడు. ఏ క్షణమైనా బయటకు దూకేందుకు సిద్ధంగా నిలబడ్డాడు.

కాసేపటికల్లా, 'ధడ్', 'ధడ్' అన్న శబ్దం రెండుసార్లు వినిపించింది. రెండు దేహాలు సముద్రంలో విసిరేయబడ్డాయని గ్రహించాడు. వెంటనే భయంకరమైన ఒక కేక; చేతుల కలయిక, కత్తులు ఒకదాన్నొకటి కొట్టుకొనే శబ్దం - అన్నీ పైబల్లనుంచి వినవచ్చాయి.

వంతిదేవుడు చేత పట్టిన పట్టాకత్తితో బయటకు పరుగెత్తి వెళ్ళాడు. రవిదాసుని, దేవరాళన్ని తక్కిన నలుగురు అరబ్బులు అటకాయించి చుట్టుముడుతున్నారు. వంతిదేవుడు పెద్దగా కేక వెస్తూ పరుగెత్తాడు. అరబ్బులలో ఒకడు వెనక్కి తిరిగి అతన్ని ఎదిరించవచ్చాడు. వంతిదేవుని కత్తి ఆ అరబ్బువాని కత్తిని కొట్టగా, అది ఎగిరి వెళ్ళి సముద్రంలో పడింది. అరబ్బువాని ముఖంమీద ఒక కత్తివేటు కూడ పడింది. ముఖంపైన రక్తం కారుతుండగా భయంకరంగా అరుస్తూ వంతిదేవుని గుండెలమీద తన ముష్టితో గుద్దడానికి ముందుకొచ్చాడా అరబ్బువాడు. వంతిదేవుడు చటుక్కున కాస్త పక్కకు జరిగాడు. అరబ్బువాడు ధడేల్మని కిందపడ్డాడు. వాడు పడ్డ వేగానికి తెరచాప స్తంభం ఒకటి వదులై వాడి తలమీద పడింది.

ఇంకొక అరబ్బువానితో వంతిదేవుడు కాసేపు యుద్ధం చేసి వాడిని సముద్రంలోకి తోసేశాడు.

~

రవిదాసు, దేవరాళన్ యుద్ధనైపుణ్యం కలవారు కారు. ఒక్క అరబ్బువాడితో యుద్ధం చేయడమే వారికి చాల కష్టమైంది. పోనుపోను అలిసిపోయారు. అప్పుడు సముద్రంలో ఏదో శబ్దం వినరాగా, ఆ ఇద్దరు అరబ్బులు తమ స్నేహితుల గతి ఏమైందోనని తిరిగి చూశారు. అదే సమయమని ఎంచి రవిదాసు, దేవరాళన్ వారిని ముగించేశారు.

అంతా ముగిసి, గెలుపొందిన ముగ్గురు కూర్చొని సేద తీర్చుకొన్నారు.

"అబ్బాయీ! మంచి సమయానికి వచ్చావు! ఎలా వచ్చావు?" అని అడిగాడు రవిదాసు.

"నీవేదో మంత్రం వేసినట్లుంది. నా చేతి కట్లు వాటికవే విడిపోయాయి. తర్వాత ఈ పట్టాకత్తి ఎగిరి వచ్చి నాచేతిలో నిలిచింది!" అన్నాడు వంతిదేవుడు.

"నీ దాహం సంగతి?"

"ఒక కొబ్బరి బొండాం నా తలమీదుగా వచ్చింది. తనంతట తానే పగిలి కొబ్బరి నీళ్ళను నానోట పోసింది!"

"ఓహో! నీవు మా చెడ్డవాడివి!" అన్నాడు దేవరాళన్. ఇద్దరూ పడీపడీ నవ్వారు.

"తమ్ముడూ! నిన్ను పరీక్ష చేశాము. మేమే నీ కట్లను వదులుచేశాము. ఆయుధాలను నీ పక్కన పెట్టాము. కొబ్బరికాయలు నీకు కనిపించేలా దగ్గర పడేశాము!" అన్నాడు రవిదాసు.

ఇదంతా నిజమా, లేక అబద్ధమా అని నిర్ధారించుకోలేకపోయాడు వంతిదేవుడు. కాసేపు మౌనంగా కూర్చొన్నాడు.

“తమ్ముడూ! బాగా ఆలోచించి చెప్పు! నీవు బతకాలా? ప్రాణాలతో తీరం చేరి, నీ బంధువులను, తోబుట్టువులను చూడాలా? సుఖభోగాలు, పదవి, పట్టం పొంది జీవితాన్ననుభవించాలన్న ఆశ ఉందా? ఇష్టమైతే చెప్పు; మా పక్షం చేరిపో! ఈ సౌభాగ్యాలన్నీ పొందగలవు!” అన్నాడు రవిదాసు.

“నిద్రపోతున్న మనుషులను చంపారు కద?” అని అడిగాడు వంతిదేవుడు.

“ఇద్దరిని మాత్రమే అలా చంపగలిగాము. అంతలో తక్కిన వారు లేచేశారు. నీవు ముందుగానే మాతో చేరివుంటే ఇంకా సులువయ్యేది.”

“నిద్రపోతున్నవారిని చంపడం ఎలాంటి ధర్మం? అలా చేయడానికి మీకెలా మనసొప్పింది?”

“ఈ చిన్న ఉసిరికాయకు భయపడితే, పెద్ద పెద్ద గుమ్మడికాయలను ఎలా మింగగలవు? నీవు మాతో చేరేటట్లయితే....”

“మీతో, మీతో అంటున్నారే? మీరెవరు?”

రవిదాసు దేవరాళన్ని చూసి, “ఇక వీడి దగ్గర రహస్యాలేవీ దాచనక్కర లేదు. వీడు మన పక్షం చేరాలి, లేదా సముద్రానికి బలి కావాలి. కాబట్టి అంతా చెప్పవచ్చు కద?” అన్నాడు.

“అన్నీ బాగ విడమరిచి చెప్పు!” అన్నాడు దేవరాళన్.

“విను, తమ్ముడూ! మేము వీరపాండ్యుని ’ఆపత్కాల సహాయకులం’. ఆయనను కాపాడుతామని శపథం చేసినవారం...”

“మీ వల్ల అది సాధ్యం కాలేదు కద? ఆదిత్య కరికాలన్ గెలుపొందారు...”

“ఎలా గెలిచారు? ఒక ఆడపిల్ల మూఢత్వం వల్ల గెలిచారు. ఆమె తన మోహపు వలపైన ఎక్కువ నమ్మకం కలిగివుంది. ఆ చోళవంశపు నాగుపామును తాను చెప్పినట్లు ఆడేటట్లు చేయగలనని నమ్మింది. పామేమో పడగెత్తి ఆడింది. కానీ తన విషపు కోరలను చూపించేసింది. మా రాజు తల మట్టిలో దొర్లింది. తంజావూరు వరకు తీసుకొని వెళ్ళారు. తలను పల్లకిలో పెట్టి ఊరేగించారు! ఆహా! తంజావూర్! తంజావూర్! ఆ నగరం గతి ఏం కాబోతోందో చూడు, తమ్ముడూ!”

ఇలా అంటున్నప్పుడు రవిదాసుని వెడల్పాటి, ఎర్రబారిన కళ్ళు ఇంకా వెడల్పై నిప్పులుగక్కాయి. అతని ఒళ్ళు వణికింది. పళ్ళు పటపటలాడాయి. దేవరాళన్ రూపం కూడ అదే విధంగా భయంకరంగా మారింది.

“జరిగిందేదో జరిగిపోయింది. ఇక మీదట ఏం చేయబోతున్నారు? చనిపోయిన వీరపాండ్యుని బతికించగలరా?”

“వీరపాండ్యుని బతికించలేము. అంతటి శక్తి నా మంత్రానికి కూడ లేదు. కానీ ఆయన్ను

చంపిన వాడిని, వాడికి చెందిన వారందరినీ సమూలంగా నాశనం చేసి ప్రతీకారం తీర్చుకొంటాము. చోళవంశపు నాగుపాములను పిల్లలతో సహా తుడిచిపెట్టేస్తాము. మాతో చేరుతావా? చెప్పు!"

"చోళవంశాన్ని నాశనం చేసిన తర్వాత? తర్వాతేం చేస్తారు?"

"మా మహారాణి ఎవరికి పట్టం కట్టాలంటే వారికి పట్టం కడతాం..."

"మీ మహారాణి ఎవరు?"

"తెలియదా, తమ్ముడూ? ఇప్పుడు పళువూర్ యువరాణిగా నటిస్తున్న ఆమే!"

"అలాగైతే మధురాంతకులకు..."

"వాడు కూడ ఒక పాము పిల్లే కద?"

"పళువేట్టరయ్యర్..."

"ఆ ముసలాడిని మా మహారాజుగా చేస్తామనా అనుకొంటున్నావు? వాడి పలుకుబడిని, డబ్బును ఉపయోగించుకోవడం కోసం ...."

"మీ మహారాణి ఆయన ఇంట్లో ఉంది కాబోలు..."

"అంతా తెలుసుకొన్నావే? మంచి బుద్ధిశాలివి నీవు!"

"వీర పాండ్యుని మరణానికి ఒక ఆడపిల్ల కారణమన్నారు కద?"

"అది కూడ పళువూర్ రాణే! యుద్ధంలో గాయపడ్డ వీరపాండ్యుని తాను కాపాడుతానని మాటిచ్చింది. ఆ మాటను నిలబెట్టుకోక తానే ద్రోహం చేసిందని చెప్పి ఆమెను ప్రాణాలతో కాల్చేయబోయాము. పగ తీర్చుకోవడంలో మాతో చేరుతానని మాటిచ్చినందు వల్ల ప్రాణాలతో విడిచిపెట్టాము. ఈనాటి వరకు ఆమె తన మాటను నిలబెట్టుకొంటూ వస్తూంది. ఓ! ఆమె సహాయం లేకపోతే మేమింతటి పనులు చేయగలిగేవారం కాము."

"ఇంకా మీరేమీ సాధించలేదు కద?"

"కాస్త ఓపిక పట్టు! చూస్తూండు ఏం చేస్తామో!" అన్నాడు రవిదాసు.

"మన దగ్గరినుంచి వీడు అన్ని రహస్యాలు తెలుసుకొన్నాడు. మనం అడిగినదానికేమీ జవాబివ్వలేదు కద?" అన్నాడు దేవరాళన్.

"తమ్ముడూ! ఏమంటావు? మాతో చేరుతావా? ఎవరు చూడవచ్చారు? ఒకవేళ నీకే ఆ అదృష్టం పట్టవచ్చు. నీవే ఒకవేళ దక్షిణ తమిళదేశపు సింహాసనం ఎక్కినా ఎక్కవచ్చు. ఏమంటావు?"

~

కొంతకాలానికి మునుపైతే వంతిదేవుడు, "ఓ! మీతో చేరిపోతానోచ్!" అనేవాడేమో. కానీ యువరాజుతో మూడు రోజులు స్నేహం చేసిన తర్వాత అతని ఆలోచనా సరళిలో ఒక పెద్ద మార్పు వచ్చింది. లేనిపోనివి చెప్పడం, సమయోచిత కల్పనలు - వీటిలో ఆసక్తి పోయింది. కాబట్టి మాట

మార్చదలచి, “ఈ ఓడను ఎలా పట్టుకొన్నారు? కాసేపటికి మునుపు యమలోకానికి పంపించిన ఆ అరబ్బుదేశస్తులతో ఎలా స్నేహితులయ్యారు?” అని అడిగాడు.

"అంతా నా మంత్రశక్తి, తమ్ముడూ! త్రికోణమలైలో వీరి దగ్గరినుంచే మేము గుర్రాలను కొన్నాము. ఆ గుర్రాల సహాయంతోనే మేము మిమ్మల్ని కాస్త ముందు వెనుకగా వెంబడిస్తూ వచ్చాము. 'ఏనుగుల దిగుడు' కాలువలో యువరాజు దిగి పరుగెత్తడాన్ని చూశాము. ఆయనకు ముందే ఇక్కడకు వచ్చి చేరాలని తీర్మానించి అడ్డదారిలో ఇక్కడికి వచ్చేశాము. ఇక్కడికి వచ్చి చూస్తే మా పాత స్నేహితులు ఓడనే కైవసం చేసుకొనివున్నారు. వారెక్కి వచ్చిన ఓడ ముల్లై దీవి దగ్గర ఒడ్డుకు కొట్టుకొని విరిగిపోయిందట. ఇక్కడ దాక్కొని ఈ ఓడను వశపరుచుకొన్నారు. 'సముద్ర తీరం వెంబడి దోవ చూపేందుకు వస్తారా?' అని మమ్మల్ని అడిగారు. పండు జారి పాలలో పడ్డట్లైంది.”

“అదెలా?”

“ఆ చోళ వంశపు యువసర్పం చోళ సేనాధిపతితో మాట్లాడుతుండగా విన్నాము. ఎలాగూ చోళనాడుకు తిరిగి వచ్చి చేరుతాడని గ్రహించాము. అది మాత్రం కాదు, తమ్ముడూ! లంకలో ఒక మూగ ఆడభూతం ఉంది. ఆ ఆడ భూతం మా మంత్రానికి ప్రతి మంత్రం వేసి అరుళ్మొళి వర్మను కాపాడుతూ వస్తూంది. కానీ అది చోళనాడుకు రాదు...”

వంతిదేవుడు ఆ రాత్రి అనురాధపురంలో జరిగినదంతా గుర్తుచేసుకొన్నాడు.

రవిదాసు ఉన్నట్లుండి నవ్వాడు.

“ఇదేం నవ్వు? దేన్ని చూసి నవ్వుతున్నావు?” అని అడిగాడు వంతిదేవుడు.

“ఏం లేదు, తమ్ముడూ! ఈ అరబ్బు వారి స్వభావాన్ని తెలుచుకొన్నాను. నవ్వొచ్చింది. వీరింత మొరటు మనుషులు కద? వీరికి మనుషులను చంపడమంటే అరటి కాయలు కోయడం లాంటిది. కానీ వీరికి గుర్రాలంటే ఎనలేని ప్రీతి, అభిమానం. వారి దేశంలో గుర్రాల కాలి డెక్కలకు ఇనుప <<   >> కొట్టే నడుపుతారట. మనం గుర్రాలను ఒట్టి కాళ్ళతోనే నడుపుతామట. కాబట్టి మనం కరుణలేని, అనాగరిక మృగాల కన్న నీచులైన మనుషులట! మనకు గుర్రాలనుఅమ్మడమే పాపమట...! ఈ రోజు పొద్దున ఏం జరిగిందో తెలుసా?”

“చెప్పండి!”

“అందరూ ఓడెక్కాము. తెరచాపను విప్పాము. ఓడ బయలుదేరింది. అప్పుడు ఒడ్డున ఒక గుర్రపు డెక్కల చప్పుడు వినిపించింది. అంతే! ముల్లై దీవిలో విరిగిపోయిన వారి ఓడనుంచి తప్పించుకొన్న ఒక గుర్రం అదే కావచ్చని సందేహించారు. వారిలో ఒకడు ఒడ్డుకు దిగి చూసే తీరుతానని హఠం పట్టాడు. మమ్మల్ని వాడితో బాటు ఒక పడవలో పంపారు...”

“తర్వాత?”

"గుర్రం దొరకలేదు, తమ్ముడూ! నీవు దొరికావు! ఎంత మంచిదైంది, చూడు! ఈ అశ్వప్రియుల్ని ముగించడం ఎంత సులువైంది!"

"అదంతా సరే. ఈ అబ్బాయి ఇంకా మన ప్రశ్నకు ఉత్తరం ఇవ్వలేదు" అని గుర్తు చేశాడు దేవరాళన్.

"ఇస్తున్నానయ్యా, ఇస్తున్నాను. నేను చోళవంశానికి ఊడిగం చేయ నిశ్చయించుకొన్నవాడిని. ఏనాడూ మీతో చేరను..."

"వేళక్కార దండులో చేరావా? సత్య ప్రమాణం చేశావా?"

"అదంతా ఏం లేదు..."

"మరెందుకు జంకు? నీవు యుద్ధవీరుడివి. ఏ పక్షంలో ఎక్కువ అనుకూలంగా ఉందో అందులో చేరిపోవలసిందే కద?"

చోళ కులంతో సంబంధం ఏర్పరచుకోవడానికి అన్ని శపథాలకన్న బలమైన కారణముందని వారికి చెప్పదలుచుకోలేదు వంతిదేవుడు. యువరాకుమారి కడగంటి చూపు కన్న, ఆమె మల్లెల చిరునవ్వు కన్న, చోళవంశం కోసం ప్రాణత్యాగం చేయడానికి ఇంకేదైనా బలమైన కారణం కావాలా? అదీగాక, యువరాజుగారి సాటిలేని స్నేహం ఉంది! ఆయనతో స్నేహం మరిచిపోలేనిది కద?

"ఏదెలా ఉన్నా, మీలాంటి హంతకులతో చేరను!" అన్నాడు వంతిదేవుడు.

"అలాగైతే నీ ప్రాణాన్ని సముద్రరాజుకు బలివ్వడానికి సిద్ధం కా!" అన్నాడు రవిదాసు.

~~~
~~~

# అధ్యాయము - 51

## సుడిగాలి

**గాలి** కించిత్తు కదలడం లేదు; కడలి నిశ్చలంగా ఉంది. ఓడ కూడ ముందుకు జరగడం లేదు.

అలల్లేని చెరువులాగ ప్రశాంతంగా ఉన్న కడలిని చూస్తూ కాసేపు నిశ్శబ్దంగా కూర్చొన్నాడు వంతిదేవుడు. కానీ అతని మనసులో మాత్రం ఉత్తుంగ తరంగాలు లేస్తున్నాయి.

ఉన్నట్లుండి రెండు చేతులనూ సముద్రం వైపు చాచి, "ఓం హ్రీం హాం ఫట్!" అన్నాడు.

మరుక్షణమే చేత కత్తి తీసుకొన్నాడు. చక్రాకారంలో రెండు సార్లు తిప్పాడు.

"అవును! అవును! సముద్రరాజు బలి కోరుతున్నాడు. నిద్రపోయేవారిని ముట్టడించి చంపే ఇద్దరు శూరులను బలికోరుతున్నాడు! బలి ఇస్తేనే ఈ ఓడను ముందుకు పోనిస్తానంటున్నాడు. ఎక్కడ? ఇద్దరూ వెంటనే ఇక్కడకు వచ్చి మెడలు చాచండి! శీఘ్రం! శీఘ్రం!" అని ఆర్భాటంగా అరిచాడు వంతిదేవుడు.

రవిదాసు వంతిదేవుని పరీక్షగా గుచ్చి చూశాడు. "హహ్హహ్హ!" అని మళ్ళీ ఆ పిశాచి నవ్వు నవ్వాడు.

"తమ్ముడూ! ఇదేం తమాషా?" అన్నాడు.

"అన్నగార్లూ! ఇది వినోదం, పరాచికం కాదు! నిజమైన, గంభీరమైన విషయం! కాసేపటికి మునుపు నేను కింది గదిలో కట్టబడివున్నప్పుడు కాస్త నిద్రలోకి జారిపోయాను. అప్పుడొక కలగన్నాను. ఆకాశాన్ని, కడలిని ఒకటి చేస్తున్నంత పెద్ద భూతాకారం ఒకటి ఆ కలలో వచ్చి ఏదో చెప్పింది. అదేమని అప్పుడర్థం కాలేదు. ఇప్పుడు అర్థమైంది! మంత్రతంత్రాలలో ఆరితేరిన ఇద్దరు కాళికాభక్తులను సముద్రరాజు బలి కోరుతున్నాడు. బలి ఇవ్వకపోతే ఓడను ముందుకు పోనివ్వనని కూడ చెబుతున్నాడు. ఆరుగురు అరబ్బు మొరటువారి బలి వల్ల అతడు తృప్తి చెందలేదు. రండి! వెంటనే!" అని చెబుతూ వంతిదేవుడు చేతబట్టిన కత్తిని పైకెత్తాడు.

రవిదాసు, దేవరాళన్ ఒకరి ముఖాన్నొకరు చూసుకొన్నారు.

"తమ్ముడూ! కట్టు కథలు కట్టడంలో నీవు భలే తెలివైన వాడివి!" అన్నాడు.

వంతిదేవుడు, "ఓ! నా మాటలో మీకు నమ్మకం లేదా? కట్టు కథలు కడుతున్నానా? సముద్రరాజా! ఈ మూర్ఖులకు నీవు జవాబివ్వు!" అన్నాడు.

అతడలా అన్నది సముద్రరాజు చెవిన పడ్డట్లుంది. అందుకు బదులివ్వడానికీ సముద్రరాజు ఇష్టపడ్డాడు కాబోలు.

~

కడలిలో అప్పుడొక విచిత్రమైన దృశ్యం కనిపించింది. కనుచూపు మేరకు నలువైపులా సముద్రం జలదరించినట్లైంది. వేలకొద్ది చిన్న చిన్న అలలు లేచాయి. అది ఒక్క నిమిషం మాత్రమే. మరునిమిషం అవి విరిగిపడి తెల్లని నురగ రేణువులై సముద్రమంతటా విస్తరించాయి! విశాలమైన పసుపు పచ్చని గడ్డిమైదానంలో వేలకొద్ది తుమ్మి పూలు దొర్లుతూ వెళుతుంటే ఎలా ఉంటుంది? అలా ఉంది సముద్రమప్పుడు చూసేందుకు!

ఆహా! మెత్తని, మెల్లని పిల్లగాలి - ఆ ఓడను కూడ ఒకసారి సుతిమెత్తగా తాకి ముందుకు వెళ్ళింది. ఓడ మెత్తగా ఊగింది. వేడివల్ల మాడిపోయిన వంతిదేవుని శరీరం కూడ జలదరించింది.

రవిదాసు, దేవరాళన్, "హహ్హాహ్హా!" అని నవ్వారు.

"తమ్ముడూ! సముద్రరాజే నీ ప్రశ్నకు ఉత్తరమిచ్చేశాడు! మమ్మ;ల్ని మేము బలివ్వడానికి ఆయత్తం కావలసిందే!" అన్నాడు రవిదాసు.

వంతిదేవుని మనసు కలతబారింది. కడలిలో ఏర్పడ్డ జలదరింపు, వెంటనే వచ్చిన మార్పు అతన్ని దిగ్భ్రమింపజేశాయి.

ఆహా! ఇదేమి విచిత్రం! ఆ కోటానుకోట్ల నురగ రేణువులెక్కడ? ఉన్నట్లుండి ఎలా మాయమయ్యాయి? కాసేపటికి మునుపు చూసిన దృశ్యం నిజమా? లేక ఒట్టి భ్రమేనా? ఒకవేళ ఈ మంత్రవాది రవిదాసుని మంత్రశక్తి ప్రభావమా?

"అదిగో చూశావా, తమ్ముడూ! సముద్రరాజు మాట ఆకాశం కూడ ఆమోదించేసింది!" అని రవిదాసు దక్షిణ – పశ్చిమ (నైఋతి) దిశగా వేలెత్తి చూపించాడు.

అతను చూపిన దిశలో - పచ్చని కడలి, నీలి ఆకాశం కలిసే చోట – ఒక చిన్న నల్లటి మబ్బు తునక పైకి లేచింది. ఆ నల్లటి మబ్బు తునక పైఅంచు రక్త వర్ణంతో ఆకాశంతో పోటీ పడుతూంది.

సాధారణమైన రోజుల్లో వంతిదేవుడు ఈ దృశ్యాన్ని గమనించేవాడేకాదు. సముద్రం, ఆకాశం కలిసే చోట మేఘాల గుంపు కనిపించడం ఒక వింతా ఏమి? కాదు, నిజమే! కానీ ఆ చిన్న దృశ్యమే ఆ వేళ మన కథానాయకుని మనసును కల్లోలపరిచింది.

మరుక్షణమే వంతిదేవుడు తన మనసును స్థిమితపరుచుకొన్నాడు. 'ఈ మాంత్రికుని వలలో పడకూడదు' అని దృఢనిశ్చయం తీసుకొన్నాడు.

రవిదాసుని ఒకసారి, దేవరాళన్ని ఒకసారి తేరిపారజూసి, "అలాగైతే మరెందుకాలస్యం? ముందుకు రండి!" అంటూ కత్తిని పైకెత్తాడు.

"అబ్బాయీ! మేము బలికావడానికి ముందు మా కులదైవాన్ని పూజింపగోరుతున్నాము.

అర్ధగడియ సమయమివ్వు!" అన్నాడు రవిదాసు.

"సరే! ప్రార్థన చేసిన తర్వాత వెంటనే రండి. మీ మంత్ర తంత్రాలేవీ నా దగ్గర చూపకండి. చూపించినా ఫలితముండదు.!" అన్నాడు వంతిదేవుడు.

"ఇదిగో వచ్చేస్తాము. మా ఆయుధాలను కూడ ఇక్కడే విడిచి పెట్టి వెళుతున్నాము, చూడు!" అన్నాడు రవిదాసు.

అలాగే ఇద్దరూ తమ ఆయుధాలను కింద పడేసి ఓడ వెనక భాగానికి వెళ్ళారు.

ఆ అర్ధగడియ సమయం వంతిదేవునికి కావలసివచ్చింది. సముద్రంలో, ఆకాశంలో వచ్చిన హఠాత్పరిణామాల వల్ల ఒక అనిర్వచనీయమైన కలత అతని మనసును, శరీరాన్ని సడలించింది. అవసరమైతే ఒకే ఒక్క వేటుతో ఆ ఇద్దరు కిరాతకులను ముగించేసేందుకు సిద్ధంగా ఉన్నాడు. కానీ అందుకు కావలసిన బలం తన చేతిలో ఉందా అన్న సందేహం ఏర్పడింది. కాబట్టి మనసును దిటవు పరచుకొని, చేతిలో కూడ పూర్తి బలాన్ని రప్పించుకోవడానికి  అతడికి ఆ అర్ధగడియ సమయం కావలసి వచ్చింది.

~

నైఋతి దిశగా అతని చూపు యధాలాపంగా మళ్ళీ మళ్ళింది. కాసేపటికి మునుపు జానెడెత్తు ఉన్న ఆ మబ్బు తునక ఇప్పుడు పెరిగి ఆ మూలను పూర్తిగా ఆక్రమించుకొంది. శిఖరభాగానున్న రక్తవర్ణపు ఛాయ మసకబారింది.

మేఘాలు మరింత పెద్దవై దగ్గరకు వస్తున్నట్లనిపించింది.

మొదట చలి చలిగా వీచి నిలిచిపోయిన గాలి మళ్ళీ నిదానంగా వీచనారంభించింది. కడలిలో కూడ కదలికలు మొదలైనాయి. చిన్న చిన్న అలలు నాట్యమాడనారంభించాయి.

మేఘాల గుంపు ఇంకా పెద్దది కాసాగింది.

గాలి వేగం కూడ హెచ్చుకాసాగింది. ఓడ మెల్లగా ఊగనారంభించింది.

గాలి ఓంకార నాదానికి, అలల గలగలలకు మధ్య అదేం శబ్దం? సముద్రంలో ఏదో పడ్డట్లు వినిపించింది కద?

వంతిదేవుడు వెనక్కి తిరిగి చూశాడు. రవిదాసు, దేవరాళన్ కనిపించలేదు. అందులో ఆశ్చర్యమేమీ లేదు - వారు ఓడ వెనక భాగంలో ఉంటారు. తెరచాపలు, వాటి స్తంభాలు వారిని మరుగుపరుస్తున్నాయి.

ఆః! ఇదేమి? తెడ్లతో పడవను నడిపే శబ్దం వినిపిస్తోందేమి?

వంతిదేవుడు వెంటనే పరుగెత్తి ఓడ అవతలి భాగానికి వెళ్ళాడు. అతడక్కడ చూసిన దృశ్యం అతన్ని నిజంగానే అదిరిపడేటట్లు చేసింది. అలా జరగవచ్చని అతడు కలలో కూడ అనుకోలేదు. తనకు

నచ్చజెప్పేందుకే వారిద్దరూ కలిసి సమాలోచన చేసేందుకు అవతలికి వెళ్ళారనుకొన్నాడు. కానీ వారు ఓడకు అవతలి పక్క కట్టివున్న పడవ కట్లు తెంపేసి దానిలోకెక్కి పారిపోతున్నారు!

~

రవిదాసు వంతిదేవుని చూసి నవ్వాడు. “తమ్ముడూ! మాకు సముద్రరాజుకు బలికావడం ఇష్టం లేదు. తెలుస్తోందా?” అన్నాడు.

వంతిదేవుడు ఒక్క క్షణంలో తన పరిస్థితిని గ్రహించాడు! ఆ పెద్ద ఓడలో తనను ఒంటరిగా వదిలేసి వారు వెళ్ళిపోతున్నారు! ఓడను నడిపే విద్య అతనికేమాత్రమూ తెలియదు. ఓడ ఇప్పుడు సముద్రంలో ఎక్కడ ఉంది, ఏ దిశలో పోతే ఎక్కడ పోయి చేరుతామన్నది అతనికి ఏ మాత్రం తెలియదు. అటువంటి అయోమయ పరిస్థితిలో అతన్ని వదిలేసి వెళ్ళిపోతున్నారు వారు.

“పాపిష్టులారా! నన్ను కూడ మీతో తీసుకొని వెళ్ళకూడదా?” అని అరిచాడు.

“తమ్ముడూ! సముద్రరాజుకు ఒక్క బలి కూడ లేకుండ పోతుంది కద?” అన్నాడు రవిదాసు.

పడవ, ఓడను వదిలి దూరంగా పోనారంభించింది.

సముద్రంలోకి దూకి వెళ్ళి పడవను పట్టుకొందామా అని ఒక్క క్షణం అనుకొన్నాడు వంతిదేవుడు. కానీ ఆ ఆలోచనను వెంటనే వదిలిపెట్టాడు. తనకేమో సరిగ్గా ఈదడమే రాదు. ఓడనుంచి సముద్రంలోకి దూకేందుకే ఇంకా మనసును గట్టిపరుచుకోలేదు. అలా దూకి, కిందా మీదా పడి పడవను చేరుకొన్నా కూడ, ఆ కిరాతకులేం చేస్తారో ఏమో? తన దగ్గర వారి రహస్యాన్ని బట్ట బయలు చేసేశారు కద! తాను ఏనాడూ వారి పక్షం చేరడని కూడ తెలుసుకొన్నారు. పడవను చేరుకోగానే తనను తెడ్లతో కొట్టి చంపజూడవచ్చు. తాను నీటిలో అవస్థపడుతూనే, పడవలో ఉన్నవారితో పోరాడలేడు కద?

పోనీ! తొలగి పోనీ! ఆ ఛండాల హంతకులతో ఆ పడవలో వెళ్ళడం కన్న ఈ పెద్ద ఓడలో ఒంటరిగా ఉండడమే మేలు! ఇంతకు మునుపు ఎన్నో క్లిష్ట పరిస్థితుల నుంచి దేవుని దయవల్ల తాను బతికి బయట పడలేదా? ఈ అపాయం నుంచి కూడ బయటపడేందుకు దేవుడొక దారి చూపకపోడు! ఆ పాపిష్టివాళ్ళు పోనీ...!

కానీ వారిని ప్రాణాలతో పోనిచ్చింది సబబేనా? వారు ఎక్కడ తీరం చేరుతారో/ఒడ్డెక్కుతారో! ఇంకా ఎన్నెన్ని కుట్రలు పన్నుతారో! ఇంకా ఎన్నెన్ని ఘోర కృత్యాలు చేస్తారో! - దేవుడున్నాడు; మనమేం చేయగలం? ఎలాగైనా మళ్ళీ యువరాజును కలుసుకొంటే చాలు! అయినా కూడ వారిలా తనను వదిలిపెట్టి వెళ్ళివుండకూడదు! పూంగుళలితోబాటు తనను కూడ ఏనుగుపైన ఎక్కించుకొని వెళ్ళివుండాల్సింది. మళ్ళీ ఆయనను కలవడమంటూ జరిగితే, ఆయనతో దెబ్బలాడాలి. “మీ పురాతన చోళవంశపు స్నేహధర్మమిదేనా?” అని నిలదీసి అడగాలి. కానీ అలా అడిగే సందర్భం మళ్ళీ వస్తుందా? యువరాజును మళ్ళీ చూడబోతామా....? ఎందుకు చూడలేము? తానీ సంకట స్థితిలో చిక్కుకోవడాన్ని సేనాధిపతి,

ఆళ్వార్ కట్టియాన్ చూడనే చూశారు. వారు ఏదైనా చేయకుండా ఉంటారా? యువరాజును కలిసినప్పుడు తప్పక చెప్పే తీరుతారు కద?

~

వంతిదేవుడు ఇలా ఆలోచిస్తూ నిలబడ్డప్పుడు పడవ సముద్రంలో చాల దూరం వెళ్ళిపోయిందని గమనించాడు. పడవ అంత వేగంగా ఎలా వెళ్ళగలిగింది? పడవ మాత్రమే వేగంగా వెళ్ళడం లేదు; తానున్న ఓడ కూడ మెల్లగా కదులుతూంది. అందుకే పడవకు, ఓడకు మధ్య అంత దూరమేర్పడింది! సముద్రంలో అలలు పెద్దవవుతుండడాన్ని కూడ వంతిదేవుడు గమనించాడు. అది మాత్రమేనా? ఇదేమి? పట్ట పగలే ఇలా చీకట్లు కమ్ముకొస్తున్నాయి?

నైఋతి దిశగా చూశాడు వంతిదేవుడు. కాసేపటికి మునుపు పెరుగుతూ వచ్చిన మేఘాలిప్పుడు బ్రహ్మాండంగా పెరిగి, ఆకాశాన్ని చాలవరకు కమ్ముకొన్నాయి. ఆ మేఘాలు గుంపులు గుంపులుగా ఆకాశంపైకి రాసాగాయి. అతడు చూస్తుండగానే పడమర అర్ధ దూరం దిగిన సూర్యుని అవి కప్పేశాయి. ఆకాశంలోని నల్లని మబ్బులు సముద్రంలో కూడ ప్రతిబింబించి, సముద్రంకూడ నల్లగా కనిపించసాగింది. సముద్రం ఎక్కడ ముగుస్తోంది, ఆకాశం ఎక్కడ మొదలౌతోంది అన్నదే తెలియనంత నల్లగా ఆకాశం, సముద్రం మారిపోయాయి.

మేఘాల గుంపులు ఇంకా పైకి వచ్చి, వంతిదేవుని తలపైకి వచ్చాయి. ఇంకా విస్తరించి అధోముఖంగా దిగసాగాయి.

పడవ వెళ్ళిన వైపు చూశాడు వంతిదేవుడు. పడవ ఉన్నచోటే కనిపించలేదు. అతని కనుచూపు మేర దాటి వెళ్ళిపోయింది కాబోలు!

ఇంతవరకు మెల్లగా శబ్దం చేస్తున్న గాలి ఇప్పుడు ఈదురుగాలిగా మారి హోరుమని శబ్దం చేయసాగింది.

దానికి తోడు, నిమిష నిమిషానికి పెద్దవవుతున్న అలల హోరు కూడ జతగూడింది.

ఓడలో విరుచుకొన్న తెరచాపలు పటపటమని కొట్టుకోసాగాయి.

తెరచాపలు, వాటి స్తంభాలు ఒకదానికొకటి ఒరుసుకొని వేలకొద్ది తలుపులను తెరిచి మూస్తున్నట్లు శబ్దాన్ని పుట్టించాయి.

తెరచాప కంబాలను వంతిదేవుడు తలెత్తి చూశాడు. వాటి స్థితిని బట్టి ఓడ ఏ ఒక్క దిశలోను పయనించక, ఉన్నచోటే గిరికీలు కొడుతోందని గ్రహించాడు.

'సుడిగాలి' అని అంటారు కద? ఆ సుడిగాలి ఇప్పుడు వీయబోతోంది కాబోలు!

సుడిగాలి వీస్తున్నప్పుడు తెరచాపలను తీసి చుట్టిపెట్టాలని వంతిదేవుని ఎరుకకు తట్టింది. కానీ ఆ పని తానొక్కడే ఎలా చేయగలడు? పది మంది కలిసి చేయవలసిన పని కద? పది మంది లేకపోయినా,

కనీసం నలుగురైనా కావాలి. తానొక్కడే ఒంటరిగా ఏం చేయగలడు? దేవుడే దారి చూపుతాడు; ఓడ తాను పోయే దిక్కున తాను పోతుందని ఊరుకోవలసిందే!

ఓడకు పట్టబోయే గతి ఏమని అతనికి త్వరలోనే తెలిసిపోయింది.

కాసేపటూ ఇటూ ఊగి, సముద్రంలో మునిగిపోవలసిందే! మునిగిపోయే ముందు ముక్కలు చెక్కలై విరిగిపోవచ్చు కూడాను! ఓడ గతి ఏమైనా, తన గతి గురించి సందేహమే లేదు!

నడి సముద్రంలో మరణం!

ఆ కుంభకోణం (కుడంద్రై) జ్యోతిష్కుడు దీని గురించి ఒక్క మాట కూడ చెప్పలేదు, చూడు! వాడిని మళ్ళీ చూస్తే.... నా పిచ్చిగాని, మళ్ళీ చూసేదెలా?

~

ఉన్నట్లుండి వంతిదేవుని భుజంపైన గట్టి వస్తువేదో పడింది. ఓడ అంతటా చిన్న చిన్న గుండ్రాళ్ళు పడసాగాయి. సముద్రంలో కూడ ధారాళంగా పడసాగాయి. ఆ గుండ్రాళ్ళు పాలరాళ్ళలాగ ఎలా మెరుస్తున్నాయి? ఆకాశం నుంచి ఎలా పడుతున్నాయి?

ఇంకా రెండు మూడు రాళ్ళు అతని తలమీద, భుజంమీద, వీపుమీద పడ్డాయి. అవి తన ఒంటి మీద పడ్డ చోట మొదట నొప్పి, తర్వాత చలువ. ఓడలో పడ్డ రాళ్లను చూస్తే, ఆః! అవి కరిగి మాయమైపోతున్నాయే! - అవును, ఇది వడగండ్ల వాన! అప్పటివరకు వంతిదేవుడు అంత పెద్ద వానను చూసి ఎరుగడు; చనిపోయే ముందు ఇంతటి అద్భుతాన్ని చూడగలుగుతున్నాం కద అని అతని మనసు కుతూహలపడింది.

ఓడ బల్లపైన కూర్చొని కరుగుతున్న వడగండ్లను తాకి సంబరపడ్డాడు. అబ్బ! ఎంత చలువ! తాకినప్పుడు నిప్పును తాకేటట్లు కద ఉంది? కానీ నిప్పు చర్మాన్ని కాల్చేటట్లు కాల్చడం లేదు. అతివేగంగా ఆ నిప్పు చల్లగా మారిపోతోంది.

వడగండ్ల వాన ఎంత హఠాత్తుగా వచ్చిందో అంతే హఠాత్తుగా ఆగిపోయింది. ఆ వాన ఒక అర్ధగడియ కూడ పడలేదు!

~

తర్వాత మామూలు వాన పడసాగింది. వాన నీళ్ళు ఓడలో పడి ముందుకు పారి సముద్రంలో పడడాన్ని గమనించాడు వంతిదేవుడు. చోళదేశపు ఓడ వడ్రంగుల పనితనాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. ఎంత పెద్ద వాన పడ్డా, ఎంత పెద్ద అలలు గుద్దినా, సముద్రపు నీరు, వాన నీళ్ళు ఓడలో ఏమాత్రం నిలవ ఉండక, మళ్ళీ సముద్రంలోకి వెళ్ళి పడేటట్లు ఆ ఓడను నిర్మించారు. ఓడ అడుగు భాగం విరిగి సముద్రపు నీరు తోసుకొని రాకుండ కట్టుదిట్టంగా నిర్మించారు కూడాను.

ఇది చూడగానే అతనికి కాస్త ధైర్యం వచ్చింది. వెంటనే ఒక విషయం గుర్తొచ్చింది. తనను

కట్టిపడేసిన గది తలుపు తెరిచివుంటే దాని గుండా నీరు లోపలికి రావచ్చు కద? వెంటనే పరుగెత్తి వెళ్ళి చూశాడు. అతననుకొన్నట్లే ఆ గది తలుపు తెరుచుకొని గాలికి కొట్టుకోసాగింది. తలుపును గట్టిగా లాగి గొళ్ళెం వేశాడు.

పైన గాలి, వానలకు  తట్టుకోలేకపోతే కిందికి వచ్చి ఈ గదిలో తలదాచుకోవచ్చు. తర్వాత దేవుడు దారి చూపుతాడని నెమ్మదిగా ఉండవచ్చు. ఇంత సురక్షితమైన ఓడను వదిలేసి పడవలో పారిపోయిన ఆ మూర్ఖులిద్దరినీ తలుచుకొని జాలిపడ్డాడు. కానీ ఆ పడవ నిర్మాణం కూడ అద్భుతమైనదే. ఎంతటి గాలి, వాన వచ్చినా కూడ అది మునిగిపోదు. అలా ఆ పడవ విరిగిపోయినా, దాని పక్కలకు కట్టిన కొయ్య దిమ్మెలున్నాయి. వాటిని పట్టుకొని ఆ నర హంతకులు ఒడ్డుకు చేరుకోవచ్చు! బహుశా కోడిక్కరై దగ్గర ఒడ్డెక్కుతారు....!

కోడిక్కరై నుంచి వంతిదేవుని మనసు పళైయారైకి ఎగిరింది. చక్రవర్తి ముద్దుల కుమార్తెకు తనకు పట్టిన గతి ఎలా తెలియబోతోంది? ఆమె ఆజ్ఞాపించిన పనిని నెరవేర్చే ప్రయత్నంలో తాను నడిసముద్రంలో మునిగిపోయాడని ఆమెకు ఎవరు తెలియజేస్తారు? సముద్రం తెలియజేస్తుందా? గాలి వెళ్ళి తెలియజేస్తుందా? - దేవుడా! ఆ వనితామణిని కలవక ముందే తానెందుకు చనిపోలేదు? యుద్ధరంగంలో వీరమరణం పొందివుండకూడదా? స్వర్గభూమిని కళ్ళారా చూడనిచ్చి అధఃపాతాళానికి తోసేసినట్లు కద ఉంది...!

గాలి వేగం ఎక్కువ కాసాగింది. సముద్రపుటలల హోరుకూడ అధికం కాజొచ్చింది. తెరచాపలు దెయ్యాలు, పిశాచాలు అరుస్తున్నట్లు శబ్దం చేయసాగాయి.

~

చీకటి ఇంకా దట్టంగా కమ్ముకోసాగింది. చీకటి కన్న నల్లది ఎలా ఉండ సాధ్యం? - అలా కూడ ఉండ సాధ్యంలాగుంది.

ఉన్నట్లుండి ఆకాశంలో ఒక మెరుపు మెరిసి ఒక మూలనుంచి ఇంకొక మూలకు దూకింది.

దాని తర్వాత ఏర్పడ్డ చీకటి రాత్రి కన్న నల్లగా అనిపించింది.

మెరుపు వెనకే ఉరుము శబ్దం వినిపించింది. ఓడ అదిరింది. సముద్రం అదిరింది. నలు దిక్కులూ అదిరాయి.

ఇంకొక మెరుపు ఆకాశపు అడుగు భాగం నుంచి చీకటిని చీల్చుకొంటూ పైకెగసింది. అది పైపైకి వచ్చి శాఖోపశాఖలుగా విస్తరించి భూమిని, ఆకాశాన్ని జ్యోతిర్మయంగా చేసి మరుక్షణం మాయమైంది.

వెనువెంటనే పిడుగు పడి దిక్కులు పిక్కటిల్లాయి. అబ్బ! అండ పిండ బ్రహ్మాండాలు పేలి పడుతున్నట్లుంది కద!

మళ్ళీ మెరుపులు, మళ్ళీ ఉరుములు, మళ్ళీ పిడుగులు. ఇంకా ఆకాశం పగిలిపోలేదేమి? ఇదేం

విచిత్రం అని వంతిదేవుడు అనుకొన్నాడో లేదో, ఆ క్షణమే ఆకాశం ఫెలింది.

ఫెలి పగిలిన ఆకాశం నుంచి ప్రళయవర్షం కురిసింది.

అవును; దాన్ని వాన అనకూడదు. ఆకాశంలో ఒక జలసముద్రం కమ్ముకొస్తూంది. ఒక్క చీలిక ఏర్పడగానే దాని గుండా కుండపోతగా కురుస్తున్నట్లుంది.

కడలి అలలు ఆవేశ తాండవమాడాయి. మెరుపుల వెలుతురులో కంటికి కనిపించిన మేరకు కొండల్లాగ లేచిన అలలను చూసి విస్తుపోయాడు.

గాలి ఆర్భాటం మరింత హెచ్చుకాసాగింది. కొండెత్తు అలలను అలాగే ఆకాశానికెత్తి చెల్లాచెదురు చేశాడు వాయు భగవానుడు.

వంతిదేవుని ఓడమీద కూడ ఆ జలపర్వతాలు కొన్ని వచ్చి పడ్డాయి.

పైనుంచి వాన కుండపోతగా కురవసాగింది. నలువైపుల నుంచి అలలు వచ్చి ఓడను గుద్దసాగాయి. సుడిగాలి తెరచాపలకు పట్టించిన పాట్లు చెప్పనలవికాదు.

ఇంతటినీ తట్టుకొని చోళదేశపు వడ్రంగులు నిర్మించిన ఆ అద్భుతమైన ఓడ సుడులు తిరగసాగింది.

~

కానీ ఎంతసేపని అలా తిరుగుతూ ఉండగలదు? ఎంతసేపని ఆ మహా తరంగాల ఉధృతాన్ని తట్టుకొని నిలబడగలదు? - వల్లకాదు; ఈ క్షణమో, మరుక్షణమో ఓడ మునిగిపోవలసిందే. దానితోబాటు వంతిదేవుడు కూడ మునిగిపోవలసిందే.

కానీ, ఆ ఆలోచన అతనికి దుఃఖం కలిగించలేదు. తనకు కలగబోయే మరణం ఒక అద్భుతమైన మరణమని ఎంచాడు.

పైకి లేచి పడుతున్న అలల్లాగ అతని మనసుకూడ కుతూహలంతో పొంగసాగింది.

గాలి హోరు, అలల హోరు, పిడుగుల శబ్దం, వీటన్నిటితోబాటు వంతిదేవుని గొంతు కూడ కలిసింది. "హహ్హహ్హా!" అని పెద్దగా నవ్వాడు.

ఆ దృశ్యాలనన్నింటినీ  బాగా చూడాలని ముందు జాగ్రత్తగా తనను తాను తెరచాప స్తంభాలకు కట్టేసుకొన్నాడు.

ఓడ సుడి తిరిగినప్పుడు తెరచాప స్తంభాలు కూడ తిరిగాయి. వాటితో బాటు వంతిదేవుడు కూడ తిరిగాడు.

ఇలా ఎంతసేపు ఓడ, తెరచాప స్తంభాలు, వాటితోబాటు వంతిదేవుడు సుడులు తిరిగారో తెలియదు.

పలు యుగాలు కావచ్చు; కొన్నే క్షణాలైన కావచ్చు. భూత, భవిష్యద్వర్తమాన కాలాలకు

అతీతమైన ఒక స్థితిని చేరుకొన్నాడు వంతిదేవుడు.

~

గాలి వేగం కాస్త తగ్గినట్లనిపించింది. ప్రళయ వర్షం నిలిచింది. సన్నటి తుంపరగా పడసాగింది వాన.

ఉరుములు, మెరుపులు, పిడుగులు ఆగిపోయాయి. సముద్రం కారు చీకటిలాగ తోచింది.

వంతిదేవుడు కాసేపటికి మునుపు మెరుపుల కాంతికి తట్టుకోలేక కళ్ళు మూసుకొన్నాడు. పిడుగుల శబ్దాన్ని కూడ వినలేక చేతులతో చెవులు మూసుకొన్నాడు.

ఇప్పుడు కళ్ళు తెరిచాడు. చెవుల మీదినుంచి చేతులు కూడ తీసేశాడు.

ఆహా! ఇంత పెద్ద సుడిగాలి వాన నుంచి తాను తప్పించుకొన్నాడా? దేవుడు కాపాడాడా? మళ్ళీ పళైయార్రై యువరాకుమారిని ఈ జన్మలోనే చూడబోతానా? యువరాజును కలిసి మాట్లాడబోతానా...?

అంతలో తొందర పడకూడదు. ఈ ఓడ ఎక్కడుందో ఎవరికి తెలుసు? ఇది క్షేమంగా తీరం చేరేవరకు ఎలా చెప్పగలం? ఓడ బతికి బయట పడ్డా, తాను ప్రాణాలతో తప్పించుకొని ఒడ్డెక్కుతానని ఏం నిశ్చయం?

ఇంకా ఎన్నెన్ని అపాయాలు పొంచివున్నాయో....?

~

వంతిదేవుని మనసులో ఈ ప్రశ్న లేవగానే, అందుకు జవాబు చెబుతున్నట్లు, ఆకాశాన్ని చీల్చుకొని ఒక మెరుపు మెరిసింది. దాని ప్రజ్వల కాంతి వేయి సూర్యులను అతని కళ్ళముందుంచినట్లనిపించింది. చీకటినైనా కాస్త చూడవచ్చు; కానీ అ భయంకర ప్రజ్వల కాంతిలో ఏమీ చూడలేకపోయాడు. ఆ మెరుపు తన కళ్ళనే తీసేసుకొందేమో అని సందేహపడ్డాడు. మండుతున్న కళ్ళను గట్టిగా మూసుకొన్నాడు. మరుక్షణమే అతని చెవులకు కూడ విపత్తు మూడింది. ఇంతకు మునుపు వంతిదేవుడు ఎన్నో పిడుగుల శబ్దాన్ని వినివున్నాడు; ఈ రోజు కూడ విన్నాడు. కానీ ఇప్పుడు పడ్డ పిడుగు లాగ – ఛ! అది పిడుగా? ఇంద్రుని వజ్రాయుధమే తన చెవిగుండా దూరి తలలోపల దూరి కొట్టినట్లనిపించింది.

కాసేపు వంతిదేవుడు కళ్ళు తెరవలేకపోయాడు. చెవులేమో ఇంకా 'ఓ' అని గింగుర్లెత్తుతున్నాయి.

మూసిన కళ్ళు తలపైన ఏదో ఒక కొత్త కాంతి విస్తరిస్తుండడాన్ని గ్రహించాయి. చెవుల్లో కూడ 'ఓ' అన్న గింగుర్లెత్తే శబ్దంతోబాటు ఒక వినోదమైన శబ్దం కూడ వినవచ్చింది. అడవుల్లో నిప్పంటుకొన్నప్పుడు పుట్టే శబ్దంలాగ అనిపించింది.

వంతిదేవుడు కళ్ళు తెరిచి చూశాడు. ఓడ తెరచాప స్తంభం శిఖరాన నిప్పంటుకొని కాలుతుండడాన్ని గమనించాడు.

ఆహా! ఇప్పుడర్థమవుతోంది. ఆ మెరుపు ఎందుకంత ప్రకాశంగా మెరిసిందని! ఆ పిడుగు ఎందుకంత పెద్దగా వినిపించిందని!

ఆ పిడుగు ఓడపైనో, లేక అతి దగ్గరగానో పడింది. అందుకే తెరచాప స్తంభాలకు నిప్పంటుకొంది.

పంచభూతాలలో రెండు ఆ చోళ దేశపు ఓడను తుడిచిపెట్టజూశాయి. గాలీ, నీరూ ఓడిపోయాయి. వరుణుడు, వాయువు చేయలేని కార్యాన్ని చేసేందుకు అగ్నిదేవుడు ఇప్పుడు ప్రత్యక్షమైనాడు!

~~~
~~~

# అధ్యాయము - 52

## విరిగిన ఓడ

పిడుగు పడ్డందువల్ల నిప్పంటుకొన్న ఆ ఓడ తెరచాప స్తంభాన్ని చూసిన వెంటనే ఇక ఆ ఓడ తప్పించుకోవడం అసాధ్యం అని నిశ్చయించుకొన్నాడు వంతిదేవుడు. కాబట్టి తాను కూడ ప్రాణాలతో తప్పించుకోవడం అసాధ్యం.

వంతిదేవునికప్పుడు కించిత్తు కూడ దిగులు, భయం కలగలేదు. ఉత్సాహమే ఎక్కువైంది. గలగలా నవ్వాడు. తెరచాప స్తంభం నుంచి తన్ని తాను కట్లు తీసేసి విడిపించుకొన్నాడు. నిప్పులో మాడి చావవలసిన అవసరం లేదు కద? దాని కన్న చల్లని సముద్రపు నీటిలో మునిగిపోయి సముద్రపుటడుగున నెమ్మదిగా చావడం మేలు కద?

కానీ మిగిలిన కాసింత సమయాన్ని వృధాపరచడానికి ఇష్టపడలేదు వంతిదేవుడు. నిప్పంటుకొని కాలుతున్న ఓడ మంటల వెలుతురులో చుట్టూ పరికించి చూసి కల్లోలితమైన సముద్రాన్ని చూసి అనుభవించాలని ఆశపడ్డాడు. తన శరీరం సమాధి కాబోయే స్థలాన్ని బాగా చూసుకోవడం మంచిది కద? ఇలా అకాల మరణం చెందినవారు ఆత్మరూపంలో చనిపోయిన చోటే తిరుగుతుంటారట కద? అలాగైతే తన ఆత్మ కూడ ఈ సముద్రం పైనే తిరుగుతుంటుందా? గాలిలో తేలియాడుతుంటుందా? అలలపైన పచార్లు చేస్తుంటుందా? సుడిగాలి వీచినప్పుడు తన ఆత్మకూడ సుడులు తిరుగుతుంటుందేమో?

ఆహా! ఎప్పుడైనా యువరాకుమారి ఓడెక్కి ఈ సముద్రంలో వెళుతుంది. ఓడను నడిపే కళాసీలు "వంతిదేవుడు ఓడతో సహా మునిగిపోయిన చోటిదే!" అని చూపుతారు. ఆమె కంట నీరుబికి ఆమె సుందర వదనంపైన ముత్యాల్లాగ జారుతాయి. ఆత్మరూపంలోనే ఆ దృశ్యాన్ని దగ్గరనుంచి చూడగలిగితే, ఆమె కన్నీళ్ళను తాను తుడవగలడా?

ఓడ ఒక పెద్ద తరంగ శిఖరం పైకి వెళ్ళింది. తెరచాప స్తంభం దివిటీ వెలుతురులో చుట్టుపక్కల చాల దూరం వరకు కనిపించింది. నల్లని పాలరాతిలాగ కనిపించిన సముద్రపు నీరు వెలుతురు పడ్డ చోట మాత్రం బంగారంలాగ మెరిసింది. ఆ అద్భుత దృశ్యాన్ని చూసి ఆనందించేలోపు ఇంకొక దృశ్యం అతని కళ్ళను ఆకట్టుకొంది.

కాస్త దూరాన ఒక ఓడ కనిపించింది. దానిపైన పులిజెండా ఎగురుతోంది.

దైవమా! నీ వింతలకు అంతులేదు కద! - ఆ ఓడలో వస్తున్నది యువరాజు అరుళ్మొళి వర్మే అయివుండాలి. తనను వెతుక్కొంటూనే ఆయన వస్తున్నారని అతని మనసు లోలోపల అనిపించింది.

~

~

వంతిదేవుడు ఎక్కిన ఓడ చిక్కుకొన్న అదే సుడిగాలిలో పార్థిబేంద్రుని ఓడ కూడ చిక్కుకొంది. కానీ ఈ ఓడలో ఆ సుడిగాలి స్వబావం తెలిసిన వారు, ఓడ నడిపే విద్యలో ఆరితేరిన, మంచి నైపుణ్యంగల కళాసీలు ఉన్నారు. వారు తెరచాపలను దించి చుట్టిపెట్టేశారు. గాలి వేగాన్ని ఓడ పూర్తిగా ఎదుర్కోనవసరం లేదు కాబట్టి చుక్కాని పట్టుకొని ఓడను నడపసాగారు. ఒక నిమిషం ఓడ పూర్తిగా ఒకవైపుకు వాలిపోయి, 'ఇదిగో తలకిందులైపోతుంది' అన్నట్లనిపిస్తుంది. మరునిమిషమే సర్దుకొని పైకిలేచి నిటారుగా నిలబడుతుంది. కొండంత అలలు ఆ ఓడను ఎంత గుద్దినా ఆ ఓడ బల్లలు, కొయ్య దిమ్మెలు విరగలేదు, చీలిపోలేదు! కాదు కాదు! సముద్రరాజు ఆ ఓడతో బంతాట ఆడాడు. సుడిగాలి ఆ ఓడను బొంగరం లాగ గిరగిరా తిప్పింది. ఆకాశంనుంచి వర్షం కుండపోతగా కురిసి ఆ ఓడను సముద్రంలోకి అదిమేయజూసింది. చోళదేశపు నిపుణులైన వడ్రంగులు నిర్మించిన ఆ ఓడను - సముద్రం, గాలి, వాన ఒక్కటిగా కూడబలుక్కొని అటకాయించినా ఏమీ చేయలేకపోయాయి.

"దీనికన్న పెద్ద సుడిగాలులను, చండమారుతాలను నేను చూసివున్నాను. తట్టుకొన్నాను కూడాను. కాబట్టి ఏం దిగులు పడకండి" అన్నాడు నౌకాధిపతి. కానీ అతను పార్థిబేంద్రుని వద్ద, యువరాజు వద్ద ఇంకొక అపాయం గురించి తన భయాన్ని వెలిబుచ్చాడు.

నల్లని మేఘాలు నలువైపుల నుంచి కమ్ముకొని ఆకాశాన్ని కప్పేయగా, పూర్తిగా చీకటి కమ్ముకొంది. అది చాలదన్నట్లు కుండపోతగా వర్షం కురుస్తోంది. అలలేమో వరుసగా పర్వతశ్రేణుల్లాగ వచ్చి ఓడను చుట్టుముట్టి నలువైపుల తెరగాక నిలిచి, అవతల ఏముందో తెలియనట్లు చేస్తున్నాయి. ఇటువంటి పరిస్థితిలో తాము వెతక వచ్చిన ఓడ తమకు అతి దగ్గరలో ఉన్నాకూడ కనిపించదు. ఆ ఓడ కూడ ఇదే పరిస్థితిలో చిక్కుకొని అవస్థపడుతూంటుంది. ఓడలు రెండూ ఒకదానికొకటి గుద్దుకొని తునాతునకలైపోతాయి. ఓడల్లో ఉన్నవారి గతి అధోగతే!

కాబట్టి సుడిగాలి కన్న చుట్టూ ఏమీ కనిపించకపోవడమే మరింత పెద్ద అపాయమని చెప్పాడు నౌకాధిపతి.

ఇది యువరాజుకు కూడ తెలిసిన విషయమే. అందుకే అంతటి గాలిలోను, వానలోను ఓడ అంచు దగ్గర నిలబడి తమ చురుకైన కళ్ళ చూపులను నలువైపుల సారిస్తున్నారు. మెరుపు మెరిసినప్పుడల్లా ఆయన కళ్ళు అతివేగంగా చుట్టు తిరిగి చూశాయి. ఆయన మనసు ఎంత కల్లోలపూరితమైవుందో చెప్పలేము. తన ప్రియసహోదరి పంపిన దూత మొరటు అరబ్బుల చేత, హంతకులైన కుట్రదారుల చేత చిక్కుకొనివున్నాడు. అది చాలదని ఈ సుడిగాలి తోడైంది. ఒకవేళ ఆ వీరయువకుడున్న ఓడను మనం కనిపెట్టడం అసాధ్యమైపోతుందేమో! కనిపెట్టినా అతన్ని సజీవంగా చూడడం సాధ్యమా? - నౌకాధిపతి భయపడ్డట్లు అతనున్న ఓడ తమ ఓడను గుద్దుకొంటే భలే తమాషాగా

ఉంటుంది! అయితే తండ్రికి చెప్పవలసిన విషయాన్ని ఆయనకు ఎవరు చెబుతారు? పార్థిబేంద్రుని వద్ద ఆ కుటుంబ రహస్యాన్ని వెలిబుచ్చడం అసాధ్యం. చెబితే, ఆ పల్లవునికి అది వేళాకోళమనిపిస్తుంది; దాని ప్రాముఖ్యతను అతడు గ్రహించలేడు, గ్రహించడు.

ఇంతవరకు యువరాజు తాను చేయబూనిన ఏ కార్యంలోను ఓటమిని చవిచూడలేదు. ఇప్పుడు ఓటమి ఎదురౌతుందా? - లేదు. ఏనాడు అలా జరగదు. పొన్నియిన్ సెల్వన్కి హాని కలగడం గాని, ఓటమి కలగడం గాని సముద్రరాజు చూస్తూ ఊరుకోడు!

చీకటిని, వానను చీల్చుకొని చుట్టూ చూస్తున్న యువరాజు కూడ ఆ పిడుగు శబ్దాన్ని విన్నారు. దానికి ముందు మెరిసిన మెరుపుకు ఆయన కూడ కాసేపు కాసేపు కళ్ళు మూసుకోవలసివచ్చింది. కళ్ళు తెరిచినప్పుడు మెరుపు కాంతిగాక, ఇంకొక వెలుతురును కూడ చూశారు. కాస్త దూరాన ఒక ఓడ విరిసిన తెరచాపలతో దెయ్యాలూగుతున్నట్లు ఆడుతూ కనిపించింది! దాని తెరచాప స్తంభపు శిఖరాగ్రం నిప్పంటుకొని కాలుతోంది! ఆ మంటల వెలుతురులో, యువరాజు ఒక మనిషి తెరచాప స్తంభంతోబాటు నిలబడి ఉండడాన్ని గమనించారు! భగవాన్! ఇంతటి అద్భుతం కూడ సాధ్యమా? - అతను, ఆ వీరయువకుడు వంతిదేవుడే! అతను మాత్రం ఎందుకు ఒంటరిగా నిలబడివున్నాడు? తక్కిన వారు ఎక్కడ? - అదంతా ఆలోచించేందుకు ఇప్పుడు సమయం లేదు, కాదు. చేయవలసింది ఇదీ అని ఒక్క క్షణంలో యువరాజు తీర్మానించుకొన్నారు.

ఆయన చూసిన దృశ్యాన్ని ఓడలో ఉన్న పలువురు చూశారు. “అదిగో!” అని వారు ఏకకాలంలో చేసిన ఘోష గాలి చేస్తున్న భయంకరమైన హోరును మీరి వినిపించింది.

ఓడతో చేర్చి కట్టివున్న ఒక పడవ దగ్గరికి వెళ్ళి నిలబడి, యువరాజు ఓడ కళాసీలను చూసి, “మీలో నాతో ఎవరు వస్తున్నారు?” అని పెద్దగా అడిగారు. అయన చేయబూనిన కార్యమిదీ అని ఊహించి గ్రహించిన కళాసీలు అవాక్కయ్యారు. కానీ పలువురు పోటీ పడి ముందుకు వచ్చారు.

పార్థిబేంద్రుడు, నౌకాధిపతి వచ్చి అడ్డగించజూశారు.

“యువరాజా! ఇదేం పని? ఈ కల్లోలిత సముద్రంలో ఈ చిన్న పడవను ఎలా నడప సాధ్యం? కాలుతున్న ఓడలో ఉన్నవాడిని ఎలా కాపాడగలం? - కానీ ప్రయత్నించి చూద్దాం. మీరు వెళ్ళవద్దు. వెళ్ళేందుకు మాలో ఎందరో ఉన్నారు!” అన్నాడు పార్థిబేంద్రుడు.

“జాగ్రత్త! ఈ సమయాన నన్ను అడ్డగించజూసే వారెవ్వరినీ నేను క్షమించను!” అని రాజ గంభీరమైన అధికార ధోరణిలో అన్నారు యువరాజు. అదే సమయాన పడవను విప్పి వదిలారు. “మీలో ఇద్దరు చాలు; రండి!” అన్నారు.

~

పడవ సముద్రంలోకి దించబడింది. యువరాజు, అయన సూచించిన ఇద్దరు అందులోకి

దూకారు. మరుక్షణం పడవ ఓడను వదిలి ముందుకు సాగింది. అలలపైన ఆవేశతాండవమాడింది. యువరాజు, ఆ ఇద్దరు కళాసీలు సాధ్యమైనంత బలంగా తెడ్లను వేశారు. మెల్లమెల్లగా పడవ మండుతున్న ఓడను సమీపించింది. అంతలో మంట తెరచాప స్తంభం సగంవరకు దిగివచ్చేసింది. కానీ వంతిదేవుడేమో అక్కడే నిలబడ్డాడు. అతడు ఆ మంటల వెలుతురులో రెండో ఓడను చూశాడు; ఓడనుంచి దింపబడ్డ పడవను కూడ చూశాడు. ఆ సంభ్రమంలో తనను తాను మరిచాడు. తాను ఏదైనా చేయాలన్నదే అతనికి తోచలేదు.

"దూకు! సముద్రంలోకి దూకు!" అని అరిచారు యువరాజు. అతని చెవిన అది పడలేదు. బొమ్మలాగ అలాగే నిలబడ్డాడు.

అంతే! ఇంకాసేపు ఆలస్యం చేస్తే ఓడ కిందిభాగాన ఉన్న బల్లలు,. కొయ్య దిమ్మెలకు నిప్పంటుకొంటుంది. ఓడ మునిగిపోతుంది. తర్వాత అతన్ని కాపాడడం అసాధ్యం.

ఏం చేయాలన్నది యువరాజు ఒక్క క్షణంలో నిశ్చయించుకొన్నారు. ఇటువంటి సందర్భం కోసమే ఆ పడవలో ఒకవైపుకు చేర్చి కట్టివున్న తాడు ఒక చివరను తన నడుముకు గట్టిగా చుట్టి కట్టుకొన్నారు. కళాసీలిద్దరినీ హెచ్చరించి సముద్రంలోకి దూకారు.

ఒక పెద్ద, చాల పెద్ద అల లేచింది. అది యువరాజు పైన పడివుంటే ఆయనను సముద్రపు లోతుల్లోకి అదిమేసి ఉండేదే! కానీ అది మంచి అల; యువరాజుకు హాని చేయవచ్చిన ఆ అల యువరాజును తన శిఖరం పైన ఎత్తి పట్టుకొని తీసుకొని వెళ్ళి మండుతున్న ఓడ పైబల్ల మీద పడేసింది!

అప్పటికే కట్లు విప్పేసుకొన్న వంతిదేవుడు యువరాజును చూసిన వెంటనే 'ఆః!' అని అరిచి ముందుకు దూకాడు. యువరాజు అతన్ని అలాగే అతని మెడను కౌగలించుకొని, అతని చెవిలో, "నన్ను పట్టుకొని రా! వదిలిపెట్టకు!" అన్నారు. ఆయన అలా చెప్పి ముగించిన మరుక్షణమే ఇద్దరూ మళ్లీ సముద్రంలో అలలపైన తేలసాగారు.

కళాసీలు తెడ్లు వేయడం ఆపి, తాడును పట్టి లాగనారంభించారు. యువరాజు, ఆయనను ఉడుంలాగ పట్టుకొన్న వంతిదేవుడు పడవను సమీపించసాగారు.

పడవను పట్టుకొని అందులోకి ఎక్కడం అంత సులువైన పని కాదు. అలలతో పోరాడుతూ, వంతిదేవుని కూడ మోస్తూ పడవలోకెక్కడానికి ప్రయత్నించిన ప్రతిక్షణమూ ఒక యుగం లాగ తోచింది.

ఇదిగో పడవ చేతికి చిక్కింది అనుకొన్న మరుక్షణం అది దూరంగా జరిగిపోయింది.

చివరికి ఒక పెద్ద అల సహాయం చేసింది. పడవ దగ్గరగా, ఎత్తుగా లేచిన ఆ అలతోబాటు వారు కూడ పైకి లేచారు. కళాసీల సహాయంతో పడవలోకి దూకారు.

"తెడ్లు వేయండి! వేగంగా వేయండి!" అన్నారు యువరాజు.

ఎందుకంటే, మండుతున్న ఓడ సముద్రంలో మునికిపోయే సమయమాసన్నమైంది.

అలా మునిగిపోయేటప్పుడు కలిగే కల్లోలంలో పడవ మునిగినా మునిగిపోవచ్చు. అది మాత్రం కాదు; ఓడ మునిగిపోయి మంటలారిపోయినా, తర్వాత వారు తమ ఓడను చేరుకోవడం అసాధ్యమైపోవచ్చు.

ఆహా! అదిగో, ఓడ మునగనారంభించింది. దివిటీలలాగ మండుతున్న తెరచాప స్తంభాలతోబాటు అది కడలిలో మునిగిన దృశ్యం ఎంతటి భయంకరమైన సౌందర్య దృశ్యం!

దాన్ని వారు చాలసేపు చూసి ఆనందించలేకపోయారు.

యువరాజు ఎదురుచూసినట్లే సముద్రం అల్లకల్లోలమై ఉవ్వెత్తున లేచాయి అలలు.

పడవేమో అలలను తట్టుకొంది. కానీ మండుతున్న ఓడ మునిగిన వెంటనే చుట్టూ కమ్ముకొన్న చీకటిలో ఇంకొక ఓడ ఉన్న చోటే తెలియకుండపోయింది.... దిక్కే తెలియక అయోమయం రాజ్యమేలింది.

పడవా, ఓడా ఒకదానికొకటి దగ్గరవుతున్నాయో, దూరమవుతున్నాయో, - అది కూడ తెలుసుకొనే దారిలేదు.

రెండింటా అపాయం ఉంది.

చీకటిలో ఓడ ఉన్న చోటు తెలియక పడవ వెళ్ళి దానికి గుద్దుకొంటే అది ముక్కలైపోయే అవకాశం ఉంది.

దూరమైపోతే, అడగనేల? నడిసముద్రంలో, కారు చీకటిలో ఆ చిన్నారి పడవ ఏం చేయగలదు?

సముద్రరాజా! నీ ప్రేయసి పొన్ని నది ప్రసాదించిన ముద్దుబిడ్డను నీవే కాపాడాలి!

~

వాయుభగవానుని లీలలు అతి విచిత్రమైనవి. ఆ సుడిగాలి ఎంత త్వరగా వచ్చిందో అంతే వేగంతో వెళ్ళిపోయింది. వెళ్ళే దారి పొడుగునా సముద్రానికి పడరాని పాట్లిచ్చి వెళ్ళింది.

సుడిగాలి వెళ్ళిపోయింది సరే; కానీ అది సముద్రంలో లేపిన కల్లోలం అంత సులభంగా అణగిపోదు. ఒక రాత్రి, ఒక పగలు కూడ కొనసాగవచ్చు. ఆ కల్లోలం చాల దూరం ప్రయాణం చేస్తుంది. నాగపట్టణం తీరాన్ని పెద్ద పెద్ద అలలు బాదుతాయి. ఇంకా ఆ కల్లోలం గాంగేశుని జలసంధి - త్రికోణమలై వరకు విస్తరిస్తుంది. మామిడి తోపును, రామేశ్వరాన్ని కూడ ఒక ఆట ఆడించేస్తుంది.

యువరాజు తదితరులున్న పడవ అలలపైన తేలుతూనే ఉంది. కాసేపటికి తెడ్లు వేయడమే ఆపేశారు. దిక్కే తెలియనప్పుడు, ఓడ ఎక్కడుందో తెలియనప్పుడు తెడ్లు వేసి ఏం ప్రయోజనం?

గాలి ప్రశాంతమైంది; వాన నిలిచింది; మెరుపులు, ఉరుములు, పిడుగులు కూడ ఆగిపోయాయి.

కానీ అలల ఆవేశతాండవం మాత్రం ఏమాత్రం తగ్గలేదు.

పడవ ఆ అలలపైన నిస్సహాయంగా ఊగిసలాడుతూనే ఉంది.

ఏమాత్రం ఎదురుచూడని ఒక అపాయం ఆ పడవను సమీపించసాగింది. అదిగో వచ్చేసింది!

మండిపోయిన ఓడ మునిగిపోయింది కద? అప్పుడు పూర్తిగా కాలిపోని తెరచాప స్తంభం ఒకటి ఓడనుంచి వేరు పడింది. సముద్రంలో తేలుతూ, తేలుతూ పడవ దగ్గరకు వచ్చేసింది. చీకటివల్ల అది చాల దగ్గరకు వచ్చేంతవరకు దాన్ని ఎవరూ గమనించలేకపోయారు.

చూసిన వెంటనే, "తెడ్లు వేయండి! తెడ్లు వేయండి!" అని కేక వేశారు యువరాజు.

ఆయన అలా చెప్పి నోరు మూసేలోపు, ఆ తెరచాప స్తంభం పడవ దగ్గరకు వచ్చేసి దాని కింది భాగాన్ని బలంగా గుద్దింది.

గుద్దిన వేగానికి పడవ రెండుగా చీలిపోయింది. తర్వాత చిన్న చిన్న బల్ల ముక్కలుగా తునాతునకలైపోయింది.

"మిత్రమా! ఈ పడవ కన్న ఆ తెరచాప స్తంభమే క్షేమం. ముందుకు దూకి దాన్ని పట్టుకో!" అన్నారు యువరాజు.

~~~
~~~

# అధ్యాయము - 53

## అభయ గీతం

యువరాజు, పార్థిబేంద్రుడు ఓడకు వెళ్ళి చేరేవరకు తొండైమాన్ నదీముఖద్వారం వద్ద నిలబడ్డవారు చూస్తున్నారు.

ఓడలో యువరాజు ఎక్కిన వెంటనే, ఆయనను తీసుకొని వెళ్ళిన పడవ వెనుదిరిగింది.

సేనాధిపతి బూది విక్రమ కేసరి కుతూహలభరితుడయ్యాడని ఆయన ముఖం తెలియజేసింది.

"దేవుడు మనపైపున్నాడు. యువరాజు దివ్యశరీరంపైనున్న శంఖచక్రాలు వృథా అవుతాయా? పార్థిబేంద్రుడు ఆయనను క్షేమంగా తీసుకొని వెళ్ళి కంచికి చేరుస్తాడు. మనమూ, మన సైన్యమూ తంజావూరు వైపు బయలుదేరవలసిందే ఆలస్యం!" అని తనకు తాను చెప్పుకొన్నట్లు కొడుంబాళూర్ పెద్ద వేళార్ పెద్దగానే అన్నారు.

వెంటనే పక్కన నిలబడ్డ ఆళ్వార్ కట్టియాన్ వైపు చూశారు.

"వైష్ణవా! నీవిక్కడ నిలబడ్డావా? ఫరవాలేదు. ముఖ్యమంత్రి అంతరంగ, రహస్య సేవకుడవైన నీకు తెలియనిదేముంటుంది? సరే. నీవేం చేయబోతున్నావు? మామిడితోపుకు నాతో రాబోతావా?" అని అడిగారు.

'లేదయ్యా! ముఖ్యమంత్రి నాకు చెప్పిన పనుల్లో ఇంకా ఒకటి మిగిలివుంది..."

"ఏమది?"

ఆళ్వార్ కట్టియాన్ కాస్త దూరాన నిలబడ్డ మూగరాణిని, పూంగుళలిని చూశాడు.

"ఆ స్త్రీల గురించిన విషయమా?" అన్నారు సేనాపతి.

"వారిలో ఒకరి గురించి మాత్రమే. లంకలో ఇటువంటి మూగస్త్రీని చూడడమంటూ జరిగితే, ఆమెను ఎలాగైన తంజావూరుకు పిలుచుకొని రమ్మని ముఖ్యమంత్రి ఆజ్ఞాపించారు."

"నీకు మంచి పనే ఇచ్చారు. దానికన్న లంకలో వీచే సుడిగాలుల్లో ఒకదాన్ని పట్టి తీసుకొని రమ్మంటే సరిపోయేది. ఆమె ఎవరో తెలియదు. మన యువరాజు పైన చాల అభిమానంగొనివుంది. ఆమె గురించి నీకేమైనా తెలుసా?"

"ఆమె మూగదని, పుట్టు చెవిటిదని తెలుసు. ఆమెను పిలుచుకొని వెళ్ళడంకన్న ఒక సుడిగాలిని ఒక గూట్లో బంధించి తీసుకొని వెళ్ళడం సులభమని కూడ తెలుసు. కానీ నా యజమాని ఆజ్ఞాపించారు కాబట్టి ఒకసారి ప్రయత్నించి చూస్తాను."

"ఈ పడవ నడిపే అమ్మాయికీ, ఆమెకు స్నేహం కాబోలు. ఇద్దరూ సైగలద్వారా

మాట్లాడుకోవడం చూడు! ఆ అమ్మాయినిలా పిలువు! ఆమెకు ఒక హెచ్చరిక చేయాలి..."

~

ఆళ్వార్ కట్టియాన్ ఆ స్త్రీల వద్దకు వెళ్ళి పూంగుళలితో సేనాధిపతి పిలుస్తున్నారని చెప్పాడు. పూంగుళలి మూగరాణిని వదిలి సేనాధిపతి దగ్గరకు వెళ్ళింది.

"ఇదిగో అమ్మాయ్! నీవు చాల తెలివైనదానివి. మంచి సమయాన వచ్చి ముఖ్యమైన వార్తను తెలియజేశావు. చోళవంశానికి చాల పెద్ద సహాయం చేశావు. అందుకు తగిన బహుమానం తగిన సమయాన ఇస్తాను!" అన్నారు.

పూంగుళలి, "వందనమయ్యా! నాకు బహుమానాలేవీ అక్కర లేదు" అని వినయంగా అంది.

"వద్దంటే ఎవరు వదిలిపెడతారు? ఈ గందరగోళమంతా కాస్త తగ్గనీ. తర్వాత, తర్వాత ... చోళదేశపు సైన్యంలో వీరాధివీరుడైన యువకుడిని ఎంచి నీకు పెళ్ళి చేయిస్తాను. నీ కాబోయే భర్త సాధారణమైనవాడైతే వాడిని నీ చిటికెన వేలిచుట్టూ ఆడించేయవా?" అనేసి నవ్వారు సేనాధిపతి.

పూంగుళలి నేలను చూస్తూ నిలబడింది. ఆమె మనసులో కోపం ఉవ్వొంగింది. దాన్ని ఆ సమయాన చూపదలుచుకోలేదు. ఈ మొరటు ముసలాడితో దెబ్బలాడి ఏం ప్రయోజనం? కోపాన్ని అణచిపెట్టుకోవడానికి ప్రయత్నించింది.

"కానీ ఒక విషయం మాత్రం గుర్తుంచుకో! యువరాజుకు సహాయం చేశావు కాబట్టి ఆయనమీద హక్కు చెలాయించవచ్చనుకోకు! సముద్రంలో వలవేసి చేపలు పట్టడంతో సర్దుకో! యువరాజుకు వలవేసి పట్టేసుకోవచ్చని ఆశపడకు! జాగ్రత్త, అమ్మాయ్! ఇక ఆయన దగ్గరకు వచ్చినా నీకు అపాయమే!" అన్నారు సేనాధిపతి. అప్పుడాయన స్వరం అతి కఠినంగా వినిపించింది. ఆయన ఒక్కొక్క మాట కరిగించిన సీసపు రవ్వల్లాగ ఆమె చెవిన పడ్డాయి.

ఆ ముసలాయనకు మాటకు మాట బదులు చెబుదామనుకొంది. కానీ గొంతు పూడుకుపోయి నోరు పెగల్లేదు. చెవిన పడ్డ కరిగిన సీసపు రవ్వలు కళ్ళనుంచి అశ్రుధారలుగా ప్రవహించగా ఆమె కళ్ళు నిప్పు కణికల్లాగ ఎర్రబారాయి.

~

వంచిన తల ఎత్తకుండ వెనుదిరిగింది పూంగుళలి. సముద్రతీరానికి వ్యతిరేక దిశగా ముందుకు సాగింది. మొదట్లో నడక మెల్లగా సాగింది. పోనుపోను వేగం హెచ్చింది. మూగరాణి ఉన్నచోటును ఒక్క క్షణం ఓరకంట చూసింది. ఆమె సమీపాన ఆళ్వార్ కట్టియాన్ నిలబడి ఏదో తెలియజేయ ప్రయత్నిస్తుండడాన్ని గమనించింది. మనుషులున్న చోటే తాను ఉండకూడదన్న ఉద్దేశం కలిగిందామెకు. మనుషుల చప్పుడే విననిష్టపడలేదు. హుః! మనుషులెంత క్రూరులు! ఎందుకింత క్రూరంగా/కఠినంగా

మాట్లాడుతున్నారు? అందరూ మూగవారైపోతే ఎంత బాగుంటుంది?

కాస్త దూరం ఆ అడవి దారిన నడిచి వెళ్ళిన తర్వాత తొండైమాన్ నదీతీరం చేరుకొంది. ఆ తీరం వెంబడి తన దేశం/నాడు వైపు నడిచింది. ఆమె తన పడవను విడిచిపెట్టి వచ్చిన చోటును గురిగా పెట్టుకొని వెళ్ళింది. అవును; వేగంగా తన పడవను చేరుకోవాలి. పడవెక్కి ఒంటరిగా సముద్రంలో వెళ్ళాలి. మనుషుల గొంతు వినరాని సముద్రానికే వెళ్ళిపోవాలి. తెడ్డు వేయక ఊరకే పక్కన పెట్టేయాలి. పడవ అలలపైన తేలుతూ వెళ్ళాలి. తాను కూడ అందులో వెళుతుండాలి. అప్పుడే కల్లోలితమైన తన మనసు నెమ్మదిగొంటుంది. సేనాధిపతి మాటలవల్ల గాయపడ్డ తన మనసు కుదుటపడుతుంది. హృదయవేదన తీరుతుంది. ఆవేశం చల్లారుతుంది. ఓదార్పు కలుగుతుంది. ఆ చెడ్డ ముసలాడు ఏమన్నాడు? “సముద్రంలో వలవేసి చేపలు పట్టడంతో సరిపెట్టుకో! యువరాజుకు వలవేయవద్దు!” అన్నాడు. నేనా యువరాజుకు వలవేస్తున్నాను? ఛీఛీ! ఆ ముసలాడి బుద్ధి పోకడ చూడు! అవును. భూమిపైన నివసించే మనుషుల కన్న సముద్రంలో నివసించే చేపలే ఎంతో మేలు! అవి ఇలా క్రూరంగా మాట్లాడవు. లోతైన సముద్రంలో ఈదుతూ, తేలుతూ ఎంత ఆనందంగా కాలం గడుపుతాయి? వాటికి ఏం దిగులు? దుఃఖమేది? కష్టాలేవి? ఆహా! నేను కడలిలో చేపగా పుట్టివుండకూడదా? అలా పుట్టివుంటే ఈ లోకంలోని సుఖదుఃఖాలు, ద్వేషాలు, ఆశాపాశాలు, కోపతాపాలు - వీటి మధ్య చిక్కుకోక సదా, సర్వకాలమూ ఈ లోతైన కడలిలో ఈదుతూ కాలం గడపవచ్చు కద? అప్పుడు తనని, యువరాజును విడదీయడానికో, వంచించడానికో, క్రూరంగా మాట్లాడేందుకో ఎవరూ ఉండరు కద? కాదు, కాదు! అదికూడ ఖచ్చితం కాదు. అక్కడ కూడ ఈ దుష్టమానవులు వచ్చి వలవేసి పట్టుకొని పోజుస్తారు! రెండు చేపల్లో ఒక్కదాన్నే పట్టుకొని పోజుస్తారు! పాతకులు....!

~

పూంగుళలి మనసులో పొంగిన ఉద్రేకం, ఆక్రోషం ఆమె కాళ్ళకు ఎనలేని వేగాన్నిచ్చాయి. మిట్టమధ్యాహ్న సమయానికి తన పడవను విడిచిపెట్టిన స్థలానికి చేరుకొంది. మంచివేళగా తన పడవ తాను విడిచిపెట్టిన చోట అలాగే ఉంది. ఆమెకు ఆరోప్రాణమైన చెలి ఆ పడవే. ఆమెకు రక్షణనిచ్చేది ఆ పడవే. కల్లాకపటం, ఈర్ష్యాసూయలతో నిండిన ఈ లోకంలో ఆమెకు నెమ్మదిని, శాంతిని ఇచ్చేది ఆ పడవే. దాన్ని ఎవరూ కొట్టేసుకొని పోకుండ భద్రపరచడం పెద్ద పనే. ఇక ఏదేమైన, యువరాజుకు ఆ ముసలాడే కాపలా కాయనీ. కొడుంబాళూర్ ఆడపడుచునే ఆయన మెడకు కట్టేయనీ. అందువల్ల తనకేమి? నాకు నా పడవుంది; తెడ్లున్నాయి. చేతిలో బలముంది. సముద్రరాజా! నీ ముద్దుల కుమార్తెను ఇంకెవరు మోసంచేసినా, నీవు చేజారిపోనివ్వవు కద? “సముద్రకుమారి" అని యువరాజు తన నోరార పెట్టిన పేరును అబద్ధం కానివ్వవు కద?

పూంగుళలి పడవలోకెక్కింది. సముద్రంవైపు పడవను నడిపింది. నదీప్రవాహం వెంబడి

వెళ్ళినందువల్ల నదీముఖద్వారాన్ని త్వరలోనే చేరుకొంది. తర్వాత సముద్రంలో పడవను నడపసాగింది. కాసేపటికల్లా సుడిగాలి వీయబోతుందని ఆమెకు తెలిసిపోయింది. సుడిగాలికి ముందు వచ్చే వాన సూచనలు ఆమెకు బాగా ఎరుకే. క్రితంరోజు రాత్రి చంద్రుని చుట్టూ బూడిద రంగు వలయం కనిపించింది. ఈరోజు పగలంతా ఒకటే ఉక్క. చెట్ల ఆకులు ఏమాత్రం కదల్లేదు. అదిగో నైఋతి మూలలో నల్లటి మబ్బులు బయలుదేరేశాయి. త్వరలో సుడిగాలి వీయడం ఖాయం. సముద్రంలో కల్లోలం చూడ అద్భుతంగా ఉంటుంది. కానీ సుడిగాలి వీచేటప్పుడు సముద్రంలో చిక్కుబడకూడదు. భూతదీవికి వెళ్ళి తలదాచుకోవడం మంచిది. అక్కడికి చేరుకొంటే సముద్రంలో లేచే కల్లోలాన్ని బాగ చూసి ఆనందించవచ్చు. గాలి వీచి వెళ్ళిన తర్వాత, సముద్రంలో కల్లోలం అణగిన తర్వాత నిదానంగా కోడిక్కరైకి పడవను నడుపుకొంటూ వెళ్ళవచ్చు. ఇప్పుడేం తొందర? ఆ ఓడ బహుశ ఇప్పుడు కోడిక్కరైకి వెళ్ళి చేరివుంటుంది. మంచి సమయం! అది సుడిగాలిలో చిక్కుబడివుండదు. యువరాజు ఇప్పటికి క్షేమంగా అక్కడికి వెళ్ళి చేరివుంటారు. లేక మామల్లపురానికే వెళ్ళినా వెళ్ళివుండవచ్చు. ఎక్కడికి వెళితే మనకేమి? సుడిగాలిలో చిక్కుబడివుండరు. అంతవరకు తృప్తి పడవచ్చు.

~

సుడిగాలి ప్రారంభం కావడానికి మునుపు గాలి పూర్తిగా స్తంభించిపోయినందువల్ల, ఓడల తెరచాపలు విప్పివున్నా కూడ అవి ముందుకు వెళ్ళలేకపోయాయన్న విషయం పూంగుళలికి తెలియదు. కాబట్టి అవతలి ఒడ్డుకు వెళ్ళి చేరివుంటాయనే అనుకొంది. సేనాధిపతి "యువరాజుకు వలవేయకు!" అన్న మాట తరచూ గుర్తుకొచ్చి ఆమె మనసును గాయపరచసాగింది. కాబట్టి తాను కోడిక్కరైకి వెంటనే వెళ్ళకూడదని నిశ్చయించుకొంది. భూతదీవిలో ఆగి, సుడిగాలి అట్టహాసాలను చూసి ఆనందించిన తర్వాత నిదానంగా బయలుదేరవచ్చని తీర్మానించుకొంది.

తొండైమాన్ నదీముఖద్వారం నుంచి భూతదీవి ఎంతో దూరం లేదు. కాబట్టి బయలుదేరిన ఒక ఘడియలోపే అక్కడికి చేరుకొంది.

పూంగుళలి భూతదీవి చేరడానికి, సుడిగాలి ప్రారంభం కావడానికి సరిగ్గా సరిపోయింది.

పడవను గట్టెక్కించి, తలకిందులుగా బోర్లించి భద్రంగా కట్టిపెట్టి ఆ దీవిలోని ఒక కొత్త బౌద్ధ స్తూపాన్ని చేరుకొంది పూంగుళలి. మొదట కాసేపు దాని కింది భాగాన ఉన్న మంటపంలో గాలికి, వానలో చిక్కుపడకుండ తలదాచుకొంది. అక్కడ చాలసేపు ఉండలేకపోయింది. వాయుభగవానుని లీలల్ని చూసి ఆనందించాలన్న ఆశను ఆపుకోలేక మంటపం నుంచి బయటకు వచ్చి మెట్లెక్కి స్తూపశిఖరాన్ని చేరుకొంది. అప్పుడు బయటి వాతావరణం ఆమె మనఃస్థితిలాగే ఉంది. భూతదీవిలో ఎత్తుగా పెరిగిన వందలకొద్దీ కొబ్బరిచెట్లు ప్రళయతాండవమాడే శివుని చుట్టూ తాండవమాడే భూతగణాలలాగ ఊగుతున్నాయి. కడలి అలలు ఆ కొబ్బరిచెట్లంత ఎత్తు లేచి హిమపర్వతాల శిఖరాలలాగ కనిపించి మరుక్షణం నూరుకోటి నురగ

రేణవులుగా చెదరిపడ్డాయి. సుడులు తిరుగుతున్న గాలి శబ్దమూ, ఆ గాలిలో సుడులు తిరిగి ఆడుతున్న చెట్ల కొమ్మలు చేస్తున్న శబ్దమూ, అలల హోరు, మధ్య మధ్య పిడుగుల శబ్దమూ కలిసి దిక్కులే పిక్కటిల్లుతున్నాయా అనిపించింది. ఆకాశాన్ని రెండుగా చీల్చుతూ ఒక చివరినుంచి ఇంకొక చివరికి దూకిన మెరుపులు ఆ దీవిని, తలవిరబోసుకొన్న దెయ్యాలలాగ ఊగుతున్న కొబ్బరిచెట్లను తమ మిరుమిట్లుగొలిపే కాంతిలో ఒక్క క్షణం ప్రకాశవంతంగా చూపించి మరుక్షణం కారుచీకటిలో ముంచాయి.

~

ఈ అల్లకల్లోలాన్ని చూస్తూ చాలసేపు నిలబడింది పూంగుళలి. ఆమె ఒళ్ళు గాలిలో ఆడిన చెట్లలాగ ఆడింది. ఆమె తలవెంట్రుకలు విడి గాలిలో ఎగిరాయి. వాన ఆమె ఒంటిని తడిపింది. పిడుగుల పేలుడు శబ్దం ఆమె చెవులు దిబ్బెళ్ళు పడేలా చేసింది. మెరుపులు ఆమె కళ్ళకు మిరుమిట్లుగొలిపాయి. ఇదంతా ఆమె పట్టించుకోక అలాగే ఆ గాలివానలో నిలబడింది. ఆమె మనసు ఉద్రేకంతో ఉర్రూతలూగింది. తన చుట్టూ జరుగుతున్న అల్లోలకల్లోలమంతా తాను చూసి అనుభవించేటందుకే అన్నట్లు (గర్వంతో) చూస్తూ ఆనందించసాగింది.

మధ్యమధ్య ఆమెకు యువరాజు అరుళ్మొళివర్మ గుర్తుకొచ్చారు. అప్పటికి ఆయన కోడిక్కరై చేరుకొని సురక్షితమైన స్థలంలో దిగివుంటారని భావించింది. ఒకవేళ తన తలిదండ్రుల ఇంట విడిదిచేసి వుండవచ్చు. లేక నాగపట్టణం చేరుకొని అక్కడి రాజమాళిగలో విడిది చేసివుండవచ్చు. లేక, ఇంకా సముద్రంలో ఓడలోనే ఉన్నారా? ఉంటేనేమి? ఆయన ఎక్కి వెళ్ళిన పెద్ద ఓడను ఏ సుడిగాలి ఏం చేయగలదు? ఆయన్ని కాపాడేందుకు ఆయన చుట్టూ ఎంతోమంది ఉంటారు. తనను ఆయన తలుచుకొంటారా? 'ఆ పేద పూంగుళలి ఇప్పుడెక్కడుందో?' అని తలుచుకొంటారా? ఉహుం! ఏనాడూ తలుచుకోరు. ఆయన సహోదరి పంపిన దూత వంతిదేవుని గురించే ఆలోచిస్తుంటారు. కొడుంబాళూర్ కుమారి (వాణతి)ని గురించి కూడ ఆలోచిస్తుండవచ్చు. ఈ పేదకులపు పిల్ల ఆయనకు ఎక్కడ గుర్తుండబోతుంది?

రాత్రి చాలసేపు సుడిగాలి కోలాహలాన్ని, అట్టహాసాన్ని చూసి ఆనందించిన తర్వాత కిందికి దిగివచ్చి, స్థూపం కిందిభాగానున్న గుహలో పడుకొంది. నిద్రలో కూడ ఆమె నెమ్మదిగొనలేదు. ఏవేవో కలలు కంది. పడవలో సముద్రంలోకి వెళ్ళి వల విసిరినట్లు, అందులో యువరాజు చిక్కుకొన్నట్లు ఒకసారి కలగంది.  ఇంకొకసారి, ఆమె, యువరాజు చేపలుగా మారిపోయి ఒకరిపక్కనొకరు ఈదుతున్నట్లు కలగంది. ఒక్కొక్కసారి కల మధ్య ఉలిక్కిపడి లేచి, “ఇదేం పిచ్చితనం?” అని మనసును తేటపరుచుకొని మళ్ళీ నిద్రపోయింది.

~

పొద్దు పొడిచి ఆమె మేలుకొనేసరికి సుడిగాలి కోలాహలం చాలవరకు అణగిపోయింది.

పిడుగుల్లేవు; మెరుపుల్లేవు; వానకూడ నిలిచిపోయింది. లేచి కడలి తీరానికి వెళ్ళింది. సముద్రంలో కూడ నిన్న రాత్రిలాగ అంతపెద్ద అలలు లేవడం లేదు. కానీ సముద్రం ఇంకా కల్లోలపూరితంగానే ఉంది. నిన్న రాత్రి సుడిగాలి వల్ల ఆ దీవి పడ్డ పాట్లు ఎలాంటివని నలువైపుల సాక్ష్యాలు కనిపించాయి. కూకటివేళ్లతో పెకలించుకొని కిందపడ్డ చెట్లు, విరిగిన కొమ్మలతో వంగిన పెద్ద పెద్ద చెట్లు నలువైపుల కనబడ్డాయి.

పూంగుళలి ఆ దృశ్యాలనన్నిటినీ చూస్తున్నప్పుడు దూరాన సముద్రంలో ఒక కొయ్య దిమ్మెల కట్ట తేలుతున్నట్లు కనిపించింది. అది సముద్రతీరపుటలల వల్ల అటూ ఇటూ ఊగుతూ చివరికి తీరం చేరుకొని ఒదిగి నిలిచింది. అప్పుడందులో ఒక మనిషి ఉండడాన్ని గమనించింది పూంగుళలి. పరుగెత్తి వెళ్ళి చూసింది. దానికి కట్టబడివున్న మనిషి కొనవూపిరితో ఉన్నాడు. అతని కట్లు విప్పి ఊపిరాడజేసింది. అతను ఈలందేశపు (లంక) సముద్రతీర గ్రామాల్లో ఒకదానికి చెందిన చేపలు పట్టేవాడని, చేపలు పట్టబోయిన చోట సుడిగాలిలో చిక్కుకొన్నాడని చెప్పాడు. తన తోటి స్నేహితుడిని సముద్రం పొట్టనబెట్టుకొందని, తాను బతికింది పునర్జన్మేనని చెప్పాడు. ఇంకా ఒక ముఖ్యమైన విషయాన్ని కూడ అతడు చెప్పాడు:

“నిన్నరాత్రి పెద్ద సుడిగాలి వీచి కాసేపటి తర్వాత ఆగింది. అప్పుడు మా చుట్టూ కారు చీకటి కమ్ముకొంది. ఉన్నట్లుండి ఒక పెద్ద పిడుగు పడింది. దానికి ముందు మెరిసిన మెరుపు వెలుతురులో రెండు ఓడలు కనిపించాయి. ఒక పెద్ద ఓడకు నిప్పంటుకొని కాలిపోనారంభించింది. ఆ భయంకర దృశ్యాన్ని కాసేపు చూస్తూ ఉన్నాము. అందులో మనుషులున్నట్లే అగుపించలేదు. కాస్త దూరాన ఇంకొక ఓడ నిలబడివుండడాన్ని కూడ చూశాము. అందులో మనుషులు గాభరాగా అటూ ఇటూ తిరుగుతుండడాన్ని గమనించాము. తర్వాత నిప్పంటుకొన్న ఓడ సముద్రంలో మునిగిపోయింది. ఇంకొక ఓడ చీకటిలో కనుమరుగైంది!” అని ఆ మనిషి అతికష్టం మీద తడబడుతూ చెప్పాడు.

~

ఇది విన్న వెంటనే యువరాజును ఎక్కించుకొని వెళ్ళిన ఓడ వాటిలో ఒకటి కావచ్చన్న సందేహం కలిగింది పూంగుళలికి. కానీ అలా ఉండబోదు అని తనకు తానే ధైర్యం చెప్పుకొంది. సముద్రంలో ఎన్నో ఓడలు వస్తూ పోతుంటాయి. అందుగురించి మనకెందుకు దిగులు? కానీ, నిప్పంటుకొన్న ఓడలోని మనుషులు కొందరు సముద్రంలో పడిపోయివుండవచ్చు. ఈ కట్లతెప్ప చేపలవాడిలాగ వారిలో ఎవరైనా చేతికి దొరికిన ఆసరాను పట్టుకొని ఉక్కిరిబిక్కిరవుతుండవచ్చు. వారికి మనమెందుకు సహాయం చేయకూడదు? పడవలో వెళ్ళి అలా అవస్థపడుతున్న వారిని పడవలోకి ఎక్కించుకొని ఎందుకు తీరానికి చేర్చి కాపాడకూడదు? మరి, ఈ జన్మ ఉన్నదెందుకు?

అంతే! ఇలాంటి ఆలోచన వచ్చిందో లేదో, పూంగుళలి తన పడవ కట్లు విప్పి సముద్రంలోకి తోసి, తాను కూడ అందులోకెక్కింది. తన వజ్రహస్తాల బలాన్ని పూర్తిగా ఉపయోగించి తెడ్లు వేసింది.

తీరానికి వచ్చి గుద్దుకొంటున్న అలలను దాటి వెళ్ళేవరకు కష్టపడింది. తర్వాత అంత కష్టమనిపించలేదు. అలవాటు ప్రకారం ఆమె చేతులు తెడ్లు వేశాయి. పడవ ఉల్లాసంగ ఆడుతూ ముందుకు సాగింది.

పూంగుళలి మనసులో కుతూహలం ఉప్పొంగింది. ఆమె పడవలో అలవాటు ప్రకారం పాడే గీతం తనకు తానే కొత్త రూపం దాల్చింది. అలల హోరును మీరి ఆ గీతం ఆమె గంభీరమైన, ఇంపైన స్వరం ద్వారా వెలువడి నలువైపులా విస్తరించింది:

<< సముద్రపుటలల గురించి, వాటి అద్భుత నాట్యం గురించి,
వాటి అంతరార్థం ఏమై ఉండవచ్చని పూంగుళలి
ఆశ్చర్యపడుతూ పాడిన అందమైన పాట >>

~

తెరచాప స్తంభాన్ని పట్టుకొన్న యువరాజు, వంతిదేవుడు అలల కడలిలో తేలసాగారు. వారలా సముద్రంలో ఉన్నది ఒక్క రాత్రి మాత్రమే. కానీ వంతిదేవునికి అది ఎన్నో యుగాలనిపించింది. అతడు అతిత్వరలోనే నిరాశకు లోనయ్యాడు; బతికి గట్టెక్కుతామన్న నమ్మకాన్ని పూర్తిగా కోల్పోయాడు. ప్రతిసారి అలల శిఖరానికి వెళ్ళి కిందికి వచ్చినప్పుడల్లా, "ఇంతటితో చచ్చాను!" అనుకొనేవాడు. మళ్ళీ ఊపిరి, స్పృహ ఉండడం చూసుకొని ఆశ్చర్యపడేవాడు. తరచూ యువరాజును చూసి, "నా తొందరపాటువల్ల మిమ్మల్ని కూడ ఈ అపాయానికి గురిచేశాను!" అని పలవరించాడు. యువరాజు అతన్ని ఓదార్చి, ధైర్యం నూరిపోశారు. "మూడు నాలుగు రోజులు ఇలా సముద్రంలో చిక్కుపడి తేలుతూ బతికి బయటపడ్డవారున్నారు" అని తరచూ చెప్పుకొచ్చారు. "మనం సముద్రంలో పడి ఎన్నాళ్ళైంది?" అని అడిగాడు వంతిదేవుడు. "ఇంకా ఒక రాత్రి కూడ పూర్తి కాలేదే!" అన్నారు యువరాజు. "అబద్ధం! అబద్ధం! అంతా అబద్ధం! చాల రోజులైనాయి!" అని అరిచాడు వంతిదేవుడు.

కాసేపటికల్లా అతనికి ఇంకొక కష్టం ఎదురైంది. గొంతెండిపోయి దాహమెక్కువైంది. నీట తేలుతున్నా దాహానికి నీళ్ళు లేని పరిస్థితి. ఇది పెద్ద చిత్రహింసయ్యింది. యువరాజుతో తన కష్టాన్ని చెప్పుకొన్నాడు. "కాస్త ఓపిక పట్టు! త్వరలోనే పొద్దు పొడుస్తుంది. ఎక్కడైనా తీరం చేరుకొని సేదదీర్చుకొందాము!" అన్నారు యువరాజు. కాసేపు ఓపిక పట్టాడు. సాధ్యం కాలేదు. "అయ్యా! నేనిక ఈ చిత్రవధ భరించలేను. కట్లు విప్పేయండి. సముద్రంలో మునిగి చనిపోతాను!" అన్నాడు. యువరాజు మళ్ళీ ధైర్యం చెప్పబోయారు. కానీ అది ఫలించలేదు. వంతిదేవునికి పెర్రెక్కినట్లైంది. తన కట్లను తానే విప్పేసుకోవడానికి ప్రయత్నించాడు. యువరాజు అది గమనించారు. దగ్గరికి వెళ్ళి అతడి తలను లాగిపెట్టి రెండు సార్లు బాదారు. వంతిదేవుడు స్పృహ తప్పాడు.

అతడికి మళ్ళీ స్పృహ వచ్చేటప్పటికి పొద్దు పొడిచింది. చీకటి పోయి వెలుతురుగా ఉండడాన్ని గమనించాడు. అలల కోలాహలం కూడ కాస్త తగ్గింది. సూర్యుడెక్కడో ఉదయించి ఉండాలి. కానీ ఎక్కడ ఏ

దిక్కున అన్నది తెలియలేదు.

యువరాజు అతన్ని ప్రేమతో చూసి, "మిత్రమా! మనం తీరానికి చాల దగ్గరలోనే ఉన్నట్లున్నాము. ఒక కొబ్బరిచెట్టు శిఖరాన్ని కాసేపటి కిందట చూశాను. ఇంకాసేపు ఓపిగ్గా ఉండు!" అన్నారు.

"యువరాజా! నన్ను వదిలేయండి! మీరు బతికి బయట పడండి!" అన్నాడు వంతిదేవుడు.

"వద్దు! అధైర్యపడకు! నిన్నలా విడిచిపెట్టి వెళ్ళను! ఆహా! అదేమి? ఎవరో పాడుతున్నట్లు గొంతు వినిపిస్తూందే!" అన్నారు యువరాజు.

అవును; అప్పుడు ఆయనకు వినిపించింది పూంగుళలి తన పడవనుంచి పాడుతున్న పాటే!

"అలల కడలి కల్లోలితం కాగా
ఎద కడలి తాను ,,,,"

అన్న గీతం వారి చెవులకు అభయ గీతం లాగ వినిపించింది. దైహికంగాను, మానసికంగాను పూర్తిగా అలిసిపోయి మూడొంతులు ప్రాణం కోల్పోయివున్న వంతిదేవునికి కూడ ఆ గీతం ప్రాణం పోసి ఉత్సాహాన్నిచ్చింది.

"యువరాజా! పూంగుళలి గొంతే అది! పడవ నడుపుకొని వస్తోంది. మనం బతికిపోయాం!" అన్నాడు.

కాసేపటికల్లా పడవ వారికి కనిపించింది. మెల్లగా వారిని సమీపించసాగింది. పూంగుళలి "ఇది కలా? నిజమా?" అని చేష్టలుడిగి నిలిచింది. యువరాజు వంతిదేవుని కట్లు విప్పారు. ముందు తాను పడవలోకెక్కారు. తర్వాత వంతిదేవుని ఎక్కించుకొన్నారు. పూంగుళలి చేతబట్టిన తెడ్డుతో చిత్తరువులా చేష్టలుడిగి నిలిచింది.

~~~

[ఇంతటితో రెండవ భాగం సమాప్తం]
~~~